# మధుబాబు



# చక్రతీర్థం

# చక్రతీర్థం

"ఏందే రంగమ్మా! పొద్దుగాలే బయల్దేరినవ్.... పనిలోకి పోతున్నావా ఏంది?" అంటూ రంగమ్మను పలకరించాడు, సిటీకి అవతలిపక్క నుండే మురికివాడకి చెందిన పౌరుడు ఒకతను.

"అవును బాబాయ్.... నువ్వేంది ఈవేళప్పుడు ఈడున్నావ్?" అతనివైపు ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది రంగమ్మ.

"మెయిన్ రోడ్డు మీద టాబూ హోటల్ కాడ నవరాత్రి పందిరి వేసిన్రు.

రాత్రి గానాబజానా పెట్టించిండ్రు. బాగా ఆలస్యం అయిపోయింది. ఆడనే పండుకున్నా!" తను ఆ సమయంలో రోడ్డు మీద కనిపించటానికి కారణాన్ని తెలియచేసాడు ఆ పౌరుడు.

"గానాబజానా కాదు... పందిరికాడ ఎవడో మస్తుగా తాగబోయించి వుంటడు. తాగి ఇంటికొస్తే పిన్నమ్మ నీ తాట ఒలిచేస్తుందని భయపడి పందిరికాడనే పండుకొని వుంటవ్... నాకు దెల్సు నీ సంగతి..." చురచురా చూస్తూ అన్నదామె.

"ఛాఛా... అదేం కాదు రంగమ్మా.... నీ మీదొట్టు... సారా ముకం చూసి మూడు నెలలైంది. నిజంగా గానాబజానాకాడ పండుకున్నా. కావాలంటే మన షరీఫు ఇంకా పందరికాడనే వున్నాడు. ఆడిని అడుగు.... ఇంకనేబోతా.... మీ పిన్నమ్మ నిజంగానే తాగి తందనాలాడ్తున్నానని అనుకుంట" దంటూ మురికివాడవైపు వెళ్ళిపోయాడా పౌరుడు.

‘నీ మాటల్ని నమ్మినోడు నరకానికి బోవాల్సిందే... నోరుదెరిస్తే.... అబద్ధాలే’ అని తనలో తాను అనుకుంటూ వడివడిగా ముందుకు అడుగులు వేసింది రంగమ్మ. టాబూ హోటల్ దగ్గరికొచ్చేసరికి ఆమెకు అగుపించింది అందంగా అలంకరించబడిన నవరాత్రి పందిరి.

పందిరి మధ్యలో ఎత్తయిన బల్లమీద చిద్విలాసంగా చూస్తూ కూర్చుని వున్న విగ్రహాన్ని చూడగానే అప్రయత్నంగానే చేతులు జోడించిందామె.

“గట్టిగా నమస్కారం పెట్టుకో రంగమ్మా... మంచి మొగుడు రావాలని కోరుకో” అని పందిరి పక్కనుంచి కామెంట్ చేసింది ఒక కంఠం. అది విని ఉలిక్కిపడి అటు చూసిన ఆమె కళ్ళకు, పొడవాటి చీపురుతో పందిరి చుట్టుపట్ల శుభ్రం చేస్తున్న షరీపు కనిపించాడు.

“నువ్వేంటి బాబాయ్.... నువ్వు ఈడ పనిచేస్తున్నావేంటి?” ఆశ్చర్యంగా అతన్ని అడిగింది.

“రోజుకి యాభై రూపాయలు ఇస్తామన్నారు బేటీ... బేకార్‌గా ఇంట్లో కూర్చుంటే ఆ డబ్బులు వచ్చి ఒళ్ళో పడతాయా? కష్టపడేవోడికి ఏ పనయినా ఒకటే... ఏదైనా ఒకటే... అవునూ.... నువ్వేంది... ఇంత పొద్దున్నే...” అంటూ మాటల్ని ఆపాడు షరీపు.

“ప్రశాంతి కాలనీలో రవిబాబుగారింట్లో పనిచేస్తున్నా. ఇదివరకు ఓసారి అడిగినవ్.. చెప్పినా.. అప్పుడే మర్చిపోయినవ్...” నిష్టూరంగా అన్నది రంగమ్మ.

“అవునుగదూ... మర్చిపోయినా... ముసలితనం వస్తున్న కొద్దీ మతిమరుపుతనం కూడా ఎక్కువ అయిపోతుంది... ప్రశాంతి కాలనీకి పోయే బస్సు” అంటూ రోడ్డువైపు చూసి “అదిగో.... అదిగో వచ్చేస్తోంది ఎల్లు బేటీ.... త్వరగా ఎల్లు” అంటూ రంగమ్మను తొందరచేశాడు షరీపు.

పాతిక గజాల దూరంలో వున్న బస్‌స్టాప్ వైపు పరుగెత్తింది రంగమ్మ. అంతలోనే చెవులు చిల్లులు పడేటట్లు వినవచ్చింది ఆమెకు షరీఫ్ అరిచిన అరుపు.

“పట్టుకో... పట్టుకో... చోర్ బద్మాష్ పట్టుకో....” గిరుక్కున వెనుతిరిగి పందిరివైపు చూసింది. షరీపు అరిచిన అరుపును విని బిలబిల లాడ్తూ బైటికొచ్చేస్తున్నారు టాబూ హోటల్లో చాయ్ తాగుతున్న కస్టమర్స్ అందరూ. “పట్టుకోండి... పట్టుకోండి....” అని కేకలు పెడుతూ పందిరి వెనుక భాగంలో వున్న ఖాళీస్థలంలో గుమిగూడుతున్నారు.

“ఏమయింది బాబాయ్? ఏమయింది? ఎందుకు అలా అరిచావ్?” పెద్ద పెద్ద అడుగులు వేస్తూ అక్కడికి పోయి, షరీపుని అడిగింది రంగమ్మ.

“ఎవరో ముసల్ది బేటీ... బాగా ముసల్ది... నడుము వంగిపోయింది. అయినాసరే బుద్ధి మాత్రం ఎదవబుద్ధి. అమ్మోరి దగ్గిరున్న హారతిపళ్ళెన్ని తీసుకుని ఉడాయిస్తోంది.....” చెప్పాడు షరీఫ్. ముందుకు అడుగువేసి గుంపులో జొరబడింది రంగమ్మ. అడ్డంగా వున్న ఆఖరి ఇద్దరి మనుష్యుల్ని అవతలికి నెట్టివేసి కిందికి చూసింది.

తొంభై, వంద సంవత్సరాల వయస్సున్నట్టు ముడతలతో చాలా అసహ్యకరంగా కనిపిస్తోంది కింద పడిపోయివున్న ముసలి మనిషి అవతారం. గోగుపుల్లల మాదిరి సన్నగా వున్న చేతులతో పందిరిలోనుంచి ఎత్తుకొచ్చిన హారతి పళ్ళెరాన్ని గుండెలకదుముకుంటోంది.

"ఆగండి... కాస్తంత ఆగండి... గట్టిగా కొడితే కళ్ళు తేలవేసేస్తుంది. ఆగండి" అంటూ, పిడికిలితో ఆ ముసలి మనిషిని హింసించబోతున్న ఒక పౌరుడిని ఆపింది రంగమ్మ.

"చస్తే పీడా వదిలిపోతుంది... ఇట్టాంటోళ్ళని ఊరికే వదిలిపెట్టకూడదు. ఇంకోసారి చేయకుండా గుణపాఠం చెప్పాలి" అంటూ చేయి ఎత్తాడు ఆ పౌరుడు. "చాల్చాల్లేవయ్యా... ఇప్పుడో ఇంకాస్సేపటికో అయిపోయేటట్టున్న ఆ మనిషిని కొట్టటం గొప్ప అనుకుంటున్నావా? అసలు జరిగిందేమిటో అడగద్దా....? ఆగు... అవతలికి జరుగు" అంటూ అతన్ని అవతలికి నెట్టి, మూట మాదిరి పడివున్న వృద్ధురాలి దగ్గిరికి చేరుకుంది రంగమ్మ.

"పందింట్లో నుంచి అమ్మవారి హారతి పళ్ళెం ఎత్తుకురావచ్చా? తప్పు కదా మామ్మా. పళ్ళెం ఇచ్చేయ్" మృదువుగా అడుగుతూ, ఆ పళ్ళేన్ని తీసుకోవటానికి ట్రై చేసింది.

"ఇది... ఇది... ఈ పళ్ళెం నాది. నా తల్లి వుంది ఈ పళ్ళెంలో... నా తల్లి దాక్కునుంది. నేను ఇవ్వను" అంటూ ఆ హారతిపళ్ళేన్ని మరింతగా గుండెలకు అదుముకుంది కింద వున్న వృద్ధురాలు.

“ఇందులో నీ తల్లి వుండటం ఏమిటి మామ్మా.... ఇది వట్టి ఇత్తడి పళ్ళెం. అమ్మావారికి హారతి ఇచ్చేందుకు తెచ్చారు” ఆమె భుజం మీద చేయివేస్తూ మరింత అనునయంగా అంది రంగమ్మ.

“ఇత్తడి పళ్ళెంకాదు... పుత్తడి... ఇదీ పుత్తడితో చేసింది. నన్ను ఏమార్చటానికి నా తల్లి దీన్ని ఇత్తడిగా మార్చేసింది. ఇది నాది... నాదే...” చెప్పిందా వృద్ధురాలు.

“కాదు మామ్మా.... అది పుత్తడి పళ్ళెం కాదు.. మొన్న సాయంత్రము ప్రత్యేకంగా పనికట్టుకుని వన్ టౌన్లో కొనుక్కొచ్చాం.... అది ఇత్తడి పళ్ళెమే...” అంతవరకూ కొంచెం అవతలగా నిలబడిన షరీఫ్ వెంటనే అన్నాడు.

“మీరు... మీరు నన్ను మోసం చేయటానికి మాట్లాడుతున్నారు.... ఇది.. ఈ పళ్ళెం” అంటూ మాటల్ని ఆపి, పళ్ళెం వంక చూసింది వృద్ధురాలు.

“లేదు మామ్మా... నిన్ను మోసం చేయటం లేదు. ఇది అమ్మావారి పూజకోసం కొనుక్కువచ్చిన పళ్ళెం. నీది కాదు ఇచ్చేయ్... మనది కాని వస్తువును మనం తాకను కూడా తాకకూడదు. పెద్దదానివి నీకు చెప్పకూడదు. ఇచ్చేయ్ మామ్మా...” అంటూ వృద్ధురాలి దగ్గర నుంచి ఆ పళ్ళేన్ని తీసుకునే ప్రయత్నం చేసింది రంగమ్మ.

పది క్షణాలు గడిచిన తర్వాత అయిష్టంగానే పళ్ళేన్ని ఇచ్చేసింది వృద్ధురాలు.

"మతిపోయిన మనిషిని పట్టుకుని మొనగాళ్ళ మాదిరి కొట్టటానికి వచ్చారా? వయస్సును చూసయినా కాస్తంత నిదానించి వుండచ్చు... మీ పళ్ళెం మీకు వచ్చేసిందిగా... పొండి అవతలికి.. వెళ్ళిపొండి...." కరకుగా అరుస్తూ చుట్టూ వున్న వారివైపు చూసింది రంగమ్మ.

పళ్ళేన్ని తీసుకుని అవతలికి వెళ్ళిపోయాడు పందిరి నిర్వాహకుల్లో ఒకతను.

ఒకరి తరువాత ఒకరుగా అతన్ననుసరించి ఆ ప్రదేశాన్ని వదిలి పోయారు మిగిలినవాళ్ళు.

"హోటల్లోకి పోయి గ్లాసుతో మంచినీళ్ళు తీసుకురా బాబాయ్... ఆ చేత్తోనే చాయ్ కూడా తెచ్చిపెట్టు. దెబ్బలు బలంగా తగిలినట్టున్నాయి. వణికిపోతోంది" వృద్ధురాలి భుజాలచుట్టూ చేయి చుట్టి కూర్చోబెడుతూ, పక్కనే వున్న షరీఫ్‌తో చెప్పింది రంగమ్మ. పమిటెచెంగుకు వేసిన ముడిని విప్పి అతనికి పైసలిచ్చింది.

పరిగెత్తుతున్నట్టుగా పోయి పెద్దగ్లాసుతో నీళ్ళు తీసుకువచ్చాడు షరీఫ్. చాయ్ కప్పును కూడా ఆమె చేతికి అందించాడు. కాసిని నీళ్ళతో వృద్ధురాలి ముఖం తుడిచి, నీళ్ళు తాగించింది రంగమ్మ. చాయ్ కప్పును తనే పట్టుకుని చాయ్‌ని కూడా తాగేటట్టు చేసింది.

నీళ్ళ గ్లాసును, చాయ్ కప్పును తీసుకుని అక్కడి నుంచి వెళ్ళిపోయాడు షరీఫ్.

“మీ ఇల్లు ఎక్కడ వుంది మామ్మా?” వృద్ధురాలిని నెమ్మదిగా లేపి నిలబెడుతూ అడిగింది రంగమ్మ.

“నా ఇల్లా… నా ఇల్లు అదిగో… అక్కడ వుంది” గారపట్టి అసహ్యకరంగా కనిపిస్తున్న దంతాలన్నీ కనిపించేటట్టు నోటిని తెరిచి, దక్షిణహస్తంతో సిటీ వెలుపల దూరంగా వున్న కొండల్ని చూపిస్తూ చెప్పింది వృద్ధురాలు.

“అబ్బో… చాలా దూరం… ఈ చుట్టుపట్ల ఎక్కడయినా వుంటే తీసుకుపోయి దిగబెడదామని అనుకున్నాను. అంత దూరం తీసుకుపోవటం నా వల్ల అయ్యే పని కాదు. నీ దారిన నువ్వు వెళ్ళిపో. నేను వెంటనే పనిలోకి పోవాలి… ఇప్పటికే బాగా ఆలస్యం అయిపోయింది” అంటూ ఆమెను పందిరికి దూరంగా తీసుకుపోయి, ఒక సందు ముందు వదిలిపెట్టింది రంగమ్మ.

“నేను పోయొస్తా మామ్మా… నువ్వు ఇంటికి పో…” అంటూ అటుగా వచ్చిన ఖాళీ ఆటోని పిలిచి అందులో కూర్చుంది. తడబడుతున్న అడుగులతో ఆ వృద్ధురాలు సందులోకి పోవటం వరకే చూడగలిగింది ఆమె…. ఆ తర్వాత ఆమెను గురించి మరిచిపోయింది.

***

“ఏమిటి రంగమ్మా…. ఈ రోజు నేను ఎర్లీగా కాలేజీకి వెళ్ళాలనుకున్నాను… నీ మూలంగా లేట్ అయిపోయింది… ఇంతవరకూ కాఫీ కూడా తాగలేదు” ఆటో దిగి గబగబా లోపలికి వస్తున్న రంగమ్మను చూస్తూనే విసుగ్గా అన్నాడు రవిబాబు.

“బాబుగారూ... క్షమించేయండి.. అనుకోని విధంగా ఆలీశం అయిపోయింది.. మా పేట దగ్గిర ఇయ్యాళ ఒక దొంగతనం జరిగింది....” అంటూ టాబూ హోటల్ దగ్గిర జరిగిన సంఘటనని వివరించింది రంగమ్మ.

చెపుతూనే కిచెన్‌లోకి పోయి కాఫీపెట్టి తీసుకొచ్చింది. చెపుతూనే పావుగంటలో టిఫిన్ చేసేసింది. “నాకు తెలియక అడుగుతా బాబూ... ఇత్తడి పళ్ళెంలో ఆ ముసల్దాని తల్లి దాక్కోవటం ఏమిటి?” అని అడిగింది ఆఖర్లో.

“అదేదో మెంటల్ కేసు అయివుంటుంది. మెంటల్ మేళాలు మాట్లాడే మాటలకు అర్థం వుండదు. అర్థం వుండే మాటలు మాట్లాడేవాళ్ళు మెంటల్ మేళాలు అనిపించుకోరు....” అంటూ పావుగంటలో కాలేజీకి పోవటానికి రెడీ అయ్యాడు రవిబాబు. పోర్టికోలో నిలబెట్టి వుంచిన మోటార్ బైక్‌ని స్టార్ట్ చేస్తూ, “ఇవాళ నేను కేంటీన్‌లో భోజనం చేస్తాను. ఇంటికి రావడం కుదరదు. నువ్వు తాళం వేసి వెళ్ళిపో.... వంట చేయకు” అంటూ, అంతలోనే ఏదో గుర్తుకు వచ్చినట్టు బండిని ఆపేసి, ప్యాంటు జేబులో నుంచి ఒక కరెన్సీ నోటును తీసి ఆమెకు ఇచ్చాడు.

“ఎందుకు బాబూ ఇది?” అడిగింది రంగమ్మ.

“నేను భోజనానికి రావటంలేదుగా.... నువ్వు కూడా ఏదైనా హోటల్‌కి వెళ్ళి హేపీగా తినేయ్... కాస్తంత ఛేంజ్‌గా వుంటుంది...” అన్నాడు రవిబాబు.

“అబ్బెబ్బే... అవసరంలేదు బాబూ... నేను ఇంటికి పోతాను..” అతనిచ్చిన నోటును రిటన్ చేయటానికి చేయి ముందుకు జాస్తూ అన్నది రంగమ్మ.

“ఇంటికే వెళ్ళు. వెళ్ళద్దని నేను అనటం లేదు... అంత దూరం వెళ్లి మళ్ళీ నీ కోసం నువ్వు చెయ్యి కాల్చుకోవటం వేస్ట్ ఆఫ్ టైమ్. హోటల్లో తిని వెళ్ళు” అంటూ ఆమె సమాధానం కోసం ఎదురుచూడకుండా మోటార్ బైక్‌ని వేగంగా రోడ్డు మీదికి పోనిచ్చాడు రవిబాబు.

అరగంటలో అన్ని పనులూ పూర్తిచేసి, ఇంటికి తాళం పెట్టింది. తాళం చెవుల్ని రోడ్డుకి ఆవలి పక్కన వున్న బడ్డీకొట్లో ఇచ్చింది రంగమ్మ.

“రంగమ్మా... ఈమధ్య మీ పాండుగాడు కనపడటంలేదు. ఏమయి పోయిండు? ఏదయినా ఊరు పోయిండా?” తాళం చెవుల్ని భద్రపరుస్తూ అడిగాడు బడ్డీ ఓనర్. కోపంగా చూడబోయింది రంగమ్మ. ఎంత ప్రయత్నించినా ఆమె ముఖంలో కోపం ప్రతిఫలించలేదు. నునుసిగ్గు వంటి భావమే ప్రత్యక్షమైంది.

“కాకి ముక్కుకి దొండపండంటే అర్థం తెలిసేది కాదు నాకు. ఇప్పుడు నిన్ను, ఆ పాండుగాడిని చూస్తుంటే తెలుస్తోంది. వాడిలో ఏం చూసి నువ్వు అభిమానిస్తున్నావో నాకు దెల్వటంలే. ఏది ఏమైనా అదృష్టవంతుడు వాడు” నవ్వుతూనే తన అభిప్రాయాన్ని వెల్లడించాడు బడ్డీ ఓనర్.

అక్కడే నిలబడితే అతను అలా మాటల్ని పొడిగిస్తూనే వుంటాడని రంగమ్మకి తెలుసు. అందుకని అతని మాటలకు సమాధానం చెప్పకుండా గిరుక్కున వెనుతిరిగి, దగ్గిర్లో వున్న బస్‌స్టాప్ వైపు అడుగులు వేసింది.

“ఓయ్ రంగమ్మా... నువ్వు ఇక్కడ వున్నావా? నేను చూడలేదు..” అంటూ ఆమెను పలకరించాడు కూరగాయల బండిని నడుపుకుంటూ వస్తున్న వ్యక్తి ఒకతను.

“బాబుగారు ఈ పూట వంట చేయొద్దన్నారు. కూరలు రేపు తీసుకుంటా...” బస్‌స్టాప్ దగ్గిర నిలబడుతూ చెప్పింది రంగమ్మ.

“అది సరేలే.... ఆ పాండుగాడు మళ్ళీ బొక్కలోకి పోయిండు... ఆ సంగతి తెల్సా?” అన్నాడా వ్యక్తి.

రంగమ్మ ముఖంమీది నవ్వు ఎవరో చెయ్యిపెట్టి తుడిచేసినట్టు మటు మాయమైపోయింది.

“ఇందాక వన్ టౌన్‌లో షాహిరీకేఫ్ దగ్గర వుండగా ఆ ఎస్సయ్ వచ్చి పాండుగాడిని తన్నుకుంటూ తీసుకుపోయిండు. ఆ తన్నుల్ని జూసేసరికి మాకు ఒళ్ళు జలదరించింది. కాళ్ళు చేతులు విరిగిపోయి వుంటాయి ఈ పాటికి.... గారెంటీ” అంటూ ఇంకో మాట చెప్పి, తన దారిన తాను వెళ్ళిపోయాడు కూరగాల మనిషి.

తను ఎక్కాల్సిన సిటీబస్ వచ్చి తన సమీపంలోనే ఆగటాన్ని రంగమ్మ గమనించలేదు. ఏదో నిర్ణయానికి వచ్చి, రోడ్డుకు అవతలివైపుకు బయలుదేరింది. మరో పది నిముషాల తర్వాత వచ్చిన సిటీబస్‌ని ఎక్కి అరగంట తరువాత వన్ టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గిర దిగింది.

స్టేషన్ ఆవరణలోకి అడుగు పెట్టీ పెట్టకముందే ఆమె చెవులకు చేరింది గావుకేకలు పెడ్తున్న కంఠం ఒకటి. "నాకు దెల్వదు... నాకేమీ దెల్వదు.. నేను ఆ పని చేయలేదు. నన్ను ఒదిలేయండి. నన్ను కొట్టమాకండి."

పమిటెచెంగును భుజాల చుట్టూ చుట్టుకుంటూ, స్టేషన్ లోకి ఎంటరయిన రంగమ్మను చూసి, "వచ్చావా? వస్తావనే అనుకుంటున్నా. అనుకున్నట్టే వచ్చేశావ్... కాసేపు ఆగు.... లోపల ఎస్సయ్ సాబ్ ఆడికి నలుగు బెడుతున్నాడు. ఆయన బయటికి పోయిం తర్వాత ఆడిని చూద్దువుగాని" అన్నాడు హెడ్ కానిస్టేబుల్ జోగినాథం.

తల వంచుకుని ఒక పక్కగా నిలబడింది రంగమ్మ. పది నిముషాల తరువాత విసురుగా లోపల్నించి బయటికొచ్చాడు ఎస్సయ్. "ఇదిగో జోగినాథం... నువ్వేం చేస్తావో నాకు తెలియదు. నేను ఇంటికి పోతున్నా... తిరిగి వచ్చేసరికి వాడు దారిలోకి వచ్చేయాలి. అర్థమైందా?" అటెంక్షన్‌లో నిలబడిన జోగినాథాన్ని చూస్తూ ఆర్డర్ ఇచ్చి, తన మోటార్ సైకిల్ మీద విసురుగా వెళ్ళిపోయాడు.

"నువ్వు లోపలికి పో రంగమ్మా... ఆడికి నీళ్ళు కావాలేమో అడుగు. చాయ్ కావాలంటే తెచ్చియ్యి. పో...." రంగమ్మవైపు చూస్తూ లోపలికి పోవటానికి అనుమతి ఇచ్చాడు జోగినాథం. లోపలికి పోయింది రంగమ్మ... వెక్కిరింపుగా చూసిన ఇద్దరు కానిస్టేబుల్స్‌ని గురించి పట్టించుకోకుండా లాకప్ గది దగ్గరికి పోయి లోపలికి తొంగి చూసింది "చచ్చిపోయాను.... నా కాళ్ళు విరిగిపోయాయి. నా చేతులు పనిచేయటం లేదు. అన్నెం పున్నెం ఎరగని నన్ను తీసుకొచ్చి

అన్యాయంగా చంపేస్తున్నారు" లాకప్ చివరి భాగంలో వున్న అరుగువంటి గట్టుమీద కూర్చుని అదేపనిగా రాగాలు తీస్తున్నాడు పాండు.

తలుపుల దగ్గిర అలికిడైౖ తల ఎత్తి చూశాడు. చూసిన మరుక్షణం ఠక్కున మూతబడిపోయింది అతని నోరు.... బంద్ అయిపోయాయి అతను తీస్తున్న రాగాలు.

"ఏందే రంగమ్మా.! నువ్వోచ్చావేంది? నిన్ను ఇక్కడికి ఎవడు రమ్మన్నాడు?" సీరియస్‌గా చూస్తూ అడిగాడు.

"నీకింకా బుద్ధి రాలేదు.... రాలేదు కదూ" అడిగింది.

"అదీ... అలా గడ్డిపెట్టు... ఎన్నిసార్లు చెప్పినా వీడికి బుద్ధి రావటం లేదు. ఇదిగో రంగమ్మా... వీడిచేత మాట్లాడించటం మావల్ల కావటం లేదు. మాట్లాడకపోతే ఈసారి నడుములు జారిపోతాయి. మా ఎస్సయ్ సాబ్ మాంచి పట్టుదల మీదున్నాడు. నిన్న సాయంత్రం గౌరీశంకర్ థియేటర్ దగ్గిర కొట్టేసిన డబ్బు ఏడ దాచిండో చెప్పమను" రంగమ్మ వెనకాలే లాకప్ దగ్గరికి వచ్చి, చిన్న కంఠంతో అన్నాడు హెడ్ కానిస్టేబుల్ జోగినాథం. అంటూనే లాకప్ గది తలుపులు తెరిచాడు.

"ఏంది అది? ఏమిటా పని? ఎందుకు తీస్తున్నావ్ తలుపులు? ఇదిగో బాబాయ్... నువ్వు చేసే పని మంచిగ లేదు... మూసేయ్ తలుపులు మూసేయ్...." గట్టుమీది నుంచి లేవకుండానే పెద్దగా అరిచాడు పాండు.

ఆ అరుపులు తనకు వినబడనట్లు కామ్‌గా అవతలికి వెళ్ళిపోయాడు జోగినాథం. "మీరు వెళ్ళి చాయ్ తాగి నాకు కూడా తీసుకురండి. పొండి" అని లోపలవున్న కానిస్టేబుల్స్‌ని బయటికి పంపించేశాడు.

"ఇదిగో రంగమ్మా. ఇప్పుడే చెప్తున్నా. నా దగ్గిరికి రామాకు. దూరంగా నిలబడు..." అంటున్నాడు లాకప్‌లో వున్న పాండు. ఉన్నట్టుండి "అయ్యబాబోయ్... చచ్చిపోయాను. రక్షించు బాబాయ్... నన్ను కాపాడు... ఈ రాక్షసిని బైటికి పంపించేయ్" అంటూ బిగ్గరగా విన వచ్చింది అతని కంఠం. తాపీగా లేచి లాకప్ దగ్గరికి పోయాడు జోగినాథం. బీడీని వెలిగించుకుంటూ లోపలికి చూశాడు.

అడ్డదిడ్డంగా గట్టుమీద పడిపోయిన పాండు గుండెల మీది మోకిలిని పెట్టి బలంగా అదుముతూ, చెంపల్ని ఛళ్ ఛళ్ మన్పిస్తోంది రంగమ్మ.

"నెప్పి పుడ్తోంది వదలవే... వదిలేయవే.... నీకు సలాం చేస్తా... నన్నొదులు!" అంటున్నాడు పాండు. "నీకు ఎన్నిసార్లు చెప్పినా బుద్ధి రావడం లేదు. నీకు రోషం పాశం లేవు. కుక్కతోకలాంటి బుద్ధి నీది... చెప్పు.... ఆ డబ్బు ఏడ బెట్టినవో చెప్పు" షర్టు పట్టుకు గుంజుతూ అడిగింది రంగమ్మ.

"నాకు దెల్వదు..." అన్నాడు పాండు.

చటుక్కు అతన్ని వదిలి రెండు అంగల్లో తలుపుల దగ్గిరికి వచ్చింది రంగమ్మ. ఊచల మధ్యనుంచి చేయిజాచి, జోగినాథం దగ్గిర ఉన్న లాటీని గభాలున లాక్కుంది.

"ఏందే అది? ఇన్స్‌పెక్టర్ మాదిరి నువ్వు కూడా నా మక్కెలు విరగదీస్తావా ఏంది?" ఆశ్చర్యంగా అడుగుతూ గట్టుమీద లేచి కూర్చున్నాడు పాండు.

లాటీని పైకెత్తి అతని సమీపంలోకి పోయింది రంగమ్మ. అతన్ని కొట్టలేదు. విసురుగా చేతిని కిందికి దించి తన కాళ్ళమీద కొట్టుకోవటం మొదలుపెట్టింది.

అది చూసి అదిరిపడి ఆమె చేతిని గట్టిగా పట్టుకున్నాడు పాండు.

"వద్దు.... వద్దే రంగమ్మ. నేను చూడలేను.... చెప్పేస్తాను. చెప్పేస్తానే. మన జువ్వి చెట్టు తొర్రలో వుంది" అన్నాడు గబగబా. లాటీని అవతలికి విసిరి, లాకప్‌లో నుంచి బయటికి వచ్చింది రంగమ్మ. "అరగంటలో మీ డబ్బు మీకు తెచ్చిస్తాను.... వాడిని కొట్టకండి...." అంటూ వడివడిగా స్టేషన్ వెలుపలికి వెళ్ళిపోయింది.

"నీయవ్వ.... నువ్వు మామూలోడివి కాదురా పాండూ... బ్రహ్మరాక్షసుడిలాంటి మా ఎస్సయ్‌నే మంచినీళ్ళు తాగించావ్... రంగమ్మ వచ్చేసరికి అదేంటిరా అలా జావకారిపోయావ్?" కిందపడిన లాటిని తీసుకుని లాకప్ తలుపులు మూస్తూ అడిగాడు జోగినాథం.

"పర్సు పోగొట్టుకున్న సేటు స్టేషన్ కొచ్చాడా?" దెబ్బలు తిన్న కాళ్ళుచేతుల్ని సవరించుకుంటూ అడిగాడు పాండు.

"వచ్చాడుబే.. రోడ్డు అవతలి పక్కన హోటల్లో కూర్చుని వున్నాడు" రోడ్డువైపు చేయి చూపించాడు.

"మా రంగమ్మ డబ్బులు తెచ్చి ఇచ్చేస్తుంది. మీరు అతనికి ఇస్తారా?" అడిగాడు పాండు.

"రేయ్ పాండు... మేము పోలీసులం... మేము అడిగే ప్రశ్నలకు నువ్వు సమాధానం చెప్పి తీరాలి. అది రూలు. అంతేగాని నువ్వు ప్రశ్నలు వేయకూడదు. ఒకవేళ వేసినా సమాధానం చెప్పాల్సిన అవసరం మాకు లేదు. అర్థం అయిందా?" పదిక్షణాలు ఆలోచించి మెల్లిగా అన్నాడు జోగినాథం.

"అవును బాబాయ్. నేను కూడా అదే అనుకున్నాను. మా రంగమ్మ మాత్రం అలా అనుకోవడంలేదు. తనకి తెలియదు, మనం చెపితే వినదు. వట్ట మడ్డిముకం. ప్రపంచమంతా మంచి మనుషులతోనే నిండిపోయి వుందని తన అభిప్రాయం. ఎప్పుడు తగులుతుందోగాని నాసామిరంగా, భలే దెబ్బ తగులుతుంది తనకి" వెనుతిరిగి తన చోటులోకి తను వెళ్ళిపోతూ అన్నాడు పాండు.

"ఏడిశావులేరా... బలవంతంగా నీచేత నిజం చెప్పించిందన్న కడుపు మంటతో మాట్లాడుతున్నావుగాని యదార్థం ఏమిటో నీకు తెలుసు" అన్నాడు జోగినాథం.

"యదార్థమేమిటి బాబాయ్?" అడిగాడు పాండు.

"నువ్వు వుండగా రంగమ్మకు ఎటువంటి ఇబ్బందీ రాదు. తనకు దెబ్బ అసలు తగలనే తగలదు..."

కామ్ అయిపోయాడు పాండు ఆ మాటల్ని వినేసరికి. లాకప్ గది చివరి భాగంలో వున్న గట్టుమీద కూర్చుని తలను పక్కకు తిప్పుకున్నాడు.

***

మురికివాడ చివరిభాగంలో చెత్తగుట్టలమధ్య ఎత్తుగా పెరిగి వున్న జువ్విచెట్టు దగ్గిరికిపోయి చుట్టూ చూసింది రంగమ్మ. గోలీలు ఆడుకుంటున్నారు అరడజనుమంది పిల్లలు అక్కడికి కాస్తంత దూరంలో.

"ఇదిగో టింగూ.... ఒకసారి ఇలా వస్తావా?" అని పిలిచింది ఆమె వారిలో పది సంవత్సరాలున్న పిల్లాడిని.

ఆడుతున్న ఆటని అర్థంతరంగా వదిలేసి పది అంగల్లో ఆమె దగ్గిరికి వచ్చిపడ్డాడు టింగు.

"ఏంది అక్కా? ఎందుకు పిలిచినవ్?" అని అడిగాడు.

"ఈ చెట్టు మీద తొర్ర ఏదైనా వుందా?" అడిగింది."

ఉంది అక్కా.. అదిగో... ఆ కొమ్మకు వుంది...." పదిహేను అడుగుల ఎత్తున్న కొమ్మను చూపిస్తూ చెప్పాడు.

"అందులో ఒక పర్సు వుంటుంది... పైకి ఎక్కి కాస్తంత కిందపడేస్తావా?" అన్నది రంగమ్మ వాడితో.

"ఓస్... ఇంతేనా? చిటికెలో పడేస్తాను..." అంటూ ఉడతలా చెట్టుమీదికి ఎగపాకాడు ఆ పిల్లడు.

“ఒరేయ్ టింగూ... పాండూ బాబాయ్ ఎవరినీ చెట్టు ఎక్కవద్దని చెప్పాడు. ఎవరు అడిగినా ఆ తొర్రను గురించి చెప్పవద్దని అన్నాడు... మర్చిపోయావా?” అన్నాడు గోలీలు ఆడుతున్నవారిలో ఇంకో కుర్రాడు అది చూసి.

పది అడులుల ఎత్తుకు వెళ్ళిన టింగు, జర్రునజారి కింద వున్న చెత్తగుట్ట మీద పడ్డాడు. “నిజమే... మర్చిపోయాను” అంటూ రంగమ్మ వైపు చూశాడు.

అతన్ని అతనితోపాటుగా వున్న ఆ పిల్లలందర్నీ పట్టుకుని వీరబాదుడు బాదేయాలన్నంత కోపం వచ్చేసింది రంగమ్మకి. కోపం అయితే వచ్చిందికాని, దాన్ని బయటపెట్టేందుకు కావల్సిన ధైర్యం మాత్రం రాలేదు.

మురికివాడలో వున్న పిల్లలందరికీ పాండు ఖాస్ దోస్తు. అతనంటే వెర్రి అభిమానం వాళ్ళందరికీ, వాళ్ళంటే పిచ్చిప్రేమ అతనికి. ఇప్పుడు చెట్టు మధ్య భాగం వరకూ వెళ్ళి, అర్జంటుగా కిందికి వచ్చేసిన టింగు – టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతుంటే, అతనికోసం గవర్నమెంట్ హాస్పిటల్లో పదిహేను రోజుల పాటు ఒంటరిగా కూర్చున్నాడు పాండు. డాక్టర్లును బెదిరించి, భయపెట్టి, బతిమాలి అతనికి మంచి వైద్యం చేయించాడు. అటువంటి పాండు ఇష్టానికి వ్యతిరేకంగా నడుచుకుంటాడా ఆ పిల్లడు?

కోపాన్ని ప్రదర్శిస్తే పని జరగదని అర్థమై, “రేయ్ టింగూ... మీ పాండు బాబాయ్ చెప్పబట్టే నేను ఇక్కడికి వచ్చాను. ఆ తొర్రలో ఒక పర్సు వుంటుందని నాకు ఎలా తెలిసింది? మీ పాండు బాబాయ్ చెప్పబట్టే కదా!” అనునయస్వరంతో అన్నది రంగమ్మ.

ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు పిల్లల. అందరూ కలసి ఒక నిర్ణయానికి వచ్చినట్లు తలలు వూపుకున్నారు. అంతకు ముందుకంటే కాస్త వేగంగా చెట్టుమీదికిపోయాడు టింగు.

నిండు గర్భిణి మాదిరి వత్తుగా వున్న ఒక ఖరీదయిన పర్సును తొర్రలోనుంచి తీసి కిందికి వదిలాడు.

గాలిలో వుండగానే దాన్ని అందుకుని, అందులో వున్న కరెన్సీ నోట్లను కనులతోనే లెక్కించి, మనుసులోనే గుండెలమీద చేయి వేసుకుని చిన్నగా నిట్టూర్చింది రంగమ్మ.

దగ్గిరి దగ్గిరిగా నలభై యాభైవేల రూపాయల సొమ్ము వుంది అందులో. రెండు మూడు సంవత్సరాలపాటు హాయిగా గడపటానికి అది సరిపోతుంది.

ఆ పాడు ఆలోచనను తలుచుకునేసరికి వేపాకులు నమిలినట్టు చేదుగా తయారయింది రంగమ్మ నోరు. అటువంటి మాటను మనసులోకి రానిచ్చినందుకు తనను తానే తిట్టుకుంటూ అక్కడి నుంచి మెయిన్ రోడ్డు మీదికి వచ్చింది. భోజనాల టైమ్ కావటంవల్ల సిటీ బస్సులు మందకొడిగా తిరిగే సమయం అది. పది నిముషాలపాటు వెయిట్ చేసినా బస్ రాకపోయేసరికి, నవరాత్రి పందిరి వెనుక భాగంలో వున్న సందులోకి పోయింది ఆమె. ఆరు ఫర్లాంగుల దూరం నడిస్తే, ఇంకో మెయిన్ రోడ్డు కనిపిస్తుంది. అక్కడ ఆరు నిముషాలకో బస్ వస్తుంది.

పెద్ద పెద్ద అడుగులు వేస్తూ సందు మధ్యభాగంలోకి పోయిన తర్వాత, ఉన్నట్టుండి తెలిసివచ్చింది ఆమెకు ఒక విషయం. తనకంటే పాతిక అడుగులు ముందుగా ఆ సందులోకి వచ్చింది ఒక మధ్య వయస్కురాలు.

అటూ ఇటూ ఖంగారుపడుతున్నట్టు చూస్తోంది "ఏమిటి పిన్నీ? ఏమయింది" అనడగాలనుకున్నది, రంగమ్మ.

ఆమె నోరు తెరవకముందే "దొంగలు... దొంగలు... నా దారికి అడ్డం తగులుతున్నారు.. దొంగలు..." మెడలో వున్న బంగారు గొలుసు బయటికి కనిపించకుండా పమిటచెంగును భుజాల చుట్టూ చుట్టుకుంటూ బేలగా చెప్పింది ఆమె.

"దొంగలా? ఎక్కడున్నారు పిన్నీ?"

"బస్ స్టాప్‌లో బస్ కోసం వున్నప్పటి నుంచీ నా చుట్టూ తిరుగుతున్నారు. భయంవేసి ఈ సందులోకి వచ్చాను.. నాకంటే ముందుగా వచ్చి నా కోసం కాపలా కాశారు... అరుగో..." అంటూ ఒక ఇంటి పక్కన వున్న ఖాళీస్థలం వైపు చూపించింది ఆ మధ్యవయస్కురాలు.

ఆమె మాటలు పూర్తవుతుండగానే, ఖాళీ స్థలంలోంచి ఇవతలికి వచ్చారు ముగ్గురు వ్యక్తులు. తమ గుట్టు రెండో మనిషికి తెలిసిందని అర్థం కాగానే, ఆలస్యం చేయటం అనవసరం అనిపించింది కాబోలు, పది అంగలలో వచ్చి మధ్య వయస్కురాలిని, రంగమ్మని చుట్టుముట్టారు.

మధ్య వయస్కురాలి భుజాల్ని పట్టుకుని, ఆమె మెడలో వున్న గొలుసును స్వంతం చేసుకోవటానికి ట్రై చేశారు.

“దొంగలు... దొంగలు... రక్షించండి... కాపాడండి... దొంగలు” అని గావుకేకలు పెట్టింది రంగమ్మ. కేకలు పెట్టడంతో ఆగకుండా, ఆ వ్యక్తుల్లో ఒకతని ముఖం పగిలిపోయేలా కొట్టింది. కళ్ళు బైర్లు కమ్మాయి కాబోలు తూలుకుంటూ రెండు అడుగులు అవతలికి వేసి, అంతలోనే తేరుకున్నాడు ఆ వ్యక్తి. స్పీడ్‌గా ముందుగా వచ్చి రంగమ్మ భుజాల మీద చాలా బలంగా కొట్టాడు.

తూలి పక్కకి పడింది రంగమ్మ... తల పక్కనే వున్న ఒక ఇంటి గోడకు తగిలి నరాలు జివ్వుమన్నాయి. తనకు తెలియకుండానే “అమ్మా” అని అరిచింది.

పళ్ళు బిగించి బూటుకాలిని ఎత్తి నడుము మీద బలంగా తన్నటానికి ప్రయత్నం చేశాడు.

తప్పుకోవటం ఎలాగో ఆమెకు తెలియలేదు. మరోసారి నోరు తెరిచి, “కాపాడండి.. రక్షించండి” అని అరిచి గట్టిగా కళ్ళు మూసుకుంది. ఒకటి... రెండు... మూడు క్షణాలు గడిచినా తన ఒంటిమీద దెబ్బ పడకపోవడంతో, కనులు తెరిచి చూసింది. బూటుకాలితో ఆమె నడుముమీద తన్నటినికి ట్రై చేసిన వ్యక్తి, తన నడుములు ఎవరో విరగగొట్టినట్లు అల్లంత దూరంలో కిందపడి, అప్పుడే లేచి నిలబడుతున్నాడు.

మధ్య వయస్కురాలి మెడలో వున్న గొలుసును లాక్కోవటానికి ప్రయత్నం చేస్తున్న అతని సహచరులు ఇద్దరూ, భయంకరమైన భూతం తమ వెనకాల పడినట్లు భయంతో వణికిపోతూ దూరంగా పారిపోతున్నారు.

మధ్య వయస్కురాలి భుజాల చుట్టూ చేయి చుట్టి, "దెబ్బ తగిలిందా తల్లీ? నెప్పిగా వుందా?" వణుకుతున్న కంఠంతో ఆప్యాయంగా రంగమ్మను అడిగింది ఆరోజు ఉదయం ఆమెకు తారసపడిన వృద్ధురాలు.

తన కళ్ళు తనను ఏమారుస్తున్నాయేమో అన్పించింది రంగమ్మకి.

"పరిచయం లేనట్టు పిచ్చిచూపులు చూస్తావేం తల్లీ? నన్ను గుర్తుపట్టలేదా?" గారపట్టిన దంతాలన్నీ బయటికి కనపడేటట్లు నవ్వుతూ, మధ్య వయస్కురాలిని వదిలి రంగమ్మ దగ్గిర కూర్చుంది ఆ వృద్ధురాలు.

"నువ్వా మామ్మా... నువ్వు ఎలా వచ్చావ్?" అని అడిగింది రంగమ్మ.

"నా తల్లి ఈ సందులో ఎక్కడైనా దాక్కుని వుందేమోనని పొద్దుటి నుంచీ వెతుకుతూ, ఇక్కడే వుండిపోయాను. అమ్మా అని నువ్వు అరిచిన అరుపు వినబడింది. వెంటనే వచ్చేశాను..." ఆమె తల మీద చేయి వేసి మృదువుగా నిమురుతూ చెప్పింది వృద్ధురాలు.

"నా అరుపు విని వచ్చేశావా? మరి ఆ బద్మాష్ లు..." కిందినించి లేచి పలాయనం చిత్తగించిన మూడో మనిషి కోసం చుట్టూ చూస్తూ అన్నది రంగమ్మ.

"నన్ను చూసి దయ్యమో, భూతమో అనుకుని భయపడినట్లున్నారు... పారిపోయారు వెధవలు.." నవ్వుతూ అన్నది వృద్ధురాలు. మెడలోని గొలుసును

తడుముకుంటూ నిలబడిన మధ్య వయస్కురాలికి అలాంటి భావమే కలుగుతున్నట్లు అర్థమయి చికాకుగా తల విదిలించింది రంగమ్మ.

"విలువైన వస్తువులతో ఒంటరిగా రోడ్ల వెంట తిరగటం మంచిది కాదని నీకు తెలిసివచ్చింది కదా? ఇక వెళ్ళిపో పిన్నీ... వెనక్కి వెళ్ళి, టాబూ హోటల్ దగ్గిర బస్ ఎక్కు... వెళ్ళు!" కృతజ్ఞతలు కూడా చెపుకోలేదు ఆ మధ్య వయస్కురాలు. ఆమె వంక చూడను కూడా చూడలేదు. పెద్ద పెద్ద అడుగులతో పరిగెత్తుతున్నట్లు టాబూ హోటల్ వైపు వెళ్ళిపోయింది.

రంగమ్మకు చేయి అందించి లేచి నిలబడటానికి సహాయం చేసింది వృద్ధురాలు.

ఎవరైనా చేయి ఆసరా ఇస్తే తప్ప ఒక్క అడుగు కూడా అవతలికి వేయలేనట్లు వంగిపోయి కనిపిస్తున్న ఆ వృద్ధురాలు, తనను చాలా తేలికగా పైకి లేపినట్లు గమనించలేకపోయింది రంగమ్మ. "నేను అర్జంటుగా పోలీస్ స్టేషన్ కి పోవాలి అంటూ ముందుకెళ్ళబోయి ఆగి, మామ్మా... భోజనం చేశావా?" అని అడిగిందామెని.

అప్పటికప్పుడు నీటితో నిండిపోయాయి వృద్ధురాలి కనులు. "అయ్యయ్యో... ఏమిటి మామ్మా! ఏమయింది? ఆ బద్మాష్‌లు నిన్ను ఏమైనా చేశారా? దెబ్బ ఏదయినా తగిలిందా?" ఆందోళనగా అడిగింది రంగమ్మ.

తనను తాను సంబాళించుకుని, కనులు తుడుచుకుంది వృద్ధురాలు. "వాళ్ళు వెర్రి వెధవలు... నన్ను ఏదయినా చేయటం వాళ్ళ వల్లనే కాదు. వాళ్ళను

పుట్టించిన వాళ్ళవల్ల కూడా కాదు. అన్నం తిన్నావా అని నన్ను ఎవరైనా అడిగి ఎంతకాలం అయిందో గుర్తుకు వచ్చింది. కన్నీళ్ళు అందుకే వచ్చాయి'' అన్నది చిన్న కంఠంతో.

``ఎంత కాలమైంది మామ్మా?'' అడిగింది రంగమ్మ.

``చాలా... చాలాకాలం... దగ్గిర దగ్గిరగా నాలుగువందల సంవత్సరాలు... అబ్బో.... చాలాకాలం'' అరమూసిన కనులతో ఎటో చూస్తూ సమాధానం ఇచ్చిందామె.

``అదిగో... మళ్ళీ మొదలయింది నీ ధోరణి. ఇప్పటిదాకా మంచిగా మాట్టాడావు. ఇంతలోనే నీకు గుబులు మొదలు. సరే... నాతోరా....'' అంటూ ఆ ముసలామె చేయి పట్టుకుని సాధ్యమయినంత వేగంగా సందు చివరి భాగంలో వుండే మెయిన్ రోడ్డుమీదికి తీసుకుపోయింది రంగమ్మ.

సిటీబస్‌లు ఆగే ప్రదేశానికి దగ్గిర్లోనే వున్నది ఒక హోటల్, వృద్ధురాలిని ఒక టేబుల్ ముందు కూర్చోబెట్టి ``పళ్ళేలు పెట్టకండి... పళ్ళేలను చూస్తే మా మామ్మకి పిచ్చి మొదలవుతుంది. విస్తరాకు వేయండి'' అని వెయిటర్‌కి చెప్పి, భోజనం టిక్కెట్‌ని తీసుకు వచ్చింది.

తన పిచ్చితనాన్ని ఆమె పాయింట్ అవుట్ చేసినా ఏమీ పట్టించుకోలేదు వృద్ధురాలు. భోజనం చేసి అప్పటికి చాలా రోజులు అయినట్టు ఆబగా తిని చేతులు కడుక్కున్నది. ఆమె ఎవరో, ఎక్కడనించి వచ్చిందో తెలుసుకోవాలని ఎంత కోరికగా వున్నా, పోలీస్ స్టేషన్‌కి పోయి పాందు దొంగిలించిన పర్సును

అప్పగించేయాలన్న తొందర రంగమ్మను అధికంగా మాట్లాడనీయలేదు. పమిటె చెంగుకున్న ముడినివిప్పి, మూడు రూపాయల చిల్లరను బలవంతంగా వృద్ధురాలి చేతిలో పెట్టింది.

"సాయంత్రం చాయ్ తాగు. నీకు అవసరం అయితే టాబూ హోటల్ దగ్గిర మురికివాడలో వుంటాను నేను. రంగమ్మ అంటే ఎవరైనా చెపుతారు. నా ఇంటికొచ్చేయ్..." అంటూ హడావుడిగా బస్ స్టాప్ దగ్గరికి వచ్చి, అప్పుడే అటుగా వచ్చిన బస్ ఎక్కేసింది.

***

"ఏరా పాండూ.... రంగమ్మకు నువ్వు నిజం చెప్పావా? ఆ పర్సు ఆమెకు దొరుకుతుందా?" అనుమానంగా చూస్తూ పాండు నడిగాడు జోగినాథం.

చాలా నమ్మకంగా తల వూపాడు పాండు.

"ఏదిరా? ఎస్సయ్ గారు వచ్చే టయిమ్ అయింది. ఆయన వస్తే కథ పూర్తిగా మారిపోతుందిబే... నీ ఒళ్ళు హూనం అయిపోతుంది" విసుగ్గా అంటూ స్టేషన్ వరండాలోకి వచ్చాడు.

అదే సమయంలో ఆవరణలోకి ఎంటర్ అయింది రంగమ్మ. "ఇదిగో పర్సు" అంటూ పమిటిచెంగు చాటున దాచి వుంచిన పర్సును తీసి అతనికి అందించింది.

మెచ్చుకోలుగా చూస్తూ ఏదో అనబోయాడు కానిస్టేబుల్ జోగినాథం. కాని అదే సమయంలో ఎస్సయ్ సాబ్ స్పీడ్‌గా వచ్చేయటంతో మాటని మింగేశాడు.

“ఏమిటి జోగినాథం? ఏమయింది? వాడు ఏమైనా నోరు విప్పాడా?” మోటార్ బైక్‌ని వదిలి హూందాగా లోపలికి వస్తూ అడిగాడు ఎస్సయ్.

“నోరు విప్పటమే కాదు సార్... సొమ్ములు కూడా రికవరీ అయ్యాయి సార్...” అంటూ రంగమ్మ తెచ్చిన పర్సును ఆయనకి అందించాడు జోగినాథం.

అందులోని నోట్ల పొతికని చూసి మెరుస్తున్న కనులతో తృప్తిగా తల వూపాడు ఎస్సయ్. “వాడిని బయటికి తీసుకురండి. కమాన్ క్విక్...” అంటూ తన టేబిల్ దగ్గిరికి పోయాడు. క్షణం కూడా ఆలస్యం చేయకుండా లాకప్ తలుపుల్ని తెరిచి పాండును బయటికి రమ్మని సైగ చేసాడు జోగినాథం.

బయటికి వచ్చి ఇన్స్‌పెక్టర్ సాబ్‌కి వంగివంగి నమస్కారాలు చేస్తూ వినయంగా చేతులు కట్టుకుని ఒక పక్కగా నిలబడ్డాడు పాండు.

“నువ్వు చేసిన ఈ పనికి నీ ఎముకల్ని సున్నం చేసి కనీసం మూడు సంవత్సరాలపాటు జైలుకు పంపించేవాడిని. ఈసారికి నిన్ను వదిలేయాలని ఎందుకనో అన్పిస్తోంది. మళ్ళీ ఇలాంటి పనులు చేయకుండా బుద్ధిగా వుంటావా?”

“ఉంటాను సార్... మీరు చెప్పిన తరువాత మళ్ళీ ఇటువంటి ఎదవ పనులు ఎందుకు చేస్తాను సార్?”

“వెళ్ళు... ఎక్కడా నోరు తెరవకు.... తెరిస్తే నా సంగతి తెలుసుగా నడుములు జారిపోతాయ్.. పో..”

అటువంటి మాటల్ని రెండోసారి చెప్పించుకునే అలవాటు పాండుకు లేదు. వేగంగా బైటికి వచ్చేసాడు.

"చాయ్ తాగాలి రంగమ్మా. తల పోటెత్తిపోతోంది..." అంటూ జేబులు తడుముకుని, జోగినాథంవైపు చూసాడు.

"ఎంత సంపాదించినా చాయ్ డబ్బులకు చేతులు జాచాల్సిన ఖర్మ నీది. నువ్వు యీ జన్మలో మారవు...." అంటూ పదిరూపాయల్ని అందించాడు జోగినాథం.

***

"నేను తప్పు చేశానని అనుకోవటం లేదు" పోలీస్ స్టేషన్‌కి దూరంగా వున్న హోటల్లో పాండుతోపాటు చాయ్ తాగుతూ చెప్పింది రంగమ్మ.

సీరియస్‌గా వున్న పాండు ముఖంలో వెంటనే కనిపించింది చిన్న నవ్వు.

"నువ్వు తప్పు చేశావని నేను అనటం లేదు. నీ వరకూ నువ్వు కరక్టే. ఆ ఎస్సయ్ పెద్ద పానకాలసామి. కరెన్సీనోటు కళ్ళబడితే పూనకం వచ్చినట్టు ఊగిపోతాడు" అన్నాడు అతను.

"ఎవరు ఎట్టబోయినా నాకు అనవసరం. నువ్వు మాత్రం ఇక ముందు ఇట్టాంటి పాడు పనులు చేయకూడదు. అంతే...." అంటూ చాయ్ డబ్బుల్ని తను చెల్లించింది రంగమ్మ.

జోగినాథం ఇచ్చిన నోటును మార్చి ఒక బీడీకట్ట కొనుక్కున్నాడు పాండు. బీడీ వెలిగించుకుంటూ ఆమె పక్కన అడుగులు వేశాడు.

పాతిక అడుగుల దూరం పోయాక ఉన్నట్టుండి ఆగిపోయింది రంగమ్మ.

"ఏంది రంగమ్మా, మళ్ళీ ఏం గుర్తొచ్చింది నీకు?" అసహనంగా అడిగాడు పాండు.

"మా రవిబాబు వస్తున్నాడు. అడుగో అటుచూడు" అంటూ ఒకవైపు చూపించింది రంగమ్మ.

అటుకేసి చూసిన పాండుకు మోటార్ బైక్ మీద వస్తూ, రంగమ్మను గమనించి ఆమెవైపు తిరిగిన ఆమె పనిచేసే ఇంటి ఓనర్ రవిబాబు కనిపించాడు.

"బాబూ... కాలేజీ అయిపోయిందా?" పమిటచెంగును భుజం చుట్టూ చుట్టుకుంటూ ముందుకెళ్ళి మోటార్ బైక్‌ని ఆపిన రవిబాబును అడిగింది రంగమ్మ.

"కాలేజీ అయిపోలేదు రంగమ్మా! అర్జంటుగా ఇంటికి రమ్మని నాన్నగారు ఫోన్ చేశారు. నేను వెళుతున్నా, నువ్వు రేపు పనిలోకి రావాల్సిన అవసరం లేదు. ఎల్లుండి వచ్చి ఒకసారి చూడు. ఎల్లుండి కూడా నేను రావటం కుదరకపోతే ఫోన్ చేసి బడ్డీకొట్టు సంగయ్యకి చెపుతాను" అంటూ మోటార్ బైక్‌ని కదిలించి వెళ్ళిపోయాడతను.

"పెద్దవయసట రవిబాబు నాన్నగారిది. అనారోగ్యంగా వుందో ఏమిటో... పాపం..." దిగులుగా ముఖం పెడుతూ పాండుతో అన్నది రంగమ్మ.

“ఊళ్ళో వాళ్ళందరి బాధలు నీ బాధలే. నిన్ను కట్టుకున్నవాడు ఎవడు అవుతాడోగాని ఆడు అనాథాశ్రమం పెట్టుకోవాల్సిందే” కాజువల్‌గా అన్నాడు పాండు.

పాతిక గజాల దూరంలో వుంది వారికి కావాల్సిన బస్‌స్టాప్. అక్కడికి పోయి బస్ కోసం వెయిట్ చేస్తున్న సమయంలో, పాండుకు కనిపించాడు ఒక వ్యక్తి.

“అరేయ్... అరేయ్ గోపాలం.. ఒరేయ్... ఒరేయ్ గోపాలం” అని బిగ్గరగా అరుస్తూ, అతనివైపు పరుగెత్తబోయాడు. చటుక్కున చేతిని జాచి, అతన్ని కదలకుండా నిలబెట్టేసింది రంగమ్మ.

“గోపాలం లేదు... గీపాలం లేదు. ఇయ్యాళ నువ్వు ఎక్కడికీ పోవాల్సిన పనిలేదు. పిచ్చి అరుపులు అరవకుండా నిలుచో... బస్ వచ్చే టైమైంది” అంటూ తన నిర్ణయాన్ని గట్టిగా వినిపించింది.

“ఓసినీ... ఆడు..... ఆ గోపాలంగాడు ఎనిమిదినెల్ల కిందట నాలుగొందలు అప్పు తీసుకొని అడ్రసు లేకుండా మాయం అయిపోయాడు. పదిరోజుల్లో నా డబ్బులు నాకు పువ్వుల్లోపెట్టి ఇచ్చేస్తానని చెప్పి అదేపోక పోయాడు. ఆడిని వదిలిపెట్టేది లేదు. నువ్వు ఇంటికి వెళ్ళిపో. ఆడి దుమ్ము దులిపైనాసరే నా డబ్బులు నేను వసూలు చేసుకు తీరాలి” పట్టుదలగా అంటూ ఆమె చేతిని వదిలించుకున్నాడు పాండు.

బస్టాప్‌కి రెండువందల గజాల దూరంలో వున్న ఒక సందులోకి ఎంటర్ అవబోతూ దొరికిపోయాడతనికి గోపాలం.

“ఆరినీ.... నువ్వా పాండూ.... నువ్వు నన్ను పిలిచావా? నాకు వినబడలేదులే. వినబడితే ఎందుకు ఆగనూ? నీమీదొట్టు... నిజంగానే వినబడలేదు. అవునూ... ఏమిటి కబుర్లు? బాగున్నావా?” షర్టును గట్టిగా పట్టుకున్న అతన్ని చూస్తూ ఆప్యాయంగా మాట్లాడించాడతను.

“బాగున్నానో, బాగా లేకుండా వున్నానో తర్వాత చెపుతాను. ముందు నా పైసల్ నా ముఖంమీద కొట్టు. అర్జంట్” షర్టును గట్టిగా పట్టుకుంటూ అన్నాడు.

“ఇప్పటికిప్పుడు దార్లో కనిపించి పైసల్ అంటే యాడినించి వస్తాయి పాండూ? రెండురోజులాగు... నీ పైసల్ నీకు పువ్వుల్లో పెట్టి...” తడుము కోకుండా మాటలు మొదలెట్టిన గోపాలం ముఖంమీద అరచేత్తో చరిచాడు.

మాటలు మధ్యలోనే ఆగిపోయాయి. లావుపాటి కాంక్రీట్ దిమ్మ ఏదో వచ్చి ముఖానికి తగిలినట్లు వెనక్కి తూలాడు గోపాలం.

“అన్యాయం.... ఇది అక్రమం... ఒంటరివాడిని చేసి నడిబజార్లో ఇలా కొట్టడం అమానుషం...” దెబ్బపడిన ప్రదేశాన్ని చేత్తో అదుముకుంటూ పెద్ద పెద్ద మాటల్ని ఉపయోగించాడు అతను.

“నువ్వు ఎట్టాగైనా అనుకో.... నాకు అభ్యంతరం ఏమీలేదు. పది రోజులని అన్నావు. మళ్ళీ కనబడితే ఒట్టు.... ఎనిమిది నెలలకు పైనే అయింది. నా పైసల్ నాకు కావాలె... ఇచ్చేయ్” పిడికిలి బిగించి గద్దించాడు పాండు.

“రెండురోజులు... రెండంటే రెండురోజులు ఆగు”

“ఆగను... ఇప్పటికిప్పుడు ఇచ్చేయాలె...”

“అన్ని పైసల్ నా దగ్గర ఇప్పుడు లేవు. రెండొందలే వున్నాయి” జేబుల్ని తడుముకుంటూ అంతవరకూ గట్టిగా మాట్లాడిన గోపాలం హీన స్వరంతో అన్నాడు.

అతనికంటె ముందుగా ఆ జేబుల్ని తనే వెతికి, రెండు వందలపైన కొంచెం చిల్లర్ని బయటికి తీసాడు పాండు.

“నువ్వు ఎక్కడ వుంటున్నావో అడ్రస్ చెప్పు. రెండురోజుల తర్వాత వస్తా...” చిల్లర్ని వదిలి పెద్దనోట్లను తన జేబులో పెట్టుకుంటూ అన్నాడు.

“త్రీటవున్ లో మున్సిపాలిటీ పార్కు ఉందా? ఆ పార్కు పక్కనే ఒక మేడ వుంది. ఆ మేడ వెనకాల రేకుల షెడ్లో వుంటున్నాను. ఎల్లుండి కాకుండా ఆవలెల్లుండి వచ్చి నీ పైసల్ నువ్వు తీసుకుపో.... ఎక్కువగా మాట్లాడబోకు ఎళ్లిపో...” డబ్బులు చేజారిపోయాయన్న కచ్చతో చాలా కోపంగా చెప్పడతనికి గోపాలం.

“ఖచ్చితంగా వస్తా... రెడీగా వుంచు... మర్చిపోయావంటే... నా సంగతి నీకు బాగా తెలుసు. మక్కెల్ విరగేస్తా...” అంటూ అతని షర్టును వదిలేశాడు పాండు.

అతని రియాక్షన్స్ కోసం ఎదురు చూడకుండా వచ్చిన దారినే వెనక్కి పోయాడు. రెండు బస్సులు వచ్చినా అలాగే బస్ స్టాప్‌లో నిలబడి వున్నది రంగమ్మ.

“రెండు రోజులు ఖర్చులు గిట్టుబాటు అయ్యాయి. ఆడు అసలు నాకు కనపిస్తాడని అనుకోలే... నీళ్ళు ఒదిలేసుకోవటమే అనుకున్నా....” తను వసూలు చేసుకు వచ్చిన నోట్లను ఆమెకు చూపిస్తూ అన్నాడు పాండు.

“ఆడు... ఆ గోపాలం ఏం చేస్తూ వుంటాడు?”

“ఆడా? ఆడు ఒట్టి ఎధవ... పనీ పాటా లేదు. గడ్డం పెంచి, కుంకం బొట్టు పెట్టుకొని, ఎవరు కనిపిస్తే ఆళ్ళ వెనకాలపడి తిరుగుతూ వుంటాడు. మంత్రాలు నేర్చుకొని మాయలపకీర్ అయిపోవాలని ఆడి ఆశ. ఇప్పుడు కూడా ఎవడో ఒకడిని పట్టుకొని మంత్రాలు–తంత్రాలు అంటూ ఆడికి సేవలుచేస్తూ వుండి వుంటాడు... గారెంటీ” అంటూ చటుక్కున మాటల్ని ఆపి, రంగమ్మకు సైగచేశాడు.

టాబూ హోటల్ దగ్గరికెళ్ళే బస్ అటుగా వస్తూ వుండటమే అందుకు కారణం. “సర్లే.... వాడు ఎవరితో తిరిగినా, ఎట్లాబోయినా మనకి అనవసరం. అతని దగ్గిర వసూలు చేసింది చాలు. ఇంక అతని జోలికి పోమాకు” అంటూ అతనితో కలిసి బస్ ఎక్కింది రంగమ్మ.

“మంత్రాలు చదివి నన్ను కుక్కగానో, పిల్లిగానో మార్చేస్తాడని భయమా?” నవ్వుతూ అడిగాడు పాండు.

“భయం లేదు గియం లేదు. నువ్వు అతన్ని మర్చిపో... అధికంగా మాట్లాడబోకు” విసురుగా కసురుకుని, ఇద్దరికీ టిక్కెట్స్ తీసుకున్నది రంగమ్మ.

## 2

“నేను మర్చిపోను... ఇంకో పది జన్మలు ఎత్తినా ఇవాళ జరిగిన అవమానాన్ని గుర్తుపెట్టుకు తీరతాను... రెండు రోజులు ఆగమన్నా, వాడు.... ఆ పాండుగాడు ఆగలేదు... గురువుగారితో చెప్పి వాడి అంతు చూసి తీరతాను... ఈ మాటకు తిరుగులేదు” పట్టరాని ఆవేశంతో పళ్ళు పటపటమని కొరుకుతూ ఎనౌన్స్ చేశాడు గోపాలం సాయంత్రం ఆరు గంటల సమయంలో.

“అది సరే... గురువుగారు తీసుకురమ్మన్న దినుసులన్నీ తీసుకొచ్చావా?” ఆ మాటల్ని ఆలకిస్తూ ఆఖర్లో అడిగింది వెంకటమ్మ.

“తీసుకువచ్చాను కాబట్టే పూర్తిగా దొరకలేదు ఆ పాండుగాడికి. తీసుకోక ముందు వాడి కళ్ళపడినట్లయితే నా కొంప నిలువునా మునిగి నాశనమయ్యే వాడిని. అసలుతోపాటు వడ్డీ కింద మొత్తం వసూలు చేసి ఒట్టి చేతులతో నన్ను వెనక్కి పంపేవాడు.

నువ్వు వెయ్యి చెప్పు, లక్ష చెప్పు. వాడికి ముహూర్తం పెట్టించాల్సిందే... వాడు నెత్తురు కక్కుకుంటూ నడిబజార్లో నేలమీదపడి గిలగిలా కొట్టుకోవాల్సిందే” జరిగింది మరోసారి గుర్తుతెచ్చుకుని, పళ్ళు పటపటమని కొరుకుతూ అన్నాడు గోపాలం.

“కరాళశక్తికి పూజ చేయటం పూర్తి అవనిదే నీ గోల ఏది గురువుగారి చెవికి చేరదు. అనవసరంగా మాట్లాడి ఆయనకి కోపం తెప్పించకు. నెత్తురు కక్కుకోవటం, కిందపడి గిలగిలా కొట్టుకోవటం అవన్నీ నీకే జరుగుతాయి. జాగ్రత్త” సీరియస్ గా చెప్పిందామె.

‘ఆ మాట నాకు తెలియదని అనుకున్నావా? నువ్వు ప్రత్యేకంగా చెప్పాలా? నాలుగు నెలల్నించీ వదలకుండా వెంట తిరుగుతున్నాను....’ తనలో తను అనుకుంటూ సిటీలో నుంచి తను తీసుకువచ్చిన సరంజామా నంతా ఒక స్టీల్ బేసిన్‌లో పెట్టి, పాతికగజాల దూరంల వున్న ఒక తాటాకుల పాక దగ్గిరకి బయలుదేరాడు గోపాలం.

“నీకు అప్పు యిచ్చిన మనిషికి ఈ అడ్రసు చెప్పావా? మిగిలిన బాకీ డబ్బులు వసూలు చేసుకోవటానికి అతను ఇక్కడికి వస్తాడా....?” అతనితోపాటు అడుగులేస్తూ అడిగింది వెంకటమ్మ.

“నీ కళ్ళకు నేను ఎలా కన్పిస్తున్నాను వెంకటమ్మా? వెర్రి వెంగళప్ప మాదిరిగా కనిపిస్తున్నానా?” అడిగాడు గోపాలం.

“నలుగురూ చూస్తుండగా చిత్తుగా తన్ని తల పగలగొడతాడన్న భయంతో నోరు జారావేమోనని అడిగా... ఆ సమయంలో ఎవరయినా భయపడతారు. నేనైతే అంతే” అన్నది వెంకటమ్మ.

“ఊరి బైట ఇక్కడ గుట్టల్లో మకాం వేసినట్టు నేను చెప్పలేదు. త్రీటవున్ మున్సిపల్ పార్కు దగ్గిర అడ్రసు ఇచ్చా... మనం ఎక్కడున్నామో తెలుసు

కోవాలంటే ఆ పాండుగాడు ఇంకో పది జన్మలు ఎత్తాల్సిందే'' తన తెలివి తేటలకు తానే సంబరపడిపోతూ ఆమెకు చెప్పి చకచకా పాక లోపలికి పోయాడు గోపాలం.

నిలువెత్తు శక్తి విగ్రహం, మహావికృతంగా చూస్తూ నిలబెట్టి వున్నది పాక మధ్యబాగంలో... పసుపు, కుంకుమలతో, రంగు రంగు పుష్పాలతో అలంకరించబడి వున్న ఆ విగ్రహం ఎదుట పద్మాసనం వేసుకుని కూర్చున్నాడు గోపాలం గురువుగారు. అరమూసిన కనులతో వినబడీ వినబడనట్లు ఏవో మంత్రాలు చదువుకుంటున్నాడు. తను తీసుకు వచ్చిన సరంజామాను ఆయన చేతికి అందే విధంగా కిందపెట్టి వెనుతిరిగి నిశ్శబ్దంగా పాక బయటికి వచ్చేశాడు గోపాలం.

అతడ్ని చూసి ''భయం వేసింది కదూ?.... కరాళశక్తి విగ్రహాన్ని చూసేసరికి నీకు కాళ్ళల్లో వణుకు మొదలయిందికదూ?'' పాకకు పదిగజాల దూరంలోనే ఆగిపోయిన వెంకటమ్మ వెంటనే అడిగింది గోపాలాన్ని.

''నాకు తెలియక అడుగుతున్నా... అసలు గురువుగారు ఈ విగ్రహానికి పూజలు ఎందుకు చేస్తున్నట్టు?'' తన మాటలు లోనికి వినబడటం లేదని నిశ్చయపరుచుకుంటూ ఆమెను అడిగాడు గోపాలం.

''ఎనిమిది నెలల నుంచీ నమ్మినబంటు మాదిరి సేవలు చేస్తున్నావ్. గురువుగారు నీకు చెప్పలేదా?''

“సరేలే.... సేవలు చేయించుకోవటమే... నోరు తెరిచి ఏదైనా అడిగితే గుర్రుగా ఒక చూపు చూస్తాడు... గట్టిగా అడిగితే మంత్రదండం లాంటి ఆ చేతికర్రతో తల పగలగొడతాడని భయం...” నిట్టూరుస్తూ అన్నాడు.

“అదీ.... అసలు ఆ విగ్రహానికి పూజలు చేయటం దేనికంటే....” అంటూ సడన్ గా మాటల్ని ఆపేసిందామె.

“ఏంటి వెంకటమ్మా? ఏమయింది?” ఆశ్చర్యంగా అడగబోయి, తనూ ఆ మాటల్ని మింగేశాడతను.

అంతకుముందు రెండు క్షణాల వరకూ పాకలో కూర్చుని మంత్రాలు చదువుకుంటున్న వారి గురువుగారు పాక ద్వారంలోకి రావటమే అందుకు కారణం.

“గోపాలం... ఏయ్ గోపాలం....” పాకలోంచి బయటికి వస్తూనే గట్టిగా పిలిచాడు గురువుగారు.

నాలుగు అంగల్లో దగ్గిరికిపోయి వినయంగా చేతులు కట్టుకుని నిలబడ్డాడు గోపాలం... “ఏమిటి గురూజీ... ఏమిటి తమరి ఆజ్ఞ?” అని అడిగాడు.

“ఆరు పున్నమి రాత్రులు అకుంఠిత దీక్షతో అర్చించినా కరాళశక్తి కనీసం కళ్ళు తెరిచి కూడా చూడటం లేదు. నాలో ఇంక సహనం నశించిపోతోంది.

వెంకటమ్మకి చెప్పి కర్ణపిశాచిని ఆవాహన చేసేందుకు ఏర్పాటు చేయాలి.. ఎలా చేయాలో వెంకటమ్మని అడిగి అన్నీ సిద్ధం చేయి.”

గురువుగారి మాటలు ఆమెకి వినబడ్డాయి. కరాళశక్తి విగ్రహం నిలబెట్టి వున్న పాకకి పాతిక అడుగుల దూరంలో వున్న ఇంకో చిన్నపాకలోకి పరుగులాంటి నడకతో పోయిందామె. రాగిచెంబుతో నీటినిజల్లి శుభ్రం చేసింది నేలని. బియ్యపు పిండితో రకరకాల ముగ్గుల్ని పెట్టింది. నల్లటి చెక్కతో తయారు చేసిన పెద్దపీటను ఆ ముగ్గుల్లోపెట్టి, దానికెదురుగా చిన్న చాపను పరిచింది.

"చెంబులు, పళ్ళేలు, చిన్నసైజు నిమ్మకాయలు సిద్ధంగా పెట్టు. నేను కాళ్ళు చేతులు కడుక్కుని వస్తాను" అని గోపాలానికి చెప్పి రెండు అడుగులు అవతలికివేసి, ఉన్నట్టుండి ఆగిపోయింది వెంకటమ్మ.

"ఏం చేయాలో నాకు తెలుసులే. అన్నీ రెడీచేస్తాను.... నువ్వు వెళ్ళు" అని ఆమెను తొందరపెట్టాడు.

"అదికాదు. కర్ణపిశాచి మాట్లాడేటప్పుడు నువ్వు పొరపాటున కూడా నోరు తెరవకు.... మూడో మనిషి ఎవరూ ఆ మాటల్లో తల దూర్చకూడదు..." అన్నది వెంకటమ్మ.

"నాకు తెలుసని చెపుతున్నాగా... నువ్వు వెళ్ళు."

"నువ్వు గురువుగారి దగ్గిరికి వచ్చిన తర్వాత ఇంతవరకూ ఇట్టాంటి ప్రయోగం జరగలేదు. అందుకే చెపుతున్నా... జాగ్రత్త" అంటూ పాకలో నుంచి బయటికిపోయి పది నిమిషాల్లో తిరిగి వచ్చింది వెంకటమ్మ.

ముగ్గుల చుట్టూ చెంబుల్ని, ఆ చెంబులమీద నిమ్మకాయల్ని అన్నింటినీ సిద్ధంచేసి, వెంటనే గురువుగారి దగ్గిరికిపోయాడు గోపాలం "ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. మీదే ఆలస్యం" అని అన్నాడు.

మంత్రదండం వంటి చేతికర్రను విసురుగా ఊపుతూ వచ్చాడు గురువుగారు. "కూర్చో...." కరకరలాడుతున్న కంఠంతో వెంకటమ్మను ఆదేశించి, ఆమె పీటమీద కూర్చోగానే, తను పీటకు ఎదుటవున్న చాప మీద ఆసీనుడైనాడు.

అతను చదవటం మొదలుపెట్టిన మంత్రాలను చాలా క్లోజ్‌గా ఫాలో కావటానికి ప్రయత్నిస్తూ, రెండు అడుగుల దూరంలో నిలబడ్డాడు గోపాలం. అతను చేతుల్ని తిప్పే పద్ధతిని, పళ్ళెంలోవున్న నిమ్మకాయల్ని వెంకటమ్మ తలమీది నించి అవతలికి విసిరే యాంగిల్స్‌ని అతిజాగ్రత్తగా అబ్జర్వ్ చేయటం మొదలుపెట్టాడు.

అతని ఎడమ చేతికి వున్న రిస్ట్ వాచి సరిగ్గా ఏడుగంటలు సూచిస్తున్న సమయంలో, దట్టమైన చీకట్లు ఆ పాకలున్న కొండగుట్టల్ని పూర్తిగా ఆవరించుకుంటున్న టైమ్ లో ఉన్నట్లుంది నవ్వింది వెంకటమ్మ.

"నవ్వకు వెంకటమ్మా.... నవ్వకు... తప్పు... నోరు మూసుకో" కోపంగా చూస్తూ తీవ్ర కంఠంతో ఆమెను హెచ్చరించబోయి, అదిరిపడ్డాడు గోపాలం.

నవ్వుతూనే వున్నది వెంకటమ్మ. ఆ నవ్వులో క్షణ క్షణానికి మార్పు వచ్చేస్తోంది. చిన్నగా సాఫీగా స్టార్ట్ అయింది కాస్తా, వికటంగా, పరమ

భయంకరంగా ధ్వనించటం మొదలుపెట్టింది. మంత్రాలు చదవటం ఒక్కసారిగా ఆపి, "వచ్చావా?" అని అడిగాడాయన.

"వచ్చానురా... కావాలని పిలిస్తే రాకుండా ఎలా వుంటాను?" నవ్వును ఆపకుండా అన్నాది వెంకటమ్మ.

"వెర్రి నవ్వుల్ని ఆపి విషయం చెప్పు...." కనుబొమల్లో నుంచి క్రూరంగా చూస్తూ అన్నాడు గురువు.

"ఏ విషయం చెప్పమంటావ్ రా? ఆరు పున్నముల నుంచీ ఆకుంఠిత దీక్షతో ఉపాసన చేస్తున్నా, కొంచెం కూడా పట్టించుకోని కరాళశక్తిని గురించి చెప్పనా?

కరాళశక్తినే సాధించలేనివాడికి అష్టసిద్ధి యంత్రం గురించి ఆలోచించే అవకాశమే లేదని చెప్పనా? దేన్ని గురించి చెప్పను?" తల వెనక్కీ ముందుకీ వూపుతూ వెక్కిరింపుగా అడిగింది ఆయన్ని వెంకటమ్మ.

"అడిగినదానికి వెక్కిరించకుండా సరయిన సమాధానం చెప్పు. అడిగిన బలులన్నీ ఇచ్చి నిన్ను ఉపాసించింది నీచేత వెక్కిరింపబడటానికి కాదు... చెప్పు" కోపం నిండిన కంఠంతో హుంకరించాడు గురువు.

"నీకు అష్టసిద్ధి యంత్రం కావాలి... అంతేకదూ?"

"అవును... ఆ అమోఘశక్తి నా స్వంతం కావాలి... అది నా దగ్గిర వుంటే నేను రాజులకు రాజుని, రారాజుని అవుతాను. ఈ సృష్టికంతటికీ నేనే ఏలికను

అవుతాను. ఆ అద్భుతశక్తి నా వశం కావాలి.. ఎలా?" ఉద్రేకపూరిత కంఠంతో గబగబా అన్నాడు గురువు.

"మానవజాతి శ్రేయస్సుకోసం సృష్టించబడిన ఆ అద్భుతశక్తి ఒక మనిషి అజ్ఞానం కారణంగా అంతర్ధానమైపోయింది. అదెక్కడ వుందో తెలుసుకోవాలంటే నువ్వు కరాళశక్తి సహాయాన్ని పొంది తీరాలి."

"అవును... ఇప్పటికి నువ్వు చాలాసార్లు చెప్పావ్ ఆ మాటని... నీ మాటను నమ్మే ఆరు పున్నముల నుంచీ ఆ శక్తిని ఉపాసిస్తున్నాను. కళ్ళు తెరిచి చూడటం కాదుగదా, పెదవివిప్పి ఒక్కమాట కూడా ఇంతవరకూ మాట్లాడలేదు. కరాళదేవిని ప్రసన్నం చేసుకోవటానికి ఇంకో సులువయిన మార్గం వుంటే చెప్పు."

"మంత్రంతో సాధ్యంకాని పనిని తంత్రంతో సాధించు. వేములపల్లి గ్రామం పక్కన ఒక చిట్టడివి వున్నది. ఆ అడవి మధ్యలో పాడుబడిన భవనం ఒకటి వుంటుంది. అందులో తచ్చట్లాడుతూ వుండే ఆత్మ స్వరూపాన్ని భవనంలో నుంచి బయటకు రప్పించాలి" కనుగుడ్లు వింత వింతగా తిప్పుతూ చెప్పటం మొదలు పెట్టిందామె.

ఆత్మస్వరూపాన్ని భవనం వెలుపలికి రప్పించటమనే మాట చెవుల పడిన వెంటనే తొడ చరిచి చాలా పెద్దగా నవ్వాడు గురువు. "ఆత్మస్వరూపాలను అవి వున్న ప్రదేశాలనుంచి ఇవతలికి రప్పించటం నాకు చాలా తేలిక... కూర్చున్న చోటినించి కదలకుండా ఈ నిముషంలోనే ఆ స్వరూపాన్ని భవనంలో నుంచి బయటికి లాగగలను" అని దర్పం ధ్వనిస్తుండగా అన్నాడు.

“అనవసరమైన గొప్పలకుపోయి అన్యాయమైపోకు. నేను చెప్పేది విన్నాక ఏం చేయాలో ఆలోచించుకో...”

వెంకటమ్మ మాటల్ని చెవిన పెట్టలేదు గురువు.

“అనవసరైన గొప్పలకు పోవటం నాకు అలవాటులేదు. పాతిక సంవత్సరాల నుంచీ ప్రాపంచిక సుఖాలను కాదని మంత్రశక్తుల్ని సాధన చేస్తున్నాను. శాకిని ఢాకిణి యక్షిణి శక్తులన్నిటినీ నా గుప్పిట్లో పెట్టుకుని ఆటలాడిస్తున్నాను. ఎక్కడో ఒక పాడుబడిన భవనంలోని ఆత్మస్వరూపాన్ని ఇవతలికి రప్పించ లేకపోవటం అనే మాటకు అర్థమేలేదు. చూడు.. నువ్వు చూస్తుండగానే, ఆ స్వరూపాన్ని ఇక్కడికే రప్పిస్తాను” అంటూ పక్కకు తిరిగి, శిలావిగ్రహంలా నిలబడివున్న గోపాలానికి సైగ చేశాడు.

వెంటనే ఒక వెడల్పాటి పళ్ళెం నిండా నీళ్ళుపోసి అతని ఎదుట పెట్టాడు గోపాలం. బయటికి పరిగెత్తి, అంతకుముందు తను బజారు నుంచి తీసుకువచ్చిన సరంజామానంతటినీ ఆ పాకలోకి తెచ్చాడు.

పసుపు కుంకుమలతో పళ్ళేన్ని అలంకరించి, మంత్రదండం వంటి తన చేతికర్రను ఆ పళ్ళెం చుట్టూ తిప్పాడు గురువు. ఉన్నట్లుండి నోరు తెరిచి, “రా, ఎదుటికి రా–” అని గొంతు చినిగిపోయేలా అరిచాడు.

నిశ్చలంగా వున్న నీరు అల్లకల్లోలం అయింది ఒక్కసారిగా. కణకణలాడే నిప్పుల మీద సాంబ్రాణి జల్లినట్లు తెల్లటి పొగలు దట్టంగా లేచాయి నీటి పై భాగంలోనుంచి.

ఊపిరి బిగపట్టి గురువుగారి భుజాలమీదినించి చూసిన గోపాలానికి, ఆ పొగల మధ్యలో ప్రత్యక్షమవుతూ ఆగుపించింది ఒక పాడుబడిన భవనం.

"రావే.... భవనంలోనుంచి బైటికి రా... త్వరగా రా" చేతికర్రను పళ్ళెం చుట్టూ తిప్పుతో ఇంకోసారి అరిచాడు గురువు. నీటిమీద ప్రత్యక్షం అయిన పాడుపడిన భవనం నిశ్చలంగా అలాగే ఏ విధమైనటువంటి కదలికా లేకుండా కన్పిస్తోంది. పీటమీద కదలిక లేకుండా కూర్చుని వున్న వెంకటమ్మ వున్నట్లుండి ఫక్కున నవ్వింది.

పళ్ళు బిగించి చూశాడు గురువు ఆమె వంక. "వెక్కిరింపా? ఎగతాళా? చూడు... చూడవే... బాగా చూడు" అంటూ పక్కనే వున్న కుంకుమ పొట్లంలో నుంచి పట్టెడు కుంకుమ తీసి పళ్ళెం మీద కొట్టాడు.

"రా బయటికి.... రా" అని ఇంకోసారి హుంకరించాడు.

కనులు చిట్లించి చూస్తున్న గోపాలానికి వెంటనే అగుపించింది పాడుబడిన భవంతిలో ఒక కదలిక... తెల్లటి వెలుగురేఖ సన్నగా స్టార్ట్ అయి, తీగెలా సాగి, అతను చూస్తూ వుండగానే పళ్ళెంలోని నీటిలో నుంచి సర్రున పైకి వచ్చి, గురువుగారి ముఖంమీద బలంగా కొట్టింది. రాక్షస హస్తం ఏదో పట్టుకుని పైకిలేపినట్టు అమాంతంగా గాలిలోకి లేచి అవతల పడ్డాడు గురువు.

కర్ణపిశాచిని ఆవాహన చేస్తున్న ఆ పాకలోనే ఒక పక్కగా పెద్ద ఉట్టిని కట్టి ముగ్గులు వేయటానికని బియ్యపు పిండిని పెద్దకుండలో భద్రపరిచింది వెంకటమ్మ. ఫట్ మని శబ్దం చేస్తూ పగిలిపోయింది ఇప్పుడా కుండ. అందులోని ముగ్గుపిండి

అంతా గురువుగారి నెత్తిమీదా, ఆయనతో పాటు తను కూడా అవతలికి పడిపోయిన గోపాలం ముఖం మీదా విరజిమ్మబడింది.

పడిపడి నవ్వింది పీటమీద కూర్చున్న వెంకటమ్మ. నవ్వినవ్వి "పిచ్చివాడివి నువ్వు. నేను చెపుతున్నది పూర్తిగా వినిపించుకోక తొందరపడ్డావ్. అందుకు ఫలితాన్ని అనుభవించావ్. ఆ భవనంలో వున్న ఆత్మ స్వరూపాన్ని బయటికి రప్పించటం నువ్వు అనుకున్నంత తేలిక కాదు" అని చెప్పింది.

"నా ప్రయోగాన్ని ధిక్కరించిన శక్తి ఎవరిది? ఆ భవనంలో వున్న ఆత్మ స్వరూపానిదేనా?" తలమీద పడిన ముగ్గుపిండిని దులుపుకుంటూ అడిగాడు గురువు.

"నిన్ను, నీ ప్రయోగాన్ని ధిక్కరించి ఆ శక్తి ఎవరిదో, ఎక్కడి నుంచి వచ్చిందో నీకు తెలియచెప్పటం నాకు చేతకావటం లేదు. నేను చెప్పగలిగింది ఒక్కటే... ఏదో ఒక విధంగా ఆ స్వరూపాన్ని బయటికి రప్పించాలి" సీరియస్‌గా చూస్తూ చెప్పింది వెంకటమ్మ.

"తర్వాత? తర్వాత ఏం చేయాలి?" కనులు చిట్లించి సూటిగా చూస్తూ అడిగాడు గురువు.

"నీ శక్తి సామర్థ్యాల నుపయోగించి ఆ స్వరూపాన్ని భవనంలో నుంచి బయటికి రప్పించి ఎవరో ఒక మానవుడి శరీరంలోకి ప్రవేశపెట్టాలి. తర్వాత ఆ మానవుడిని కరాళశక్తికి బలివ్వాలి. అప్పుడే నీకు కరాళశక్తి అనుగ్రహం

లభిస్తుంది. కరాళశక్తి మాత్రమే అష్టసిద్ధి యంత్రాన్ని గురించి నీకు చెపుతుంది. అర్థమైందా?" ముందుకీ వెనక్కీ ఊగుతూ చెప్పింది వెంకటమ్మ.

నరబలి అనే మాట చెవులబడేసరికి గురువుగారికి వెనకాల నిలబడి వున్న గోపాలానికి చెమటలు పట్టేశాయి. "అయ్యబాబోయ్... పోలీసులకి తెలిస్తే తీసుకుపోయి ఉరికంబానికి ఎక్కిస్తారు. లాకప్ లోకి నెట్టి మక్కెలు విరగేస్తారు" ఆందోళన నిండిన కంఠంతో అన్నాడు.

పీటమీద కూర్చుని వున్న వెంకటమ్మ ముఖంలో కూడా మార్పు వచ్చేసింది. "నియమ భంగమైంది. మన సంభాషణలో మూడో మనిషి జోక్యం చేసుకున్నాడు. పోతున్నా... నేను వెళ్ళిపోతున్నా" అంటూ ఒక్కసారిగా పీటమీద నుంచి పక్కకు పడిపోయింది.

పట్టరాని కోపంతో పళ్ళు పటపట కొరుకుతూ పైకి లేచాడు గురువుగారు.

"అనవసరంగా నోరు తెరిచి అంతా సర్వనాశనం చేశావ్. నిన్ను ఊరికే వదలను. నీ అంతు చూస్తాను" అంటూ తన చేతికర్రను ఎత్తి గోపాలం ముఖం మీద కొట్టబోయాడు.

"తప్పయిపోయింది గురూజీ... నరబలి అనేసరికి నాకు భయం వేసింది. అందుకే నోరు జారాను. ఈ ఒక్కసారికి నన్ను క్షమించండి. ఇంకోసారి వెంకటమ్మను పీటమీద కూర్చోబెడతాను. ఈసారి మీరు చెప్పేటంతవరకూ నోరు తెరవను" వణికిపోతూ అన్నాడు గోపాలం.

"పీటమీద కాదురా... నా నెత్తిమీద కూర్చోబెట్టినా ఇంకో నెల రోజుల వరకూ ఆ పిశాచిని పిలవటం సాధ్యపడదు. నిన్ను అనవసరంగా దగ్గిర నిలబెట్టుకుని పెద్ద తప్పు చేశాను..." కోపం కొంచెంగా తగ్గటం వల్ల, పైకి ఎత్తిన చేతికర్రను దించుతూ అన్నాడు గురువుగారు.

"నా తెలివితక్కువతనం వల్ల తీరని అపచారం జరిగిపోయింది. ఇప్పుడు ఏం చేయాలి గురూజీ....?" బాధపడుతున్నట్టు ముఖం పెడుతూ అన్నాడు గోపాలం.

"ముందు వెంకటమ్మ ముఖంమీద నీళ్ళుజల్లి పైకిలేపు... తర్వాత నా ట్రంకుపెట్టెలో ఓ మూలగా ఒక పెద్ద కాగితంచుట్ట ఒకటి వుంటుంది. తీసుకురా.." అంటూ ఆ పాకలోంచి బయటికి వెళ్ళిపోయాడు గురువుగారు.

పక్కనే వున్న కుండలోంచి నీటిని అందుకుని, వెంకటమ్మ ముఖం మీద చిలకరించి, బుగ్గలు తడుతూ, "వెంకటమ్మా... వెంకటమ్మా" అని పిలిచాడు గోపాలం.

అర నిముషం తర్వాత కనులు తెరచి చూసింది వెంకటమ్మ.

"జరిగింది ఏమిటో తర్వాత తీరిగ్గా నీకు చెప్తాను. ముందు మనం ఇంకోపని చేయాలి. ట్రంకుపెట్టెలో ఏదో కాగితం చుట్ట వుందిట. గురువుగారు తీసుగురమ్మన్నారు" అన్నాడు గోపాలం.

ముఖంమీద నీళ్ళను పమిటిచెంగుతో తుడుచుకుంటూ ఆ పాకలోనే ఒక మూలగా వున్న పెద్ద పాతకాలపు ట్రంకు పెట్టె దగ్గరకిపోయి, అందులో వున్న పొడవాటి కాగితపు చుట్టను అతనికి ఇచ్చింది వెంకటమ్మ.

పాక ఎదుటవున్న ఒక మర్రిచెట్టు కింద పచార్లు చేస్తున్నాడు గురువు.

గోపాలం తీసుకుని వచ్చిన కాగితపు చుట్టని తెరిచి, నేలమీద పరిచాడు.

"అదిగో... అద్గో వేములపల్లి...." ఆయనతోపాటు నేలమీద మోకరించి కూర్చుంటూ ఉత్సాహంగా అరిచాడు గోపాలం.

మందపాటి బాండ్ పేపర్ మీద కరక్కాయ సిరాతో పెయింట్ చేయబడిన పెద్ద మేప్ ఆ కాగితపు చుట్టలో వుంది. ప్రభుత్వంగాని, ప్రభుత్వం దగ్గిర అనుమతి పొందిన సంస్థలుగాని ప్రింట్ చేసిన మేప్ కాదు అది.

ఎప్పుడో చాలా సంవత్సరాలక్రితం చేయితిరిగిన చిత్రకారుడు ఎవరో, తనంతట తనే స్వయంగా తయారుచేసిన స్వంత పటం.

"అష్టసిద్ధి యంత్రం అనుపానులు తెలుసుకోవటానికి మా పూర్వీకులు తయారుచేయించారు దీన్ని. పాతకాలపు పట్టణాలు, గ్రామాలు, వాటి చుట్టూ వుండే నదులు, అడవులు అన్నీ వివరంగా చిత్రించబడ్డాయి దీనిలో" అని గోపాలంతో చెపుతూ, చూపుడువేలితోనే వేములపల్లి గ్రామాన్ని స్పృశించి, వేలిని కొంచెం పక్కకు జరిపాడు గురువుగారు.

"ఏమిటి గురూజీ? ఎందుకోసం చూస్తున్నారు?" రెండు నిముషాల తర్వాత అడిగాడు గోపాలం.

“నన్ను అవమానించిన ఆ ఆత్మస్వరూపం ఒక పాడుబడిన భవనంలో నివశిస్తూ వుంటుందని కదా కర్ణపిశాచి కథనం? అటువంటి భవనం ఏదీ ఈ అడవిలో కనిపించటం లేదు....” తల ఎత్తి అతనికేసి చూడనుకూడా చూడకుండా సాలోచనగా అన్నాడు గురువుగారు.

“అదేదో రీసెంట్‌గా నిర్మించబడి వుంటుంది. ఫారెస్ట్ డిపార్టుమెంట్ వాళ్ళో, బాగా డబ్బులున్న సమీప గ్రామస్థులలో ఎవరో గెస్ట్‌హౌస్ కింద ఉపయోగించుకోవటానికి దాన్ని నిర్మించి, ఆ తర్వాత వదిలేసి వుంటారు. అడవి మధ్యలో వుండటంవల్ల ఆ భవనం అతి త్వరగా పాడుపడిపోయి వుంటుంది...” వెంటనే తన అభిప్రయాన్ని వెల్లడించాడు గోపాలం.

చిట్టడివి మీద వేలును ఇంకా కొంచెం అవతలికి జరిపాడు గురువుగారు.

‘నల్లకొండలు...’ తనలో తను చదువుతున్నట్టు పైకి చదివాడు గోపాలం.

“నల్లకొండల చివర నారాయణపురం అనే ఊరు వుంది...” అని మేప్‌ని చూస్తూ ఇంకో ఊరి పేరును కూడా చెప్పాడు గోపాలం.

“మనం నారాయణపురం వెళ్ళటం మంచిదా? వేములపల్లి గ్రామానికి పోవటం మంచిదా?” తల ఎత్తుతూ గోపాలాన్ని అడిగాడు గురువుగారు.

“వేములపల్లి పోవటమే మంచిది గురూజీ! నారాయణపురం వెళితే, మళ్ళీ ఈ నల్లకొండల్ని దాటి ఇవతలికి రావాలి. వేములపల్లి అయితేనే మనకు చాలా సౌకర్యంగా వుంటుంది” గురువుగారు అడిగినదానికి తడుముకోకుండా సమాధానం చెప్పాడు గోపాలం.

దూరంగా నిలబడివున్న వెంకటమ్మని దగ్గిరికి రమ్మని పిలిచి, కిందపెట్టిన మేప్‌ని జాగ్రత్తగా చుట్టచుట్టి ఆమె చేతికి ఇచ్చాడు గురువుగారు.

"మనం వెంటనే వేములపల్లి వెళ్ళాలి. ప్రయాణానికి ఏర్పాటు చేసుకోండి.." అని ఆమెకు ఆర్డర్ ఇచ్చి, కరాళశక్తి ప్రతిష్టించబడి వున్న పాకలోకి వెళ్ళిపోయాడు.

వెంకటమ్మతోపాటు ట్రంకుపెట్టె వున్న పాకలోకి పోయాడు గోపాలం.

"ఏవో నాలుగైదు మంత్రాలు నేర్చుకుని, నలుగురి మధ్య గౌరవంగా బతకాలనే ఉద్దేశంతో ఎనిమిది నెలల నుంచీ గురువుగారి సేవలు చేస్తున్నాను. బజారుపోయి సామానులు కొనుక్కురావటం, ఈ పాకల్ని ఊడ్చి పేడతో అలకటం తప్ప ఇంకే పనీ నన్ను చేయనీయటం లేదు. వచ్చిన దగ్గిర్నించి అష్టసిద్ధి యంత్రం గురించి నిముషానికి నాలుగుసార్లు చెప్పటమే తప్ప, అదేమిటో కూడా నాకు తెలియటం లేదు...." గుమ్మంలో నిలబడి చిన్న కంఠంతో తన గోడును వెళ్ళబోసుకున్నాడు.

గురువుగారిచ్చిన మేప్‌ని ట్రంకుపెట్టెలో పెట్టబోతూ, మధ్యలో ఆ పనిని ఆపి, "ఇప్పుడు నీకు వచ్చిన బాధ ఏమిటి?" అని అడిగింది అతన్ని వెంకటమ్మ.

"అష్టసిద్ధి యంత్రాన్ని గురించి పూర్తిగా నాకు చెప్పు" అన్నాడు వెంకటమ్మతో గోపాలం.

రెండు క్షణాలు ఆలోచించి ట్రంకుపెట్టెని మూసేసింది వెంకటమ్మ. మేప్‌ని విప్పి అక్కడే నేలమీద పరిచింది.

ఎరుపురంగులో చిత్రించబడివున్న ఒక పెద్ద పట్టణాన్ని అతనికి ఆ మేప్‌లో చూపించింది.

"ఇది సిరిపురం సంస్థానం.... ఎప్పుడో నాలుగువందల సంవత్సరాల క్రితం ఈ సంస్థానాన్ని పరిపాలించిన కీర్తిరాయుడు అనే జమీందార్ దగ్గిర వుండేదిట గురువుగారు కోరుకుంటున్న అష్టసిద్ధి యంత్రం.

అడగకముందే అష్టయిశ్వరాల్ని అందిస్తుందిట... శత్రువుల్ని తేలికగా నిర్జించేందుకు కావాల్సిన శక్తి యుక్తుల్ని ప్రసాదిస్తుందట.. ఆ యంత్రం దగ్గిర వుంటే ఈ భూమిమీద ఇక ఎదురనేది ఏమీ వుండదుట" అని వివరించింది వెంకటమ్మ.

మేడలు, మిద్దెలు పూలతోటలతో నిండివున్న సిరిపురం సంస్థానపు చిత్రాల్ని కుతూహలంగా చూస్తూ తలూపాడు గోపాలం.

"ఎందుకు మాయమైందో, ఎలా మాయమైందో గాని సిరిపురం సంస్థానంలో నుంచి మటుమాయమైపోయింది ఆ యంత్రం. తోకచుక్క మాదిరి ఎర్రటి వెలుగులు విరజిమ్ముతూ గాలిలోకి లేచి ఎక్కడో పడిపోయిందట ఆ యంత్రం.

ఆ పడిపోయిన ప్రదేశాన్ని కనిపెట్టి, తిరిగి ఆ యంత్రాన్ని స్వాధీనం చేసుకోవటానికి ఎందరెందరో ప్రయత్నాలు చేశారు. కానీ అది ఇంతవరకూ ఎవరికీ కనిపించలేదు" సిరిపురం సంస్థానం దగ్గిర మొదలుపెట్టి ఆ మేప్‌లో

గుర్తించబడిన గ్రామాల్ని, నదుల్ని, కొండల్ని అన్నింటినీ చూపుడు వేలితో రౌండప్ చేస్తూ చెప్పింది వెంకటమ్మ.

"అంటే నీ ఉద్దేశ్యం ఆ యంత్రం తప్పకుండా ఈ ప్రదేశాల్లోనే ఎక్కడో ఒకచోట పడిపోయి వుంటుందనా?" అని వెంకటమ్మను అడిగాడు గోపాలం.

అవునన్నట్టు తల ఊపింది ఆమె.

"కర్ణపిశాచికి తెలియని సంగతులంటూ వుండవు. ఆ యంత్రం ఎక్కడుందో తను చెప్పచ్చుగదా!" అడిగాడు గోపాలం.

"చెప్పటానికి ట్రై చేసిందట పది సంవత్సరాల క్రితం. అప్పటికి నేను గురువుగారి దగ్గిరికి రాలేదు. మా బాబాయిగారి భార్య పనులుచేసి పెడుతూ వుండేది. ఆ యంత్రం ఎక్కడ వుందో చెప్పమని గురువుగారిని వత్తిడి చేసేసరికి, ముక్కులనుంచీ, చెవుల నుంచీ నెత్తురు వచ్చిందట. గొంతును ఎవరో నొక్కేస్తున్నట్టు గిలగిలా కొట్టుకుని ప్రాణాలు వదిలేసిందట ఆమె. అప్పటి నుంచీ మొదలయింది నేను సేవలు చేయటం" చెప్పిందామె.

"అయితే గురువుగారు కరాళశక్తిని పదిసంవత్సరాల నుంచీ ఉపాసిస్తున్నారా?" అడిగాడు గోపాలం.

"లేదు... ఆ ఉపాసన ఆరు పున్నములనుంచీ మొదలయింది. అంతకు ముందు వరకూ మానవ ప్రయత్నంతోనే ఆ యంత్రాన్ని సాధించటానిక చూశారు. అది అసంభవం అని తెలిసిన తరువాత ఈ పూజలు మొదలు పెట్టారు" అని వివరించింది వెంకటమ్మ.

చాలా శ్రద్ధగా ఆ మాటలు వింటున్న గోపాలం ఉన్నట్లుండి చాలా దీర్ఘంగా నిశ్వసించాడు.

“అదేవిటి? ఇప్పటివరకూ బాగానే వున్నావు. ఇంతలోనే ఏమైంది నీకు?” ఆశ్చర్యంగా అడిగింది వెంకటమ్మ.

“నాలుగు వందల సంవత్సరాల నుంచీ ఎవరికీ కనిపించని అష్టసిద్ధి యంత్రం ఇప్పుడు మన గురువుగారికి మాత్రం కనిపిస్తుందా? అనవసరమైన ఆశలకుపోయి లేనిపోని కష్టాలను గురువుగారు కొని తెచ్చుకుంటున్నారని నాకు అనిపిస్తోంది. అందుకే బాధ కలిగింది” అన్నాడు గోపాలం వెంకటమ్మ వైపు చూస్తూ.

“నాతో అంటే అన్నావుగాని, గురువుగారి దగ్గిర మాత్రం అనబోకు.. అన్యాయమైపోతావు. చేతికర్రతో తల పగలగొట్టి కరాళశక్తి విగ్రహం ముందే నీ ప్రాణాలు తీసేస్తారు....” అంటూ కిందపరిచిన మేప్‌ని చుట్టచుట్టి ట్రంకుపెట్టెలో భద్రపరిచింది వెంకటమ్మ.

“వెళ్ళు... వెంటనే పూజ గదిలో సామాన్లు సర్దు... వేములపల్లికి వెళ్ళాలి మనం. మర్చిపోకు” అంటూ అతన్ని పాకలోనుంచి బయటికి పంపించేసింది.

***

ఎర్రటి దుమ్ముతెరల్ని రేపుతూ వేగంగావచ్చి సడన్‌గా ఒక పెద్ద మర్రిచెట్టు దగ్గిర ఆగింది ఆ బస్సు.

“వేములపల్లె వెళ్ళే పాసింజర్లు ఇక్కడే దిగాలి. త్వరగా బస్సు దిగండి” తల వెనక్కి తిప్పి బస్ చివరి భాగంలోకి చూస్తూ బిగ్గరగా అరిచాడు కండక్టర్.

గురువుగారి ట్రంకుపెట్టెను పట్టుకుని అందరికంటె ముందు దిగింది వెంకటమ్మ. రకరకాల సామగ్రిని పెట్టి గట్టిగా కుట్టిన ఒక గోనె సంచీని భుజం మీద వేసుకుని ఆమె వెనుకే వచ్చాడు గోపాలం.

చేతి కర్రను విలాసంగా ఊపుతూ ఆఖర్లో దిగిన గురువుగారివంకా, తమ చుట్టూ వున్న ప్రకృతి దృశ్యాలవంకా మార్చిమార్చి చూశాడు.

"ఏమిటా వెర్రిచూపులు?" బస్ వెళ్ళిపోయిన తర్వాత, మర్రిచెట్టు మొదట్లోవున్న ఒక బండరాయిమీద కూర్చుంటూ అతన్ని అడిగారు గురువుగారు.

"వేములపల్లి వెళదామని మీరు అన్నప్పుడు, సరాసరి ఊళ్ళోకి వెళ్ళిపోతామని అనుకున్నాను. మంచి ఇంటిని అద్దెకు తీసుకుని హాయిగా విశ్రాంతి తీసుకోవచ్చని ఆశపడ్డాను. దారిమధ్యలో దిగిపోవటం దేనికో నాకు అర్థం కావటం లేదు" తడుముకోకుండా చెప్పాడు గోపాలం.

"మనం ఇక్కడికి వచ్చింది దేనికో తెలిస్తే కర్రలు పట్టుకుని వెంట పడతారు గ్రామంలో నివసించేవాళ్ళు. అసలు ఆ ఊరు ఎటువంటిదో, అక్కడ నివసించే జనం ఎటువంటివాళ్ళో తెలియకుండా ముందుకుపోకూడదు..." బాసిపట్టు వేసుకుని, బండరాయిమీద హేపీగా సెటిల్ అయిపోతూ అన్నాడు గురువుగారు.

"మీరు చెపుతున్నది నాకు అర్థంకాలేదు గురూజీ. మనం ఊళ్ళోకి వెళ్ళటం లేదా?" అడిగాడు గోపాలం.

“నువ్వోక పెద్ద మోద్దుబుర్రవీ. ఊళ్ళోవున్న పరిస్థితులెటువంటివో తెల్సుకోనిదే అటుకేసి వెళ్ళకూడదని గురువుగారి భావం....” ట్రంకు పెట్టెను కూడా చెట్టుకింద దింపి ఆయనకంటె ముందుగా చెప్పింది వెంకటమ్మ.

ఆమెవంక మెచ్చుకోలుగా చూసి, గోపాలంవైపు తిరిగాడు గురువుగారు.

“ఆ గోనెసంచీని వెంకటమ్మకి అప్పగించి నువ్వు ఊళ్ళోకి వెళ్ళిరా... ఈ రోజు వంట చేయటానికి అవసరమైన సరంజామాని ఖరీదుచేసి తీసుకురా... ఊళ్ళోవున్న పెద్దలెవరో, ఎలాంటివాళ్ళో జాగ్రత్తగా ఎంక్వయిరీ చెయ్యి. వెళ్ళిరా” అని ఆర్డర్ ఇచ్చాడు.

గోనెసంచీని వెంకటమ్మ దగ్గిర దించి, గురువుగారు అందించిన రెండు కరెన్సీ నోట్లను జేబులో పెట్టుకుంటూ ముందుకు నడిచాడు గోపాలం.

ఎంతోసేపు పట్టలేదతనికి ఊళ్ళో అడుగుపెట్టటానికి. నాలుగురోడ్లు కలిసే చిన్న కూడలిదగ్గర వున్న చిన్న కాకా హోటల్ వైపు అడుగులు వేస్తుండగా, కనిపించారతనికి పరుగుపరుగున వస్తున్న యిద్దరు వ్యక్తులు.

“కొట్టేశారు... దొరగారి పాలేరు పెద్దయ్యని భుజంగరాయుడిగారి పనివాళ్ళు తల పగలగొట్టేశారు..” తమవంక ప్రశ్నర్థకంగా చూసిన ఒక గ్రామస్థుడికి చెప్పి, హోటల్ పక్కనే వున్న వీధిలోకి వెళ్ళిపోయారు.

గోపాలం చూస్తూ వుండగానే తలపగిలి స్పృహ కోల్పోయిన ఒక వ్యక్తిని చేతుల్లోకి ఎత్తుకుని అటువైపుగా తీసుకువచ్చారు మరో ఇద్దరు వ్యక్తులు. “పడుకోబెట్టండి. బెంచిమీద పడుకోబెట్టి అతని ముఖంమీద నీళ్ళు జల్లండి.

మంచినీళ్ళు తాగించండి'' ఖంగారుగా అన్నాడు గోపాలం పక్కనే నిలబడివున్న గ్రామస్థుడు ఒకతను.

కాకాహోటల్ వెలుపల వున్న బెంచీమీద పడుకోబెట్టారా వ్యక్తులు తలపగిలి స్పృహ లేకుండా పడివున్న మనిషిని. హోటల్ మనిషి అందించిన లోటా తీసుకుని అందులోని నీళ్ళతో అతని ముఖం తుడుస్తుండగా పెద్ద పెద్ద అడుగులేస్తూ అక్కడికొచ్చాడు ఒక ఆజానుబాహుడు.

''దొరగారూ... భుజంగరాయుడి జనం పదిమంది ఒంటరివాడిని చేసి పెద్దయ్యని కొట్టేసారయ్యా... వద్దు వద్దని మేము అడ్డంపడినా ఆగలేదు'' బిక్క ముగంతో ఆయనకి చెప్పాడు లోటా పట్టుకున్న మనిషి.

''ఎందు క్కొట్టార్రా? ఏం చేసాడు పెద్దయ్య?'' బెంచిమీది మనిషిని చూస్తూ అడిగాడు ఆ ఆజానుబాహుడు.

''పెద్దయ్య ఏమి చేయలేదయ్యా. మన మొక్కజొన్న చేనుకు నీళ్ళు పెడుతున్నాడు. భుజంగరాయుడి జనం మొక్కజొన్న పొత్తుల్ని విరవబోతుంటే వద్దని అన్నాడు. అంతే... పదిమందీ కలిసి కర్రలతో కమ్ముకుని బాదేశారు'' గద్గద కంఠంతో చెప్పాడు ఆ వ్యక్తి.

అతని మాటలు పూర్తి అవుతున్న సమయంలో పరుగు పరుగున అక్కడికి వచ్చింది ఒక మధ్యవయస్కురాలు.

“చంపేశారు.... నా దేవుడిని చంపేశారు నాయనా... రవిబాబూ! నా దేవుడిని భుజంగరాయుడి జనం చంపేశారు” అని అరుస్తూ గుండెలు బాదుకోవటం మొదలుపెట్టింది.

“ఆగు... ఆగు రత్తాలూ... నువ్వు కాస్తంత ఆగు. రవిబాబు నిన్న సాయంత్రమే పట్నం నుంచి ఇంటికి వచ్చాడు. నువ్వు అరిచి కేకలు పెడితే అగ్గిరాముడైపోతాడు, నువ్వు కాస్తంత ఆగు” అంటూ ఆమెను సముదాయించటానికి ప్రయత్నం చేశాడు ఒక గ్రామస్థుడు.

రవిబాబుని పేరుపెట్టి పిలవటం మానుకుంది ఆ మహిళ. బెంచి మీద పడుకోబెట్టబడిన పెద్దయ్యను కావలించుకుని ఏడ్వడం మాత్రం మానుకోలేదు.

“భుజంగరాయుడి జనం చేసే ఆగడాలు రోజురోజుకీ చాలా ఎక్కువ అయిపోతున్నాయి దొరగారూ... మొన్నటికి మొన్న మన చెరుకుతోట మీదికి పశువుల్ని తోలి నాలుగు ఎకరాల పంటను నాశనం చేసేశారు.

మీరు తగాదాలువద్దని అంటారనీ, తన్నులాటలు అనవసరం అంటారని వాళ్ళ ధైర్యం. మీ మంచితనాన్ని వాళ్ళు పిరికితనం కింద జమ కడుతున్నారు.

మీరు ఏదో ఒకటి చేయకపోతే లాభం లేదు” దొరగారి పక్కన నిలబడి చిన్న కంఠంతో చెప్పాడు ఆయన అక్కడికి వచ్చిన దగ్గిర నుంచీ మాట్లాడుతున్న గ్రామస్థుడు.

“మన ఆచారిగారిని పిలిపించండి. ముందు పెద్దాయన దెబ్బలకి కట్లు కట్టించాలి” చాలా ప్రశాంతంగా అన్నాడు దొరగారు. ఆయన ఆ మాటలు

అంటుండగానే, చంకలో ఒక మందులపెట్టెను పట్టుకొని పరుగులాంటి నడకతో అక్కడికొచ్చాడు ఆ గ్రామంలో అందరికీ వైద్యం చేసే ఆచారి.

‘‘దెబ్బలు చాలా గట్టిగా తగిలినట్లు వున్నాయి దొరగారూ! కట్లు చాలా ఎక్కువగా కట్టాలి. మొన్న పట్నం నుంచి తెప్పించిన బేండేజీ క్లాతు మన భవనంలోనే వుండిపోయింది. ఎవరినైనా పంపించి తెప్పించండి’’ బెంచిమీద పెద్దయ్య నాడిని పట్టుకుని పరిశీలిస్తూ చెప్పాడు.

‘‘వెళ్ళు... త్వరగా వెళ్ళి తీసుకురా’’ పక్కనేవున్న గ్రామస్థుడి వైపు చూస్తూ చెప్పాడు దొరగారు. మరుక్షణమే నిశ్శబ్దంగా నిలబడి ఆ సంభాషణల్ని ఆలకిస్తున్న గోపాలం పక్క నుంచి వేగంగా పరిగెత్తాడు ఆ గ్రామస్థుడు.

***

‘‘బాబూ... రవిబాబూ... బారెడు పొద్దెక్కింది. నిద్రలేచి కాఫీ తాగండి’’ విశాలమయిన భవంతిలో ఒక గదిముందు నిలబడి చిన్న కంఠంతో పిలిచింది ఒక పనిమనిషి.

‘‘నాన్నగారు తాగారా?’’ పెద్దగా ఆవులించి ఒళ్ళు విరుచుకుంటూ అడిగాడు గదిలో బెడ్ మీద వున్న రవిబాబు.

‘‘నాన్నగారు పొద్దుపోకముందే నిద్రలేచి స్నానం చేసి, పూజ చేసుకుని టిఫిన్ చేసి మూడుసార్లు కాఫీ తాగారు. మీరేమో ఇంతవరకూ ముఖమైనా కడగలేదు’’ అంటూ గదిలోకి ఎంటరైంది పనిమనిషి.

ఆమె తెచ్చిన కప్పును అందుకుంటూ, ‘‘నాన్నగారు హాల్లోనే వున్నారా?’’ అడిగాడు రవిబాబు.

“లేరు బాబూ.. ఊళ్ళోకి పోయారు. చలమయ్య హోటల్ దగ్గిర వున్నారు” చెప్పింది పనిమనిషి. పెదవుల దగ్గిర పెట్టుకోబోతున్న కప్పును చటుక్కున కిందికి దించి, కనులు చిట్లిస్తూ ఆమెవంక చూశాడతను.

“తొందరగా తాగి కప్పు ఇచ్చేయండి బాబూ... నాకు అవతల బోలెడు పనులు వున్నాయి. దొరగారు తిరిగి వచ్చేలోపల పూర్తికాకపోతే తిట్టిపోస్తారు” అతని ముఖంలోకి చూడకుండా తల పక్కకు తిప్పుకుని చెప్పిందామె.

“నాన్నగారు ఎప్పుడూ చలమయ్య హోటల్ దగ్గిరికి పోరు. ఇప్పుడు అక్కడికి ఎందుకు పోయారు?” కప్పును అలాగే పట్టుకుని నిశితంగా చూస్తూ ఆమెను అడిగాడు రవిబాబు. పనిమనిషి ముఖంలో రకరకాల భావాలు ప్రత్యక్షమయ్యాయి.

“ఎందుకు పోయారో నాకెట్టా తెలుస్తుంది చినబాబూ? ఎందుకు పోతున్నారని నేను అడుగుతానా? అసలు అలా అడగచ్చా? మీరు ముందు కాఫీ తాగి కప్పు ఇచ్చేయండి. అంట్లు తోమలేదు. వంట చేయాలి. ఆలస్యం అయితే పెద్దయ్యగారు ఆకలికి ఆగలేరు.... అరిచి కేకలు పెట్టేస్తారు” అన్నది.

“నువ్వు చేయాల్సిన పనులన్నీ వరసబెట్టి చెప్పేస్తున్నావు. నేను అడిగినదానికి మాత్రం సమాధానం చెప్పవు. అంతేకదూ?” సగం తాగి, కప్పును కిందికి దించుతూ అన్నాడు రవిబాబు. ఆ మాటకు సమాధానం చెప్పేందుకు పనిమనిషి రెడీ అవకముందే ముఖద్వారం దగ్గిర ప్రత్యక్షం అయినాడు ఒక గ్రామస్థుడు.

“చిలకమ్మా... ఓయ్ చిలకమ్మా.. ఎక్కడ వున్నావ్?” ద్వారం దగ్గిరే నిలబడి పెద్ద కంఠంతో అరిచాడు.

“చెవికోసిన మేకలా ఎందుకు అలా అరుస్తావ్? ఇక్కడ ఎవరికీ చెవుడు లేదు. ఏం కావాలి నీకు?” రవిబాబు గదిలోనుంచి వస్తూ కోపంగా అడిగింది పనిమనిషి.

“దొరగారు మొన్న పట్నం నుంచి తెచ్చిన బేండేజి క్లాత్ కావాలి... తొందరగా యివ్వు” అన్నాడతను.

“నెమ్మది... నెమ్మదిగా మాట్టాడు. చినబాబు మెలకువగానే వున్నాడు... నోటిని జాగ్రత్తగా చూసుకో” చటుక్కున గొంతు తగ్గించి అతన్ని కమాండ్ చేసింది పనిమనిషి. పరుగులాంటి నడకతో పక్క గదిలోకి పోతుండగా, తన గదిలోంచి బయటికి వచ్చాడు రవిబాబు. “బేండేజి క్లాత్ ఎవరికోసం?” అని గ్రామస్థుడిని అడిగాడు.

“అదీ – అది దెబ్బలకి కట్టు కట్టటానికి చిన్నబాబూ... ఆచారిగారు అడిగారు. పెద్దయ్యగారు వెంటనే తీసుకురమ్మన్నారు” ఒక్కసారిగా అదిరిపడినట్లు ఒక అడుగు వెనక్కి వేస్తూ గబగబా చెప్పాడు ఆ గ్రామస్థుడు.

“బేండేజి క్లాత్ కట్టటానికే వుపయోగపడుతుంది. ముఖం తుడుచుకోవటానికి కాదని కూడా నాకు తెలుసు. కట్లు ఎవరికి కడుతున్నారు? హోటల్ చలమయ్యకి ఏవైనా దెబ్బలు తగిలాయా?”

“అదీ... చలమయ్యకి కాదు చినబాబూ” అంటూ అతనితో మాటల్ని ఆపాడు ఆ గ్రామస్థుడు. “తొందరగా చిలకమ్మా... అక్కడ నా కోసం అందరూ ఎదురుచూస్తూ వుంటారు” అని పక్కగదిలోకి పోయిన పనిమనిషిని వుద్దేశించి పెద్దగా అన్నాడు.

పెద్ద అట్టపెట్టెలో నీట్ గా ప్యాక్ చేసి వున్న బేండేజి క్లాత్‌ని తీసుకు వచ్చి అతనికి అందించబోయిన పనిమనిషిని వెంటనే అడ్డుకున్నాడు రవిబాబు. “ఎవరికి తగిలాయి దెబ్బలు?” కనులు చిట్లించి చూస్తూ అడిగాడు.

“అదీ... మన పెద్దయ్యకి... మొక్కజొన్న చేనుకి నీళ్ళు పెట్టడానికి పోయినప్పుడు” మాటల కోసం తడుముకుంటూ మొదలుపెట్టాడు ఆ గ్రామస్థుడు.

పూర్తిగా చెప్పమని అతన్ని బలవంతం చేయలేదు రవిబాబు. పెద్దయ్య అనేమాట చెవులపడిన మరుక్షణం తన చేతుల్లో కాఫి కప్పును విసిరేశాడు రవిబాబు. నలిగివున్న నైట్ డ్రస్‌ని మార్చుకోను కూడా మార్చుకోకుండా ఎవరో వెనకబడి తరుముతున్నట్లు ముఖద్వారాన్ని దాటి వీధిలోకి పరుగు తీశాడు.

“అయ్యయ్యో... చినబాబూ.. ఆగండి... ఒక్కసారి ఆగండి” ఆందోళన నిండిన కంఠంతో అరుస్తూ, పనిమనిషి దగ్గిర బేండేజి క్లాత్‌ని తీసుకుని అతని వెనుక తను కూడా పరిగెత్తటం మొదలుపెట్టాడు గ్రామస్థుడు.

ఆగలేదు రవిబాబు. అతని అరుపుల్ని అసలే మాత్రం లక్ష్యపెట్టలేదు. మూడేమూడు నిముషాల్లో మెయిన్ రోడ్డును చేరుకుని, మరో రెండు నిముషాల తర్వాత చలమయ్య హోటల్ దగ్గిరికి వెళ్ళిపోయాడు.

"వచ్చిందా? బేండేజి క్లాత్ వచ్చిందా?" వంచిన తల ఎత్తకుండా పెద్దయ్య ఒంటిమీద గాయాల్ని శుభ్రం చేస్తూ అడుగుతున్నాడు ఆచారి. ఆ ధ్యాసలోపడి సుడిగాలి మాదిరి వచ్చి పడిన రవిబాబును చూడలేదు. పమిటచెంగును నోటికి అడ్డం పెట్టుకుని తనలో తను కుమిలిపోతున్న రత్తాలు చూసింది.

"చిన్నయ్యా... చంపేశారయ్యా... నా దేవుడిని ఆళ్ళు చావగొట్టేశారయ్యా" అంటూ ఒక్కసారిగా బావురుమంది ఆమె.

"చిన్నబాబూ... మీరు అనవసరంగా ఆవేశపడకండి. పట్టపగలు జరిగిన వ్యవహారం... పదిమందికీ చెప్పి పంచాయితీ పెట్టిద్దాం... తొందరపడి మనం ఏదైనా చేస్తే ఆ భుజంగరాయుడికి లోకువ అయిపోతాం. మీరు కొంచెం నిదానించాలి" పెద్దయ్య వంక చూస్తూ బొమ్మలా నిలబడిన రవిబాబు చేయి పట్టుకుంటూ అన్నాడు అక్కడ గుంపులో నిలబడివున్న వారిలో ఒకతను.

"అరేయ్ వెంకటేశూ!" పెద్దయ్య మీదినించి తన దృష్టి మరల్చకుండా తమ పాలేరుని పిలిచాడు రవిబాబు.

"ఇక్కడే వున్నాను చినబాబూ!" అంటూ ముందుకు వచ్చాడు పెద్దయ్యని మోసుకువచ్చిన వారిలో ఓ వ్యక్తి.

"ఎవరు? ఎవరు చేశారు ఈ పని?"

"భుజంగరాయుడి పెద్ద పాలేరు సోమయ్య... వాడి బామ్మర్ది, వాడి తమ్ముడు" అంటూ మరికొంత ఆనవాళ్ళను తడుముకోకుండా చెప్పాడు వెంకటేశు.

“ఇప్పుడు ఎక్కడ వున్నారు వాళ్ళు?”

“అక్కడే గరపచేను పెద్దమడి దగ్గిరే వున్నారు. దెబ్బలు తగిలిన పెద్దయ్యని మేము మోసుకువస్తుంటే మీసాలు మెలేసి పకపకా నవ్వుకుంటున్నారు.”

చటుక్కున చేయిజాచి అతని దగ్గిరున్న బాణాకర్రని తను తీసుకున్నాడు రవిబాబు. వద్దు చిన్నబాబూ వద్దు.... అటుకేసి వెళ్ళద్దు.... ఆగండి అని అక్కడున్న వాళ్ళు గావుకేకలు మొదలుపెట్టినా వినిపించుకోకుండా అతి వేగంగా పొలిమేరలవైపు పరిగెత్తాడు.

***

“నీకు బుద్ధిలేదు... నేను చెప్పిందేమిటి? నువ్వు చేసిందేమిటి? ఇప్పుడు టైమెంతైందో తెలుసా?” మిట్టమధ్యాహ్నం అవుతుండగా, కాళ్ళు ఈడ్చుకుంటూ వచ్చిన గోపాలాన్ని చూసి కోపంగా అన్నాడు గురువుగారు.

తను తీసుకువచ్చిన వంట సరంజామాని అసహనంగా చూస్తున్న వెంకటమ్మ చేతికి అందించి, వినయంగా చేతులు కట్టుకు నిలబడ్డాడు గోపాలం. తను చలమయ్య హోటల్ దగ్గిరికి పోయిన మరుక్షణం దగ్గిర్నించీ మొదలుపెట్టి, వెనక్కి వచ్చేటంతవరకూ తను అబ్జర్వ్ చేసిన అంశాలను ఆయనకి తెలియచేశాడు.

“వద్దు వద్దంటున్న కొద్దీ పొలాల్లోకి పరిగెత్తి ఆ భుజంగరాయుడి పాలేర్లు అందరినీ చావకొట్టి వచ్చాడు దొరగారి కొడుకు రవిబాబు. నలుగురికి చేతులు విరిగిపోయాయిట.... నలుగురికి తలలు పగిలిపోయాయి....

ఊరు ఊరంతా అట్టుడికినట్టు ఉడికిపోతుంది. ఏ క్షణంలో ఏం జరుగుతుందో ఎవరికీ అర్థం కావటంలేదు'' అంటూ మాటల్ని ముగించాడు గోపాలం.

''ఎవరి గోలలో వాళ్ళు ఉన్నారన్నమాట... నీ గురించి ఎవరూ అడగలేదా?'' సాలోచనగా చూస్తూ అన్నాడు.

''హోటల్ చలమయ్య అడిగాడు... ఇక్కడి చిట్టడవిలో మూలికల్ని సేకరించటానికి వచ్చామని చెప్పాను.''

''అప్పుడతనేమన్నాడు? తలూపి ఊరుకున్నాడా?''

''ఊరుకోలేదు.... అడవిలో ఒక పాడుబడిన మేడ వుందిట. అందులో ఆడదయ్యం ఒకటి తిరుగుతూ వుంటుందిట... దాని దగ్గరికి మాత్రం పోవద్దని అన్నాడు. గతంలో చాలామంది ఆ దయ్యం మూలకంగా మతులు చెడినంత పనై, మంచాలు పట్టారట'' అని చెప్పాడు గోపాలం.

ఆ మాటలకు తల ఊపాడు గురువుగారు. ఎటువంటి కామెంటూ చేయలేదు. ''వెంకటమ్మకి సహాయం చేయి. వంట త్వరగా పూర్తిచేయండి'' అని మాత్రం చెప్పి, తన ఆలోచనల్లో తను మునిగిపోయాడు.

గోపాలం తీసుకొచ్చిన సరంజామాలో నుంచి బియ్యపు పొట్లాన్ని బయటికి తీసి, గోనెసంచీలో మూటకట్టి తెచ్చుకున్న పెద్ద సత్తుగిన్నెలో పోస్తోంది వెంకటమ్మ.

''పొయ్యి ఏర్పాటు చూడు... నాలుగు ఎండుకొమ్మల్ని ఏరుకురా'' అని అతనికి చెప్పింది.

పట్టెడు పట్టెడు లావున్న మూడు కొండరాళ్ళను ఏరుకొచ్చి మర్రి చెట్టు వెనుక భాగంలో పొయ్యి మాదిరిగా ఏర్పాటు చేశాడు గోపాలం. పక్కనేవున్న పొదల్లోకి పోయి ఆమె అడిగిన ఎండుకొమ్మల్ని విరుచుకు వచ్చాడు.

నలభై రెండు నిమిషాల్లో వంట పూర్తి చేసింది వెంకటమ్మ. తెల్లగా తోమిన సత్తుపళ్ళెంలో ముందు గురువుగారికి వడ్డించింది. ఆయన ఆరగించి, మర్రిచెట్టు మొదట్లోకి చేరుకున్న తర్వాత తనకు, గోపాలానికి మరో రెండు పళ్ళేల్లో మిగిలిన పదార్థాలన్నిటినీ సర్దింది.

చలమయ్య హోటల్ దగ్గిరికి వచ్చిన దొరగారిని గురించి, ఆయన కొడుకు రవిబాబును గురించి ఆమెకు చెపుతూ, ఆమెతోపాటు అన్నం తిన్నాడు గొపాలం.

"ఒక్కగానొక్క కొడుకట... భూమిమీద పడగానే తల్లిని పోగొట్టుకున్నాట్ట... ఇప్పుడు దెబ్బలు తగిలిన పెద్దయ్య భార్య రత్తాలు అతన్ని పెంచి పెద్దచేసిందట. ఆ ప్రేమతోనే అతను భుజంగరాయుడి జనాన్ని చావచితగ్గొట్టి వచ్చాట్ట" అంతకుముందు గురువుగారికి చెప్పిన మాటల్ని వెంకటమ్మకు చెప్పాడు.

"డబ్బులు దండిగా వున్నవాళ్ళు ఏం చేసినా చెల్లుబాటు అయిపోతుంది. ఇంతకీ దొరగారి కొడుకు ఏంచేస్తూ వుంటాడు? మూడుపూటలా తినటం, ఎదుటివాళ్ళ తలలు పగలగొట్టటమా? వేరే పనేం లేదా?" అడిగింది వెంకటమ్మ.

"ఛా... ఛా... అటువంటిది ఏదిలేదు. మనం ఖాళీచేసి వచ్చిన సిటీలో ఏదో కాలేజీలో చదువుకొంటున్నాట్ట... నిన్ననే ఇంటికి వచ్చాట్ట" చెప్పాడు గోపాలం.

“సరేలే! ఎవరు ఎట్టా బోయినా మనకి అనవసరం. ముందు మనం వచ్చిన పని పూర్తియిపోవాలి. అదే మనకి ముఖ్యం” అంటూ భోజనం ముగించి, తను తిన్న పళ్ళెం తీసుకుని అక్కడికి పాతిక గజాల దూరంలో వున్న చిన్న నీటిగుంట దగ్గిరికి బైలుదేరింది వెంకటమ్మ.

గురువుగారు ఉపయోగించిన సత్తు పళ్ళేన్ని, తను అన్నం తిన్న ఇంకో పళ్ళేన్ని, వంటచేసిన పాత్రల్ని అన్నింటినీ తీసుకుని ఆమె వునుకే అడుగులు వేశాడు గోపాలం. మురికిగా వున్న నీళ్ళు అతనికి అసహ్యాన్ని కలిగించాయి. “గురువుగారికి చెప్పి ఊళ్ళోకి వెళ్ళిపోదాం... ఈ నీళ్ళు తాగితే వాంతులు మొదలవుతాయి” అని వెంకటమ్మకి చెప్పి, వెనక్కి వచ్చాడు.

“ఇక్కడి నీళ్ళను చూస్తే నీకు అసహ్యం కులుగుతోందా?” నోరు తెరిచి అతను ఒక్కమాట కూడా మాట్లాడకముందే కల్పించుకుని అడిగాడు గురువుగారు.

అవునన్నట్టు తల ఊపాడు గోపాలం.

“రెండు రోజులు ఓపికపట్టు... అడవిలో వున్న మేడని ఒకసారి కళ్ళారా చూసి, అక్కడి పరిస్థితుల్ని అధ్యయనం చేసి ఆ తర్వాత ఊళ్ళోకి మకాం మారుద్దాం....” అరమూసిన కనులతో చెప్పాడు గురువుగారు.

“అడవిలోకి ఎప్పుడు పోదాం? ఇప్పుడు బాగా ఆలస్యం అయిపోయింది. రేపు వెళదామా?” అని అడగాలనుకున్నాడు గోపాలం. అప్పటికే పూర్తిగా కనులు మూసుకుని ఆయన ఏవో ఆలోచనల్లో మునిగిపోవటాన్ని గమనించి బలవంతాన నోటిని అదుముకున్నాడు.

“ఇంకోసారి ఊళ్ళోకి వెళ్లి వస్తావా?” నీటిగుంట దగ్గర్నించి తిరిగి వస్తూ అతన్ని అడిగింది వెంకటమ్మ.

“చీకటిపడే సమయంలో అక్కడికి పోదలచుకోలేదు. అంతగా అవసరం అయితే రేపు పొద్దున్న పోతాను. అంతవరకూ విశ్రాంతి తీసుకోటమే. వేరే పనిలేదు” అంటూ మర్రిచెట్టు వెనుకభాగంలో నేలను శుభ్రం చేసుకుని, గోనెసంచీలో వున్న దుప్పటిని కింద పరిచాడు గోపాలం. ఇటుకరాయిలాంటి కొండరాయిని తలగడ మాదిరిగా తలకింద పెట్టుకుని హాయిగా పడుకున్నాడు.

చీకటి పడిన తర్వాత అతన్ని నిద్రలేపి, మరోసారి సత్తుపళ్ళెం చేతికి ఇచ్చింది వెంకటమ్మ.

“గురువుగారు భోజనం చేశారా?” నిద్రకళ్ళను నులుముకుంటూ, ఆ పళ్ళేన్ని ఒళ్ళో పెట్టుకుని అడిగాడు.

“ఈ రోజు భోజనం చేయరట... తనంతట తను పలకరించేదాకా మాట్లాడించవద్దన్నారు” అందామె.

పళ్ళేన్ని ఖాళీచేసి, నీటిగుంట దగ్గిరికి పోయి వస్తూ మర్రిచెట్టు కింద అర్ధనిమీలిత నేత్రాలతో కూర్చుని వున్న గురువుగారి వైపు ఓరగా చూశాడు గోపాలం.

తనంతట తనే అతన్ని పలుకరించాడు గురువుగారు.

“ఏడుపు... ఎవరో ఆడమనిషి ఏడుస్తున్నట్టు వినిపిస్తోంది. ఊళ్ళో మళ్ళీ ఏదైనా గొడవ జరిగి వుంటుందా?” అతని ముఖంలోకి చూస్తూ అడిగాడు.

తడి చేతుల్ని తన భుజంమీద వున్న టవల్‌కి తుడుచుకుంటూ, చెవులు రిక్కించి విన్నాడు గోపాలం.

“ఊళ్ళో నుంచి ఏమీ వినరావటంలేదు. అదేపనిగా ఆలోచించటం వల్ల అడవిలోనుంచి వచ్చే శబ్దాలు మీకు ఏడుపు మాదిరిగా వినిపించి వుండవచ్చు” నెమ్మదిగా తన అభిప్రాయాన్ని తెలియచేశాడు.

“వెంకటమ్మా... నువ్వు జాగ్రత్తగా విను.... వీడికి ఏమీ వినపడడం లేదుట... వెక్కి వెక్కి ఏడుస్తున్నారు ఎవరో... ఎటునుంచి వినవస్తోందో చూసి చెప్పు” అతని వంక కోపంగా చూసి, వెంకటమ్మను దగ్గరికి పిలుస్తూ ఆజ్ఞ ఇచ్చాడు గురువుగారు. చేతుల్ని చెవుల దగ్గిర పెట్టుకుని, మర్రిచెట్టుకు దూరంగా పోయి, తాను కూడా పది నిముషాలపాటు ఆలకించి వచ్చింది వెంకటమ్మ.

“గోపాలం మాటలు నిజమే స్వామి... నాకు కూడా ఏమీ వినిపించడం లేదు” అని రిపోర్టు చేసింది.

“వాడితోపాటు నీకు కూడా చెవుడు వచ్చింది. బుద్ధి మందగించింది. ఇక మీరు నాతోపాటు మెలకువగా వుండాల్సిన అవసరం లేదు... పోయి పడుకోండి” కసురుకున్నట్లు సీరియస్‌గా చెప్పాడు గురువుగారు.

చింతాకంత ముఖం చేసుకుని మర్రిచెట్టు వెనుక భాగంలోకి చేరుకున్నది వెంకటమ్మ. “ఎందుకు బాధ? ముందు వెనకా ఆలోచించకుండా తిట్టడం ఆయనకు అలవాటేనని నీకు తెలుసుకదా?” ఆల్‌రెడీ తన దుప్పటి మీదికి చేరుకున్న గోపాలం అనునయించాడు లోగొంతుకతో.

“ఈయన ఆ అష్టసిద్ధి యంత్రాన్ని ఎప్పుడు సాధిస్తాడోగాని, సాధించేలోపల నా ప్రాణాలు పోయేటట్టున్నాయి. చాకిరీకి చాకిరీ చేయటం, అనవసరంగా మాటలు పడటం నాకు చేతకావటంలేదు. బుద్ధి గడ్డి తిని ఈయన దగ్గిరికి చేరుకున్నాను. బైటపడటం ఎలాగో అర్ధం కావటంలేదు” తనూ గొంతును తగ్గిస్తూ వాపోయింది వెంకటమ్మ.

“కొంచెం ఓపిక పట్టు... ఏడాదిపాటు ఏదో ఒక విధంగా భరించు... ఆ తర్వాత మనకీ కష్టాల నుంచి విముక్తి దొరుకుతుంది” తలకింది రాయిని అవతలకు జరిపి, చేతిని పెట్టుకుంటూ చెప్పాడు గోపాలం.

“సంవత్సరం తర్వాత నాకు విముక్తి ఎలా దొరుకుతుంది” ఆశ్చర్యంగా అడిగింది వెంకటమ్మ.

“తిండికి ఇబ్బంది లేకుండా నాలుగు పైసలు వెనక వేసుకునేందుకు అవసరం అయిన మంత్రాలు ఒకటి రెండు నేర్చేసుకుంటాను. ఆ తర్వాత మనిద్దరం ఒక మంచిరోజు చూసుకుని పని మానేద్దాం... నీకు ఇష్టం అయితేనే సుమా... ఇష్టం లేకపోతే నాతోపాటు రావాల్సిన అవసరంలేదు..” ఆమె ముఖంలోకి సూటిగా చూడకుండా, ఆకాశంలోకి చూస్తూ అన్నాడు గోపాలం.

అదిరిపడి, ఆంకాళమ్మలా గావుకేకలు పెట్టలేదు వెంకటమ్మ. అతని మాటలకు సమాధానం చెప్పలేదు. అరగంటపాటు అతనివంక చూడను కూడా చూడలేదు.

వేగంగా కొట్టుకుంటున్న గుండెలతో ఊపిరి బిగపట్టి ఎదురుచూసి చూసి, ఒక విధమైన నిరాశకు గురయ్యాడు గోపాలం. పక్కకు తిరిగి కళ్ళు మూసుకున్నాడు.

ఉన్నట్లుండి అతని భుజం మీద పడింది వెంకటమ్మ చెయ్యి. ఉలిక్కిపడి తలతిప్పిన అతని పెదవుల మీద చూపుడు వేలిని వుంచి శబ్దం చేయవద్దని హెచ్చరించింది ఆమె. మర్రిచెట్టు ముందు భాగంలో నడుము వాల్చిన గురువుగారిని కనులతోనే అతనికి చూపించింది.

“శబ్దం చేయకుండా రా... ఆయన చూస్తే ఇద్దర్నీ చంపేస్తాడు...” అతనికి మాత్రమే వినిపించేటట్లు లోగొంతుకతో చెప్పి, నెమ్మదిగా చెప్పి నిలబడింది.

శరీరంలోని రక్తం అంతా విపరీతమైన వేడిమికి గురి అవుతున్న అనుభూతి కలిగింది గోపాలానికి. తన ముఖం తనకే బరువు అనిపించటం మొదలు పెట్టింది. అతనికి తెలియకుండానే వెచ్చటి నిట్టూర్పులు వెలువడటం మొదలయింది. మరమనిషిలా దుప్పటిమీంచి లేచాడతను. అడుగులో అడుగువేస్తూ, వెంకటమ్మను అనుసరించాడు. మర్రిచెట్టుకు వందగజాల దూరంగా వున్న ముళ్ళపొదల చాటుకు దారి తీసిందామె. ఆ పొదల వెనకాల వున్న ఒక వెడల్పాటి కొండరాయిమీద కూర్చుంది.

“గురువుగారు... గురువుగారికి మెలకువ వచ్చి మన కోసం వెదికితే?” ఆమె ఎదుట నిలబడుతూ అన్నాడు గోపాలం.

సమాధానం చెప్పకుండా అతని చేతిని గట్టిగా తనకేసి లాగుకున్నది ఆమె. మీదికొచ్చిన అతన్ని కౌగిలించుకుని తమకంగా ముద్దు పెట్టుకుంది.

***

అర్ధరాత్రి అవుతున్న సమయంలో ఉన్నట్లుండి కనులు తెరిచాడు మర్రిచెట్టు ముందు భాగంలో నిద్రపోతున్న గురువుగారు. పక్కనే వున్న చేతికర్రను అందుకుంటూ చెట్టు వెనక్కి చూశాడు. ఆదమరిచి నిద్రపోతున్నాడు గోపాలం. అతనికి నాలుగు అడుగుల దూరంలో పడుకొంది వెంకటమ్మ.

చప్పుడు చేయకుండా వారి పక్కనుంచి అడుగులు వేశాడాయన. ముళ్ళపొదల్లో నుంచి సూటిగా ముందుకు పోయాడు. ఒక గంట సేపు నడిచాక వత్తుగా వున్న చెట్ల మధ్యలోంచి ఆయనకి అగుపించింది ఒక పెద్ద పాడుపడిన భవంతి.

ముఖద్వారానికెదురుగానే వున్నది తుప్పుపట్టి పాడైపోయిన పెద్ద ఇనుపగేటు.... ఏక్షణంలోనైనా విరిగిపోవటానికి సిద్ధంగా వున్నట్లు కనిపిస్తున్నాయి ప్రహరీగోడలు, గేటుకు పది అడుగుల ఇవతలగా ఎండిపోయిన ఆకులతో అసహ్యకరంగా కనిపిస్తున్న నేలను శుభ్రం చేసి, బాసిపట్టు వేసుకు కూర్చున్నాడు. చేతికర్రను అవతల పెట్టి, చూపుడు వేలితో మట్టిమీద ఏవేవో ముగ్గులు గీశాడు.

“శాకిని ఢాకినీ యక్షిణీ శక్తుల్ని గుప్పిట్లో పెట్టుకొని ఆటలు ఆడించే స్వామిని వచ్చాను... నా కళ్ళకు కనిపించకుండా, నా మాటల్ని ఆలకించకుండా నువ్వు తప్పించుకోలేవు.. బయటికిరా...” పాడుపడిన మేడవంక చూస్తూ బిగ్గరగా అరిచాడు.

రెండు నిముషాల తర్వాత మేడ ముందు గదిలో నుంచి బయటికి వచ్చి, ముఖద్వారం దగ్గిరవున్న మెట్లమీద నిలబడింది అస్పష్టమయిన ఆకారం ఒకటి.

“బైటికి రమ్మని ఆదేశిస్తుంటే బొమ్మలా అలా నిలబడిపోయావేమిటి? మెట్లు దిగి ముందుకు రా.. గేటును దాటి ఇవతలకు వచ్చేయ్....” మెరుస్తున్న కనులతో మహదానందంగా అన్నాడు గురువుగారు.

అతను గమనించలేదుగానీ, ముఖద్వారం దగ్గిర వున్న ఆకారం గమనించింది. ఎటువంటి భావాలు లేకుండా నిర్వికారంగా వున్న ఆ ముఖంలో చటుక్కు ప్రత్యక్షం అయింది ఒక భయం. వద్దు.... వద్దని ప్రాధేయపడుతున్నట్టు చేతుల్ని ముఖానికి అడ్డంగా పెట్టుకుని, ఒక్కసారిగా మేడలోకి పారిపోయింది. మెరుస్తున్న కనులతో మహదానందంగా చూస్తున్న గురువుగారి ముఖంలో చకచకా మారిపోయాయి రకరకాల భావాలు.

“ఆగు... అక్కడే ఆగు... అడుగు కదిపి అవతలికి పోయావంటే నిలుచున్న చోటునే నిన్ను భస్మం చేసేస్తాను. వెనక్కి తిరుగు...” కర్ణ కఠోరంగా అరుస్తూ, కిందవున్న మట్టిని ఎత్తి ముగ్గులమీద బలంగా కొట్టాడు.

తెల్లటి పొగమాదిరి పైకిలేచింది. దుమ్ముతెర... మేడలోకి పారిపోతున్న ఆకారపు అడుగులు తడబడ్డాయి. ముందుకుపోటాన్ని విరమించుకుని వెనక్కి తిరిగే ప్రయత్నం చేసింది అది. అంతలోనే కంటికి కనిపించని చేయి ఏదో మెడపట్టుకుని నెట్టినట్టు తూలి ముందుగదిలో పడిపోయింది.

“ఎవరు? ఎవరు ఆ పని చేసింది? ఎవరు నా ప్రయోగానికి అడ్డం తగిలింది? దమ్మంటే ఎదుటికి రండి... రండి” ఖంగుమంటున్న కంఠంతో అరిచాడు గురువుగారు.

అతని అరుపు ముగిసిన మరుక్షణంలోనే మేడ ముందు భాగంలో ప్రత్యక్షమైంది తెల్లటి వెలుగు. తీగెలా సాగింది అది. బ్రహ్మాండమైన పాము మాదిరి వేగంగా ఆయనకేసి దూసుకువచ్చింది.

“ఆగు.... ఆగిపో... కరాళశక్తి మీద ఆనపెడుతున్నా. అడుగు ముందుకెయ్యకు. ఆగిపో...” అంటూ హుంకరించాడు గురువుగారు.

కరాళశక్తి పేరు ఆ వెలుగు ముందు ఎందుకూ పనికిరాలేదు. పాములా మెలికలు తిరుగుతూ మరింత వేగంగా వచ్చేసింది అది. మొట్ట మొదటిసారిగా తన శక్తియుక్తుల మీద తనకే అపనమ్మకం కలిగిందాయనకు.

“ఎవరు నువ్వు? ఎవరివి నువ్వు?” అని అడుగుతూ, నేలమీద తనుగీసిన ముగ్గుల ఎదుటినుంచి గబుక్కున లేచాడు. ఉన్నట్టుండి వెనుతిరిగి పాడుపడిన మేడకు దూరంగా పారిపోవటానికి ప్రయత్నించాడు.

వేగంగా వచ్చి అతన్ని ఢీకొట్టిందా వెలుగు.

భుజాలు విరిగిపోయినంత బాధ నరాలను జివ్వుమనిపిస్తుండగా కంటికి కనిపించని ఏదో రాక్షస హస్తం గట్టిగా వడిసిపట్టుకుని గాలిలోకి లేపినట్లు పైకిలేచి, పల్టీలు కొట్టుకుంటూపోయి ఒక పెద్ద పొద దగ్గిర పడిపోయాడు. ఇద్దరు మనుష్యులు కూర్చోగలిగినంత సైజున్న పెద్ద కొండరాయి వున్నది ఆ పొద దగ్గిర.

నుదురు దానికి తగిలేసరికి తనకు తెలియకుండానే గావుకేక ఒకటి పెట్టాడతను. ఎర్రటి రక్తం బొట్లుబొట్లుగా బయటికివచ్చి నాశికాగ్రం మీదుగా పెదవుల మీదికి, అక్కడి నుంచి చుబుకం మీదికి జారటం మొదలయింది.

"గోపాలం... ఒరేయ్ గోపాలం... ఎక్కడ వున్నావురా... రారా.... త్వరగా రారా...." కంటి ఎదుటలేని తన శిష్యుడిని పెద్ద కంఠంతో పిలుస్తూ తనకు తెలీయకుండానే తెలివితప్పి తల వాల్చేశాడు.

పగతీరిన తరువాత పడగను కిందికి దింపి, పుట్టలోకి వెళ్ళిపోయే తాచుపాము మాదిరి, మెల్లిగా వెనుతిరిగి పాడుపడిన మేడకేసి వెళ్ళిపోయింది అతడిని తీవ్రంగా గాయపరిచిన వెలుగురేఖ.

***

"వస్తున్నా... వస్తున్నా గురువుగారూ వచ్చేస్తున్నా..." బిగ్గరగా అరుస్తూ చటుక్కునలేచి కూర్చున్నాడు మర్రిచెట్టు దగ్గిర గాఢనిద్రలో వున్న గోపాలం.

అతనితో పాటు తను కూడా లేచింది వెంకటమ్మ. "ఏమిటి....? ఏమైంది? ఎందుకలా గావుకేకలు పెట్టావ్?" అని అడుగుతూ అతని దగ్గిరికి వచ్చింది.

"గురువుగారు పిలిచినట్టు అనిపించింది... తలకు దెబ్బతగిలి ముఖమంతా రక్తంతో తడిసిపోయినట్టు... కళ్ళు తేలవేస్తున్నట్టు కలవచ్చింది" అంటూ దుప్పటిమీది నుంచి లేచి, మర్రిచెట్టు ముందు భాగంలోకి చూశాడు గోపాలం. నేలమీద కూర్చున్నా, కుర్చీలో కూర్చున్నా, ఇరవైనాలుగు గంటలు తనవెంట వుండే కృష్ణాజినం పరచుకుని, దానిమీద ఆసీనుడౌతాడు అతని గురువు ఆ సమయంలో ఖాళీగా కనిపిస్తోంది అది.

"అనుకుంటూనే వున్నాను... ఎవరో వెక్కి వెక్కి ఏడ్చినట్టనిపిస్తోందని అన్నాడుగా. ఆ ఏడుపు అడవిలో వున్న పాడుపడిన మేడ దగ్గిర్నించి వస్తోందని నిర్ణయించుకుని, అటువెళ్ళి వుంటాడు. సందేహం" లేదు అతని వెనుకేవస్తూ తన అభిప్రాయాన్ని వెల్లడించింది వెంకటమ్మ.

"నన్నో నిన్నో వెంటబెట్టుకుని పోకుండా ఒక్కడే ఒంటరిగా అడవిలోకి వెళ్ళడం దేనికో!" తనలో తను అనుకుంటున్నట్టు పైకే అనేశాడు గోపాలం.

"నిన్ను, నన్ను వెంటబెట్టుకొని ఎందుకు వెళతాడు? వెళితే ఆ అష్టసిద్ధి యంత్రాన్ని గురించి మనకి కూడా తెలిసిపోతుందిగదా!" ముచ్చటగా మూతిని ముడుస్తూ అన్నది వెంకటమ్మ. అలా అంటున్న ఆమె వంక ఆశ్చర్యంగా చూశాడతను. గురువుగారిమీద ఆమెకు వున్న అసంతృప్తి ఎంతటి మోతాదులో వున్నదో అర్థమయ్యేసరికి, కొంచెం ఇబ్బందికరంగా ఫీలయ్యాడు.

"నోరు తెరిచి చెప్పుకునేందుకు తోడులేక ఇంతకాలం నుంచి ఎంత నరకం అనుభవిస్తున్నానో నాకు మాత్రమే తెలుసు. నీకు తెలియదు. నిట్టాడిలా నిలబడి అదేపనిగా ఆలోచించమాక... రా" అంటూ అతని చేతిని పట్టుకుని మర్రిచెట్టు వెనక్కి లాగింది వెంకటమ్మ.

"ఆగు వెంకటమ్మా! ఈ ఒక్కసారికి కాస్తంత ఆగు. అడవిలోకి వెళ్ళిన గురువుగారికి నిజంగానే ఏదయినా ప్రమాదం జరిగివుంటే ఇప్పుడు మనం చేసేది చాలా తప్పు పని అవుతుంది. మనం సుఖంగా బతకాలి అంటే నేను ఎన్నో కొన్ని విద్యలు నేర్చుకొని తీరాలి. అందుకు ఆయన కాళ్ళు, చేతులతో తిన్నగా వుండాలి...." అంటూ ఆమె చేతుల్ని వదిలించుకున్నాడు గోపాలం.

గోనెసంచిలో నుంచి తీసి ఒకపక్కగా పెట్టిన కిరోసిన్ లాంతర్ని వెలిగించాడు. దగ్గర్లోవున్న పొద దగ్గిరికిపోయి పట్టెడు లావున్న ఒకపొడుగాటి కొమ్మని విరిచి చేతికర్ర మాదిరిగా తయారుచేశాడు.

"యుద్ధానికి పోతున్నట్టు కర్ర పట్టుకుని రెడీ అవుతున్నావు. అసలు ఈ చీకటిలో ఆ పాడుపడిన మేడ ఎక్కడ వుందో నీకు తెలుస్తుందా?" దుప్పటిమీద వయ్యారంగా కూర్చుంటూ అతన్ని అడిగింది వెంకటమ్మ.

"అవునుకదూ.. ఆ సంగతే మరిచిపోయా..." తన పొరపాటును నిజాయితీగా ఒప్పుకుంటూ క్షణకాలం ఆలోచించి, చిరునవ్వుతో చిటికె వేశాడు గోపాలం.

"గురువుగారి కాయితపు చుట్ట వుందిగా.. బయటికి తీయి. అందులో ఈ ఊరు, ఈ అడవి, అడవిలోని దారులన్నీ వివరంగా గీసి వున్నాయి" అన్నాడు.

"గురువుగారి ముందు అమాయకుడిలా వుండటాన్ని చూసి నువ్వు పిచ్చివాడివి అనుకున్నాను. తెలివితేటలున్నాయి నీకు" అంటూ పైకిలేచి అతని బుగ్గ గిల్లిందామె.

ట్రంకుపెట్టె దగ్గిరికెళ్ళి, తాళాన్ని తీసింది. తను వెలిగించిన లాంతర్‌ని పైకెత్తి పట్టుకున్నాడు గోపాలం.

ఒకపక్కగా పెట్టిన కాయితపు చుట్టను వెంకటమ్మ బైటికి తీస్తుండగా, ఆ చుట్టకింద వున్న అందమైన చిన్న చెక్కపెట్టె అతని కగుపించింది. బాగా డబ్బున్న

పెద్దింటి ఆడవాళ్ళు తమ నగల్ని, ఖరీదైన వస్తువుల్ని దాచుకునేందుకు ఉపయోగించే చందనపు పెట్టెలా వున్నదది.

"అదేమిటి? ఏమున్నాయి అందులో?" అంటూ ముందుకు వంగి ఆ పెట్టెని ముట్టుకోబోయాడతను.

చటుక్కున అడ్డుకున్నది వెంకటమ్మ.

"ఈ పెట్టెలో వున్న సరంజామా అంతా ఆ ముసలాడు తను మంత్రాలకి, తంత్రాలకి ఉపయోగించేటటువంటివి. ఆయనకి తెలియకుండా అంటుకుంటే లేనిపోని గొడవలు ఎదురవుతాయి... ముట్టుకోకు" అంటూ అతన్ని పక్కకు నెట్టి రప్పున ట్రంకుపెట్టెను మూసేసింది.

"మంత్రాలుకాదు... తంత్రాలు కాదు... డబ్బులు వుండి వుంటాయి. మనం ఆశపడకుండా ఏవో కథలు చెప్పివుంటాడు..." అంటూ కాగితపు చుట్టని తెరిచి, మేప్ మీద వున్న గీతల్ని, గుర్తుల్ని దీక్షగా చూశాడు గోపాలం.

"నాకు ఏమీ అర్థం కావటం లేదు. నీకు అర్థం అవుతున్నదా....?" వెనుకనుంచి అతని ఎడమ చెవిని మునిపళ్ళతో కొరుకుతూ అడిగింది వెంకటమ్మ.

మేప్ మీది నుంచి తల ఎత్తి తమకు దగ్గిరగా వున్న పొదల మధ్య వున్న ఒక దారివైపు చేయి చూపించాడు గోపాలం.

"ఆ దారి మూడు ఫర్లాంగుల దూరం ముందుకు తీసుకుపోతుందిట. అక్కడినించి ఎడమచేతివైపు ఇంకో దారి వుందిట... అది అడవి మధ్య భాగంలోకి

వెళుతుందిట. గురువుగారు చెప్పిన మాటల ప్రకారం ఆ పాడుపడిన మేడ అడవి మధ్యలోనే వుండాలి" అంటూ మేప్ ని తిరిగి చుట్టగా చుట్టి ఆమె చేతికి ఇచ్చేశాడు.

"నేను ఒంటరిగా వుండలేను. నువ్వు తొందరగా వచ్చేయ్..." గోముగా అన్నది వెంకటమ్మ.

"ఇక్కడున్నట్టు వచ్చేస్తాను. నాకు మాత్రం నిన్ను వదిలిపెట్టి వెళ్ళాలని వున్నదా! గురువుగారి పని... బద్ధకించడం మనిద్దరికీ మంచిది కాదు...." అంటూ చెట్టుకొమ్మని, లాంతర్‌ని తీసుకుని ముందుకు అడుగు వేశాడు గోపాలం.

అతను పొదల్లోకిపోయి కనుమరుగు అయిన తర్వాత అరగంట వరకూ అలాగే కూర్చుండిపోయింది వెంకటమ్మ. ఆ తరువాత తెలివి తెచ్చుకుని గట్టిగా నిట్టూరుస్తూ, ట్రంకుపెట్టెని తెరిచింది కాగితపు చుట్టని భద్రపరచటానికి. గోపాలం ముట్టుకోబోయిన చెక్కపెట్టె మీదికి మరలాయి ఆమె చూపులు.

'గోపాలం చెప్పింది నిజమే అయి వుండవచ్చు. డబ్బులే దాచిపెట్టి వుండవచ్చు. సందేహం లేదు...' అని తనలో తను అనుకుంటూ, కాగితపు చుట్టని లోపలపెట్టి, ఆ చిన్న పెట్టెని చేతిలోకి తీసుకున్నాది. అటూ ఇటూ చూసి ఓపెన్ చేసింది.

అందులో నోట్ల కట్టలున్నాయో, చిల్లర నాణేలు వున్నాయో చూసే సావకాశం ఆమెకు లభించలేదు. పెట్టె ఓపెన్ అయిన మరుక్షణం, చెవులు చిల్లులు పడిపోయే స్థాయిలో భీకరమైన నవ్వు ఆమె చెవులకు చేరింది.

కళ్ళు మిరుమిట్లుగొలిపే ఎ్రరటి వెలుగు ఒక్కసారిగా పెట్టెలో నుంచి బయటికి వచ్చేసరికి, తట్టుకోలేక కళ్ళు గట్టిగా మూసుకుంటూ, పెట్టెని అవతల పడేసింది.

"ఆకలి... నాకు ఆకలిగా వుంది... నైవేద్యం సిద్ధమేనా?" నాలుగడుగుల ఎత్తువున్న ఒక భయంకరమైన ఆకారం, పెట్టె దగ్గిర ప్రత్యక్షం అవుతూ అడిగింది.

"న....న... నైవేద్యమా? నేనా... నాకేమీ తెలియదు.. నువ్వు పెట్టెలోకి వెళ్ళిపో...." ఎండిపోయిన గొంతుకతో తడబడుతూ భయంగా అన్నది వెంకటమ్మ.

"పెట్టెని తెరిచి, నన్ను బయటికి రప్పించి, నైవేద్యం లేదంటే కుదరదు. ఆకలి... నాకు ఆకలిగా వుంది..." కనుగుడ్లు భయంకరంగా తిప్పుతూ చెప్పిందా ఆకారం.

"మేము వండుకున్న అన్నం అంతా అయిపోయింది. కాస్సేపు ఆగావంటే మళ్ళీ వండి నీకు పెడతా... అంతవరకూ పెట్టెలోకి వెళ్ళు..." ధైర్యం తెచ్చుకుంటూ అన్నదామె.

"అన్నం వండిపెడతావా? అందులో ఎత్తుకెత్తు రక్తం పోస్తావా?" నాలుకతో పెదవుల్ని తడుపుకుంటూ అడిగింది ఆ భయంకర ఆకారం.

వెంకటమ్మకి పై ప్రాణాలు పైనే పోతున్నట్లు అనిపించింది.

“రక్తం లేదు... ఒట్టి పప్పు అన్నమే..... కావాలంటే అందులో కాస్తంత బెల్లం వేస్తాను” అప్పటికీ పూర్తిగా బెదిరిపోకుండా కొంచెం స్థిర కంఠంతో చెప్పింది.

“రక్తం తప్ప ఏ పదార్థాన్నీ ముట్టుకోని నాకు పప్పు – బెల్లం ప్రసాదంగా పెడతావా? ఎంత ధైర్యమే నీకు? నీ రక్తమే తాగి ఆకలి తీర్చుకుంటా...” అంటూ గాలిలోకి ఎగిరి వెంకటమ్మ మీదికి దుమికింది ఆ ఆకారం.

కెవ్వున అరిచి, అర్జంటుగా అవతలికి జంప్ చేసింది వెంకటమ్మ. చెక్కపెట్టెను తెరవటం చాలా పెద్ద తప్పు అయిపోయిందని ఆమెకు క్లియర్‌గా తెలిసిపోయింది. అక్కడే నిలబడి వుంటే, ఆ ఆకారం తాను అన్నంతపనీ చేసి చూపిస్తుందని వెంటనే అర్థమయింది.

“రక్షించండి... నన్ను కాపాడండి... గోపాలం... గోపాలం... ఎక్కడున్నావ్ గోపాలం....?” అని బిగ్గరగా కేకలు పెడుతూ, అంతకు ముందు గోపాలం వెళ్ళిన అడవి దారికేసి పరుగులు తీయటం మొదలు పెట్టింది.

“రక్తం...రక్తం కావాలి నాకు... రక్తం....” అంటూ ఆమెతో పాటు తను కూడా పరుగు మొదలుపెట్టిందా ఆకారం.

***

మూడు ఫర్లాంగుల రోడ్డును మూడు నిముషాల్లో అధిగమించి, అక్కడి నుంచి ఎడమచేతివైపు తిరిగాడు గోపాలం. నలభై నిముషాలు నడిచాక అతనికి అగుపించింది చిన్న కొండవాగు... దాని ఒడ్డు దగ్గిర నిలబడి, “గురువుగారూ... గురువుగారూ....” అని పిలిచాడు.

సమాధానం వినవస్తుందని వూహించలేదతను. చుట్టూ చూస్తూ ముందుకు అడుగు వేయబోతుండగా, వందగజాల దూరంలో వున్న పొదల్లోంచి చిన్నగా, అతి చిన్నగా అతని చెవులకు చేరింది ఒక హీనస్వరం. అతనినే పేరు పెట్టి పిలవటం మొదలుపెట్టింది అది.

వేగంగా కొట్టుకుంటున్న గుండెల్ని ఎంతో ప్రయత్నంమీద చిక్కబట్టుకుంటూ, వేగంగా అటుకేసి పరిగెత్తాడు అతను. దట్టమైన ఒక పొదను దాటి అవతలిపక్కకు పోయిన వెంటనే అగుపించాడతనికి, అడ్డదిడ్డంగా పడిపోయివున్న గురువుగారు. రక్తసిక్తమై వున్న ఆయన అవతారాన్ని చూసేసరికి కళ్ళు గిర్రున తిరుగుతున్న సెన్సేషన్ కలిగింది గోపాలానికి. "ఏమయింది గురూజీ? ఏమిటి ఈ దెబ్బలు? ఎవరు చేశారీపని?" అని కంగారుగా అడుగుతూ ఆయన దగ్గిరికి పోయాడు.

"కర్ణపిశాచి మాటలు నిజమే... ఆ మేడలో కాపురం చేస్తోంది ఓ ఆడదెయ్యం" కంపిస్తున్న చేతినెత్తి దూరంలో పాడుపడిన మేడను అతనికి చూపిస్తూ చెప్పాడాయన.

"ఆ దయ్యాన్ని బయటికి రానీయకుండా ఏదో శక్తితరంగం కాపలా కాస్తోంది... అదేమిటో, ఎక్కడి నుంచి వచ్చిందో..." అంటూ సడన్‌గా మాటల్ని ఆపేశాడు.

"ఏమయింది గురూజీ?" ఆయన ముఖంలోకే చూస్తున్న గోపాలం ఆశ్చర్యంగా అడిగాడు.

“పారిపోవాలి... మనం ఇక్కడి నుంచి వెళ్ళిపోవాలి... పద... త్వరగా పద....” అతని భుజాల్ని పట్టుకుని పైకిలేస్తూ ఆందోళన నిండిన కంఠంతో అన్నాడు గురువు.

“పారిపోవాలా? ఎందుకు గురూజీ... మనం ఎందుకు పారిపోవాలి?” కింద పెట్టిన లాంతర్ని చేతితో అందుకుని, ఆయనతోపాటు వాగువైపు బయలుదేరుతూ మరింత ఆశ్చర్యంగా అడిగాడు గోపాలం.

“వచ్చేస్తోంది... శక్తి తరంగం మళ్ళీ దాడి చేయటానికి వచ్చేస్తోంది.... పరిగెత్తు... త్వరగా పరిగెత్తు” ఖంగారుగా అతన్ని హెచ్చిరించాడు గురువుగారు.

ఆయన బరువును మూడొంతులు తన ఎడమభుజంతో మోస్తూ, ఆయనతో పాటు పరుగు మొదలుపెట్టాడు గోపాలం.

గట్టుతెగిన వరద నీరులా సుడులు తిరుగుతూ, దారుణమైన శబ్దలు చేస్తూ వచ్చి అతన్ని, గరువుగారిని బలంగా ఢీ కొట్టింది వెనుకునుంచి వచ్చిన శక్తి తరంగం.

పల్టీలు కొడుతూ గాలిలోకి లేచారు వాళ్ళిద్దరూ... కన్ను మూసి కన్ను తెరిచేటంతలో పోయి నిదానంగా ప్రవహిస్తున్న వాగులో దభీమని పడిపోయారు.

ఎంత వేగంగా వచ్చిందో అంతే వేగంతో వెనుతిరిగింది ఆ శక్తి తరంగం. తన దారిన తను పాడుపడిన మేడ దిశగా రివ్వున వెళ్ళిపోయింది.

***

“గోపాలం... గోపాలం...” అని అరుస్తూ పరుగులు మొదలుపెట్టిన వెంకటమ్మకు మూడు అడుగుల దూరంలోకి వచ్చేసింది వెంటపడిన వికృతాకారం. “రక్తం.... నాకు రక్తం కావాలి... రక్తం” అంటూ చేయి జాచి ఆమె పమిటెచెంగు ఒడిసి పట్టుకోబోయింది.

“రక్షించండి... నన్ను కాపాడండి.. రక్షించండి.. గోపాలం ఎక్కడున్నావ్ గోపాలం?” వణుకుతున్న కంఠంతో గొంతు చించుకుని అరుస్తూ గాలిలోకి ఎగురుతున్న తన పమిటెచెంగును దగ్గిరికి లాక్కున్నది వెంకటమ్మ.

రెండు క్షణాలు – రెండంటే రెండు క్షణాలపాటు ఆమె చూపు పక్కకు మరలింది. అపుడే రెండుగా చీలుతోంది ఆమె అనుసరిస్తున్న అడవిదారి... ఆ చీలికిని తనకు తెలియకుండానే మిస్ అయిందామె... సూటిగా ముందుకు వెళ్ళి ఒక చిన్న కొండగుట్టను చేరుకుంది.

“రక్తం... నాకు రక్తం కావాలి...” అని అరుస్తూ ఆమెను వెంబడిస్తున్న ఆకారం వున్నట్లుండి వెనుకంజ వేయటం అరక్షణం తర్వాత ఆమెకు తెలిసి వచ్చింది.

అయినాసరే ఆగలేదు వెంకటమ్మ. శరీరంలో వున్న శక్తినంతా కూడగట్టుకొని పరుగుతీసి, కొండగుట్ట మొదట్లోకి పోయింది. పడమటి దిశకు మరులుతున్న శుక్లపక్షపు చంద్రుడున్నాడు ఆకాశంలో. మెర్క్యురీ బల్బుల మాదిరి వెలుగుతున్నాయి నక్షత్రాలు. ఆ వెలుగులో కొండగుట్ట మొదట్లో ఎత్తుగా ఎదిగివున్న పెద్ద వేపచెట్టు, దానిచుట్టూ పెద్ద గట్టు, ఆ గట్టుమీద ఒక దేవతా విగ్రహపు తల స్పష్టంగా వెంకటమ్మకు కనిపించాయి.

“రక్షించు తల్లీ నన్ను రక్షించు...” అని ఆక్రశిస్తూ గట్టుమీద కెక్కి ఆ తలముందు మోకరిల్లింది వెంకటమ్మ.

ఆ సమయంలో ఏం జరిగిందో ఆమెకు స్పష్టంగా తెలియలేదు... ఆమె ఏ దారిలో అక్కడికి వచ్చిందో ఆ దారి మధ్యలో గంతులు వేస్తూ వుండాల్సిన ఆ ఆకారం మాయమైపోయినట్లు అనిపించింది.

మరో మూడునిముషాలపాటు చూసినా, తన వెంట పడిన ఆకారం ఆ గట్టు దగ్గిరికి రాకపోయేసరికి, అంతవరకూ తను అనుభవించిన మనోవేదన నుంచి విముక్తి లభించినట్లయింది వెంకటమ్మకి. విముక్తితో పాటు భరించరాని నీరసం కూడా ముంచుకు వచ్చింది.

“అమ్మా... కాపాడు... నన్ను కాపాడు తల్లీ” అని బిగ్గరగా అరిచి స్పృహ తప్పి పడిపోయింది.

***

శక్తి తరంగం కొట్టిన బలమైన దెబ్బకి మైకం ముంచుకు వచ్చినంత పని అయింది గోపాలానికి. తన పని అయిపోయిందనే అనుకున్నాడు అతను.

మంచుకంటె చల్లగా వున్నాయి నీళ్ళు. రెండు మునకలు వేసేసరికి, దూరంగా పారిపోయింది అతన్ని ఆవరించుకోబోతున్న మైకం, మైకం దూరం అవగానే గుర్తుకువచ్చింది ప్రస్తుతం. గురువుగారూ... అని పిలుస్తూ చుట్టూ చూశాడు. .

కనులు తేలవేసి, నీళ్ళల్లో మునకలు వేస్తూ నెమ్మదిగా నీటి వాలుకు కొట్టుకుపోతున్నాడు గురువుగారు.

బలంగా మూడు బారలు వేసి ఆయన్ని చేరుకున్నాడు గోపాలం. వెనకనుండి ఒడిసి పట్టుకుని జాగ్రత్తగా ఒడ్డుకు తీసుకువచ్చాడు. గురువుగారి చేతిలోనే వుండిపోయిన మంత్రదండం వంటి చేతికర్రను తన ఎడమ చేతిలోకి తీసుకున్నాడు. రబ్బర్ బొమ్మ మాదిరి వేలాడబడుతున్న గురువుగారిని భుజానికి ఎత్తుకుని సాధ్యమైనంత వేగంగా పరుగు మొదలుపెట్టాడు. తూర్పుదిక్కున వేగుచుక్క ప్రత్యక్షమయింది అతను మర్రిచెట్టును చేరుకునేసరికి.

‘‘వెంకటమ్మా.... వెంకటమ్మా... గురువుగారి తలకు కట్టుకట్టాలి. అర్జంట్’’ అని వెంకటమ్మను పిలుస్తూ, మర్రిచెట్టు మొదట్లో పడుకోబెట్టాడు భుజం మీద వున్న గురువుగారిని.

ఆ పిలుపుకు సమాధానం రాకపోయేసరికి, అనుమానంగా చూస్తూ మర్రిచెట్టు వెనక్కి వచ్చాడు. తను అడవిలోకి వెళ్ళేటప్పుడు ఎలా పరిచి వున్నాయో, అలాగే కనిపిస్తున్నాయి నేలమీది దుప్పట్లు. తెరిచి వుంది ట్రంకుపెట్టె... దానికి కాస్తంత అవతలగా పడి వుంది అందులో వుండవలసిన చిన్న పెట్టె.

ఏం జరిగిందో, ఎలా జరిగిందో, ఎందుకు జరిగిందో ఆలోచించక ‘‘గురువుగారూ... కొంప మునిగింది. మీ ట్రంకు పెట్టెలో వుండాల్సిన చిన్న పెట్టె ఖాళీగా వుంది. వెంకటమ్మ కనిపించటంలేదు... ఏమైనా దారుణం జరిగిందేమోనని భయంగా వుంది’’ అంటూ గురువుగారి చెవిదగ్గర బిగ్గరగా అరిచాడు.

అతనన్న మాటలవల్ల చలనం కలిగిందో లేక, కదలకుండా పడుకోవడం వల్ల స్వస్థత చేకూరి కదలిక వచ్చినదో తెలియదుగాని, చిన్నగా శబ్దం చేస్తూ తలను అటూ ఇటూ కదిలించాడు గురువుగారు.

కళ్ళు తెరిచి చుట్టూ చూస్తూ "ఎక్కడ వున్నాం?" మనల్ని దెబ్బకొట్టిన శక్తి తరంగం ఏమైంది? అని అడిగాడు.

ఒకటొకటిగా అడవి మధ్యలో కొండవాగు దగ్గిర జరిగినవన్నీ వివరంగా చెప్పాడు గోపాలం... పనిలో పనిగా చిన్న పెట్టెను గురించి కూడా వెల్లడించేశాడు.

"డాక్టర్ దగ్గిరికిపోవాలి... నన్ను వెంటనే గ్రామంలోకి తీసుకుపోయి ఎవరైనా డాక్టర్ వుంటే, వెంటనే ఆయనకి చూపించు.." నీరసం నిండిన కంఠంతో అస్పష్టంగా చెప్పాడు గురువుగారు.

"తీసుకుపోతాను గురువుగారూ.. నేను చలమయ్య హోటల్ దగ్గిర చూసిన ఆచారి దగ్గిరికి తీసుకుపోతాను. మనం గ్రామంలోకి వెళితే మరి వెంకటమ్మ?" అంటూ తను ఎదుటవున్న సమస్యను గుర్తుచేశాడు.

"పది.. పది సంవత్సరాలపాటు ఒంటిపూట మాత్రమే అన్నం తింటూ, అష్టకష్టాలు పడి స్వాధీనంలోకి తెచ్చుకున్న రక్తాక్షి ఆ పెట్టెలో వుంటుంది. సరయిన మంత్ర ప్రయోగం చేయకుండా పెట్టెని తెరిస్తే మదమెక్కిన ఏనుగులా బయటికివచ్చి భీభత్సం సృష్టిస్తుంది... ఆ పెట్టెలో విలువైన వస్తువులు ఏమైనా దాచిపెట్టానని అనుకుని, వెంకటమ్మ గనక తెరిచి వుంటే తనపని అయిపోయినట్టే.

చచ్చిపోయుంటుంది సందేహం లేదు'' కళ్ళు మూసుకుని తలను తిప్పుతూ అన్నాడు గురువుగారు.

''ఛా... ఛా.. వెంకటమ్మ అట్లాంటిది కాదు గురూజీ... నేను రాక ముందునుంచీ తను మీ దగ్గర పనిచేస్తోంది. అప్పుడెప్పుడూ ఆ పెట్టెజోలికి పోనిమనిషి, ఈ దరిద్రపుగొట్టు చోటులో కక్కుర్తి పడుతుందా? పడదు గాక పడదు. అసలు ఏం జరిగిందో మీరు ఒకసారి అంజనం వేసి చూస్తే అనుమానాలన్నీ తీరిపోతాయి కదా... పళ్ళెం తీసుకురానా? అంజనపు ముగ్గులు వేయనా?'' ఆశగా అడిగాడు గోపాలం.

''ఓపికలేదు గోపాలం... అందుకు అవసరమైన ఏకాగ్రత ఇప్పుడు నాలోలేదు. తల పోటెత్తిపోతోంది... కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. ముందు మనం గ్రామంలోకి పోయి డాక్టర్‌ని కలుసుకోవాలి..'' అని అంటూ, ఉన్నట్టుండి తలను పక్కకు వాల్చేశాడు గురువుగారు.

''అయ్యయ్యో... ఏమైంది గురువుగారూ? మీకు ఏమయింది?'' అవధులు దాటిన ఆందోళనతో పిచ్చిపిచ్చిగా పిలుస్తూ, ఆయన బుగ్గల్ని తట్టాడు గోపాలం.

ఇంకోసారి ముఖంమీద నీళ్ళు జల్లాడు. అప్పటికీ కళ్ళు తెరిచి చూడకపోవటంతో, అమాంతంగా చేతుల్లోకి ఎత్తుకొని గ్రామంలోకి పరుగు మొదలుపెట్టాడు.

***

తూర్పు దిక్కున తొలివెలుగులు ప్రత్యక్షమవుతున్నప్పుడు తన దగ్గిరకెవరో వచ్చి "ఎవరమ్మా నువ్వు? ఎవరివి?" అని పెద్దగా ప్రశ్నించటంతో కళ్ళు తెరిచి చూసింది కదలిక లేకుండా పడివున్న వెంకటమ్మ.

నుదుటి మీద రూపాయిబిళ్ళంత కుంకుమబోట్టు పెట్టుకుని, నెరిసి వున్న బుర్రమీసాలను సవరించుకుంటూ కనిపించాడామెకు ఒక వృద్ధుడు.

"ఈ కొండలమ్మ తల్లికి కాపలదారుడిని నేను.. అవసరపడి ఇక్కడికి వచ్చేవాళ్ళ తరపున ఈ తల్లికి పూజలు చేస్తూ వుంటాను. అదిగదిగో నా గుడిశె" అంటూ అక్కడికి కాస్తంత దూరంలో బండరాళ్ళ మధ్యన వున్న ఒక చిన్న గుడిశెను ఆమెకు చూపించాడతను.

"నేను.... మేము అడవిలో మూలికలు సేకరించటానికి వచ్చి ఊరి బయట మర్రిచెట్టు కింద వుంటున్నాము... రాత్రి మా మగవాళ్ళు దగ్గిర లేనప్పుడు ఏదో భూతం వంటి భయంకర ఆకారం నా వెంటపడింది. భయంతో ఇటు పారిపోయి వచ్చాను..." జరిగింది తలుచుకుంటూ తనను గురించి చెప్పింది వెంకటమ్మ.

"భూతం వంటి ఆకారం వెంటపడిందా? కొండలమ్మతల్లి కొలువయివున్న ఈ నల్లకొండల్లో భూతాలు తిరగలేవు" అంటూ చుట్టూ చూశాడు ఆ వృద్ధుడు.

తన వెంటపడిన భూతం తన గురువుగారు ట్రంకుపెట్టెలో అతి జాగ్రర్తగా భద్రపరిచి తీసుకువచ్చిందేనని అతనికి చెప్పలేదు వెంకటమ్మ. "అదేమిటో నాకు తెలియదు... భయంతో బెంబేలెత్తిపోతూ ఇక్కడికి వచ్చాను. ఈ విగ్రహానికి నమస్కారం పెట్టగానే అది మాయమైపోయింది" అని మాత్రం చెప్పింది.

తెల్లటి నవ్వు ఒకటి ఆ వృద్ధుడి ముఖాన్ని ప్రకాశవంతం చేసేసింది.

"అద్గదీ సంగతి... చూశావుగా... నేను చెప్పబోతోంది అదే.. మా కొండలమ్మని చూసేసరికి తారెత్తి దూరంగా పారిపోయి వుంటుంది అది. మా తల్లి శక్తి సామాన్యమైంది కాదు... " అంటూ తల మాత్రమే వున్న విగ్రహానికి నమస్కారం పెట్టాడతను.

"నాతోరా తల్లి... రాత్రి వండుకున్న అన్నం మిగిలేవుంది... మజ్జిగపోసి ఇస్తాను. మిరపకాయ నంజుకుంటూ తిందువుగాని... ఊరి దగ్గిరికి పోవటానికి ఓపిక వస్తుంది. నాతోరా" అంటూ అంటూ గుడిశెవైపు అడుగులేశాడు.

చద్దన్నంలో మజ్జిగ అనేమాటని వినేసరికి ఒక్కసారిగా భగ్గుమంది వెంకటమ్మ ఆకలి. ఏమాత్రం బెట్టుచేయకుండా అతని వెనకే అడుగులు వేసి, గుడిశెముందున్న అరుగుమీద కూర్చుని, అతను పెట్టిన అన్నాన్ని తిని, అరగంట తర్వాత అతని దగ్గిర సెలవు తీసుకుంది. గట్టు మీది విగ్రహం తలకు నమస్కారం చేసుకుని, ఆ వృద్ధుడు చూపించిన దారిలో అడుగులు వేసింది.

***

"ఆచారిగారి కోసం వచ్చారా? తలకి దెబ్బ తగిలి రక్తం బాగా కారిపోయిందా?" గోపాలాన్ని, అతని చేతుల్లో వున్న పెద్దాయాన్ని చూసి సానుభూతిగా అడిగాడు ఆచారిగారి ఇంటి దగ్గర వున్న ఒక పౌరుడు.

"అవును బాబూ... ఆలస్యం చేయకూడదు. ఓసారి ఆయన్ని బయటకి పిలవండి.. మేము ఈ ఊరికి కొత్తకావటం వల్ల అంతా గందరగోళంగా వుంది" అంటూ అతన్ని అర్థించాడు గోపాలం.

“ఆచారిగారు ఇంట్లోలేరు... నిన్న దెబ్బలు తగిలిన పెద్దయ్యకి ఇంకా తెలివిరాలేదుట... తెలివి వచ్చేదాకా ఆయన్ని దివాణంలో నుంచి కదలనీయడు దొరగారు... మీరు అక్కడికే పోవడం మంచిది” దూరంలో వున్న ఒక ఆవరణవైపు చేయి చూపిస్తూ చెప్పాడతను.

నిముషాలు గడుస్తున్న కొద్దీ గురువుగారి ఒళ్ళు చల్లబడిపోతున్నట్లు, ఆయన ముఖంలోకి తేజస్సు తగ్గిపోతున్నట్టు అనిపిస్తోంది. అలా అనిపించినకొద్దీ తారాస్థాయికి చేరుకుంటోంది గోపాలం ఆందోళన.

“అయ్యా... దొరగారూ! బాబూ దొరగారూ... రక్షించండి బాబో... మా గురువుగారిని కాపాడండి...” దివాణం ముఖద్వారం దగ్గిరికిపోయి అరిచాడు.

అంతకు ముందెప్పుడో నిద్రలేచి, స్నాన సంధ్యలు ముగించి కాఫీ తాగటానికి రెడీ అవుతున్నాడు దొరగారు. చటుక్కు లేచి ముఖద్వారం దగ్గరికి వచ్చాడు.

గోపాలం గురువుగారిని చూడగానే విషయం అర్థమయింది ఆయనకి. “అదిగో... ఆ కట్టడంలో మంచం వుంది. అక్కడ పడుకోబెట్టు...” అంటూ దివాణం పక్కనే వున్న అవుట్ హౌస్ వంటి కట్టడాన్ని అతనికి చూపించాడు. అదే చేత్తో ఆ సమీపంలో వున్న ఒక పనివాడిని పిలిచి, “ఆచారిగారిని రమ్మని చెప్పు” అని ఆజ్ఞ ఇచ్చాడు.

గోపాలం తన గురువుగారిని అవుట్ హౌస్ వంటి కట్టడంలోకి తీసుకుపోయి, అక్కడున్న మంచంమీద పడుకోబెట్టిన రెండో నిముషంలో దివాణం వెనుకనున్న బిల్డింగ్ లోంచి ఆచారిని వెంటబెట్టుకొచ్చాడా పనివాడు.

“నువ్వు నిన్న చలమయ్య హోటల్ దగ్గిర కనిపించావు. అడవిలో మూలికలు సేకరించటానికి వచ్చానని చలమయ్య చెప్పాడు... అవును కదూ?” వస్తూనే గురువుగారి నాడిని పరిశీలించి, తన మందుల పెట్టెలో నుంచి ఏదో చూర్ణాన్ని అతని పెదవులపై వేస్తూ గోపాలంతో అన్నాడు ఆచారి. ఎవరితోనూ మాట్లాడకుండా తన పనేదో తను చేసుకుపోతున్నట్లు కనిపించే ఆ పెద్దమనిషి తన గురించి మాట్లాడటం ఆశ్చర్యాన్ని కలిగించింది.

“అవును.. చలమయ్య చెప్పింది నిజమే...” తడబడకుండా వుండటానికి ట్రై చేస్తూ తలూపాడు.

“ఉట్టుట్టిగా కాలుజారిపడితే తగిలే దెబ్బ మాదిరిగా కనిపించటం లేదు ఇది. కావాలని కర్రలతో కొట్టినట్టుగా కూడా అనిపించటం లేదు. మూలికల మిషమీద పాడుపడిన మేడ దగ్గిరికేమైనా పోయారా?” వంచిన తల ఎత్తకుండా వైద్యం చేస్తూ అడిగాడు ఆచారి.

ఒక్కసారిగా ఉలిక్కపడ్డాడు గోపాలం. అంతలోనే నేర్పుగా ఆ ఉలికిపాటును కప్పి పెట్టుకున్నాడు.

“నిన్న చలమయ్య ఆ మేడను గురించి చెప్పాడు.. చెప్పినాక అటుకేసి పోయేటువంటి మూర్ఖులం కాదు. కొండవాగు దగ్గిర కాలు జారి నీళ్ళలో పడ్డాడు... రాళ్ళకు పొడుచుకుంది తల...” నోటికొచ్చిన సమాధానాన్ని చెప్పేశాడు.

గురువుగారి తలకు కట్టుకట్టి, నాలుగు రకాల భస్మాలను పొట్లాలు కట్టి అతని చేతికి అందించాడు ఆచారి.

“గంటకు ఒకసారి నోట్లోవేసి నీళ్ళు తాగించు... సాయంత్రానికి తెలివి వస్తుంది. ఖంగారుపడాల్సిన అవసరం లేదు.... లేచి నడవటానికి మాత్రం రెండు రోజులు పడుతుంది. దొరగారికి నేను చెబుతాను. మీరు ఇక్కడే వుండవచ్చు. అవసరం అయితే వెంటనే కబురు చేయి. నేను పెద్దయ్య దగ్గిరే వుంటాను” అంటూ తన మందుల పెట్టెతో సహా బయటికి వెళ్ళిపోయాడు.

“ఏదో చేయాలని ఇక్కడికి వచ్చి ఇంకేదో అయిపోయాం గురువుగారూ.. మనం బయలుదేరిన వేళావిశేషం బాగున్నట్టులేదు. మీకు ఎప్పటికి నయం అవుతుందో తెలియటం లేదు. వెంకటమ్మ ఏమయిందో అస్సలు అర్థం కావటం లేదు.... త్వరగా తేరుకోవాలి మీరు” మంచం పక్కనే నేల మీద చతికిలపడి గురువుగారి వైపు చూస్తూ తనలో తను వాపోయాడు గోపాలం.

***

అంతకు ముందురోజు టాబూ హోటల్ దగ్గర వున్న మినీసూపర్ బజార్లో కొనుక్కొచ్చుకున్న సంతూర్ సోప్‌తో శుభ్రంగా స్నానంచేసి, సరిగంచు నీలం రంగు చీరెను కట్టుకుంది రంగమ్మ.

గంధం వాసన వచ్చే పౌడర్‌ను అద్దుకుంది. తడితడిగా వున్న ముంగురుల్ని వెనక్కి నెట్టుకుంది.

“పాండు బాబాయ్ బట్టలేసుకుంటున్నాడక్కా. బయటికి పోతున్నాడు. బయటికిపోతే తిరిగి ఎప్పుడు వస్తాడో ఎవరికీ తెల్వదు..” ఆమె నివసించే రేకుల షెడ్డు దగ్గరికొచ్చి రిపోర్టు చేశాడు, జువ్విచెట్టు ఎక్కి తొర్రలో దాచిన పర్సును ఆమెకు ఇచ్చిన కుర్రాడు.

“నేను పదినిముషాలలో వస్తాను... పాండును బయటికి పోనీయకుండా ఆపితే పావలా ఇస్తాను” అంది.

“పావలా వద్దులే అక్కా.. పావలాకి గుప్పెడు పల్లీలు కూడా రావు. ఇవ్వాలని వుంటే అర్ధరూపాయి ఇవ్వు... ఐసు కొనుక్కుంటా” అంటూ వెనక్కి పరుగు తీశాడు.

అద్దాన్ని ఒక కిటికీలోపెట్టి, ఆగ్నేయమూలలో వున్న పొయ్యి దగ్గరికి పోయింది రంగమ్మ.. సన్నపాటి సెగమీద కుతకుతలాడుతున్న కూరను ఒక పళ్ళెంలో పెట్టుకుంది. అరకిలో బియ్యంతో వండిన అన్నం గిన్నెను కూడా తీసుకుని. వడివడిగా అడుగులువేస్తూ, పది కట్టడాల అవతలగా వున్న పాండు ఇంటికి పోయింది.

“ఓరి నీయవ్వ... నువ్వు పొద్దున్నే నన్ను తగులుకున్నావేంటిరా టింగూ? నీకేం చెప్పి పంపిందిరా ఆ రాక్షసి?” గుమ్మానికి అడ్డంగా నిలబడిన టింగుతో అంటున్నాడు బయటికి పోవటానికి రెడీ అయిన పాండు.

సంతూర్ వాసనలతో, పౌడర్ ఘుమఘుమలతో పరిమళించిపోతూ వచ్చిన రంగమ్మని చూసి చటుక్కున తన మాటల్ని ఆపేశాడు పాండు.

“నేను పోతున్నానక్కా... నువ్వన్న మాటని మర్చిపోబోకు” అంటూ దూరంగా పరుగుతీశాడు టింగు.

“ఏంటే రంగమ్మా.... సువాసనలు ఎక్కువైపోయాయి... ఏంటి కథ?” తన ఇంటి మధ్యలో వున్న మంచం మీద కూర్చుంటూ రంగమ్మని అడిగాడు పాండు.

“రవిబాబు వాళ్ళ ఇంటికిపోయాడుగా.. అందుకే ఇంటి దగ్గర వంటచేవా... షరీఫ్ బాబాయ్ పొద్దున్నే వేటమాంసం తెచ్చిచ్చాదు... బాగా వేయించి కారం వేశా... రుచి చూసి చెప్తావని వచ్చా....” అంటూ తను తెచ్చిన పాత్రల్ని మంచం దగ్గిరపెట్టి, పళ్ళెంలో అన్నాన్ని వడ్డించింది రంగమ్మ. అతని చేతికి అందించి, తను కూర్చుంది.

“రుచి చూడటానికి వండిన కూరంతా పెట్టేస్తావా? నీకు వుంచుకున్నావా?” అన్నం కలుపుతూ అడిగాడు.

“ఇయ్యాళ నేను ఉపవాసం... దుర్గమ్మతల్లికి దండం పెట్టుకుంటున్నాను సాయంత్రం నవరాత్రి పందిట్లోకి పోయి పూజ చేయిస్తా. నువ్వు తిని ఎలా వుందో చెప్పు” అతని ముఖం మీదినించి చూపుల్ని తిప్పకుండా అన్నదామె.

“నీయవ్వ.. నువ్వు వండటం, కూర రుచిగా లేకపోవడం ఏమిటే? బెమ్మాండంగా అదిరిపోయింది. ఆ దేవుడు నీ చేతుల్లో ఏదో మంత్రం పెట్టి పుట్టించాడు... నాలికమీద నిలబడటం లేదే కూర... పంచదార మాదిరి

కరిగిపోతోంది'' మెచ్చుకోలుగా తల వూపుతూ, ఆత్రంగా పళ్ళేన్ని ఖాళీచేస్తూ చెప్పాడు పాండు.

నవరాత్రి పందిరిముందు నిర్వాహకులు పెట్టించిన నియోన్ బల్బు మాదిరి గుప్పున వెలిగింది రంగమ్మ ముఖం.

''ఒకసారి నువ్వు పందిరి దగ్గిరికిపోయి రాకూడదా?'' అతని ప్యాంటుకింది భాగంలో పాదాల దగ్గిర వున్న ముడతల్ని సరిచేస్తూ గోముగా అన్నది ఆమె.

''నేనా? పందిరి దగ్గిరికి పోయిరావాలా? ఎందుకే?'' తల ఎత్తి చూడకుండా తన పనిని కానిస్తూ ఆశ్చర్యంగా అడిగాడు పాండు.

''పందిట్లో పూజ చేయించటానికి వచ్చే పంతులుగారు ముహూర్తాలు కూడా పెడతాడట. మంచి ముహూర్తం వుంటే చెప్పమని అడుగు'' అంది రంగమ్మ.

''ముహూర్తం పెట్టించాలా? ఎందుకే?''

''పెళ్ళి చేసుకోవటానికి.''

''పెళ్ళా? నీయవ్వ.... పెళ్ళి ఎవరికే?''

''నీకే'' అన్నది రంగమ్మ.

''నాకా? ఎవరిని చేసుకోవాలి?''

''ఇంకెవరినీ నన్నే...'' అన్నదామె.

గబగబా దగ్గి, అరచేత్తో నెత్తిమీద చరుచుకున్నాడు పాండు. ''నీ యవ్వ... ఏదైనా ఎదవపనిచేసి పట్టుబడినప్పుడు మాత్రమే నా ఒళ్ళు నలగగొడతారు

పోలీసులు... నిన్ను చేసుకుంటే ప్రతిరోజు పగలు రాత్రి తేడా లేకుండా నలిగిపోతుంది నాఒళ్ళు. నేను భరించలేను.... నావల్ల కాదు" ఖాళీ పళ్ళేన్ని కిందపెడుతూ అన్నాడు పాండు.

సినిమా తెరమీద బొమ్మలు మారిన విధంగా టకటక మారిపోయాయి రంగమ్మ ముఖంలోని భావాలు.

"నీ కళ్ళకు నేను ఎలా కనిపిస్తున్నాను....? పొద్దస్తమానం సతాయించుకు తినే రాక్షసి మాదిరిగా కనిపిస్తున్నానా? మర్యాదగా ఏది అడిగినా నువ్వు సరిగ్గా సమాధానం చెప్పవా?" అంటూ అతను కిందపెట్టిన పళ్ళేన్ని అందుకుని అతనికేసి విసిరింది.

చటుక్కున అవతలికి జరిగి ఆ ఎంగిలిపళ్ళెం తనకు తగలకుండా తప్పించుకున్నాడు పాండు. అంతటితో ఆగిపోలేదు రంగమ్మ. అంతవరకూ అతను కూర్చునివున్న మంచాన్ని ఎత్తి అవతలకు విసిరేసింది.

"నీకు కోపం వచ్చినా, సంతోషం వచ్చినా తట్టుకోవటం చాలా కష్టం.... గిన్నెలు సొట్టలుపడి పాడయిపోతాయి... మళ్ళీ కొత్తవి కొనిపెట్ట మంటే చాలా ఇబ్బంది... కోపం తగ్గించుకోవే రంగమ్మ. శాంతగుణం అలవాటు చేసుకో" అంటూ, వేగంగా ఇంట్లో నుంచి బయటికి పరిగెత్తాడు పాండు.

"ఆగు... నువ్వు ఒకసారి ఆగు.... ఆగు..." పెద్దగా అరిచింది రంగమ్మ.

ఆగలేదు పాండు. ఆరు ఇళ్ళ అవతల ఇంటిపక్కన వున్న పీపా దగ్గర శుభ్రంగా చేయి కడుక్కున్నాడు....

“పెద్దబజారులో చిన్నపని వుంది. అది చూసుకుని సాయంత్రం వస్తా... నౌషాద్ టాకీస్‌లో మంచి భక్తి సినిమా వచ్చింది... తీసుకుపోతా రెడీగా వుండు...” ఆమెకు వినబడేటట్లు అరిచి. అటునుంచి అటే మెయిన్ రోడ్డువైపు బయలుదేరేడు.

రంగమ్మకు వేటమాంసం తెచ్చిచ్చాక ఇంకోసారి నవరాత్రి పందిరి దగ్గిరికిపోయి, ఇంటికి తిరిగి వస్తున్నాడు షరీఫు.

“ఒరేయ్ పాండూ... పందిరి దగ్గిరికి జోగినాథం వచ్చాడు... ఎవరి కోసమో వెతుకుతున్నాడు... నీకోసమే అని నా అనుమానం. జాగ్రత్తగా పో....” అడగకముందే అతనికి ఉప్పు అందించి, తనదారిన తను తిన్నగా మురికివాడలోకి వచ్చేశాడు.

ఆ మాటల్ని విని భయపడలేదు పాండు. పక్కదారుల్ని వెతుక్కో లేదు. ఇంకా కొంచెం వేగంగా పందిరి దగ్గిరికి పోయాడు.

పాండుని చూడగానే “వచ్చావా? నువ్వు వస్తావని అనుకుంటూనే వున్నా. నన్ను చూడగానే ఆ షరీపుగాడు ఇంటికి బయల్దేరగానే నాకు అనుమానం వచ్చింది....” అంతవరకూ పందిరిలో నిలబడివున్న జోగినాథం టాబూ హోటల్లోకి దారితీస్తూ అన్నాడు.

“నాకు టీ వద్దు బాబాయ్. ఇప్పుడే రంగమ్మ వేడివేడిగా వేటమాంసం వేపుడు పెట్టింది. పదిరోజులపాటు ఇక మంచినీళ్ళు కూడా అవసరం లేదు. నాకు కడుపు నిండిపోయింది” కూరతో పాటు ఖాళీచేసిన అరకిలో అన్నాన్ని గురించి చెప్పకుండా, ఒట్టి కూరనే మెచ్చుకుంటూ చెప్పాడు పాండు.

“ఒరేయ్ పాండు... నీకు బుద్ధి వుంటే, జీవితంలో బాగుపడాలనే కోరిక వుంటే రంగమ్మని పెళ్ళి చేసుకో... లేకపోతే వద్దు...” టీకి ఆర్డర్ ఇస్తూ అన్నాడు జోగినాథం.

“ఇప్పుడు అట్టాంటి పెద్ద పెద్ద మాటలు అనవసరం బాబాయ్.... నీ గురించి చెప్పు... నాకోసమే వచ్చావా?” అడిగాడు పాండు.

“అవునురా... నీతో ఒక ముఖ్యమైన పని తగిలింది... మొన్న వారంరోజుల కిందట సాతూరులో ఒక బ్యాంక్ దొంగతనం జరిగింది. మూడుకోట్ల రూపాయలు మాయమయ్యాయి” చాయ్‌ని నెమ్మదిగా సిప్ చేస్తూ చెప్పాడు జోగినాథం.

“మూడుకోట్లా....? అయ్యబాబోయ్... చాలా పెద్ద మొత్తం...” గుండెలపై చెయ్యి వేసుకుని అన్నాడు పాండు.

“ఆ దొంగతనం చేసినవాళ్ళు ఎవరోగాని, పోలీసుల్నించి తప్పించుకోవటనికి ఇటుగా పారిపోయి వచ్చినట్టు అనుమానంగా వుందిట మా అధికారులకి. ఇవ్వాళ పొద్దున్నే ఫోన్ల మీద ఫోన్లు పన్నెండు వచ్చాయి. మమ్మల్నందర్నీ ఎలర్ట్‌గా వుండమని ఆర్డర్స్” చాయ్ తాగి ఖాళీ కప్పు టేబిల్ మీద గుండ్రాలు చుడుతూ అన్నాడు జోగినాథం.

“ఆళ్ళెవళ్ళో దొంగతనం చేసి ఇటుగా పారిపోయివస్తే, ఆళ్ళను పట్టుకోవటానికి రెడీగా వుండమని మీకు ఆర్డుర్లు రావటం చాలా సహజం. మీరు నావంటివాళ్ళని పిలిచి ఈ మాటలు చెప్పటం సహజంగాలేదు” అతని ముఖం

మీదినించి చూపుల్ని తిప్పకుండా ముక్తసరిగా తన మనసులోని మాటను బయటపెట్టాడు పాండు.

“ఓరినీ… నిన్నేదో అవమానించినట్టు ఊరికే ఇదయిపోబోకు. నిన్ను పట్టుకోమని, నీతో మాట్లాడదామని నాకు ఎవరూ చెప్పలేదు. నాకే మనసుండబట్టలేక నీకోసం వచ్చాను. మనసు ఎందుకు ఉండబట్టలేకపోయిందో చెప్పనా?”

“నువ్వు పోలీసువి. చెప్పే హక్కు, అధికారం నీకున్నాయి. నేను దొంగని. నోరు మూసుకుని వినాల్సిన బాధ్యత కలవాడిని. చెప్పద్దంటే చెప్తావు… ఆగవు” నెత్తి పగలగొట్టి మరీ. సన్నటి కంఠంతో నిష్టూరం వేశాడు పాండు.

“ఓరినీ… పొద్దున్నే రంగమ్మతో తగాదాపడి వచ్చావా ఏంటి? అదే పనిగా ఫైర్ అయిపోతున్నావ్. ఎదవ ఏడుపుల్ని కాస్సేపు పక్కకిపెట్టి జాగ్రత్తగా విను” అంటూ మాటల్ని కంటిన్యూచేసాడు జోగినాథం.

“దొంగిలించబడిన సొత్తును ఎవరైతే రికవరీ చేసిపెడతారో వాళ్ళకి టెన్ పర్సంట్ బహుమానంగా ఇస్తామని ఆ బ్యాంకువాళ్ళు ఎనౌన్సు చేశారు. మూడుకోట్లలో టెన్ పర్సంట్ అంటే ముప్పయి లక్షలు….” తన కప్పును పెదిమల దగ్గిర పెట్టుకుంటూ చెప్పాడు.

మౌనంగా తల ఊపి ఊరుకున్నాడు పాండు.

“పాండూ… ఇద్దరు ఆడపిల్లల తండ్రిని. ఇద్దరికీ కట్నాలు ఇచ్చి బయటికి పంపించాల్సిందే. వాళ్ళ అమ్మ పోలికలు వచ్చి వుంటే కాస్తయినా కట్నం

తగ్గించుకోమని అడగటానికి అవకాశం వుండేది. ఖర్మకాలి నా పోలికలే వచ్చేశాయి. అందువల్ల ఖర్చును తప్పించుకోవడమంటే సాధ్యపడే విషయం కాదు.

ఈ పోలీసు ఉద్యోగంలో తింటినికి, ఒంటికి కట్టుకోవటానికి తప్ప ఎనకేసుకోవటానికి వీలు కాకుండా వుంది. పైరాబడి ఎంత వచ్చినా, ఎస్సయ్ గంగరాజు తాగుడికే సరిపోవటం లేదు. మాదాకా వచ్చేసరికి పైసలే మిగులుతున్నాయి. రూపాయలు కళ్ళపడటంలేదు.''

''అసలు విషయం ఏమిటో చెప్పకుండా నాకు ఈ వీరసుత్తి ఎందుకు వేయటం? నీ పిల్లలకి నీ పోలికలు రూపంలోనే వచ్చాయి. బుద్ధిలో రాలేదు. బంగారు తల్లులు వాళ్ళిద్దరూ. ఏ ఇంటికి పోయినా హాయిగా బతికేస్తారు. ఆళ్ళని గురించి నువ్వు అనవసరంగా బాధపడిపోతున్నావ్. నువ్వు అనుకుంటున్నట్లు ఏమీ జరగదు'' కొంచెం విసుగు నిండిన కంఠంతో అన్నాడు పాండు.

''ఓరినీ... మాటవరసకు చెప్పిన మాటల్ని పట్టుకుని నాకే ఎదురు మాట్లాడుతున్నావా? నా బిడ్డలు ఎలాంటివాళ్ళో నాకు తెలియదని అనుకుంటున్నావా? వాళ్ళని గురించి నువ్వు చెపితే, నేను వినాల్సిన ఖర్మ నాకు ఇంకా పట్టలేదుబే. నోరుమూసుకుని నేను చెప్పేది పూర్తిగా విను. మధ్యలో నోరు తెరిచావంటే మూతి పగిలిపోతుంది'' కచ్చగా అన్నాడు జోగినాథం.

''సరేలే... ఇక చెప్పు'' అన్నాడు పాండు.

''సాతూర్ బ్యాంక్‌లో దొంగిలించబడిన సొమ్మును మనం గనక పట్టిస్తే అప్పణంగా ముప్పయి లక్షలు వచ్చి పడతాయిరా. నువ్వు, నేను హాయి హాయిగా

బతికేయొచ్చు. సిటీలో నీకు తెలియని బద్మాష్ అంటూ ఎవడూ లేడు. బయటివాళ్ళు ఎవరైనా వస్తే వాళ్ళని గురించి ఇన్ఫర్మేషన్ మాకంటె ముందుగా నీకే తెలిసిపోతుంది. మనసుపెట్టి నీకోసం కాకపోయినా, నా కోసమయినా కాస్తంత కష్టపడరా. ఈ మాట చెప్పటానికే నేను వచ్చాను అర్థం అయిందా?" అన్నాడు జోగినాథం.

"మీ పెద్దమ్మాయి ఇప్పుడప్పుడే పెళ్ళి చేసుకోనని అంటోంది. డాక్టరు చదువు చదవాలని వుందిట. మరి చదివిస్తావా?" చిరునవ్వుతో అడిగాడు పాండు.

"ఓరినీ... నీకు నేనంటే చులకనగా వుందా? నీ కాళ్ళు, చేతులు విరగదీయకపోతే నాకు మారుపేరు పెట్టు" అంటూ టేబిల్ మీద వాటర్ జగ్గును పైకి ఎత్తాడు జోగినాథం అతని మీదికి విసరటానికి.

పెద్దగా నవ్వుతూ, కుర్చీలోనుంచి లేచి, హోటల్లోనుంచి ఇవతలికి వచ్చాడు పాండు.

"నీ మాట నాకు చాలా బాగా నచ్చింది బాబాయ్. ఆ బద్మాష్ గాళ్ళని పట్టుకోగలిగితే, నా సంగతి ఎలావున్నా, నీకు బోలెడంత లాభం కలుగుతుంది. నాకు చేతనయినంతవరకూ చేసి పెడతాను. పని పూర్తి అయిపోయే టైమ్ లో మీ ఎస్సయ్ గంగరాజు రంగంలోకి దిగి నీ నెత్తిమీద చేయి పెట్టకుండా నువ్వు జాగ్రత్తపడాలి.." జోగినాథం కూడా బయటికి రాగానే అన్నాడు.

"రంగంలోకి ఎప్పుడు దిగిపోయాడు. ఇంకో గంట తర్వాత మన సూదిగుట్టల దగ్గిర సెర్చింగ్ మొదలెట్టాలని అన్నాడు. ఇంతదూరం వచ్చిన వాళ్ళు

సిటీలోకి రాకుండా ఊరిబయట బండరాళ్ళ మధ్య దాక్కుంటారా? ఏమిటో అతని ఉద్దేశ్యం!'' అంటూ హోటల్ ముందు పెట్టిన తన సైకిల్ని తీసుకున్నాడు జోగినాథం.

''నేను వుంటాను బాబాయ్. పెద్ద బజార్లో కాస్తంత పని వుంది. అటు వెళ్ళి వస్తాను'' అంటూ చేతిలోని బీడీని అవతలికి విసిరి పారేసి, బస్ స్టాప్ దగ్గిరికి పరిగెత్తాడు పాండు. పెద్ద బజారు దగ్గరికి తీసుకుపోయే సిటీబస్ దిగవల్సిన స్టాప్ రాగానే తిరిగి బస్ ఆగకముందే బయటికి దూకేసి, ఒక కరెంట్ పోల్ దగ్గర నిలబడ్డాడు.

పది నిముషాల తరువాత తన దగ్గిరికి వచ్చిన ఒక భారీ పర్సనాలిటీ వంక ప్రశ్నార్థకంగా చూశాడు.

''నవరాత్రి ఉత్సవాల సందడి వల్ల తెచ్చిన సరుకు తెచ్చినట్టే ఖాళీ అయిపోతోంది. మధ్యాన్నమయ్యేసరికి వచ్చిన కస్టమర్లకి ఖాళీ చేతులు చూపించాల్సి వస్తోంది.

సూదిగుట్టల దగ్గిర బట్టీలు పెట్టారు. ఏదో ఒక విధంగా నాలుగు క్యాన్లు తీసుకువచ్చావంటే నాకు ఎంతో సౌకర్యంగా వుంటుంది. క్యానుకి నూటయాభై ఇస్తా'' అంటూ పాండు సమాధానం కోసం ఎదురు చూడకుండా పెద్ద నోట్ల కట్ట నొకదాన్ని తీసి చూపించాడతను.

అలవాటు ప్రకారం ఎకస్ట్రా మాటలేవీ మాట్లాడకుండా, చటుక్కున ఆ నోట్ల కట్టను అందుకుని జేబులో పెట్టేసుకున్నాడు పాండు.

“నా స్కూటర్‌కి రిపేరు వచ్చింది. ఆళ్ళ కాళ్ళు ఈళ్ళ కాళ్ళు పట్టుకుని ఒక టీ.వీ.ఎస్.ని పట్టుకునేసరికి తల ప్రాణం తోకకి వచ్చింది. ట్యాంక్ నిండా పెట్రోల్ కొట్టించి వుంచా. గులాబీ కేఫ్‌లో నాస్తా చేసి వెళ్ళు” అంటూ పాతిక అడుగుల దూరంలో స్టాండ్ వేసి వుంచిన మోపెడ్ నొకదాన్ని అతనికి చూపించాడు ఆ పర్సనాలిటీ.

***

ఎత్తుగా వున్న నిద్రగన్నేరు చెట్టుకింద నిలబడి, చెమటలు కమ్మిన ముఖాన్ని ఖరీదయిన హేండ్ కర్చీఫ్‌తో తుడుచుకున్నాడు ఎస్.ఐ. గంగరాజు.

జీప్‌లో సీటుమీద వున్న వాటర్ బాటిల్‌ని తీసుకురమ్మని, డ్రయివర్‌కి సైగ చేశాడతను. క్షణం కూడా ఆలస్యం చేయకుండా తెచ్చిచ్చాడు డ్రయివర్.

“ఊరికే కూర్చుని గోళ్ళు గిల్లుకోకుండా నువ్వూ వెళ్ళి హెల్ప్ చేయి. వెళ్ళు” అని ఆర్డర్ ఇచ్చాడు.

అతను అందించిన బాటిల్‌ని తిరిగి సీటు మీద పెట్టి నెమ్మదిగా గుట్టల వైపు కదిలాడు డ్రైవర్. పావుగంట తరువాత రెండు పెద్ద పెద్ద బండ రాళ్ళమధ్య చదునుగా వున్న ఒక ప్రదేశంలోకి ఎంటర్ అయ్యాడు.

అంతకుముందు నాలుగైదురోజులు క్రితం వరకూ అక్కడ ఎవరో కాపురం చేసిన జాడలు కనిపిస్తున్నాయి. లాఠీ కర్రతో ఒక చిన్న బండరాయి మీద కొడుతూ ఒక పక్కగా నిలుచుని వున్నాడు జోగినాథం.

“అయ్యగారు వర్రీ అయిపోతున్నారు.... దొంగలు ఈ చుట్టుపట్లే ఉండి తీరతారని ఆయన అబిప్రాయం” అతని దగ్గరికి పోతూ అన్నాడు డ్రయివర్.

"ఆ మాటల్లో నిజం వుండచ్చురా... అదిగో చూడు" అంటూ ముందుకి చూపించాడు జోగినాథం. రెండు పాకలు నిర్మించిన గుర్తులు కనిపించాయి డ్రైవర్‌కి. వాటితో అవసరం తీరింది కాబోలు నిప్పు ముట్టించి తగలబెట్టేశారు నిర్మించినవాళ్ళు.

"ఊరికి దూరంగా ఇక్కడ వీటిని ఎందుకు కట్టారు? సారాబట్టీ లేవయినా పెట్టారా వాటిలో?" అంటున్న జోగినాథం మాటల్ని వినిపించుకోకుండా ముందుకు అడుగేస్తూ, చటుక్కున ఆగిపోయాడు డ్రైవర్.

"మిగిలినవాళ్ళు ఏరీ? ఎక్కడికి పోయారు?" భుజం మీదినించి వెనక్కి చూస్తూ అడిగాడు.

"ఈ గుట్టల్లో ఇంకా కొంచెం ముందుకు పోతే ఎల్లమ్మ గుడి ఒకటి వుందిగదా... అక్కడికి పోయారు... ఇంకో పావుగంటలో వచ్చేస్తారు" నిలుచున్న చోటి నుంచి ఒక్క అంగుళమన్నా కదలకుండా చెప్పాడు జోగినాథం.

మళ్ళీ ముందుకు కదిలాడు డ్రైవర్. అగ్గిపాలైన మొదటి పాక చుట్టూ ఒక రౌండ్ కొట్టి, కాస్తంత అవతలగా వున్న రెండో పాక దగ్గరికి పోయాడు. దాని చుట్టూ రౌండ్ కొడుతూ, కొడుతూ వున్నట్టుండి పది అడుగుల అవతల వున్న పెద్ద ముళ్ళపొద వైపు చూశాడు. అడుగుపెట్టడానికి వీలు కానంత దట్టంగా ఏమీ లేదు పొద. అయితే, అడుగుపెట్టకుండా ఎవరో కావాలని కొన్ని ముళ్ళమండల్ని విరిచి అడ్డంగా పేర్చారు. వదిలి వున్నాయి అలా పేర్చిన మండల తాలూకు ఆకులు.

బండరాయి దగ్గరే వున్న జోగినాథాన్ని పిలవను కూడా పిలవకుండా అటుకేసి కదిలాడు డ్రైవర్. ముళ్ళు తనకి గుచ్చుకోకుండా, జాగ్రత్తగా రెండు మండల్ని ఇవతలికి లాగాడు. ఆ మండలు తొలిగిన వెంటనే, అతనికి ఆగుపించింది ఓ దేవతా విగ్రహం.

లావుపాటి బూడిద గుమ్మడికాయ ఒకటి నిలబెట్టి వుంది విగ్రహం పాదాల దగ్గిర... పసుపు కుంకుమలతో అలంకరించబడిన నిమ్మకాయలు వరుసగా కనిపిస్తున్నాయి ఆ గుమ్మడికాయ చుట్టూ.

ఆ విగ్రహం వంకా, బూడిద గుమ్మడికాయ వంకా పరిశీలనగా చూస్తూ ముందుకు అడుగు వేశాడు అతను. పొరపాటున తగిలింది అతని కాలు గుమ్మడికాయకి. ఫుట్‌బాల్ మాదిరి గునగునా అవతలికి దొర్లింది అది. చుట్టూ వున్న నిమ్మకాయలు చెల్లాచెదురు అయ్యాయి.

పోలీస్ డ్రైవర్ అవటం వల్ల, అందరితోపాటు అప్పుడప్పుడు ఫిజిక్‌ని మెయిన్‌టైన్ చేసే ట్రెయినింగ్‌లకు వెళ్ళి వస్తూ వుండటం వల్ల, తనకు తెలియకుండానే రియాక్ట్ అయ్యాడతను.

జింక మాదిరి ఎగిరి వెనక్కి దూకాడు. దూకుతూ వుండగానే నెమ్మదిగా విగ్రహం కదుల్తున్నట్లు అనిపించింది అతనికి... అంతవరకూ మడిచిపెట్టుకుని వున్నట్లుగా కనిపించిన ఆ చేతులు తీగెల మాదిరి ముందుకుసాగి తన గొంతు పట్టుకోవటానికి వస్తున్నట్లు అనుభూతి కలిగింది.

“జోగినాథంగారో... జోగినాథంగారో....” తనకు తెలియకుండానే గొంతు చించుకుని అరిచాడతను.

అరుపు బయటికి రాలేదు... కళ్ళు మూతలు పడిపోబోతున్న తరుణంలో అస్పష్టంగా అగుపించాడు అతనికి జోగినాథం... “అరేయ్... ఏమయిందిరా నీకు? ఏంటిరా అలా గిలగిల్లాడుతున్నావ్?” అంటున్న అతని కంఠం వినిపించింది.

శరీరంలో వున్న శక్తినంతా కూడగట్టుకుని మూసుకుపోతున్న కళ్ళను బలవంతంగా తెరిచి వుంచాడతను.

చేతిలో వున్న లాఠీని కత్తిలా ఎత్తిపట్టుకుని రెండే రెండు అంగల్లో అతని దగ్గరికి వచ్చేశాడు జోగినాథం. అక్కడ అతనికి ఏం కనిపించిందో డ్రైవర్‌కి తెలియలేదుగాని, “వదులు... వాడిని వదులు... విదిలేయ్...” అని అరుస్తూ పైకెత్తిన లాఠీతో దభీ దభీమని బాదటం తెలిసివచ్చింది.

మూడుదెబ్బలు పడేంతవరకూ పరిస్థితి యధాతథంగానే వుంది. మూడో దెబ్బ పడిన మరుక్షణంలో డ్రైవర్ మెడకు విముక్తి లభించింది. మెడని వదులుతూ ఆ చేతులు తనని అవతలికి నెట్టినట్టు, వైల్డ్‌గా అటూ ఇటూ వూగి ఆరడుగుల దూరంలో పడిపోయాడతను.

చేతుల్ని నేలకు ఆనించి అడవి జంతువు మాదిరి వికృతమైన శబ్దాలు వెలువరిస్తూ ఆత్రంగా ఊపిరి పీల్చుకున్నాడు.

ఊపిరి అందకపోవటం వల్ల గుండెల్లో స్టార్టయిన బాధ కాస్త ఉపశమించగానే తల తిప్పి విగ్రహం వైపు చూశాడు.

అంతకుముందు ఒక్క క్షణం వరకూ తను ఎటువంటి అనుభూతిని పొందాడో, సరిగ్గా అదే పరిస్థితిలో చిక్కుకుని వున్నాడు జోగినాథం. లాఠీని వదిలి తనను పట్టుకున్న చేతుల్ని విడిపించుకోవటానికి గిలగిలా కొట్టుకుంటున్నాడు.

ముందుకుపోయి జోగినాథానికి హెల్ప్ చేసే ధైర్యం అతనికి లేకపోయింది.

"జోగినాథం చచ్చిపోతున్నాడు... చచ్చిపోతున్నాడు... రండిరా... రండిరోయ్... రండి" అని గొంతు చినిగేలా అరుస్తూ, బూడిద గుట్టలుగా మారిపోయివున్న పాకల్ని దాటి, బండరాళ్ళ దగ్గరికి పరిగెత్తుకొచ్చాడు.

అరవగానే, అరిచి కేకలు పెట్టగానే పరిగెత్తుకుంటూ రావటానికి ఎవరున్నారని అక్కడ? చుట్టుపక్కల ఎవరూ లేరు.

***

బండరాళ్ళ మధ్య ఏమాత్రం బాలెన్స్ తప్పి కిందపడినా, బండి మీద వున్న సారా క్యాన్లు మట్టిలో పొర్లాడతాయని, ఏదైనా డామేజి జరిగినట్లయితే వాటిలో వున్న సారా అంతా నేలపాలు అయిపోతుందనీ, చాలా జాగ్రత్తగా టీవీఎస్‌ని నడుపుతున్నాడు పాండు.

ఎల్లమ్మగుడి దగ్గిర చక్కర్లు కొడుతున్న కానిస్టేబుల్స్‌కి కన్పించకుండా, ఇంజన్‌ని ఆఫ్ చేసి, చేతులతోనే నెట్టుకుంటూ ఫర్లాంగు దూరం ఇవతలికి వచ్చాడతను. బండి మోత వారికి వినిపించదని అర్థం అయిన వెంటనే స్టార్ట్ చేసి వేగంగా ముందుకు దూకించాడు.

తన వెళ్ళాల్సిన మెయిన రోడ్డు ఇంకో నాలుగు ఫర్లాంగుల దూరంలో వున్నదనగా, అతనికి ఎదురయింది బండరాళ్ళ మధ్యలో వున్న ఖాళీ స్థలం.

‘ఇంతకు ముందు నెలరోజుల క్రితం వచ్చినప్పుడు రెండు పాకలుండాలి ఇక్కడ... ఏమైపోయాయి అవి?’ తనలో తాను అనుకుంటూ, టీవీఎస్‌ని కొంచెం స్లో చేస్తుండగా కనిపించాడు అతనికి ఎస్సయ్ గంగరాజు జీప్‌ని నడిపే పోలీస్ డ్రైవర్.

“జోగినాథం చచ్చిపోతున్నాడు... రండిరా... రండిరోయ్... రండి” అని కేకలు పెట్టి, ఎవరిని ఉద్దేశించి అలా బిగ్గరగా అరిచాడో, వాళ్ళ రాక కోసం ఎదురు చూడకుండా మెయిన్ రోడ్డు కేసి పరుగుతీస్తున్నాడతను.

డబడబమని శబ్దం చేస్తున్న టీవీఎస్‌ని ఆపేసి చుట్టూ చూశాడు పాండు. అంతకుముందు ఎప్పుడో అతను చూసిన పాకల స్థానంలో పెద్ద పెద్ద బూడిదగుట్టలు కనిపిస్తున్నాయి. వాటికి కొంచెం అవతలగా ముళ్ళపొదలకేసి దృష్టిని మరలించేసరికి అగుపించాడు, వట్టి పుణ్యానికి గిలగిలా కొట్టుకుంటున్న జోగినాథం.

పదివేల ఏడువందల రూపాయలు విలువచేసే టీవీఎస్‌ని బండల మధ్య వదిలేసి సొంత పనుల మీదికి దృష్టికి మరలిస్తే, కొంపలు అంటుకుంటాయని అతనికి తెలుసు.

తెలిసినా ఆగలేదతను. టీవీఎస్ కి స్టాండు వేయలేదు. నిర్మొహమాటంగా నిరభ్యంతరంగా వదిలేశాడు. అది దబ్బుమని పక్కకు పడినా పట్టించుకోలేదు. ముందు వెనకా నిలబెట్టి వుంచిన సారాక్యాన్లు పెద్ద శబ్దంతో అవతలికి దొర్లినా గమనించుకోలేదు.

"బాబాయ్... ఏమైంది బాబాయ్? ఏమైంది?" బిగ్గరగా పిలుస్తూ పొదల దగ్గరికి పరిగెత్తాడు.

ఆఖరి దశలోకి వచ్చేశాడు జోగినాథం. ఊపిరి అందక భయంకరంగా బయటికి పోడుచుకు వచ్చేస్తున్నాయి కనుగుడ్లు. పెదవుల్ని దాటి వెలుపలికి కన్పిస్తోంది నాలుక... నీలవర్ణానికి తిరిగిపోతోంది అతని రంగు...

"బాబాయ్... ఏమయింది నీకు? ఏమయింది?" అని ఇంకా గట్టిగా అడుగుతూ, అతని భుజాల్ని పట్టుకుని విసురుగా వెనక్కి లాగాడు పాండు.

లాగుతూ వుండగానే, అతనికి కనిపించింది. ప్రాణం ఉండకూడని శిలలాంటి ఆ దేవతా విగ్రహం, ప్రాణం వున్నట్లుగా అది చేతుల్ని ముందుకు జాచి జోగినాథం మెడని గట్టిగా నులుతున్నట్టు తెలిసి వచ్చింది.

జోగినాథాన్ని వదిలి, సూటిగా ఆ విగ్రహం దగ్గరికి జంప్ చేశాడు. పాదాలు నేలకు ఆనగానే ముందుకు వంగి, ఆ విగ్రహాన్ని ఒక్క ఉదుటున పైకెత్తి వెనక్కి దొర్లించాడు. అంతటితో ఆగకుండా, అంతకు ముందు పోలీస్ డ్రైవర్ పాదం తగిలి పక్కకుదొర్లిన గుమ్మడికాయను చటుక్కున ఎత్తి ఆ విగ్రహం ముఖం మీద భళ్ళున పగలగొట్టాడు.

అది పగలటమే కాదు, అచ్చమయిన వంద్రుమట్టితో చేసినట్లున్న ఆ విగ్రహపు ముఖాన్ని కూడా ముక్కలు చేసేసింది.

లావుపాటి ఐరన్ రాడ్‌తో బలంగా మోదటం వల్ల విరిగిపోయి పట్టును కోల్పోయినట్టు సడన్‌గా కిందకి వాలిపోయాయి విగ్రహం చేతులు. తోకలు

తెగిపోయిన పాములు పారిపోయినట్టు అర్జంటుగా వెనక్కి జరిగి విగ్రహంలో ఐక్యం అయిపోయాయి.

అంతకు ముందు ఒక్క క్షణం వరకూ దారుణమైన హోరుగాలిలో చిక్కుబడి వున్నట్లు ఫీలవుతున్న పాండుకు వెంటనే తెలిసి వచ్చింది వాతావరణంలో వచ్చిన డిఫరెన్స్.

"బాబాయ్! ఎలా వుంది బాబాయ్?" అని అడుగుతూ వెనక వున్న జోగినాథం దగ్గిరికి దూకాడతను.

విగ్రహంలో నుంచి వచ్చిన చేతులు తనని వదిలిపెట్టిన వెంటనే చాపచుట్ట మాదిరి వెల్లకిలి పడిపోయాడు జోగినాథం. కిందపడిన వెంటనే తెలివిని కోల్పోయాడతను. పాండు తన దగ్గరికి రావటంగాని, తనని చేతులతో ఎత్తుకుని బండరాళ్ళ దగ్గరికి తీసుకుపోవటంగాని అతనికి తెలియదు.

"బాబాయ్... కళ్ళు తెరువు బాబాయ్... ఒకసారి నావంక చూడు... బాబాయ్..." అంటూ అతనికి తెలివి తెప్పించటానికి పాండు చేసిన ప్రయత్నాలన్నీ వృథా అయ్యాయి. ముఖంమీద నీళ్ళు జల్లితే ఉపయోగం ఏమైనా వుంటుందేమోనని అనుకుంటూ, నిటారుగా నిలబడి చుట్టూ పరికించి చూశాడు పాండు.

నీటి జాడలు ఏవీ కనిపించలేదతనికి. మెయిన్ రోడ్డు దగ్గిర్నించి బండరాళ్ళలోకి ఎగిరెగిరిపడుతూ వస్తున్న పోలీస్ జీప్ కనిపించింది. ముందు సీట్లో డ్రైవర్ పక్కన కూర్చుని వున్న ఎస్సయ్ గంగరాజు కూడా అగుపించాడు.

తలమీద లాగిపెట్టి ఎవరో బలంగా కొట్టినట్టు అర్జంటుగా తల కిందకి దించేసుకుని, చటుక్కున మోకాళ్ళమీద వాలిపోయాడు పాండు.

"మీ ఎస్సయ్ వచ్చేస్తున్నాడు బాబాయ్... నిన్ను జీప్‌లో వేసుకుని హాస్పిటల్ కి తీసుకుపోతాడు. నన్ను ఇక్కడ చూశాడంటే ఛండాలంగా మాట్లాడతాడు. నేను నిన్నేదో చేసినట్టు అభాండం వేసేస్తాడు..." స్పృహలేని జోగినాథంతో చెప్పి, వెరీ స్పీడ్‌గా తన టీవీఎస్ దగ్గిరికి మోకాళ్ళ మీదే దేక్కుంటూ పోయాడు. తన అదృష్టం బాగుండటం వల్ల డామేజికి గురికాకుండా ఊరకే పక్కలకు పడిపోయిన సారా క్యాన్లను సరిచేసుకుని, చేతులతోనే నెట్టుకుంటూ టీవీఎస్‌ని అక్కడనించి దూరంగా తీసుకుపోయాడు. శబ్దం వినిపించనంత దూరం వచ్చేసినట్టు నిశ్చయం అవగానే స్టార్ట్ చేసి వింటినుంచి వెలువడిన బాణంలా సిటీకేసి దూసుకుపోయాడు.

## 3

"బాబూ.... నా మాట విని నువ్వు అన్నం తిను... పెద్దయ్యకి ఏమీ అవదు. ఏమైనా అయితే చూసుకోవటానికి నేనున్నాను. నువ్వు వెళ్ళిరా బాబూ..." దొరగారి దివాణం వెనుకభాగంలో వున్న అవుట్ హౌస్‌లో, అచేతనంగా పడివున్న పెద్దయ్య దగ్గిర కూర్చుని వున్న రవిబాబుకి నచ్చ చెప్పటానికి ప్రయత్నించాడు ఆచారి.

"నాకు ఆకలిగా లేదు ఆచారిగారూ... ముందు పెద్దయ్యకి తెలివి రావాలి. కళ్ళు తెరిచి చూడాలి... అంతవరకూ నాకు ఏమీ తోచదు" నిర్మొహమాటంగా అతనికి చెప్పి, కుర్చీ వెనక్కి వాలి కూర్చున్నాడు రవిబాబు.

అప్పుడే గదిలోకి వచ్చింది పెద్దయ్య భార్య రత్తాలు. వట్టిగా రాలేదామె. పెద్ద వెండిపళ్ళెం నిండుగా భోజన పదార్థాల్ని పెట్టుకు వచ్చింది.

"ఎదురు చెప్పకుండా తిను... పాడు మాటలు మాట్లాడమాకు" అంటూ అతని కుర్చీ దగ్గిర కూర్చుని, అన్నం కలిపి, తానే అతని నోటికి అందించటం మొదలుపెట్టింది. చిలకమ్మని చూసి సీరియస్‌గా మాట్లాడిన రవిబాబు రెండోమాట మాట్లాడకుండా ఆమె చేతి ముద్దల్ని తిన్నాడు. ఖాళీ అయిన పళ్ళేన్ని అతని చుట్టూ మూడుసార్లు తిప్పి దిష్టి తీసింది రత్తాలు. తన చేయి శుభ్రం చేసుకుని అతని పెదవుల్ని తుడిచింది. తన పమిటె చెంగుతోనే తడి అద్దింది.

"పెద్దయ్యగారు నీతో మాట్లాడటం కోసం ఎదురుచూస్తున్నారు.... వెళ్ళిరా..." అని చెప్పింది.

అయిష్టంగానే కదిలి మెయిన్ బిల్డింగ్ లోకి బయలుదేరేడు రవిబాబు.

"ఏదో ఒక విధంగా చిన్నబాబుతో అన్నం తినిపించావ్. బాగుంది. మరి నీ సంగతి?" పెద్దయ్య వంక చూస్తూ నిలబడిపోయిన రత్తాలును అడిగాడు ఆచారి.

పమిట చెంగును నోటికి అడ్డం పెట్టుకుంటూ తలని పక్కకు తిప్పుకుంది ఆమె. అప్పటికే ఆమె బుగ్గలమీదికి జారిన కన్నీటిబొట్లు అక్కడే వున్న ఆచారికంట పడ్డాయి.

"నాశక్తినంతా ఉపయోగించి వైద్యం చేస్తున్నాను రత్తాలూ... నాలుగు వేల రూపాయల విలువచేసే సువర్ణ భస్మాన్ని కూడా తేనెతో కలిపి పెదవులకి రాశాను.

లెక్క ప్రకారం ఇంకో గంటా రెండు గంటల్లో తెలివి వచ్చేయాలి. ఈ లోపల నువ్వు అన్నం తిను...” అనునయంగా ఆమెకు ధైర్యం చెప్పాడతను.

ఆ మాటలకు రత్తాలు అవునని కాని, కాదని కాని సమాధానం చెప్పకముందే, అంతకు ముందువరకూ రవిబాబు కూర్చున్న కుర్చీ దగ్గిర్నించి అదే పనిగా వినరావటం మొదలయింది ఫోన్ మోత. కుర్చీ పక్కన వున్న స్టూల్ మీద పెట్టిన సెల్ ఫోన్ మోత అది. తన తండ్రిగారి దగ్గిరికి పోతూ, దాన్ని అక్కడే మర్చిపోయి వెళ్ళాడు రవిబాబు.

“చూడు అదేమిటో చూడు” విసుగూ విరామం లేకుండా మోగుతున్న ఆ ఫోన్ వంక చిరాకుగా చూస్తూ చెప్పాడు ఆచారి. రెండు అంగల్లో పోయి దాన్ని అందుకుని అతనికి ఇచ్చింది రత్తాలు. దానివంక ఒకసారి చూసి, ఏదో బటన్ ని నొక్కి, ఆమెకే అందించాడు అతను.

హల్లో అని రత్తాలు మాట్లాడకముందే “ఎన్ని రోజులు? ఎన్ని రోజులు మీ ఊళ్ళో దాక్కుంటావ్? ఇక్కడ నీ కోసం ఎదురు చూసే అమాయకురాలు ఒకతె వుందని మర్చిపోయావా? ఒక్క రోజులో తిరిగి వచ్చేస్తానని చెప్పి కనీసం ఫోన్ కూడా చేయకుండా కూర్చుంటావా?” అవతలివైపు నుంచి అడిగింది ఒక అందమైన లేడీ వాయిస్.

తన గుండెల్ని తొలిచివేస్తున్న బాధను ఆ క్షణంలో మరిచిపోయింది రత్తాలు. విపరీతమయిన ఆశ్చర్యంతో వెడల్పు అయ్యాయి ఆమె కనులు.

“ఇదిగో ఆఖరుసారిగా చెపుతున్నా. నువ్వు వచ్చేసిన దగ్గర్నించీ సరిగ్గా నిద్రపట్టటంలేదు. తిండి సహించటం లేదు. కళ్ళు మూసుకున్నా తెరిచినా నువ్వే కనిపిస్తున్నావ్. నువ్వు ఇంకో రెండు రోజులు కనిపించకపోతే పిచ్చిపట్టేటట్టుంది. త్వరగా వచ్చేయ్…” తన ధోరణిలో తను చెప్పుకుంటూ పోయింది అవతలి నుంచి మాట్లాడుతున్న ఆడ కంఠం.

అప్పుడు కాస్తంత తేరుకుంది రత్తాలు తన ఆశ్చర్యం నుంచి. “ఎవరమ్మా నువ్వు?” అని అడిగింది.

అదిరిపడి నాలుక కరుచుకున్నట్టు శబ్దం వినవచ్చింది. ఠక్కున ఆఫ్ అయిపోయింది ఫోన్.

“ఎవరు రత్తాలూ? ఎవరు మాట్లాడింది?” రత్తాలు ముఖంలో అడుగుపెట్టిన చిత్రవిచిత్రమయిన భావాల్ని గమనించి తనుకూడా ఆశ్చర్యానికి గురవుతూ అడిగాడు ఆచారి.

“చెపుతా… ఒక్క క్షణం ఆగండి. ముందు నా దేవుడికి ఒక మంచి మాట చెప్పాలి” అంటూ గబగబా బెడ్ మీద పడుకున్న పెద్దయ్య పక్కకి పోయింది రత్తాలు.

సెల్ ఫోన్ ని అతని ముఖం దగ్గిరపెడుతూ–

“ఇదిగో ఒక్కసారి కళ్ళు తెరిచి చూడయ్యా మన చిన్నబాబుకి పెళ్ళి మాటలు మాట్లేడేయాలి. మనకి కోడలు రాబోతోందయ్యా! నువ్వు ఇలాగే కళ్ళు

తెరవకుండా పడుకునివుంటే ఇక లాభం లేదు. లేచి కూర్చో....” సంతోషం అధికమైపోవటం వల్ల గద్గదమైన కంఠంతో స్పృహలేని అతనికి చెప్పింది.

అంతకుముందు ఆచారి ప్రయోగించిన సువర్ణ భస్మం పనిచేసిందో లేక, రత్తాలు మాటలు అంతరంగానికి చేరి హఠాత్తుగా చలనమే కలిగిందో తెలియదుగాని, చటుక్కున కళ్ళు తెరిచాడు పెద్దయ్య.

పెట్రోమాక్స్ లైటు మాదిరి ప్రకాశవంతం అయింది ఆచారి ముఖం.

“నీకు తెలివి తెప్పించటం నావల్ల కాదని అనుకుంటున్నా. ఇంకో రెండు మూడు గంటలు చూసి పట్నం పంపించేయాలని నిర్ణయించుకున్నా, కోడలు వస్తున్నదని చెపితేగాని నువ్వు కళ్ళు తెరవదలుచుకోలేదు కదూ?” సంతోషంగా అన్నాడు.

ఆయనకోసం ఒక ట్రేలో కాఫీ కప్పును పెట్టుకుని అప్పుడే గది ద్వారం దగ్గరికి వస్తోంది మనిమనిషి చిలకమ్మ. ఒకళ్ళు చెప్పాల్సిన అవసరం లేకుండానే అసలు విషయం ఆమెకు అవగతమైపోయింది.

చేతిలో ఉన్న ట్రేని దప్పున కిందపడేసింది.

టీ కప్పు పగిలిపోయి, అందులోని టీ నేలపాలు అయినా లక్ష్యపెట్టకుండా, “దొరగారూ... పెద్దయ్య లేచాడు.. పెద్దయ్య కళ్ళు తెరిచాడు... దొరగారూ....” అని బిగ్గరగా అరుస్తూ ఆ బిల్డింగ్ లో నుంచి బయటికి పరిగెత్తింది.

***

“నిన్ను అర్జంటుగా సిటీ నుంచి పిలిపించిన కారణం ఏమిటో ఇంతవరకూ నీకు చెప్పలేదు. మాట్లాడదాం అని అనుకుంటూ వుంటే అలాగే గడిచిపోతోంది” సోఫాలో నుంచి లేచి నిలబడుతూ రవిబాబుతో అన్నాడు దొరగారు.

“అంత అర్జంటు ఇప్పుడేమొచ్చింది నాన్నగారూ?” ఆశ్చర్యంగా అడిగు రవిబాబు.

“ఇప్పటికిప్పుడు ఏమీ రాకపోయినా, ఎప్పుడో ఒకప్పుడు అర్జంటే అవవచ్చు. నాకు వయసు మీరిపోతోంది. నువ్వు దూరంగా వుంటున్నావ్ ఎప్పుడయినా మనం ఎదురుచూడని అవాంతరం వచ్చి, నీతో మాట్లాడకముందే నేను....” అంటున్న దొరగారి వంక ఆందోళనగా చూసి, ఆయన నోటిని తనచేత్తో మూశాడు రవిబాబు.

“మీరు లేనిపోని మాటలు మాట్లాడకండి. ఆ భుజంగరాయుడు మూలకంగా మనకి ఏదైనా ప్రాబ్లమ్ వస్తుందని మీకు అనిపిస్తే చెప్పండి. వాడి తలనరికి మన కొండలమ్మ తల్లికి నైవేద్యం పెడతాను...” ఆవేశంగా అన్నాడు.

“ఛ ఛ... వాడెంత? వాడి బతుకెంత? వాడు కాదు... అసలు కారణం నీకు తెలియాలి. నాతోరా” అంటూ హాల్లోనుంచి తన బెడ్ రూమ్ లోకి దారితీశాడాయన.

చేయి తిరిగిన మహాచిత్రకారుడు ఎవరో అమూల్యమైన రంగులతో చిత్రించిన పోస్ట్ కార్డుసైజు వర్ణచిత్రాలున్నాయి మొదటి పేజీల్లో. బ్లాక్ అండ్ వైట్ ఫోటోలు తరువాతి పేజీల్లో కనిపిస్తున్నాయి.

“నువ్వు పుట్టిన తర్వాత ఎప్పుడూ నీకు చూపించని ఆల్బమ్ ఇది. మన వంశకర్తలు, మన దాయాదులు, బంధువులు అందరూ ఇందులో నీకు దర్శనం ఇస్తారు....” అంటూ మొట్టమొదటి మూడు పేజీలను తెరిచి రవిబాబుకు చూపించాడు దొరగారు.

“ఎప్పుడో నాలుగు వందల ఏళ్ళక్రితం సిరిపుర సంస్థానాన్ని పరిపాలించిన కీర్తిరాయుడు ఇతను. మన వంశం ఇతనితోనే మొదలయింది...” అంటూ ధీర గంభీర రూపంతో నిలబడిన ఒక ఆజానుబాహుడి వర్ణ చిత్రాన్ని చూపించాడు.

“ఇతను శక్తిరాయుడు... కీర్తిరాయుడి తమ్ముడు. చిన్నతనంలోనే సంస్థానాన్ని వదిలి సన్యాసుల్లో కలిసిపోయాడు. హిమాలయాల్లో తపస్సు చేసి అష్టసిద్ధి యంత్రమనే మహాశక్తిని మన వంశానికి ప్రసాదించాడు...” రెండో పేజీల్లో వున్న ఒక సర్వసంగ పరిత్యాగి చిత్రాన్ని చూపిస్తూ చెప్పాడు.

“అష్టసిద్ధి యంత్రమా? అదేమిటి నాన్నగారూ?” ఆశ్చర్యంగా అడిగాడు రవిబాబు.

“అదే చెప్పటానికి నిన్ను పిలిపించాను. అందుకు ముందు నువ్వు ఈ ఆల్బమ్‌ని పూర్తిగా చూడాలి” అంటూ మూడో పేజీలో వున్న ఇంకో చిత్రాన్ని చూపించాడు దొరగారు.

కళ్ళు మిరుమిట్లు గొలుపుతున్నట్టు అనిపించింది రవిబాబుకి.

ఎందుకంటే – ఆ పేజీలో విలాసంగా నిలుచునివున్న యువతివంటి అందగత్తెను అతను అంతవరకూ చూడలేదు.

“కీర్తిరాయుడికి, శక్తిరాయుడికీ గారాల చెల్లెలు సుధంతి. ఆమె కారణంగానే మన వంశం...” అంటూ వుండగానే గద్గదమైంది దొరగారి కంఠం, కంటతడి పెట్టటం అంటే ఏమిటో ఎరుగని ఆయన కళ్ళు జల పాతాలైపోయాయి ఒక్కసారిగా.

చూస్తున్న ఆల్బమ్‌ని చటుక్కున మూసి పందిరి మంచం మీద పడవేశాడు రవిబాబు.

“ఏమయింది నాన్నగారూ? ఏమిటిది?” ఆందోళనగా అడుగుతూ ఆయన భుజాలు పట్టుకున్నాడు.

ఆ మాటలకు దొరగారు సమాధానం చెప్పకముందే బెడ్‌రూమ్ బయటినుంచి పెద్దగా వారి చెవులకు చేరాయి పనిమనిషి చిలకమ్మ అరుస్తున్న అరుపులు.

“తెలివి వచ్చేసింది పెద్దయ్యకి... దొరగారూ... పెద్దయ్య కళ్ళు తెరిచాడు.”

మంత్రం వేసినట్లు మాయమైపోయింది దొరగారి వదనంలో ప్రత్యక్షం అయిన ఆవేదన.

“నువ్వు తీరికగా కూర్చుని ఈ ఆల్బమ్‌ని చూడు. మనం నెమ్మదిగా మాట్లాడుకుందాం” అంటూ కొడుకు సమాధానం కోసం ఎదురు చూడకుండా చకచకా బయటికి వెళ్ళిపోయాడాయన.

ఆయన ఆదేశించినట్లు అక్కడే కూర్చుని ఆల్బమ్ చూడలేదు రవిబాబు. దాన్ని పందిరి మంచంమీది తలగడ కిందికి నెట్టి తనుకూడా అవుట్ హౌస్ దగ్గరికి పోయాడు పరుగులాంటి నడకతో.

***

"పిచ్చిముఖం వేసుకుని యధాలాపంగా నిలబడ్డా... ఏమాత్రం అనుమానం వచ్చినా ఆ దొంగనాయాళ్ళ తలలు అప్పుడే పగిలిపోయి వుండేవి..." రత్తాలు సాయంతో బెడ్ మీద కూర్చుని ఆచారిగారికి చెపుతున్నాడు పెద్దయ్య – గరపచేలో జరిగింది గుర్తుకు తెచ్చుకుంటూ.

"అందుకు నువ్వు బాధపడాల్సిన అవసరం ఎంతమాత్రము లేదు. ఆ పని చిన్నబాబు చేసేశాడు. వాళ్ళ ఝటాలం వదిలిపోయింది" అంటున్నాడు ఆచారి.

"పెద్ద పెద్ద అడుగులు వేస్తూ వచ్చిన దొరగారిని చూడగానే కుర్చీలో నుంచి లేచి వినయంగా చేతులు కట్టుకుని నిలబడ్డాడు అతను. తను కూడా మంచం దిగబోయిన పెద్దయ్యవంక కోపంగా చూసి, అతని పక్కనే మంచంమీద కూర్చుని, అతని భుజాన్ని ఆప్యాయంగా నిమిరాడు దొరగారు.

"గండం గడిచింది దొరగారూ... నాలుగు రోజుల్లో మన పెద్దయ్య మామూలు మనిషవుతాడు" వైద్యుడిగా తన ఫైండింగ్స్ ని ఆయనకి రిపోర్ట్ చేశాడు ఆచారి.

"చాలా సంతోషం. వెంటనే మీరు ఒకపని చేయండి. నల్లకొండల్లో వున్న మామయ్యకి కబురుచేసి కొండలమ్మతల్లికి ఘనంగా జాతర జరిపించాలని చెప్పండి. మనం రేపు ఉదయమే అక్కడికి పోదాం..." అన్నాడు దొరగారు.

“ఒంటరి పూజలు ఇంకా ఎంతకాలం దొరగారూ? కోడల్ని తెచ్చుకుని జంటతో చేయించటం బాగుంటుందికదా?” చాలా... చాలా కాజువల్‌గా అన్నాడు ఆచారి.

వినకూడని మాట ఏదో చెవుల పడినట్లు ఒక్కసారిగా మంచంమీది నించి లేచాడు దొరగారు. కోపమో, ఆవేదనో, ఆందోళనో ఏదో తెలియని ఒక వికృతభావంతో చాలా మలినమయింది ఆయన వదనం.

“దయచేసి మీరు నోరు మూసుకోండి. ఇంకెప్పుడూ అటువంటి మాటలు మా ముందు మాట్లాడకండి. మొదటిసారి కాబట్టి నెమ్మదిగా చెపుతున్నాను...”

ఆచారిగారిని కరుకుగా హెచ్చరించి, విసవిసా అడుగులు వేస్తూ ఆ గదిలో నుంచి బయటికి వెళ్ళిపోయాడు ఆయన.

***

ఎప్పటి మాదిరిగానే గులాబీ కేఫ్ వెనకాల వుండే సందులో పాండు దగ్గర సారా క్యాన్లను డెలివరీ తీసుకున్నాడు భారీ పర్సనాలిటీ.

“నువ్వు మొనగాడివి పాండూ.... నువ్వు వెళ్ళాక తెలిసింది ఎస్సయ్య గంగరాజు సూదిగుట్టల దగ్గరికి పోయినట్టు, ఆడు అక్కడ వుండగా సరుకును సిటీలోకి తీసుకొచ్చే దమ్ము నీకు తప్ప ఇంకెవరికీలేదు. నీకున్న డేర్‌లో వెయ్యోవంతు నాకు వుంటే, ఈపాటికి పది అపార్టుమెంట్‌లు కొనేసి వుండేవాడిని. శ్రీదేవితో సినిమాతీసి వుండేవాడిని” అని పాండును మెచ్చుకున్నాడు.

“శ్రీదేవి సినిమాల్లో వేషాలు వేయటం మానేసి చాలాకాలం అయింది. ఇంకెవరినైనా చూసుకో” అంటూ టీవీఎస్‌తో పాటు, తన దగ్గిర మిగిలిన

కొద్దిపాటి కరెన్సీనోట్లను కూడా అతనికి లెక్క చెప్పి అప్పగించేశాడు పాండు. బీడీని వెలిగించి మెయిన్ రోడ్డు మీదికి బయలుదేరాడు.

టీవీఎస్‌ని, సారా క్యాన్లను తనతో వచ్చిన తన అనుచరులు ఇద్దరికి అప్పగించి, అతనితోపాటు రోడ్డుమీదికి వచ్చాడు భారీ పర్సనాలిటీ. "అవును బే పాండూ.... ఆ ఎస్సయ్ గంగరాజు సూది గుట్టల్లో వున్న బట్టీల్ని చూస్తాడంటావా?" అని అడుగుతూ, అతనికి ఇవ్వాల్సిన డబ్బుకు ఇంకో వంద ఎకస్ట్రాగా యిచ్చాడు.

చటుక్కు గుర్తుకు వచ్చాడు పాండుకు తెలివితప్పి తల వేలాడేసిన జోగినాథం. భారీ పర్సనాటిటీ అదనంగా ఇచ్చిన డబ్బులు అతనికి సంతోషాన్ని కలిగించలేకపోయాయి. "బట్టీల్ని ఆడు చూస్తాడో చూడడో నాకు ఎలా తెలుస్తుంది? ఎవర్నయినా అక్కడికి పంపించు... నేను వస్తా... నాకు అర్జంట్ పనివుంది" అంటూ అతనితో సంభాషణ కట్ చేసి గులాబీ కేఫ్ లోకి దారితీశాడు..

'ఇప్పటిదాకా బాగానే మాట్లాడాడు... అప్పుడే ఎందుకు మార్పు వచ్చింది? రాను రాను వీడు వట్టి తిక్కల మేళం అయిపోతున్నాడు...' తనలో తను అనుకుంటూ తన దారిన తను వెళ్ళిపోయేడు భారీ పర్సనాలిటీ.

కప్పు మీద కప్పుగా మూడు టీలు తాగాడు గులాబీ కేఫ్ లోకి ఎంటర్ అయిన పాండు. ఒకదాని వెనుక ఒకటి వరుసగా నాలుగు బీడీలు కాల్చాడు.

"పరేషాన్ లో వున్నట్టున్నావ్... ఏంది భాయీ?" చూసి వుండబట్ట లేక అతని దగ్గరికొస్తూ అడిగాడు గులాబీ కేఫ్ ఓనర్ ముస్తఫా. కళ్ళ ముందు

మెదులుతున్న జోగినాథం ముఖాన్ని అతిబలవంతంగా అవతలకు నెడుతూ గట్టిగా నిట్టూర్చాడు పాండు.

"ఎప్పుడూ నవ్వుతూ వుండే నీ ముఖం, నిద్దరబోయి లేచినోడిలా తయారయింది. నీ పరేషాన్ ఏంటో నాకు చెప్పు. డబ్బుల్కి ఇబ్బందా?" అడిగాడు ముస్తఫా.

"అదేం కాదు భాయీ.... బాగా తెలిసిన మనిషికి ఒంట్లో బాగోలేదు. దగ్గిర వుండీ ఏమి చేయలేకపోయాను. చేతకాని చవటలా తోకముడుచుకుని పారిపోయి రావాల్సి వచ్చింది" ఎస్సయ్య గంగరాజును చూసి తను పారిపోయి రావటాన్ని గుర్తు చేసుకుంటూ చెప్పాడు పాండు.

"ఎవురా మనిషి? మీ జోగినాథమే?" నిర్మొహమాటంగా అడిగేశాడు ముస్తఫా.

అదేమాట ఇంకెవరి నోటి నుంచయినా వచ్చి వుంటే అదిరిపడి, ఆశ్చర్యంగా చూసి వుండేవాడు పాండు. ముస్తఫా నోటివెంట రావడం అతనికి విడ్డూరంగా అనిపించలేదు. చేసేది ఆర్డినరీ హోటల్ వ్యాపారమే అయినా, బల్ చలాక్‌గా వుంటాడు ముస్తఫా. సిటీలోని వింతలు విశేషాలు అప్పటికప్పుడు అరక్షణంలో అతనికి తెలిసిపోతూ వుంటాయి. అవసరం అయిన వాళ్ళకి అవసరం అయిన ఇన్ఫర్మేషన్‌ని సప్లయ్ చేసి, తన కౌంటర్లో నుంచి కాలు కదపకుండా డబ్బులు సంపాదించటంలో దిట్ట అతను.

పాండు మనసులో మెదులుతున్న భావాలన్నీ తనకు తెలిసిపోయినట్టు చిన్నగా నవ్వుతూ, అతని భుజం మీద చేయివేసి బలంగా అదిమాడు ముస్తాఫా.

"నువ్వు అనవసరంగా పరేషాన్ అయిపోతున్నావ్... ఆ ఎస్సయ్ గంగరాజు నీ దోస్త్ జోగినాథాన్ని జీప్‌లో ఏసుకుని గవర్నమెంట్ హాస్పిటల్‌కి తీసుకు వచ్చాడు. ఇంతకుముందే నాకు తెలిసింది..." అంటూ, ఇంకో టీ తీసుకోచ్చి ఇవ్వమని దూరంలో వున్న వెయిటర్‌కి సైగచేశాడు.

పూర్తిగా కాకపోయినా మూడొంతుల బాద చేత్తో తీసేసినట్టు చటుక్కున మటుమాయం అయిపోతుండగా, హాయిగా ఆ టీని కూడా తాగి, భారీ పర్సనాలిటీ ఇచ్చిన ఎక్స్ట్రా డబ్బుల్లో నుంచి బిల్లు చెల్లించాడు పాండు. ఇంకో ఫ్రెష్ బీడీని వెలిగించుకుని బయటికిపోతూ వుండగా స్ట్రయికయింది అతనికి ఆ ఆలోచన.

జోగినాథం తనకి అప్పచెప్పిన పనిని గురించి ముస్తఫాతో మాట్లాడితే ఎలా వుంటుంది?

బీడీ పొగల్ని రైలింజన్ మాదిరి గుప్పుగుప్పున బయటికి వదులుతూ హోటల్ గుమ్మంలో నిలబడిపోయిన పాండువంక ఓరగా చూసి, ప్రశ్నార్థకంగా నొసలు ఎగరేశాడు ముస్తఫా. "ఏంది భాయి? ఏమైనా మాట్లాడాలని అనుకుంటున్నావా?" అని అడిగేశాడు.

"అవును భాయీ... ఆ మధ్య సాతూర్లో బ్యాంక్ దొంగతనం ఏదో జరిగిందట... అదీ..." అంటూ అతనితో మాటలు మొదలెట్టాడు పాండు.

"అదీలేదు గిదీలేదు... మూడు కోట్లు అప్పణంగా సంపాదించేసిన ఆ బద్మాష్ గాళ్ళు ఎక్కడా చోటు దొరకనట్టు ఈ సిటీలోకి ఎందుకు వస్తారు? సూదిగుట్టల్లో బంజారోళ్ళ మాదిరి ఎందుకు హైరానా పడ్తారు? ఆళ్ళు ఇటు రాలేదు... నల్లకొండల్లో దట్టమైన జంగిల్ వుంది... ఆడికి బోయిన్రు... అటునుంచి కర్ణాటక రాష్ట్రానికి జంప్ అయిపోతారు. ఇటురారు" తనుకు తెలిసింది నమ్మకంగా, ఆలస్యం చేయకుండా బయట పెట్టాడు ముస్తఫా.

"మరి ఈ పోలీసోళ్ళు ఎందుకు ఇప్పుడు హంగామా చేస్తున్నారు?" అడిగాడు పాండు.

"అది ఆళ్ళ కాపీరైటు... అంతా అయిపోయిం తర్వాత హంగామా చేయటం ఆళ్ళకి బాగా అలవాటు... నీకు దెల్సు ఆ సంగతి.. టెన్ పర్సంట్ బహుమానం కోసం నువ్వు ట్రై చేయదలచుకుంటే నల్లకొండల్కి బోవాలి... నారాయణపురమని ఒక ఊరు వుంది అక్కడ.

శివయ్య అనీ మనోడే.. బార్బరు... నేను పంపించానని చెప్పు. నీకు కావల్సిన హెల్పు చేస్తాడు...." అడగకముందే అవసరం అయిన ఇన్ఫర్మేషన్ అంతా యిచ్చి, తన పనిలో తాను బిజీ అయిపోయాడు ముస్తఫా.

రెండు మూడు అనుమానాలు అలాగే మిగిలి, మెదడును తొలిచేయడం మొదలుపెట్టినా, అక్కడే నిలబడి అతన్న వేధించుకుని తినలేదు పాండు. చివరికంటా కాలి చేతివేళ్ళను చురుక్కుమనిపించబోతున్న బీడీని అవతలకు విసిరిపారేసి, చకచకా రోడ్డుమీదికి వచ్చాడు. గులాబీ కేఫ్‌కి ఆపోజిట్‌గా, రోడ్డుకు

అవతల పక్కనవున్న స్వీట్ షాపులో రెండు కేజీల స్వీట్లు పొట్లం కట్టించుకుని, టాబూ హోటల్ దగ్గిరికి తీసుకుపోయే సిటీ బస్‌ని క్యాచ్ చేశాడు.

నవరాత్రి పందిర్లో ఒక మూలగా నిలబడి, సిటీబస్‌లో నుంచి దిగుతున్న అతన్ని గమనించాడు షరీపు. ఇయ్యాళ డబ్బులు బాగా గిట్టుబాటు అయినట్టున్నాయి. ఆలస్యం చేస్తే మనం వెనకబడిపోతాం.. ఆడి ఎనకాలే పోవాలి అనుకుంటూ మురికివాడవైపు అడుగులు వేశాడు.

తన ఇంటి ముందుకు పోగానే పెద్ద కంఠంతో చుట్టుపట్ల వున్న పిల్లలు అందర్నీ పిలిచాడు పాండు. గుంపులు గుంపులుగా వచ్చిన వారందరికీ తను తీసుకువచ్చిన స్వీట్లు పంచిపెట్టాడు. ఆదరాబాదరాగా వచ్చిన షరీపుకు కూడా రెండు జిలేబీ చుట్టల్ని యిచ్చాడు.

"నేను కాస్సేపు నిద్రపోతా... సాయంత్రం సినిమాకి పోదామని రంగమ్మకి చెప్పు" అని అతనికి ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చి, రంగమ్మ తల్లకిందులు చేసేసిన నులక మంచాన్ని సరిచేసుకుని, దానిమీద మేనువాల్చాడు.

"అయితే పాండూ.. నువ్వు ఆ జోగినాథాన్ని గురించి వినలేదా?" జిలేబి చుట్టల్ని తాపీగా ఆరగించి, వేళ్ళకు అంటిన పంచదార పాకాన్ని కూడా వదిలిపెట్టకుండా నాలుకకు అద్దుకుంటూ అడిగాడు షరీపు.

తలగడని సరిచేసుకుంటున్న పాండు చటుక్కు తలఎత్తి అతని వంక చూశాడు ప్రశ్నార్ధకంగా.

"ఆళ్ళ స్టేషన్లో పనిచేస్తున్న కానిస్టేబుల్ ఒకతను ఇంతకుముందే పందిరి దగ్గరికి వచ్చి, పూజలు చేసే బాపనాయనతో మాట్లాడటం నేను విన్నా....

సూదిగుట్టల్లో ఎవరో చేతబడి చేసి వదిలేసిన గుమ్మడికాయని పొరపాటున జోగినాథం తొక్కాడట... వెర్రిగా అరిచి వెల్లకిలా పడిపోయాట్ట. గవర్నమెంటు హాస్పిటల్లో డాక్టర్లు ఆళ్ళ వల్ల కాదంటున్నారట పాపం. జోగినాథం పెళ్ళాం పిల్లలు గావురు గావురుమంటున్నారట" తనకు తెలిసింది నాన్‌స్టాప్‌గా చెప్పేసి, అంతకుముందు అతను ఇచ్చిన ఇన్‌స్ట్రక్షన్స్‌ని అక్షరాలా అమలు చేయటానికి రంగమ్మ ఇంటివైపు బయలుదేరాడు షరీఫు.

అతన్ని వెనక్కి పిలవలేదు పాండు. అర్జంటుగా మంచం మీద నుంచి లేచి, తన ఇంటి ముందున్న సీసాలోని నీటితో ముఖం కడుక్కున్నాడు. కాళ్ళు చేతుల్ని శుభ్రం చేసుకున్నాడు. సారా క్యాన్లను హేండిల్ చేయటంవల్ల అపరిశుభ్రంగా తయారైన దుస్తుల్ని తీసేసి, ఫ్రెష్ బట్టల్ని ధరించాడు. బీడీని వెలిగించుకుని, తన ఇంటి వెనకాల నిలబెట్టి వున్న హంబర్ సైకిల్ని బయటికి తీసుకువచ్చాడు.

సరిగ్గా అప్పుడే అక్కడికొచ్చింది రంగమ్మ....

"నేనూ వస్తాను.... నన్ను నీతో తీసుకుపో" అంటూ అతని దారిని అడ్డగించింది.

"నువ్వు నెమ్మదిగా రా... నాతోవద్దు... నేను అర్జంటుగా పోవాలి" అంటూ హేండిల్‌ని పట్టుకున్న ఆమె చేతిని బలవంతంగా పక్కకు నెట్టి సైకిల్‌ని ముందుకు దూకించాడు పాండు. రెండే రెండు నిముషాల్లో మెయిన్ రోడ్డును చేరుకుని, వింటి

నుంచి వెలువడిన బాణంలా గవర్నమెంట్ హాస్పిటల్ వైపు రివ్వుమని దూసుకువెళ్ళిపోయాడు.

"నువ్వంటే ఆడికి ఎప్పుడూ లక్ష్యంలేదు రంగమ్మా.... అట్టాంటోడి మీద నువ్వు భ్రమలు పెంచుకోవటం దేనికో నాకైతే అర్థం కావడంలేదు" అంటున్న షరీఫు వంక కళ్ళెర్రజేసి కోపంగా చూసి "నువ్వు కాస్సేపు నోరు మూసుకుంటావా?" అని అడిగింది రంగమ్మ.

"మూసుకోమని నువ్వు గట్టిగా చెపుతుంటే మూసుకోక ఏం చేస్తాను? నువ్వు చెప్పినట్టే మూసుకుంటాను. నువ్వు మాత్రం నేను చెప్పింది గట్టిగా ఆలోచించు...." నోటిమీద చేయి వేసుకుని, ఆమెతో పాటు మెయిన్ రోడ్డువైపు అడుగులు వేస్తూ అన్నాడు షరీఫు.

అతని మాటల్ని లక్ష్య పెట్టకుండా రోడ్డుమీది బస్‌స్టాప్‌లో రెండు నిముషాలు నిలబడింది రంగమ్మ. బస్ ఎంతసేపటికీ రాకపోవటంతో.. "నేను పోతున్నా.." అని అతనికి చెప్పి, టాబూ హోటల్ వెనకాల వున్న సందులోకి ఎంటర్ అయింది. వడివడిగా అడుగులు వేసి అవతలి పక్కనవున్న సెంటర్ ని చేరుకున్నది.

అక్కడ పదినిముషాలపాటు వెయిట్ చేసినా తనకు కావాల్సిన బస్ రాకపోవటంతో, విసుగ్గా తల విదిలించి, ఇంకో షార్ట్‌కట్‌లో నడక మొదలు పెట్టింది.

వంద గజాలు పోయాక ఒక క్రాస్ రోడ్డు మొదట్లో, ఆమెకు కనిపించింది ఒక ఇంటిముందు నిలబడి, ఆ ఇంటి యజమానితో తిట్లు తింటున్న పిచ్చిమామ్మ.

"ఎన్నిసార్లు చెప్పినా పోకుండా దయ్యంలా ఇక్కడే తగలడ్డావేమిటి? అవతలికిపో... నిన్ను చూసి పిల్లలు దడుసుకుంటున్నారు...." అంటూ అరుస్తోంది ఆ యజమాని.

తల వంచుకుని నిలబడివున్న మామ్మ... అనుకోని విధంగా తన పక్కన ప్రత్యక్షం అయిన రంగమ్మని చూసి ఆశ్చర్యపడింది. కొంచెం ఆనందంగా నవ్వను కూడా నవ్వింది.

"ఆళ్ళతో ఈళ్ళతో అడ్డమైన తిట్లు తినడం దేనికి మామ్మా...? ఇక్కడ ఏముంది? ఇవతలికి వచ్చేయి..." అంటూ ఆమె చేయి పట్టుకుని తనతోపాటు నడిపించటం మొదలుపెట్టింది రంగమ్మ.

"ఆకలిగా వుంది తల్లీ! ఏమైనా పెట్టిస్తావా తినటానికి?" ఆమెతో పాటు అడుగులు వేయటానికి శక్తివంచనాలేకుండా ప్రయత్నం చేస్తూ అడిగింది మామ్మ.

"ఇప్పుడు నీతోపాటు వచ్చి తీరికగా నిలబడటానికి టైములేదు. అర్జంటుగా హాస్పిటల్‌కి పోవాలి. జోగినాథం అనీ మాకు బాగా తెలిసిన మనిషి అక్కడ వున్నాడు. వెళ్ళి చూడాలి...." అంటూ పమిటె చెంగుకున్న ముడిని విప్పి పదిరూపాయల నోటును ఆమెకు ఇచ్చింది రంగమ్మ.

"ఈ వీధి చివర మంచి హోటలుంది. వెళ్ళి టిఫిన్ చేయి" అంటూ తాను ముందుకు అనుసరించింది మామ్మ.

"ఆగవే తల్లీ... నేనూ నీతోపాటు వస్తాను. నెమ్మదిగా నడువ్" అంటూ ఆమెను అనుసరించింది మామ్మ.

"ఆకలిగా వుందని అన్నావుగా... వెళ్ళి టిఫిన్ చేయి. నాతోపాటు అంతదూరం నడవలేవు....." అన్నది రంగమ్మ.

"నీతో వస్తానే... నేను కూడా అతన్ని చూస్తాను. నన్ను నీతో తీసుకుపో...." ఆమె మాటలు తనకు వినబడనట్లు మొండిగా అన్నది ఆ వృద్ధురాలు.

"నీ పిచ్చిగోల ఏమిటో నాకు అర్థం అయి చావదు. ముక్కు, మొహం తెలియని మనిషి దగ్గరికి నువ్వు రావటం దేనికి....?" అంటూ ఇంకోసారి ఆమె చేతిని పట్టుకుని తనతోపాటు అడుగులు వేయించింది రంగమ్మ.

ఆయాసం ఎగదన్నుకువస్తున్నా, అలాగే నడిచింది వృద్ధురాలు. ఆ వీధిని దాటి ఇంకో రోడ్డుమీదికి పోబోతూ, ఆ సంగతిని గమనించి ఖాళీగా వున్న ఒక రిక్షాని పిలిచింది రంగమ్మ. వృద్ధురాలిని జాగ్రత్తగా చూర్చోబెట్టి తనుకూడా పక్కన కూర్చుంది. పావుగంట తర్వాత వారిద్దరినీ గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గిర వదిలాడు రిక్షావాలా. రంగమ్మ ఇచ్చిన నోటును కళ్ళకు అద్దుకుని, రిక్షా హేండిల్‌కి కూడా అద్ది, "బోణీ బేరం తల్లీ... నీ చేతిచలవ ఎలా వుంటుందో చూడాలి" అని చెపుతూ అవతలికెళ్ళిపోయాడు.

వృద్ధురాలి చేయి పట్టుకుని హాస్పిటల్ గేటును దాటిన రంగమ్మకు, గేటుకు దగ్గిర్లోవున్న చెట్లకింద కనిపించింది జోగినాథం భార్య. పమిటె చెంగును నోటికి

అడ్డం పెట్టుకుని షరీఫు చెప్పినట్టే గావురు గావురుమని ఏడుస్తోంది. ఏం పాలుపోక బిక్కముఖాలతో ఆమె పక్కన నిలబడి వున్నారు జోగినాథం పిల్లలు ఇద్దరూ.

"ఏమైంది పిన్నీ? మీరిక్కడ ఎందుకున్నారు?" పెద్ద పెద్ద అడుగులు వేస్తూ వాళ్ళ దగ్గిరికిపోయి జోగినాథం భార్యను అడిగింది రంగమ్మ.

"నాన్నకి ఇంకా తెలివిరాలేదు. అమ్మ అదే పనిగా ఏడుస్తుంటే డాక్టర్లు బయటికి నెట్టేశారు. మమ్మల్ని లోపలికి పోనీయటం లేదు...." ఆమెకు చెప్పింది పెద్దపిల్ల.

"పాండు ఇక్కడికి వచ్చాడు కనిపించలేదా?" ఆమె భుజం మీద చేయి వేస్తూ అడిగింది రంగమ్మ.

"వచ్చాడు.... లోపలికిపోయాడు...." హాస్పిటల్ బిల్డింగ్స్ వైపు చూపిస్తూ చెప్పింది జోగినాథం రెండో కూతురు.

తన పక్కనే నిలబడి ఆ బిల్డింగ్స్ వైపు చూస్తున్న వృద్ధురాలిని గురించి మర్చిపోయింది రంగమ్మ. పరుగులాంటి నడకతో అటుకేసి బయలుదేరింది. పాతబడిపోయిన రెండంతస్థుల బిల్డింగ్ లోకి ఎంటర్ అయిన రెండో క్షణంలో ఆమెకు అగుపించాడు పాండు.

తెల్లటి డ్రస్ వేసుకుని వున్న ఒక డాక్టర్‌తో గొడవపడుతున్నాడు అతను.

"మీరు అసలు మనుషులుకారు. మనుషులే అయితే ఆ తల్లీబిడ్డల్ని బయటికి నెట్టించి వుండేవాళ్ళుకారు...." అంటున్నాడు ఆవేశం నిండిన కంఠంతో,

ఎర్రగా కందిపోయిన ముఖంతో తమ అటెండర్స్ ఇద్దరిని పిలిచి పాండును కూడా బయటికి నెట్టమని ఆజ్ఞలు యిస్తున్నాడు ఆ డాక్టర్.

"లోపలికి రానీయకండి. నోరు తెరిస్తే పళ్ళు రాలిపోయేటట్టు కొట్టండి" అని కూడా అంటున్నాడు.

జెమాజెట్టీల్లా కన్పిస్తున్న ఆ అటెండర్స్ గనుక పాండు ఒంటిమీద చేతులేస్తే తర్వాతేం జరుగుతుందో తనకు బాగా తెలిసి వుండటంవల్ల, ఆదరా బాదరాగా ముందుకుపోయి పాండు చేతిని పట్టుకున్నది రంగమ్మ.

"ఇది హాస్పిటలు... ఆళ్ళు డాక్టర్లు... ఎటువంటి మాటలు మాట్లాడినా మనం నోరు మూసుకుని వినాలి. ఎదురుచెప్పి గొడవచేస్తే మనకే నష్టం. నువ్వు బయటికి వచ్చేయ్....." అంటూ అటెండర్స్ ముందుకు రాకముందే, అతన్ని బిల్డింగ్ లోనుంచి బయటికి తీసుకొచ్చింది.

"ఆళ్ళు వట్టి ఎదవలే రంగమ్మ.... బాబాయిని చూడనీయటం లేదు. ఎట్టా వుందని అడిగితే సమాధానం చెప్పటం లేదు. ఆళ్ళని ఊరికే వదలకూడదు. ఒట్టొట్టి మాటలకి వాళ్ళు సమాధానాలు చెప్పరు...." చేయి వదిలించు కోవటానికి ట్రై చేస్తూ కోపంగా అన్నాడు పాండు.

"ఆళ్ళ సంగతే అంత..... నువ్వు మాట్లాడకుండా నిలబడితే నేను వెళ్ళి చూసొస్తాను. నాకు తెలిసిన నర్సమ్మ ఒకామె ఈ బిల్డింగ్ లోనే పనిచేస్తోంది. నువ్వు గమ్మునుండు." అంటూ అతన్ని అక్కడే నిలబెట్టి తాను ఇంకోసారి బిల్డింగ్ లోకి ఎంటర్ అయింది రంగమ్మ.

తనకు తెలిసిన నర్సమ్మకోసం గాలింపు మొదలుపెట్టబోతుండగా, నిశ్శబ్దంగా వచ్చి తనతో అడుగులు కలుపుతున్న వృద్ధురాలు ఆమెకు కనిపించింది.

“అసలే ఇక్కడ గొడవగా వుంది. నువ్వూ వస్తే ఇంకా గొడవైపోతుంది. నువ్వు బైటికిపో మామ్మా... పాండు దగ్గిర నిలబడు...” అంటూ ఆమె సమాధానం కోసం ఎదురుచూడక తన పనిలో తాను బిజీ అయిపోయింది. ఆమె చెప్పినట్టు బయటికిపోలేదు వృద్ధురాలు. ఆ మాటలు అస్సలు తనకు వినబడనట్టు ఆమెతోపాటు పది అడుగులు వేసినట్టే వేసి, ఒక గదిముందు ఆగింది. ఖాకీ దుస్తులు ధరించిన కానిస్టేబిల్ ఒకతను విసుగు నిండిన ముఖంతో, చుట్టూ చూస్తూ నిలబడి వున్నాడు ఆ గది ముందు.

“ఎవరివే నువ్వు? దయ్యం ముఖం వేసుకుని ఇక్కడికి ఎందుకు వచ్చావ్? పో అవతలికి....పో” వృద్ధురాలిని చూడగానే కోపంగా అంటూ తన చేతిలోని లాఠీని గాలిలో వూపాడు. భయంతో వణికిపోతూ వెనక్కి వెళ్ళిపోవాల్సిన వృద్ధురాలు, ఒక్క అడుగు కూడా అవతలికి వేయలేదు.

“కర్ర పైకి ఎత్తినంత మాత్రాన నేను భయపడిపోతానని అనుకోబోకు. నన్ను కొట్టగల ధైర్యం వుంటే కొట్టు....” అంటూ రెండు అడుగులు ముందుకు వేసింది.

గాలిలోకి ఎత్తిన లాఠీని చటుక్కున కిందికి దించి, పక్క చూపులు చూస్తూ గది ద్వారం దగ్గిర్నించి కొంచెం అవతలికి జరిగి నిలబడ్డాడు ఆ కానిస్టేబిల్. పెదవులు విప్పి మరొక్క మాట కూడా మాట్లాడలేదు.

ఓరగా వేసివున్న గది తలుపుల్ని తన చేతికర్రతో ఇంకా కొంచెం తెరిచి లోపలికి తొంగి చూసింది వృద్ధురాలు.

ఇంటెన్సివ్ కేర్ గది మాదిరిగా వున్న ఆ గదిలో అచేతనంగా పడుకొని వున్నాడు జోగినాథం... అతని పక్కనే నిలబడి అతని నాడిని పరిశీలిస్తున్నాడు ఒక డాక్టర్. తలుపులు తెరుచుకున్న సవ్వడిని ఆలకించి చటుక్కున వెనక్కి చూశాడు.

ద్వారంలో నిలబడి వున్న వృద్ధురాలిని చూసేసరికి టాప్ పిచ్‌కి వెళ్ళిపోయిందతని కోపం. "ఎవరు నువ్వు? ఎందుకొచ్చావ్ ఇక్కడికి? అవతలికి పో..." తీవ్ర కంఠంతో చెవులు చిల్లులు పడిపోయేటట్లు బిగ్గరగా అరవటానికి నోరు తెరిచాడు.

"నోరుంది కదా అని వట్టి పుణ్యానికి అరవబోకు... నోరు మూసుకో..." చేతికర్రను అతనికేసి గురుపెడుతూ అన్నది వృద్ధురాలు. ఎవరో చేయిపెట్టి అదిమినట్టు మూతబడిపోయింది డాక్టర్ నోరు.

"ఇతని భార్యాబిడ్డలు చెట్ల కింద కూర్చుని ఆవేదనతో అలమటించి పోతున్నారు. వాళ్ళని పిలిపించు...." అతని ముఖం మీదినించి చూపుల్ని తిప్పకుండా ఇంకో మాట చెప్పింది వృద్ధురాలు.

అందుకు కూడా అభ్యంతరం చెప్పలేదతను. గబగబా ద్వారం దగ్గరికి వచ్చి, గోడ పక్కనే నిలబడి వున్న కానిస్టేబిల్‌కి వృద్ధురాలి మాటల్ని రిలే చేశాడు. పరుగులాంటి నడకతో బయటికి పోయాడా కానిస్టేబిల్. నాలుగు నిముషాల తర్వాత జోగినాథం భార్యని, బిడ్డల్ని తనతో లోపలికి తీసుకువచ్చాడు. అదే

సమయంలో తనకు పరిచయం వున్న నర్సమ్మను వెదికిపట్టుకుని తనూ ఆ గది దగ్గిరికొచ్చింది రంగమ్మ.

"నా అవసరం లేకుండానే పని అయిపోయినట్టుంది. నేను పోతాను..." అంటూ రంగమ్మని అక్కడే వదిలి తన దారిన తను వెళ్ళిపోయింది ఆ నర్సమ్మ.

అడుగులో అడుగువేస్తూ, అతి నెమ్మదిగా బిల్డింగ్ లోకి వచ్చిన పాండును చేయి ఊపి తాను కూడా గది లోపలికి ఎంటర్ అయింది రంగమ్మ.

"మేము ఎంతగానో ట్రై చేస్తున్నాం... తెలివి ఎందుకు రావటం లేదో మాకు అర్ధం కావటం లేదు. కింద పడినప్పుడు మెదడుకు దెబ్బ ఏదయినా తగిలిందేమో రేపు స్కాన్ చేయించి చూడాలి" జోగినాథం భార్యకు బహుమర్యాద నిండిన కంఠంతో చెపుతున్నాడు అక్కడ డ్యూటీలో వున్న డాక్టర్.

"నాన్నా... ఒకసారి చూడు నాన్నా.. అమ్మ వచ్చింది కళ్ళు తెరువ్ నాన్నా..." ఏడుపు కంఠంతో తండ్రిని పిలుస్తున్న జోగినాథం పెద్ద కూతురి భుజం మీద చేయివేసి, తను కూడా కన్నీళ్ళు పెట్టుకుంది రంగమ్మ.

అందరికంటె వెనుకగా వచ్చిన పాండు కళ్ళు కూడా చెమ్మగిల్లటాన్ని గమనించి, అతన్ని కాస్తంత క్రూరంగానే మందలించింది వృద్ధురాలు.

"తలకి దెబ్బ తగలేదని చెప్పకుండా బొమ్మలా నిలబడి ఆడదానిలా అలా కళ్ళనీళ్ళు పెట్టుకుంటావేమిటి? అక్కడ జరిగిందేమిటో చెప్పు" అంటూ ఆదేశించింది.

ఆశ్చర్యంగా ఆమె వంక చూశాడు పాండు. ఏదో అనటానికి నోరు తెరిచాడు.

అంతలోనే అతన్ని గురించి మరిచిపోయినట్టు, “ప్రశాంతంగా పడుకోవాల్సిన మనిషి చుట్టూ చేరి కాకుల మాదిరి రొదచేయకండి. కాస్సేపు బయట నిలబడండి. డాక్టరుగారిని పరీక్ష చేయనీయండి” అని అందరితోను అన్నది వృద్ధురాలు.

ముంచుకొచ్చేసింది కోపం రంగమ్మకి. “ఎందుకులే అని ఊరుకుంటుంటే నీ వాగుడు అధికం అయిపోతోంది. నువ్వే బయటికి పో... వెళ్ళు” అని ఆమె మీద విరుచుకుపడుతుండగా, “నిజమే... మీరు కాస్సేపు బయట నిలబడండి... వెళ్ళండి” అని సడన్‌గా అన్నారు డాక్టరు.

అతనివంకా, వృద్ధురాలివంకా కోపంగా చూస్తూ జోగినాథం కూతుళ్ళని, భార్యని పొదవిపట్టుకుని నెమ్మదిగా గది బైటికి నడిపించింది రంగమ్మ.

అలాగే అక్కడ కదలకుండా నిలబడి వున్న పాండు వంక కూడా కొంచెం కోపంగా చూసి, “బయట నిలబడమని నీకు బొట్టుపెట్టి ప్రత్యేకంగా చెప్పాలా?” అని అడిగాడు డాక్టరు. అంతటితో ఆగకుండా, అతని భుజంమీద చేయివేసి తనే స్వయంగా గుమ్మం దగ్గరికి నడిపించాడు.

“బైటికి వచ్చేయ్ మామ్మా... నువ్వు కూడా వచ్చేయ్....” అంటూ మామ్మని తను పిలిచాడు.

అతని మాటలు తనకు వినిపించనట్టు అలాగే గదిలో వుండి పోయిందా వృద్ధురాలు. పాండుని బయటికి పంపించి వెనుతిరగబోతున్న డాక్టర్ ఎదుటే, నేలను బలంగా తన్ని, తన్నిన చోటి నుంచి చిటికెడు ధూళిని తీసి అతని కుడిచేతి చూపుడువేలికి రాసింది ఆమె.

"అతని ముఖం మీద బొట్టుగా పెట్టు. ఈ ముసలి మామ్మ ఈ చుట్టు పట్ల తచ్చట్లాడుతూ వున్నంతవరకూ అతని ప్రాణాలకు ఎటువంటి ప్రమాదమూ ఎదురుపడదని ధైర్యం చెప్పు. త్వరగా...." తన చర్యలు, తన మాటలు గది వెలుపల నిలబడిన రంగమ్మకుగాని, పాండుకుగాని తెలియకుండా జాగ్రత్త పడుతూ చెప్పింది.

నిద్రలో కదిలినట్టు యాంత్రికంగా కదిలి, ఆ వృద్ధురాలు తన చూపుడు వేలికి రాసిన ధూళిని జోగినాథం కనుబోమల మధ్య బొట్టుగా పెట్టాడు డాక్టరు.

"ముసలిమామ్మ చెపుతోంది. నీకు ఎటువంటి ప్రమాదమూ రాదుట... త్వరగా కళ్ళు తెరువ్..." అతని చెవి దగ్గర నోరు పెట్టి చాలా నెమ్మదిగా అన్నాడు.

"బయటికి రమ్మని అంటుంటే వినిపించుకోకుండా లోపల ఏం చేస్తున్నావే ముసలిదానా? త్వరగా బయటికి రా...." కోపంగా అంటూ రెండు అడుగులు ముందుకు వేసింది గది వెలుపల వున్న రంగమ్మ.

"అతనికి మెలకువ వస్తున్నట్టుందే తల్లీ. అందుకే చూస్తున్నా" గారపట్టిన దంతాలన్నీ కనిపించేలా నిండుగా నవ్వుతూ ఆమెతో అన్నది వృద్ధురాలు.

“మెలకువ వస్తోందా... బాబాయికి మెలకువ వచ్చేస్తోందా?” ఆశ్చర్యం, ఆనందం కలగలిపిన కంఠంతో అడుగుతూ గదిలోకి వచ్చేసింది రంగమ్మ. ఆమె వెనుకే జోగినాథం భార్య వచ్చేసింది. ఆమె బిడ్డలు వచ్చేశారు. ఈసారి డాక్టరు గనుక భుజంమీద చేయివేస్తే ఐసాపైసా అక్కడికక్కడే తేల్చుకోవాలని స్థిరనిశ్చయం చేసుకుంటూ తను కూడా ఎంటర్ అయినాడు పాండు.

అతను, రంగమ్మ, జోగినాథం భార్య, ఆమె బిడ్డలు, అంతవరకూ మామ్మ చెప్పినట్టు చేసిన డాక్టరు, అందరూ చూస్తుండగా, చిన్నగా కదిలి, “దాహం, దాహం....” అంటూ కళ్ళు తెరిచాడు జోగినాథం. ఆనందం అధికం అయ్యేసరికి దుఃఖం ముంచుకువచ్చేసింది జోగినాథం భార్యాబిడ్డలకి. అతను పడుకుని వున్న బెడ్ దగ్గిరే చతికిలబడి బావురుమన్నారు వాళ్ళు ఒక్కసారిగా.

“బాబాయ్.... ఇప్పుడు ఎలా వుంది? మమ్మల్ని ఎంత ఖంగారుపెట్టేశావో తెలుసా?” కన్నీటిని తుడుచుకోవటానికి ప్రయత్నిస్తూ సంతోషంగా పలకరించింది రంగమ్మ.

“ఏడవకండి.... ఇప్పుడు నాకేమయిందని మీరంతా అలా గోల చేస్తున్నారు? నాకు బాగానే వుంది.....” ఎడమచేతిని జాచి భార్య తలను, బిడ్డల బుగ్గల్ని స్పృశిస్తూ జీరపడిన కంఠంతో అన్నాడు జోగినాథం.

“దాహంగా వుందని అంటుంటే అలా బొమ్మరాయిలా నిలబడి పిచ్చిచూపులు చూస్తావేమిటిరా? నీళ్ళు తీసుకురా...” అంటూ పాండును కసురుకున్నాడు.

“ఓరినీ... తెలివి వచ్చేసరికి ముట్టెపొగరు కూడా దానంతట అదే వచ్చేసింది. అప్పుడే నీ పోలీస్ అరుపులు మొదలుపెట్టేశావ్...” అంటూ అక్కడ నిలబడి వున్న డాక్టరువంక ప్రశ్నార్థకంగా చూశాడు పాండు.

“మామూలు నీళ్ళు వద్దు... మినరల్ వాటర్ తీసుకురా వెళ్ళు.” తను కూడా జోగినాథం వంక ఆశ్చర్యంగా చూస్తూ పాండుకి ఆర్డర్ ఇచ్చాడు డాక్టర్.

రెండు అంగల్లో గదిలో నుంచి బైటికొచ్చాడు పాండు. పది అంగల్లో బిల్డింగ్ లో నుంచి బయటపడ్డాడు.

ఎప్పుడు వచ్చిందోగాని, వారెవరికీ తెలియకుండా తనుకూడ ఇవతలికి వచ్చి, హాస్పిటల్ గేటు దగ్గరికి అడుగులు వేస్తోంది పిచ్చి మామ్మ. ఆమెను చూసిన వెంటనే చటుక్కున ఆగిపోయాడు అతను.

“అవును మామ్మా.... నాకు, జోగినాథానికి తప్ప అసలు సూది గుట్టల్లో ఏం జరిగిందో ఎవరికి తెలియదు.... నీకు ఆ విషయం” అంటూ మాటలు మొదలుపెట్టబోతుండగా, “నీళ్ళు కావాలని అన్నాడు... నీళ్ళకోసం నువ్వు వచ్చావ్... వచ్చిన పనిని వదిలేసి కబుర్లుతో కాలక్షేపం ఎందుకు చేస్తావ్?” కోపంగా చూస్తూ అన్నదామె.

“అవును కదూ... ఆ సంగతే మర్చిపోయా... నువ్వు ఇక్కడే వుండు. నీళ్ళు ఇచ్చి వెంటనే వచ్చేస్తా” అంటూ ఇంకో ఇరవై అంగల్లో హాస్పిటల్ గేటును క్రాస్ చేసి, రోడ్డుమీద వున్న బడ్డీకొట్టులో రెండు వాటర్ బాటల్స్‌ని ఖరీదు చేశాడు

పాండు. వచ్చినదానికంటే రెట్టింపు వేగంతో లోపలికి పోయి, జోగినాథం భార్య చేతికి ఇచ్చాడు.

ఆత్రంగా ఆరు గుటకల నీళ్ళు తాగి హాయిగా నిట్టూర్చాడు జోగినాథం. "ఒరేయ్ పాండు.... ఇప్పుడు నాకు ఏ బాధలేదు... హాయిగానే వుంది. ఇక్కడినించి ఇంటికి పోయిన తర్వాత నీతో మాట్లాడాలి... మర్చిపోకుండా ఒకసారి వచ్చి కనిపించు" అని పాండుకు చెప్పాడు.

"మీరందరూ బయటికి పోతే సూపర్నెంటుగారిని పిలిచి ఇతని పొజిషన్‌ని చూపించాలి. బైటికిపోయి నిలబడండి" అంటూ వారిని హెచ్చరించి, వాళ్ళ సమాధానం కోసం ఎదురు చూడకుండా గదిలోనుంచి బైటికి వెళ్ళిపోయాడు డాక్టర్.

"అరేయ్... ఈ హాస్పటల్ సూపర్నెంట్ మహా ముదురు... ఎదుట వున్నది ఎంతటివాడైనా తేలికగా మాట తూలుతాడు... కాస్సేపు బయట నిలబడండి. ఆళ్ళతో మనకి తగాదాలు వద్దు. వెళ్ళండి" తన భార్య చేతిని ఆసరాగా తీసుకుని మంచంమీద లేచి కూర్చుంటూ పాండుకి చెప్పాడు జోగినాథం.

"పిన్ని ఇక్కడే వుంటుంది. మేం బయట నిలబడతాం" అంటూ అతని భార్యను గదిలో వదిలి, అతని బిడ్డలతో తను గదిలో నుంచి బయటికి వచ్చింది రంగమ్మ.

"నేను మా ఎస్సయ్ సాబ్‌కి ఫోన్ చేసి వస్తా... నువ్వు ఇక్కడే వుండు" అంటూ పాండుని తన స్థానంలో నిలబెట్టి బిల్డింగ్ బయటికి పరుగు తీశాడు

సెంట్రీ డ్యూటీ చేస్తున్న కానిస్టేబిల్. రంగమ్మ, పాండు చూస్తూండగానే పెద్దపెద్ద అడుగులు వేస్తూ ఆ గది దగ్గరకు వచ్చాడు సూపర్నెంటు. "ఆశ్చర్యంగా వుంది... మెదడుకు తగిలిన షాక్ తన భార్యాబిడ్డల్ని చూడకపోయినా, వాళ్ళ మాటలు చెవులపడగానే తనంతట తనే సర్దుబాటు చేసుకుని వుంటుంది... హీ ఈజ్ క్వయిట్ ఆల్ రైట్ నౌ. రేపు డిశ్చార్జి చేయవచ్చు" స్టెతస్కోపుతో పదినిముషాలపాటు పరిశీలించి, కళ్ళను, పెదవుల్ని, నాలుకనీ రకరకాలుగా పరీక్షించి నెమ్మదిగా తన అభిప్రాయాన్ని వెల్లడించాడతను.

"అంతా మీ చేతిచలువ అయ్యగారూ..." కృతజ్ఞతాపూర్వకంగా చూస్తూ ఆయనతో అన్నాడు జోగినాథం.

"నో.... నో.... నువ్వు థాంక్స్ చెప్పవలసింది నాకు కాదు. నిన్ను తీసుకువచ్చిన క్షణం నుంచీ ఇక్కడే వుండి నీకు ట్రీట్‌మెంట్ ఇచ్చిన ఈ డాక్టరుగారికి చెప్పుకో...." అంటూ అతన్ని ఎటెండ్ అయిన డాక్టరు భుజంమీద చేయివేస్తూ అన్నాడు హాస్పిటల్ సూపర్నెంటు.

జోగినాథం, అతని భార్య చూపించడం మొదలుపెట్టిన కృతజ్ఞతను భరించటం అసాధ్యమైపోయింది కాబోలు, "నాదేముంది? నాకు చేతనయింది నేను చేశాను. నీ తలరాత తిన్నగా వుండబట్టి వెంటనే తెలివి వచ్చింది. నా గొప్పతనం ఏమీలేదు" అంటూ సూపర్నెంట్ వెనకాలే తను కూడా వెళ్ళిపోయాడతను.

"నీకు ఇంకేమైనా కావాలంటే చెప్పు.... తెచ్చిస్తాను" జోగినాథంతో అన్నాడు పాండు.

"జేబులో డబ్బులు ఏమీ లేవురా... నాలుగొందలు ఇచ్చి వెళ్ళు. ఇప్పుడు ఇంకేమీ అవసరం లేదు...." వెంటనే సమాధానం ఇచ్చాడు జోగినాథం.

ప్యాంటు జేబులోనుంచి నాలుగు నోట్లను తీసి అతనికిచ్చాడు పాండు. "మేము వెళ్ళివస్తాం పిన్నీ... అవసరమైతే కబురుపెట్టు... మళ్ళీ రేపు ఉదయం వస్తాం..." అంటూ అతని భార్యకుచెప్పి, బిల్డింగ్ లో నుంచి బైటికొచ్చాడు పాండు. జోగినాథం బిడ్డల్ని లోపలికి పంపి, అతనితోపాటు గేటువైపు అడుగులేసింది రంగమ్మ.

గేటును క్రాస్ చేస్తుండగా గుర్తుకు వచ్చింది కాబోలు, "మామ్మా... మన పిచ్చి మామ్మ ఏది? ఏమయింది?" అని అడిగింది చుట్టూ చూస్తూ. వాటర్ బాటిల్స్ కోసం వచ్చినప్పుడు ఆమెను అక్కడే వుండమని చెప్పినట్లు గుర్తుకు వచ్చి, తనూ చుట్టూ చూశాడు పాండు.

అక్కడ వందగజాల దూరంలో వున్న ఒక వినాయకుడి గుడికేసి చూసి, "అదిగో... అక్కడ వుంది... అదిగో..." అన్నది రంగమ్మ. సైకిల్ స్టాండ్‌లో పెట్టిన తన హంబర్ సైకిల్ మీద ఆమెను ఎక్కించుకుని అర్జంటుగా ఆ గుడి దగ్గరికి తీసుకుపోయాడు పాండు.

"ఏంటి మామ్మా... ఇక్కడ ఏం చేస్తున్నావ్ నువ్వు?" సైకిల్ దిగి మామ్మ దగ్గరికి పోతూ అడిగింది రంగమ్మ.

వినాయకుడి గుడిపక్కన వున్న ఒక చెత్తకుండీ... ఆ కుండీ పక్కన పడివున్న చెత్తలో నుంచి ఏవో పేపర్ ప్లేట్లు, డిస్పోజబుల్ సామగ్రిని బయటికి తీసి

పరీక్షా చూస్తోంది పిచ్చి మామ్మ. "నా తల్లి ఇక్కడ దాక్కుని వున్నదేమో వెతుకుతున్నానే తల్లీ...." దంతాలన్నీ కనిపించేటట్లు నవ్వుతూ చెప్పింది రంగమ్మకి.

"ఓరినీ పిచ్చి దొంగలు తోలా... ఇదెక్కడి గొడవే? అడుక్కు తినేవాళ్ళ మాదిరి చెత్తకుండీల దగ్గర వెతుకులాడటం ఏమిటే? రా ఇవతలికి..." అంటూ చేయిపట్టుకుని ఆమెను బరబరా ఇవతలికి లాగింది రంగమ్మ.

"స్నానం చేసి ఎన్ని రోజులు అయిందో, ఇంటికి తీసుకువచ్చి ఎండుగడ్డితో ఒళ్ళంతా గీకిపారేయ్... ఆమె శరీరం నుంచి వచ్చే వాసన భరించటం చేతకావడంలేదు" సైకిల్ ని పట్టుకుని నిలబడి వున్న పాండు వెంటనే అన్నాడు.

"నిన్నకాక మొన్న పుట్టినవాడివి నువ్వు. నాకు స్నానం చేయించమని చెపుతావా? పోరా – పోపో...." అని కోపంగా అంటూ రంగమ్మ చేతిని విసురుగా విదిలించికొట్టి అవతలికి అడుగువేసింది మామ్మ.

"దీనికి తీక్కరేగింది. తిక్కేరేగితే మళ్ళీ ఏదో ఎదవపని చేసి అందరితో దెబ్బలు తింటుంది.... వదిలిపెట్టకూడదు పాండూ... మన వెంట తీసుకుపోవాల్సిందే" అంటూ పరిగెత్తుతున్నట్టు పది అడుగులు వేసి, దూరంగా పోతున్న వృద్ధురాలిని మళ్ళీ పట్టుకున్నది రంగమ్మ.

"ఎనకాల కూర్చోవటం చేతకాదు... ముందు కూర్చోబెట్టుకో" అంటూ ఆమెను బలవంతంగా సైకిల్ ముందు కూర్చోబెట్టి, తను క్యారేజి మీద సెటిలయింది.

అది పాతకాలం నాటి బండి కాబట్టి ఆ బరువును భరించగలిగింది. భారంగా తొక్కుతూ మురికివాడవైపు వీరిద్దరినీ తీసుకుపోయాడు పాండు.

***

అంతకుముందు రోజు గోపాలం తీసుకువచ్చిన బియ్యంతో అన్నం వండుకుని మధ్యాహ్నం వరకూ ఎదురుచూసి ఒంటరిగా ఆరగించింది వెంకటమ్మ. సూర్యుడు పడమటి దిశకు వాలిన తర్వాత కూడా వాళ్ళెవరూ రాకపోవడంతో అధికమైంది ఆమె ఆందోళన.

'అసలు అడవిలో నుంచి వచ్చారో లేదో... వచ్చి నా కోసం వెదుకుతూ ఎక్కడికయినా పోయారేమో!' అని తనలో తాను అనుకుంటూ ఓపికగా సాయంత్రం వరకూ వెయిట్ చేసింది. చీకటిపడే సూచనలు కనిపించే టైము దగ్గరికి వచ్చేసిన తర్వాత కూడా ఎవరూ కనిపించకపోయే సరికి స్టార్ట్ అయింది ఆమెకు గుండెదడ.

కొండలమ్మ తల్లిని చూసి మాయమయిపోయిన పొట్టి పిశాచం తిరిగి తన ఎదుట ప్రత్యక్షమయితే?

ఆ మాట మనసులో మెదిలేసరికి వెంకటమ్మకి పిచ్చిపట్టినంత పని అయింది.. తమ ట్రంకుపెట్టెని, గోనెసంచీని, పాత సామగ్రని ఒక దుప్పటిలో చుట్టచుట్టి మర్రిచెట్టు వెనుక భాగానికి ఆనించింది.

'గురువుగారికి కోపం వచ్చినా సరే... గోపాలం నన్ను నోటికి వచ్చినట్టు తిట్టినా సరే... ఇంకొక్క క్షణం కూడా నేను ఇక్కడ వుండను. ఊళ్ళోకి పోయి

ఎక్కడో ఒక చోట తెల్లారేవరకూ తలదాచుకుంటాను' అని అనుకుంటూ గ్రామంవైపు బయలుదేరింది వెంకటమ్మ.

పది అడుగులే వేసింది ఆమె. పదకొండో అడుగు వేయబోతుండగా, రోడ్డుపక్కనే వున్న పొదలలో నుండి ఆమెను పిలిచాడు ఒక ధృఢకాయుడు.

రోడ్డుమీదికి కనిపించని ప్రదేశంలో ఒక బండరాయిమీద హుందాగా కూర్చుని ఆమెకు అగుపించాడు భుజంగరాయుడు. లావుపాటి పోగచుట్టను నోటిలో పెట్టుకుని పొగ వదులుతూ, "మీ మగవాళ్ళను చూడటానికి ఆ దొరగారి దివాణం దగ్గరికి పోతున్నావా?" అని అడిగాడు. ఆయన్నే దొర అని అనుకుంటున్న వెంకటమ్మకి, ఇంకో దొరగారు ఎవరో, ఆయన దివాణం దగ్గరికి తను వెళ్ళటం ఏమిటో అర్థం కాలేదు.

"అదికాదు అయ్యగారూ – అదీ... నేనూ..." అని తడుముకుంటూ ఆమె మాటలు మొదలుపెట్టేసరికి, చేయి ఎత్తి ఆపేశాడు భుజంగరాయుడు.

"మీరు ఈ ఊరికి కొత్త కావటంవల్ల నాకు, ఆ దొరకి మధ్య పగ వున్నట్టు తెలియదు. మీ మగవాళ్ళు ఇప్పుడు దివాణంలోనే వున్నారు. గడ్డం పెంచుకుని వున్న మనిషి పేరేమిటో నాకు తెలియదు. అతని తలకి తగిలిన దెబ్బకి ఆచారి వైద్యం చేస్తున్నాడు. ఇప్పుడు కాస్తంత నయంగానే వుందని, కళ్ళు తెరిచాడనీ నాకు తెలిసింది. కాబట్టి నువ్వు ఖంగారుపడాల్సిన పనిలేదు. నేను ఇక్కడికి ఎందుకొచ్చానో చెపుతాను..." అంటూ తన పక్కన నిలబడివున్న అనుచరుడివైపు చూశాడు భుజంగరాయుడు.

దివాణంలో వున్నది ఎవరో, తలకుదెబ్బ తగలటం ఏమిటో వెంకటమ్మకి కొంచెంగా కూడా తెలియలేదు. పెదవి విప్పి ఒక మాట కూడా మాట్లాడకుండా తలను మాత్రం ఊపి ఒక నమస్కారం చేసింది ఆమె.

భుజంగరాయుడు తనకేసి చూసిన మరుక్షణమే, ఆయన కూర్చుని వున్న బండరాయి చాటునుంచి ఒక గుడ్డమూటని తీసి వెంకటమ్మ పాదాల దగ్గర జాగ్రత్తగా పెట్టాడు ఆయన అనుచరుడు.

"మధ్యాహ్నం నుంచీ నువ్వు ఒంటరిగా వున్నట్టు, సత్తుపాత్రలో ఉడికీ ఉడకని అన్నాన్ని తిన్నట్టు నాకు తెలిసింది. ఆ మూటని తీసుకుపోయి దివాణం లోపల ఎవరికీ కనిపించని చోట్లో దాచిపెట్టు... నీ వాళ్ళ కోసం వెళుతున్నావు కాబట్టి ఈ మూటని చూసి ఎవరూ అనుమానపడరు. పదిక్షణాల పనికి నీకు రెండు వేలు యిస్తాను" అంటూ తన జేబులోనుంచి కొత్త కరెన్సీ నోట్ల పొతికని తీసి ముందుకు జాచాడు భుజంగరాయుడు.

"మా మగవాళ్ళు... వాళ్ళకి ఒకమాట చెప్పి...." తడబడుతున్న కంఠంతో వెంటనే అన్నది వెంకటమ్మ.

"ఎవరికీ చెప్పవద్దు... చెప్పాల్సినంత గొప్పపని కానేకాదు ఇది... ఈ డబ్బు నీది... నువ్వే హాయిగా ఖర్చుపెట్టుకోవచ్చు.... తీసుకో...." అంటూ తొందరచేశాడు ఆ పెద్దమనిషి.

తనకు తెలియకుండానే చేతుల్ని జాచి ఆ నోట్లను తీసుకున్నది వెంకటమ్మ. అంత డబ్బు ఒకేసారి ఎప్పుడూ చూసి వుండకపోవడంవల్ల, ఒక్కసారిగా మాయమైపోయింది ఆమె అనిశ్చిత పరిస్థితి.

“ఈ మూటలో ఏముంది అయ్యగారూ?” డబ్బుని జాకెట్‌లో దాచుకుని, మూటని తీసుకుంటూ అడిగింది.

“అది నీకనవసరం. అతి తెలివికిపోయి మూట విప్పినా, ఈ మాటలు ఎవరికైనా చెప్పినా నువ్వు, నీ మగవాళ్ళు ప్రాణాలతో ఈ పొలిమేరలు దాటి అవతలికి పోరు... తీసుకుపోయి దివాణంలో దాచిపెట్టు... ఆ తర్వాత దాన్ని గురించి మర్చిపో” కరుకు కంఠంతో చెప్పి బండరాయి మీదినుంచి లేచాడు భుజంగరాయుడు.

అంతవరకూ మృదువుగా మాట్లాడిన మనిషి ఒక్కసారిగా అలా హెచ్చరికలు చేసేసరికి బిత్తరపోయింది. తల వంచుకుని రోడ్డుమీదికి వచ్చేసింది.

***

సరిగ్గా చీకటిపడిన అరగంటకు దివాణం ముందు భాగంలోకి వచ్చి, గోపాలాన్ని పలుకరించాడు ఆచారి.

“ఎలా వుంది? ఏమని అంటున్నాడు?” అని.

“సాయంత్రమే తెలివి వచ్చింది. ఇప్పుడు ఆకలిగా వుందని అంటున్నారు” తన గురువుగారి పరిస్థితిని గురించి వెంటనే తెలియచెప్పాడు గోపాలం.

“బాగుంది... చిలకమ్మని అడిగితే బాగా కాచిన పాలు యిస్తుంది. వాటిని తాగించు... ఈ పూటకి అన్నంవద్దు. రేపు ఉదయం నేను వచ్చి చూస్తాను. అప్పుడు చెపుతాను” అంటూ తన మందుల సంచిని సవరించుకుంటూ మెయిన్ గేటుకేసి అడుగులు వేశాడు ఆచారి.

“ఆచారిగారూ... పేరు వెంకటమ్మట... దెబ్బతగిలి వచ్చినోళ్ళ మనిషట...” గేటుపక్కనే నిలబడి వున్న ఆడమనిషిని చూపిస్తూ చెప్పారు అక్కడ వున్న దృఢకాయులు.

“ఏమ్మా... నీకు ఏమవుతారు వాళ్ళు?” అని వెంకటమ్మని సాదరంగా అడిగాడు ఆచారి.

“గోపాలం నా మగమనిషి... రెండో ఆయన మాకు గురువుగారు...” తడుముకోకుండా చెప్పింది ఆ మనిషి.

“గోపాలం అంటే ఆ కుర్రాడు... అతన్ని పిలిచి ఈమెను చూపించండి...” అంటూ దృఢకాయులకు చెప్పి తన ఇంటికేసి వెళ్ళిపోయాడు ఆచారి.

పరుగు పరుగున లోపలికిపోయి పదిక్షణాల తర్వాత గోపాలాన్ని వెంటబెట్టుకొచ్చాడు ఓ దృఢకాయుడు.

“వెంకటమ్మా... నువ్వా... రాత్రి నువ్వు కనిపించకపోయేసరికి ఎంత గాబరాపడ్డానో తెలుసా?” ఆశ్చర్యం, ఆనందం కలగలిసిన కంఠంతో బిగ్గరగా అనబోయి, ఆఖరి క్షణంలో గొంతును తగ్గిస్తూ అన్నాడు గోపాలం.

“ఈమె మా మనిషే.. మా గురువుగారు తెలివి వచ్చిన దగ్గర్నించీ ఈమెను గురించే అడుగుతున్నాడు. లోపలికి తీసుకుపోతాను...” అంటూ దృఢకాయులకు చెప్పి, వెంకటమ్మని గేటు దాటించాడు గోపాలం.

“నా మానాన నన్ను వదిలి నీ దారిన నువ్వు పోయావు. నా తల రాత తిన్నగా వుండబట్టి ప్రాణాలతో బయటపడ్డాను... లేకపోతే నీకు నా ఎముకలు కూడా కనిపించి వుండేవి కావు....” నిష్ఠూరంగా అంటూ అతన్ని అనుసరించిందామె. అవుట్ హౌస్ కి కాస్త ఇవతలగా ఆగి, “నువ్వు ఆ చిన్నపెట్టెని తెరిచావా?” చిన్న కంఠంతో అడిగాడు గోపాలం.

అవునని తల ఊపింది వెంకటమ్మ.

“అందులో నువ్వు అనుకుంటున్నట్టు డబ్బుగాని, నగలుగాని వుంటే, వాటిని తీసుకుని ఇద్దరమూ లేచిపోవచ్చని ఆశపడ్డాను. అందులో ఏముందో తెలుసా?” బిక్కమొగంతో చెప్పి ఏడ్వడం మొదలుపెట్టింది.

అన్ని విషయాలు ఆమె నోటివెంట వినాలని ఎంత కోరికగా వున్నా, ఆ పని చేయలేకపోయాడు గోపాలం. అవుట్ హౌస్ నుంచి గురువుగారు అతన్ని పిలవడమే అందుకు కారణం.

“ఈయనకు దెబ్బ తగలటం ఏమోగాని, క్షణం కూడా నన్ను వదలటం లేదు. ఆలస్యం చేస్తే పెద్దగా అరుస్తాడు” అంటూ అడుగు ముందుకు వేయబోయి “చిన్న పెట్టెని నువ్వే తెరిచినట్టు ఆయనకి తెలియనీకు. అవతలికి పోయిన టైములో దారెమ్మట వెళ్ళేవాళ్ళు తెరిచారని చెప్పు.... భయమేసి దూరంగా పారిపోయి, దారి

తప్పినట్టు నమ్మించు” అని చెప్పాడు. ఆమె తల ఊపగానే చేయిపట్టుకుని లోపలికి తీసుకెళ్ళాడు.

“గోపాలం... ఆకలిగా వుంది. పాలు తెచ్చిపెడతానని చెప్పావ్....” అతన్ని చూడగానే గుర్తుచేశాడు గురువుగారు.

వెంకటమ్మని చూడగానే కొద్దిగా వికసించింది ఆయన వదనం. చిన్నపెట్టెను గురించి చెప్పటానికి నోరు తెరిచిందామె.. “తర్వాత మాట్లాడుకుందాం. ఇక్కడ వుండగా ఆ విషయాలు వద్దు” అని ద్వారంకేసి చూస్తూ హడావుడిగా ఆమెను వారించాడు ఆయన.

గుండె మీదినించి కొండంత బరువు దిగిపోయినట్టు నిట్టూరుస్తూ గోపాలం కేసి చూసింది వెంకటమ్మ.

“దివాణంలో చిలకమ్మ అనే ఒకమ్మాయి వుంటుంది. గురువుగారికి పాలు ఇస్తానని చెప్పింది. వెళ్ళి తీసుకురా” ఆమెకు చెప్పాడు గోపాలం.

అలాగేనని తలఊపి అవుట్‌హౌస్‌లో నుంచి బయటికి వచ్చింది వెంకటమ్మ. మెయిన్ బిల్డింగ్ లోకి ఎంటర్ అవబోతుండగా ఆమెకు కనిపించింది చిలకమ్మ. తను ఎవరో, ఎందుకు వచ్చిందో తెలియచేసింది వెంకటమ్మ.

“ఒక నిముషం ఆగు... ఇప్పుడే తెచ్చిస్తాను” అంటూ వెనుక భాగంలో వున్న కిచెన్ వైపు వెళ్ళింది చిలకమ్మ.

చేతిలో వుండిపోయిన మూటని చటుక్కున తలుపుల చాటుకు నెట్టాలని అనుకుంది వెంకటమ్మ. అంతలోనే లోపలి గదులలో నుంచి హాల్లోకి వచ్చాడు దొరగారు.

ఆయన ఎవరో తెలియకపోయినా, ఆకర్షణీయమైన రూపాన్ని, ఆయన ముఖంలోని గంభీరత్వాన్ని గమనించి అప్రయత్నంగా చేతులు జోడించిందామె.

"ఆ మందులోళ్ళ మనిషి దొరగారూ... ఇంతకుముందే వచ్చిందట..." లోపలి నుంచి పాలు తీసుకువస్తూ చెప్పింది చిలకమ్మ. చిలకమ్మ ఇచ్చిన పాలచెంబును, గ్లాసును తీసుకుని వెనుతిరిగింది. వెంకటమ్మ. తన దగ్గిరేవున్న మూటని ఎలా వదిలించుకోవాలో ఆలోచిస్తూ అవుట్‌హౌస్‌లోకి వెళ్ళిపోయింది వెంకటమ్మ.

ఆకలి చాలా అధికంగానే వున్నది కాబోలు, ఆవురావురుమంటూ పాలు తాగేశాడు గురువుగారు, కడుపు నిండగానే నిద్ర ముందుకొచ్చింది.

"నేను పడుకుంటాను" అంటూ ప్రక్కకు తిరిగి నిద్రలోకి జారిపోయారు.

"ఎనిమిదింటికి అన్నం పెడతానని చిలకమ్మ చెప్పింది. అంత వరకూ బైట కూర్చుని మాట్లాడుకొందాం" అంటూ వెంకటమ్మ చేయిపట్టుకుని అవుట్‌హౌస్ ముందు భాగంలోకి దారి తీయబోయాడు గోపాలం.

సరిగ్గా అప్పుడు అతని దృష్టిలోకి వచ్చింది ఆమె వెంటబెట్టుకు తిరుగుతున్న గుడ్డమూట.

"ఇదేమిటి?" అని అతను ప్రశ్నించకముందే, "దీన్ని నాకు భుజంగరాయుడు యిచ్చాడు. ఎవరికీ తెలియకుండా ఈ దివాణంలో ఎక్కడో ఒకచోట దాచిపెట్టమన్నాడు" అంటూ ఊరి వెలుపల జరిగిందేమిటో అతనికి చెప్పింది వెంకటమ్మ. భుజంగరాయుడు తనకు బహూకరించిన కరెన్సీ నోట్లను కూడా తీసి అతనికి చూపింది.

అప్పణంగా వచ్చిపడిన ఆ సోమ్మును చూసి ఆనందంగా తల ఊపినా, సొమ్ముతోపాటుగా అప్పచెప్పబటిన మూటను తలుచుకునేసరికి ఒక్కసారిగా కళ తప్పింది గోపాలం ముఖం. "ఇందులో ఏదో తిరకాసు వుండే వుంటుంది. మనం ఇక్కడ వుండగా ఏదయినా పొరపాటు జరిగితే దొరగారితోపాటు మనం కూడా గల్లంతైపోతాం" ఖంగారునిండిన కంఠంతో చెప్పాడతను.

"ఏదో జరగాలనే ఆయన దీన్ని నాకు అంటగట్టాడు. ఏదీ జరగకపోతే మనల్ని వదిలిపెట్టడు. వేటకత్తులతో మేకల్ని నరికినట్టు నరికించేస్తాడు" అన్నదామె.

"ఆ మాట అక్షరాలా నిజం... ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్నట్టు తయారైంది మన పరిస్థితి. ఇప్పుడు ఏదో ఒకటి వెంటనే చేసేయాలి. ఆలస్యం చేయకూడదు" అంటూ ఆ మూటని తను తీసుకున్నాడు గోపాలం.

"చిలకమ్మ అడిగితే జాగ్రత్తగా సమాధానం చెప్పు... నేను దీన్ని వదిలించుకు వస్తాను..." అని చెప్పి, మూటతో సహా అవుట్‌హౌస్ వెలుపలికి పోయాడు.

అదే సమయంలో మెయిన్ గేటును దాటి లోపలికి వచ్చారు దొరగారి పాలేర్లు నలుగురు. పెద్ద పెద్ద వెదురు బుట్టల్ని మోసుకువస్తున్నారు వాళ్ళు.

"ఏం మందులాయనా? ఎలా వుంది మీ గురువుగారికి? మెలకువ వచ్చిందా?" గోపాలాన్ని చూసి చనువుగా పలకరించాడు వారిలో ఒకతను.

తన దగ్గర వున్న మూట అతనికి కనిపించకుండా జాగ్రత్తలు తీసుకుంటూ తల ఊపాడు గోపాలం. అతను చూస్తుండగానే మోసుకువచ్చిన బుట్టల్ని మెయిన్ బిల్డింగ్ ముందు కిందికి దించారు పాలేర్లు.

రత్తాలుకి చెప్పి వెళ్ళిపోదాం... మళ్ళీ తెల్లారకముందే సిద్ధంగా వుండాలి. అని తమలో తాము అనుకుంటూ వారందరూ బిల్డింగ్ వెనుక భాగంలోకి వెళ్ళిపోయారు.

కుతూహలం అధికమయిపోవటం వల్ల, ముందుకుపోయి ఆ వెదురు బుట్టల వంక పరిశీలనగా చూశాడు గోపాలం. బూడిద గుమ్మడికాయలు వున్నాయి ఒక బుట్టలో. దొరగారి పళ్ళ తోటల్లో పండాయి కాబోలు రకరకాల పళ్ళు ఫలాలు కనిపిస్తున్నాయి మిగిలినవాటిలో.

మెరుపులాంటి ఆలోచన అప్పటికప్పుడు మనసులో అడుగుపెట్టే సరికి, తన దగ్గర వున్న మూటని ఒక బుట్టలోకి నెట్టేశాడు గోపాలం. తన చర్యల్ని ఎవరూ గమనించలేదని నిశ్చయపరుచుకుని అవుట్ హౌస్‌లోకి వచ్చాడు.

గుమ్మం దగ్గిరే నిలబడి అతను చేసిన పనిని స్పష్టంగా చూసింది వెంకటమ్మ. “నువ్వు చేసింది బాగోలేదు. ఆ బుట్టలు ఎవరివో, ఎందుకు ఇక్కడికి వచ్చాయో తెలుసుకోకుండా....” అంటూ సణుగుడు మొదలెట్టింది.

“అవి ఇక్కడికి ఎందుకు వచ్చాయో నాకు తెలుసు” వెంకటమ్మ వైపు చూస్తూ అన్నాడు గోపాలం.

“ఎందుకొచ్చాయి?” అమాయకంగా అడిగిందామె.

గురువుగారు గాఢ నిద్రలోనే వున్నట్టు ఇంకోసారి నిశ్చయం చేసుకుని, ఆమెను గట్టిగా కౌగిలించుకున్నాడు గోపాలం. “ఆగు... ఎవరైనా చూస్తే అల్లరిపాలయిపోతాం. ఆగు...” అతన్ని అవతలికి నెట్టటానికి ప్రయత్నం చేస్తూ అన్నదామె. ఆగలేదతను.... శబ్దం అవుతున్నా లక్ష్యపెట్టకుండా పదే పదే పెదవుల్ని ముద్దాడాడు.

అతని చర్యలు తనకు అమితమయిన సంతోషాన్ని, అదోరకమైన హాయిని కలుగచేస్తున్నా, అడ్డుకోకుండా వుండలేకపోయింది వెంకటమ్మ.

“అన్నం తిన్న తర్వాత మనల్ని గురించి పట్టించుకునే వాళ్ళు ఎవరూ వుండరు. అప్పుడు నువ్వు ఏం చేసినా నాకు అభ్యంతరం వుండదు. చిలకమ్మ చూసినా, గురువుగారు లేచినా నిందలు పడిపోతాం. కాస్తంత తమాయించుకో” అంటూ తను కూడా ముద్దు పెట్టుకుని, బలవంతంగా అవతలికి నెట్టేసింది. పదిమైళ్ళ దూరం ఆగకుండా పరిగెత్తినట్లు గట్టిగా ఊపిరి పీలుస్తూ మరోసారి అవుట్‌హౌస్ వెలుపలికి పోయాడు గోపాలం.

బిల్డింగ్ వెనుక భాగంలోకి పోయిన పాలేర్లు వెనక్కి వస్తున్నారు. "రావయ్యా. మందులాయనా... వచ్చి కాస్త సాయం పట్టు....." బిల్డింగ్ ముందు దించిన బుట్టల్ని తిరిగి తన సహచరుల తలలకు ఎత్తి, తన వంతు బుట్టని పైకెత్తటానికి సహాయాన్ని కోరాడు అంతకుముందు అతన్ని పలకరించిన పాలేరు.

"ఎక్కడికి తీసుకుపోతున్నారు వీటిని? ఇక్కడ వుంచటం లేదు?" అతని దగ్గరికిపోతూ అడుగాడు గోపాలం.

"ఇక్కడే వుంచాలనుకున్నాం. కాని రత్తాలు ఊరుకోలేదు. కొండలమ్మ తల్లి దగ్గరికి ఇప్పటికిప్పుడు పంపించమని చెప్పింది. రానుపోను మూడు గంటలు పడుతుంది. ఇవ్వాళిక నిద్రకు సెలవివ్వాల్సిందే. సుతిమతి లేని మాటలు మాట్లాడుతూ వుంటుంది రత్తాలు ఒక్కోసారి...."

"కొండలమ్మతల్లి దగ్గిరికా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును. కొండలమ్మ తల్లి దగ్గిరికే, పెద్దయ్యకి ప్రమాదం తప్పినందుకు రేపు ఉదయం ఘనంగా పూజలు చేయిస్తున్నారు దొరగారు. ఈ పళ్ళు, ఫలాలు, గుమ్మడికాయలు అన్నీ అందుకోసమే తీసుకొచ్చాం. ఆ తల్లికి మాంసం కంటే ఇవే ఎక్కువ ఇష్టం. రేపు నువ్వే చూద్దువుగాని" అంటూ గేటువైపు బైల్దేరాడు ఆ పాలేరు.

తను వదిలించుకున్న గుడ్డమూట అతను తలకు ఎత్తుకున్న బుట్టలోనే వుండటంవల్ల, వెనుతిరిగి అవుట్ హౌస్ లోకి వెళ్ళిపోలేదు గోపాలం. అతని వెనుకే గేటు దగ్గరికిపోయాడు. బలంగ వున్న ఎడ్లు కట్టిన బండిని ఒకదాన్ని గేటు ముందుకు తీసుకువచ్చాడు. అక్కడవున్న వ్యక్తుల్లో ఒకతను. బుట్టల్ని ఆ బండి

మీదికి చేర్చటంలో సహాయపడ్డాడు. మొదటి మూడు బుట్టల్ని ఎక్కించగానే, నాలుగో బుట్ట మిగిలివున్నదనే మాటను మరిచిపోయి ఎడ్లను అదిలించాడు బండిని నడిపే మనిషి.

“అరెరె... ఆపు... బండిని ఆపు....” ఆందోళన నిండిన కంఠంతో బిగ్గరగా అరిచాడు గోపాలంతో మాట్లాడిన పాలేరు. తన తలమీది బుట్టని బండి చివరి భాగంలోకి ఎక్కించి, బలంగా ముందుకు నెడుతున్నాడు అతను. అనుకోని విధంగా బండి కదలటంతో అతని చేతుల్లో నుంచి జారికింద పడిపోయిందా బుట్ట.

కొండరాళ్ళు పడినట్లు వీధిలో పడిపోయాయి ఆ బుట్టలో వున్న బూడిద గుమ్మడికాయలు, గునగునా దొర్లుకుంటూపోయి పక్కనే వున్నటువంటి మురుగు కాలువలో మునకలు వేశాయి వాటిలో కొన్ని.

విస్ఫారిత నేత్రాలతో చూస్తున్నాడు గోపాలం. బుట్ట అడుగు భాగంలోకి అతను నెట్టినటువంటి గుడ్డమూట కూడా బూడిద గుమ్మడికాయల మాదిరిగానే దొర్లి దొర్లి మురుగు కాలువలో మునిగిపోయింది.

“కిందపడిపోయిన కాయల్ని ముట్టుకోకండి... వదిలేయండి. చేను దగ్గరికి పోయి కొత్త కాయలు కోసుకుని తీసుకుపొండి..” తను చెప్పక ముందే బండిని కదిలించిన వ్యక్తిని నోటికి వచ్చినట్టు తిడుతూ, కింద పడిపోయిన కాయల్ని ఏరబోయిన పాలేరును అడ్డుకున్నాడు గేటు దగ్గర వున్న వాళ్ళల్లో ఒకతను.

బండిని కదిలించిన మనిషితోపాటు, అతన్ని కూడా నోటికి వచ్చినట్టు తిడుతూ ఖాళీ బుట్టను బండిమీదికి విసిరేశాడు ఆ పాలేరు. తను కూడా ఎక్కి "ఇవ్వాళ నిద్రలేవగానే ఎవరి ముఖం చూశానోగాని, చేసిన పనే పదిసార్లు మళ్ళీ మళ్ళీ చేయాల్సి వస్తోంది. బండిని పోనీ..." అని కసురుకున్నాడు. పరుగులాంటి నడకతో శకటాన్ని దూరంగా తీసుకుపోతున్న వృషభాల వంకా రెండుసార్లు చూసి, నెమ్మదిగా అవుట్ హౌస్ దగ్గరికి వెళ్ళిపోయాడు గోపాలం.

***

"ఎంతసేపు....? ఇంకా ఎంతసేపు పడుతుందిరా ఆ బాంబు పేలటానికి?...?" స్వంతంగా తయారు చేయించుకున్న ఇప్పపూవు సారాని కొద్ది కొద్దిగా రుచి చూస్తూ కోపంగా తన మనిషిని అడిగాడు భుజంగరాయుడు.

"తొమ్మిదింటికి సరిగ్గా ఢాం అంటుంది అయ్యగారూ.... ఒక్క నిముషం కూడా ఆలస్యం అవదు... తొమ్మిదవటానికి ఇంకా పదినిముషాలుంది" ఎర్రగా కాల్చిన మాంసపు ముక్కల్ని స్టీల్ ప్లేటులో పెట్టి ఆయన చేతికి అందిస్తూ వినయంగా చెప్పాడు ఆ మనిషి.

"దాని దెబ్బకి దొరగారు కూడా ఢామ్మంటాడంటావా?"

"అది ఆయన ఆ మూటకి ఎంత దూరంలో వున్నాడనే మాటమీద ఆధారపడి వుంటుంది అయ్యగారూ... పదిహేను అడుగుల దూరంలో వుంటే ఖచ్చితంగా దెబ్బతింటాడు.... సందేహం అవసరం లేదు...." ఖాళీ అయిన గ్లాసును తిరిగి జాగ్రత్తగా నింపుతూ చెప్పాడు ఆ మనిషి.

"తొమ్మిది అయిందేమో చూడు."

ఆ మాటకు ఆయన మనిషి సమాధానం చెప్పకముందే పరుగు పరుగున అక్కడికి వచ్చాడు ఇంకో మనిషి.

"అయ్యగారూ.... అంతా నాశనం అయింది. మనం పెట్టించిన బాంబు మురుక్కాలవలో స్నానం చేస్తోంది... నీళ్ళు తగిలితే అది పేలదనీ, ఎందుకు పనికిరాదనీ దాన్ని మనకి అంటకట్టిన రాంసింగు గట్టిగా చెప్పాడు. అతను అన్నట్టే అయింది...." ఆయాసాన్ని అణుచుకోవటానికి ట్రై చేయకుండా గబగబా చెప్పాడు.

పెదవుల దగ్గర పెట్టుకోబోతున్న సారా గ్లాసును మధ్యలోనే ఆపి తనదగ్గర వున్న మనిషికేసి అయోమయంగా చూశాడు భుజంగరాయుడు.

"ఎగశ్వాస దిగశ్వాస మాటలు మాట్లాడబోకు. జరిగింది ఏమిటో వివరం చెప్పు...." కసురుకుంటున్నట్టు రెండో మనిషిని హెచ్చరించాడు ఆ మనిషి.

"మూట పట్టుకుని ఆ మందులోళ్ళ ఆడమనిషి దివాణంలోకి పోయింది. గేటుదగ్గర ఉన్నోళ్ళకు అనుమానం రాకుండా నేను దూరంగా నిలబడి చూశాను. పెద్దయ్యకి తెలివి వచ్చినందుకు కొండలమ్మ తల్లికి పూజలు చేయిస్తున్నాడు దొరగారు. పూజకోసం పళ్ళు, ఫలాల్ని, గుమ్మడికాయల్ని తెప్పించి, ముందుగానే కొండల దగ్గరికి పంపిస్తున్నాడు. మందులోళ్ళ ఆడమనిషికి బుద్ధిలేదు. అది ఆ మూటని గుమ్మడికాయ బుట్టలో పెట్టింది.

బుట్ట ఎక్కించేటప్పుడు బండి కదిలి బుట్ట పడిపోయింది. గుమ్మడికాయలతో పాటు మన మూట కూడా మురుగుకాలవలో మునిగిపోయింది. అక్కడున్న వాళ్ళకి తెల్వలేదుగాని, నాకు బాగానే

కనిపించింది....'' ఒక్కొక్క మాటను నత్తివత్తి పలుకుతూ దివాణం ముందు జరిగింది సవివరంగా చెప్పాడు ఆ రెండోమనిషి.

''ఏడిచావ్ వెధవా... నువ్వు వట్టి గుడ్డోడివి. సరిగ్గా చూసివుండవ్'' సారాగ్లాసును టీపాయ్ మీద పెడుతూ కసురుకున్నాడు భుజంగరాయుడు.

''ఒట్టు దొరా... నా పిల్లల మీదొట్టు. దివాణం గేటుముందు రెండు కరెంటు దీపాలున్నాయి. నాకు ఆ మూట కనపడింది'' తలమీద చేయి వేసుకుంటూ చెప్పాడతను.

''తొమ్మిదయిపోయింది దొరా.. ఆ బాంబు నీళ్ళల్లో పడినట్టే అనిపిస్తోంది...'' గోడమీద గడియారంవైపు చూస్తూ చిన్న కంఠంతో చెప్పాడు మొదటి మనిషి.

ఎదుట వున్న టీపాయ్‌ని ఎగరేసి తన్నాడు భుజంగరాయుడు. దగ్గర్లో వున్న సారాసీసాని ఎత్తి బలంగా గోడకేసి కొట్టాడు.

''ఎన్నిసార్లు? ఎన్నిసార్లు తప్పించుకుంటాడు ఆ దొరగారు? ఏం చేస్తే ఆయన పీడ శాశ్వతంగా విరగడ అయిపోతుంది?'' కనులు ఎర్రచేసి, నడుముమీద చేతులు వేసుకుంటూ గట్టిగా అరిచాడు.

''ముందు మనం ఆ రవిబాబుని ఏసాయాలి అయ్యగారూ... ఆయన హరీ అంటే దొరగారు హరీ అనేస్తాడు. ఆయన్ని ఏసేయటానికి మనం ప్రత్యేకంగా కష్టపడాల్సిన అవసరంలేదు'' అన్నాడు మొదటి మనిషి.

''వాడిని ఏసేయటం ఎలా?'' అడిగాడాయన.

“పట్నం పోదాం. పచ్చనోట్లని చూస్తే ఎలాంటి పనైనా ఎనకా ముందూ చూసుకోకుండా చేసే రౌడీనాయాళ్ళు చాలామంది అక్కడ వుంటారు. మనకి బాంబు ఇచ్చిన రాంసింగుతో చెప్పి రవిబాబుకి ముహూర్తం పెట్టించేద్దాం.”

పది క్షణాలపాటు ఆలోచించి ప్రశాంతంగా తల ఊపాడు భుజంగరాయుడు.

“ఆ రవిబాబు రెండు మూడు రోజుల్లో మళ్ళీ పట్నం వెళ్ళిపోతాడు. వాడికంటె ముందుగా పోయి మనం ఏర్పాట్లు చేసేయాలి. రేపే మన ప్రయాణం. మనవాళ్ళని పదిమందిని రెడీగా వుండమని చెప్పు....” అంటూ తిరగబడిన కుర్చీని తనే సరిచేసుకుని తాపీగా కూర్చున్నాడు.

అల్లంత దూరంలోకి వెళ్ళిపోయిన టీపాయ్‌ని తీసుకువచ్చాడు రెండోమనిషి.

ఇంట్లోనుంచి ఇంకో సారాసీసాని అందుకున్నాడు. రెండు గ్లాసులు పుచ్చుకోగానే మత్తు అధికమైపోయింది భుజంగరాయుడికి. కుర్చీలో వున్నవాడు కుర్చీలో వుండగానే తెలివితప్పి నిశ్చలంగా వుండిపోయాడు.

***

“పదిగంటలు దాటిపోయింది. ఇంకా పడుకోలేదని తెలిస్తే నాన్నగారు కోపం చేస్తారు. లైటు తీసేసి పడుకో చిన్నబాబు?” తళతళ మెరుస్తున్న వెండి గ్లాసులో చిక్కటిపాలు తీసుకొచ్చి రవిబాబు గదిలో పెడుతూ హెచ్చరించింది చిలకమ్మ.

"నేను లైటు తర్వాత తీసేస్తాను. ముందు నువ్వెళ్ళి నీ పనులు చూసుకో పో..." చిరాకుగా అన్నాడు రవిబాబు.

"నీ అరుపులు, కేకలు అన్నీ అయ్యగారికి వినపడుతూనే వుంటాయి. ఆయన ఇంకా నిద్రపోలేదు. హాల్లోనే వున్నారు" వెక్కిరింపుగా అన్నది చిలకమ్మ.

అదిరిపడి ఆమెకేసి చూశాడు రవిబాబు.

"హాల్లోనే వున్నారా? ఈ టైంలో ఆయన హాల్లో ఎందుకున్నారు?" అని అడిగాడు.

"రేపు నల్ల కొండల దగ్గరికి పోవాలిగా... ఆ మాటలు మాట్లాడుతున్నారు" అని చెప్పి అవతలికి వెళ్ళిపోయిందామె.

అంతవరకూ తను చూసిన ఆల్బమ్‌ని అలాగే పట్టుకుని తనూ హాల్లోకి వచ్చాడు రవిబాబు.

చేతులు కట్టుకుని నిలబడిన ఇద్దరు గ్రామస్థులకు ఏవో ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చి, ఆతనివైపు చూశాడు దొరగారు.

"ఆల్బమ్‌ని చూడటం అయిందా?" అని అడిగాడు.

ఆయన పక్కన కూర్చుంటూ తలూపాడు రవిబాబు.

"అందులో ఉన్న వారందరూ కీర్తిశేషులే.. నేను తప్ప...." అతని దగ్గరున్న ఆల్బమ్‌ని ఆప్యాయంగా తడుముతూ అన్నాడాయన.

“ఈయన ఎవరు నాన్నగారు? ఈయన్ని గురించి చాలా విచిత్రంగా రాయబడి వుంది....” అంటూ మధ్యపేజీ నొకదాన్ని తెరిచి, ఠీవిగా నిలబడివున్న వర్ణచిత్రాన్ని ఒకదాన్ని చూపించాడు రవిబాబు.

“ఇతను పాండురంగరాయుడు. ఇప్పటికి వంద సంవత్సరాల క్రితం మన పద్ధతుల నుంచి దూరం అయిపోయాడు. మధుపానం చాలా ఎక్కువ, జూదం కూడా అపరిమితం.. తన వాటాకి వచ్చిన ఆస్తినంతా హారతి కర్పూరంలా హరించివేశాడు. ఒకే ఒక వజ్రం మిగిలింది. దాన్ని తన వారసులకి అప్పచెప్పమని మా తాతగారిని అర్థించాడు. అతను మరణించి చాలాకాలం అయినా, ఇంతవరకూ అతని వారసులు ఎవరూ రాలేదు.”

“ఇప్పుడు ఆ వజ్రం ఎక్కడ వుంది నాన్నగారూ? మన దగ్గిరే వున్నదా?” నిప్పుల్లాంటి కళ్ళతో నిలబడివున్న పాండురంగరాయుడి చిత్రాన్ని మరింత కుతూహలంగా చూస్తూ అడిగాడు రవిబాబు.

“వజ్రం లేదు. మంచి బేరం ఒకటి వచ్చిందని చెప్పి మా నాన్నగారు దాన్ని రెండు లక్షలకు అమ్మి, ఆ డబ్బుని అతని వారసులకోసం చెన్నపట్టణంలోని బ్యాంకులో డిపాజిట్ చేశారు. యాభై సంవత్సరాలయింది. ఆ డబ్బు అలాగే వుండిపోయింది....”

యాభై సంవత్సరాలక్రితం డిపాజిట్ చేసిన రెండు లక్షల రూపాయలు, ఇప్పుడు ఎంత ఎమౌంట్‌కి ఎదిగివుంటాయో మనసులోనే లెక్క కట్టాడు రవిబాబు.

"ఎంత తక్కువ వడ్డీ కట్టినా అది కోటి రూపాయలకు పైనే అయి వుంటుంది. పాండురంగరాయుడి వారసులు ఎవరైనా వస్తే, అణాపైసలతో సహా వారికి అప్పచెప్పాల్సిన బాధ్యత మనమీద వుంది. ఈ విషయం బాగా గుర్తుపెట్టుకో.." అంటూ సోఫాలో నుంచి లేచాడు దొరగారు.

"నాకు నిద్ర వస్తోంది. నేను వెళ్ళి పడుకుంటాను. నువ్వు కూడా వెళ్ళు. రేపు ఉదయమే కొండలమ్మతల్లి దగ్గరికి పోవాలి" అంటూ తన గది వైపు వెళ్ళిపోయాడాయన.

నిప్పులవంటి కళ్ళతో నిర్భయంగా చూస్తూ, మహాకరుకుగా నిలబడి వున్న పాండురంగరాయుడిని అంతకు ముందెక్కడో చూసినట్టనిపిస్తోంది రవిబాబుకి.

'వంద సంవత్సరాల క్రితం మనిషి ఇతను... మనకి కనిపించటం అసంభవం....' అని తనలో తనే అనుకుంటూ నెమ్మదిగా తన గదివైపు వెళ్ళి పోయాడు.

## 4

తూర్పు దిక్కు తెల్లబడకముందే నిద్రలేచి ప్రశాంతి కాలనీకి పోయింది రంగమ్మ.

సంగయ్య దుకాణంలోని తాళం చెవులు తీయబోతుండగా, "రవిబాబు ఎల్లుండి వస్తాడంట... ఇందాకే ఫోన్ వచ్చింది...." అన్నాడా పెద్దమనిషి.

ఇంటి తలుపులు తెరిచి అరగంటలో తుడుపుడు కార్యక్రమాన్ని పూర్తిచేసింది రంగమ్మ. తాళంచెవుల్ని తిరిగి సంగయ్యకి అప్పచెప్పి, సిటీబస్

ఎక్కింది. టాబూ హోటల్ దగ్గిర దిగి, పన్నెండు ఇడ్లీలు పొట్లం కట్టించుకుని గబగబా అడుగులు వేసింది.

ఓరగా వేసిన తలుపులు వేసినట్టే వున్నాయి. "ఏం చేస్తున్నావ్ మామ్మా? ఇంకా నిద్రలేవలేదా....?" అని అడుగుతూ తలుపుల్ని నెట్టింది. దబ్ మని బరువైన వస్తువు ఏదో కిందపడిన శబ్దం వినవచ్చింది.

తలుపులు తెరుచుకునేసరికి, నులకమంచంమీద పడుకుని వుండాల్సిన పిచ్చిమామ్మ.... బాసిపట్టు వేసుకుని నేలమీద చతికిలపడి ఆమెకు కనిపించింది.

"ఏమయింది మామ్మా? మంచం మీదినించి పడిపోయావా?" ఆశ్చర్యంగా అడుగుతూ లోపలికి పోయిందామె.

"ఎక్కడికి పోయావే తల్లీ? నీ కోసమే నేను ఎదురుచూస్తున్నా" దంతాలన్నీ కనబడేటట్లు నవ్వుతూ అంది మామ్మ.

తన అడిగిన ప్రశ్నకు సమాధానం అది కాదని అనిపించినా, సరిగ్గా పట్టించుకోలేదు రంగమ్మ. "టాబూ హోటల్లో ఇడ్లీలు బాగుంటాయని తీసుకువచ్చా. తిను త్వరగా...." అంటూ ఒక ప్లేటులో నాలుగు ఇడ్లీలు పెట్టి ఆమెకు అందించింది.

ఒక ఇడ్లీని విరిచి నోట్లో పెట్టుకుంటూ మెచ్చుకోగా తలూపింది మామ్మ. అంతలోనే మారిపోయాయి ఆమె ముఖకవళికలు. ఉన్నట్లుండి నీటితో నిండాయి కనులు.

“అదిగో నువ్వు మళ్ళీ నీ పిచ్చి ఏడుపులు మొదలుపెడుతున్నావ్. తినుతిను అంటూ ఎవరయినా తినటానికి పెట్టి నాలుగువందల సంవత్సరాలు అయిందని అనబోతున్నావ్. అవునుకదూ?” నొసలు ముడివేస్తూ మామ్మను అడిగింది రంగమ్మ.

అతి బలవంతంగా ఉబికివస్తున్న కన్నీటిని ఆపుకుని ఇడ్లీలు తిన్నది వృద్ధురాలు. రంగమ్మ తెచ్చిచ్చిన నీళ్ళగ్లాసును అందుకుంటూ, “ముక్కు ముఖం తెలియని కొత్త చుట్టానికి మర్యాదలు బాగానే చేస్తున్నావ్.... మరి ఆ పాండును ఏం చేశావ్? ఆ ముట్టెపొగరు మగాడికి కూడా తీసుకొచ్చావా?” అని అడిగింది.

ఉన్న పళంగా ముంచుకొచ్చిన సిగ్గుతో కెందామరగా మారిపోయింది రంగమ్మ వదనం.

“తెచ్చాను మామ్మా. ఇచ్చి వస్తా” అంటూ బయటికి పరుగు తీసింది.

***

“నిన్న చచ్చీచెడీ సూదిగుట్టల్లో నుంచి సారాక్యాన్లు తీసుకువచ్చి సంపాదించిన డబ్బులన్నీ అల్లాలు బెల్లాలు ఇడ్లీలు చేసేశావా?” తన ఇంటి ముందు కూర్చుని వున్న పాండును అడిగాడు షరీఫు.

టింగూని పంపించి టాబూ హోటల్ నుంచి తెప్పించిన ఇడ్లీల్ని మురికివాడ పిల్లలందరికీ పంచిపెడుతున్నాడు పాండు. నాలుగేళ్ళ పిల్లను తన ఒళ్ళో కూర్చోబెట్టుకుని స్వయంగా తనే తినిపిస్తున్నాడు.

“బాబాయ్.. రంగమ్మ వస్తోంది...” ఉన్నట్లుండి అతనికి చెప్పింది ఆ పిల్ల.

“చూడవే రంగమ్మా... ఉన్నదంతా ఊరోళ్ళ పిల్లలకి పెట్టేస్తున్నాడు. తన అవసరాలకి పైసా మిగుల్చుకోవటం లేదు. మళ్ళీ ఎవళ్ళ జేబులోనో చెయ్యి పెట్టి కాళ్ళుచేతులు విరగగొట్టించుకుంటాడు లేదా పస్తులుంటాడు. వీడి పద్ధతి బాగోలేదు. నాకు అస్సలు నచ్చటంలేదు” రంగమ్మను చూడగానే కంప్లయింట్ చేసేశాడు షరీఫు.

“పిన్నీ... నువ్వు ఇడ్లీలు తిన్నావా?” అతని మాటల్ని గురించి రంగమ్మ ఆలోచించకముందే ఆమెను అడిగింది పాండు ఒళ్ళో కూర్చుని ఇడ్లీలు తింటున్న పిల్ల.

లేదన్నట్టు తల అడ్డం తిప్పింది రంగమ్మ.

“పిన్నికి ఇడ్లీ పెట్టు బాబాయ్... నాకు చాలు” అంటూ పాండు ఒళ్ళో నుంచి లేచి పక్కన కూర్చుంది ఆ పిల్ల.

“రావే రంగమ్మా.... దగ్గరికి రా...” అంటూ ఆమె చేయి పట్టుకుని దగ్గరికి లాగాడు పాండు. ఇడ్లీని విరిచి, ఆమె నోటికి అందించాడు.

“ఉట్టుట్టి అభిమానాలవల్ల ఉపయోగం లేదు పాండూ. చేసే పనేదో గట్టిగా చేసేయ్... రంగమ్మని నిక్కా చేసేసుకో....” తనవంతు రాక ముందే ఇడ్లీలైపోతాయన్న అనుమానంతో చూస్తూ సలహా యిచ్చాడు షరీఫు.

“నువ్వు నోర్మూసుకుంటావా?” చేస్తున్న పనిమీదినించి దృష్టిని మరల్చకుండా రంగమ్మ వాడే మాటల్ని తనూ వుపయోగించాడు పాండు.

“మూసుకుంటాను భాయీ... నువ్వు చెప్పిం తర్వాత మూసుకోక ఏం చేస్తాను?” అంటూ నిజంగానే నోటిని అదుముకున్నాడు షరీఫు. పది క్షణాలు కూడా గడవకముందే అతనికి వచ్చేసింది ఇంకో అనుమానం.

“అవును పాండూ... వయ్యారంగా నడుమూపుకుంటూ ఈ రంగమ్మ రావటం, పళ్ళు ఇకిలించుకుంటూ నువ్వు ఇడ్లీలు పెట్టటం బాగానే వుంది. ఉన్నవన్నీ అయిపోతున్నాయి. మరి నీకు ఏవి?” అని అడిగాడు.

“నువ్వు కంగారుపడకు బాబాయ్. నా దగ్గర వున్నాయ్. నేను తీసుకొచ్చాను” అంటూ తను తీసుకువచ్చిన పొట్లాన్ని పాండు ఎదుటపెట్టింది రంగమ్మ.

“వట్టిగా వదిలేస్తే బాబాయ్ తినడు. మళ్ళీ మా అందరికీ తలా ఒకముక్కా పెట్టేస్తాడు. అందుకని నువ్వే తినిపించు....” అంటూ వెంటనే సలహా ఇచ్చింది అంతకుముందు వరకూ పాండు ఒళ్ళో కూర్చున్న చిన్నపిల్ల.

తను తెచ్చిన ఇడ్లీనొకదాన్ని విరిచి, పాండు నోటికి అందించబోయింది రంగమ్మ. సరిగ్గా అదే సమయంలో చిన్నగా విజిల్ వేశాడు వారికి పది అడుగుల దూరంలో నిలబడి వున్న టింగూ.

“పాండు బాబాయ్... పోలీసులు వస్తున్నారు” అతని సైగను అందుకున్న వెంటనే పాండును హెచ్చరించాడు ఇంకో పిల్లాడు. అంతే! చటుక్కున లేచి కాస్తంత ముందుకుపోయాడు పాండు.

"నిన్ను ఎస్సయ్ సాబ్ అర్జంటుగా స్టేషన్‌కి రమ్మని చెప్పారు. బయల్దేరు త్వరగా. ఆలస్యం చేశావంటే అగ్గిమీద గుగ్గిలం అయిపోతాడు...." సైకిల్‌ని ఆపి, హెచ్చరించాడు అక్కడికి వచ్చిన వారిలో ఒక కానిస్టేబుల్.

"ఏమిటంత అర్జంటు? ఎందుకు గుర్తుకువచ్చాను నేను?" కనులు చిట్లించి చూస్తూ అడిగాడు పాండు.

"ఏమో.... ఎందుకు గుర్తుకు వచ్చావో మాకు ఎలా తెలుస్తుంది? వెళ్ళి ఆయన్నే స్వయంగా అడుగు. త్వరగా బైల్దేరు" అంటూ హెచ్చరించి, తమ సైకిళ్ళని వెనక్కి తిప్పారు ఆ కానిస్టేబిల్స్.

"ఏరా పాండూ? వెళ్ళాల్సిందేనా?" నోరు మూసుకుని నిలబడటం అసాధ్యమైపోతూ వుండటంతో అడిగాడు షరీఫు.

"వెళ్ళాల్సిందే... కబురంటూ రానేకూడదు. వచ్చిన తర్వాత వెళ్ళకపోతే చాలా ఛండాలంగా మాట్లాడేస్తాడు. నోటికి ఏదివస్తే అది అనేస్తాడు. ఆ మాటల్ని భరించటం చాలా కష్టం" అంటూ అటు నుంచి అటే మెయిన్ రోడ్డుమీదికి బయలుదేరాడు పాండు.

అతని నోటికి అందించబోయిన ఇడ్లీ ముక్కని అలాగే పట్టుకుని నిశ్శబ్దంగా కూర్చుని వున్నది రంగమ్మ. ఉన్నట్లుండి మ్లానమైపోయింది ఆమె ముఖం. కళ్ళ వెంట గిర్రున తిరిగాయి నీళ్ళు. ఎడమచేతిలో వున్న పొట్లాన్ని కిందపడేసి, తన ఇంటివైపు వెళ్ళిపోయింది.

శిలా విగ్రహాల్లా నిలబడివున్న పిల్లల్లో చలనంవచ్చి, కిందపడిన ఆ పొట్లం మీదికి ఎగబడకముందే, "రంగమ్మతల్లి ప్రసాదం... తినే అదృష్టం ఆ పొండుగాడికి ఎలాగూ లేదు... మనకి ఎటువంటి అభ్యంతరమూ ఉండదు" అంటూ తను తీసుకున్నాడు షరీఫు.

## 5

"జై కొండలమ్మతల్లీ... జైజై కొండలమ్మతల్లీ...." అని తన పాలేర్లు, తనతో పాటుగా వచ్చిన గ్రామస్థులు ఎలుగెత్తి భక్తితో జయజయ ధ్వానాలు చేస్తూ వుండగా, మూడు బూడిద గుమ్మడికాయల్ని అమ్మవారికి భూతబలిగా సమర్పించాడు దొరగారు. తన పాలేర్లు తీసుకువచ్చిన పళ్ళను, ఫలాల్ని నైవేద్యం పెట్టాడు.

"మా పెద్దయ్యకి మళ్ళీ ఏ ఇబ్బందీ రాకుండా చూడమని చెప్పు. ఈ తల్లికి పరధ్యానం ఎక్కువ. ఒకటికి నాలుగుసార్లు మొర పెట్టుకుంటే తప్ప విన్పించుకోదు" అంటూ పక్కనే వున్న ముసలయ్యని హెచ్చరించాడు.

"నాలాంటి వాడి విషయంలో ఆ మాట నిజమేనేమోకాని, మీ వ్యవహారంలో తల్లి ఎప్పుడూ పరధ్యానంగా వుండదు. అటువంటి అనుమానాలు మీకు అనవసరం" అంటూ తన చేతిలో వున్న శంఖాన్ని గట్టిగా ఊది, దొరగారు తీసుకువచ్చిన కుంకుమ కొండలమ్మతల్లి తల మీద దారగా పోశాడు పూజారి ముసలయ్య.

“కొట్టండి... అందరూ కొబ్బరికాయలు కొట్టండి” పక్కకు జరిగి అందర్నీ హెచ్చరించాడు దొరగారు.

ఒకరి తర్వాత ఒకరుగా ముందుకువచ్చి కొండలమ్మతల్లికి కొబ్బరికాయలు కొట్టారు వారందరూ. చేతులు జోడించి సాష్టాంగ నమస్కారాలు చేశారు.

అందరితోపాటుగా ముందుకుపోకుండా వెనకాలే నిలబడిన గోపాలాన్ని చూసి,

“ఏం మందులాయనా? మొద్దురాచిప్ప మాదిరి అలాగే నిలబడిపోయావేంటి? ముందుకు పో....” అని హెచ్చరించాడు అతనికి పరిచయం అయిన దొరగారి పాలేరు ఒకతను.

“రావయ్యా గోపాలం... వచ్చి నువ్వు కూడా నమస్కారం పెట్టుకో” ఉన్నట్టుండి దొరగారు కూడా హెచ్చరించటంతో, అయిష్టంగానే ముందుకు కదిలాడు అతను. గట్టుక్రింద పెట్టిన వెదురుబుట్టల్లో నుంచి ఒక కొబ్బరికాయని తీసి గట్టుమీద కోట్టబోయాడు. పట్టుకుంటే జారిపోయేటంత నునుపుగా వున్నట్లు, అతనికి తెలియకుండానే జారి కిందపడిపోయింది ఆ కొబ్బరికాయ.

“అయ్యయ్యో.... అదేంటి మందులాయనా? అట్లాంటిపని చేశావేంటి? అన్నం తినలేదా రాత్రి?” అంటూ చటుక్కున ముందుకువచ్చి, ఇంకో కొబ్బరికాయని తీసి అతనికి అందించాడు పరిచయమైన పాలేరు.

ఏమరిపాటుగా వుండటంవల్ల మొదటికాయ చేతిలోనుంచి జారిందని అనుకుంటూ, ఈసారి చాలా గట్టిగా పట్టుకున్నాడు గోపాలం. పళ్ళు బిగపట్టి, కళ్ళను గట్టిగా మూసుకుని గట్టుకేసి కొట్టాడు.

కళ్ళు మూసుకోవటంవల్ల జరిగిందో, గట్టుకు తనకు మధ్యనవున్న దూరాన్ని తప్పుగా అంచనావేయటంవల్ల జరిగిందోగాని, గట్టుకు కాయ తగలలేదు. అతని మణికట్టు తగిలి, మరోసారి జారిందా కాయ కూడా.

“అయ్యయ్యో... అదేంటి మందులాయనా?” అని ఈసారి పొరపాటున కూడా అనలేదు అతనికి పరిచయం అయిన పాలేరు. ఆశ్చర్యం నిండిన కనులతో దొరగారివంకా, పూజారివంకా, ముసలయ్యవంకా చూశాడు.

“ఒకసారికాదు.. రెండుసార్లు కాయ చేతిలోనుంచి జారిపోయిందంటే, ఇతన్ని గురించి కొండలమ్మతల్లి కొంచెం కూడా పట్టించుకోవటం లేదని అర్థం.... మందులు ఏరుకునే మిషమీద, అడవిలోవున్న పాడుపడిన మేడదగ్గరికి ఎప్పుడన్నా పోయాడేమో అడగండి” అరమూసిన కనులతో ఊగుతూ అన్నాడు ముసలయ్య.

గట్టుకు తగలటం వల్ల, కట్టెపేడుతో మోదినట్టు పోటెత్తి పోతున్న మణికట్టును రెండో చేత్తో అదిమిపట్టుకుంటున్న గోపాలం ఒళ్ళు ఝుల్లుమంది.

“పాటుబడిన మేడ దగ్గరికి పోలేదుగాని, దూరం నుంచి దాన్ని చూశాం. అప్పుడు మా గురువుగారు కూడా నాతోపాటు వున్నారు. అక్కడ వున్న వాగులో కాలుజారి పడటంవల్లనే ఆయన తలకు దెబ్బ తగిలింది” మాటలకోసం

తడుముకుంటే, అక్కడివారందరికి అనుమానం పస్తుందన్న భయంతో గబగబా చెప్పాడతను.

"పాటుపడిన మేడ దగ్గరికి పోయిన వాళ్ళల్లో చాలామందిని మా కొండలమ్మ తల్లి తన దగ్గరికి రావద్దని ఆంక్షపెట్టడం నాకు బాగా తెలుసు. ఎందుకు అలా చేస్తుందో నన్ను అడగవద్దు. నాకు తెలియని విషయాన్ని గురించి నేను ఏమీ చెప్పలేను. నీ విషయంలో కూడా ఆ తల్లికి కోపం వచ్చిందని నేను అనుకుంటున్నాను" అతని వైపు చూడకుండానే చెప్పాడు ముసలయ్య.

ఏదో ఒకటి మాట్లాడి తను ఏ తప్పు చేయలేదని అందరికీ తెలియచేయటం అత్యవసరం అని భావించి, "దొరగారూ... నేను అమాయకుడిని... నాకు ఏ పాపము తెలియదు...." అని మాటలు మొదలుపెట్టాడు గోపాలం.

చేతిని ఎత్తి అతన్ని వెంటనే ఆపేశాడు దొరగారు. నువ్వు అనవసరంగా బాధపడకు... అన్ని విషయాలు మన ముసలయ్య చూసుకుంటాడు. మనం వెళ్ళిపోయిన తర్వాత అమ్మవారిని ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తాడు అంటూ గట్టుమీదినించి కిందికి దిగాడు.

ఆయన దృష్టిలో అపరాధం చేసినవాడిలా మిగిలిపోకుండా, కాస్తంత అమాయకుడిగానే నిలబడగలిగినందుకు సంతోషంగానే వున్నా, ఆయనతో పాటు అక్కడికి వచ్చిన వారందరూ తనవంక అదోలా చూస్తూ వుండటం మాత్రం గోపాలానికి బాధను కలిగించింది.

పూజలు పూర్తి అయిపోయేటంతవరకూ దూరం దూరంగానే వుండిపోయాడు అతను. "కొండలమ్మ తల్లి చూస్తూ వుండగా వంటలు చేసుకుని, ఆ తల్లికి నివేదించి, ఆ తర్వాత భోజనాలు చేయటం మాకు ఆనవాయితీ.... వంటలు పూర్తి అవటానికి యింకా కొంచెం వ్యవధి వున్నది. అంతవరకూ విశ్రాంతి తీసుకో...." పనికట్టుకుని అతన్ని దగ్గరికి పిలిచి చెప్పాడు దొరగారు.

వినయంగా తలవూపి బాగా ఇవతలికి వచ్చేశాడు గోపాలం. కొండలమ్మ కొలువై వున్న గట్టుకు వందగజాల దూరంలో వున్న బండల దగ్గరికి పోయి ఒక బండమీద కూర్చున్నాడు.

దొరగారు చెప్పనట్లు వంటలు పూర్తి అయిన వెంటనే కొండలమ్మ తల్లికి నైవేద్యం పెట్టి, ఆ తల్లి ఎదురుగానే అందరికీ విస్తళ్ళు వేశారు ఆయన పాలేర్లు.

చకచకా వడ్డన కార్యక్రమం కూడా పూర్తిచేశారు.

కొట్టబోయిన కొబ్బరికాయలు చేతిలోనుంచి జారిపోయినట్టు, విస్తిరిలో చేయి పెట్టగానే ఇంకో అనర్థం ఏదయినా జరుగుతుందేమోనన్న సంశయంతో చాలాసేపు తటపటాయించాడు గోపాలం.

అది గమనించి అతని అనుమానం ఏమిటో తనకు అర్థం అయినట్టు చిన్నగా నవ్వాడు పూజారి.

"కోపం వస్తే తన దగ్గరికి రాకుండా ఆంక్షలు మాత్రమే విధిస్తుంది మా తల్లి.... ఆకలితో అలమటించే పరిస్థితుల్ని మాత్రం ఎప్పుడూ కల్పించదు. నిర్భయంగా తిను. నీకేమీ జరగదు" అని ధైర్యం చెప్పాడు.

రెండో ఆలోచన చేయకుండా కడుపునిండా అన్నం తిన్నాడు గోపాలం. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న తరువాత అందరితోపాటు గ్రామంలోకి తిరిగి వచ్చాడు.

***

"నువ్వు రకరకాల పనులమీద సిటీ అంతా తిరుగుతూ వుంటావు. కాబట్టి నిన్ను ఓ విషయం అడుగుతున్నాను. ఈ మధ్యకాలంలో ఐరన్ సేఫులు, ఇనప్పెట్టెలు బద్దలుకొట్టే బద్మాష్‌లు ఎవరైనా సిటీలోకి ఎంటరైనట్టు నీకు అనుమానం కలిగిందా?" ఉన్నట్లుండి అడిగాడు గంగరాజు.

సాతూర్ బ్యాంక్ దొంగతనాన్ని గురించిన టాపిక్ అది... నిర్మొహమాటంగా తల అడ్డంగా తిప్పేశాడు పాండు.

"తెలియదు సార్... మొన్న మీరు దయతలచి వదిలేసిన తర్వాత ఇంత వరకూ నేను వీధుల్లోకి పోలేదు. అసలు ఇంట్లోనుంచి బయటికి రాలేదు...." అని చెప్పాడు.

నమ్మినట్టుగా తల ఊపి ఆఖర్లో ఒక విషపు నవ్వు నవ్వాడు గంగరాజు. "ఒకసారి ఎదవ అయితే జీవితాంతం ఎదవే, మారటం అసంభవం. ఒళ్ళు దగ్గర పెట్టుకుని తిరుగు. ఇంకోసారి నా చేతికి దొరికితే షేపులు మారిపోతాయి వెళ్ళు" అంటూ చేయి వూపాడు.

అతను తనను ఎందుకు పిలిపించాడో పాండుకు అర్థం కాలేదు.

"అయ్యగారూ... ఇంతకూ నన్నెందుకు రమ్మన్నారో నాకు చెప్పలేదు" నిలబడిన చోటినుంచి అంగుళమన్నా కదలకుండా మెత్తగా అడిగాడు పాండు.

“నువ్వు చాలా తెలివైన బద్మాష్ వి... అమాయకంగా నిలబడితే నమ్మేసి అవతలికి వెళ్ళిపోతానని మాత్రం అనుకోబోకు... నీకు ఒక పని అప్పగించాలనిపించింది. అందుకే కబురు పెట్టాను... నమ్మకంగా చేసి పెట్టాలి. తేడాలు వస్తే తాట ఒలిచేస్తాను. చేస్తావా?” మాటల్ని ఆచి తూచి ఉపయోగిస్తూ అన్నాడతను.

అలవాటు ప్రకారం అలాగేనంటూ తల వూపేశాడు పాండు. ఊపకపోతే వూరుకోడుకదా!

“రేయ్.... రెండు టీలు స్ట్రాంగ్‌గా తీసుకురా... వెళ్ళు” తన గది ద్వారం పక్కనే నిలబడి చెవులు రిక్కిస్తున్న కానిస్టేబిల్ ఒకతన్ని ఉన్నట్లుండి పిలిచి, ఆర్డర్ వేశాడు గంగరాజు. “మా వాళ్ళకు ఈ మధ్య తెలివి తేటలు ఎక్కువై పోయాయి... అవసరంలేని మాటల్ని కూడా చెవులు అప్పగించి వినటం బాగా ప్రాక్టీస్ చేస్తున్నారు” అంటూ కానిస్టేబిల్ అవతలికి పోగానే ప్యాంటు జేబులోనుంచి మూడు కార్డు సైజు ఫోటోల్ని బయటికి తీశాడు.

నిఠారుగా నిలబడి ఠీవిగా చూస్తున్నారు ఆ ఫోటోల్లో వున్న ముగ్గురు వ్యక్తులూ, బాగా చదువుకున్నట్టు, అదీగాక తెలివితేటలు కూడా చాలా అధికం అన్నట్టు కనిపిస్తున్నాయి వారి ముఖకవళికలు.

“ఎవరు సార్ వీళ్ళు?” తనకేసి జాచబడిన ఆ ఫోటోల్ని జాగ్రత్తగా చూసి ఇచ్చేస్తూ అడిగాడు పాండు.

"ఆమధ్య సాతూర్లో బ్యాంకు దొంగతనం చేసి మూడుకోట్ల డబ్బుతో పారిపోయిన బడాచోర్లు వీళ్లు...." అంటూ చటుక్కున మాటల్ని ఆపి, ఆ ఫోటోల్ని తిరిగి ప్యాంటుజేబులో దాచేశాడు ఎస్సయ్ గంగరాజు.

సెగలు వెలువరుస్తున్న టీ గ్లాసుతో తిరిగి వచ్చాడు కానిస్టేబిల్. ఎస్సయ్ సాబ్‌కి ఒక గ్లాసు అందించాడు. "పాండుకి ఇవ్వు" ఆర్డర్ ఇచ్చాడు. ఎస్సయ్, ఆశ్చర్యపోతూ పాండుకి రెండోగ్లాసు ఇచ్చాడు కానిస్టేబిల్.

"త్వరగా తాగు... మనకి డోంగ్రే సెంటర్ లో ఒక పని వుంది" పాండుని హెచ్చరించి, తన గ్లాసును చిటికెలో ఖాళీచేసి కానిస్టేబిల్‌కి అందించాడు ఎస్సయ్. గబగబా తాగి, తను కూడా ఖాళీ గ్లాసును ఆ కానిస్టేబిల్‌కే అందించాడు పాండు. అతను కోరగా చూస్తూ బయటికి వెళ్ళిపోగానే గంగరాజువంక ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఆ బద్మాష్‌లు ఈ సిటీలోకి వస్తారేమో, నడుములు విరగగొట్టి లాకప్ లోకి నెడదామనుకున్నాను. మళ్ళీ ఇటు రాలేదు. నల్లకొండల దగ్గర వున్న జంగిల్ లోకి పారిపోయార్ట. అటు నుంచి అటు కర్ణాటక రాష్ట్రానికి జంప్ అయిపోవచ్చు." ఈసారి తన మాటలకి అడ్డంకి ఏర్పడకుండా గుమ్మం దగ్గరే నిలబడుతూ చెప్పాడు గంగరాజు.

అతను తనను ఎందుకు పిలిపించాడో అప్పుడు అర్థం అయింది పాండుకి. నోరు వెగటుగా మారిపోయింది. తాగిన టీ కడుపులో గుడగుడమని శబ్దాలు చేయటం మొదలుపెట్టిన సెన్సేషన్ కలిగింది.

తను గులాబీ కేఫ్ ఓనర్ ముస్తఫా దగ్గర ఎలా ఇన్ఫర్మేషన్ని సంపాదించాడో, అలాగే ఇంకెవరి దగ్గరో అదే సమాచారాన్ని గంగరాజు కూడా సేకరించాడు. ఇప్పుడు తనకి మెలిక వేయబోతున్నాడు. ఆ మాట అనుకుంటూ వుండగానే, అతను అనుకున్నట్టే జరిగింది.

“నువ్వు చాలా తెలివైనవాడివి. అవసరం అయితే పదిమందినయినా పట్టి గోడలకేసి కొట్టగల దమ్మున్నవాడివి. నువ్వు నల్లకొండల దగ్గర జంగిల్ లోకి వెళ్ళి ఆ బద్మాష్‌ల జాడ తెలుసుకోవాలి. కామ్‌గా నాకు ఉప్పు అందించాలి. ఉద్యోగానికి ఒక వారం సెలవు పెట్టి ప్రయివేట్‌గా ఇన్వెస్టిగేట్ చేస్తాను. వాళ్ళని నా పై అధికారులకు అప్పగించి పెద్ద ప్రమోషన్ కొట్టేస్తాను. నువ్వు వెంటనే ప్రయాణం కావాలి. ఇంటికి వెళ్ళి ఏర్పాట్లు చూసుకో” అంటూ జేబులోంచి ఓ వెయ్యి తీసి ఎవరూ గమనించకముందే పాండు జేబులోకి నెట్టేసి, వెళ్ళిపొమ్మని తలూపాడు.

అంత త్వరగా తనని ఇరికిస్తాడని అనుకోకపోవడం వల్ల కొంచెం షాక్ అయ్యాడు పాండు. “అదికాదు సార్.... ఆ జంగిల్ లోకి నేనెప్పుడూ వెళ్ళలేదు. నేను వెళ్ళేసరికి వాళ్ళు జంప్ అయివుంటే?” అని అడిగాడు.

“జంప్ అవటానికి అవకాశాలున్నాయిగాని, నువ్వు అనుకున్నంత త్వరగా ఆ పని చేయలేరు. అక్కడ నారాయణపురమనే ఊరు వుంది. దానికి అవతలగా కర్ణాటక పోలీసులు కాపలా కాస్తున్నారు. సాతూర్ బ్యాంక్ వాళ్ళు వాళ్ళకి కూడా కబురు అందించారు” అని చెప్పి, అతన్ని గదిలోనుంచి బయటికి నెట్టాడు గంగరాజు.

ఆలోచించుకోవటానికి కూడా వ్యవధి ఇవ్వకుండా అతను తన నెత్తిమీద పెట్టిన ఆ పనిని గురించే ఆలోచిస్తూ స్టేషన్లోనుంచి బయటికి వచ్చాడు పాండు.

“నువ్వు వట్టి బేవార్స్ గాడివిరా పాండు... ఎస్సయ్య చెప్పిన మాటల్ని పట్టుకుని ఆ సాతూర్ బ్యాంక్ దొంగల జోలికి పోబోకు. ఆళ్ళు గుండెలు తీసిన బంట్లు. నీ గుండెల్ని చీల్చి నెత్తురు తాగేస్తారు. అనవసరంగా అన్యాయం అయిపోతావ్” టీ కొట్టు దగ్గరే నిలబడివున్న కానిస్టేబిల్ అతన్ని చూస్తూనే హెచ్చరించాడు.

ఎస్సయ్ గంగరాజు ఎంతో రహస్యంగా చెప్పిన మాటలు అతనికి ఎలా తెలిసాయో పాండుకి అర్థం కాలేదు. ‘చూడబోతే ఇదంతా పెద్ద గందరగోళంగా వుంది. జోగినాథం బాబాయ్ దగ్గరకెళ్ళి వివరంగా మాట్లాడాలి...’ అనుకుంటూ అటునుంచి అటే జోగినాథం ఇంటి దిశగా బయలుదేరాడు.

***

“సాతూర్ బ్యాంక్ దొంగలు నల్లకొండలు దగ్గరికి పోయినట్టు నీకు నాకు తప్ప ఊళ్ళో వాళ్ళందరికీ తెలిసిపోయినట్టుంది. ఇక ఆ మాటని మర్చిపో... ఆ జంగిల్ లోకి మనం ఎంటర్ కాలేము....” పాండు నోటి వెంట స్టేషన్‌లో జరిగినదంతా వింటూ, తాపీగా తన అభిప్రాయాన్ని వెల్లడించాడు ఆ రోజు ఉదయం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి వచ్చిన జోగినాథం.

“మరి గంగరాజు నాకు ఇచ్చిన డబ్బులు?” పై జేబులో వున్న కరెన్సీ నోట్లను తడుముకుంటూ అడిగాడు పాండు.

“వారంపాటు ఎవరికీ కనిపించకుండా ఇంట్లోనే కూర్చో. నన్నడిగితే నల్లకొండలు దగ్గరికి పోయావని చెపుతా... వారం తర్వాత వట్టి చేతులతో వచ్చి కనిపించు... వాళ్ళు జంగిల్‌లో లేరని చెప్పు... ఏమీ ప్రమాదం లేదు” అంటూ సలహా ఇచ్చాడు జోగినాథం.

చేయని పనిని చేసినట్టు చెప్పడం తనకు నచ్చదని అతనికి చెప్పలేదు. “అది సరే బాబాయ్... సూది గుట్టల దగ్గర జరిగింది చెప్పు” అంటూ మాట మార్చాడు.

తమ జీప్ డ్రైవర్ గిలగిలలాడటం దగ్గర్నించి మొదలుపెట్టి, తను కళ్ళు తేలవేయటం వరకూ అన్ని సంఘటనలూ వివరంగా అతనికి చెప్పాడు జోగినాథం.

“అరేయ్... ఆ గుట్టల్లో ఎవడో బద్మాష్ ఏదో ప్రయోగం చేస్తున్నాడు. నువ్వు ఏదో ఒక విధంగా వాడు ఎవరో తెలుసుకోవాలి. పళ్ళు రాలగొట్టాలి. ఈ చుట్టుపట్ల కన్పించకుండా దూరంగా తరిమేద్దాం...” అని కూడా అన్నాడు.

“సరే బాబాయ్.... ఎలాగూ గంగరాజుకి కనిపించకుండా నాలుగు రోజులు దాక్కోవాలి కదా... సరాసరి ఆ గుట్టల్లోకిపోయి, అక్కడి సారా బట్టీల దగ్గర మకాం పెడతా... నువ్వు చెప్పినట్టు మంత్రాల బద్మాష్ ఎవరైనా కనిపిస్తే నీకు కబురుచేస్తా....” అన్నాడు పాండు.

“మీ పిన్ని టిఫిన్ చేసింది. తిని కాఫీ తాగి పోదువుగాని కూర్చో” అన్నాడు జోగినాథం.

“వద్దులే బాబాయ్... రంగమ్మ ఇడ్లీలు రెడీగా వుంచింది. ఇంటికి పోయి అవి తింటా...” అంటూ కుర్చీలో నుంచి లేచి గబగబా బయటికి వచ్చేశాడు పాండు.

రంగమ్మ మీద ఇంత అభిమానం వుంచుకుని కూడా పాండు ఆ పిల్లను ఎందుకు పెళ్ళి చేసుకోవటంలేదు? భర్తను అడిగింది జోగినాథం భార్య.

“నాకు కూడా సరిగ్గా తెలియదే... ఈసారి వాడు వచ్చినప్పుడు గుర్తుచేయ్... నిలబెట్టి అడిగేస్తా... అసలు ఏమాత్రం వీలున్నా మనమే పూర్తిచేయిద్దాం ఆ కాస్త పనినీ” అన్నాడతను.

## 6

“మన సిటీ కాలేజీలోనే చదువుతున్నాడు రవిబాబు. ప్రశాంతి కాలనీలో ఇల్లు... రెండో కంటివాడికి తెలియకుండా ఏసేయాలి. ఎంత అవుతుంది?” సాయంత్రం నాలుగు గంటల సమయంలో త్రీ టవున్ లో వుండే శ్యామ్ దాదా దగ్గరికి వచ్చి సూటిగా అడిగాడు రాంసింగ్.

ఆ మాటలు విని చేతిలో వున్న పాన్ పరాగ్ ప్యాకెట్ని చింపి నోటిలో వంపుకుంటూ అతనివంక ఆశ్చర్యంగా చూశాడు శ్యామ్ దాదా.

“బాంబులు వేయటంలో నిన్ను మించినవాళ్ళు ఈ చుట్టుపట్ల ఎవరూ లేరు. రెండింటిని తీసుకుపోయి ఆ ఇంటిపక్కనే పడేస్తే చిటికెలో పని పూర్తి అయిపోతుంది. నాదాకా రావడం దేనికి?”

"అది కూడా అయిపోయింది... అంతకుముందు మాదిరి ఆఖరి క్షణంలో ఎందుకూ పనికిరాకుండా పోయింది నేను పంపించిన బాంబు. అదే గనుక పేలి వుంటే నీ ఎదుట ఇలా దేవిరించుకుంటూ నిలవాల్సిన అవసరం మాకు వుండేది కాదు. చుట్టుదారి మాటలు వద్దు. ఈ పని నీవల్ల అవుతుందో అవదో తేల్చి చెప్పు" ఖరాకండీగా అన్నాడు రాంసింగు.

ఇంకో పాన్ పరాగ్ పాకెట్ని చింపి నోటిలోకి వంపుకుంటూ తన పక్కనే నిలబడివున్న అనుచరుడివైపు చూశాడు శ్యామ్ దాదా "ఫోన్ కొట్టు. ముస్తాఫాకి ఫోన్ కొట్టి ఆ రవిబాబు విషయాలు అడుగు. ఈళ్ళ మాటలు వింటుంటే వాడు సామాన్యుడు కాదని నాకనిపిస్తుంది" అని ఆర్డర్ ఇచ్చి, రెండు నాముషాలు స్థిమితంగా కూర్చోండి.... నాకు తెల్సిన ఓ మనిషికి ఫోన్ చేసి మాట్లాడతా. మాట్లాడాక మీకు సమాధానమిస్తా అన్నాడు.

"ముస్తాఫా అంటే మెయిన్ రోడ్డు మీద గులాబీకేఫ్ ఓనర్... పెద్ద చాలూగాడు... సిటీలో ఏం జరిగినా, చిటికెలో తెలిసిపోతుంది వాడికి... రవిబాబుని గురించి వాడిని అడుగుతున్నాడు" చిన్న కంఠంతో గుసగుసలు పోతున్నట్లుగా భుజంగరాయుడికి చెప్పాడు రాంసింగ్.

"ఇంతకీ మనం వచ్చినపని అవుతుందా, అవదా?" విసుగ్గా అడిగాడు భుజంగరాయుడు.

"అవుతుంది దొరగారూ.... తప్పకుండా అవుతుంది. అడగగానే తల ఊపితే అలుసుగా వుంటుందని చెప్పి, ఇలా కాలక్షేపం చేస్తున్నాడు... మీరు

ఓపికపట్టండి. అంతా మనం అనుకున్నట్టే జరిగిపోతుంది" అంటూ ఆయనకి చెప్పి, శ్యామ్ దాదావైపు చూశాడు రాంసింగు.

ముస్తాఫాకి ఫోన్ చేసి, రిసీవర్‌ని శ్యామ్ దాదాకి అందించాడు అతని అనుచరుడు. "ఏంటీ... గట్టిగా చెప్పు... వినపడి చావటంలేదు. ఇక్కడ అందరూ మనవాళ్ళే... పరాయివాళ్ళు ఎవరూ లేరు...." అని హెచ్చరిస్తూ మధ్యమధ్యలో ఏవేవో జోకులు వేస్తూ, పెద్దగా నవ్వుతూ అవతలివైపు నుంచి వినవచ్చిన మాటల్ని జాగ్రత్తగా ఆలకించి, ఐదు నిముషాల తరువాత ఫోన్ పెట్టేశాడు శ్యామ్ దాదా.

"రంగమ్మ అనీ సిటీ బయట మురికివాడలో వుండే ఆడమనిషి ఆ రవిబాబు దగ్గర పనిచేస్తోందిట.... వంటావార్పూ కూడా తనే చేసిపెడుతోందిట..." రాంసింగు వైపు చూస్తూ చెప్పాడు శ్యామ్ దాదా. విసుగ్గా ఏదో అనబోయిన దొరగారిని మాట్లాడవద్దని సైగచేస్తూ చాలా శ్రద్ధగా ఆ మాటల్ని విని తల ఊపాడు రాంసింగు.

"రంగమ్మ ఊసు ఎందుకు వచ్చిందో చెపుతాను... రంగమ్మకి ఒక లవరు వున్నాడు పాండుగాడు... వాడు మహా ముదురుపిండం... మీ రవిబాబుకి వాడికి దోస్తీలేదు. అయినా సరే రంగమ్మ గనక ఒక మాట అనటం జరిగితే, రవిబాబుని ఏసేయటం నాకు కాదు గదా... ఆ దేవుడికి కూడా సాధ్యపడే పనికాదు. ఆ పాండుగాడు మహా దుర్మార్గుడు. మనసు పెట్టి ఏదైనా పని మొదలుపెట్టడంటే ఆ పని అయిపోయినట్టే.. అది ఎంత కష్టమైంది అయినాసరే, ఆడు రవిబాబుని కాపలా కాయకుండా వుంటే నేను మీ పని చేసి పెడతాను. ఆడు గనుక కల్పించుకుంటే నా వల్ల కాదు. నేను ఏమీ చేయలేను" అన్నాడతను.

''ఈ సిటీలో పాండుగాడికి ఒక్కడికే లేవు తెలివితేటలు. నీకు కూడా వున్నాయి. నువ్వు మనసు పెట్టిచేస్తే పని పూర్తి కాకపోవటం అంటూ వుండదు'' అతను చెప్పింది అంతా విని చాలా తాపీగా అన్నాడు రాంసింగు.

పైకి కనిపించకపోయినా జానెడు పొడుగున విస్తరించింది శ్యామ్ దాదా ఛాతీ ఆ పొగడ్తని వినేసరికి.

''నా మీద నీకు నమ్మకం వున్నందుకు సంతోషంగా వుంది. ఏదో ఒక విధంగా పని పూర్తి అయ్యేటట్టు చూస్తాను... ఓ యాభైవేలు అడ్వాన్సు ఇవ్వండి. పని అయింతర్వాత ఇంకో యాభై యివ్వవచ్చు'' అన్నాడతను.

ఆ మాట విని రాంసింగు తనవైపు చూడగానే, లాల్చీ జేబులో నుంచి ఒక కరెన్సీ నోట్ల కట్టను తీసి శ్యామ్ దాదా మీదికి విసిరాడు భుజంగరాయుడు.

''నేను రేపు ఉదయం మా ఊరు వెళ్ళిపోతాను. సాధ్యమైనంత త్వరగా పని పూర్తి అయ్యేటట్టు చూడు'' అంటూ కుర్చీలో నుంచి లేచాడు.

''మీరు హాయిగా వెళ్ళిరండి.. ఆ పాండుగాడు మధ్యలో దూరకుండా వుండాలంటే మీ రవిబాబుని ఏదో ఒక విధంగా సిటీలో నుంచి అవతలికి తీసుకుపోవాలి. ఆ పని చేయగలిగితే, మహా సుఖంగా వుంటుంది. మీరు నిర్భయంగా మీ ఊరు వెళ్ళిపొండి. హాయిగా వుండండి'' తనూ లేచి నిలబడుతూ అన్నాడు శ్యామ్ దాదా.

“రవిబాబు ఖతమైపోయాడన్న వార్త వినగానే మా శ్రీపతి దోర గుండెఆగి చచ్చిపోవాలి. అప్పుడే నాకు ఆనందం, హాయి. అంతవరకూ ఏదీ వుండదు” అంటూ ఆ ఆవరణలో నుంచి బయటికి వెళ్ళిపోయాడు భుజంగరాయుడు.

“శ్రీపతి దొరగారంటే మనం మాట్లాడుకుంటున్న రవిబాబుకి తండ్రి... మా దొరగారికి, ఆయనకి పగ.... అది చల్లారాలంటే ఆయన హరీ అనాలి. ఇప్పుడు కథ ఏమిటో నీకు అర్థం అయిందా?” తనవంక ప్రశ్నార్థకంగా చూసిన శ్యామ్ దాదాకి చెప్పాడు రాంసింగ్.

అర్థం అయినట్లు తల వూపి అతని వెనుకే వీధిలోకి వచ్చాడు శ్యామ్ దాదా, భుజంగరాయుడితో కలిసి అతను అవతలికి వెళ్ళిపోగానే, “రేయ్.... మీలో ఒకళ్ళు మురికివాడ దగ్గరికిపోయి ఆ పాండుగాడు ఎక్కడ వున్నాడో, ఏం చేస్తున్నాడో వాడి వివరాలను కనుక్కోండి. ఇంకొకళ్ళు ప్రశాంతికాలనీకి వెళ్ళి రవిబాబు ఇంటిమీద నిఘా వేయండి....” అని అనుచరులకు చెప్పాడు.

అతనుపయోగించే హీరో హోండామీద మురికివాడ దగ్గరికి పోయాడో అనుచరుడు. అటుగా వచ్చిన రిక్షాలో ప్రశాంతి కాలనీ దగ్గరికి పోయాడు రెండో మనిషి.

***

“ఆర్తితో వచ్చిన మాకు మీ సన్నిధిలో ఆశ్రయం ఇచ్చి చాలా సహాయం చేశారు. మీ మేలు ఈ జన్మలో మరిచిపోలేము. మేము వెళ్ళి వస్తాము. అనుమతి ఇవ్వండి అయ్యగారూ....” వినసొంపైన మాటలతో శ్రీపతి దొరగారిని వేడుకున్నాడు గోపాలం గురువుగారు.

కొండలమ్మతల్లి దగ్గరికి వెళ్ళి వచ్చిన తర్వాత మొట్టమొదటిసారిగా తనను చూడవచ్చిన గ్రామస్థులతో పిచ్చాపాటీ మాట్లాడుతున్న దొరగారు చిరునవ్వుతో చేతిని ఎత్తి అతన్ని ఆపేశారు.

"చెట్ల కింద పుట్టకిందా కాలక్షేపం చేయాల్సిన అవసరం మీకు లేదు. మీ పని పూర్తి అయ్యేటంతవరకూ యిక్కడే వుండవచ్చు" అని కూడా అన్నారు.

అందుకు ఒప్పుకుంటే చాలా బాగుంటుందని గోపాలానికి అనిపించింది. వెంకటమ్మకి కూడా అనిపించింది. అయితే గురువుగారికి మాత్రం అలా అనిపించలేదు.

"అడవుల్లోపడి మూలికల కోసం వెతుక్కునే వాళ్ళకి ఒక సమయం సందర్భం అంటూ వుండదు దొరగారూ.... అవసరాన్ని బట్టి అర్ధరాత్రిళ్ళు కూడా అటూ ఇటూ తిరగాల్సి వస్తుంది. మీ వంటి పెద్దల పంచన వుంటే మా కదలికలు మీకు చికాకును కలిగించవచ్చు... మా దారిన మేముపోతాం...." అంటూ సమాధానం చెప్పి గౌరవంగా దివాణంలో నుంచి బయటికి వచ్చాడు.

"మనం వచ్చింది మూలికలకోసం కాదు... పాడుపడిన మేడలోని ఆత్మ స్వరూపం కోసం. అది మనం అనుకున్నంత తేలికగా మన చేతికి చిక్కేటట్టు కనిపించటంలేదు. దాన్ని స్వాధీనం చేసుకోవాలంటే పూజలు మొదలుపెట్టాలి. దివాణంలో ఆ పనులు సాగుతాయా?" తన మాటకి ఎదురు చెప్పితే అగ్గిరాముడిలా అరిచి కేకలు పెట్టే గురువుగారు, ఆ రోజు ఎందుకో సౌమ్యంగా,నిదానంగా తన చేతలకు అర్థాన్ని వివరించాడు.

"నిజమే గురువుగారూ... నాదే పొరపాటు.... మనం దివాణంలోకి అసలు వెళ్ళను కూడా వెళ్ళకూడదు....." కొండలమ్మ తల్లి దగ్గర తనకు జరిగిన అనుభవాలను గుర్తుచేసుకుంటూ చెప్పాడు గోపాలం.

"చీకటిపడిన తర్వాత మనం మర్రిచెట్టు దగ్గర్నించి మకాం మార్చి, అడవిలోకి పోదాం. పాడుపడిన మేడకు కాస్తంత దూరంగా బిచాణా వేద్దాం. అందులో వున్న శక్తి ఏమిటో, ఎందుకో అక్కడవుందో బాగా ఆలోచించాలి" అంటూ ముందుకు సాగాడు గురువుగారు.

ఒకరి ముఖం ఒకరు చూసుకుంటూ ఆయన్ని అనుసరించారు గోపాలం, వెంకటమ్మ. వారు ముగ్గురూ మర్రిచెట్టు దగ్గరికి చేరుకుంటుండగా, దుమ్ము తెరలు రేపుతూ వచ్చి, ఎప్పుడూ ఆగే ప్లేస్ లో ఆగింది ఎర్ర బస్సు.

ఎక్కాల్సిన ప్రయాణీకులెవరూ అక్కడ లేకపోయినా, దిగేవాళ్ళు బస్సులో లేకపోయినా, తిరగి ముందుకు కదలలేదు అది. ఇంజన్‌ని ఆపి సిగరెట్ వెలిగించుకుంటూ తాపీగా కిందికి దిగాడు డ్రైవర్.

"ఎందుకు ఆగారు? ఇంజన్ ట్రబులా?" కుతూహలాన్ని అపుకోలేక అతన్ని అడిగాడు గోపాలం.

"ఇంజన్ ట్రబుల్ కాదు. శ్రీపతి దొరగారి బిడ్డడు వస్తానని చెప్పాడట... సిటీకి వెళ్లిపోతున్నాడట. కాలేజీ చదువు కదా... ఇంట్లోనే కూర్చుంటే చదువు ఎలా వస్తుంది?" అంటూ సమాధానం ఇచ్చాడు డ్రైవర్.

నాలుగు నిముషాల తరువాత నలుగురు పాలేళ్ళు వెంట వస్తుండగా బస్ దగ్గరికి వచ్చాడు రవిబాబు.

పరుగులాంటి నడకతో ఎదురెళ్ళి అతని సూట్‌కేస్‌ని, ఎయిర్ బేగ్‌ని, టైట్‌గా ప్యాక్ చేసి వున్న రెండు అట్టపెట్టెల్ని తాము తీసుకున్నారు డ్రైవర్, బస్ క్లీనర్, కండక్టర్. అతని కోసమే ఖాళీగా వుంచిన సీటు దగ్గర వాటిని పెట్టి బస్‌ని ముందుకు కదిలించారు.

బస్సు తమ దృష్టిపథం నుంచి దూరం అయ్యేదాకా అక్కడే నిలబడి, నెమ్మదిగా గ్రామంలోకి వెళ్ళిపోయారు రవిబాబుకి తోడుగా వచ్చిన పాలేర్లు నలుగురూ.

***

తూర్పుదిక్కు తెల్లబడకముందే నిద్ర లేచి, స్నానం చేసి, పదిహేను నిముషాల్లో రెడీ అయింది రంగమ్మ.

"హాయిగా పడుకుని ఆదమరిచి నిద్రపోవాల్సిన సమయంలో ఏమిటే ఈ హడావుడి?" తను పడుకుని వున్న మంచం మీదినించి లేచి, నేలమీద బాసిపట్టు వేసుకు కూర్చుంటూ అడిగింది పిచ్చిమామ్మ.

"రవిబాబు వచ్చేసి వుంటాడు.... తెల్లారకముందే కాఫీ తాగే అలవాటుంది ఆయనకి. ఆలస్యం అయితే ఓర్చుకోలేడు. నేను ప్రశాంతి కాలనీకి వెళుతున్నా" అంటూ గుమ్మందాకా పోయి ఆగింది రంగమ్మ.

"ఏం గుర్తుకు వచ్చిందే తల్లీ?" అడిగింది మామ్మ.

“నువ్వు ముఖం కడుక్కుని టాబూ హోటల్లో ఇడ్లీలు తిను... నేను ఇంటికి వచ్చిం తర్వాత వంట చేస్తాను” అంటూ పమిటె చెంగు ముడిని విప్పి రెండు రూపాయల బిళ్ళనొకదానిని ఆమెకు అందించింది రంగమ్మ.

“దగ్గర చుట్టానికి ఇచ్చినట్టు అదేపనిగా డబ్బులు ఇచ్చేస్తున్నావ్.... ఈ ఋణం ఎప్పటికి తీరుతుందే?” గద్గదమయిన కంఠంతో అడిగింది మామ్మ.

“పొద్దుపొద్దున్నే నువ్వు నీ పిచ్చివాగుడు మొదలుపెట్టి నా బుర్రని తినబోకు. అంతగా తినాలని అనిపిస్తే ఆ ముట్టెపొగరు మగాడు అంటూంటావే.... ఆడి దగ్గరికిపోయి తిను.... నే వెళ్తున్నా....” నవ్వుకుంటూ చెప్పి వేగంగా వెళ్ళిపోయింది రంగమ్మ.

అరక్షణమే ఆగి, ఆ ఇంటి వెనకాల వున్న నీటితొట్టి దగ్గర ముఖం కడుక్కున్నది పిచ్చి మామ్మ. గోడకి ఆనించి వుంచిన తన చేతికర్రని తీసుకుని పాండు ఇంటి దగ్గరికి పోయింది. రాత్రి పన్నెండు గంటల సమయంలో మస్తుగా మందుకొట్టి, ఇంట్లోకి వెళ్ళే ఓపికలేక, గుమ్మం దగ్గరే కటిక నేలమీద పడుకుని వున్నాడు పాండు.

“లేవరా మగాడా... నిద్రలే. నీతో బోలెడంత పని వుంది... కళ్ళు తెరువ్...!” అంటూ చేతికర్రతో అతని భుజాన్ని తట్టింది మామ్మ.

అరనిముషం గడిచిన తరువాత కళ్ళు తెరిచాడు పాండు. అర్ధాంతరంగా నిద్రలేపినందుకు గర్రుగా చూడబోయి, అంతలోనే మనసు మార్చుకున్నాడు.

“నువ్వా మామ్మా... మంచి నిద్ర చెడగొట్టావ్... బ్రహ్మాండమైన కల ఒకటి వస్తోంది. నీ మూలకంగా అది పాడయిపోయింది” అంటూ ఒళ్ళు విరుచుకున్నాడు.

“రంగమ్మ తప్ప ఇంకెవరు నీ కలల్లోకి వచ్చినా నేను ఊరుకోను. లేచి ముఖం కడుక్కో.... నాకు ఆకలి వేస్తోంది....” ఇంటిముందు వున్న అరుగువంటి గట్టుమీద కూర్చుంటూ అన్నది మామ్మ.

“నీయవ్వ... నిన్ను నాకు కాపలా పెట్టినట్టుంది ఆ రాక్షసి. పొద్దున్నే నా మీదకి పంపకం చేసింది. దానికి బుద్ధిలేదు...” అంటూ విసురుగా లేచి వెళ్ళి నీళ్ళ పీపా దగ్గరికిపోయాడు పాండు. అక్కడ ఒక రాయిమీద రెడీగా వున్న పందుంపుల్లతో దంతధావన పూర్తిచేసి ముఖం కడుక్కున్నాడు.

తడి పోయేటట్టు తన షర్టుతోనే తుడుచుకుని “పద.... హోటల్‌కి పోదాం...” అంటూ మెయిన్ రోడ్డువైపు అడుగులు వేశాడు.

“అవునురా అబ్బాయ్... రంగమ్మ అంటే నీకు వల్లమాలిన ఆపేక్ష వుంది కదూ?” అతని పక్కనే అడుగులు వేస్తూ అడిగింది మామ్మ. ఓరగా ఆమెవంక చూస్తూ మౌనంగా వుండిపోయాడు పాండు.

“నువ్వు చెప్పకపోయినా నాకు తెలుసులేరా... నీకు రంగమ్మ అంటే ఇష్టమే....” తనంతట తనే డిక్లేర్ చేసిందామె.

ఇంకో పది అడుగులు వేసిన తర్వాత, “రంగమ్మ నిన్ను పెళ్ళి చేసుకోవాలని అనుకుంటోంది. ఆ పిల్ల నోరు తెరిచి చాలాసార్లు నిన్ను అడిగింది...

అయినాసరే నువ్వు మొగ్గటం లేదు. ఎందుకని? పోషించలేనని భయమా?" అని ఇంకో ప్రశ్న వేసింది.

"అదేంలేదు మామ్మా... సమస్య అదికాదు... నీకు చెప్పినా అర్థం కాదు. నోరు మూసుకో.." అంటూ ఆమె నోటిని మూయించటానికి ట్రై చేశాడు పాండు.

ఫలించలేదు అతని ప్రయత్నం.

"పెళ్ళి అయిన తర్వాత పిల్లలు పుడితే రంగమ్మ నీకు దక్కదని నీ భయం. అంతేకదా?" ఉన్నట్లుండి అడిగింది ఆమె.

అదిరిపడినట్టు చటుక్కున ఆమెకు దూరంగా జరిగాడు పాండు.

"ఏంటి అలా దొంగని చూసినట్టు చూస్తున్నావ్? ఎవరికీ తెలియని మాట నాకు ఎలా తెలిసిందోనని ఆశ్చర్యపడుతున్నావా?" చిరునవ్వుతో అతన్ని ప్రశ్నించిందామె.

"నువ్వు ఎవరివి మామ్మా? నువ్వు అసలు మా దగ్గరికి ఎందుకు వచ్చావ్?" ఆమె మాటలు ఏ ఒక్కటీ తనకేమాత్రం వినబడనట్టు అడిగాడు పాండు.

"రాను రానంటున్నా వినకుండా మీరే నన్ను మీ దగ్గరికి తీసుకువచ్చి ఇప్పుడు ఎందుకు వచ్చానని అడుగుతున్నావా? నీకు అసలు బుద్ధి వుందా?" కోపంగా ముఖం పెడుతూ అన్నది వృద్ధురాలు.

"పొరపాటు అయిపోయింది... ఏమీ అనుకోబోకు. ఎవరికీ తెలియని మాటలు నీకు చకచకా తెలిసిపోతున్నాయి. ఇప్పుడు నా మాటని వదిలేయ్.... మొన్న జోగినాథం బాబాయ్ సూది గుట్టల్లో ఎలా పడిపోయాడో, ఆ విషయాలన్నీ

నీకు తెలిసినట్టు బాగా మాట్లాడావ్... నీకు ఎలా తెలిసింది?" నల్నీ నడక మొదలుపెడుతూ పిచ్చి మామ్మను అడిగాడు పాండు.

"ఎలా తెలిసిందని నిలదీసి అడిగితే ఇప్పటికిప్పుడు సమాధానం చెప్పటం చాలా కష్టం. ఒక పని చేయి.... నువ్వు రంగమ్మని పెళ్ళి చేసుకో.... పిల్లలు పుట్టకుండా జాగ్రత్తలు తీసుకో" అతను అడిగింది ఒకటైతే, తను ఇంకో మాటని గురించి సంభాషణ మొదలుపెట్టింది వృద్ధురాలు.

"ఛ.... ఛ.... అది ఎలా కుదురుతుంది మామ్మా? పెళ్ళి అయిన తరువాత పిల్లలు కలగకపోతే ఏం బాగుంటుంది చెప్పు?" అని అన్నాడు పాండు.

"అదే నీ ముట్టెపొగరుకు నిదర్శనం... పెళ్ళి చేసుకున్న తరువాత ఆడది ఖచ్చితంగా పిల్లల్ని కనితీరవలసిందేనా? కనకుండా కాపరం చేసుకోకూడదా?" కోపంగా అడిగింది మామ్మ.

"చేసుకోవచ్చు మామ్మా... ఎందుకు చేసుకోకూడదు? నిక్షేపంలా చేసుకోవచ్చు. నువ్వు ఒక పని చెయ్యి. ఈ మాట రంగమ్మకి చెప్పు. పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకోమను. అప్పుడు మా పెళ్ళి జరుగుతుంది. చెపుతావా?" ఆమె ముఖంలోకి పట్టిపట్టి చూస్తూ అన్నాడు పాండు.

"రంగమ్మకి చెప్పాలా? అమ్మో.... నా పీకపిసికి చంపేస్తుంది."

"అదే మరి.... అందుకే నేను తప్పించుకు తిరిగేది. పెళ్ళయ్యాక పిల్లలు పుట్టకూడదని బుద్ధి జ్ఞానం వున్న ఏ ఆడది నిద్రలో కూడా అనుకోదు. తినటం తొంగోవటం ఒక్కటే కాదు మనిషికి కావల్సింది.... సంతానం కూడా కావాలి.

ఆళ్ళనీ పెంచి పెద్దచేసి, పెళ్ళిచేసి, పిల్లల్తో హాయిగా బతుకుతుంటే చూడాలి. వయస్సయిపోయాక కొట్టినా తిట్టినా ఆళ్ళ పంచనే రోజులు వెళ్ళతీయాలి. ఆళ్ళ చేతుల్లోనే కళ్ళుమూయాలి. ఈ మాటల్ని పట్టించుకోకపోతే మనిషికి, పశువుకి తేడా ఏముంటుంది?" అని అడిగాడు పాండు.

"ఒరేయ్ అబ్బాయ్... నువ్వు వట్టి ముట్టెపొగరు మగాడివే అనుకున్నాను. చెవులకు పట్టిన తుప్పు వదిలిపోయే మాటలు చెప్పే మొనగాడివి అనుకోలేదు. బాగా చెప్పావ్ రా... మరి మీ బతుకులు ఇలా ఒంటరిగా వెళ్ళమారిపోవల్సిందేనా?" చిన్న కంఠంతో అంది మామ్మ.

"మన చేతుల్లో ఏముంది మామ్మా? ఏమీలేదు.... చచ్చిపోవటానికి రెండు రోజులు ముందర మా నాన్న నాకు ఒకమాట చెప్పాడు. మా పూర్వీకుల్లో ఎవరో అష్టసిద్ధి యంత్రంమనే పేరుగల దేవతకు అన్యాయం చేశారట... అప్పటినుంచీ మాకు ఈ దుర్దశ మొదలయిందిట.... పెళ్ళి చేసుకునే ముందు ఒకటికి రెండుసార్లు గట్టిగా ఆలోచించుకుని మరీ చేసుకోమని చెప్పాడు..." రోడ్డుమీదికి తేరిపార చూస్తూ చెప్పాడు పాండు.

అంతవరకూ హేపీగా అతనితోపాటు అడుగులు వేస్తున్న పిచ్చి మామ్మ ముఖంలో ప్రత్యక్షం అయింది దారుణమైన వేదన. చేతికర్రను వదిలేసి, చేతులతో ముఖాన్ని కప్పుకుంటూ, నడక ఆపి నేలమీద చతికిలపడిపోయింది. ఒళ్ళు కదిలిపోయేలా ఏడ్వటం మొదలుపెట్టింది.

"ఏమయింది మామ్మా? ఎదురుదెబ్బ తగిలిందా? ఏమయింది నీకు?" ఆందోళనగా అడుగుతూ ముందుకు వంగి ఆమె భుజాల్ని పట్టుకున్నాడు పాండు.

“తగలాల్సిన దెబ్బ ఎప్పుడో తరతరాలకిందటే తగిలింది... ఇంకా ఇప్పుడు కొత్తగా తగిలేది ఏముంది? అప్పుడు నేను చేసిన తప్పు నావెంటే వచ్చి యిప్పుడు నన్ను ఎత్తిపొడవటాన్ని భరించలేకపోయాను...” రెండు నిముషాల తరువాత తనను తాను సంబాళించుకుని, అతని అసరాతో పైకి లేస్తూ అన్నదామె.

“అప్పుడేమిటి? తప్పేమాటి? అర్థం అయ్యేలా చెప్పు.....” అయోమయంగా చూస్తూ అడిగాడు పాండు.

“చెపుతానురా అబ్బాయ్.. సమయం వచ్చినప్పుడు అన్ని విషయాలు నీకు సవివరంగా చెపుతాను... ఇప్పుడు నన్నేమీ అడక్కు.. అడుగో... ఆ తాగుబోతు షరీఫు నీ కోసమే ఎదురుచూస్తున్నట్లున్నాడు... వెళ్ళి ఎందుకో తెలుసుకో....” పమిటెచెంగుతో ముఖం తుడుచుకుని, ముందుకు అడుగువేస్తూ అన్నది మామ్మ.

సూటిగా టాబూ హోటల్లోకి దారితీశాడు పాండు. వెయిటర్‌ని పిలిచి మామ్మని చూపించాడు. “ఏమి తింటే అవి పెట్టు. ఎన్ని తింటే అన్ని పెట్టు... డబ్బులు నేనిస్తాను” అంటూ రెండు చాయ్ గ్లాసుల్ని తీసుకుని మళ్ళీ రోడ్డుమీదికి వచ్చాడు.

పెద్ద పెద్ద అడుగులు వేస్తూ వచ్చి షరీఫు అతను అందించిన రెండో చాయ్ గ్లాసును ఆప్యాయంగా పట్టుకున్నాడు.

“అడగక ముందే చాయ్ తాపించేవాడివి ఈ భూ ప్రపంచంలో నువ్వు ఒక్కడివే... అందుకే నువ్వంటే నాకు చచ్చేంత అభిమానం... నీకోసం ఆ శ్యామ్

దాదా మనిషి ఒకడు తిరుగుతున్నాడు... ఏం చేశావ్? ఆ శ్యామ్ గాడి చెంచాల్ని ఎవరినయినా చితకకొట్టావా?" చాయ్ ని చప్పరిస్తూ కాజువల్ గా అడిగాడు.

"శ్యామ్ దాదా మనిషి నాకోసం తిరుగుతున్నాడా? ఎందుకబ్బా? వాడినిచూసి నెలదాటింది. వాడికీ మనకీ విరోధం ఏదీలేదు. ఎందుకు తిరుగుతున్నాడో!" తనలో తనే అనుకుంటున్నట్టు పైకే అన్నాడు పాండు.

"ఎందుకో ఏమిటో నాకు తెలియదు... నిన్న రాత్రి పదింటివరకూ పందిట్లోనే నిలబడ్డాడు. నీకు, నాకు దోస్తీ వున్నట్టు వాడికి తెలుసు. అందుకని నా దగ్గరికి రాలేదుగాని, ఒకళ్ళిద్దరిని నీ గురించి అడిగాడు."

హోటల్ క్లీనర్‌ని పిలిచి ఖాళీ గ్లాసులు అతనికిచ్చేసి, జేబులో నుంచి బీడీ కట్టలను బయటికితీశాడు పాండు. షరీఫుకి ఒకటిచ్చి, తనొకటి వెలిగించుకున్నాడు.

"ఏం చేద్దామనకుంటున్నావ్ భాయీ?" బీడి పొగను గుండెలనిండా పీల్చుకుంటూ అడిగాడు షరీఫు.

"ఇప్పటికిప్పుడు ఏమీ చేయాలని అనుకోవడం లేదు. ఇంకోసారి మళ్ళీ ఎవరైనా వస్తే గట్టిగా చూడు. విషయం తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్. నేనో వారంపాటు ఊళ్ళో వుండటం లేదు అన్నాడు" పాండు.

"వారంపాటు ఊళ్ళో వుండటం లేదా? ఎక్కడికిపోతున్నావ్ భాయీ? గిట్టుబాటు అయ్యేపని అయితే నాకు చెప్పు. నేనూ వస్తాను" ఆశగా అడిగాడు షరీఫు.

“నువ్వు నాతో రాలేవుగాని ఒక పని చెయ్యి. శ్యామ్ దాదాగాడి వ్యవహారం నాకెందుకో అనుమానం కలిగిస్తోంది. ఇవాల్టినుంచీ నువ్వు రంగమ్మని గట్టిగా కాపలాకాయి. నేను తిరిగి వచ్చేంతవరకూ ఒంటరిగా ఎక్కడికీ పోనీయకు...” అంటూ ప్యాంటు జేబులోనుంచి రెండు పెద్ద కరెన్సీ నోట్లను తీసి అతనికిచ్చాడు పాండు.

పెట్రోమాక్స్ లైటయిపోయింది షరీఫు ముఖం.

“నువ్వు నిశ్చింతగా వెళ్ళిరా భాయీ... ఇక రంగమ్మ పని మటాష్. అయిపోయినట్టే... నన్ను వదిలించుకోవటం ఆ బిడ్డతరంకాదు...” రెట్టించిన ఉత్సాహంతో చెప్పాడు ఆ నోట్లని జాగ్రత్తగా జేబులో పెట్టుకుంటూ.

“ఏమిట్రా ఏమిటా మంతనాలు? రంగమ్మపని మటాష్ అంటున్నారేమిటి....?” టిఫిన్ చేసి, టీ తాగి, వాళ్ళ దగ్గరికి వస్తూ అడిగింది పిచ్చి మామ్మ.

“ఏమీ లేదులే మామ్మా! ఏదో మాట్లాడుకుంటున్నాం. నీకు సంబంధించిన మాటలు కాదులే” అంటూ అర్జంటు పని ఏదో గుర్తుకువచ్చినట్లు చటుక్కున వెనక్కి తిరిగి పందిరి దగ్గరికి వెళ్ళిపోయాడు షరీఫు.

“నువ్వు ఊరొదిలిపెట్టి వెళ్ళిపోతున్నావా? తిరిగి ఎప్పుడు వస్తావ్?” పాండుకేసి చూస్తూ అడిగింది పిచ్చి మామ్మ.

ఆశ్చర్యంగా ఆమె ముఖంలోకి చూశాడు పాండు.

“మరీ అంతలా ఆశ్చర్యపడబోకు... హోటల్లోనుంచి బయటికి వస్తున్నప్పుడు గాలివాలున నీ మాటలు నాకు వినిపించాయి....” గారపట్టిన దంతాలన్నీ బయటికి కనిపించేటట్టు నవ్వుతూ అంది పిచ్చిమామ్మ.

“వెళుతున్నాను మామ్మా.... తిరిగి రావటానికి వారం పడుతుంది. ముందుగా చెపితే గోలచేస్తుందనిచెప్పి రంగమ్మతో అనలేదు. నెమ్మదిగా నువ్వు చెప్పు” అన్నాడు పాండు.

“రంగమ్మకి నేను చెపుతాలే... నువ్వు క్షేమంగా వెళ్ళి లాభంగా రా... వెళ్ళు” అన్నది ఆమె.

హోటల్లో ఆమె తిన్న టిఫిన్‌కి, తను తీసుకున్న రెండు టీలకు బిల్లు చెల్లించి, పక్కనేవున్న బడ్డీలో రెండు బీడీకట్టల్ని తీసుకుని, సుమారు పాతిక రూపాయల చిల్లరను మామ్మ చేతిలో పెట్టాడు పాండు.

“ఎందుకురా అబ్బాయ్ ఈ డబ్బులు....?” గద్గద స్వరంతో అనబోయిన ఆమె భుజంతట్టి చిరునవ్వు నవ్వాడు. “అవసరం అయితే వాడుకో, అవసరం లేకపోతే నేను వచ్చింతర్వాత ఇచ్చేయ్.... నేను వెళ్ళివస్తా....” అంటూ ఆమె సమాధానం కోసం ఎదురుచూడకుండా, అప్పుడే వచ్చిన సిటీబస్ వైపు పరుగుతీశాడు.

బుగ్గల మీదికి బిరబిరా వచ్చేసిన కన్నీటిని తుడుచుకోనుకూడా తుడుచుకోకుండా ఆ బస్ దృష్టిపథం నుంచి దూరం అయిపోయేదాకా అలాగే చూస్తూ నిలబడిపోయింది పిచ్చిమామ్మ. ‘నా తల్లి... నిన్ను అష్టకష్టాలపాలు చేసి

ఆనందిస్తున్న నా భగవతి నిన్ను క్షేమంగా చూడాలి.... నా ఆర్తిని తీర్చటం నీవల్లనే అవుతుంది... నువ్వు కలకాలం హాయిగా జీవిస్తావ్....' అని తనలోతనే అతన్ని గురించి అనుకుంటూ సిటీలోకి బయలుదేరింది.

జోగినాథం బాబాయ్ చెప్పినట్టు సూదిగుట్టల్లో ఒక వారంపాటు ఎవరికీ కనపడకుండా తలదాచుకుని ఆ తరువాత అడవిలో తిరిగి తిరిగి అలసిపోయినట్లు నీరసంగా అడుగులువేస్తూ గంగరాజు దగ్గరికి పోవాలని చాలా గట్టిగా నిర్ణయించుకున్నాడు పాండు.

నవరాత్రి పందిరి దగ్గర్నించి బయలుదేరిన ఒక గంటకి సూదిగుట్టల ఎదుటికి తీసుకుపోయే కంకర రోడ్డును చేరుకున్నాడు అతను. బీడీని వెలిగించుకుని తాపీగా అడుగులు వేయటం మొదలుపెట్టేసరికి పాతికగజాల దూరం పోయాక వచ్చేసింది అతనికి ఒక అనుమానం. నోట్లో వున్న బీడీని అవతలకు విసిరేసి, కంకరరోడ్డు పక్కనే వున్న చింతచెట్టు మీదికి జంప్ చేశాడు.

గుబురుగా వున్న కొమ్మల్ని చాటు చేసుకుంటూ గుట్టలకేసి చూశాడు. ఎగుడు దిగుళ్ళల్లో ఎగిరి ఎగిరి పడుతూ వేగంగా గుట్టల్లోనుంచి రోడ్డు మీదికి వచ్చేసింది ఎక్సయిజ్ డిపార్టుమెంట్ వాళ్ళ వాహనం ఒకటి.

గుట్టల మధ్యలో సారాబట్టీలు నడిపే హీరోలు అందరూ అందులో వుండటాన్ని చూసేసరికి నోరు ఎండుకుపోయిన సెన్సేషన్ కలిగింది పాండుకి.

గుడ్డిగా తను ముందుకేపోయి, ఆ వెహికల్ లో వున్న ఎక్సయిజ్ ఇన్స్పెక్టర్ కళ్ళపడటం జరిగివుంటే... ఆ తరువాత ఏం జరిగివుండేదో ఊహించుకునే సరికి వేపాకు నమిలినట్టు చేదుగా తయారైంది అతని నోరు.

సూదిగుట్టల్లో కాలక్షేపం చేయటం జరిగేపని కాదని అర్థం అయిపోయిందతనికి. అందుకు అతిగా బాధపడలేదతను. ఇల్లు వదిలి బయటికి వచ్చిన తర్వాత కాలక్షేపం చేయటానికి సూదిగుట్టయినా, నల్లకొండలు అయినా ఒకటే అని కూడా అనిపించి, అంతే! రెండో ఆలోచన ఏదీ లేకుండా, ఒక గంటసేపయిన తరువాత అటుగా వచ్చిన ఎర్రబస్సును కేచ్ చేశాడు.

ఎంతసేపు ఎదురు చూసినా కూరగాయల బళ్ళు ఒక్కటి కూడా కాలనీలోకి రాకపోవడంతో సంగయ్య దుకాణం దగ్గరికి వెళ్ళింది రంగమ్మ.

“రవిబాబుకి ఆకలి వేస్తోందిట... ఉప్మా చేసేస్తాను. టొమేటోలు, ఆలుగడ్డలు ఇవ్వు” అంటూ వుండగా, ఆమెకు కనిపించింది ఆటోలో వచ్చిన ఆ అమ్మాయి.

“రవిబాబుతో పాటు కాలేజీలో చదువుతోందిట... పేరు అపూర్వ చాలా మంచిపేరు... నిన్న సాయంత్రం వచ్చింది. బాబు ఇంకా రాలేదని చెప్పేసరికి చిన్న ముఖం చేసుకుని వెళ్ళిపోయింది” ఆ అమ్మాయిని చూడగానే అడగకపోయినా రంగమ్మకి చెప్పాడు సంగయ్య.

చక్కటి మేనిఛాయతో ఒకసారి చూస్తే మళ్ళీ మళ్ళీ చూడాలని అనిపించేటంత ఆకర్షణీయంగా వున్న ఆ అమ్మాయిని చూసి చిన్నగా నవ్వింది రంగమ్మ.

“అదేపనిగా పళ్ళు ఇకిలిస్తున్నావ్... ఆ పిల్ల నీకు తెలుసా?” ఆశ్చర్యంగా అడిగాడు సంగయ్య.

“మర్యాదగా మాట్టాడు... ఇవ్వాళో రేపో రవిబాబుకి కాబోయే భార్య... పెద్దోళ్ళకి చెప్పి పెళ్ళి చేసుకోవటం ఒక్కటే మిగిలింది” అంటూ గబగబా వెనక్కి మళ్ళిందామె.

“నేను ఇవాళ మా వూరు వెళ్ళిపోతున్నా... మా డాడీ అర్జంటుగా రమ్మని ఫోన్ చేసారు. మన సంగతి ఏమయింది? మీ నాన్నగారికి చెప్పావా లేదా?” ఇంట్లోకడుగు పెడుతూనే రవిబాబుని బంబార్డ్ చేస్తూ ఆమెకు కనిపించింది ఆ పిల్ల.

గుమ్మంలోకి వచ్చిన రంగమ్మవైపు చూసి చిన్నగా నవ్వాడు రవిబాబు.

“పెళ్ళి విషయం మాట్లాడుతోంది. మా నాన్నగారితో నేను మాట్లాడలేను. ఇప్పుడు నన్నేం చేయమంటావ్ రంగమ్మా?” అని ఆమెనే సలహా అడిగాడు.

“చేసేది ఏముంటుంది బాబూ? ముందు ఆ పిల్ల నాన్నగారిని ఒప్పించండి. ఆయన్నే మీ నాన్నగారి దగ్గరికి రమ్మని చెప్పండి. ఆయన వచ్చేలోగా మీరు మీ నాన్నగారికి చెప్పండి. ఆడపిల్లోళ్ళు మగవాళ్ళ దగ్గరికి పోవటం మర్యాద.

మగవాళ్ళు ముందుగా ఆడపిల్లోళ్ళ దగ్గరికిపోరు....." తనకు తెలిసింది చెప్పింది రంగమ్మ.

"మా డాడితో మాట్లాడాలంటే నాకు భయంగా వుంది. కాదు పొమ్మంటారేమోనని భయం...." మాటల కోసం తడుముకుంటున్నట్టు నెమ్మదిగా చెప్పింది ఆ పిల్ల.

"పోనీ... ఒక పని చేయండి బాబూ... అపూర్వమ్మతోపాటు మీరు కూడా వాళ్ళ వూరు వెళ్ళి వాళ్ళ నాన్నగారిని డైరక్టుగా అడిగేయండి... ఆ తరువాత పెద్దోళ్ళు పెద్దోళ్ళు మాట్లాడుకోవచ్చు" వంటింట్లోకి పోతూ చెప్పింది రంగమ్మ.

పది క్షణాలు ఆలోచించి మెల్లిగా తలూపాడు రవిబాబు.

"త్వరగా టిఫిన్ పెట్టు ఇద్దరం కలిసి వెళతాం. రేపు సాయంత్రానికి తిరిగి వచ్చేయచ్చు" అని అన్నాడు రవిబాబు.

పది నిముషాల్లో టిఫిన్ తయారుచేసి, వారిద్దరినీ డైనింగ్ టేబిల్ దగ్గరికి పిలిచింది రంగమ్మ.

***

"అవును.... కాలేజీలో తనతోపాటు చదివే అమ్మాయితో కలిసి వాళ్ళ ఊరు వెళుతున్నాడు రవిబాబు. నల్లకొండల దగ్గర వున్న నారాయణపురం.... బస్ స్టేషన్లో అడిగితే తెలిసింది" ఉదయం తొమ్మిది గంటల సమయంలో శ్యామ్ దాదాకి రిపోర్ట్ చేశాడు రవిబాబు ఇంటి దగ్గర కాపలాకి నియమించబడిన అనుచరుడు.

పాన్ పరాగ్ ప్యాకెట్‌ని చింపి నోటిలోకి వంపుకుంటూ ఆనందంగా నవ్వాడు శ్యామ్ దాదా.

“మనం చేయాలని అనుకున్నపని దానంతట అదే జరిగిపోయింది. నారాయణపురం నుంచి రవిబాబు తిరిగి సిటీలోకి రాకూడదు. అక్కడే ఖతమ్ చేసి అవతల పారేద్దాం. మనవాళ్ళు ఓ పదిమందిని ప్రయాణానికి రెడీ అవమని చెప్పు.... ఇంకో గంటలో మన ప్రయాణం....” అని అన్నాడు.

అతను చెప్పినట్టే ఖచ్చితంగా ఒక గంట గడిచిన తరువాత సిటీలో నుంచి కదిలి, సూదిగుట్టల పక్క నుంచి నల్లకొండలవైపు బయలుదేరాయి రెండు జీపులు.

***

“అయ్యగారో! అమ్మాయిగారు వచ్చేశారు. పట్నం నుంచి వచ్చిన ఎర్ర బస్సులో దిగారు... పక్కనే ఎవరో కుర్రాడున్నాడు... ఎవరయిందీ నాకు తెలియలేదు” పరుగులాంటి నడకతో వచ్చి, తమ బంగళావంటి మండువా ఇంటిముందు కూర్చుని వున్న రత్నంగారితో చెప్పాడు ఆయన పాలేర్లలో ఒకతను. ముగ్గురు స్నేహితులున్నారు రత్నంగారికి. పొద్దుటా సాయంత్రం వాళ్ళతో ఒక గంటసేపయినా కబుర్లు చెప్పుకోకపోతే ఆయనకు ఏమీ తోచదు.

ఇప్పుడు కూడా వాళ్ళతోనే ఏదో మాట్లాడుతున్నాడు.

“ఎవరో కుర్రాడు వున్నాడా? ఎవర్రా వాడూ?” కోపం నిండిన కంఠంతో చాలా కరుకుగా అడిగాడు రత్నంగారు.

"నువ్వు తొందరపడకు.... చిన్న కుర్రాడేమో... బస్సులో పరిచయం అయ్యాడేమో? అడుగుదాం...." అంటూ పాలేరువైపు తిరిగాడు అతని స్నేహితుల్లో ఒకతను.

"చిన్నకుర్రాడు కాదు బాబూ, పెద్ద కుర్రాడే. ఎర్రగా, బుర్రగా, ఎత్తుగా చాలా బాగున్నాడు. అమ్మాయిగారితోపాటు తను కూడా కాలేజీలో చదువుతూ వుండివుంటాడు...." తడుముకోకుండా చెప్పాడు ఆ పాలేరు.

కూర్చున్న కుర్చీలో నుంచి మహా విసురుగా పైకి లేచాడు రత్నంగారు.

"నువ్వు ఎక్కడికి? వాళ్ళకి ఎదురు వెళతావా? ఎదురువెళ్ళి వీధిలో గలాటా చేస్తావా? నీకు మతిపోయిందా కూర్చో...." అంటూ అతన్ని బలవంతంగా కుర్చీలో కూర్చోబెట్టారు అతని స్నేహితులు.

రుసరుసలాడుతూ ఆయన కుర్చీలో కూర్చోవటం, రవిబాబుని వెంటబెట్టుకుని ఆయన కూతురు అపూర్వ ఆ కాంపౌండ్ లోకి ఎంటరవటం ఒకేసారి జరిగింది.

"ఆయనే మా డాడీ" ఆయన్ని చూపిస్తూ రవిబాబుకి చెప్పింది అపూర్వ.

"డాడీ... ఇతను నా క్లాస్‌మేట్. పేరు రవిబాబు. వీళ్ళది" అంటూ అతన్ని పరిచయం చేయటానికి ప్రయత్నం మొదలుపెట్టిన వెంటనే, ఆమె మాటల్ని అడ్డుకుంటూ "ఎందుకు వచ్చావ్" రవిబాబువంక తీక్షణంగా చూస్తూ అడిగాడు రత్నంగారు.

“డాడీ! ఇతను నా క్లాస్‌మేట్... నేనే రమ్మని తీసుకువచ్చాను....” ఖంగారుగా ఒక్కోమాటా చెప్పబోయింది అపూర్వ.

“నువ్వు నోరు మూసుకో.... అతన్ని చెప్పనీ... నువ్వు ఎందుకు వచ్చావ్?” ఆమెను గద్దిస్తూ, రవిబాబుని ఇంకోసారి అడిగాడాయన. తమ పెళ్ళి విషయం ఆయనతో మాట్లాడటానికి అపూర్వ ఎందుకు భయపడుతోందో వెంటనే అర్థం అయింది రవిబాబుకి. తన మాటల్ని అవతలి వాళ్ళు వినిపించుకోవాల్సిందే తప్ప, అవతలి వారి మాటలను ఆలకించే తత్వం అమె ఫాదర్‌కి వున్నట్లు కనపించటం లేదు.

ఆయనతో వ్యవహారం అప్పటికప్పుడు అటో ఇటో తేల్చిపారేయటమే మంచిది అనిపించి, “నేను మీ అమ్మాయిని ప్రేమిస్తున్నాను. మీరు ఒప్పుకుంటే పెళ్ళి చేసుకోవాలని అనుకుంటున్నాను. మాది ఇక్కడికి దగ్గర్లోనే వున్న” అంటూ మొదలుపెట్టాడు.

ప్రేమ సంగతి అతని నోటివెంట బయటికి వచ్చిన మరుక్షణం తోక తొక్కిన మాదిరి చివాలున కుర్చీలోనుంచి లేచాడు రత్నంగారు.

“ఇంకోసారి నువ్వు గనక నోరు తెరిచి ఇంకొక్కమాట మాట్లాడావంటే చెప్పు తీసుకుని పళ్ళు రాలగొడతాను. మర్యాదగా ఇక్కడినించి వెళ్ళిపో... వెళ్ళిపో...” విపరీతమైన కోపంతో పూనకం వచ్చినట్టు ఊగిపోతూ గొంతు చించుకుని అరిచాడు.

"నాన్నా అతను నా స్నేహితుడు... అతడిని అవమానించటం మర్యాద కాదు... డాడీ..." ఆందోళనగా తండ్రి మాటలను అడ్డుకోబోయింది అపూర్వ.

కంటికి కనిపించనంత వేగంగా చేతిని విసిరాడు రత్నంగారు. ఛళ్ మని శబ్దం చేసింది అపూర్వ చెంప.

నిలదొక్కుకోవటం చేతకాక తూలి పక్కకు పడిపోయింది ఆమె. ఆమె దగ్గరికి పోబోయిన రవిబాబు షర్టును పట్టుకుని, బర్రున వెనక్కి గుంజాడు రత్నంగారు. "వెళ్ళిపో.... పో...." అని వికృతంగా అరిచాడు.

"వెళ్ళవయ్యా... వెళ్ళు. వెళ్ళిపోమ్మని చెపుతుంటే నీకు అర్థం కావటంలేదా? వెళ్ళిపో" అంటూ తాము కూడా రత్నంగారి మాటలకి వంత పాడారు ఆయన స్నేహితులు. రవిబాబు చేతుల్ని గట్టిగా పట్టుకుని బరబరా ఆవరణ వెలుపలికి లాక్కు వచ్చి వీధిలోకి విసురుగా నెట్టేశారు.

కన్నుమూసి కన్ను తెరిచేటంతలో జరిగిపోయింది ఆ సంఘటన. తన మనస్సులోని మాటలను వినకుండా వాళ్ళు అలా అడవి మనుషుల్లా ప్రవర్తించినందుకు ఆగ్రహించాలో, దారుణమైన అవమానానికి గురైనదందుకు కుంగిపోవాలో తెలియని అయోమయ పరిస్థితిలో చిక్కుపడ్డ రవిబాబును పలకరించాడు వీధిలో నిలబడి లోపల జరిగినదంతా ప్రత్యక్షంగా చూసిన నారాయణపురం గ్రామస్థుడు ఒకతను "రత్నంగారి పద్ధతే వేరు బాబూ... వట్టి మూర్ఖుడు... తను అనుకున్నదే జరిగి తీరాలంటాడు. ఎదుటివాళ్ళ మాటల్ని అస్సలే మాత్రమూ విన్పించుకోడు. ఇంకోసారి మీరు ఎదురైతే ఇంకా రెచ్చిపోతాడు...

ఇవతలికొచ్చేయండి....” అంటూ చేయి పట్టుకుని నెమ్మదిగా ఆ వీధిలో నుంచి దూరంగా తీసుకుపోయాడు.

“ఎవరు శివయ్యా? ఎవరీ కుర్రాడు?” రచ్చబండ దగ్గర కూర్చుని వున్న ఓ గ్రామస్థుడు అతన్ని ప్రశ్నించాడు.

“రత్నంగారింటికొచ్చాడు....ఆళ్ళ అమ్మాయితోపాటు కాలేజీలో చదవుకుం టున్నాడట.. అర్జంటు పని ఏదో గుర్తుకువచ్చిందట. పట్నం వెళ్ళిపోవాలి. మన బస్సులేదు వెళ్ళిపోయింది. ఇప్పుడు ఏం చేయాలో ఆలోచిస్తున్నాం” రవిబాబు చేయాల్సిన పనేమిటో తనకు తానే డిసైడ్ చేసేసినట్టు చెప్పాడు శివయ్య.

“బస్సు వెళ్ళాక ఇక చేసేదేముంది? రేపు ఉదయం బయల్దేరటమే. మరీ అర్జంటు అయితే రాఘవాపురం వెళ్ళి రాత్రి పన్నెండింటికి వచ్చే రైలు ఎక్కటమే!” అన్నాడు రచ్చబండ దగ్గర కూర్చున్న గ్రామస్థుడు.

అతనితో మరింకేమీ మాట్లాడక పక్కనే వున్న చిన్నపాక దగ్గరికి రవిబాబును తీసుకుపోయాడు శివయ్య. “మంగమ్మా... వేడివేడిగా మంచి టీచేసి ఇవ్వు. బాబు కాళ్ళు కొట్టుకుంటూ రాఘవాపురం పోవాలి. పద్దెనిమిది మైళ్ళ నడక.... పులుసు కారిపోద్ది....” అంటూ ఆ పాకలో వున్న మధ్య వయస్కురాలికి చెప్పాడు.

చకచకా టీకాచి రవిబాబు చేతికి అందించింది ఆ స్త్రీ. “పట్నం బాబులికి అడవిదారిలో అడుగులు వేయటం అంతగా అలవాటుండదు... తోడు ఎవరినైనా పంపిస్తే బాగుంటుంది” అని సలహా కూడా యిచ్చిందామె.

ఆ మాటల్ని విన్నాక తనను ఆవరించుకుని వున్న అయోమయ స్థితిలో నుంచి బైటపడ్డాడు రవిబాబు.

"అడవిదారుల్లో అడుగులు వేయటం, నాటురోడ్ల మీద నడవటం నాకు అలవాటే... నా గురించి మీరు అనవసరమైన ఇబ్బందులు పడవద్దు. రాఘవాపురం రైల్వేస్టేషన్ నాకు తెలుసు... ఒంటరిగా వెళ్ళగలను" అంటూ టీ తాగి అందుకు డబ్బులు ఇవ్వబోయాడు.

"మీరు మాకు అతిథులు. మీకు మర్యాద చేయటం మా విధి.... కర్తవ్యం. జరిగినదాన్ని గురించి ఆలోచించకుండా హాయిగా వెళ్ళిరండి..." అతన్ని ఇవ్వనీయకుండా అడ్డంపడుతూ అన్నాడు శివయ్య.

ఎడమ చేతివైపున వున్న వీధిలో అడుగులు వేయించి, నాలుగు నిముషాల తరువాత ఊరి వెలుపలికి తీసుకెళ్ళాడు. పాము మెలికలు తిరుగుతున్నట్టుగా వుంది అక్కడి నాటురోడ్డు. దట్టమైన అడవిలోకి దారి తీస్తోంది.

"నువ్వు ఎవరివో నాకు తెలియదు. నీవు చేస్తున్న సాయం నేను మర్చిపోలేను...." ఆ దారిని అనుసరించటానికి రెడీ అవుతూ అన్నాడు రవిబాబు.

"నా పేరు మీరు విన్నారు... శివయ్య.. బార్బర్ని. నాలుగు సంవత్సరాల క్రితం వరకూ నేను కూడా పట్నంలోనే వుండేవాడిని... ఏపని చేసినా కలిసి రాకపోవటంతో ఇక్కడికి వచ్చేశాను... ఇప్పుడు ఫరవాలేదు. ఒక ఎకరం పొలం కొనుక్కున్నాను... ఇద్దరు పిల్లలు...." అంటూ తనని పరిచయం చేసుకుంటూ నమస్కారం చేశాడా మనిషి.

“ఇంకోసారి ఎప్పుడైనా పట్నం వస్తే ప్రశాంతి కాలనీకి వచ్చేయ్. రవిబాబు ఇల్లు అని అడిగితే ఎవరైనా చెపుతారు. తప్పకుండా రా” అంటూ అతనికి వీడ్కోలు పలికి ముందుకు అడుగేశాడు రవిబాబు.

రెండు నిముషాలపాటు పొలిమేరలోనే నిలబడ్డాడు శివయ్య. అతను ఒక మలుపు తిరిగి దృష్టిపథం నుంచి దూరం అయిన తర్వాత వెనుతిరిగి గ్రామంలోకి బయలుదుతుండగా, దుమ్ముతెరలు రేపుకుంటూ వేగంగా వచ్చి అతని పక్కన ఆగాయి రెండు జీప్‌లు.

“అరె శివయ్యా... నువ్వా? నువ్వు ఇక్కడున్నావేంటి?” ముందు జీప్‌లో నుంచి తల బైటికి పెడుతూ అడిగాడు. చాలా దూరం నుంచి ప్రయాణం చేసి రావటం వల్ల అలసిపోయినట్టుగా కనిపిస్తున్న శ్యామ్ దాదా.

అతన్ని గుర్తుపట్టి నవ్వాడు శివయ్య. “రాకరాక మా ఊరు వచ్చావ్... మా ఇంటికిపోదాం.... పదపద...” అంటూ ఆప్యాయంగా పలకరించాడు.

“అరె భాయీ.... ఇది నీ ఊరేనని మాకు తెలియదు. తెలిసి వుంటే ఎంతో మజాగా వుండేది... ఇప్పుడు అర్జంట్‌గా రాఘవాపురం పోతున్నాం. ఈసారి వచ్చినప్పుడు తప్పకుండా మీ ఇంటికి వస్తాం, మాంచి విందు భోజనం పెడుదువుగాని. వెళ్ళొస్తాం” అంటూ అతని భుజం తట్టి పోనిమ్మని డ్రైవర్‌కి సైగచేశాడు శ్యామ్ దాదా.

శివయ్య చూస్తూ వుండగానే రివ్వుమని ముందుకు దూసుకుపోయాయి ఆ జీప్‌లు... అవి కూడా తన దృష్టిపథం నుంచి దూరం అయిన వెంటనే అటూ ఇటూ

చూసి, తన దుస్తుల్లో వున్న సెల్ ఫోన్ బయటికి తీశాడు అతను... చటుక్కున దారిపక్కనే వున్న ఒక చింతచెట్టుకు చాటుకిపోయి ఒక నెంబర్ ని ప్రెస్ చేశాడు.

"అరె శివయ్య! చాలారోజులైంది నీతో మాట్లాడి... ఏంటి కథ?" అంటూ బొంగురుగా వినవచ్చింది సిటీలోవున్న గులాబీ కేఫ్ ఓనర్ ముస్తాఫా కంఠం.

"శ్యామ్ దాదా మా ఊరోచ్చాడు. ఎందుకొచ్చాడు? జంగిల్‌లో దాక్కుని వున్న సాతూర్ బ్యాంక్ దొంగలకోసమా?" తన మాటలను వినటానికి అక్కడ ఎవరూలేరని నిశ్చయం చేసుకుంటూ అడిగాడు శివయ్య.

"అరె భాయీ... ఆ దొంగల గురించి శ్యామ్ దాదాకి తెలియదు... ఆడు వచ్చింది ఇంకో పని మీద.... రవిబాబని ఒక కాలేజీ కుర్రాడు మీ ఊరి అమ్మాయిని లవ్వాడాడు... పెళ్ళి మాటలు మాట్లాడుకోటానికి ఆ పిల్లతో కలిసి మీ వూరే వచ్చాడు. ఆ రవిబాబును ఏసేయటానికి ఈడు లక్షరూపాయల కాంట్రాక్ట్ ఒప్పుకున్నాడు."

"అయ్యయ్యో!" అన్నాడు శివయ్య.

"ఏందిబే? ఏమంటున్నావు నువ్వు?" ఆ మాట అర్థంకాకపోవటంవల్ల ఆశ్చర్యంగా అడిగాడు ముస్తాఫా.

రవిబాబుని అంతకముందే తను అవతలికి పంపిన మాట అతనికి చెప్పాలని అనిపించకపోవటంవల్ల, ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వలేదు శివయ్య.

"కాలేజీ కుర్రాడిని ఏసేయటానికొచ్చాడని ఏ మాత్రం ముందు తెలిసినా, ఏదో ఒక విధంగా శ్యామ్ దాదాని బెదిరించి ఎంతో కొంత వసూలు చేసేవాడిని,

మంచి ఛాన్స్ మిస్ అయిపోయిందని బాధగా వుండి అయ్యయ్యో అన్నాను. అదిసరే ఇంక వుంటాను" అంటూ తన సెల్ ని స్విచాఫ్ చేయబోతుండగా, "అరే భాయీ... కొంచెం ఆగు... నీకు ఇంకో విషయం చెప్పాలి. నేను నీకు ఫోన్ చేద్దామని అనుకుంటూ వుండగా నువ్వే చేసినవ్. పాండు అనీ మనోడే, మనకి ఖాస్ దోస్తు... నీ దగ్గరికి పొమ్మని చెప్పినా, సాతూర్ బ్యాంక్ పనిమీద వస్తాడు. అతను అడిగిన సాయం చెయ్యి. పని పూర్తి అయితే నజరానా నీకు దండిగా దొరుకుతుంది. సరేనా?" అన్నాడు ముస్తాఫా.

"పాండు.... మన పాండు... మురికివాడలో వుంటాడు... అప్పుడెప్పుడో టూ టవున్ పోలీసులతో గొడవపడి రెండు నెలలు జైల్లో వున్నాడు... అతనేనా?" అడిగాడు.

"ఓరినీ... నీకు బాగా గుర్తుందే! ఆడే... మనోడే... జాగ్రత్తగా చూసుకో..." అంటూ ఫోన్ కట్ చేశాడు ముస్తాఫా.

తన ఫోన్‌ని దుస్తుల్లో జాగ్రత్తగా చేసుకుంటూ చింతచెట్టు చాటు నుంచి ఇవతలికి వచ్చాడు శివయ్య. ఎంత వద్దని అనుకున్నా అడవి దారివైపు మరలకుండా వుండలేకపోయాయి అతని చూపులు.

శ్యామ్ దాదా రవిబాబుని ఓవర్ టేక్ చేసి, తలనరికి అడవిపొదల్లో పారేసి వుంటాడన్న మాట మెదిలింది అతని మనస్సులో.

‘ఎక్కడినుంచో వచ్చి ఎటూకాని చోటులో అనాథ ప్రేతం అయిపోవాల్సిన గీత అతని ముఖంమీద రాసిపెట్టి వుంది. అందుకు మనం చేయగలిగింది ఏమీలేదు....’ అనుకుంటూ గ్రామంలోకి బయలుదేరాడు.

సరిగ్గా పది అడుగులే వేశాడు అతను. పదకొండో అడుగు వేయబోతుండగా, వేగంగా అడుగులు వేస్తూ అతనికి ఎదురు వచ్చింది ఓ చక్కటి పర్సనాలిటీ. అతని ముఖంకేసి ఎగాదిగా చూస్తూ “శివయ్య అంటే నువ్వేనా?” అని అడిగింది.

తను కూడా పట్టి పట్టి చూసి చిరునవ్వు నవ్వాడు శివయ్య. “నువ్వు పాండువి... గులాబీ కేఫ్ ముస్తాఫా నీకు నాగురించి చెప్పాడు... మన ఇద్దరికి పరిచయం పెద్దగా లేదుగాని, నాలుగైదుసార్లు నా దగ్గర క్రాఫ్ వేయించుకున్నావ్....” అని అన్నాడు అతని భుజంమీద చేయివేస్తూ.

“ఓరి నీయవ్వ... నువ్వా... శివయ్య అంటే ఇంకా ఎవరో అనుకున్నాను.... పట్నం దెబ్బ తట్టుకోలేక ఈడకి వచ్చేశావా? భలేగా వుంది. పద... పద. మంచి చోటులో కూర్చుని మనం మాట్లాడుకోవలసిన మాటలు చాలా వున్నాయి” అంటూ ప్యాంటు లోపల దోపుకుని వున్న ఒక విస్కీ బాటిల్‌ని అతనికి చూపించాడు పాండు.

అది చూసి నోరు ఊరిపోయింది శివయ్యకి. “మంచి మందు కొట్టి చాలాకాలం అయింది. పద... పద...” అంటూ వేగంగా అడుగులు వేసి, మళ్ళీ రచ్చబండ దగ్గర వున్న పాక దగ్గరికి తీసుకుపోయాడు.

"మేము వెనకాల కూర్చుంటాం. ఎవరొచ్చి అడిగినా చూడలేదని చెప్పు" అని ఆ పాకలో వున్న నడివయసు స్త్రీకి ఇన్స్ట్రక్షన్స్ ఇచ్చి పాక వెనుకభాగంలో వున్న ఒక చెట్టుకింద సెటిలైపోయాడు.

రెండు గ్లాసులు, కరకరలాడే పకోడీలున్న రెండు ప్లేట్లు, పెద్ద లోటానిండా నీళ్ళు తెచ్చి వాళ్ళకి ఇచ్చింది పాకలోని స్త్రీ.

వెనుక తలుపుల్ని మూసి తమ ముందు భాగంలోకి వెళ్ళిపోయింది.

"రాఘవాపురం రైల్వేస్టేషన్ అనీ ఒక రైలుస్టేషను వుంది అడవి మధ్యలో. ఊరు కాదు అది... ఏవో నాలుగైదు కొంపలు మాత్రమే వుంటాయి... నీకు కావలసిన సాతూర్ బ్యాంకు దొంగలు ఆ స్టేషన్లో రైలు దిగి, అడవిలోకి వెళ్ళారట... ముసలమ్మకుంట అనీ ఒక పెద్ద మడుగు ఒకటి వుంది అడవిలో... మంచి మాటల్లో చెప్పాలంటే దాన్ని చక్రతీర్థం అంటారు... ఆ మడుగు చుట్టుపట్ల మకాం పెట్టారు వాళ్ళు. ఇంకా అక్కడే వున్నట్టు నాకు నిన్న తెలిసింది... కట్టెలు కొట్టేవాళ్ళకు కనిపించార్ట" రెండు పెగ్గులు మందు లోపలికి పోగానే హుషారుగా తనకు తెలిసిన విషయాన్ని చెప్పటం మొదలుపెట్టాడు శివయ్య.

"కర్ణాటకలోకి జంప్ అయిపోకుండా ఆళ్ళు ఇంకా అడవిలోనే వుండటానికి ఏదో కారణం వుండే వుంటుంది. అదేమిటో నీకు తెల్సా?" గుక్క మందుతాగి పకోడీల రుచి చూస్తూ అడిగాడు పాండు.

“కర్ణాటక పోలీసులు ఇక్కడికి పదిహేను మైళ్ళ దూరంలో గట్టిగా కాపలా కాస్తున్నారు. అటుకేసి పోయిన మరుక్షణం పట్టుబడిపోతారు వీళ్ళు” చెప్పాడు శివయ్య.

“ఆళ్ళని ఏమార్చటానికి ఇంకోదారి ఏమీ లేదా....?” అడిగాడు పాండు.

“ఒకటి కాదు... వందదాకా వుంటాయి. అయితే వాటిని గురించి వీళ్ళకు తెల్సినట్టులేదు. ఖచ్చితంగా తెలియకపతే ఈ నల్లకొండల్లో నుంచి ఒక్క అడుగు కూడా అవతలికి వెయ్యలేరు ఎవరూ... అందుకే ఆగిపోయారు. పోలీసుల ఎద్దడి తగ్గిపోయిందని నికరంగా తెలిస్తే తప్ప ప్రయాణం మొదలు పెట్టకపోవచ్చు” మూడో పెగ్గును కూడా పూర్తి చేసి నాలుగోదానికి ప్రారంభోత్సవం చేస్తూ చెప్పాడు శివయ్య.

ఆ మాటలకు నిదానంగా తల ఊపి, వెనుక వున్న చెట్టు మొదలును ఆనుకుని హేపీగా కూర్చున్నాడు పాండు.

“రేపు ఉదయం ఒకసారి మనం ఆ ముసలమ్మ కుంట దగ్గరికి వెళ్ళివద్దాం... వాళ్ళు కనపడితే ఒక పనైపోతుంది...” అంటూ ఒక్కక్షణం ఆగి, “నీ గురించి చెప్పు. ఈ ఊరు ఎలా వుంది?” అని అడిగాడు.

“ఊరికేం భాయీ? ఊరు సూపరు... పంటలు బాగా పండుతాయి. చాలా మంది హాయిగా బతికేస్తున్నారు... రత్నంగారని ఆరొందల ఎకరాల భూస్వామి వున్నాడు. ఆయనే మాకు గ్రామపెద్ద. ఆయనకు ఒకే ఒక కూతురు... మీ పట్నంలోనే కాలేజీలో చదువుతోంది... పాపం...” అన్నాడు శివయ్య.

"పాపమా? పాపమేమిటి?" అడిగాడు పాండు.

"పాపంకాక మరోటి ఎలా అవుతుంది బ్రదరూ? పట్నం కుర్రోడు రవిబాబట. అతన్ని ప్రేమించి, పెళ్ళిమాటలు మాట్లాడటానికి యిందాక సాయంత్రం ఊళ్ళోకి వెంటబెట్టుకువచ్చింది. వీరభద్రుడి మాదిరి ఎగబడి ఆ బిడ్డని చెంప పగలగొట్టాడు రత్నంగారు... ఆ కుర్రాడిని వీధిలోకి నెట్టేశాడు... నేనే ఇక్కడ టీ ఇప్పించి రాఘవాపురం రైలుస్టేషన్‌కి వెళ్ళేందుకు దారి చూపించా... అతను అటు పోయాడు. వెనకాలే శ్యామ్ దాదాగాడు జీపుల్లో తయారయ్యాడు. ఆ కుర్రాడిని ఖతమ్ చేయటానికి లక్షరూపాయల కాంట్రాక్టు తీసుకున్నాడట... పాపం... ఈపాటికి అయిపోయే వుంటాడు ఆ కుర్రాడు" సానుభూతి ధ్వనిస్తున్న కంఠంతో చెప్పాడు శివయ్య.

పాండు తాపీగా తల ఊపి, ఖాళీ అయిన గ్లాసులోకి విస్కీని వంపుకుంటాడని అనుకున్నాడతను. ఖాళీగ్లాసును నింపుకోవాలనే మాటని మరచినట్టు అవతలికి విసిరికొట్టి అతని షర్టును పట్టుకుని ముందుకు లాగాడు పాండు.

"ఆ కుర్రాడి పేరేమని అన్నావ్? రవిబాబా? ఆ అమ్మాయి పేరు అపూర్వ కదూ?" అని అడిగాడు.

తలకు ఎక్కబోతున్న మత్తు హఠాత్తుగా దిగిపోయిన అనుభూతి కలుగుతుండగా గబగబా తల ఊపాడు శివయ్య. అతన్ని అమాంతంగా అవతలికినెట్టి, ఒక్క ఉదుటున లేచి నిలబడ్డాడు పాండు.

"ఏమిటి భాయీ? ఏమైంది నీకు? మందు అప్పుడే తలకెక్కేసిందా?" తడబడుతున్న కంఠంతో అడుగుతూ తనూ లేవటానికి ప్రయత్నించాడు శివయ్య.

అతని మాటలను వినిపించుకోలేదు పాండు.

"నాకు అర్జంటు పని వుంది. నేను నిన్ను తరువాత కల్సుకుంటాను..." అంటూ పక్కనే వున్న చిన్న ప్రహరీ మీదినించి జంప్ చేసి అవతలిపక్కన వున్న వీధిలోకి చేరుకున్నాడు.

వింటినుంచి వెలువడిన బాణం మాదిరిగా వేగంగా పరుగు తీస్తూ రాఘవాపురం రైల్వేస్టేషన్ దిశగా వెళ్ళిపోయాడు.

***

"ఏడిరా... ఏడి ఆ రవిబాబు?" నారాయణపురాన్ని వదిలి 5 మైళ్ళ దూరం పోయిన తర్వాత కూడా రవిబాబు కనిపించకపోవటంతో అసహనంగా తన అనుచరుల్ని అడిగాడు శ్యామ్ దాదా.

"మనం వస్తున్నట్టు పసికట్టి పొదలచాటుకు పారిపోయి వుంటాడు" అన్నాడు వారిలో ఒకతను.

"నోరుమూసుకో.. మన గురించి అతనికి తెలియదు. ఆ శివయ్యకి కూడా మనం ఎందుకు వచ్చామో చెప్పలేదు.

వాళ్ళిద్దరూ కలిసి ఊరి బయటికి వచ్చినట్టు ఆ హోటల్ ఆడమనిషి మనకి చెప్పింది. శివయ్యగాడు దారిలోనే మనకి కనిపించాడు. మరి రవిబాబు ఏమయినట్టు?" కోపంగా ఇంకోసారి తన అనుచరుడ్ని అడిగాడు శ్యామ్ దాదా.

కొద్ది దూరం పోయిన తరువాత అడవిని చుట్టుముట్టటం మొదలుపెట్టాయి మసక చీకట్లు... ఏడో మైలును సమీపిస్తుండగా దట్టం అయింది చీకటి.

"అడుగో... అడుగో..." విపరీతమైన ఎగ్జయిట్ మెంట్ వల్ల కంఠం స్వల్పంగా కంపిస్తుండగా అరిచాడు డ్రైవర్. హెడ్ లైట్ల వెలుగులో ఓ కుర్రాడిని చూపించాడు.

నరమానవుడు కనిపించడని అనుకుంటున్న ఆ అడవి దారిలో అధునాతన మైన మోటర్ వెహికిల్స్ ప్రత్యక్షం కావటం ఆశ్చర్యాన్ని కలిగించింది కాబోలు హెడ్ లైట్ల వెలుగు కళ్ళల్లో పడకుండా చేతుల్ని అడ్డం పెట్టుకుంటూ ఒక పక్కకి జరిగి నిలబడ్డాడు అతను చూపించిన యువకుడు.

"అరేయ్... ఆలస్యం చేయద్దు... ఏసేయండి. ముందు జీప్‌తో ఢీ కొట్టించేయ్" హుషారుగా అన్నాడు శ్యామ్ దాదా.

యాక్సిలేటర్‌ని మరింత బలంగా అదిమాడు అతని డ్రైవర్.

అదిరిపడి ఇంకా కాస్త పక్కకి దూకాడా యువకుడు... దట్టమైన పొదల్ని విరగదొక్కుకుంటూ, అతనికి అడుగున్నర దూరంలో నుంచి ముందుకు దూసుకుపోయింది జీప్.

తమ మొట్టమొదటి స్టెప్ అలా దారుణంగా ఫెయిల్ అవటంతో శ్యామ్ దాదా ఆగ్రహానికి అంతులేకుండా పోయింది, "దూకండి. కిందికి దూకండి... త్వరగా..." అని కేకలు పెడుతూ జీప్ పూర్తిగా ఆగకముందే కిందికి దూకేశాడు.

అతను ఎందుకు అలా జీప్‌లో నుంచి దూకాడో అర్థం అయినట్టుంది. రెండో ఆలోచన లేకుండా పొదల్లోకి పరుగుతీశాడు ఆ యువకుడు.

"పారిపోతున్నాడు... పట్టుకోండి... పట్టుకోండి..." అంటూ తనూ పొదల్లోకి ఎంటరయ్యాడు శ్యామ్ దాదా.

***

ఎగదన్నుకు వస్తున్న ఆయాసాన్ని లక్ష్యపెట్టకుండా, పళ్ళబిగువున పరుగులు తీస్తున్న పాండు, ఉన్నట్టుండి ఆగిపోయాడు ఒక పెద్ద మలుపు దగ్గర.

బీడీలు కాల్చుకుంటూ నిలబడి వున్నారు ఇద్దరు వ్యక్తులు ఆ మలుపు మొదట్లో... పొదలను ఆనుకుని పార్క్ చేయబడి వున్నాయి రెండు జీప్‌లు.

వాళ్ళకి కనిపించకుండా దారి పక్కన నిలబడి కనులు చిట్లించి చూసిన పాండుకి రెండు నిముషాల తర్వాత అర్థం అయింది వారు ఎవరో. వాళ్ళు చూస్తున్న వైపుకు తలతిప్పి, చెవులు రిక్కించాడతను.

అరనిముషం తర్వాత వినవచ్చింది అలికిడి... మరో నిముషం తర్వాత "ఇక్కడే వుంటాడు. నేను విసిరిన చాకు వాడికి తగిలి కింద పడింది. చాకు మొనకి రక్తం అంటింది. బాగా వెతకండి... జీప్‌లో టార్చిలైటు వుంది తీసుకురండి...." అంటున్న శ్యామ్ దాదా కంఠం కూడా విన్పించింది.

రెండే రెండు క్షణాలు ఆలోచించి, కింద నుంచి లావుపాటి పలుకు రాయిని ఒకదాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు పాండు. గురిచూసి జీప్ దగ్గర వున్న వ్యక్తుల్లో ఒకతని తలకి తగిలేలా విసిరాడు.

క్రికెట్ బాల్ మాదిరి గింగిరాలు తిరుగుతూ పోయిందా రాయి. అతని తలకి తగిలి కిందపడింది. గావుకేకపెట్టి అలాగే నేలమీద చతికిలపడ్డాడతను.

రాయి తగిలిన ప్రదేశం నుంచి బొట బొటా బయటికి వస్తున్న రక్తాన్ని చూడగానే ఖంగారు పుట్టింది కాబోలు, పెద్ద కంఠంతో శ్యామ్ దాదాని పిలిచాడు రెండోవ్యక్తి.

"రండిరోయ్... రండి. రవిబాబు రోడ్డు మీదకి వచ్చేశాడు రండి" అని బిగ్గరగా కేకలు కూడా పెట్టాడు. అడ్డువచ్చిన పొదల్ని గుడ్డిగా విరగదక్కుతూ జీప్‌ల దగ్గరకొచ్చేశారు పొదల్లోకి పోయిన జనం.

"ఏడిబే? ఎక్కడ? ఎక్కడ ఆ బద్మాష్?" వగరుస్తూ అడిగాడు శ్యామ్ దాదా.

మలుపు దగ్గర కొంచెం కదలిక కనిపించే విధంగా చేశాడు చీకట్లలో నిలబడివున్న పాండు. వెనుతిరిగి గ్రామంలోకి పారిపోతున్నట్లు పది అడుగులు వేసినట్టే వేసి, చల్లగా పొదల్లోకి జరిగాడతను.

"పోతున్నాడు... వాడు గ్రామంలోకి పారిపోతున్నాడు.... పదండి. పదండి... త్వరగా" అని అందర్నీ హెచ్చరిస్తూ తను ముందుండి ఛేజింగ్‌ని మొదలుపెట్టాడు శ్యామ్ దాదా.

వాళ్ళు పాతికగజాల దూరం పోయేదాకా కదలకుండా నిలబడి, తన అడుగుల చప్పుడు వారికి వినపడకుండా ఇంకా అడవిలోకెళ్ళిపోయాడు పాండు. చిమ్మ చీకటిలో నిలబడి పరిసరాలను జాగ్రత్తగా అబ్జర్వ్ చేస్తూ రవిబాబు కోసం గాలింపు మొదలు పెట్టాడు.

అరగంట గడిచిన తరువాత అతనికి కనిపించింది ఒక నేరేడు చెట్టుచాటున చిన్న కదలిక. ‘‘బాబూ...! రవిబాబూ.. నేను పాండుని... రంగమ్మ దోస్త్‌ని’’ అని తనను గురించి చిన్న కంఠంతో ఎనౌన్స్ చేస్తూ అటుపోయిన అతనికి, చెట్టుచాటున చతికిలబడి కన్పించాడు రవి.

‘‘వాళ్ళ దగ్గర కత్తులు వున్నాయి... చాకులున్నాయి... అనుకోని విధంగా ఎటాక్ చేయటంతో ఏం చేయాలో తోచలేదు. ఎదురు తిరగాలనుకుంటుండగా దెబ్బ తగిలింది’’ రక్తం ఓడుతున్న ఎడమ భుజాన్ని కుడిచేత్తో బలంగా అదిమి పట్టుకుంటూ చిన్న కంఠంతో అతనికి చెప్పాడు రవిబాబు.

‘‘మరేం ఫర్వాలేదు... నేను వచ్చేశానుగా... వాడు కాదుగదా... వాడిని పుట్టించిన దేవుడు కూడా మీ జోలికి రాలేడు. మనం ఇంకా కాస్త ముందుకు పోదాం’’ అంటూ తన జేబులో వున్న జేబుగుడ్డని అతని భుజం మీది అద్ది పట్టుకున్నాడు పాండు. చేయిని ఆసరాగా ఇచ్చి పైకి లేపాడు. బరువునంతా తన భుజాల మీద మోపుకుంటూ అడవిలోకి నడిపించాడు. రెండు – మూడు – నాలుగు – ఐదు మైళ్ళ దూరం పోయిన తరువాత అధికం అయిపోయింది రవిబాబుకి అలసట.

‘‘ఈ చుట్టుపట్ల ఎక్కడయినా నీళ్ళున్నాయేమో చూసివస్తాను. మీరు కదలకుండా ఇక్కడే కూర్చోండి’’ అంటూ రవిబాబును ఒక చెట్టు దగ్గర కూర్చోబెట్టి తను ముందుకు అడుగువేశాడు పాండు.

చీకటి. ఎటు చూసినా, ఎదుట ఏమున్నదో కనీసం లీలా మాత్రంగానైనా కనిపించనంత చిమ్మచీకటి అలుముకుని వున్నది. ఏ మాత్రం అజాగ్రత్తగా వున్న దారితప్పి ఎటో వెళ్ళేటంత దట్టంగావున్న ముళ్ళపొదలు.

దట్టంగా వున్న పొదను తప్పించుకుని అవతలి పక్కకు చేరుకోబోతుండగా, "ఎవరు? ఎవరా పొద దగ్గర?" అంటూ అతని చెవికి చేరింది ఒక కరుకు కంఠం.

కరెంట్ షాక్ కొట్టినట్టు అదిరిపడి, నిలుచున్నవాడు చిలుచున్నట్టే వెనక్కి పల్టీకొట్టాడు పాండు. ఏ పొదను అధిగమించి అవతలికి వెళ్ళాలనుకున్నాడో, అదే పొదను చాటుచేసుకుని నేలపై బోర్లాపడుకున్నాడు.

అలా పడుకుంటూ వున్న సమయంలో గుప్పున వెలిగింది ఒక పవర్ ఫుల్ టార్చిలైట్. అంతకు ఒక్కక్షణం ముందువరకూ అతను నిలబడి వున్న ప్రదేశాన్ని పట్టపగలుగా మార్చివేసింది దాని వెలుగు.

"ఏంటిరా? ఏమైంది? ఎందుకు అరుస్తున్నావ్?" నిద్రమత్తులో నిలబడి వున్న రెండోకంఠం ఒకటి పాండు చెవికి చేరింది.

"ఎవరో ఆ పొద దగ్గరికి వచ్చి నిలబడినట్లు అనిపించింది" టార్చిలైటును పొదమీదికి నాలుగువైపులనుండి ఫోకస్ చేస్తూ చెప్పింది మొదటి కంఠం.

"మనం వదిలేసిన రొట్టెముక్కలకోసం ఏ ఎలుకో – ఏ గోలమో వచ్చి వుంటుంది. నీ అరుపుల్ని విని ఈపాటికి అరమైలు దూరం పారిపోయి వుంటుంది" పెద్దగా ఆవులిస్తూ అన్నది రెండో కంఠం.

“ఎలుక కాదు.. ఏ గోలమూ కాదు... మనిషి వచ్చినట్టే అనిపించింది. వద్దు వద్దన్న కొద్దీ మీరు ఇష్టం వచ్చినట్లు అడవిలో తిరుగుతున్నారు... కట్టెలు కొట్టుకోవటానికి వచ్చినవాళ్ళు కొంతమంది మిమ్మల్ని చూశారు....” టార్చిలైటును ఆఫ్ చేస్తూ అన్నది మొదటి కంఠం.

“చూస్తే చూశారులేవోయ్.. చూస్తే ఇప్పుడు మనకి వచ్చిన నష్టం ఏముందట? చచ్చీ చెడి ప్రాణాలకు తెగించి సంపాదించిన సొత్తును ఈ ముదనష్టపు అడవికి ధారాదత్తం చేసేశాం... ఫైవ్ స్టార్ హోటల్లో విందు భోజనాలు చేస్తూ, క్వాలీస్ కార్లలో తిరుగుతూ వుండాల్సినవాళ్ళం. మాడిపోయిన రొట్టెముక్కలతో కడుపు నింపుకుంటూ, కోతుల్లా పొదల్లో కాలక్షేపం చేస్తున్నాం. ఇంతకంటే పోలీసులకి పట్టుబడి జైలుకు పోవటమే బెటరు. ఎంచక్కా వేళకు తిండి దొరుకుతుంది... నిద్రపోవటానికి సరైనచోటు వుంటుంది” నిరసన ధ్వనిస్తున్న మాటలతో ఎత్తిపొడిచింది రెండో కంఠం.

“మాడిపోయిన రొట్టెలు, మాడిపోయిన రోట్టెలు అంటూ తెగ బాధపడి పోతున్నావ్.. నువ్వు ఒక్కడివే తింటున్నావా? నీతోపాటు మేము కూడా తినటం లేదే? అసలు మనకి ఈ గతి పట్టటానికి కారణం నువ్వే... నీ అజాగ్రత్త వల్లనే నీళ్ళల్లో పడిపోయింది సూట్‌కేస్... నువ్వు వట్టి చచ్చుముఖానివి... నీ మూలకంగానే ఈ కష్టాలు” తడుముకోకుండా అన్నది మొదటి కంఠం.

“అవును బే... నా మూలకంగానే నీకు ఈ కష్టాలు వచ్చాయి నువ్వు మొనగాడివి కదా. నీళ్ళల్లోనించి బయటికి తీయలేకపోయావా సూట్ కేసుని. ఎందుకు తీయలేకపోయావ్?” కోరగా అంది రెండో కంఠం.

దట్టంగా వున్న పొదచాటున బోర్లాపడుకుని వున్న పాండుకి పొరపాటున కూడా అర్థం కాలేదా సంభాషణ. సూట్‌కేస్ ఏమిటో, నీళ్ళల్లో పడిపోవడం ఏమిటో కొంచెం కూడా అంతుబట్టలేదతనికి.

అక్కడ మకాం పెట్టింది ఎవరో చూచాయగా తెలిసినా, ఆ విషయాన్ని గురించి సీరియస్‌గా ఆలోచించలేదు అతను. వారి అటెంక్షన్ తన మీదినించి ఇంకో టాపిక్ మీదికి మరలిందని తెలిసిన వెంటనే పాములా మోచేతుల మీద పాకుతూ, ఇంకో పక్కకు బయలుదేరాడతను. పదిగజాల దూరం పోయాడతను. ఒక పెద్ద బండరాయిపక్కకు పోయి ముందుకు చూసేసరికి ఎట్ట ఎదుట ప్రత్యక్షమైంది పెద్ద చెరువు వంటి నీటి గుంట ఒకటి.

ఆగి ఆగి వీస్తున్న గాలి తెరల తాకిడికి చిన్నచిన్నగా కదులుతున్నాయి అందులోని నీళ్ళు. చిరుకెరటాల్లా సున్నితంగా వచ్చి ఒడ్డును తాకుతున్నాయి.

శబ్దం కాకుండా గబగబా ముందుకు జరిగి, ఆ నీటిలో తలను మొత్తం ముంచేశాడు పాండు.... అడవి జంతువు మాదిరి ఆత్రంగా నాలుగు గుటకలు వేశాడు.

శరీరాన్ని ఆవరించుకుని వున్న అలసట అంతా చిటికెలో మాయమైన అనుభూతి కలిగింది అతనికి... అమృతాన్ని సేవించినట్లు హాయిగా అనిపించింది.

రెండు నిముషాలపాటు అక్కడే గడిపి, ఎలా వచ్చాడో అలాగే వెనక్కి జరిగాడు అతను. దారితప్పి ఎటెటో వెళ్ళిపోక జాగ్రత్తగా రవిబాబును చేరుకున్నాడు.

"ఏమైంది? నీళ్ళు కనిపించాయా?" అతను ఎక్కడ కూర్చోబెట్టాడో, అక్కడి నుంచి అవతలికి జరగకుండా కూర్చునివున్న రవిబాబు అడిగాడు.

"మామూలు నీళ్ళు కాదు బాబూ.. ఆళ్ళేవరో దేవతలు మనకోసం సిద్ధంచేసి వుంచిన తీర్థం నీళ్ళు.. మహా రుచిగా వున్నాయి.... శబ్దం చేయకుండా వెళ్ళాలి" అంటూ అతన్ని పైకిలేపి ముందుకు నడిపించాడు పాండు.

నీటిమడుగు దగ్గర మకాం పెట్టినవాళ్ళు ఎవరోగాని, తమలో తామింకా కలహించుకుంటూనే వున్నారు.

"నోళ్ళు మూసుకోండి మీరు ఇద్దరూ... ఇంకొక్కమాట మీ నోళ్ళలోనుంచి బయటికి వచ్చిందంటే నేనే మీ నెత్తురు కళ్ళ చూస్తాను" అంటోంది మరో కొత్త కంఠం.

"ఎవరు వీళ్ళు....? ఇక్కడ ఏం చేస్తున్నారు?" పాండు చెవిదగ్గర నోరుపెట్టి అడిగాడు రవిబాబు.

"అవన్నీ తర్వాత.... ముందు మీరు దాహం తీర్చుకోండి" అంటూ అతన్ని నీటి దగ్గరికి లీడ్ చేశాడు పాండు.

అతని మాదిరిగానే ఆ నీళ్ళల్లో తల ముంచేశాడు రవిబాబు. "చక్రతీర్థం అంటారు దీన్ని. ముసలమ్మ కుంట అని కూడా ఇంకో పేరుంది. ఈ నీళ్ళు తాగితే ఏ జబ్బులైనా చిటికెలో నయం అయిపోతాయని పేరు... దారి తెలియకుండా దీని దగ్గరికి రాగలగటం మన అదృష్టం" దాహం తీర్చుకుని, దోసిళ్ళతో ఆ నీటిని ముఖంమీదా, దుస్తులమీదా జల్లుకుంటూ పాండుకి చెప్పాడతను.

“మీరు గట్టిగా మాట్లాడితే మన కొంపలు మునిగిపోతాయి... ఆ మధ్య సాతూర్ బ్యాంక్‌లో దొంగతనం జరిగిందని విన్నారా?” అతన్ని నెమ్మదిగా మాట్లాడమని సైగచేస్తూ లోగొంతుకతో అడిగాడు పాండు.

“అవును.. పేపర్లో చదివాను. మూడుకోట్లు దొంగిలించారు వాళ్ళు” ఆశ్చర్యంగా అన్నాడు రవిబాబు.

“ఆళ్ళే వీళ్ళు... పోలీసుల్నుంచి తప్పించుకోవటానికి ఈ అడవిలోకి వచ్చారు.... ఇక్కడి నుంచి కర్ణాటక జంప్ అవుతారు....”

“నీకు ఎలా తెలుసు?” మరింత ఆశ్చర్యంగా అడిగాడు రవిబాబు. తను అక్కడికి రావడాన్ని గురించి చెపుతూ నిజాయితీగా, నిరభ్యంతరంగా ఎస్సయ్ గంగరాజు తనకు అప్పగించిన పనిని అతనికి తెలియచేశాడు పాండు.

“గంగరాజు నాకు ఈ పని అప్పగించటం మనకి చాలా మంచిదైంది బాబూ... అవసర సమయంలో మీకు సాయం చేయగలిగాను....” అని కూడా అన్నాడు.

“మరి వీళ్ళ సంగతేమిటి? వీళ్ళ గురించి గంగరాజుకి రిపోర్ట్ చేయాలిగదా!” ప్యాంటుజేబులో నుంచి తన సెల్‌ని బయటికి తీస్తూ అన్నాడు రవిబాబు.

బయటికి తీసిన ఒక్క క్షణం వరకూ చక్కగా పనిచేస్తున్నట్టు కనిపించింది ఆ ఫోన్. సిటీలో వున్న పోలీస్ స్టేషన్ నెంబర్‌ని ప్రెస్ చేయబోతుండగా ఉన్నట్లుండి పనిచేయటం మానేసింది.

“అడవి ప్రాంతం కదా... సిగ్నల్ సరిగ్గా లేదు. అడవిలో నుంచి బయటి కెళ్ళిన తర్వాత ఇంకోసారి ట్రై చేద్దాం” అంటూ ఫోన్‌ని తిరిగి ప్యాంటుజేబులోకి నెట్టేశాడతను. రవిబాబు దగ్గరేవున్న హేండ్ కర్చీఫ్‌తో ఎడమ భజంమీద గాయానికి కట్టుకట్టాడు పాండు.

“ఆ శ్యామ్ దాదాగాడు పెద్ద బద్మాష్... మొదలుపెట్టిన పనిని పూర్తి చేయకుండా వుండడు. వాడు మనకోసం ఇక్కడంతా వెతుకుతూ వుంటాడు” అతని చేయిపట్టుకుని మడుగుకు దూరంగా నడిపిస్తూ చెప్పాడు.

“శ్యామ్ దాదా ఎవరో నాకు తెలియదు. ఎందుకు నామీదికి వచ్చాడో అర్థం కావటంలేదు. అంతా అయోమయంగా వున్నది” సాలోచనగా అన్నాడు రవిబాబు.

“ఆషామాషీ వ్యవహారం కాదిది. ప్రాణాలకు సంబంధించింది. దీన్ని ఇంతటితో వదిలిపెట్టకూడదు. తెల్లారగానే ఎదుటపడి అటో ఇటో తేల్చేసుకోవటం మంచిది” అతని ముఖంలోకి చూస్తూ అన్నాడు పాండు.

“ఆ పనిచేసేందుకు ఇప్పుడు ఓపికలేదు... తాపీగా చూద్దాం...” తల విదిలిస్తూ అన్నాడు రవిబాబు.

ఆ మాటలు అంటున్నప్పుడు అతని కంఠంలో ధ్వనించిన నిర్వేదం పాండును ఎలర్ట్ చేసేసింది.

“బాబూ! నారాయణపురంలో జరిగిన ఘోరం గురించి వివరంగా నాకు తెలిసింది. అపూర్వమ్మగారి నాయన మిమ్మల్ని అవమానించినందుకు మీరు

ఏమయినా బాధపడుతున్నారా?'' చటుక్కున నడవటం ఆపి అతని ముఖంలోకి సూటిగా చూస్తూ అడిగాడు.

''అవునని చెప్పలేనుగాని, అపూర్వని నేను ప్రేమిస్తున్నాను పాండూ. ఆమెను పెళ్ళి చేసుకోలేకపోతే ఈ జీవితం వృథా అని అన్పిస్తోంది. వాళ్ళ నాన్న నెగటివ్‌గా మాట్లాడతాడని నేను అనుకోలేదు. అందువల్ల కొంచెం షాక్ తగిలిన మాట వాస్తవం'' నిజాయితీగా తన మనస్సులోని మాటను బయట పెట్టాడు రవిబాబు.

''ఓ.కె.... బాబూ... నేను ఒక మార్గం చెబుతాను. ఒప్పుకుంటారా?'' రెండో ఆలోచన లేకుండా అప్పటికప్పుడు ఒక నిర్ణయానికి వస్తూ అన్నాడు పాండు.

''మార్గం చెపుతావా? ఏమిటా మార్గం?'' అతనివంక చూస్తూ ఆశ్చర్యంగా అడిగాడు రవిబాబు.

''ఈ చీకట్లో, ఈ పోదల్లో మనం అడవిని దాటి అవతలికిపోవటం చాలా కష్టం. తెల్లారేవరకూ ఇక్కడే మకాంపెట్టి, తెల్లారంగానే మీ ఊరు వెళదాం. మీ నాన్నగారిని కలుసుకుని మీ ప్రేమ విషయం మాట్లాడదాం. ఆయన అంగీకరిస్తే, రేపు ఈ వేళకల్లా నారాయణపురం నుంచి అపూర్వమ్మని లేవతీసుకుని మీ ఊరు వెళ్ళిపోదాం. ఆ రత్నంగారు ఏం చేస్తాడో, ఆయన మందీ మార్బలం ఏం చేయగలరో చూద్దాం. నీతిగా, నిజాయితీగా ఇంటి ముందుకు వచ్చిన మనిషిని వెక్కిరించి అవతలికి నెట్టేసినందుకు అతనికి గుణపాఠం నేర్పాలి....''

“ఇది నా ఒక్కడికి సంబంధించిన విషయం కాదు పాండూ. అపూర్వకి కూడా ఈ పద్ధతి అంగీకారం అవ్వాలి. ఈ విషయంలో తను ఏమని అనుకుంటోందో మనకెలా తెలుస్తుంది?” అంటూ మళ్ళీ ప్యాంటు జేబులో నుంచి ఫోన్ ని బయటికి తీశాడు రవిబాబు.

అంతకుముందు జరిగినట్టే ఇప్పుడూ జరిగింది. అప్పటివరకు చక్కగా సిగ్నల్ అందుతున్నట్టు సూచించిన ఆ ఫోన్ అపూర్వ నెంబర్ని ప్రెస్ చేయటం మొదలుపెట్టేసరికి పనిచేయటం మానేసింది.

విసుగ్గా తల విదిలించి, ఫోన్ని ప్యాంటుజేబులోకి నెట్టేస్తున్న రవిబాబు వంక వినోదంగా చూస్తూ, పది అడుగుల దూరంలో వున్న ఒక పెద్ద నేరేడు చెట్టుకేసి చేయి చూపాడు పాండు. రేపు ఉదయం ఇంకోసారి ట్రై చేయవచ్చు. ఇక ముందుకెళ్ళక ఇవాల్టికి ఇక్కడ రెస్టు తీసుకుందాం అంటూ అతన్ని ఆ చెట్టు కిందికి తీసుకెళ్ళాడు.

***

చీకటి పడిన క్షణం నుంచీ ప్రయత్నం చేసి చేసి, విసుగుతో సహనాన్ని కోల్పోయింది అపూర్వ. సెల్ ఫోన్ని ఎదుటవున్న గోడకేసి బలంగా కొట్టింది. ముక్కలై ఎందుకూ పనికిరాకుండా పోయింది ఆ ఫోన్.

“అయ్యయ్యో... అదేంటమ్మా! బంగారంలాంటి ఫోన్ని నాశనం చేసేశారేంటి?” బుగ్గలు నొక్కుకుంటూ ఆశ్చర్యంగా అడిగింది గదిలోకి వచ్చిన పనిమనిషి.

“నేను వెంటనే రవిబాబుతో మాట్లాడాలి. ఏమన్నా మార్గం చెప్పవే” బేలగా అడిగింది అపూర్వ.

“చేతుల్లో ఫోన్ పెట్టుకుని నన్ను అడుగుతున్నారేంటమ్మా...?” పాడైన ఫోన్‌ని చూస్తూ అన్నదామె.

“అది పని చేయటంలేదే.... రవి నెంబర్‌ని ప్రెస్ చేయగానే సిగ్నల్ లేదంటూ విసిగిస్తోంది....” అంటూ ఒక కిటికీ దగ్గరికెళ్ళి బైటికి తొంగి చూసింది అపూర్వ.

“నాన్నగారు హాల్లోనే వున్నారు. మిమ్మల్ని గదిలోంచి బయటికి రానీయొద్దన్నారు. ఎవరో పెళ్ళిచూపుల వాళ్ళని రేపు సాయంత్రం రమ్మంటున్నారట.... అంతవరకూ మీకు బందిఖానా తప్పదు” అన్నది పని మనిషి.

అంతకు ముందే తన తల్లి ద్వారా ఆ విషయాన్ని తెలుసుకుని వుండటంతో కలవరపడలేదు అపూర్వ.

“నా కంఠంలో ప్రాణం వుండగా రవిని తప్ప నేను ఇంకొకర్ని పెళ్ళి చేసుకోను. నా ఇష్టానికి వ్యతిరేకంగా జరిగితే, నా ప్రాణాలు తీసుకుంటాను....” ఖచ్చితమైన కంఠంతో తన నిర్ణయాన్ని బయటపెట్టిందామె.

“అదీ అయిపోయిందమ్మా... మీరు చెప్పిన మాటని అమ్మగారు నాన్నగారికి చెప్పారు. మీరు చచ్చిపోయినా ఇష్టమేనంట. ఆ కుర్రాడిని మాత్రం

పెళ్ళి చేసుకోవటానికి ఒప్పుకోనని రంకెలు పెట్టరాయన" చిన్న కంఠంతో చెప్పింది పనిమనిషి.

అంతవరకూ ఎంతో నిబ్బరంగా వున్న అపూర్వ ముఖంలో వెంటనే ప్రత్యక్షం అయింది తీరని వేదన. గిర్రున తిరిగిన కన్నీటిని పమిటె చెంగుతో అద్దుకుంటూ "ఎందుకు ఇలా మాట్లాడుతున్నారు? నేను ప్రేమించడం తప్పా?" గద్గద స్వరంతో అడిగింది.

"మీ నాన్నగారి దృష్టిలో అది తప్పేనమ్మా. ఇదివరకు ఎప్పుడో పాతిక సంవత్సరాలక్రితం మీ మేనత్త...." అంటూ మొదలుపెట్టి, సడన్ గా మాటల్ని ఆపేసిందామె.

"ఏమిటే! మా మేనత్త అంటున్నావేమిటి!" ఆశ్చర్యంగా పనిమనిషి వైపుచూస్తూ

అడిగింది అపూర్వ.

"ఏమీలేదమ్మా... ఏదో అనబోయి ఇంకేదో అన్నాను. మీరేం చేస్తున్నారో అమ్మగారు చూసిరమ్మన్నారు... వచ్చిన పనిని వదిలేసి కబుర్లు చెపుతుంటే ఊరుకోరు. చంపేస్తారు" అంటూ కిందికి వెళ్ళబోయింది పనిమనిషి.

ఆమెకంటే వేగంగా కదిలి గది తలుపుల్ని మూసి గడియ పెట్టింది అపూర్వ. "మొదలుపెట్టింది పూర్తిచేయకుండా అవతలికి పోనీయను. మర్యాదగా చెప్పు. నాకు మేనత్త ఎవరు? నాకు మేనత్తలు లేరు. ఇప్పుడు సడన్ గా ఎక్కడినించి వచ్చారు? చెప్పు...." అంటూ పనిమనిషి భుజాన్ని గట్టిగా పట్టుకుంది.

“అమ్మా.... నన్నొదిలేయ్... బుద్ధి తక్కువ అయింది. ఏదో మాటల్లోపడి నోరుజారాను... నన్ను వదిలేయ్....” కన్నీళ్ళ పర్యంతం అవుతూ అన్నదామె.

జాలి, దయ అనేవి మనస్సులో లేనట్టు కరుకుగా తల అడ్డం తిప్పింది అపూర్వ. మర్యాదగా నేనడిగిన ప్రశ్నకు సరిగ్గా సమాధానం చెప్పు. చెప్పకపోతే నువ్వు నాకు ఏదో చెప్పావని మా నాన్నకి వినపడేటట్లు అరుస్తాను... ఆ తర్వాత ఏం జరుగుతుందో నీకు తెలుసు కఠినమైన కంఠంతో హెచ్చరించింది.

“అమ్మా... ఆ సంగతి మీకు చెప్పినట్టు తెలిస్తే నాన్నగారు ఎనకా ముందూ చూడక నా గొంతు పిసికేస్తారు” భయంతో వణికిపోతూ అన్నదా పనిమనిషి.

“చెప్పకపోయినా అదే జరుగుతుంది. నేనే స్వయంగా దగ్గిర వుండి నీ గొంతు పిసికిస్తాను. చెప్పు, నాకు మేనత్తలు ఎక్కడినించి వచ్చారు?” అన్నది అపూర్వ.

“చెపుతాను తల్లీ.... అయితే నేను చెప్పినట్లు నువ్వు ఎవరికీ తెలియనీయకూడదు... ఒట్టేయ్...” ధైర్యాన్ని కూడదీసుకుంటూ చేతిని జాపిందామె. అయోమయంగా చూస్తూ ఆమె చేతిలో చేయివేసింది అపూర్వ.

“అమ్మా.... ఇది పాతికేళ్ళ కిందట జరిగిన సంగతి.... అప్పటికి మీ నాన్నగారికి పెళ్ళికాలేదు. మీకు ఒక మేనత్త వుండేది. మీ నాన్నకి చెల్లెలు. పేరు సువర్ణ.... అచ్చం బంగారపు బొమ్మ మాదిరిగానే వుండేదిట...

మీ నాన్నకి ఆవిడంటే తగని ఆపేక్షంట... తగిన సంబంధాన్ని చూసి తనకి ఘనంగా పెళ్ళి చేసి, అత్తారింటికి పంపించిన తరువాతే తను పెళ్ళి

చేసుకుంటానని పంతం పట్టారుట...." పమిటెచెంగుతో ముఖాన్ని తుడుచుకుని తన మాటల్ని ఆలకించటానికి ఆ గది వెలుపల ఎవరూలేరని నిశ్చయించుకున్న తరువాత నెమ్మదిగా చెప్పటం మొదలుపెట్టింది పనిమనిషి.

"బంగారపు బొమ్మలాంటి మీ మేనత్త మీ మాదిరిగానే ప్రేమలోపడిందిట... ఈ ఊళ్ళోనే కత్తులు, గొడ్డళ్ళు తయారుచేసే కమ్మరి గుర్నాధం కొడుకు రాజశేఖర్ అనే కుర్రాడిని గాఢంగా ప్రేమించిందట.

చెల్లెలి ప్రేమ విషయం తెలియని మీ నాన్నగారు రాఘవాపురం అవతల వున్న ఒక ఊరు నుంచి పెద్దింటి సంబంధాన్ని తీసుకువచ్చారట... పెళ్ళి చూపులు ఇంకో మూడు రోజుల్లో వున్నాయనగా మీ మేనత్త తన ప్రేమ విషయాన్ని మీ నాన్నగార్తో చెప్పిందట...

అందుకు ఆయన ఒప్పుకోలేదట... పెళ్ళిచూపులు ఏర్పాటయిన తర్వాత వెనక్కి తిరిగేందుకు వీలులేదని గట్టిగా అరిచారట.... ఆ రాత్రికి రాత్రి మీ మేనత్త తను ప్రేమించిన రాజశేఖర్‌తో ఎక్కడికో లేచిపోయిందట... ఎంత వెతికినా, ఎన్నిచోట్ల గాలించినా దొరకలేదట... కనిపించలేదంట... అప్పటినుంచీ మీ నాన్నగారికి ప్రేమ పెళ్ళిళ్ళంటే ఇంకా ఇంకా అసహ్యం కలిగింది.

మీ మేనత్త పేరు తనకు వినపడకూడదని ఆంక్షలు పెట్టారంట... ఆ బిడ్డ ఉపయోగించిన వస్తువుల్ని, ఆ బిడ్డ ఫోటోల్ని అన్నింటినీ విరగగొట్టి, పగలగొట్టి మన ఉత్తరపు మూలగదిల పడేసి తాళం వేసేశారంట...

పాతిక సంవత్సరాల తర్వాత మొదటిసారిగా నా నోటివెంట ఆ బిడ్డ పేరు బయటికి రప్పించారు మీరు... ఈ విషయం మీ నాన్నగారికి తెలిసిందంటే నేను చచ్చిపోయినట్టే...." అని చెప్పి, గది తలుపులు తెరిచి బయటికి వెళ్ళిపోయింది పరుగులాంటి నడకతో.

ఆడింది ఆటగా, పాడింది పాటగా చిన్ననాటి నుండి తనను ఎంతో గారాబంగా పెంచిన తన తండ్రి, తన ప్రేమ వ్యవహారం చెవులపడిన వెంటనే రాక్షసుడిలా మారిపోవటానికి కారణమేమిటో కొంచెంగా బోధపడి, దిగులు పడుతూ ఏం చేయాలో తోచక నిస్సహాయురాలిగా తన మంచంమీద కూర్చుండి పోయింది అపూర్వ.

తన తండ్రికి ఒక చెల్లెలు వుండేదన్న మాటే ఆమెకు కొంచెం వింతగా, విచిత్రంగా అనిపించింది. పుట్టి బుద్దెరిగిన క్షణం నుండీ తనకు తెలియని ఆ మేనత్తను గురించి మరికొన్ని వివరాలను తెలుసుకోవాలన్న ప్రగాఢమయిన కోరిక కూడా ఆ సమయంలో కలిగింది.

వడిలిపోయిన ముఖాన్ని టవల్‌తో తుడుచుకుని, చెదిరిన ముంగురుల్ని సరిచేసుకుని, చిన్న చిన్న అడుగులతో మేడమీది నించి కిందికి వచ్చిందామె. హాల్లో కూర్చుని ఎవరితోనో మాట్లాడుతున్న తండ్రివంక చూడనుకూడా చూడకుండా ఇంటి వెనుక భాగంలోకి పోయింది.

వంట పనులను సూపర్‌వైజ్ చేస్తూ బిజీగా వున్నది ఆమె తల్లి. ఆమె చెప్పిన పనిని పూర్తిచేయటానికి పెరటి తోటలోకి పోతూ కనిపించింది పనిమనిషి.

“నేను చెప్పాల్సింది చెప్పేశాను. నన్ను వదిలేయండి తల్లీ....” తన దగ్గరికి వచ్చిన అపూర్వను చూసి చేతులు జోడించి వేడుకున్నంత పనిచేసిందామె.

“మా మేనత్త ప్రేమించిన రాజశేఖర్‌కి ఊళ్ళో బంధువులు ఎవరున్నారు? అతని తండ్రి కమ్మరి గుర్నాధం అంటే ఎవరు?” అని అడిగింది అపూర్వ.

అటు ఇటూ చూసి గొంతు తగ్గించింది పనిమనిషి. “మీ మేనత్త రాజశేఖర్‌తో లేచిపోయిందన్న కచ్చతో మీ నాన్నగారు గుర్నాధాన్ని చంపించేశారన్న గాలిమాట ఒకటి ఆ రోజుల్లో అందరూ అనుకునేవారట... ఆ తర్వాత ఆళ్ళెవరూ కనిపించలేదు. ఇప్పుడు ఆళ్ళకి సంబంధించిన వాళ్ళెవళ్ళూ ఊళ్ళో లేరు....” అని చెప్పి అక్కడ నిలబడకుండా చకచకా అవతలికి వెళ్ళిపోయింది.

“ఏమిటే... తోటలో ఏం చేస్తున్నావే?” వంట ఇంటి కిటికీలోనుంచి తల్లి గట్టిగా పిలవటంతో మెల్లిగా వెనుతిరిగి బిల్డింగ్ లోకి వచ్చేసింది అపూర్వ.

“ముఖం జిడ్డుగా వుంది, స్నానం చేసి బట్టలు మార్చుకో” ఇంకో అర్డర్‌ని విన్పించింది ఆమె మాతృమూర్తి.

ఆ మాటలు తనకు ఏ మాత్రమూ వినబడనట్లు నిర్వికారంగా అడుగులు వేసింది అపూర్వ. మేడమీది తన గదివైపు పోబోతుండగా, హాలును ఆనుకుని వున్న స్టోర్ రూమ్ దగ్గర గోడకి కొట్టిన మేకులకు వ్రేలాడుతూ ఆమెకు కనిపించాయి రకరకాల తాళం చెవులు.

తన చర్యలను ఎవరూ గమనించటం లేదని నిశ్చయపరుచుకుని, ఒక చివరగా వున్న పాతకాలపు తాళం చెవుల గుత్తిని గోడమీదినించి తొలగించి వాటిని పమిటెచెంగు చాటున భద్రపరుచుకుని వడివడిగా తన గది వైపు వచ్చేసింది.

సరిగ్గా ఒక అరగంట తరువాత ఆమెకు వచ్చింది పిలుపు. "నాన్నగారు పిలుస్తున్నారు. భోజనం చేద్దువుగాని కిందికిరా" అంటూ మేడ గది మెట్లు దగ్గర నిలబడి బిగ్గరగా పిలిచింది ఆమె మాతృమూర్తి.

బెట్టు చేయకుండా కిందికి వెళ్ళింది అపూర్వ. డైనింగ్ టేబిల్ దగ్గర కూర్చుని వున్న తండ్రి వైపు చూడను కూడ చూడకుండా ఒక కుర్చీలో కూర్చుంది.

"ఈ ఇంట్లో నేను చెప్పిందే జరగాలి.... నా మాట కాదని నన్ను ధిక్కరించిన వాళ్ళని నేను చూస్తూ ఊరికే వదిలిపెట్టను... రేపు సాయంత్రం బళ్ళారినుంచి పెళ్ళివారు వస్తారు. పిల్లాడికి నువ్వు నచ్చితే వెంటనే పెళ్ళి చేసేస్తాను.... అర్థం అయిందా?" ఉపోద్ఘాతాలేవీ లేకుండా వున్నట్లుండి ఆమెకు చెప్పాడు రత్నంగారు.

"చిన్నపిల్లను పట్టుకుని ఏమిటిరా ఆ మాటలు? ఆప్యాయంగా, నెమ్మదిగా చెపితే నీ సొమ్ము ఏం పోతుంది?" వెంటనే కలిపించుకున్నాడు ఆయనతోపాటు భోజనానికొచ్చిన ఆయన స్నేహితుల్లో ఒకతను.

"చిన్నపిల్ల అనే ఇంతవరకూ అనుకుంటూ ఉపేక్షిస్తూ అంతగా పట్టించుకోకుండా వచ్చాను. చిన్నపిల్ల కాదని ఇవ్వాళే నాకు తెలిసింది. ఇక

ఉపేక్షించటాలు, నెమ్మదిగా నచ్చచెప్పటాలు లేవు.... నా పద్ధతిలో నేను నడుచుకుంటూ పోతాను. అంతే” ఖచ్చితంగా చెప్పి ఎదుట వున్న పళ్ళెరాన్ని దగ్గరికి తీసుకున్నాడు రత్నంగారు.

తమకంటూ స్వంత వ్యక్తిత్వాలు, స్వంత జీవితాలు ఏవీలేనట్టు అవకాశం దొరికినప్పుడల్లా ఇరవై నాలుగు గంటలూ తన తండ్రిని అంటిపెట్టుకుని వుండే ఆయన స్నేహితులవైపు ఒకసారి ఓరగా దృష్టి సారించి, తన పళ్ళేన్ని ముందుకు జరుపుకున్నది అపూర్వ. రెండే రెండు నిమిషాల్లో భోజనం పూర్తిచేసి తన గదికి వెళ్ళిపోయింది.

రాత్రి సమయాలలో తమ పొలాలకు కాపలాగా వుండేందుకు వెళ్ళే పాలేర్లు ఇద్దరిని మేడగదికి దగ్గర్లో కాపలాగా నిలబెట్టించటం ఆమెకు తెలిసి వచ్చింది దాదాపు పదిగంటల ప్రాంతంలో.

పాలేర్లతోపాటు పనిమనిషిని కూడా అదే పనిమీద అపూర్వ గది వెలుపల కూర్చోబెట్టాడు రత్నంగారు. కిందికి దారితీసే మెట్ల దగ్గిర ఈతాకుల చాపను పరుచుకుని, పొలిమేరల్లో వుండే పోలేరమ్మ విగ్రహంలా కూర్చుని వుంది ఆ పనిమనిషి. క్షణక్షణానికి అధికమైపోతున్న ఆరాటాన్ని ఎంతో ప్రయత్నం మీద అదుముకుంటూ ఓపికగా వెయిట్ చేసింది అపూర్వ.

కూర్చుని కూర్చుని నడుము పట్టేసినట్టు అనిపించింది కాబోలు, చాపమీద మేనువాల్చిందామె.

వెంటనే వచ్చేసింది నిద్ర. మేనువాల్సిన మూడో నిముషంలో సన్నగా గురకలు స్టార్ట్ చేసింది.

కింది గదిలో గోడమీది నించి సంగ్రహించిన తాళం చెవుల్ని గట్టిగా పట్టుకుని నిశ్శబ్దంగా తన గదిలోనుంచి బయటికి వచ్చింది అపూర్వ. చప్పుడు కాకుండా మెట్లు దిగి, సూటిగా వంట ఇంట్లోకి పోయింది.

పెరటి తలుపుల్ని తీయగానే చల్లటిగాలి ఆమె ముఖాన్ని తాకింది. అంతవరకూ బిల్డప్ అవుతున్న టెన్షన్ కొద్దిగా తగ్గుముఖం పట్టిన అనుభూతి కలిగింది.

పెరటి ద్వారాన్ని దాటి ఉత్తరదిశలో వున్న ఒక అవుట్ హౌస్ వంటి కట్టడం దగ్గరికి వెళ్ళిందామె. ఒక మూలగా వుంది ఆమెకు కావాల్సిన గది. తలుపులు తెరిచి చాలాకాలం అయినందువల్ల శిధిలావస్థకు చేరుకుంటున్నట్టు కళాకాంతులు లేకుండా కనిపిస్తోంది.

తప్పుపట్టి ఎందుకూ పనికిరాకుండా పోయినట్టు కనిపిస్తున్న తాళాన్ని తెరవటానికి నాలుగు నిముషాల సమయం పట్టింది. వాతావరణ పరిస్థితుల మూలకంగా, బిగుసుకుపోయిన తలుపుల్ని తెరవటానికి ఇంకో నాలుగు నిముషాలు అవసరం అయ్యాయి.

పమిటె చెంగు చాటున పెట్టి రహస్యంగా తీసుకువచ్చిన టార్చిని వెలిగించి చుట్టూ చూసిందామె.

దుమ్ము, ధూళి, సాలెగూళ్ళు చిందరవందరగా పడివున్న సామాగ్రి, చాలా అసహ్యకరంగాను, కొంచెం భయాన్ని కలిగించే పద్ధతిలోను కనిపిస్తోందా గది.

ముందుకు పోవటానికి వీలులేకుండా పాదాలకు అడ్డుగా వున్న రెండు కుర్చీలను నిశ్శబ్దంగా ఎత్తి అవతల పెట్టిందామె.

అద్దం పగిలిపోయిన ఒక పెద్ద ఫోటో ఆమె దృష్టి పథంలోకి వచ్చింది.

చేతిలో వున్న టార్చిలైటును ఆ ఫోటోమీదికి ఫోకస్ చేసి, తనకు తెలియకుండానే అదిరిపడింది ఆమె.

ఆ ఫోటోలో కనిపించే రూపం ఎవరిదో కాదు... తనదే. పట్టులంగా, పట్టు పావడా, ఒంటినిండా రకరకాలయిన ఆభరణాలు, పాదాలకు బంగారపు పట్టీలు. తనే. అచ్చంగా తనే నిలబడి వున్నది ఆ ఫోటోలో.

గుబగుబలాడే గుండెల్ని చిక్కబట్టుకుంటూ, టార్చిలైటును ఒక టేబిల్ మీదపెట్టి, కింద వున్న ఫోటోని పైకి తీసిందామె.

అంతే... ఏళ్ళ తరబడి దానిమీద పేరుకుని వున్న దుమ్ము జలజల రాలుతున్నట్టు, వర్షంలో తడిసిన వరిగడ్డివామిలో నిప్పురవ్వ పడటంవల్ల దట్టమైన పొగ వెలువడుతున్నట్టు చుట్టుముట్టిందో శక్తితరంగం.

ఆ శక్తి తరంగం మధ్యలో నుంచి ప్రత్యక్షమైంది ఒక ఆకారం.... “వచ్చావా? వచ్చావా సువర్ణా! ఇంత కాలానికి నామీద నీకు దయకలిగిందా? ఇన్ని సంవత్సరాల తర్వాత నీకు నన్ను చూడాలని అనిపించిందా?” అంటూ చేతులు జాచి ఆమెను కౌగిలించుకోబోయింది.

దటీజ్ టూమచ్.... తట్టుకోలేకపోయింది అపూర్వ. మొదలు నరికిన చెట్టులా ఎక్కడ వున్నది అక్కడే విరుచుకుపడిపోయింది.

***

చటుక్కున చేతులు జాపి పడిపోకుండా గట్టిగా పట్టుకున్నాడు శ్యామ్ దాదా తన అనుచరుడు ఒకతన్ని "గుడ్డినాయాలా... చూసుకుని నడవరా అంటే కళ్ళు నెత్తిమీద పెట్టుకుని నడుస్తావేంటిబే? ముందుకు చూడు" కోపంతో నోటికి వచ్చినట్టు తిట్టిపోస్తూ అన్నాడు.

"ఇప్పటిదాకా పొడిగా వున్న నేల ఒక్కసారిగా బురద బురద అయిపోయి వుంటుందని నేనేమైనా కలగన్నానా?" అని సమాధానం చెప్పబోయి, ఆఖరి క్షణంలో ఆ మాటల్ని తనలోనే అదిమేసుకున్నాడు ఆ అనుచరుడు.

చేతికి అందిన రవిబాబు ఆఖరి క్షణంలో చేజారిపోయినప్పటి నుంచీ అగ్గిమీద గుగ్గిలంగా గంతులు వేస్తున్నాడు శ్యామ్ దాదా. నోటికి ఏ మాట వస్తే ఆ మాట మాట్లాడేస్తున్నాడు. ఇప్పుడు మాటకు మాటగా సమాధానం ఇస్తే మరింత అధికం అయిపోతుంది అతని కోపం. వెనుకా ముందు చూసుకోకుండా ఇంకా ఇంకా అరిచి కేకలు పెడతాడు. నిద్రలు పోతున్న గ్రామస్థులు అందరూ నిద్రలేచి తమ భరతం పట్టినా పట్టవచ్చు.

కామ్‌గా తలవంచుకున్న అనుచరుడి వంక కోరగా చూస్తూ, తన వెనకాల నిలబడిన వారికి సైగచేశాడు శ్యామ్ దాదా. "శివయ్యగాడిని పట్టుకోవాలి. అల్లరి అవకుండా ఆడి ఇల్లు ఎక్కడ వుందో తెలుసుకోండి..... వెళ్ళండి" అని ఆర్డర్ ఇచ్చాడు.

“అన్నా... మనం రచ్చబండ దగ్గర వున్న కాకా హోటల్ దగ్గరికి పోయి అడిగితే?” అన్నాడు వారిలో ఒకతను.

కోపంతో ధుమధుమలాడిపోతున్న శ్యామ్ దాదా ముఖం ప్రకాశవంతమైంది ఆమాటల్ని వినేసరికి. శబ్బాషైన మాట ఇది. హోటల్ దగ్గరికి పోతే మనం అల్లరిపడం. అంతగా ఎవరయినా అడిగితే దారితప్పినట్టు చెప్పొచ్చు. పదండి అంటూ ముందుకు అడుగువేశాడు.

మురుగునీటివల్ల బురద అయిన ప్రదేశాన్ని అధిగమించి గ్రామం మధ్యలోకి వచ్చారు వాళ్ళందరూ.... హోటల్ పాకలో మడతమంచం మీద నిద్రపోతున్న ఓనరమ్మని మెల్లిగా పిలిచి బయటికి రప్పించారు.

“శివయ్య అనీ... బార్బరు... ఈ ఊళ్ళో వుంటాడు. మాకు ఫ్రెండు. అడవిదారిలో టైర్లు పంక్చర్ అవటంవల్ల ఆలస్యం అయింది. ఆడి ఇల్లు” అంటూ మాటలు మొదలు పెట్టేసరికి, నిరభ్యంతరంగా రచ్చబండవైపు చేయిచూపించింది ఆ ఓనరమ్మ.

“అడుగో... సీమ సరుకని చెప్పి పూటుగా మందుకొట్టాడు. కళ్ళు తిరిగి ఇంటికి కూడా పోకుండా ఈడనే పండుకున్నాడు” అని చెప్పింది.

“నీళ్ళు తీసుకురండిరా.... నీళ్ళు” అని అనుచరులకు చెప్పి, ఆమె చూపించిన వైపుకు పరుగులాంటి నడకతో వెళ్ళాడు శ్యామ్ దాదా.

హోటల్ పాకలోనే తమకు కనిపించిన ఒక పెద్ద కుండను అడుగు ఊడి కిందపడకుండా జాగ్రత్తగా తీసుకొచ్చారు అతని అనుచరులు. అతను తల

ఊపగానే వెల్లకిలా పడుకుని వున్న శివయ్య తలమీద కుమ్మరించారు. తలకు ఎక్కిన మత్తు సగానికి సగం అప్పటికప్పుడు దిగిపోతుండగా, అదిరిపడి లేచాడు శివయ్య. నోటికొచ్చినట్టు తిట్టడానికి రెడీ అవుతూ, ఆ పని చేసింది ఎవరో తెలిసి గటుక్కున నోటిని అదుముకున్నాడు.

"లేవరా శివయ్యా! నీతో చాలా పెద్దపని పడింది. లేచి నాతోరా" అంటూ అతని చేయి పట్టుకుని రచ్చబండ మీదినించి దించాడు శ్యామ్ దాదా. మడత మంచంమీద కూర్చుని తమవంకే చూస్తున్న హోటల్ మనిషిని గురించి ఏమాత్రం పట్టించుకోకుండా, మురుగు నీళ్ళతో బురదబురదగా తయారైన వీధిలోకి తీసుకుపోయాడు.

"అర్జంటుగా రాఘవాపురం వెళ్ళాలని చెప్పావ్ గదా! అప్పుడే తిరిగి వచ్చావేంటి?" భుజంమీది తుండుగుడ్డ కూడా తడిసిపోవటం వల్ల, వట్టి చేతులతోనే ముఖంమీది తడిని తొలగించుకుంటూ అడిగాడు శివయ్య.

"అరేయ్ శివయ్యా... నీతో అనుకోని విధంగా ఒక అర్జంట్ పని పడింది. రవిబాబని పట్నంలో కాలేజీ స్టూడెంట్ ఇవ్వాళ సాయంత్రం మీ ఊరు వచ్చాడు" తమ వెహికల్స్‌ని ఆపిన చోటుకు అతన్ని తీసుకుపోయి చిన్న కంఠంతో చెప్పటం మొదలుపెట్టాడు శ్యామ్ దాదా.

రవిబాబును గురించి అతను ఎందుకు మాట్లాడుతున్నాడో తనకు తెలియనట్లే తలూపాడు శివయ్య.

“వాడు... ఆ రవిబాబు ఏసేయటానికి మేము కాంట్రాక్ట్ తీసుకున్నాం. దొరికినట్టే దొరికి ఇటు పారిపోయి వచ్చాడు. వెతికి మాకు అప్పచెప్పు. ఇరవై వేలు ఇస్తాను....” అసలు విషయంలోకి వచ్చేశాడు శ్యామ్ దాదా.

“రవిబాబా? రవిబాబు రత్నంగారింటికి వచ్చాడు. తిరిగి వెళ్ళిపోయే సమయానికి మా బస్సు వెళ్ళిపోయింది. రాఘవాపురం దాకా వెళ్ళి రైలు ఎక్కమని నేనే పంపించాను. మీరు అతన్ని దారిలో చూసే వుంటారు....” ఆ తరువాత జరిగిన సంగతుల్ని చెప్పకుండా అవసరం అయిన మాటలను మాత్రమే ఒక్కొక్కటిగా బయటపెట్టాడు శివయ్య.

“అదేరా... అదే ఆడు మాకు మస్కాకొట్టి ఇటే పారిపోయి వచ్చాడు” చిరాకుగా అన్నాడు శ్యామ్ దాదా.

“ఇందాక పది గంటలవరకూ నేను మందుకొడుతూ హోటల్ దగ్గరే వున్నాను. నాకు రవిబాబు కనిపించలేదు. అతను గ్రామంలోకి రాలేదు.... వస్తే నా దగ్గరకే వస్తాడు. ఇక్కడ అతనికి పరిచయస్తులు ఎవరూ లేరు” ఏమాత్రం తడుముకోకుండా వెంటనే చెప్పాడు శివయ్య.

“ఆడు ఇటువైపే వచ్చాడురా” మరింతగా చిరాకుపడుతూ చెప్పాడు శ్యామ్ దాదా.

“నీకు మతిపోయింది. నేను పదింటివరకూ హుషారుగా వున్నానని చెపుతుంటే వినిపించుకోవటం లేదు. అతను ఇటు రాలే... ఇటుగా బయల్దేరినట్టే బయలుదేరి మధ్యలో దారి మార్చుకొని వుంటాడు. ఇక్కడ అతనికి తెలిసిన

వాళ్ళెవరూ లేరని చెపుతున్నా.... వినిపిస్తోందా?" తనూ చిరాకు పడుతున్నట్టు అన్నాడు శివయ్య.

"ఆ రత్నం ఎవరు? ఆళ్ళ ఇంటికే గదా మొదట ఆడు వచ్చింది?" అనుమానంగా అడిగాడు శ్యామ్ దాదా.

"రత్నంగారి ఇంటికి వెళ్ళడు. ఒకవేళ వెళ్ళినా వాళ్ళు లోపలికి రానియ్యరు తన్ని తగలేస్తారు" అంటూ రవిబాబుకి జరిగిన అవమానాన్ని గురించి చెప్పాడు శివయ్య.

ప్యాంటు జేబులోంచి పాన్ పరాగ్ ప్యాకెట్‌ని బైటికి తీసి నోటిలోకి ఒంపుకుంటూ తలూపాడు శ్యామ్ దాదా.

"నీ మాట నిజమే.... ఇంత జరిగాక ఆడు ఇటు రానేరాడు. నువ్వు చెప్పినట్టు వెనక్కి తిరిగినట్టు తిరిగి మళ్ళీ అడవిలోకి పోయి వుంటాడు" అంటూ తన వారికి సైగచేవాడు.

రెడీగా వున్నారు వాళ్ళంతా. తమ వెహికల్స్ లోకి జంప్ చేసి, అతని వంక చూశారు.

"పదరా. ఈ అడవిలో ఎటు బోవాలో తెలీదు. ఏమైనాసరే తెల్లారేలోగా ఆడిని ఏసెయ్యాలి....." అని శివయ్య చెయ్యి పట్టుకుని వెహికల్ లోకి నెట్టాడు శ్యామ్ దాదా.

వేగంగా నడిపి, రవిబాబు తమకు స్లిప్ ఇచ్చిన ప్రదేశంలో వెహికల్‌ని ఆపాడు శ్యామ్ దాదా డ్రైవర్.

"ఇక్కడేనా? వాడు నీకు కనిపించకుండా పోయింది ఇక్కడేనా?" కిందికి దిగుతూ హుందాగా అడిగాడు శివయ్య. అవునని తల ఊపటంతో ఆగకుండా, తన అనుచరుడిని గాయపరచిన కొండరాయిని కూడా కింది నించి తీసి అతనికి చూపించాడు శ్యామ్ దాదా.

"అయితే వాడు డెఫినిట్‌గా ముచ్చింతలగట్టు దగ్గరికి పోయి వుంటాడు. నాతోరండి.... త్వరగా... త్వరగా..." అంటూ ఎదురుగావున్న ఒక పొదవెనక్కి అతన్ని, అతని అనుచరుల్ని లీడ్ చేశాడు శివయ్య. పాతిక అడుగులు పోగానే అందరికీ అగుపించింది ఒక కాలిబాట.

"రవిబాబు సిటీలో చదువుకుంటున్నాడు. ఈ అడవిదారులు అతనికెలా తెలుస్తాయి?" అరగంటపాటు నడిచాక వున్నట్లుండి అడిగాడు శ్యామ్ దాదా.

"కత్తులు పట్టుకుని నీ ఎనకాల ఎవరైనా చంపటానికి వస్తే, నీకూ తెలుస్తాయి... ప్రాణభయం అట్లాంటిది. శబ్దం చేయకుండా రండి" చిన్న కంఠంతో అన్నాడు శివయ్య.

"శబ్దం చేస్తే ఏమౌతుంది?" అడిగాడు శ్యామ్ దాదా.

"ఏమీ అవదు. ముక్కులు ముఖాలు ఏకమైపోతాయి."

ఆ మాటలు వినడంతోనే ఎగసుకు వచ్చేసింది శ్యామ్ దాదాకి కోపం. "దారి చూపించమని అడిగినందుకు మమ్మల్ని చేతకానివాళ్ళు అనుకుంటున్నావా? ఏందిబే నువ్వు మాట్లాడేది...? మా ముక్కులు ముఖాలు ఏకం ఎందుకు

అయిపోతాయి బే? చూపించు" అంటూ అతని షర్టుని గట్టిగా పట్టుకుని వెనక్కి లాగాడు.

"నువ్వు ప్రతి మాటకి ఇలా వంకర అర్థాలు తీయటం ఏమీ బాగోలేదు భాయీ. ఒకసారి పైకిచూడు..." అతను అన్న మాటలకి కోపం తెచ్చుకోకుండా, పైకి చూపిస్తూ పరమశాంతంగా చెప్పాడు శివయ్య.

పైకి చూశాడు శ్యామ్ దాదా. వట్టిగా కాదు టార్చిలైట్లు ఫోకస్ చేయించి మరీ చూశాడు. వెంటనే కనిపించాయి అతనికి పాతిక సంఖ్య వరకూ వున్న గబ్బిలాలు. తల్లకిందులుగా చెట్టుకొమ్మలకు వ్రేలాడుతున్నాయి అవి.

టార్చిలైటు వెలుగులో మిణుకు మిణుకుమనే మిణుగురుపురుగుల్లా కనిపించాయి వాటి కళ్ళు.

"ఇవా? ఈ గబ్బిలాలా? లాగిపెట్టి కొడితే గావురుగావురుమంటూ చచ్చిపడే ఈ చచ్చుముఖాలను చూసి మేము భయపడాలా?" అంటూ కింది నించి పలుకురాయి నొకదానిని పైకి తీశాడు శ్యామ్ దాదా.

"వద్దు.... వద్దు భాయీ... రాయిని విసరవద్దు" ఖంగారుగా అంటూ అతని చేతిని పట్టుకోబోయాడు శివయ్య.

అప్పటికే ఆలస్యం అయిపోయింది. గింగిరాలు తిరుగుతూ గాలిలోకి లేచింది శ్యామ్ దాదా విసిరిన రాయి. సూటిగా పోయి ఒక గబ్బిలానికి తగిలింది.

కీచుమని అరిచి పల్టీలు కొడుతూ కిందపడిపోయిందా గబ్బిలం. దాని అరుపును విని గగ్గోలుగా అరుస్తూ చెట్టుకొమ్మల్ని వదిలేశాయి మిగిలినవి.

“పారిపోదాం... మనం వెంటనే ఇక్కడి నుంచి పారిపోదాం.... పదండి... వచ్చినదారినే వెనక్కి పదండి” ఆందోళన నిండిన కంఠంతో అక్కడివారందరిని హెచ్చరిస్తూ వెనక్కి బయలుదేరాడు శివయ్య.

మెరుపుకంటే వేగంగా తన చాకును తిప్పి అతని మెడకి ఆనించాడు శ్యామ్ దాదా. “అడుగు అవతలికి వేశావంటే నరికిపారేస్తాను. మాకు ఆ రవిబాబును చూపించకుండా....” అని ఏదో బెదిరింపు మొదలుపెట్టబోతుండగా దారుణమయిన ఈదురుగాలి స్టార్ట్ అయినట్టు వినవచ్చింది శబ్దం.

“అన్నా.... గబ్బిలాలు.... అయ్యబాబోయ్ గబ్బిలాలు.... చూడు.... చూడు....” అంటూ గొంతు చినిగిపోయేలా బిగ్గరగా అరిచాడు అతని అనుచరుడు ఒకతను.

టార్చిలైట్ల వెలుగులో తనకు కనిపించిన దృశ్యాన్ని చూసి నిర్ఘాంతపోయాడు శ్యామ్ దాదా. ఒకటి కాదు... రెండు కాదు... పదికాదు. పాతిక కాదు.... వందలు వేలు వచ్చిపడుతున్నాయి గబ్బిలాలు.

“పారిపోండి... పారిపోండి....” అని అరుస్తూ శివయ్యని వదిలేసి పరుగు మొదలుపెట్టబోయాడతను. రెండడుగులయినా వేయకముందే వచ్చి అతన్ని చుట్టుముట్టాయి అవి.

చేతిలోని చాకు ఎగిరి అవతల పడిపోయిన విషయాన్ని గురించి పట్టించుకోకుండా, ముఖాన్ని చేతులతో కప్పుకుంటూ గుడ్డిగా పరుగు మొదలుపెట్టాడు అతను.

***

తన బుగ్గల్ని ఎవరో తడుతున్నట్టు అనిపించి నెమ్మదిగా కళ్ళు తెరిచింది అపూర్వ. తను ఎక్కడ వున్నదో అర్థంకాక చుట్టూ చూసింది. దుమ్ము ధూళితో నిండివున్న ఫ్లోరింగ్‌ని, విరిగిపోయిన ఫర్నిచర్‌ని, చుట్టూ వున్న అపరిశుభ్ర వాతావరణాన్ని గమనించగానే జరిగింది అంతా వెంటనే గుర్తుకువచ్చి గుభిల్లుమన్నాయి ఆమె గుండెలు.

అప్రయత్నంగానే తన పాదాలవైపు చూసుకున్నది ఆమె. కింద పడిపోతున్న సమయంలో తన బొమ్మ వున్న ఫోటోని వదిలేసింది.

కిందపడి మరింతగా పాడయిపోయిందేమో అది! ఆమె పాదాల దగ్గర కనిపించలేదు ఆ ఫోటో. పక్కనేవున్న కుర్చీమీద చక్కగా నిలబెట్టి వుంది.

కింద పడిపోకముందు ఆమె టేమిల్ మీద పెట్టిన టార్చిలైటు వెలుగులో మరింత అందంగా కనిపిస్తోంది అందులోని బొమ్మ.

"ఇది.... ఇది కింద వుండకుండా కుర్చీమీదికి ఎలా వచ్చింది?" అని తనలో తాను అనుకుంటూ పైకిలేచి నిలబడి పక్కకు తిరిగి చూసింది అపూర్వ.

అంతే.... మరోసారి మైకం ముంచుకు వస్తున్న అనుభూతి కలిగింది. దారుణమైన భయంతో తల్లడిల్లిపోతూ, చెవులు చిల్లులుపడేలా అరవటానికి నోరు తెరిచింది.

"వద్దమ్మా.... అరవద్దు... నిన్ను చూసి నా సువర్ణ నా కోసం వచ్చిందని అనుకుని నేనే పొరపాటు పడ్డాను. నాదే తప్పు. నువ్వు దయచేసి అరవబోకు...."

అంటూ చేతులు జోడించి వేడుకున్నది ఆమె స్పృహ తప్పటానికి కారణమైన ఆకారం.

"ఎ.... ఎవరు నువ్వు...?" తడబడుతున్న కంఠంతో అడిగింది అపూర్వ.

"నేను రాజశేఖర్‌ని. సువర్ణని ప్రేమించినవాడిని...." అన్నది ఆ ఆకారం.

"నువ్వు రాజ... రాజశేఖర్‌వా...? సువర్ణ అంటే నా మేనత్త. ఆమెను ప్రేమించిన రాజశేఖర్‌వేనా...?" తన భయం మాట క్షణకాలం మరిచిపోయి ప్రశ్నించింది అపూర్వ.

"అవునమ్మా... ఆ దురదృష్టవంతుడిని నేనే. పాతికేళ్ళుగా ఇక్కడ వుంటున్నాను. ఎప్పుడూ ఇక్కడికి రాలేదు నువ్వు. ఇప్పుడు ఎందుకు వచ్చావ్?" అన్నదా ఆకారం.

"నా మేనత్తని గురించి నాకివ్వాళే తెలిసింది. ఆమెని గురించి ఇంకా తెలుసుకోవాలని వచ్చాను" చెప్పింది అపూర్వ.

"అదిగో.... అచ్చం నువ్వు సువర్ణ పోలికలతోనే పుట్టావు. నాతో పాటు సువర్ణ కూడా చచ్చిపోయిందని తెలుసుకాబట్టి. నిన్ను పోల్చుకోగలిగాను. తెలియకపోతే సువర్ణ అనే అనుకునేవాడిని" కుర్చీ దగ్గరికిపోయి ఫోటోలోని బొమ్మని ఆప్యాయంగా తడుముతూ చెప్పింది ఆ ఆకారం.

"సువర్ణ చచ్చిపోయిందా? నా మేనత్త...." అని అడుగుతున్న ఆమె వంక విషాదంగా చూసి తల విదిలించిందా ఆకారం.

“చెప్పు.... నా మేనత్త ఎందుకు చచ్చిపోయింది?” అని అడగాలనుకున్నది అపూర్వ.

ఆమె మాటలు పెదవులు దాటకముందే “ఆ విషయాలు అన్నీ తరువాత తీరిగ్గా మాట్లాడుకుందాం. మీ నాన్నకి మెలకువ వచ్చింది. నీ గది దగ్గరికిపోయి నువ్వు ఏం చేస్తున్నావో చూస్తాడు. నువ్వు కనిపించకపోతే గోలగోల చేస్తాడు. త్వరగా వెళ్ళు” అంటూ ఆమె చేతిని పట్టుకుని గది బయటికి తీసుకుపోయి వదిలింది.

అపూర్వ చూస్తూ వుండగానే తమంతట తామే మూసుకుపోయాయి తలుపులు. తనంతట తానే బిగుసుకున్నది గడియ. తాళం తనంతట తానే పడింది. తుప్పుపట్టిన తాళంచెవులు ఆమె చేతిలోకి వచ్చి చేరాయి.

ఆశ్చర్యపడుతూ అలాగే నిల్చుంటే ఆ ఆకారం చెప్పినట్టు తన తండ్రి గోల మొదలుపెడతాడని పరుగున పెరటి గుమ్మంలోనుంచి వంట ఇంట్లోకి, అక్కడి నుంచి మెట్లమీదుగా తన గదిలోకి వచ్చిపడింది ఆమె. విశాలమైన బెడ్ మీద పడుకుని దుప్పటిని ఒంటినిండా కప్పుకున్నది.

పదిక్షణాలు కూడా గడవకముందే ఆమె చెవులకు చేరింది ఆమె తండ్రి కంఠం.

“పెరటి తలుపులు తీసివున్నాయి... ఏం జరిగింది? అపూర్వ గదిలో వున్నదో లేదో చూడు...” అంటూ అరుపులు మొదలుపెట్టాడు ఆయన.

పెద్ద పెద్ద అంగలువేస్తూ, మెట్లు ఎక్కి గదిలోకి తొంగిచూసింది అపూర్వ మదర్.

అప్పుడే మెలకువ వచ్చినట్టు అటూ ఇటూ కదిలి కళ్ళు తెరిచింది అపూర్వ. తలుపుల దగ్గర వున్న తల్లిని చూసి, "ఏమిటమ్మా? ఏమైంది?" ఆశ్చర్యాన్ని నటిస్తూ, ఒంటిమీద దుప్పటిని అవతలికి విసిరింది.

"పడుకునేటప్పుడు పెరటి తలుపులు మూసివేయటం మర్చిపోయినట్టున్నాను. చీకటి మాటున ఎవడైనా ఇంట్లో దూరాడేమోనని ఖంగారుపడుతున్నారు మీ నాన్న.... అంతకన్నా ఇంకేమీలేదు. నువ్వు పడుకో.... నిద్రపో..." అంటూ తలుపుల్ని తిరిగి దగ్గరికి నెట్టి కిందికి వెళ్ళిపోయింది తల్లి.

తనలో తను నవ్వుకుంటూ బెడ్ మీదినుండి దిగింది అపూర్వ. మెట్లకు అడ్డంగా పడివున్న పనిమనిషి అప్పుడే కొంచెం పక్కకు వత్తిగిలింది.

"నాన్నగారెందుకో అరిచి కేకలు పెడుతున్నారు. లేచి కూర్చో.... ఆ గోలేమిటో కాస్త కనుక్కో..." దగ్గరికిపోయి ఆమె భుజం తడుతూ హెచ్చరించింది అపూర్వ.

ఉలిక్కిపడి చటుక్కున కళ్ళు తెరిచింది పనిమనిషి. గబగబాలేచి పమిటచెంగుతో కళ్ళు తుడుచుకుంటూ హడావుడిగా కిందికి పరిగెత్తింది.

పెరటి గుమ్మం దగ్గర నిలబడి వీరావేశంతో చూస్తున్న భర్తకు కూతురిగురించి చెప్పినట్లుందాయన భార్య. పదిక్షణాల్లో పరమ శాంతమూర్తి అయ్యాడాయన.

“ఏమైంది బాబుగారూ.... ఏం జరిగింది?” అని ఖంగారుగా అడుగుతూ కిందకు వచ్చిన పనిమనిషిని ఆయన చాలా సున్నితంగా మందలించాడు.

“అమ్మగారికి మతిమరుపు వుండటం సహజం. పడుకొనేముందు తలుపులన్నీ సరిగ్గా వేసి వున్నాయో లేదో చూసుకోవాల్సిన అవసరం నీకు లేదా? రోజురోజుకీ నీకు బద్ధకం ఎక్కువైపోతోంది” అంటూ ఆమెను తిరిగి పైకి పంపించేసి ముఖద్వారం దగ్గరికిపోయాడు.

ఆయన అరుపుల్ని విని ఎలర్ట్ అయిపోయారు ముందు భాగంలో కాపలా వున్న పాలేర్లు ఇద్దరూ. “పడుకోండిరా.... పెరటి తలుపులు మూయటం మర్చిపోయింది మీ అమ్మగారు. అంతకన్నా ఇంకేమీలేదు...” అంటూ వారికి కూడా చెప్పి బెడ్ రూమ్ వైపు అడుగులు వేశాడు.

“ఆయనకు అనుమానం పూర్తిగా పోలేదు. నీ దగ్గరికి వస్తాడు” తన గది గుమ్మం దగ్గర నిలబడి వున్న అపూర్వకి వున్నట్లుండి ఎవరో చెవిలో ఊదినట్లయింది.

ఉలిక్కిపడి వెనక్కి చూస్తున్న అపూర్వవంక చాలా విచిత్రంగా చూసింది. తన ఈతాకుల చాపమీద కూర్చుని గట్టిగా ఆవలిస్తున్న పనిమనిషి. “అదేంటమ్మాయిగారూ....? అట్లా ఉలిక్కిపడ్డారేంటి?” అని అడిగింది.

“నన్నెవరో పిలిచినట్టు అనిపించింది...” వెనక్కి చూడటాన్ని మానకుండా చెప్పింది అపూర్వ.

"పిలవాల్సిన మీ నాన్నగారు, అమ్మగారు మెట్లకింద వున్నారు... మీ గదిలో ఎవరూ లేరు... గాలి విసురుకి కిటికీ తలుపులు కదిలి వుంటాయి. అంతే... హాయిగా పోయి చక్కగా పడుకోండి... వెళ్ళండి" అంటూ మరోమారు గట్టిగా ఆవలించి చాపమీదికి ఒరిగింది పనిమనిషి.

"అదుగో... మీ నాన్న వస్తున్నాడు...." మరోసారి అపూర్వ చెవిదగ్గర మెల్లగా వినవచ్చాయి మాటలు. అదిరిపడబోయి, అంతలోనే నేర్పుగా తమాయించుకున్న అపూర్వకి చకచకా పైకి వస్తూ కనిపించాడు తండ్రి.

"నిద్రపట్టటంలేదా?" అంటూ ఆమెను సాదరంగా పలుకరిస్తూ గదిలోకి వచ్చాడాయన.

"ఏం జరిగింది?" అమాయకంగా అడిగింది అపూర్వ.

"పెరటి తలుపులు తీసివున్నాయి... దొంగ వెధవలు ఎవరైనా లోపలికి దూరారేమో అని అనుమానం...." అంటూ గదంతా కలియతిరిగాడాయన. ఓరగా తెరిచివున్న రెండు కిటికీ తలుపుల్లో నుంచి బయటికి తొంగిచూసి, వాటిని టైట్‌గా క్లోజ్ చేసేశాడు.

"నువ్వు పడుకో..." అని అపూర్వకి చెప్పి, ఎంత సడన్‌గా వచ్చాడో అంతే సడన్‌గా కిందికెళ్ళిపోయాడు.

ఈసారి తలుపుల్ని గట్టిగా వదిలేయలేదు అపూర్వ. గట్టిగా మూసి లోపలివైపు గడియ బిగించింది.

ఆమె ఆ పనిచేసిన వెంటనే బెడ్‌కి సమీపంలో వున్న కుర్చీలో ప్రత్యక్షమైంది రాజశేఖర్ స్వరూపం.

"ఇప్పుడు చెప్పు.... నా మేనత్త ఎందుకు చనిపోయింది?" ఆ స్వరూపం ఎదురుగా వున్న ఇంకో కుర్చీలో కూర్చుంటూ చిన్న కంఠంతో అడిగింది అపూర్వ.

"మీ నాన్నకి ఆత్మబంధువుల్లా నటిస్తూ, ఇరవై నాలుగు గంటలూ ఆయన వెనకాలే తిరుగుతూ వుండే స్నేహితులు" గట్టిగా నిట్టూర్చి, చేతులతో ముఖాన్ని తుడుచుకుంటూ మొదలుపెట్టిందా స్వరూపం.

"ఎవరు? చలమయ్య, పోతురాజు, కనకయ్య....?" అంటూ తన తండ్రిని ఎప్పుడూ అంటిపెట్టుకుని వుండే స్నేహితుల పేర్లును చకచకా చెప్పింది అపూర్వ.

"అవును.... వాళ్ళే... చలమయ్య, పోతురాజు, కనకయ్య...?" ఒక్కోపేరును ఆవేశంగా వత్తివత్తి పలికింది ఆ స్వరూపం. అంతవరకూ ప్రశాంతంగా వున్న ఆ ముఖం ఆ పేర్లను పలికే సమయంలో పరమ వికృతంగా మారిపోవటాన్ని చూసి, ఉలిక్కిపడింది అపూర్వ.... తనకు తెలియకుండానే కుర్చీలో వెనక్కి వెనక్కి జరిగింది.

ఆమె భయపడుతున్నట్లు గమనించింది కాబోలు తల విదిలించి క్షణంలో మామూలుగా మారిపోయిందా స్వరూపం. "నన్ను క్షమించాలి అమ్మా.... ఒక్కోసారి అవధులు దాటే ఆగ్రహం నన్ను ఆవరించుకుంటూ వుంటుంది. నాకు, నా సువర్ణకు ఈ గతి పట్టించిన వాళ్ళందర్నీ సర్వనాశనం చేయాలన్నంత ఆవేశం ముంచుకువస్తూ వుంటుంది" అంటూ, అపూర్వ ముఖంలోకి మరింత పరిశీలనగా

చూసి, చాలా అందంగా మళ్ళీ మళ్ళీ మరో మారు చూడాలనిపించేటంత అందంగా నవ్వాడు.

"నీ నవ్వు ముచ్చటగా చాలా బాగుంది... నా మేనత్త నీ నవ్వుని చూసే ప్రేమించిందా?" తన భయాన్ని మరిచిపోయి చనువుగా అడిగింది అపూర్వ.

"అవునమ్మా.... నా ఈ పాడు నవ్వుని చూసే తను నన్ను ప్రేమించింది... నాతో జీవితాన్ని పంచుకోవాలని ఎంతో ఆశపడింది... ఇనుప ముక్కల్ని సాగదీసుకుంటూ కత్తులు, కొడవళ్ళు చేసుకుంటూ బతికే నిర్భాగ్యుడికి నీ చెల్లెల్ని కట్టబెడతావా అని స్నేహితులు ఎగతాళి చేయటంతో మీ నాన్న మా వివాహానికి అంగీకరించలేదు..." బరువుగా అన్నది ఆ స్వరూపం.

"చేసుకునేది నువ్వు... ఒపుకున్నది నా మేనత్త... పెళ్ళి చేయవలసింది మా నాన్న. పెద్ద పెద్ద మాటలు మాట్లాడటానికి వీళ్ళకేం అధికారం వుంది?" అంది అపూర్వ.

"అధికారం లేదమ్మా... వాళ్ళకి సువర్ణమీద వాంచ వున్నది... బయటికి చెపితే మీ నాన్న వీరభద్రుడిలా విరుచుకుపడి, కాళ్ళూ చేతులు విరగతీయిస్తాడని తమ కోరికను తమలోనే దాచిపెట్టుకుని పైకిమాత్రం మీ నాన్నకి శ్రేయోభిలాషుల మాదిరి నటించటం నేర్చుకున్నారు....

ఆరోజు.... తనకు రాఘవాపురం అవతలి పక్క నుంచి పెళ్ళిచూపులు వాళ్ళు వస్తున్నారని తెలిసిన రోజున నీ మేనత్త మీ నాన్న కాళ్ళమీద పడి

వేడుకున్నది. నాతో వివాహం జరిపించమని అర్థించింది. ఆయన అంగీకరించకపోవటంతో ఒక అర్ధరాత్రి నా దగ్గరికి వచ్చేసింది.

ఈ ఊళ్ళో మీ నాన్నకి ఎదురులేదు... ఎట్టైనా పారిపోదామన్న ఆలోచనతో రాఘవాపురం రైలుస్టేషన్‌కి బయలుదేరాం... ఎలా తెలిసిందో మీ నాన్నకి ఆ విషయం తెలిసింది... తన స్నేహితుల్ని వెంటపెట్టుకుని మా వెనకాలే అడవిలోకి వచ్చేశాడు...'' పూనకం వచ్చినట్టు వెనక్కీ, ముందుకు ఊగుతూ చెప్పకుపోయిందా స్వరూపం.

"ముసలమ్మ కుంటదగ్గర వాళ్ళని తప్పించుకున్నాము మేము. రాఘవాపురం వైపు వెళ్ళటం అంటే వాళ్ళకి పట్టుబడిపోవటం తప్పనిసరి అని అర్థమై, సరాసరి వేములపల్లి గ్రామంవైపు వెళ్ళే దారిలోకి పోయాం. సువర్ణకు ఆయాసం ముంచుకు రావటంతో ఒకచోట కొద్దిసేపు ఆగాల్సి వచ్చింది.

ఆ కాస్త వ్యవధిలోను మీ నాన్నను రైలుస్టేషన్ దగ్గరికి పంపించి, తాము మా వెనకే ప్రత్యక్షం అయ్యారు పోతురాజు, చలమయ్య, కనకయ్య. సువర్ణ ఎంత ప్రాధేయపడినా వాళ్ళు కనికరించలేదు... ఆమె చూస్తూ వుండగానే తమతో తీసుకొచ్చిన కత్తులతో నన్ను పొడిచి చంపేశారు... అడ్డంపడటానికి ప్రయత్నించిన సువర్ణను పట్టుకుని'' అంటూ గొంతుకు ఏదో అడ్డం పడినట్లు మాటల్ని ఆపి, ముఖాన్ని చేతుల్లో దాచుకున్నది.

ఆత్రుత అధికమైపోయిందామెకి. "ఏం చేవారు? వాళ్ళు మా మేనత్తని వెంటబెట్టుకుని వెనక్కి తెసుకెళ్ళారా?'' అనడిగింది.

“వెనక్కి తీసుకుపోయివుంటే నాకు ఈ వ్యధ వుండేది కాదమ్మా. తీసుకు పోవాలన్న మాటను మరిచిపోయి, ఆమె శరీరంతో ఆటలాడుకోవటానికి ప్రయత్నించారు. సువర్ణ ప్రతిఘటించింది. అదను చూసుకుని అవతలికి పరుగు తీసింది. వేములపల్లికి దగ్గర్లో అడవి మధ్యలో వున్న ఒక మేడమీదికి ఎక్కి ఆ రాక్షసులు తనను వదిలిపెట్టరని అర్థమైన వెంటనే మేడమీది నించి దూకి తన ప్రాణాలు తనే తీసుకున్నది అదేపనిగా బుగ్గల మీదికి కారుతున్న కన్నీటిని తుడుచుకోను కూడా తుడుచుకోకుండా గద్గద కంఠంతో చెప్పిందా స్వరూపం.

ఏం మాట్లాడాలో తెలియక మౌనంగా వుండిపోయింది అపూర్వ. ఆమెకు తెలీకుండానే కన్నీరు కిందికి జారసాగింది.

సువర్ణ తన ప్రాణాలు తనే తీసుకున్న విషయాన్ని బయటికి చెప్పలేదు ఆమెను వెన్నంటిన దుర్మార్గులు. మేడ దగ్గరే గోయి తవ్వి ఆమె శరీరాన్ని పాతిపెట్టారు. వెనక్కి వచ్చి నా శరీరానికి కూడా అంత్యక్రియలు తామే చేశారు. తాపీగా రాఘవాపురం వెళ్ళి మీ నాన్నకి మేము కనిపించలేదని అబద్ధాలు చెప్పారు. అడవిదాటి ఎటో వెళ్ళిపోయామని నమ్మించారు” అంటూ మరోసారి చెప్పటం మొదలుపెట్టిందా స్వరూపం.

“ఆత్మరూపాన్ని పొందిన నేను సువర్ణమీది భ్రమత తీరక ఆమెను వెతుకుతూ అడవంతా గాలించాను. ఆమె కూడా నాకోసం వెతుకుతూ అడవిలోనే తిరుగుతూ వుంటుందనే నమ్మకంతో చాలాకాలం ముసలమ్మ కుంటదగ్గరే ఆమె కోసం ఎదురుచూశాను.

అప్పటికీ తను రాకపోవటంతో తన జ్ఞాపకాలను రేకెత్తించే సామాగ్రి దగ్గర ఆమెకోసం ఎదురుచూస్తూ కాలం గడుపుతున్నాను. ఇంత కాలానికి అచ్చం సువర్ణ మాదిరిగా వున్న నువ్వు ఆ గదిలోకి రావటంతో నాలో చలనం వచ్చింది. పాత జ్ఞాపకాలన్నీ తిరిగి నా అంతరంగాన్ని కలవరపరచటం మొదలుపెట్టాయి.... నీ అనుమానాలన్నిటికీ సమాధానాలు లభించాయి కదూ?" ఉన్నట్లుండి మరోసారి అందంగా నవ్వుతూ అడిగింది.

"మా నాన్నకి నిజం తెలియదన్న మాట! జరిగింది ఏమిటో ఇప్పుడు మనం చెపితే?" ఉన్నట్లుండి ఆవేశంతో అడిగింది అపూర్వ.

"ఏమని చెపుతావ్? పాతిక సంవత్సరాల క్రితం జరిగిందేమిటో నీకు ఎలా తెలిసిందని ఎవరైనా అడిగితే ఎలా సమర్థించుకుంటావ్?" అడిగింది ఆ స్వరూపం.

"జరిగిన ప్రదేశానికి తీసుకుపోయి నేలని తవ్వితే" అంటూ మాటలని మధ్యలోనే మింగేసింది అపూర్వ.

"పాతికేళ్ళ క్రితం నేలలో పాతిపెట్టబడిన శరీరాలు ఇప్పుడు అదే రూపంలో అక్కడే వుంటాయా? మట్టిలో కలిసిపోయి వుండవా? ఆత్మబంధువులకంటె అధికంగా అభిమానించే తన స్నేహితులమీద అభాండాలు వేస్తే నమ్ముతాడా తన తండ్రి? తనకు పిచ్చెక్కిందని చెప్పి గదికి తాళం వేయించకుండా ఊరుకుంటాడా!"

రకరకాలయిన అనుమానాలు ఆలోచనల్ని అస్తవ్యస్తం చేయటం మొదలుపెట్టేసరికి చిరాకుగా తల విదిలించింది అపూర్వ. ఆమె ముఖంలోకి చూస్తూ చిరునవ్వులు చిందిస్తున్న రాజశేఖర్ స్వరూపం చిన్నగా చేయిజాచి, ఆమె బుగ్గల్ని ఆప్యాయంగా నిమిరింది.

"అర్థంకాని సమస్య ఏదైనా తారసపడితే నీ మేనత్త ఎలా తల విదిలించేదో అలాగే చేస్తున్నావు నువ్వు... ఇప్పుడు నీ ఎదుట వున్న సమస్య నీ మేనత్తకు, నాకు తీరని అన్యాయం చేసిన ఆ దుర్మార్గులకు బుద్ధిచెప్పటం కానేకాదు. నువ్వు ప్రేమించిన ఆ రవిబాబును పెళ్ళి చేసుకోవటం. ముందు ఆ సంగతిని గురించి ఆలోచించు. మా బ్రతుకుల మాదిరి అన్యాయం అయిపోకూడదు నీ జీవితం. కోరుకున్న వాడితో కలకాలం ఆనందంగా, హాయిగా జీవించాలి..." అంటూ కుర్చీలో నుంచి లేచాడు.

"వెళ్ళిపోతున్నావా? ఎక్కడికి పోతున్నావ్?" అని అడుగుతూ తను కూడా లేచి నిలబడింది అపూర్వ.

"తొలికోడి కూయటానికి ఎంతో వ్యవధిలేదు. మాటలలోపడి మనం సమయాన్ని గురించి మరచిపోయాం. రేపు రాత్రికి తిరిగి కల్సుకుందాం" అంటూ తలుపుల వైపు నడిచిందా స్వరూపం.

"గడియపెట్టాను.. ఒక్క క్షణం ఆగు..." అంటూ గడియ తీయటానికి బయలుదేరింది అపూర్వ. ఆమె చూస్తూ వుండగానే మూసివున్న తలుపుల్లో నుంచి అవతలికెళ్ళిపోయిందా ఆకారం. వేసిన గడియ వేసినట్టుగానే వున్నది.

తాను అంతవరకూ మాట్లాడింది ఒక ఆత్మ స్వరూపంతో అనే మాట గర్తుకొచ్చి ఎందుకో వికలమయిపోయింది అపూర్వ మనస్సు. బెడ్ మీద మేనువాల్చిందామె. తనకు తెలియకుండానే నిద్రలోకి జారుకుంది.

***

"పరిగెత్తడం ఇక నావల్ల కాదు బే.... ఆయాసం ముంచుకొచ్చేస్తుంది..." అంటూ తూలి ముందుకు పడిపోబోయిన శ్యామ్ దాదాని ఒక చెట్టు చాటుకు లాగాడు శివయ్య.

చెవులు చిల్లులుపడేటట్లు శబ్దాలుచేస్తూ వాళ్ళ వెనకాలే వస్తున్న నాలుగు గబ్బిలాలు సూటిగా ముందుకు దూసుకుపోయాయి. చెట్టు చాటున ముడుచుకు కూర్చున్నాడు శ్యామ్ దాదా. మోకాళ్ళమీద తలపెట్టుకుని ఊపిరి తీసుకుంటున్నాడు.

పదిక్షణాల తరువాత వున్నట్లుండి విప్పారింది శివయ్య వదనం.... "గబ్బిలాలు వెంటపడటం ఒకందుకు మంచిదే అయింది. మనకి తెలియకుండానే మనం ముసలమ్మకుంట దగ్గరికి వచ్చేశాం. అలసట తీరిపోయేదాకా ఆగి కడుపునిండా నీళ్ళు తాగవచ్చు. పద పద...." అంటూ శ్యామ్ దాదా చేయి పట్టుకుని పైకి లేపాడు.

"కొంచెం ఆగు.... మనవాళ్ళు వచ్చేదాకా ఆగుదాం" తన అనుచరులకోసం చూస్తూ అన్నాడు శ్యామ్ దాదా.

"ఆళ్ళు ఇప్పుడప్పుడే ఇటు రారు. దారి తెలియకపోతే ఈ అడవిలో ఎవరు ఎటుగా పోతున్నారో ఎవరికీ తెలియదు. తెల్లారిన తర్వాత నెమ్మదిగా వెనక్కి

పోయి వాళ్ళ కోసం వెతుకుదాం" అంటూ బలవంతంగా అతడిని ముందుకు తీసుకుపోయాడు శివయ్య.

పదినిముషాల పాటు నడిచిన తర్వాత వున్నట్లుండి వాళ్ళ ఎదుట ప్రత్యక్షమయింది ముసలమ్మకుంట. శివయ్య అనుమతితో అవసరం లేకుండా ఎగిరి దూకాదు శ్యామ్ దాదా ఆ నీళ్ళల్లో... అరిచేతులతో తపతపా కొడుతూ ఆనందంగా నవ్వాడు.

"అడవి ప్రదేశంలో అరవటాలు, గంతులేయటాలు మంచిదికాదు. నెమ్మదిగా నీ పని కానిచ్చుకో. తొందరగా ఒడ్డుకొచ్చేయ్" ఒక పక్కగా నిలబడి చిన్నకంఠంతో అతన్ని హెచ్చరించాడు శివయ్య.

"ఏడిచావ్.... ఇందాకటినుంచీ ఈ అడవిని గురించి అదేపనిగా చెప్పి నన్ను బెదరేయడానికి చూస్తున్నావ్... తెల్లారిన తర్వాత నీ పని చెప్తాను, ఇప్పుడు కాదు. నోరు మూసుకుని నీ పనేదో నువ్వు చూసుకో" అంటూ నీళ్ళను అల్లకల్లోలం చేశాడు శ్యామ్ దాదా.

రెండు మునుగులు మునిగి, దోసిటితో నీటిని తీసుకుని కడుపునిండా తాగాడు.

"భలేరుచిగా వున్నాయిబే నీళ్ళు. మినరల్ వాటర్ కూడా ఇంత రుచిగా వుండదు. ఈ చెరువు పేరు ఏదో చెప్పావ్.... ఏమిటదీ? ఇంకోసారి చెప్పు?" అంటూ శివయ్యవైపు చూశాడు. శివయ్య కనిపించలేదతనికి.... రాక్షసుల్లా క్రూరంగా చూస్తూ నిలబడిన ఆగంతకులు ముగ్గురు కనిపించారు.

“ఎంతసేపు నీళ్ళల్లో నిలబడతావ్? బయటికిరా” ఉన్నట్లుండి ఒక అడుగు ముందుకువేస్తూ అన్నాడు వారిలో ఒకతను.

ఏదో తెలీని భయం, ఖంగారు ఒక్కసారిగా శ్యామ్ దాదాని ఆవరించుకున్నాయి. ముందుకు అడుగు వేసినట్టేసి ఎగిరి వెనక్కి పల్టీకొట్టడతను. రెండు అడుగుల లోతుకుపోయి, బలంగా బారలువేస్తూ ఒడ్డుకు దూరంగా వెళ్ళిపోవడానికి ట్రైచేశాడు.

“వాడు తప్పించుకుంటున్నాడు.... అవతలి ఒడ్డుకు ఈదుతున్నాడు” ఖంగారుగా అన్నాడు ముందుకు అడుగేసిన మనిషి.

“అవతలి ఒడ్డుకు ఈదుకుంటూ పోవటం అంటే చెరువు మధ్యలోకి పోవాలి. చెరువు మధ్యలో సుడిగుండం వుంది. మునిగి చచ్చిపోతాడు...” అంటూ అతనికి చెప్పి బారలు వేస్తున్న శ్యామ్ దాదాకి వినిపించేలా బిగ్గరగా అరిచాడు ఇంకో మనిషి.

“చచ్చిపోతావ్. వెనక్కి వచ్చేయ్” అంటూ చప్పట్లు కూడా చరిచాడతను. తనను పట్టుకోవటం చేతకాక వాళ్ళు అలా అరిచి కేకలు పెడుతున్నారనుకున్నాడు శ్యామ్ దాదా.

అలా అనుకోగానే అతని ఉత్సాహం అధికమైంది. మరింతబలంగా చేతులు కదిలించాడు. ఒకటినుంచి నలభై అంకెలు లెక్కబెట్టేలోపు చెరువు మధ్య భాగంలోకి చేరుకున్నాడు. మరో రెండు నిముషాల్లో అవతలి ఒడ్డును చేరుకోవచ్చని అనుకుంటూ వుండగానే, అతని చుట్టూ నిశ్చలంగా వుండాల్సిన

నీళ్ళు ఒక్కసారిగా అల్లకల్లోలం అయిన సెన్సేషన్ కలిగింది. ఒక్కసారిగా అదిరిపడి అటూ ఇటూ చూడటం మొదలుపెడుతూ వుండగానే, అతన్ని తనలో ఇముడ్చుకున్నది బలమైన సుడిగుండం ఒకటి.

కళ్ళు గిర్రున తిరుగుతున్న అనుభూతి కలిగింది అతనికి. కంటికి కన్పించని చేతులు ఏవో తన నడుమును పట్టుకుని నీటి అడుగు భాగంలోకి లాగేస్తున్నట్టుగా కూడా అన్పించి, "రక్షించండి... కాపాడండి..." అని అరిచాడు. అరుపు అతని పెదవుల్ని దాటడం, అతని శరీరం ఒక్కసారిగా నీటి అడుగు భాగానికెళ్ళిపోవటం ఒకేసారి జరిగింది.

"అయిపోయాడు... చస్తావురోయ్ అని అంత అరిచినా వినిపించుకోకుండా ముందుకు పోయినందుకు తగిన శాస్తి జరిగింది" ఒడ్డున నిలబడి ఆ దృశ్యాన్ని చూస్తున్న అగంతకులలో ఒకతను కామెంట్ చేశాడు.

"వాడు పోతేపోయేడు... వాడితోపాటు ఇంకోడు వచ్చినట్లు మాటలు వినపడ్డాయి. ఆ రెండోవాడు ఏమైపోయాడో చూడండి" కామెంట్ చేశాడు ఇంకో మనిషి.

"నీ టార్చిలైటు వెలిగించు... నా లైటులో బ్యాటరీలు అయిపోయినట్టున్నాయి" అన్నాడు మూడో మనిషి. తన దగ్గర వున్న టార్చిని వెలిగించి చెరువు ఒడ్డున వున్న పొదలకేసి ఫోకస్ చేశాడు మొదటిమనిషి.

చెరువు మధ్యలో శ్యామ్ దాదా మునిగిపోయిన ప్రదేశంవైపు చూస్తున్నాడు పొదలచాటున తలదాచుకున్న శివయ్య. తొందరపడకపోతే తన ఉనికి

బట్టబయలు కావటం డెఫినెట్ అని అర్థమైంది అతనికి. గోల చేయవద్దని ఎంత హెచ్చరించినా వినకుండా రప్చర్ సృష్టించి ప్రాణాల మీదికి తెచ్చుకోవడమే కాకుండా, తన పీకలమీదికి కూడ తీసుకువచ్చిన శ్యామ్ దాదాను మనసులోనే కసితీరా తిట్టుకుంటూ, అంగుళం అంగుళం చొప్పున వెనక్కి జరిగాడు అతను.

'ఆళ్ళు తప్పకుండా ఇక్కడ మకాంవేసిన సాతూర్ బ్యాంక్ దొంగలే అయివుంటారు. ఆళ్ళ రాకను ముందుగానే గమనించి పొదల చాటున దాక్కోవటం నిజంగా అదృష్టం.....' అని కూడా తనలో తను అనుకుంటూ ఇంకా ఇంకా వెనక్కి వెళ్ళిపోయాడు అతను.

"వెతకండిరా.... ఒళ్ళు దగ్గరపెట్టుకుని వెతకండి. అడవిలో మకాం పెడితే మన గురించి ఎవరికీ తెలియదని అనుకున్నాం... మన గురించి తెలియని వాడు ఎవడూ లేడని అనిపిస్తోంది. గట్టిగా వెతకండి" గాలివాలున వినవస్తున్న మాటల్ని విని ఖంగారుపడకుండా వుండటానికి ప్రయత్నం చేస్తూ వందగజాల దూరం మోచేతుల మీద పాములా పాకుతూ వెళ్ళాడతను.

దట్టంగావున్న ఒక పొదను దాటి అవతరికి పోగానే పైకిలేచి, వింటినుంచి వెలువడిన బాణంలా పరుగు మొదలుపెట్టాడు. ఎంత దూరం పరిగెత్తాడో అతనికే తెలియదు. ఎంతసేపు పరిగెత్తాడో అర్థంకాలేదు. తూర్పుదిక్కు తెల్లబడబోతున్న ఛాయలు కనిపించే సమయంలో చెట్ల కొమ్మల మీది పక్షులు, పిట్టలు కిలకిలరావాలు చేయటం మొదలుపెట్టాయి. ఆయాసం అధికం అవటంతో ఒక విశాలమైన ఖాళీస్థలంలోకి ఎంటరై ఎటు పోవాలో తెలియక చుట్టూ చూశాడతను.

వంకరటింకర కొమ్మలతో ఎత్తుగా ఎదిగివున్న ఒక కుంకుడు చెట్టు కనిపించింది అతనికి ఆ ఖాళీస్థలం భాగంలో. ఎత్తుగా కట్టబడి వున్న వేదిక వంటి గట్టుమీద నిలువుగా వుంది ఒక శక్తి విగ్రహం. దాని ఎదుట కూర్చుని వున్నాడు మధ్యవయస్కుడు ఒకతను.

"ఎవరు నువ్వు?" అని అడిగాడు అతన్ని.

"రాఘవాపురం రైలుస్టేషన దగ్గర్నించి వస్తున్నాను. దారిలో ఎలుగుబంటి ఒకటి వెంటపడింది. తప్పించుకుని వచ్చేసరికి చచ్చినంత పనైంది. నారాయణపురం పోవాలి. దారి తప్పినట్టు అనుమానంగా వుంది" చుట్టూ పరిశీలనగా చూస్తూ నెమ్మదిగా చెప్పాడు.

"వెలుగు పూర్తిగా వచ్చాక దారి నేను చూపిస్తాను. అంతవరకూ విశ్రాంతి తీసుకో... వెళ్ళు" అంటూ విగ్రహం దగ్గరే నిలబడిన వెంకటమ్మకు సైగచేశాడు మధ్య వయస్కుడు. చాప చూపించు. కప్పుకోవటానికి దుప్పటి ఇవ్వు. కాస్సేపు పడుకుంటాడు అని చెప్పాడు.

విగ్రహం వెనుక భాగంలో వున్న కుంకుడు చెట్టు వెనకాల అడవి ఆకులతో, కొమ్మలతో పెద్ద పందిరి ఒకటి వేసివుంది. ఆ పందిరిలో వున్న చాపమీద హాయిగా నిద్రపోతున్నాడు ఇంకో మనిషి. అతని పక్కన చోటు చూపించింది వెంకటమ్మ. అవతలగా పడేసివున్న దుప్పటిని తీసి గట్టిగా దులిపి చేతికిచ్చింది. ఒంటిని ఆవరించుకుని వున్న అలసటవల్ల ఏమీ మాట్లాడలేదు శివయ్య. చాపమీద పడుకుని దుప్పటి కప్పుకున్నాడు. పదే పది క్షణాల్లో గాఢమైన నిద్రలోకి జారుకున్నాడు.

***

"అదిగో.... అదే.... అదే ఆచారిగారి ఇల్లు..." గ్రామంలోకి అడుగుపెట్టిన ఆరో నిముషంలో పాండుకు చెప్పాడు రవిబాబు, ఒక ఇంటి దిశగా చూపిస్తూ.

నేరేడు చెట్టుకింద తెల్లవారేవరకూ వెయిట్ చేయాలని అనుకోవటం అయితే అనుకున్నారుగాని, అనుకున్నట్లు విశ్రాంతి తీసుకోవటం చేతకాలేదు వారికి.

రకరకాల పురుగులు, చీమలు, చిన్న చిన్న పాములు తమచుట్టూ రౌండ్స్ కొట్టటం మొదలుపెట్టేసరికి సహనాన్ని కోల్పోయాడు పాండు. "లాభంలేదు బాబూ! ఇక్కడ కూర్చోవటం కంటె, ఆ శ్యామ్ దాదా గాడికి ఎదురుపడి అటో ఇటో తేల్చేసుకోవటమే బాగుంటుంది" విసుగునిండిన కంఠంతో చెప్పాడు ఒక గంట గడిచాక.

"నువ్వు ఏమైన అనుకుంటావేమోనని ఇంతవరకూ మాట్లాడకుండా వూరుకున్నాను. అసలు ఇక్కడవుండటం నాకూ ఇష్టంలేదు. నెమ్మదిగా నడవటం స్టార్ట్ చేద్దాం. తెల్లవారేసరికి మా ఊరికి వెళ్ళిపోవచ్చు." అంటూ అతని సాయంతో పైకిలేచి లెఫ్ట్ రైట్ మొదలుపెట్టాడు రవిబాబు.

అతను చెప్పినట్టుగానే వేములపల్లికి చేరుకునేసరికి తూర్పుదిక్కున తొలివెలుగులు ప్రత్యక్షం అవటం వారిద్దరికీ అగుపించింది. భుజానికి తగిలిన దెబ్బను చూస్తే తన తండ్రి ఖంగారుపడతాడని అనిపించి, ఊళ్ళోకి వచ్చిన వెంటనే ఆచారిగారి ఇంటిని పాండుకు చూపించాడు రవిబాబు. అతను చెబుతున్న

ఆచారిగారు ఎవరో తెలియకపోయినా, గబగబా ముందుకు పోయి మూసివున్న తలుపుల్ని టకటకమనిపించాడు పాండు.

నిద్రలేచి అప్పటికి చాలాసేపయింది కాబోలు, చాలా ఎలర్ట్ గా వున్నాడు ఆచారిగారు.

"ఎవరూ? ఎవరు తలుపుల్ని బాదుతోంది? పేరుపెట్టి పిలిస్తే పలకనని అనుమానం వచ్చిందా? ఎందుకలా శబ్దం చేయటం?" చిరాకుగా అంటూ తలుపుల్ని తెరిచాడాయన. పాండును చూసి ప్రశ్నార్థకంగా నొసలు ఎగరవేయబోయాడు. అంతలోనే అతని వెనక వున్న రవిబాబును గమనించి అదిరిపడ్డాడు.

"అయ్యబాబోయ్... రవిబాబూ... మీరా? ఎటూకాని వేళ ఇలా అర్ధంతరంగా అని అడగబోతూ, దెబ్బతిన్న అతని భుజాన్ని చూసి ఆ మాటల్ని తనలోనే అదుముకున్నాడు. వేడినీళ్ళు రెడీచేయమని లోపల వున్న తన భార్యకు ఆర్డర్ ఇచ్చి, రండి బాబూ... లోపలికి వచ్చేయండి. ఇది పరాయిచోటు కాదు. మీ ఇల్లే... మా తాతగారికి మీ తాతగారు ఈనాముగా ఇచ్చిన ఇల్లు... మీదే..." అంటూ తలుపుల్ని తెరిచి లోపలికి ఆహ్వానించాడు.

"మందులకంటె ముందుగా మాకు చక్కటి కాఫీ కావాలి. అడవిలో పడి అలో లక్ష్మణ అనుకుంటూ వచ్చాం...." అంటూ ఓ కుర్చీలో చేరగిలపడ్డాడు రవి. ఖాళీగా వున్న ఇంకో కుర్చీకేసి చేయి చూపాడు. "కాఫీ కావాలి... రవిబాబుకి కాఫీపెట్టు త్వరగా...." నిలుచున్న చోటు నుంచి కదలకుండా ఇంకోకేక పట్టాడు ఆచారిగారు.

"కాఫీ రెండు నిముషాల్లో రెడీ అవుతుంది. ముందు మీ భుజాన్ని చూడనీయండి" అంటూ రవిబాబు షర్టును తొలగించి గాయాన్ని పరిశీలనగా చూశాడు.

"తగిలి చాలాసేపయింది. మొదట్లో అంతగా నెప్పి అనిపించలేదు గాని, తగిలిన ఒక గంట తరువాత సలుపు అధికం అయింది. తట్టుకోవటం కొంచెం కష్టంగానే వున్నది...." అతనితోపాటు తను కూడా భుజం వంక చూసుకుంటూ చప్పాడు రవిబాబు.

"కండకే తగిలింది బాబూ... ఎముక బాగానే వుంది. అడవిలో తగిలిందని అంటున్నారుగదా.... చలిగాలి మూలకంగా సలపరింత మొదలై వుంటుంది. శుభ్రంచేసి కట్టుకడతాను. రెండురోజుల్లో సర్దుకుంటుంది" అంటూ ఈసారి తనే స్వయంగా లోపలికిపోయి, ఒక పాత్రనిండుగా వేడి నీళ్ళని తీసుకువచ్చాడు.

"మీతోపాటు వచ్చాడు.... మీ స్నేహితుడా ఇతను?" రవిబాబు చూపించిన కుర్చీలో కూర్చున్న పాండు వైపు ఓరగా చూస్తూ అడిగాడు ఆచారిగారు.

"వట్టి స్నేహితుడు కాదు... నా ప్రాణాలు కాపాడిన స్నేహితుడు.... ఇతనే గనుక ఆదుకోకపోయినట్టయితే అడవి జంతువులకు ఆహారమైపోయి వుండటమో, ఆ శ్యామ్ దాదాగాడి చేతిలో హతమారిపోయి వుండటమో, జరిగేది..." అన్నాడు రవిబాబు.

ఆచారిగారు కట్టుకట్టడం పూర్తిచేసే సమయానికి సెగలు వెలువరుస్తున్న కాఫీ కప్పుల్ని తీసుకుని ఆ గదిలోకి వచ్చిందాయన భార్య. రవిబాబును చనువుగా

పలకరించి కాఫీ కప్పుల్ని అతనికి, పాండుకి అందించింది. కాఫీ రుచిని మెచ్చుకున్నాడు రవిబాబు. రెండు నిముషాలపాటు కూర్చుని కుర్చీలో నుంచి లేచాడు.

“నేను సాయంత్రం వచ్చి ఇంకోసారి కట్టుకడతాను. అంతవరకూ దాని జోలికి పోబోకండి. నెప్పి ఎక్కువ అయితే ఈ చూర్ణం పాలల్లో కలిపి పుచ్చుకోండి” అంటూ తన మందుల పెట్టెలో నుంచి ఏదో పొడిని పొట్లంకట్టి రవిబాబుకి ఇచ్చాడు ఆచారిగారు.

ఆ పొట్లాన్ని ప్యాంటు జేబులోకి నెట్టుకుంటూ వీధిలోకి వచ్చాడు రవిబాబు. అప్పటికి వెలుగు బాగా వచ్చేసింది. వీధిలో జనసంచారం స్టార్ట్ అయింది.

ఎదురయిన ప్రతిమనిషి రవిబాబుకి నమస్కారం చేస్తూ వుండటాన్ని కొంచెం విచిత్రంగానే గమనిస్తూ, అతనితోపాటు దొరగారి దివాణం ఎదుటికి పోయాడు పాండు.

“బాబుగారూ... రవిబాబు వచ్చేశాడు. మన రవిబాబు పట్నం నుంచి వచ్చేశాడు” అని బిగ్గరగా కేకలు పెడుతూ లోపలికి పరిగెత్తిన ఒక పనిమనిషిని చూపిస్తూ “మాకు వంటా వార్పూ చేసిపెట్టే చిలకమ్మ... నోరు చాలా పెద్దదేగాని, రంగమ్మ మాదిరిగా పవర్‌ఫుల్ కాదు” చెప్పాడు రవిబాబు.

సిటీలో నుంచి బయలుదేరిన తరువాత మొదటిసారిగా రంగమ్మ గుర్తుకు వచ్చేసరికి అదోలా అయిపోయాడు పాండు.

"ఉత్తుత్తి నోరే బాబూ రంగమ్మది... మనసు వెన్నపూస. వట్టి పిచ్చిమాలోకం" అంటూ రవిబాబు వెనకాలే దివాణం బిల్డింగ్ లోకి ఎంటరయ్యాడు.

చిలకమ్మ అరిచిన అరుపుకి హాల్లోకి వచ్చేసి సోఫాలో కూర్చుంటున్నాడు రవిబాబు ఫాదర్. అతని భుజానికి వున్న కట్టును చూసిన వెంటనే విపరీతమయిన ఆందోళన ప్రతిఫలించింది కనుల్లో.

"పట్టించుకోవాల్సినంత పెద్ద దెబ్బ కాదు నాన్నగారూ. దీన్ని గురించి నేను తర్వాత చెబుతాను. దీనికంటె ముందుగా మీతో ఇంకో విషయం చెప్పాలి" అంటూ ఆయన పక్కనే కూర్చున్నాడు రవిబాబు.

"నీ స్నేహితుడా ఇతను? కూర్చో" అంటూ పాండుకు కూడా తన పక్కన చోటు చూపించాడాయన.

తనతోపాటు చదువుకుంటున్న అపూర్వని గురించి అప్పటికప్పుడు ఒక్కముక్కను కూడా దాచి పెట్టకుండా పూర్తిగా చెప్పేశాడు రవిబాబు. ఆమె తండ్రితో మాట్లాడటానికి నారాయణపురం వెళ్ళి తను ఏవిధంగా అవమానం పొందిందీ సవివరంగా వివరించాడు.

"అపూర్వని నేను మనస్ఫూర్తిగా ప్రేమించాను నాన్నగారూ... ఇప్పుడు నన్ను ఏం చేయమంటారో చెప్పండి" అని కూడా అన్నాడు. అతని మాటల్ని ఆసాంతం విన్న దొరగారు నారాయణపురం రత్నంగారి మీద కారాలు మిరియాలు నూరతాడని, తన అనుచరులందరినీ పిలిచి అప్పటికప్పుడు

యుద్ధానికి సిద్ధంచేసే లెవెల్లో ఆజ్ఞలు జారీ చేస్తాదని, ఊపిరి బిగపట్టి ఎదురుచూసిన పాండుకి వెంటనే తగిలింది చిన్న షాక్.

పెదవులు విప్పి ఒక్కమాటైనా మాట్లాడలేదాయన. తల పక్కకు తిప్పుకుని కనుకొలకుల్లో ప్రత్యక్షమయిన కన్నీటి బిందువుల్ని ఉత్తరీయం అంచుతో అద్దుకున్నాడు.

"నాన్నగారూ... ఏమైంది? ఎందుకు ఆ కన్నీరు...." ఆశ్చర్యం, ఆందోళన కలగలిసిన కంఠంతో అడుగుతూ ఆయన భుజం పట్టుకున్నాడు రవిబాబు.

"నువ్వు పెరిగి పెద్దవాడివయ్యాక ఏదో ఒకరోజు ఇటువంటి సంభాషణ వచ్చి తీరుతుందని తెలుసు. ఎంత తెలిసినా నా గుండెల్లోని బాధను అణుచుకోవటం చేతకాలేదు...." అంటూ సోఫాలోనుంచి లేచాడాయన.

"స్నానంచేసి టిఫిన్ తిన్న తరువాత నా గదిలోకిరా... నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి...." అంటూ తన గదివైపు బయలుదేరాడు దొరగారు.

"నేను చెప్పినదానికి మీరు సమాధానమివ్వలేదు. అపూర్వని నారాయణపురం నుంచి తీసుకువచ్చేస్తే ఎలా వుంటుంది?" తనూ సోఫాలోంచి లేస్తూ అడిగాడు రవిబాబు.

"ఆ మాటలు ఇప్పుడు కాదు. నేను చెప్పింది విన్న తర్వాత ఏం చేయాలో నీకే అర్థం అవుతుంది. ముందు మీ స్నానసంధ్యల్ని పూర్తిచేసుకోండి. వెళ్ళండి" అని రవిబాబుకి చెప్పి, అతని సమాధానం కోసం ఎదురు చూడకుండా వెళ్ళిపోయాడు దొరగారు.

“అరిచి కేకలు పెట్టకపోయినా, తనకు నచ్చకపోతే నిర్మొహమాటంగా నచ్చలేదని చెప్పేవారు. నచ్చితే నచ్చిందని వెంటనే ఒప్పుకునేవారు. అదీలేదు, ఇదీలేదు.... నాకేమీ అర్థం కావటంలేదు....” ఆయన గదివైపే సాలోచనగా చూస్తూ అన్నాడు రవిబాబు.

“కాస్సేపాగి ఆయనతో మాట్లాడితే అన్ని విషయాలు మీకే అర్థం అవుతాయని అన్నారుగదా.... తొందరదేనికి?” సానుభూతి సూచకంగా తలూపుతూ చెప్పాడు పాండు.

“అది నిజమేననుకో... కాని” ఇంకా ఏదో అసంతృప్తి ఫీల్ అవుతున్నట్టు తల విదిలిస్తూ “కమాన్ పాండు... నా గదికి వెళదాం.... కమాన్” అని పాండు చేయి పట్టుకున్నాడు రవిబాబు.

రాజభవనంలాంటి ఆ ఇంటి అందాలను చూసి మెచ్చుకోలుగా తల ఊపుతూ అతన్ని అనుసరించాడు పాండు. విశాలమైన రవిబాబు గదిని చూసి ఆశ్చర్యంగా విజిల్ వేశాడు.

“సినిమా సెట్టింగ్ మాదిరిగా వుందికదూ? పాతకాలపు గది. ఫర్నిచర్ కూడా పాతదే.... రెండు మూడొందల సంవత్సరాల నాటిది...” చిన్నగా నవ్వుతూ చెప్పి, ఒక అలమరులో నుంచి అగరుధూపపు వాసనల్ని వెదజల్లుతున్న టవల్స్‌ని బయటికి తీశాడు రవిబాబు.

“ముందు నేను స్నానం చేసి వస్తాను. తర్వాత నువ్వు చేద్దువుగాని. అంతవరకూ ఆ టేబిల్ మీద పుస్తకాలున్నాయి. బొమ్మలు చూస్తూ వుండు”

అంటూ ఒక పక్కగానున్న టేబిల్‌ని చూపించి, ఆ గదిని ఆనుకుని వున్న బాత్ రూమ్ లోకి వెళ్ళిపోయాడు. ప్యాంటు జేబులోవున్న బీడీని తీసి వెలిగించుకున్నాడు పాండు.

పావుగంట తర్వాత బాత్ రూమ్‌లో నుంచి బయటికొచ్చి, ఆశ్చర్యంగా రవిబాబు అతనివంక.

"అదేంటి పాండూ... టేబిల్ దగ్గర కూర్చోమని చెప్పానుకదా... కూర్చోవటం ఇష్టం లేకపోతే హాయిగా బెడ్ పై పడుకోవచ్చు" అంటూ బెడ్ మీద వున్న ఇంకో టవల్ ని అతనికి అందించాడు.

***

"పొద్దు పైకెక్కి చాలాసేపయింది. నిద్రలేచి ముఖం కడుక్కో. ఉప్మా చేశాను తిందువుగాని" అంటూ వెంకటమ్మ పిలిచేసరికి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ లేచాడు శివయ్య. లేచిన వెంటనే పక్కకు చూశాడు. అంతకుముందు అక్కడ పడుకుని వున్న మనిషి శుభ్రంగా స్నానంచేసి, మట్టిగట్టుమీద శక్తి విగ్రహం దగ్గర నిలబడి వుండటం కనిపించింది.

"మీరు ఎవరు? ఇక్కడ ఏం చేస్తున్నారు? ఆ దేవత పేరేంటి?" తను కప్పుకున్న దుప్పటిని మడతపెట్టి చాపమీద పెడుతూ వెంకటమ్మను అడిగాడు.

"నీ ప్రశ్నలన్నిటికీ సమాధానాలు మా గురువుగారు చెపుతారు. ముందు ముఖం కడుక్కో...." అంటూ కాస్తంత దూరంలో వున్న ఒక నీటిగుంటను అతనికి చూపించింది వెంకటమ్మ. పొదల మధ్య నుంచి పరిగెత్తుకుంటూ రావటంవల్ల

ముళ్ళు తగిలి కత్తిపెట్టి గీరినట్లు చీరుకుపోయాయి అతని చేతులు. అడవిలోని చలిగాలికి అవి చిమచిమలాడటం మొదలుపెట్టాయి.

"గురువుగారు నీతో మాట్లాడాలంట. త్వరగా రా..." రెండు నిముషాల తర్వాత అతన్ని పిలిచింది వెంకటమ్మ. ముఖ మార్జనాన్ని త్వరగా ముగించుకుని, కాళ్ళు చేతుల్ని శుభ్రం చేసుకుని భుజంమీది తుండు గుడ్డతో తుడుచుకుంటూ వెనక్కి వచ్చాడు శివయ్య.

"తిను... త్వరగా తిను..." అంటూ అడవి ఆకులతో కుట్టిన విస్తరిలో అతనికి ఉప్మా వడ్డించిందామె.

వడ్డించిన వెంటనే అందుకు వుపయోగించిన గరిటెను, ఖాళీ అయిన గిన్నెను దూరంగా తీసుకుపోయి ఒకటికి రెండుసార్లు శుభ్రంగా కడిగింది ఆమె.

అప్పటికప్పుడు ఆ పని చేయటం ఎందుకో శివయ్యకు అర్థం కాలేదు. ఆకలిమీద వుండటంవల్ల ఆ విషయాన్ని గురించి ఏమంత గట్టిగా ఆలోచించలేదతను. ఆవురావురుమంటూ ఉప్మాతిని, మట్టిముంతలో పెట్టిన మంచినీళ్ళు తాగాడు. ముంతని కింద పెట్టిపెట్టగానే వెంకటమ్మ వచ్చి, ఆ ముంతని తీసి దూరంగా విసిరింది. గింగిరాలు తిరుగుతూ పోయి ఫట్ మని కిందపడింది అది. చూస్తూ వుండగానే ముక్కలు ముక్కలైపోయింది.

ఆ దృశ్యం శివయ్యని కొంచెం ఖంగారుపెట్టింది. అయినా సరే బింకంగానే అడుగులు వేసి శక్తి విగ్రహం దగ్గరికి పోయాడతను. "ఆయాసంతో తెలివి తప్పబోతున్న సమయంలో ఆదరించి పడుకునేచోటు చూపించారు. మీకు ఎంతో

ఋణపడిపోయాను. ఇక సెలవిప్పిస్తే వెళ్ళొస్తాను" నమస్కారం చేస్తూ మధ్యవయస్కుడికి చెప్పాడు.

"ఎక్కడికి వెళ్ళివస్తావు?" అడిగాడు మనిషి.

"ఇక్కడికి దగ్గర్లోనే వేములపల్లి గ్రామం వుంది. ఆ గ్రామంలో మాకు తెల్సినవాళ్ళు చాలామంది వున్నారు."

"వేములపల్లి గ్రామంలోని వాళ్ళు నీకు బాగా తెల్సన్నమాట.. ఐతే సరే... వెళ్ళు" అతని మనస్సులోని ఆలోచనలు అర్థం కాకపోవటం వల్ల, అమాయకంగా తన అంగీకారాన్ని తెలియచేశాడు మధ్య వయస్కుడు.

అతన్ని మభ్యపెట్టగలిగిన తన తెలివితేటలకు తనే మురుసుకుంటూ వెనక్కి తిరిగాడు శివయ్య.

పెద్ద పెద్ద అడుగులు పది మాత్రమే వేశాడతను... పదకొండో అడుగు వేయకముందే గిర్రున తిరిగాయి కళ్ళు. మెడపైన చేయి వేసి ఎవరో బలంగా ముందుకు నెట్టినట్టు బోర్లా పడిపోయాడు.

"అయ్యయ్యో పడిపోయాడు.. గురువుగారూ అతను పడిపోయాడు..." ఆందోళన నిండిన కంఠంతో అంటూ ముందుకు అడుగు వేయబోయిన గోపాలాన్ని కనుసైగతో కదలకుండా నిలబెట్టేసింది వెంకటమ్మ.

కూర్చున్న చోటి నుంచి లేచి శివయ్య దగ్గరికి బయలుదేరాడు గురువుగారు. "మన గుట్టు రట్టు అవుతుందన్న భయంతో అతను తిన్న ఉప్మాలో మత్తుమందు కలిపించారు. దాని దెబ్బకు తల్లకిందులైపోయాడు. నువ్వు

అనవసరంగా ఖంగారుపడబోకు'' గురువుగారికి వినిపించకుండా లోగొంతుకతో గోపాలానికి చెప్పిందామె.

పడిపోయిన శివయ్య నాడిని కొద్దిగా పరిశీలించి తృప్తిగా తల ఊపాడు గురువుగారు. ''తీసుకుపోయి చాపమీద పడుకోబెట్టండి. కరాళ శక్తిలో కదలిక రాగానే బలి ఇచ్చేస్తే ఓ పనైపోతుంది. మన పని సుకరమవుతుంది'' అంటూ గోపాలానికి చెప్పాడు.

''గురువుగారూ... బాగా ఆలోచించండి.... వేములపల్లి గ్రామంలో తనకు తెలిసినవాళ్ళు చాలామంది వున్నట్లు చెప్పాడితను. ఆ వూళ్ళో వాళ్ళు సామాన్యులు కాదు.... వాళ్ళకి మనమీద ఏమైనా అనుమానం వచ్చిందంటే మనల్ని మంటల్లోకి నెట్టి చేతులు దులుపుకుంటారు'' చిన్న కంఠంతో చాలా నెమ్మదిగా అన్నాడు గోపాలం.

''అందుకే వీడిని బలివ్వాలని అంటున్నాను. ఇప్పుడు వీడుపోయి మన గురించి ఆ ఊళ్ళో టాంటాం చేస్తే ఏమౌతుందో ఆలోచించు'' అన్నాడు గురువుగారు.

''తీసుకురా... ఆ మనిషిని తీసుకువచ్చి చాపపై పడుకోబెట్టు... పిచ్చిముఖం వేసుకుని వెర్రిచూపులు చూడమాకు'' అసహనంగా అతన్ని హెచ్చరించిందామె.

శివయ్య భుజాల్ని పట్టుకుని కుంకుడు చెట్టు వెనుక భాగంలోకి తీసుకుపోయాడు.

“ఎప్పుడు ఏం చేయాలో గురువుగారికి బాగా తెలుసు. ఆయనమాటలకి అడ్డంచెబితే అన్యాయం అయిపోతాం. పాడుపడిన మేడ దగ్గరవున్న శక్తి తరంగాలని తప్పుదోవ పట్టించి, అందులో వున్న ఆడదయ్యాన్ని బయటికి రప్పించేందుకు ఒక ఉపాయం తోచిందని నిన్న సాయంత్రం నువ్వు కట్టెపుల్లలకోసం పొదల్లోకెళ్ళినప్పుడు చెప్పారు. అందుకు నరబలి అవసరమయ్యేటట్లుంది అని కూడా అన్నారు. ఆయన సంకల్ప బలం గొప్పది. నలబలి అని అనుకోగానే, నరుడు తనంతట తానే వెతుక్కుంటూ వచ్చేశాడు. నువ్వు అధికంగా మాట్లాడమాకు....” అతని చెవిదగ్గర నోరుపెట్టి గుసగుసలాడింది వెంకటమ్మ.

శివయ్యను చాపమీద పడుకోబెట్టి నడుమువరకూ దుప్పటికప్పి, చేతులు దులుపుకుంటూ తిరిగి గురువుగరి దగ్గరికొచ్చాడు గోపాలం. కరాళశక్తి అనుచరగణంలో పెద్దదైన బంధకిని ఆవాహన చేస్తున్నాను. నాకు నేనై పిలిచేటంతవరకూ నన్ను పలకరించవద్దు అని అతనికి చెప్పి తన పనిలో తాను నిమగ్నమైపోయాడు గురువుగారు.

***

మెట్లు ఎక్కటం తనవల్లకాదని ఎంత మొత్తుకున్నప్పటికీ వినకుండా, కాఫీ టిఫిన్లు పైకి తీసుకురమ్మని కేకలు పెట్టిన రవిబాబుమీద కారాలు మిరియాలు నూరుతూ మేడమీదికి వచ్చింది చిలకమ్మ.

గబగబా టిఫిన్ తిని నాలుగు గుటకల్లో కాఫీ కప్పును ఖాళీ చేశాడు రవిబాబు.

“నువ్వు రెస్ట్ తీసుకుంటూ వుండు. నేను నాన్నగారితో మాట్లాడి వస్తాను” అంటూ బయటికి పరిగెత్తాడు. పాండు కూడా కాఫీ కప్పును ఖాళీ చేసేదాకా ఆగి, ట్రేతోసహా తనూ వెళ్ళిపోయింది చిలకమ్మ.

బీడీని వెలిగించుకుని బెడ్ దగ్గరే నిలబడ్డాడు పాండు. ఉన్నట్లుండి అతని దృష్టి బెడ్ మీద వున్న తలగడ మీదికి ప్రసరించింది. వాటి కింది నించి తొంగి చూస్తున్న విచిత్రమైన ఆల్బమ్ కనిపించిందతనికి. వద్దువద్దనుకుంటూనే దాన్ని బయటికిలాగి అందులోని ఫోటోలను ఆశ్చర్యంగా గమనించటం మొదలుపెట్టాడు. నాలుగు నిముషాలు కూడా గడవకముందే ఎంత స్పీడ్‌గా బయటికి వెళ్ళాడో, అంతే స్పీడ్ గా తిరిగి వచ్చాడు రవిబాబు.

“మా వంశానికి సంబంధించిన వాళ్ళ ఫోటోలు అవి.... చూశావుగా... ఇక పద... నాన్నగారు నిన్ను కూడా రమ్మని పిలుస్తున్నారు” అంటూ అతని చేతిలోని ఆల్బమ్‌ని తీసుకుని తిరిగి తలగడ కిందికి నెట్టి అతన్ని తన తండ్రి గదిలోకి తీసుకుపోయాడు.

“కూర్చో బాబూ... నేను చెప్పే విషయాల్ని నువ్వు కూడా వినటం బాగుంటుంది” అంటూ తన బెడ్ దగ్గర వున్న కుర్చీని అతనికి చూపించాడు దొరగారు. కళ్ళు చెదిరే అలంకరణలతో నిండి వున్న ఆ గది అందాలను మనసులోనే మెచ్చుకుంటూ కూర్చున్నాడు పాండు.

“నాలుగు వందల సంవత్సరాల క్రితం సిరిపుర సంస్థానాన్ని పరిపాలించిన కీర్తిరాయుడు మా వంశానికి మూలపురుషుడు. అతనికి శక్తిరాయుడు అనే

తమ్ముడు, సుదంతి అనే చెల్లెలు వుండేవాళ్ళు'' అంటూ మాటలు మొదలుపెట్టాడు దొరగారు.

అంతకుముందే తను చూసిన ఆల్బమ్ లోని చిత్రాలను, ఫోటోల్ని తలుచుకుంటూ తలూపాడు పాండు. నెమ్మదినెమ్మదిగా దొరగారు చెప్పే మాటలన్నీ దృశ్యరూపం సంతరించుకుని తన కళ్ళ ఎదుట కదులుతున్నట్టు, ఆయన చెపుతున్న వాళ్ళందరూ తనకు కనిపిస్తున్నట్లు అనుభూతి కలగటం మొదలైంది.

***

ప్రత్యేకంగా పని కట్టుకుని సేకరించిన ఇప్పపూవుల నుంచి తయారుచేసిన మత్తుపానీయాన్ని పూటుగా సేవించి, మైకంతో మూసుకుపోతున్న కళ్ళను బలవంతంగా తెరిచి వుంచటానికి ప్రయత్నం చేస్తూ, ఎదుట నిలబడి వున్న అనుచరుల మీద విరుచుకుపడ్డాడు సిరిపుర సంస్థానానికి దివానుగా పనిచేస్తున్న భూపతి.

‘‘బళ్ళారి దగ్గర పదివేల ఎకరాల మాన్యం అమ్మకానికి వచ్చింది. రెండులక్షల వరహాలు మన దగ్గర వుంటే ఆ మాన్యాన్ని మనమే ఖరీదు చేయవచ్చు. ఈ కీర్తిరాయుడి దగ్గర కొలువు చాలించుకుని మనం కూడా సంస్థానాన్ని స్థాపించుకోవచ్చు... పన్నులు వసూలు చేసుకువచ్చే కావలి భటుల మీద దాడిచేసి వసూలైన సొత్తునంతా స్వాధీనం చేసుకుని రమ్మన్నాను..... మీరు చేసింది ఏమిటి?'' తూలిపడిపోయేటంత మత్తు మెదడును ఆవరించుకుని వున్నా, మాటల మాత్రం మహా కరుకుగా వెలువడ్డాయి అతని నోటి నుంచి.

"కుదరలేదు దొరా... అడవిదారిలో వారిని అడ్డుకుందామని ప్రయత్నం చేశాం. ఆఖరి క్షణంలో కీర్తిరాయులవారే వేటకు వెళుతూ అక్కడికి వచ్చేశారు..." వినయాతి వినయంగా చెప్పాడు ఒక అనుచరుడు.

"వస్తేమాత్రం ఏం చేస్తాడు? పనిలోపనిగా ఆయన్ని కూడా హతమార్చి అక్కడే ఎక్కడో పాతిపెట్టేసినట్లయితే పీడా విరగడ అయిపోయి వుండేది. అప్పుడు ఈ సంస్థానానికి మనమే ప్రభువులం అయిపోయి వుండేవాళ్ళం" కచ్చగా అన్నాడు భూపతి.

"వేసేద్దామనే అనుకున్నాం దొరా! కాని ఈరోజు ఉదయం మాకు ఒక మాట తెలిసింది. బైరాగులతో కలిసి హిమాలయాలకు వెళ్ళిన శక్తిరాయులవారు తిరిగి వస్తున్నారట. మంత్రాలు తంత్రాలు నేర్చిన ఆయనకు మా గురించి తెలిస్తే ప్రమాదమని ఆగిపోయాం..." నెమ్మదిగా చెప్పాడు ఇంకో అనుచరుడు.

"ఏమిటీ? శక్తిరాయుడు వస్తున్నాడా? ఎవరు? ఎవరు చెప్పారు మీకు?" అదిరిపడినట్టు ఆసనం మీది నించి లేస్తూ అడిగాడు భూపతి.

"సంస్థానంలో అందరికీ తెల్సిన ఈ మాట మీకు తెలియకపోవడమేమిటి దొరా? ఎవరినోట విన్నా ఇదేమాట...." ఆశ్చర్యంగా అన్నాడు మొదటి అనుచరుడు.

బళ్ళారి దగ్గర మాన్యాన్ని స్వంతం చేసుకోవాలన్న తపనతో, గత మూడురోజుల నుంచీ ఇప్పపూల పానీయాన్ని పుచ్చుకుంటూ, తన మందిరంలో

నుంచి బయటికి పోకపోవడంవల్ల తనకు ఆ విషయం తెలియలేదనే సంగతిని వారికి చెప్పలేదు భూపతి.

"అదేమిటో నేను సరిగ్గా తెలుసుకుంటాను. ప్రస్తుతానికి మీరు వెళ్ళిపోండి..." అంటూ తన దగ్గర వున్న ఒక కాసుల సంచీని వారి మీదికి విసిరాడతను.

వంగి వంగి నమస్కారాలు చేస్తూ వెనుతిరిగి వెళ్ళిపోయారు ఆ అనుచరులు అందరూ.

పానీయపు మత్తు పోయేవరకూ స్నానాలగదిలో చన్నీటితో ముఖం కడుగుకుని, అర్ధఘడియలో మందిరంలో నుంచి బయటికి వచ్చాడు భూపతి. తన సేవకులు సిద్ధం చేసిన పల్లకీలో కీర్తిరాయులవారి భవంతి దగ్గరికి పోయాడు.

పచ్చపచ్చటి మామిడాకు తోరణాలతో, కనులపండువు చేసే పూల మాలలతో భూలోకస్వర్గంలా అలంకరించబడి వున్నది ఆ భవంతి.

అపురూప సౌందర్యఖని అయిన తన గారాబు చెల్లెలు సుదంతితో సహా ఎంతోమంది అనుచరులు గుమికూడి వుండగా, తమ్ముడి రాకకోసం ఎదురు చూస్తూ కనిపించాడు అతనికి కీర్తిరాయుడు.

"రండి భూపతిగారూ... మిమ్మల్ని చూసి మూడుదినాలు అయింది. మాకు మీ దర్శనభాగ్యమే కరువయింది ఈ మధ్యకాలంలో...." భూపతిని చూడగానే వ్యంగ్యం మాళవించిన కంఠంతో వెక్కిరించాడు కీర్తిరాయుడు.

నోరు తెరిచి ఏదయినా అంటే ఆ వెక్కిరింపులు కాస్తా బెదిరింపుల కింద మారిపోతాయన్న అనుమానంతో మౌనంగా వుండిపోయాడు భూపతి.

“కాస్తంత నలతగా వుండటంవల్ల కదిలి రాలేకపోయాను ప్రభూ! విశ్రాంతి తీసుకోవాల్సిందిగా సూచించారు వైద్యులు. అందువల్ల పడకమీది నుంచి కాలు కింద పెట్టనేలేదు...” పది నిముషాల తరువాత చిన్నగా ఒక కారణాన్ని ఆయనకు విన్నవించుకున్నాడు. ఆ మాటలకు కీర్తిరాయుడు తల ఊపకముందే భవంతి ఎదుట గుమిగూడి, వున్న జనంలో నుంచి పెద్దపెట్టున జయజయధ్వానాలు చెలరేగాయి.

“వస్తున్నారు... శక్తిరాయులవారు వచ్చేస్తున్నారు...” అంటూ రెండుగా చీలి దారిని ఇచ్చారు వారందరూ.

కాషాయ వస్త్రాలను కట్టుకుని, తన పొడుగాటి గడ్డాన్ని ఎడమ చేతితో దువ్వుకుంటూ, ముఖం మీదికి వాలుతున్న కేశాలను వెనక్కి నెట్టుకుంటూ అక్కడ వున్నవారందరికీ కనిపించాడు శక్తిరాయుడు.

హిమాలయ పర్వతాలలో అఖండమైన తపస్సుచేసి, మామూలు మనుషులెవరూ తేరిపార చూడలేనివిధంగా ధగధగ మెరిసిపోతూ వస్తాడని అనుకున్న ఆ మనిషి... సామాన్యమైన బైరాగి మాదిరిగానే పాదాలకు కనీసం పావుకోళ్ళు కూడా లేకుండా ఒంటరిగా నడిచి వస్తుండటాన్ని చూసి తనలో తాను నవ్వుకున్నాడు భూపతి.

ఎదురు వచ్చిన అన్నగారి పాదాలకు నమస్కరించాడు శక్తిరాయుడు. సోదరిని తల నిమిరి ముద్దుచేశాడు.

“నీకోసం మన అద్దాలమేడ సిద్ధంగా వుంది. బడలిక తీరేదాకా విశ్రాంతి తీసుకో. భోజనాల సమయంలో మాట్లాడుకుందాం” అంటూ తన భవంతి పక్కనేవున్న ఒక అద్దాలమేడను అతనికి చూపించాడు కీర్తిరాయుడు.

అటుకేసి చూసి తల అడ్డం తిప్పాడు శక్తిరాయుడు.

“విశ్రాంతి తీసుకోవటం మాట తర్వాత. ముందుగా మీకు ఒక విషయం చెప్పాలి. లోపలికి పదండి..” అంటూ అన్నగారిని భవంతిలోకి తీసుకుపోయాడు.

చుట్టు వున్న ఆశ్రితులతోపాటు తనుకూడా అన్నతమ్ముళ్ళను అనుసరించి భవంతి లోపలకు పోవటానికి ప్రయత్నం చేశాడు భూపతి.

అభ్యంతన మందిరాల దగ్గరికి పోయేవరకూ ఆగి, ఆ తరువాత అందరినీ వెనక్కి వెళ్ళిపొమ్మని సైగచేశాడు శక్తిరాయుడు.

“మాకు ఏకాంతం అవసరం. మీరు ఇక సెలవు తీసుకోండి....” అంటూ సున్నితమయిన మాటలతో తన సైగలకు అర్థాన్ని కూడా చెప్పాడు.

అతను చెప్పబోయే విషయాలను వినటానికి ఎంతగానో కుతూహలపడుతున్న ఆశ్రితులకు నిరాశ కలిగింది. చేసేదిలేక ఒకరి తరువాత ఒకరుగా వెనుతిరిగారు అందరూ.

వారితోపాటు తనుకూడా పది అడుగులు వెనక్కి వేసినట్లే వేసి, చిటుక్కున ఒక పట్టుపరదా చాటుకు జరిగాడు భూపతి. అభ్యంతర మందిరాలను కాపుకాసే

భటులకు కనిపించకుండా జాగ్రత్తపడుతూ నెమ్మదిగా ఒక గవాక్షం దగ్గరికి చేరుకున్నాడు.

అన్నగారిని, సోదరిని ఆసనాల్లో కూర్చోబెట్టి, “తల్లీ... దాహంగా వుంది. త్వరగా వచ్చి మా దాహం తీర్చు...” అని అంటున్నాడు శక్తిరాయుడు.

ద్వారం దగ్గర నిలబడివున్న వృద్ధ పరిచారికెవరికో ఆ విధంగా ఆజ్ఞలు ఇస్తున్నాడని అనుకున్న భూపతి కళ్ళు చెదిరిపోయాయి ఒక్కసారిగా.

శక్తిరాయుడి నోటివెంట ఆజ్ఞ వెలువడిన మరుక్షణం కనులు మిరుమిట్లు గొలిపే వెలుగు ప్రత్యక్షం అయింది ఆ మందిరంలో. ఆ వెలుగు మధ్యలో నుంచి ఈవతలికి వచ్చింది ఒక సుందర స్వరూపం.

బంగారు పళ్ళెరంలో అమృత సమానమయిన ఏదో పానీయాన్ని సృష్టించి వారందరికీ అందించింది.

“మా అన్నగారితోను, సోదరితోను కలిసి భోజనం చేసి చాలా కాలమైంది. భోజనానికి ఏర్పాటు చేయమ్మా....” పానీయాన్ని పుచ్చుకుంటూ అన్నాడు శక్తిరాయుడు.

గవాక్షం దగ్గరవున్న భూపతి చూస్తుండగానే చేతులుతిప్పి, రుచికరమైన ఆహారాన్ని సృష్టించిందా దివ్యస్వరూపం... తనే స్వయంగా వారికి వడ్డన చేసింది.

“హిమాలయాల్లో నేను ఎన్నో సంవత్సరాలు తపస్సు చేసి సంపాదించిన అద్భుతశక్తి ఇది! మన సంస్థానాన్ని కనిపెట్టుకుని వుంటుంది. అనుదినం ఈ శక్తిని భక్తిశ్రద్ధలతో పూజించాలి. ఎట్టి పరిస్థితిలోనూ అవమానం కలిగే విధంగా

ప్రవర్తించకూడదు. ఈ శక్తి మన దగ్గర వున్నంతవరకూ మన వంశం మూడుపువ్వులు ఆరుకాయలుగా వృద్ధి పొందుతుంది. ఈతి బాధలు అనేవి మన ప్రజలకు అసలు తెలియకుండా పోతాయి'' అంటూ కనులు మూసుకుని ఏదో మంత్రాన్ని జపించాడు శక్తిరాయుడు.

సామాన్యమైన పరిచారిక మాదిరి అంతవరకూ వారికి సేవలు చేసిన ఆ సుందర స్వరూపిణి వెలుగు రేఖగా మారిపోయి అతని చేతుల దగ్గరికి వచ్చింది.

కన్నుమూసి కన్ను తెరిచేటంతలో ఒక చిన్న యంత్రం మాదిరి తయారై అతని దోసిట్లో పడింది. భక్తిప్రవత్తులతో కనులకు అద్దుకుని ఆ యంత్రాన్ని కీర్తిరాయుడికి అందించాడు శక్తిరాయుడు.

''సంవత్సరాల తరబడి నేను చేసిన సాధన ఫలితం ఈ అష్టసిద్ధి యంత్రం. బహు జాగ్రత్తగా చూసుకోండి. ఎప్పుడయినా ఈ తల్లి మన మీద అలిగి అవతలికి పోవటం అంటూ జరిగితే, మన అదృష్టాలు తారు మారయిపోతాయి. దుర్భరదారిద్ర్యం మన ప్రజల్ని చుట్టుముడుతుంది. జాగ్రత్త....'' అంటూ కిందపెట్టిన తన చేతికర్ర వంటి దండాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు.

''వెళ్ళిపోతున్నావా? అప్పుడే వెళ్ళిపోతావా?'' ఆందోళనగా అడిగిన చెల్లెలు సుదంతి తల ప్రేమగా నిమిరి, నుదుటిని మృదువుగా చుంబించాడతను.

''నేను అందరి మాదిరిగా సాధారణమయిన జీవితాన్ని ఎంచుకుని వుంటే, మీ అందరితోపాటు ఇక్కడే వుండేవాడిని. నా మార్గం నాది... నల్లకొండల నడుమున వుండే ముచ్చింతల గట్టు దగ్గరికి పోతున్నాను. అక్కడే ధ్యానం

చేసుకుంటూ శేషజీవితాన్ని గడిపేస్తాను. వెళ్ళివస్తాను'' అంటూ ఆమెకు చెప్పి అన్నగారికి నమస్కరించి, నాలుగే అడుగులు ముందుకు వేశాడు.

తళుక్కున మెరిసిందొక మెరుపు. గవాక్షం దగ్గర నిలబడి తొంగి చూస్తున్న భూపతి కళ్ళు బైర్లుకమ్మినట్లయింది. రెండు క్షణాల తరువాత తిరిగివచ్చింది చూపు. అప్పటికే మాయం అయిపోయాడు శక్తిరాయుడు.

ఎదురుతెన్నులు చూసినంతసేపు కూడా తమతో వుండని అన్నగారిని తలచుకుని అదేపనిగా బాధపడుతున్న చెల్లెలు సుదంతిని ఓదార్చాడు కీర్తిరాయుడు.

“తమ్ముడు నా మీద పెట్టిన బాధ్యతను నీకు అప్పగిస్తున్నాను. ఈ క్షణం నుంచీ ఈ అద్భుత యంత్రానికి భక్తిశ్రద్ధలతో పూజాధికాలు నిర్వర్తించాలి నువ్వు…'' అంటూ కీర్తిరాయుడు ఇచ్చిన మహిమాన్వతమయిన అష్టసిద్ధి యంత్రాన్ని ఆమెకు అందించాడు.

భక్తిప్రపత్తులతో అందుకుని ఆ మందిరంలో నుంచి బయటికి వస్తున్న సుదంతికి అగుపించకుండా గవాక్షం దగ్గర్నించి పక్కకు తప్పుకున్నాడు భూపతి.

మూడు మాసాలు వేచియున్న తరువాత దొరికింది భూపతికి మరో అవకాశం… ఎర్ర వాగు ప్రవహించే ప్రదేశంలో వ్యవసాయం చేసుకునే రైతుబిడ్డల దగ్గర్నించి పన్నులు వసూలు చేసి తిరిగి వస్తున్న భటుల మీద అడవిదారిలో దాడి చేసారు అతని అనుచరులు.

“నలభైవేల వరహాలు... సంవత్సరం పొడవునా మన ఖర్చులకు సరిపోతాయి. బహు జాగ్రత్తగా పని పూర్తిచేయాలి. మన గురించి ఎట్టి పరిస్థితిలోనూ నరమానవుడికి కూడా తెలియకూడదు. రహస్యంగా సంచరించి విజయంతో తిరిగిరండి” అని ఒకటికి రెండుసార్లు వారందరికీ జాగ్రత్తలు చెప్పి పంపించాడు భూపతి.

లావుపాటి బాణా కర్రలతో, ముఖాలు కనిపించకుండా తలపాగాలతో మరుగుపరుచుకుని గుంపుగా భటులమీదికి ఎగబడ్డారు అతని అనుచరులు.

ప్రతిఘటించటం చేతకాక ధనపు మూటను కిందికి వదిలి దూరంగా పారిపోయారు భటులు.

విజయగర్వంతో వికటాట్టహాసాలు చేస్తూ ఆ మూటను ముట్టుకోబోయిన భూపతి అనుచరుల కళ్ళముందు మెరిసిందోక మెరుపు. శూలధారిణి అయిన ఒక శక్తి అక్కడ ప్రత్యక్షమై, వారందరినీ తన శూలంతో దారుణంగా హింసించటం మొదలుపెట్టింది.

అక్కడే నిలబడి వుంటే తమ ప్రాణాలు దక్కవని అర్థమై, బాణా కర్రలను వదిలేసి దూరంగా పారిపోయారు వారందరూ. అర్థరాత్రి సమయంలో రహస్యంగా వచ్చి జరిగింది ఏమిటో భూపతికి విన్నవించారు.

అష్టసిద్ధి యంత్రాన్ని అన్నగారికి అందిస్తూ శక్తిరాయుడు చెప్పిన మాటలు చెవుల్లో అదేపనిగా మార్మోగి గిజాటుకు గురయ్యాడు భూపతి. మరో

రెండుమాసాలు గడిచిన తరువాత ఒక తాంత్రికుడి దగ్గరికి పోయి తన బాధను అతనికి చెప్పుకున్నాడు.

“ఏదో ఒక సంస్థానానికి ఏలిక అవ్వాలనే నా కోరిక ఆ శక్తి మూలంగా నెరవేరకుండాపోతోంది. సిరిపుర సంస్థానానికి చెందిన చిల్లిగవ్వను కూడా అక్రమంగా సొంతం చేసుకోవటానికి వీలులేకుండా ఆ శక్తి అడ్డుపడుతోంది. మీరే నాకు ఏదైనా ఒక మార్గాన్ని చూపించాలి” అని తాంత్రికుడ్ని వేడుకున్నాడు భూపతి.

“ఆ శక్తికి అవమానం జరిగేటట్లు చూడు. తనకు అవమానం జరిగితే అది అలిగి అవతలికి వెళ్ళిపోతుందని ఆ శక్తిరాయుడు తన అన్నతో చెప్పాడని అన్నావుగా.... ఆ దారిలో నీ తెలివిని ఉపయోగించు....”

అతను చెప్పినదంతా శాంతంగా ఆలకించి నెమ్మదిగా ఉపాయం చెప్పాడు ఆ తాంత్రికుడు.

మరో మూడు మాసాల తర్వాత మొదటిసారిగా ఒంటరిగా భూపతికి తారసపడింది కీర్తిరాయుడి సోదరి సుదంతి. అష్టసిద్ధి యంత్రాన్ని ప్రతిష్ఠించిన ఆలయంలో పూజలు చేసి తన భవనానికి తిరిగి వస్తున్నదామె.

“అమ్మాయిగారి అంతస్తుకు తగిన పనికాదు ఇది. మీరు చిటికె వేస్తే చాలు మరుక్షణంలో చేతులు కట్టుకుని వాలే సేవకులు ఎంతోమంది వున్నారు. అర్ధవరహా విసిరేస్తే ఆవురావురుమంటూ వచ్చి ఎటువంటి పూజలు చేయమన్నా ఎదురు చెప్పకుండా చేసేవాళ్ళు యింకా చాలామంది మన సంస్థానంలో

నివసిస్తున్నారు. వారిలో ఏ ఒక్కరినయినా పిలిచి వారికి ఈ పని అప్పచెప్పండి.. కఠోర మయిన నియమాలతో మీ సుందరమయిన దేహాన్ని శ్రమపెట్టుకోకండి" అంటూ మెత్తటి మాటలతో చిన్నగా చెప్పాడామెకు భూపతి.

చురుకుగా చూసి చివ్వున తల తిప్పుకున్నది సుదంతి. ఆ రోజుకు తన ఉపదేశాన్ని అక్కడితో ఆపేశాడు భూపతి. మరో రెండురోజులు ఆగి ఉదయం వేళలో సుదంతి పూజ చేయటానికి సిద్ధం అవుతుండగా, ఆలయం వున్న తోటకు సమీపంలో గంగిరెద్దుల మేళాన్ని ఏర్పాటు చేశాడు.

పూజాద్రవ్యాలను తీసుకుని తోటలోకి వచ్చిన సుదంతి, అర్ధఘడియ పాటు ఆ మేళం వంకే చూస్తూ నిలబడిపోయింది. మరో రెండు రోజుల తరువాత కృష్ణాతీరం నుండి పగటి వేషగాళ్ళను పిలిపించి పట్టపగలు వీధి భాగవతాన్ని ఏర్పాటు చేశాడు భూపతి.

ఒక పూర్తి ఘడియపాటు పూజ చేయటానికి వెళ్ళకుండా ఆగిపోయింది సుదంతి. కార్యక్రమం పూర్తవగానే ఆదరాబాదరాగా ఆలయంలోకి వెళ్ళింది.

అష్టసిద్ధి యంత్రం ప్రతిష్ఠచేసిన ఆలయం గట్టుమీద ఆకలికి తట్టుకోలేక అదేపనిగా రోదిస్తున్న పసిబిడ్డ రూపం ఒకటి కనిపించింది సుదంతికి.

"పూజలు చేయించేవాళ్లు మీరు... పూజలు స్వహస్తాలతో చేయవలసిన వాళ్ళు కారు. ఎందుకు అవస్థలు పడతారు?" ఆరోజు తనకు కనిపించిన బిడ్డరూపాన్ని అదేపనిగా తలుచుకుంటూ ఆలయంలో నుంచి వెలుపలికి వచ్చిన సుదంతితో అన్నాడు భూపతి.

చురుకుగా చూడలేదుగాని, విసురుగా తల పక్కకు తిప్పుకుని వడివడిగా తన భవంతికి వెళ్ళిపోయిందామె.

తనలో తాను నవ్వుకుంటూ తోటలోనుంచి వెలుపలికి వచ్చి, అటు నుంచి అటే తనకు ఉపాయాన్ని చెప్పిన తాంత్రికుడి దగ్గరికి పోయాడు భూపతి. అంతవరకూ జరిగింది అంతా వివరంగా చెప్పాడు.

“సామాన్యమయిన మానవులకున్నట్లే శక్తిరూపాలకు కూడా కొన్ని బలహీనతలుంటాయి. దండోళ్ళ మోతలను విన్నా, పసుపు కుంకుమలను చూసినా వాటి ఆవేశానికి, ఆత్రానికి హద్దుండదు. సుదంతిని మార్చటానికి చేసే ప్రయత్నాలకు తోడుగా ఆ శక్తిని రెచ్చగొట్టే పనులు కూడా చేయి” పావుఘడియపాటు ఆలోచించి మరో ఉపాయాన్ని అతనికి చెప్పాడు ఆ తాంత్రికుడు.

తన అనుచరులతోను, తన అనుయాయులతోను ఆరు రోజులపాటు ఆలోచించాడు భూపతి.

సుదంతి చిన్నపిల్ల. అనుభవం లేమివల్ల చిన్న చిన్న ప్రలోభాలకు తేలికగా వశపడుతోంది. శక్తివంతమైన ఒక దేవతను రెచ్చగొట్టడం అంటే ఎలా?

ఆరు రోజుల తరువాత కూడా తన ఆలోచనలకు తగిన ముగింపు ఏదీ స్ఫురించకపోవటంతో అధికం అయిపోయింది భూపతి ఆత్రుత.

ఏడోరోజు చీకటి పడుతున్న సమయంలో అలవాటుగా తను వెళ్ళే మధుశాల వెనుక భాగంలోకి వెళ్ళి అక్కడవున్న ఆసనం మీద కూర్చున్నాడు.

మధుశాల యజమాని తెచ్చి ఇచ్చిన ఇప్పపూవు పానీయాన్ని పుచ్చుకుంటూవుండగా, అతని చెవులకు సోకింది ఒక కంఠం. మధుశాలకు దగ్గర్లో వున్న గ్రామదేవత గుడి దగ్గిర్నించి వినవిస్తోంది అది.

"ఏమిటా అరుపులు? ఎవరు అరుస్తోంది?" కుతూహలం నిండిన కంఠంతో మధుశాల యజమానిని అడిగాడు భూపతి.

"పనిలేక అరిచే అరుపులే దొరా! శక్తిరాయులవారు వచ్చి పెద్ద దొరగారికి అదేదో అష్టసిద్ధి యంత్రం ఇచ్చి వెళ్ళారట కదా! అప్పటినించి మన గ్రామదేవత పని హుష్ కాకి అయింది. పూజలు సరిగ్గా జరగటంలేదు. దివాణం నుంచి ఎవరూ దర్శనం చేసుకోవటానికి రావటంలేదు. అందుకని పూనకం వచ్చినట్టు గణాచారి గంతులు పెడుతోంది. పట్టించుకునే నాధుడు కరువైనాడు."

దగ్గరికివచ్చి వినయం నిండిన కంఠంతో తనకు తెలిసింది వివరంగా చెప్పాడు మధుశాల యజమాని.

***

పొద్దు పొడిచిన ఒక అర్థ ఘడియకు అష్టసిద్ధి యంత్రం దగ్గరికి బయలుదేరిన సుదంతికి పూలతోట ముఖద్వారం దగ్గరే ఎదురయ్యేరు అనేకమంది ముత్తయిదువలు. "మన గ్రామదేవతకు కుంకుమపూజ మొదలు పెట్టాం... రేపు కన్నె ముత్తయిదువులకు పాదపూజ.... ఈ సంస్థానంలో వున్న వారందరిలోకి అపురూపమైన కన్నెలు మీరు... తప్పకుండా వచ్చి పూజఅందుకోవాలి" అంటూ బొట్టుపెట్టి మరీ ఆహ్వానించారు.

అందరిలోను తనను గొప్పచేసి మాట్లాడటం మహా బాగా నచ్చింది సుదంతికి. "పూజకు తప్పకుండా వస్తాను. దైవకార్యం కదా.... అశ్రద్ధ చేయను" అని వారికి మాట ఇచ్చి ఆలయం వైపు కదిలింది. అంతలోనే ఆమె చెవులకు చేరాయి గ్రామదేవత గుడి దగ్గర మోగుతున్న దండోళ్ళ మోతలు... చెవులు చిల్లులు పడేటట్లు వినరావటం మొదలుపెట్టాయి తాషామర్ఫాల శబ్దాలు.

పాదాలకున్న బంగారు పాంజేబులు ఘల్లుఘల్లుమని శబ్దాలు చేస్తుండగా, ఆలయంలోకి వెళ్ళిన సదంతికి అష్టిసిద్ధా యంత్రం ప్రతిష్టించబడిన పీఠంమీద మరోసారి కనిపించిందో పసిపాప... దూరం నుంచి వినవస్తున్న బాజా భజంత్రీలను, జాతర శబ్దాలను ఆసక్తిగా ఆలకిస్తోంది. హడావుడిగా పూజ ముగించింది సుదంతి. మొక్కుబడిగా నైవేద్యాన్ని సమర్పించి, "గ్రామదేవత గుడి దగ్గరికిపోయి వద్దాం పదండి" అంటూ తన చెలికత్తెలను వెంటబెట్టుకుని గుబగబా వెళ్ళిపోయింది.

"కన్నె ముత్తయిదువల పూజకు మీరు అందరికంటే ముందుగా రావాలి" గుడి దగ్గర ఆమెను చూసి మరోమారు గుర్తుచేశారు అంతకు ముందు ఆమెకు బొట్టుపెట్టిన మహిళలు. వారందరూ కోరిన విధంగానే మరునాడు అందరికంటే ముందుగా గుడి దగ్గరికి పోయింది సుదంతి.

ఘనంగా పాదపూజ చేయించుకున్నది. నైవేద్యాలను గ్రామదేవత తరఫున తనే స్వీకరించింది.

"అమ్మా... మన దేవతకు పూజ చేయలేదు..." పొద్దు నడినెత్తి మీదికి పోబోతున్న సమయంలో గుర్తుచేసింది ఒక పరిచారిక.

“మరేం ఫరవాలేదు... నువ్వు వెళ్ళి నైవేద్యం పెట్టిరా” అంటూ ఆ పూజ బాధ్యతను ఆమెకే అప్పగించింది సుదంతి.

దగ్గర్లోనే నిలబడి వున్న భూపతి చెవికి చేరనే చేరాయా మాటలు. క్షణం కూడా ఆలస్యం చేయకుండా తన భార్యకు సైగ చేశాడతను.

“తల్లీ... రేపు కూడా ఉదయమే రావాలి నువ్వు.... సువాసినులకు పసుపు కుంకుమలను పంచాలి. మాకు పెద్దదిక్కు మీరేకదా. మీ బంగారు చేతులతో ఆ కార్యాన్ని పూర్తిచేయాలి” అని కోరింది ఆమె. మిగిలిన వారితో కోరచేసింది.

అంతమంది అదేపనిగా తన అంగీకారం కోసం ఎదురుచూడటం అదో విధమైన ఆనందాన్ని కలిగించేసరికి ముందు వెనకలు ఆలోచించుకుండా తలూపింది సుదంతి.

ఆ మరునాడు కూడా తను గ్రామదేవత ఆలయం దగ్గరకే వెళ్లింది. అష్టసిద్ధి యంత్రాన్ని అర్చించే బాధ్యతను తన పరిచారికకు అప్పగించింది. మూడవరోజు ముగింపు ఉత్సవాల సంరంభంలో పాలుపంచుకోవాల్సి రావటంతో ఆ రోజున కూడా పరిచారికే అష్టసిద్ధి యంత్రానికి అర్చన చేసేందుకు బయలుదేరింది.

దారి మధ్యలో ఆమెను అటకాయించాడు భూపతిదొర పంపిన అనుచరుడు. వందకాసులు బహుమానంగా ఇచ్చి ఆమెను పూపొదల చాటుకు తీసుకుపోయాడు. కలుషితమయిన తనువుతో, అష్టసిద్ధి యంత్రానికి పూజ చేయబోయిందా పరిచారిక. మూడు తలలున్న మహానాగం ఒకటి ఆలయం ఎదుట పూత్కారం చేస్తూ కన్పించేసరికి భయంతో వెనక్కి పారిపోయివచ్చేసింది.

ఆ రోజు రాత్రి అత్యద్భుతమయిన తోలుబొమ్మల ఆట సరిగ్గా దివాణం ఎదుటే ప్రదర్శించే ఏర్పాటు చేశాడు భూపతి. ఆనందంగా ఆటను చూస్తున్న సుదంతి దగ్గరికి వచ్చి "అమ్మా... మన ఆలయంలో నుంచి అదేపనిగా పసిబిడ్డ ఏడుపు వినవస్తోంది. కాగడా వెలిగించి చూశా. ఎవరూ కన్పించలేదు" రహస్యంగా విన్నవించాడో భటుడు.

రసకందాయంలో వున్న ఆటను వదిలి వెళ్ళటానికి ఇష్టంలేకపోయినా, ఆ భటుడు అక్కడినించి కదిలి అవతలికి పోకపోవటంతో విసురుగా ఆసనం మీదినించి లేచి, ఆలయం దగ్గరికి వెళ్ళింది సుదంతి.

కెవ్వు కెవ్వున ఏడుస్తోంది పీఠంమీద అప్పుడప్పుడు ఆమెకు అగుపించే పసిబిడ్డ. ఆమెను చూడగానే ఆత్రుతగా చేతుల్ని ముందుకు జాచింది.

"ఎందుకు ఏడుపు? వేళాపాళాలేకుండా ఏమిటి ఈ గోల?" దగ్గరికి పోయి కోపంగా అడిగింది సుదంతి.

ఏడుపు ఆపలేదా బిడ్డ. గుక్కపట్టి ముఖమంతా ఎర్రబడిపోయేటట్లు అదే పనిగా రోదించటాన్ని కొనసాగించింది. "నీకు పూజ చేయకపోతే ఇలా ఏడ్చి రాగాలు తీస్తావా? ఎప్పుడుపడితే అప్పుడు నీకు పూజలు చేస్తూ కూర్చోవటమే నాకు పని అనుకున్నావా? నేను చేయనుగాక చేయను. ముందు ఏడుపు ఆపు" రెండు చెవులు మూసుకుంటూ కోపంగా అన్నది సుదంతి.

అప్పటికీ ఆగలేదా పసిబిడ్డ ఏడుపు.

తారాపథానికి చేరుకున్నది సుదంతి కోపం.... తను ఒక మహోగ్ర శక్తి సన్నిధిలో వున్నదనే మాటలు మరిచిపోయింది. బిడ్డను బెదిరిస్తే ఏడుపు ఆగుతుందనే ఉద్దేశ్యంతో చేతిని ఎత్తింది దెబ్బ వేయటానికి అన్నట్లు.

అప్పుడు కూడా ఆగలేదా బిడ్డ రోదనం. దెబ్బ వేయనేవేసింది సుదంతి. చేయి ఆ బిడ్డ ఒంటికి తగిలిన మరుక్షణం భగ్గుమని పైకి లేచింది ఒక అగ్నిజ్వాల.

"ప్రాణాలుపోతున్న సమయంలో కూడా పసిబిడ్డ ఏడుపు వినబడితే ఉత్కంఠకు గురి అయ్యే స్త్రీ జాతిలోపుట్టి, నువ్వు మనసులేని బండరాయి మాదిరిగా ప్రవర్తించావు. పసిబిడ్డ ఏడుపును విని కూడా జాలిపడని నీకు, నీలాంటి మూర్ఖురాలిని నా పూజలకోసం నియమించిన నీ వంశీయుల స్త్రీలకు ఇక నుంచీ మాతృత్వంలోని మధురిమను ఆస్వాదించే అదృష్టం పట్టదు. బిడ్డపుట్టిన వెంటనే మరణించి మట్టిలో కలిసిపోతారు. నాకు అపచారం జరగటానికి కారణమయిన ఈ సంస్థానం సర్వనాశనం అయిపోతుంది..." అంటూ వినవచ్చాయి కటువైన మాటలు ఆ జ్వాలలో నుంచి.

సుదంతి చూస్తూ వుండగానే అతివేగంగా నిట్టనిలువుగా పైకి, పైపైకి లేచిందది... నిప్పురవ్వలను నలుదిక్కులకు వెదజల్లుతతూ ఆ మంటల నుంచి విడివడి తోకచుక్క మాదిరి ఎటో దూసుకుపోయింది శక్తిరాయుడు అనుగ్రహించినటువంటి అష్టసిద్ధి యంత్రం.

***

"గ్రామదేవతకు కుంకుమపూజ చేయించటమనే పన్నాగంతో అష్టసిద్ధి యంత్రాన్ని రెచ్చగొట్టి, అన్నీ తెలిసీ ఏమీ తెలియనట్లు ప్రవర్తించిన సుదంతిని

మభ్యపెట్టి, మా వంశాన్ని సర్వనాశనం చేసేశాడా భూపతి. ఆలయంలో చెలరేగిన మంటలు దివాణందాకా వచ్చి, విలువైన భవనాలన్నిటినీ పొట్టన పెట్టకున్నాయి. రాత్రిగడిచి తెల్లవారేసరికి కోట్లకు అధిపతైన కీర్తిరాయుడు కూటికి కూడా చేయి చాచాల్సినంత పేదవాడైపోయాడు.

నిండు గర్భవతి అతని భార్య... ఆ తరువాత ఒక మగబిడ్డను ప్రసవించి ప్రాణాలను పోగొట్టుకున్నది. అప్పటి నుంచీ ప్రతీ తరంలోను మగవాళ్ళు పెళ్ళిచేసుకోవటం, వారి భార్యలు బిడ్డను ప్రసవించిన వెంటనే మరణించటం ఖచ్చితంగా జరుగుతూ వస్తోంది...." కనుకొలకులు నుంచి బుగ్గల మీదికి జారిన కన్నీటిని ఉత్తరీయంతో అద్దుకుంటూ చెప్పాడు దొరగారు.

తండ్రి దగ్గరకు పోయి ఆయన భుజంమీద చేయివేశాడు రవిబాబు. మీ అభిప్రాయం ఏమిటో నాకు అర్థం అయింది. నేను అపూర్వను వివాహం చేసుకుంటే, సంతానవతి అయిన వెంటనే ఆమె చనిపోతుందని మీ అభిప్రాయం. అవునుకదూ? అని అడిగాడు.

అవునని తల ఊపాడు దొరగారు.

నిస్సహాయంగా తనకేసి చూసిన రవిబాబు వైపు తలతిప్పి చిన్నగా నవ్వాడు పాండు.

"బిడ్డను కన్న వెంటనే భార్య చనిపోతుందని తెలిసి కూడా మీ నాన్నగారు పెళ్ళి చేసుకున్నారు. ఎందుకు చేసుకున్నారో అడుగు బాబూ...." అని అన్నాడు.

"వంశం నశించిపోకుండా వుండటం కోసం విధిలేని పరిస్థితిలో ఆ పనిచేశాము.... నీ వంటి అర్భకులకు ఇటువంటి విషయాలు అర్థంకావు అసలు..." అని ఇంకా ఏదో అనబోతూ పాండు ముఖంలోని చిరునవ్వు అలాగే వుండటాన్ని చూసి చటుక్కున మాటల్ని ఆపేశాడాయన.

"నన్ను క్షమించు బాబూ.... అకారణంగా ఆత్రపడ్డాను. చిన్నవమానించబోయాను" కుర్చీలో నుంచి లేచి అతని దగ్గరికొస్తూ అన్నాడు ఆర్ద్రత నిండిన కంఠంతో.

"ఏమిటి నాన్నగారూ? అసలు ఏం జరిగిందని మీరు ఇలా బేలగా మాట్లాడుతున్నారు?" అయోమయంగా చూస్తూ అడిగిన రవిబాబు భుజం తట్టారాయన.

"నీ స్నేహితుడు చాలా చురుకైనవాడు. ఒకే ఒక్క మాటతో నా సంశయాలన్నిటిని దూరం చేశాడు. పిల్లలు పుట్టిన తర్వాత మన వంశంలోని స్త్రీలు అందరూ మరణిస్తారని తెలిసికూడా వంశం నిలవటం కోసం పెళ్ళిళ్ళు చేసుకున్నారు అందరూ.. ఎవరూ బ్రహ్మచారిగా మిగిలిపోలేదు. నిన్ను పెళ్ళి చేసుకోవద్దని అనటం చాలా పెద్ద పొరపాటు... నీకు నచ్చిన అమ్మాయిని నువ్వ నిరభ్యంతరంగా చేసుకో... చేసుకునే ముందు మాత్రం మనకి వున్న శాపాన్ని ఒకసారి గుర్తుచేసుకో...." అంటూ మాట్లాడటం పూర్తి అయినట్టు చేయి వూపాడు దొరగారు.

పాండు వెనకాలే ఆ గదిలో నుంచి బయటకు వచ్చాడు రవిబాము. ప్రాణంలో ప్రాణంగా ప్రేమిస్తున్నాను అపూర్వని.... పెళ్ళి చేసుకుని ఆమె

మరణానికి కారకుడిని ఎలా అవగలను? తన గదిలోకి చేరుకోగానే పాండును అడిగాడు.

"అందుకు ఒకే ఒక మార్గం వుందిబాబూ..." బీడీని వెలిగించుకుని పొగను తాపెగా గుండెలనిండా పీల్చుకుంటూ రవిబాబుతో అన్నాడు పాండు.

"ఏమిటది?" అడిగాడు రవిబాబు.

"అవమానం జరిగిందని చెప్పి అర్థాంతరంగా ఆకాశంలోకి ఎగిరిపోయిన ఆ యంత్రం ఎక్కడపడిందో వెతికి పట్టుకోవాలి. పూజలు పునస్కారాలు చేసి మళ్ళీ ప్రసన్నం చేసుకోవాలి. ఏ నోటితో శాపం పెట్టిందో ఆ నోటితొనే శాపాన్ని వెనక్కి తీసుకునేటట్లు చేయాలి. అలా చేస్తే ఎవరికీ ఏ ఇబ్బందీ వుండదు... మీ నాన్నగారు చెప్పిన కథలో నాకు కొన్ని అనుమానాలు మిగిలాయి. వాటిని గురించి తర్వాత తీరికగా మాట్లాడుకుందాం... ముందు మనం అపూర్వమ్మ సంగతి గురించి ఆలోచించాలి..." చెప్పాడతను.

"నాకు ఎటువంటి ఆలోచనా రావటంలేదు... అదీ నువ్వే చెప్పు" బెడ్ మీద కూర్చుంటూ అన్నాడు రవిబాబు.

"మనం నారాయణపురం వెళ్ళి ఆయమ్మని తీసుకువచ్చేద్దాం... తరువాత ఆ యంత్రాన్ని వెతికే పని మొదలుపెడదాం. యంత్రం దొరికిన తరువాత మీరు పెళ్ళిచేసుకోవచ్చు" అన్నాడు పాండు.

"తరతరాలుగా ఎవరికీ కనిపించని ఆ యంత్రం మనకి అంత తేలికగా దొరకుతుందా?" అన్నాడు రవిబాబు.

"దొరకాలి బాబూ... దొరికి తీరాలి... అది దొరక్కపోతే మీతో పాటు నేనుకూడా చాలా బాధపడాల్సి వస్తుంది."

"నాతోపాటు నువ్వు బాధపడాలా? ఎందుకట?" ఆశ్చర్యంగా అడిగిన రవిబాబుకి కనిపించకుండా తన పొరపాటును నేర్పుగా కప్పిపెట్టుకున్నాడు పాండు.

"మీరు బాధపడుతుంటే మేమెలా సంతోషంగా వుండగలం? అందుకలా అన్నాను."

బెడ్ దగ్గర్నించి ఇవతలకు వచ్చి పాండు వైపు నవ్వుతూ చూస్తూ, అతని భుజాన్ని గట్టిగా ఆదరపూర్వకంగా అదిమాడు రవిబాబు. "నీలాంటి వాడిని స్నేహితుడిగా పొందగలగటం నా అదృష్టం. నా పెళ్ళితోపాటు నీకు రంగమ్మకి నేనే వివాహం చేస్తాను... నువ్వు అందుకు ఎలాంటి అభ్యంతరాలు లేవతీసినా నేను ఊరుకోను" అని కూడా అన్నాడు రవిబాబు.

"మీ పెళ్ళి సజావుగా జరిగిన మరుక్షణం మా పెళ్ళి కూడా జరిగిపోతుంది బాబూ... అభ్యంతరాలు లేవతీయటానికి నేను వెర్రివాడిని కాదు. నేను అలా మీ ఊరు చూసొస్తాను...." అంటూ గదిలోనుంచి బయటకు వెళ్ళిపోయాడు పాండు.

***

సాయంత్రం నాలుగుగంటలు సమయంలో రాఘవాపురం రైల్వేస్టేషన్ దగ్గర్నించి పెళ్ళిచూపుల బృందాన్ని నారాయణపురం తీసుకువచ్చింది రత్నంగారు ప్రత్యేకంగా పనికట్టుకుని పంపించిన జీప్.

“అమ్మాయిగారూ... ఆళ్ళు వచ్చేశారు. మీరు తొరగారెడీ అవ్వాలి” అంటూ తన గదిలోకి వచ్చిన పనిమనిషి వంక నిరాసక్తంగా చూసింది అపూర్వ.

“తండ్రిచాటు బిడ్డలు మీరు.... తండ్రి చెప్పినట్టు ఇనుకోవటమే.. వేరేమార్గం లేదు ఊరికే బాధపడవద్దు... లేచి రెడీ అవ్వండి” ఆమె మనసులో ఏముందో తెలుసుకాబట్టి, అనునయంగా అన్నది పనిమనిషి. ఉబికి రాబోయిన కన్నీటిని అతిప్రయత్నం మీద అదుముకుంటూ బెడ్ మీద నుంచి లేచింది అపూర్వ పనిమనిషి అందించిన టవల్ ని తీసుకుని బాత్ రూమ్ వైపు కదిలింది.

“ఆగు, నన్ను బయటికి పోనీ....” తలుపు తెరవగానే చిన్నగా విన్పించింది ఆమెకు ఒక కంఠం. ఉలిక్కిపడబోయి అంతలోనే తమాయింకుకొని, అంత బాధలోనూ చిన్నగా నవ్వకుండా వుండలేకపోయింది అపూర్వ.

“పాడుపడిన గదిలోనుంచి రాత్రి వేళల్లో తప్ప బయటికి రావని అనుకున్నాను... ఇక్కడికి ఎప్పుడు వచ్చావ్?” తలుపును దగ్గరికి వేస్తూ అడిగింది అపూర్వ.

సబ్బునీళ్ళతో ఊదిన బుడగమాదిరి ట్రాన్స్పరెంట్‌గా ఆమె ఎదుట ప్రత్యక్షమయింది రాజశేఖర్ స్వరూపం. “నువ్వు సువర్ణవి కాదని తెలిసీ ఎందుకో నాకు నీ దగ్గర్నించి అవతలికి పోబుద్ధి కావటంలేదు. ఇందాకే వచ్చి ఇక్కడ కూర్చున్నాను. పెళ్ళి చూపులకు సిద్ధమవుతున్నావా?” అనడిగింది.

అపూర్వ పెదవులమీది నవ్వు మటుమాయం అయిపోయింది. ఆమెకి తెలియకుండానే కనులు తడి అయ్యాయి. ఆ సంగతి తను గమనించినట్లు ఓరగా వేసిన తలుపుల్లోనుంచి బయటికి వెళ్ళిపోయింది రాజశేఖర రూపం.

"నేను కిందికిపోయి పెళ్ళి కొడుకును ఒకసారి చూస్తాను. ఎంత లేదన్నా వాడు నాకు కొడుకువరస అవుతాడు. చూడకపోవటం మర్యాద అనిపించుకోదు" అంటూ మాయం అయిపోయింది.

తలుపులు గడియపెట్టి పావుగంట తర్వాత తన గది బయటికి వచ్చింది అపూర్వ. అందమైన చీరనొకదాన్ని కట్టుకొని, తడి అయిన ముంగురుల్ని టవల్ తో అద్దుకుంటూ తను కూడా కిందికి వెళ్ళింది.

"రావే... అందరూ ఎదురు చూస్తున్నారు.... నీదే ఆలస్యం" అంటూ ఆమె చేయి పట్టుకుని, హాలును ఆనుకుని వున్న ముందు గదిలోకి తీసుకుపొయిందామె తల్లి.

తమ వెనకాలే పెద్ద ట్రేలో కాఫీ కప్పుల్ని తీసుకువస్తున్న పనిమనిషిని ఆపి, ఆ ట్రేని అపూర్వ చేతుల్లో పెట్టింది.

"పెళ్ళివారికి కాఫీలు నువ్వు ఇవ్వాలి. వెళ్ళి ఇవ్వు" అని కూతురిని ఆదేశించింది. అంతవరకూ ఏవో మాటలలో మునిగిపోయివున్న పెళ్ళివారు మాటలను ఆపి అపూర్వవంకే చూస్తూ వుండిపోయారు.

"నచ్చేసింది. అమ్మాయిగారు ఆళ్ళకి పిచ్చి పిచ్చిగా నచ్చేసింది. మీరెంత కట్నం ఇస్తే అంత రెండో మాట లేకుండా తీసుకుంటారు. పిల్లని తమతో పంపినా

చాలని అంటారు చూడండి'' వాళ్ళ ముఖలలోని భావాలను గమనిస్తూ యజమానురాలితో సంతోషంగా అన్నది పనిమనిషి.

''నీ నోటి చలవవల్ల అలా జరిగితే మాకు ఇంకా కావాల్సింది ఏముందే? పిల్లాడు కూడా బాగానే వున్నాడు. ఒకమోస్తరు ఆస్తిపాస్తులున్న కుటుంబమే'' ఆమె ఆనందాన్ని తను కూడా పంచుకుంటూ లోగొంతుకతో అన్నది అపూర్వ మదర్.

పెళ్ళికొడుకు తండ్రికి, వారితోపాటు వచ్చిన బంధువులకు కాఫీ కప్పుల్ని ఇచ్చి ఆఖరిగా పెళ్ళికొడుకు దగ్గరికి వెళ్ళింది అపూర్వ.

''శబ్బాష్.... నువ్వు చాలా అందంగా వున్నావ్.... నాకు బాగా నచ్చావ్....'' అపూర్వకు కన్నుగీటుతూ పెద్దగా అన్నాడు పెళ్ళికొడుకు. ఆ మాటలకు అదిరిపడి అతనివంక చూశారు అక్కడున్న వారందరూ.

''నువ్వు కాలేజీలో చదువుతున్నావట.... ఇంతకుముందు ఎవరితోనైనా లవ్వులో పడ్డావా?'' కాఫీ కప్పును తీసుకుంటూ ఇంకోమాట అడిగాడతను.

పిన్ డ్రాప్ సైలన్స్ ప్రత్యక్షం అయింది ఆ గదిలో. ఊపిర్లు తీసుకోవటం మర్చిపోయినట్లు నిశ్చేష్టులై చూడటం మొదలుపెట్టారు అందరూ.

అపూర్వ ముఖంమీద చిరుచెమటలు స్టార్టయ్యాయి... ఏం చేయాలో, ఎలా రియాక్ట్ అవ్వాలో అర్థంకాక అయోమయంగా తన తండ్రివైపు చూసిందామె.

''నో.... నో.... ప్రాంప్టింగులు వద్దు... సూటిగా మాట్లాడేసుకుందాం. లవ్వులోపడితే తప్పులేదుగని ముందే చెప్పు, కట్నం ఇంకో పదిలక్షలు ఎక్కువిస్తే

అడ్జస్ట్ అయిపోతాను. ఇలారా.... నా పక్కన కోర్చో" అంటూ ఎడమచేతిని జాచి ఆమెను పట్టుకోబోయాడు పెళ్ళికొడుకు.

ఎగిరి కాస్తంత వెనక్కి జంప్ చేసింది అపూర్వ... కూర్చున్న చోటి నుంచి చివ్వున లేచి వీరభద్రుడి మాదిరి ముందుకు దూకబోయిన ఆమె తండ్రిని అతి బలవంతంగా ఆపేశారు అతని స్నేహితులు.

"పోండి... అయిదు నిముషాల్లో ఆ దరిద్రపు ముఖాన్ని తీసుకుని అవతలకు వెళ్ళిపోండి. ఆలస్యం చేశారంటేమిమ్మల్ని అందరినీ నిలబెట్టి నరికిపారేస్తాను. పొండి" అంటూ ఎర్రబడిన ముఖంతో పూనకం వచ్చినట్టు ఊగిపోతూ అరిచాడు రత్నంగారు.

అయోమయంగా చూస్తున్న పెళ్ళివారిని, పిచ్చిగా నవ్వుతున్న పెళ్ళికొడుకుని గబగబా కుర్చీలలో నుంచి లేపి బయటిక తీసుకుపోయారు, ఆ వేడుక చూడటానికి వచ్చిన గ్రామస్థులు కొందరు.

దఃఖం ఆపుకోవటం అసాధ్యమై, వేగంగా తన గదిలోకి పారిపోయి వచ్చింది అపూర్వ.... బెడ్ మీద బోర్లాపడి బావురుమనబోతుండగా "ఎందుకురా ఏడ్వటం... నీకు కావాల్సింది ఇదేగా... మళ్ళీ ఇంకో నెలదాకా పెళ్ళి మాటలు తలబెట్టడు మీ నాన్న... సంతోషించు. ఏడ్వబోకు" అంటూ వినవచ్చాయి అనునయ పూర్వకమయిన మాటలు.

ఎగసుకు వస్తున్న ఏడుపు ఠపీమని ఆగిపోతుండగా, తల ఎత్తి చూసిన అపూర్వకి, అందంగా నవ్వుతూ కనిపించింది రాజశేఖర్ రూపం.

"నీ కోసం ఇవాళ ఓ అమాయకుడిని తిట్లు తిట్టించాను. అతనికి ఈ జన్మలో పెళ్ళి అవుతుందనే నమ్మకం నాకు లేదు" చేతిని జాచి ఆమె బుగ్గల్ని ఆప్యాయంగా నిమురుతూ అన్నదా ఆత్మ స్వరూపం. తన బుగ్గలను తాకిన ఆ చేతిని కళ్ళకు అద్దుకుంటూ, కంట్రోల్‌ని కోల్పోయింది అపూర్వ బావురుమన ఏడ్చేసింది.

"వద్దురా.... నువ్వు ఏడిస్తే నా గుండెల్లో కత్తులు పెట్టి కెలికినంత బాధ కలుగుతోంది... ఏడవకురా. నేనున్నాను. నీ కోరిక తీర్చటమే నా పరమావధిగా పెట్టుకుంటాను. నిన్ను నీ రవిబాబు దగ్గరికి చేర్చేదాకా విశ్రాంతి తీసుకోను. సరేనా?" బుగ్గలమీద జారుతున్న కన్నీటిని తుడుస్తూ అన్నది రాజశేఖర్ రూపం.

"ఎలా? ఎలా చేరుస్తావ్? రవి ఇక్కడికి వస్తే ఈసారి మా నాన్న ఊరుకోడు" గద్గద స్వరంతో అడిగింది ఆమె.

"రవి ఇక్కడికి రాకపోతే ఎలా కుదురుతుంది? రప్పిస్తాను.... నువ్వు చూస్తూ వుండు" అంటూ చటుక్కున మాయమైపోయిందా ఆత్వ స్వరూపం.

## 7

అరగంట తర్వాత అపూర్వ దగ్గరికి వచ్చింది ఆమె తల్లి. "మంచి, మర్యాద, కలిగిన కుటుంబం అనుకుని పెళ్ళిచూపులకు పిలిపించారు మీ నాన్నగారు. కుర్రవాడు వట్టి పోకిరీ వెధవ అని అనుకోలేదు.

కొంచెం చిత్తచాంచల్యం వుందని కూడా అన్పిస్తోంది. మన అదృష్టం కొద్దీ అది ఇప్పుడే బయటపడింది. పెళ్ళయ్యాక బయటికి వచ్చి వుంటే నీ బతుకు

అన్యాయం అయిపోయి వుండేది... నువ్వు బాధపడకు. ఈసారి ఆదోని నుంచి బ్రహ్మాండమయిన సంబంధం తీసుకొస్తానని మీ నాన్నగారు అంటున్నారు'' అంటూ బెడ్ మీద కూర్చునివున్న కూతుర్ని అనునయించింది.

''వాడు కూడా ఇప్పుడు వచ్చినవాడి మాదిరిగా నోటికి వచ్చినట్టు ఏదేదో పేలిపోతాడు. మీకు అప్పుడుగాని సంతోషంగా వుండదు'' ముఖం ముడుచుకుని తల్లివంక చూస్తూ మహా అక్కసుగా అన్నది అపూర్వ.

''నోటికి వచ్చినట్లు పేలితే మెడమీద తలకాయతో ఈ పొలిమేరలు దాటలేరు. నువ్వు పిచ్చి పచ్చి ఆలోచనలు మనసులో పెట్టుకోకు. మేము ఏది చేసినా నీ సంతోషం కోసమే చేస్తాము....'' అంటూ బెడ్ దగ్గర్నించి ఇవతలికి వచ్చేసింది తల్లి. పదినిముషాలు ఆగి మెట్ల దగ్గరికి వచ్చింది అపూర్వ. మెట్లకింది హాలులో తండ్రి కనిపించపోయేసరికి నిబ్బరంగా దిగి వచ్చింది.

''ఆళ్ళు.... ఆ పెళ్ళివోళ్ళు కాళ్ళు ఈడ్చుకుంటూ కాలినడకన రాఘవాపురం దాకా వెళ్ళిపోతున్నార్ట.... ఊళ్లో ఒక్కళ్ళు కూడా బండి కట్టడానికి ఒప్పుకోలేదుట. రత్నంగారి అమ్మాయిని అవమానించినోళ్ళకి ఈ ఊళ్ళో మంచి నీళ్ళు కూడా పుట్టవని తెలియదు పాపం.... పిచ్చోళ్ళు....'' బయటి నించి వస్తూ ఆమెతో అన్నది పనిమనిషి.

''నాన్న ఎక్కడ వున్నారు?'' అడిగింది అపూర్వ.

''రచ్చబండ దగ్గరికి పోయారమ్మా... మన ఊరి శివయ్య కనిపించలేదట.... నిన్నో మొన్నో ఎవరో పరిచయస్తులతో కలసి చీకటివేళ

అడవిలోకి పోయాట్ట. ఇంకా తిరిగి రాలేదంట... అతని పెళ్ళాం లబోదిబోమంటూంటే అతన్ని వెతకటానికి మనుషుల్ని పంపిస్తున్నారు" అంటూ రిపోర్టు చేసింది పనిమనిషి.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా హాల్లో వున్న ఫోన్‌ని అందుకుని చకచకా ఒక నెంబర్ ని ప్రెస్ చేసింది అపూర్వ.

"ఎవరికే? ఎవరికా ఫోన్?" అంటూ వంట ఇంట్లో నుంచి తొంగి చూస్తూ అడిగింది ఆమె తల్లి.

"నా స్నేహితురాలికి ఫోన్ చేస్తున్నా...." అంటూ ఊపిరి బిగపెట్టింది అపూర్వ. కూతురు ఇచ్చిన సమాధానంతో సంతృప్తి చెందింది కాబోలు. మౌనంగా తన పనిలో తను బిజీ అయిపోయింది ఆమె తల్లి.

***

"చిలకమ్మా.... ఫోన్ మోగుతోంది ఎవరో చూడు...." దివాణం ఎదుట కంపర్టబుల్‌గా వుండే కుర్చీలో కూర్చుని, తనను కలుసుకోవడానికి వచ్చిన గ్రామస్థులతో మాట్లాడుతూ చిలకమ్మను హెచ్చరించాడు దొరగారు.

అది విని ముఖం ముటముటలాడించుకుంటూ పోయి ఫోన్ ఎత్తింది చిలకమ్మ.

"నా పనులతో నేను చచ్చిన చావై చతికిలపడి ఏడుస్తుంటే, ఈ ఫోనుల్ని చూడటం కూడా నాకే చెపుతారు. అందరూ అందరే... హల్లో... ఎవరూ?" అంటూ దీర్ఘం తీసిందామె.

"రవి.... రవిబాబు కావాలి...." అస్పష్టంగా అడిగింది అవతలివైపు నుంచి ఒక లేడీ వాయిస్.

"చిన్నబాబూ... మీరు కావాలంట.. ఎవరో అమ్మాయి మాట్లాడుతోంది" అంటూ మేడమీద గదివైపు ఒక అరుపు అరిచి నీ పేరేంటీ? అని రిసీవర్లో అడిగిందామె.

"అపూర్వ... అపూర్వ ఫోన్ చేసిందని చెప్పు"

"అపూర్వంట చిన్నబాబూ.... లైన్‌లో వుంది. తొందరగా వచ్చి మాట్లాడండి..." అంటూ రిసీవర్ ని టీపాయ్ మీద పెట్టి వంట ఇంటికేసి వెళ్ళిపోయింది చిలకమ్మ.

మేడమీద గదిలో రవిబాబు లేడు. అతను దివాణం వెనకాల వున్న అవుట్ హౌస్ దగ్గరికి వెళ్ళి చాలాసేపయింది. ఆ సంగతిని మరిచిపోయింది ఆమె.

***

"ఏమ్మా... ఏమైంది?" వంట యింట్లోకి కూడా వినబడకుండా చిన్నకంఠంతో అపూర్వని అడిగింది పనిమనిషి.

రెండే రెండు నిమిషాల్లో లైన్ కట్ అయిపోవటంతో నిరాశగా చూస్తూ రిసీవర్ ని క్రెడిల్ చేసింది అపూర్వ.

"ఎవరూ మాట్లాడలేదు.... పనిమనిషి ఎవరో మాట్లాడి రిసీవర్ ని పక్కన పారేసిపోయింది" అంటూ ఇంకోసారి రింగ్ చేయటానికి ట్రై చేసింది అపూర్వ

ఎంగేజ్ సౌండ్ వినరావడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకుని తన గదివైపు బయలుదేరింది.

***

"గోపాలం... ఓయ్ గోపాలం.... ఏం చేస్తున్నావ్....?" అంటూ గురువుగారి కంఠం వినరావడంతో ఉలిక్కిపడి చాపమీదినించి లేచాడు గోపాలం. చింతనిప్పుల మాదిరి ఎర్రబడిన కనులతో అతనివంక చూశాడు గురువుగారు. "బంధకి నా ప్రార్థనల్ని ఆలకించింది. ఇంకా కాస్సేపటిలో ప్రత్యక్షం అవుతుంది... నైవేద్యానికి ఏర్పాట్లు చేయి..." అని ఆజ్ఞ ఇచ్చాడు.

"నైవేద్యానికి నరుడిని సిద్ధం చేయమంటారా?" అయోమయంగా చూస్తూ అడిగాడు గోపాలం.

"బుద్ధిహీనుడా! నరుడి నైవేద్యం బంధకి యజమాని అయిన కరాళ శక్తికి యివ్వాలి.... మామూలు నైవేద్యం చాలు.... వెంటనే సిద్ధం చేయ్" అంటూ కోపంగా ఒక అరుపు అరిచి ధ్యానంలో మునిగిపోయాడు గురువుగారు.

"ముందుగా ఏమీ చెప్పకుండా ఆఖరి క్షణంలో నోటికి వచ్చిన మాటలన్నిటినీ మాట్లాడేస్తాడు.... బంధకి నైవేద్యం సిద్ధం చేయాలంట.... ఏం నైవేద్యం....?" వెంకటమ్మ దగ్గరికి పోయి చిన్న కంఠంతో అడిగాడు గోపాలం. చిన్నగా నవ్వి అతని బుగ్గని గట్టిగా గిల్లింది ఆమె.

"ఇలాంటి చిన్న చిన్న మాటలకి అర్థం తెలుసుకోలేనివాడివి, మంత్రాలు ఎలా నేర్చుకుంటావు?" అంటూ అప్పటికప్పుడు కట్టెలు వెలిగించి సత్తుగిన్నెలో

ఎసరు పోసింది. దూరంగా వున్న ఒక పొదచాటునుంచి కాళ్ళు కట్టేసి వుంచిన అడవి కోడిని తీసుకువచ్చింది.

"దీన్ని ఎక్కడ పట్టావ్?" అడిగాడు గోపాలం.

"నిన్న చీకటిపడేటప్పుడు అడవిపిల్లి ఏదో వెంటపడినట్టుంటే, పారిపోయి ఇటుగా వచ్చింది. ఎందుకైనా మంచిదని కట్టిపడేశాను" అంటూ ఎసరు మరిగిన తర్వాత బియ్యం పోసింది. సగం ఉడకగానే అడవికోడిని చంపి ఆ నెత్తుర్ని ఉడుకుతున్న అన్నంలోకొంచింది.

"సిద్ధమేనా? నైవేద్యం సిద్ధమేనా?" పది నిముషాల తరువాత విన వచ్చింది గురువుగారి కంఠం. సెగలు వెలువరుస్తున్న నైవేద్యపు అన్నాన్ని పెద్ద విస్తరిలోకి పంపి, అతిజాగ్రత్తగా తీసుకుపోయాడు గోపాలం.

కూర్చున్న చోటి నించి చటుక్కున లేచి చేతుల్ని గబగబా ఊపుతూ పెద్దకంఠంతో అతనికి అర్థంకాని మంత్రాలు ఏవేవో చదివాడు గురువుగారు. చూస్తూ చూస్తూండగానే కరాళశక్తి విగ్రహం ఎదుట సుడులు తిరుగుతూ ప్రత్యక్షం అయింది ఒక ధూమ స్తంభం....

"తిను.... నీకోసం సిద్ధంచేసిన నైవేద్యాన్ని తిని నా పని చేసిపెట్టు... రా..." ఖంగుమంటున్న కంఠంతో బిగ్గరగా అన్నాడు గురువుగారు. సుడులు తిరుగుతున్న పొగలోనుంచి నెమ్మదిగా ఇవతలికి వచ్చింది ఒక చేయి....

గోపాలం తీసుకువచ్చి పెట్టిన విస్తరిమీది రక్తాన్నం మొత్తాన్ని గుప్పిటపట్టి మాయం అయింది.

“పాడుపడిన మేడలోని ఆత్మస్వరూపాన్ని అర్థంకాని శక్తి తరంగం ఒకటి కాపలా కాస్తోంది... నువ్వు ఆ శక్తి తరంగం సంగతి చూసుకో.... నేను ఆ ఆత్మస్వరూపాన్ని ఆకర్షించి నా వశం చేసుకుంటాను... సరేనా?” ముందుకీ వెనక్కీ ఊగుతూ అన్నాడు గురువుగారు.

సుడులు తిరుగుతున్న పొగలో ఏ ఆకారం వున్నదో, అది ఏమని సమాధానం ఇచ్చిందో గోపాలానికి అర్థంకాలేదు.... అతను చూస్తూ వుండగానే గిర్రున పక్కకు వంగినట్లే వంగి ఆకాశంలోకి వెళ్ళిపోయిందా పొగ...

“ఏళ్ళతరబడి మంత్రోపాసన చేసినందుకు సగం ఫలితం ఈరోజు రాత్రికి కనిపించబోతోంది. కంటపడిన వారందర్నీ నెత్తి పగలగొట్టి అవతలికి తరిమే ఆ శక్తితరంగం నేను ప్రయోగించిన బంధకిని ఎలా అడ్డుకుంటుందో చూస్తాను” అంటూ గోపాలానికి సైగ చేశాడు గురువుగారు “చీకటి పడగానే పాడుపడిన మేడ దగ్గరికి పోవాలి. సిద్ధంగా వుండు” అని చెప్పి కుంకుడుచెట్టు వెనకాల, అచేతనంగా పడివున్న శివయ్య పక్కనే పడుకుని క్షణాలమీద నిద్రలోకి జారిపోయాడు.

తమ ట్రంకుపెట్టెని తెరిచి, పెద్ద సీసాని తీసి గోపాలానికి ఇచ్చింది వెంకటమ్మ. సన్నగా, పొడుగ్గా ఎముకల మాదిరి వున్న ఏవో రెండు పుల్లల్ని కట్టకట్టి చిన్న గుడ్డసంచీలోకి నెట్టింది. “సీసాని జాగ్రత్తగా చూసుకో... ఖర్మకాలి పగిలిపోయిందంటే, నీ తల కూడా అలాగే పగిలిపోతుంది గురువుగారు కొట్టే దెబ్బలకి. జాగ్రత్త సుమా....” అని హెచ్చరించిందామె.

అప్పటికప్పుడు వంటచేసి ఆమె వడ్డించిన అన్నం తిన్నాడు గోపాలం. కుంకుడుచెట్టుకు దూరంగా కూర్చుని వెయిట్ చేశాడు. చీకటి పడిన అర్థగంటకు చాపమీదినించి లేచి, వెంకటమ్మ అందించిన గుడ్డ సంచీని భుజానికి తగిలించుకుని అడవిలోకి దారితీశాడు గురువుగారు.

“జాగ్రత్త... గురువుగారికి కోపం తెప్పించే పనులు చేయమాకు. ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడు....” కొంచెం దూరం వెనకాలే వచ్చి గోపాలాన్ని రహస్యంగా హెచ్చరించి వెనక్కి వెళ్ళిపోయింది వెంకటమ్మ.

మూడు గంటలపాటు ఎక్కడా ఆగకుండా నడిచిన తర్వాత గురుశిష్యుల ఎదుట ప్రత్యక్షం అయింది పాడుపడిన మేడ.... తుప్పుపట్టి విరిగిపోయిన మెయిన్ గేట్ ఎదురుగా నేలను శుభ్రం చేసి, తను తీసుకొచ్చిన సంచిలోనుంచి ఎముకలవంటి పుల్లల్ని నక్షత్రాకారంలో పేర్చాడు గురువుగారు... బాసిపట్టు వేసుకుని మంత్రపఠనం మొదలుపెట్టాడు. ఖచ్చితంగా నలభైనిముషాల తరువాత పాడుపడిన మేడలోనుంచి బయటికొచ్చింది ఒక ఆత్మస్వరూపం. “ఎవరు? నన్ను పిలుస్తోంది ఎవరు? ఎందుకు పిలుస్తున్నారు?” ఆందోళన నిండిన కంఠంతో అడుగుతూ మెయిన్ గేటు వైపు చూసింది.

“వస్తోంది.... గురువుగారూ ఆ రూపం మన దగ్గరికి వచ్చేస్తోంది” విపరీతమైన సంతోషంతో గురువుగారికి రిపోర్టు చేయబోతూ, ఆ మాటల్ని ఠక్కున తనలోనే అదుముకున్నాడు గోపాలం. పట్టెడు లావున్న పెద్ద కొండచిలువ మాదిరి తెల్లటి శక్తితరంగం, బయటికి రాబోతున్న ఆత్మ స్వరూపాన్ని బలవంతంగా వెనక్కి నెట్టి, పాము మాదిరిగానే తమకేసి రావటం అతనికి కనిపించింది.

“గురువుగారూ.... వచ్చేస్తోంది.... ఆ శక్తి భూతం మన మీదికి వచ్చేస్తోంది.” ఆందోళన నిండిన కంఠంతో అరిచాడతను. వేగంగా గేటును దాటిన శక్తితరంగం దారికి సడన్ గా అడ్డం పడింది అంతకుముందు కరాళశక్తి విగ్రహం దగ్గర అతను చూసిన ధూమ స్తంభం.

ముదుకొచ్చే ఆలోచనను మాని పాములా ఆ ధూమ స్తంభాన్ని చుట్టుకోవటానికి ప్రయత్నం చేసింది శక్తితరంగం. చిక్కినట్లే చిక్కి అల్లంత దూరం వెళ్ళిపోయింది ధూమ స్తంభం. పట్టినట్టు వదలటం తనకు అలవాటు లేనట్టు దాన్ని వెంబడించింది శక్తి తరంగం.

అరమూసిన కనులతో అదేపనిగా బిగ్గరగా మంత్రాలు చదువుతున్న గరువుగారి పెదవుల మధ్యనుంచి సడన్ గా వెలువడింది వికటమయిన నవ్వు.

“బంధకి గెలిచింది. బంధకి నా కోరికను తీర్చింది” అంటూ బిగ్గరగా అరుస్తూ పాడుపడిన మేడవైపు చేయి జాపి, “రావే.... బయటికి రా” అని ఆజ్ఞ యిచ్చాడు.

వెన్ను మీద చేయివేసి ఎవరో బడబడా నెడుతున్నట్టు తూలుకుంటూ అతని దగ్గరికి వచ్చేసింది మేడలో వున్న ఆత్మస్వరూపం. గోపాలం దగ్గర వున్న సీసా మూత తీసి దానికేసి చూపించాడు గురువుగారు.

వికృతంగా ధ్వనించే మంత్రం ఏదో చదివాడు. తన ఇష్టంతో నిమిత్తంలేనట్టు అటూఇటూ తూలి, వున్నట్లుండి ఆ సీసాలోని జొరబడింది ఆత్మ స్వరూపం.

చటుక్కున మూత బిగించి ఆ ప్రదేశం దద్దరిల్లిపోయేటట్టు నవ్వుతూ పైకిలేచాడు గురువుగారు.

“మన మకాం దగ్గరికి వెళ్ళిపోదాం. త్వరగా వెళ్ళిపోవాలి....” అంటూ పరుగులాంటి నడకతో ప్రయాణం మొదలుపెట్టాడు. ఆత్మస్వరూపం పాడుపడిన మేడని దాటి ఇవతలికి అడుగుపెట్టిన మరుక్షణం, బంధకిని తరమటం ఆపి వెనుతిరగబోయింది శక్తితరంగం. అంతవరకూ దానికి లొంగకుండా దూరంగా పోతున్న ధూమ స్తంభం వెంటనే ఆ తరంగాన్ని ఆవరించుకున్నది.

అతి కష్టంమీద వదిలించుకోగలిగింది శక్తి తరంగం తనను చుట్టుముట్టిన ధూమ స్తంభాన్ని. రెట్టించిన వేగంతో పాడుపడిన మేడ దగ్గరికి వచ్చేసింది.

అప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది. ఆత్మస్వరూపాన్ని బంధించిన సీసాతో ఆ చుట్టుపట్ల ఎక్కడా లేకుండా దూరంగా వెళ్ళిపోయాడు గురువుగారు.

***

కుంకుడు చెట్టుకు దూరంగా కూర్చుని కునికిపాట్లు పడుతున్న వెంకటమ్మ, పరుగులాంటి నడకతో వచ్చిన గురువుగారిని చూసి అదిరిపడి పైకి లేచింది.

“బంధకి మన కార్యాన్ని సిద్ధింపచేసింది. నా జీవితాశయం నెరవేరే రోజు దగ్గర్లోకి వచ్చేసింది. అష్ట దిగ్బంధనం చేయాలి వెంకటమ్మా! అన్యశక్తులు నా ఏకాగ్రతను భగ్నం చేయకుండా ఈ ప్రదేశాన్ని మంత్రపూరితం చేసేయాలి” అంటూ తన దగ్గరున్న సీసాని ఆమె చేతికిచ్చాడు గురువుగారు. అందులోంచి బయటపడటానికి ప్రయత్నిస్తున్న రూపాన్ని విచిత్రంగా చూస్తున్న వెంకటమ్మను చాలా ఖచ్చితమైన మాటలతో హెచ్చరించాడతను.

“చాలా జాగ్రత్త.... ఈ రూపం తప్పించుకుంటే ఇక మన చేతికి చిక్కదు. ఇప్పటివరకూ పడిన శ్రమ అంతా వృధా అయిపోతుంది. ట్రంకు పెట్టెలో పెట్టి జాగ్రత్తగా చూసుకో....” అంటూ నీటిగుంటవైపు వెళ్ళిపోయాడు.

అతని వెనుకే వచ్చిన గోపాలం వైపు ప్రశ్నార్థకంగా చూసింది వెంకటమ్మ. పాడుపడిన మేడ దగ్గర జరిగింది ఆమెకు వివరంగా చెప్పాడు గోపాలం.

“బంధకి వెంటపడిన శక్తితరంగం మనల్ని వెతుకుతూ వస్తుందని గురువుగారికి అనుమానం కలిగింది. అందుకే యీ ప్రదేశాన్ని అష్టదిగ్భంధన, చేయాలంటున్నారు....” అంటూ సీసాని ట్రంకుపెట్టెలో భద్రపరిచిందామె.

నీటి గుంటలో మునిగి తడి దుస్తులతోనే వచ్చి, పెద్ద కంఠంతో ఏవో మంత్రాలు చదువుతూ కుంకుడు చెట్టు చుట్టూ రెండు రౌండ్లు కొట్టాడు గురువుగారు.

“మనం తీసుకొచ్చిన ఆత్మస్వరూపాన్ని బలి మానవుడి శరీరంలోకి ప్రవేశపెట్టాలి. అందుకు కాస్తంత శ్రమపడాలి. నా జపం పూర్తి అయ్యేవరకూ నన్ను ఎవరూ పలుకరించకండి” అని వెంకటమ్మకి, గోపాలానికి జాగ్రత్తలు చెప్పి మట్టి వేదిక దగ్గర కూర్చున్నాడు.

***

“పాండు ఏడి? ఎక్కడ వున్నాడు?” రాత్రి పదకొండు గంటల సమయంలో పెద్దయ్య దగ్గర్నించి దివాణంలోకి వస్తూ ముఖద్వారం దగ్గరే కూర్చుని వున్న చిలకమ్మని అడిగాడు రవిబాబు.

“పొద్దుట బయటికి వెళ్ళాడుగదా.... మళ్ళీ తిరిగి రాలేదు... అతని కోసమే చూస్తున్నా....” అందామె.

“పొద్దుట వెళ్ళినవాడు ఇంకా రాకపోవటమేమిటి...?” ఆశ్చర్యం, ఆందోళన కలగలిసిన కంఠంతో అంటూ మెయిన్ గేటు దగ్గరికి పోయాడు రవిబాబు.

“మీ స్నేహితుడి కోసం ఖంగారుపడకండి బాబూ... ఆయన మన కొండలమ్మ తల్లి దగ్గరికి పోయాడు. బహూశా ముసలయ్యతో మాట్టాడుతూ అక్కడే వుండి వుంటాడు....” చెప్పాడు గేటు దగ్గర వున్న వ్యక్తుల్లో ఒకతను.

“ఈ పాండు పెద్ద మొండిఘటం. నాకు చెపితే నేనూ వచ్చేవాడిని. పెద్దయ్యతో మాట్లాడుతూ కూర్చున్నాను. టైమ్ తెలీలేదు...” విసుగ్గా అంటూ వెనుతిరగాడతను.

“బాబూ... ఇందాక సాయంత్రం మీ కోసం ఎవరో అమ్మాయి ఫోన్ చేసింది. పేరు అపూర్వ... మీరు గదిలోనే వున్నారనే అనుకుని రిసీవర్ ని పక్కన పెట్టేశాను. మీరు పెద్దయ్య దగ్గర్నించి రాలేదని నాకు తెలియదు. పాపం ఆ అమ్మాయి చూసి చూసి విసుగుపుట్టి ఫోన్ దగ్గర్నించి వెళ్ళిపోయివుంటుంది....” ఒక గంట తర్వాత తను పక్కన పెట్టిన రిసీవర్ ని తిరిగి ఫోన్ మీదికి చేర్చటాన్ని గుర్తు తెచ్చుకుంటూ అతనికి చెప్పింది చిలకమ్మ.

“నీకు బుద్ధిలేదు. నా గదిలోకి చూస్తే నేను వున్నానో లేదో తెలిసేది. పెద్దయ్య దగ్గరికి వచ్చి చెపితే నీ కాళ్ళు నొప్పులు పుడతాయా? రాను రాను నీకు

బద్ధకం ఎక్కువవుతోంది. ఏమని చెప్పింది తను?" విపరీతమైన కోపం వచ్చి తనను ఆవరించకుంటూ వుండగా అడిగాడు.

"ఏమీ చెప్పలేదు బాబూ. మిమ్మల్ని పిలవమని చెప్పిందంతే" చిన్న కంఠంతొ చెప్పి అవతలికి వెళ్ళిపోయిందామె.

పెద్దపెద్ద అడుగులువేస్తూ ఫోన్ దగ్గరికి పోయాడు రవిబాబు. ఇప్పుడు టైమ్ ఎంతైందో చూసుకో. ఇప్పుడు ఫోన్ చేస్తే ఆ పిల్లతండ్రికి తెలిసిపోతుంది. ఆమెని అనవసరమైన ఇబ్బందుల్లోకి నెట్టటం జరుగుతుంది. సోఫాలో కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటున్న దొరగారు కామ్‌గా అనేసరికి, ఆగిపోయాయి అతని అడుగులు.

"అపూర్వ ఫోన్ చేసిందట నాన్నగారూ. తను నాకు ఏదో చెప్పటానికి చేసి వుంటుంది" అంటున్న అతని ముఖంలోకి చూస్తూ చిన్నగా నవ్వారాయన.

"ఏదో చెప్పటం కోసమే ఎవరయినా ఎవరికో ఒకరికి ఫోన్ చేస్తారు. ఇందులో చిలకమ్మ తప్పేమీ లేదు. ఫోన్స్ వస్తే నీకు కబురు పంపించమని నువ్వు తనకి చెప్పి పెద్దయ్య దగ్గరికి వెళ్ళి వుండాల్సింది. ఆ పని చేయకపోవడం నీ తప్పు" అన్నారాయన.

ఫోన్ వంకా, ఆయన వంకా అసహానంగా చూసి మళ్ళీ దివాణం వెలుపలికి వచ్చాడు రవిబాబు. తన దగ్గరవున్న సెల్‌ని బయటికి తీసి అపూర్వ సెల్ నెంబర్ని ప్రెస్ చేశాడు.

ఈసారి సిగ్నల్ బాగానే వున్నది కాని ఆమె ఫోన్ స్విచాప్ చేసి వున్నట్లుగా తెలిసివచ్చింది అతనికి.

విసుగ్గా తల విదిలించి తన సెల్ ఫోన్‌ని ప్యాంటుజేబులోకి నెట్టుకుంటూ వుండగా, కనపడీ కనపడనట్టుగా అతని దృష్టి పథంలోకి వచ్చి వెంటనే మాయం అయింది ఒక ఆకారం. ఎవరది? ఎవరు? ఖంగుమంటున్న కంఠంతో అడిగాడు అతను.

వెంటనే గేటు దగ్గర్నించి పరిగెత్తుకుంటూ వచ్చారు అక్కడ. కాపలా నిలబడిన వ్యక్తులు. బాణాకర్రల్ని సిద్ధంగా పట్టుకుని అవుట్ హౌస్ దగ్గరా, దివాణం పక్కభాగాల్లోను వెతికి వెతికి వట్టిచేతులతో వెనక్కి మరలారు.

"ఎవరో నిలబడినట్టు అనిపించింది. తదేక దీక్షగా నావంకే చూస్తున్నట్లు కనిపించింది" సాలోచనగా అంటున్న రవిబాబు భుజం తట్టి స్వయంగా స్వహస్తాలతో కొండలమ్మ తల్లి దగ్గర్నించి తెచ్చి వుంచిన కుంకుమను అతని ముఖానికి బొట్టుగా పెట్టారు దొరగారు. "అడవిలో అటూ ఇటూ తిరిగారు కదా నువ్వు, నీ స్నేహితుడు.... గాలి, ధూళివంటివి మీ వెంట వచ్చి వుంటాయి. మరేం ఫరవాలేదు పోయి పడుకో" అని ఆదేశించారు. కొండలమ్మ తల్లి దగ్గరకెళ్ళిన పాండును గురించి ఆలోచనలు మొదలుపెట్టాడు రవిబాబు. తనూ అక్కడికిపోతే బాగుంటుందేమో అని అనుకుంటున్నాడు. దొరగారి మాటలకు ఎదురుచెప్పటం ఇష్టంలేక, నెమ్మదిగా తన గదిలోకి పోయి పందిరి మంచంపై పడుకున్నాడు.

ఐదు నిముషాలు ఆగాక నెమ్మదిగా ఆ గదిలోకి ఎంటరైంది అంత వరకూ దూరదూరంగా తిరుగుతున్న రాజశేఖర్ ఆత్మ స్వరూపం. అడుగులో అడుగు

వేస్తూ అతని దగ్గరికి రాబోయింది. టేబిల్ మీద కొండలమ్మ తల్లి ఫోటోలోంచి సూటిగా వచ్చి అతని గుండెలకు తాకింది తెల్లటి కిరణం. లాగిపెట్టి ఎవరో బలంగా కొట్టినట్లు తల్లకిందులుగా పల్టీలు కొడుతూ గది బయటవున్న మెట్లమీద పడింది ఆ స్వరూపం. మెట్లమీది నుంచి దొర్లుకుంటూ పోయి హాల్లో పడింది.

అక్కడి నుంచి ఎవరో మెడపట్టుకుని గాల్లోకి లేపినట్టు పైకిలేచి విమానంలా దివాణం ఆవరణదాటి అడవిలోకి ఎగురుకుంటూ వెళ్ళిపోయింది.

***

"ఈ కొండలమ్మ తల్లికి మీ దొరగారన్నా, ఆయన దివాణం అన్నా అభిమానమని నాకనిపిస్తోంది...." కొండలమ్మ తల్లి విగ్రహాన్ని చూస్తూ కామెంట్ చేశాడు పాండు.

"అవును బాబూ... పూజలు, పునస్కారాలు లేక ఈ అడవిలో పడి వుంటున్న సమయంలో దొరగారి పూర్వీకులు భక్తిశ్రద్ధలతో పూజలు మొదలుపెట్టారట. అందుకనే కాబోలు ఈ తల్లికి దొరగారి కుటుంబమంటే వల్లమాలిన ఆపేక్ష" చేతులు జోడించి ఆ దేవతకు నమస్కరిస్తూ చెప్పాడు ముసలయ్య.

"అర్థరాత్రి దాటిపోతోంది... కాస్సేపు పడుకుంటే బాగుంటుంది. తెల్లవారగానే తల్లికి నమస్కారం చేసుకుని దివాణం దగ్గరికి తిరిగిపోవచ్చు" కాస్తంత గట్టిగానే ఆవలిస్తూ అన్నాడు.

"ఇవ్వాళ మీ దొరగారు నాకు, రవిబాబుకి వాళ్ళ వంశం గురించి వాళ్ళ దగ్గర్నించి మాయం అయిన అష్టసిద్ధి యంత్రాన్ని గురించి చెప్పారు. అది

మాయమైపోవటంవల్ల వచ్చిపడిన కష్టాల్ని వింటుంటే కడుపు తరుక్కుపోయినట్లు అనిపించింది.'' బీడీ పొగను గుండెలనిండా పీల్చుకుంటూ అన్నాడు పాండు. దీర్ఘంగా నిట్టూర్చి తల విదిలించాడు ముసలయ్య. ''పెద్దాయన మాట్లాడేటప్పుడు అడ్డు తగలటం పద్ధతిగా వుండదని నోరు విప్పలేదుగాని ఆయన చెప్పిన కథలో నాకో అనుమానం కలిగింది'' బీడీ కొసను వేలితో తట్టి నుసిని కిందికి విదిలిస్తూ అన్నాడు పాండు.

''దొరగారి మాటల్లో నీకు అనుమానం కలిగిందా? ఏమిటది?'' ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు ముసలయ్య.

''అష్టసిద్ధి యంత్రానికి అవమానం జరగటంవల్ల కీర్తిరాయుడి వంశం తన వైభవాన్ని కోల్పోయిందనీ, ఆడవాళ్ళకు తమ బిడ్డల పెంపకంలోని ఆనందం దక్కటం లేదని, సంపదలన్నీ మాయమై బికారులైపోయారని దొరగారు బాధపడ్డారు. మరి ప్రస్తుతం మీ దొరగారు బికారి కారు. వారి వంశం కూడా చక్కగా కొనసాగుతూ వస్తోంది. పుట్టింది ఒకరే అయినా ప్రతి తరంలోనూ నిక్షేపంగా పెరిగి పెద్దవాళ్ళు అవుతున్నారు. అష్టసిద్ధి యంత్రం పెట్టిన శాపమేమైనట్టు?'' మూడొంతులు కాలిన బీడీని అవతరకు విసురుతూ అడిగాడు పాండు.

అష్టసిద్ధి యంత్రం ప్రసక్తి వచ్చిన మరుక్షణం మ్లానమయిపోయిన ముసలయ్య ముఖంలో వెంటనే ప్రత్యక్షం అయింది కొద్దిపాటి కాంతి.

''మంచి ప్రశ్ననే అడిగావు బాబూ, ఖచ్చితంగా నీవంటి చురుకైన మనిషికి ఈ అనుమానం వచ్చి తీరుతుంది. అష్టసిద్ధి యంత్రం సామాన్యమైంది కాదు.

దాన్ని అవమానపరచటంవల్ల దొరగారి వంశానికి దుర్భర దారిద్ర్యం చుట్టుకున్న మాట అబద్ధం కాదు. యదార్థమే. అయితే కీర్తిరాయుడి వారసుల్లో ఇప్పుడు వున్న మా దొరగారి ముత్తాతకు తాత అయిన వీరభద్రరాయుడిగారి కాలంలో బతుకుతెరువు కోసం ఇదిగో ఈ తల్లి కొలువైవున్న ఈ అడవిలోకి వచ్చారట. ఇక్కడ ఈ తల్లిని చూసి పూజలు చేశారట, ఈ గట్టుచుట్టూ పెరిగిన ముళ్ళపొదల్ని పాముపుట్టల్ని తొలగించి స్వయంగా తమ చేతులతోనే ఈ గట్టును నిర్మించారట.

వారి పూజలకు, వారి సేవలకు ప్రీతిపొందింది కాబోలు ఈ కొండలమ్మతల్లి. ఆ అష్టసిద్ధి యంత్రం పెట్టిన శాపంలో కొంత భాగాన్ని వారి తలల మీదినించి తప్పించిందట... గుడిసె వేసుకోవటానికి నేలను తవ్వుతుంటే వజ్రాల భాండం, నవరత్నాలతో నిండివున్న మందసం, రత్నాలు, గోమేధికాలు కలగలిపివున్న పెద్ద ట్రంకుపెట్టె లభించాయట. అప్పటి నుంచీ దొరగారి వంశీయులు అందరూ ఈ ప్రదేశంలోనే నివసించటం మొదలుపెట్టారు. ఒక్క కీర్తిరంగరాయుడు తప్ప...'' అంటూ మాటల్ని ఆపాడు ముసలయ్య.

‘‘కీర్తిరంగరాయుడా? అతనెవరు?'' అడిగాడు పాండు.

‘‘వీరభద్రరాయుడికి ఇద్దరు మగపిల్లలు... వారిలో ఒకతను మా దొరగారి లైనుకు మూలం. రెండో మనిషి కీర్తిరంగరాయుడు.... తన వంతున వచ్చిన సంపదతో ఈ ప్రదేశాన్ని వదిలి దూరంగా వెళ్ళిపోయాడు....

అతని వంశంలోనే పాండురంగరాయుడు అనే మనిషి పుట్టాడు. జూదాన్ని మరిగి, వ్యసనాలకు బానిసై ఆస్తి మొత్తాన్ని నాశనం చేసుకున్నాట్ట... తన దగ్గర వున్న ఒకే ఒక వజ్రాన్ని మా దొరగారి పెద్దల కిచ్చి తన వారసులు ఎవరైనా వస్తే

వారికందించమని ఇంకెటో వెళ్ళిపోయాట్ట. దొరగారి తండ్రి ఆ వజ్రాన్ని అమ్మి ఆ డబ్బును అతని వారసులకోసం బ్యాంకులో వేశారు. దగ్గరగా నాలుగైదు కోట్లకు చేరి వుంటుంది అది. వారసుల కోసం ఎదురు చూస్తూ బ్యాంకులో పడి మూలుగుతోంది."

"విచిత్రంగా వుంది. నమ్మబుద్ధి కావటంలేదు...." ఆశ్చర్యంగా చూస్తూ తనలో తను అనుకుంటున్నట్టు పైకే అనేశాడు పాండు.

ముసలయ్యకు సరిగ్గా అర్థంకాలేదా మాటలు "ఏమంటున్నావు బాబూ?" అని అడిగాడు వెంటనే.

ఉలిక్కిపడినట్లు అటూ ఇటూ కదిలి, అంతలోనే సర్దుకున్నాడు పాండు.

"కొండలమ్మతల్లికి వున్న శక్తి అత్యద్భుతమనిపిస్తోంది. ఈ తల్లిని మొట్టమొదట ఎవరు ప్రతిష్టించేరు?" తన తడబాటు ముసలయ్యకి కనిపించకుండా నేర్పుగా మాట మార్చాడు.

"నాకు సరిగ్గా తెలియదు బాబూ! వీరభద్రరాయుడుగారు ఇక్కడకు వచ్చిన కాలంలో కొంతమంది కోయలు ఈ అడవిలో నివసిస్తూ వుండేవాళ్ళట. బహుశా వాళ్ళల్లో ఎవరో ఈ తల్లిని తయారుచేసి వుంటారు.

నాలుగొందల సంవత్సరాల క్రితం ఒకసారి ఆకాశంలో ఏదో తోక చుక్క కనిపించిందని, అది సూటిగా వచ్చి ఈ తల్లి దగ్గర నేలనుతాకి మళ్ళీ ఆకాశంలోకి వెళ్ళిపోయిందని, అప్పటినుంచే ఈ తల్లికి అమోఘమైన శక్తులు కలిగాయనీ ఆ

కోయలు వీరభద్రరాయుడుగారికి చెప్పారట. నిజం ఏమిటో ఎవరికీ తెలియదు" పురాణ కథను చెపుతున్నట్టు సాఫ్ సీదాగా చెప్పాడు ముసలయ్య.

పాండుకి మాత్రం ఝల్లుమంది ఒళ్ళు.

"నాలుగొందల సంవత్సరాలక్రితమా...? నిజమేనా?" అని ఆశ్చర్యంగా అడిగాడు పాండు.

"ఆనోటా ఈనోటాపడి నావరకూ వచ్చినమాట నీకు చెప్పాను. అని నిజమో కాదో నాకు ఎలా తెలుస్తుంది బాబూ?" ఎదురు ప్రశ్న వేశాడు ముసలయ్య.

"అప్పుడు ఆ కాలంలో చుట్టుపట్ల నివసించిన కోయలకు సంబంధించినవాళ్ళు ఇప్పుడు ఎవరయినా జీవించి వున్నారా?" అడిగాడు పాండు.

"ముచ్చింతల గట్టు దగ్గర పది పన్నెండు కుటుంబాలు అడవిని ఆశ్రయించుకుని బతుకుతున్నాయి. బతుకు తెరువుకోసం వాళ్ళు కూడా అడవిని వదిలి బళ్ళారివైపు వెళ్ళిపోయారేమో తెలియదు" చెప్పాడు ముసలయ్య.

"అవును ముసలయ్యా... ఎప్పుడో అవతలికి వెళ్ళిన పాండురంగరాయుడి వారసుల కోసం బ్యాంకులో డబ్బు మూలుగుతోందని అన్నావు ఇందాక. అతని వారసులు ఎవరైనా వస్తే మీ దొరగారు వాళ్ళనెలా గుర్తుపడతారు?"

"చాలా తేలిక బాబూ... అదేమంత కష్టతరమయిన పనికాదు. మా దొరగారి వంశస్థులందరికీ కుడిభుజం మీద ఒక పుట్టుమచ్చ వుంటుంది. అష్టసిద్ధి యంత్రం మాదిరిగానే వుంటుంది. దొరగారికి వుంది. రవిబాబుకి ఉంది. వాళ్ళ

పెద్దలందరికీ వుంది. పాడైపోయిన పాండురంగరాయుడి వారసులకు కూడా అది ఉండి తీరాలి. అంతే....” అంటూ బిగ్గరగా ఇంకోసారి ఆవులించి కొండలమ్మతల్లి గట్టుమీదే మేనువాల్చాడు ముసలయ్య.

అతను నిద్రలోకి జారిపోయాడని నికరంగా తేలేవరకూ ఆగి, అక్కడినుండి అతని గుడిసెలోకి పోయాడు పాండు. ఒకమూలగా గోడకు తగిలించివున్న చిన్న అద్దాన్ని బయటికి తీసుకువచ్చి తన భుజం మీది నుంచి షర్టును తొలగించి చూసుకున్నాడు.

అంతకుముందు చాలాసార్లు గమనించాడతను, భుజపు టెముకకు పైన చక్రాకారంలో వున్న పుట్టుమచ్చని. ముసలయ్య మాటల్ని విన్న తరువాత మరింత స్పష్టంగా కనిపించింది అది. అతని ఒళ్ళు తెలియకుండానే ఇంకోసారి ఝల్లుమంది.

***

నులకమంచంమీద పడుకుని వున్న పిచ్చిమామ్మ, ఒళ్ళు జలదరించే కల ఏదో వచ్చినట్లు కంగారుగా అరిచి మంచం మీదినించి పక్కకు దొర్లి దభీమని కిందపడటం కనిపించింది రంగమ్మకి.

“అయ్యయ్యో... ఏంటది మామ్మా? దెబ్బతగిలిందా?” అని అడుగుతూ రెండు అంగల్లో దగ్గరికిపోయి, ఆమెను పైకి లేపింది.

గట్టిదెబ్బే తగిలింది మామ్మకి. కళ్ళవెంట గిర్రున తిరుగుతున్న నీటిని అతి బలవంతంగా అదుముకుంటూ మంచంమీద కూర్చుంది.

“నా తల్లి కనిపించిందే.. పకాపకా నవ్వింది. పట్టుకోవటానికి పరిగెత్తబోతూ కాలుజారి పడిపోయాను” అంటూ చటుక్కున మాటల్ని ఆపి రంగమ్మ ముఖంలోకి పరిశీలనగా చూసింది.

“ఏంటి మామ్మా? నావంక అలా కొత్తగా చూస్తున్నావేంటి?” అంది రంగమ్మ.

“ఆదమరిచి నిద్రపోతూ వుండాల్సిన ఈ అర్ధరాత్రి సమయంలో నువ్వు మెలకువగా వున్నావేమిటి? నిద్రరావటం లేదా?” అడిగింది మామ్మ.

మూడీగా వున్నది రంగమ్మ ముఖం. మరింత మూడీగా మారిపోయింది ఆ మాటల్ని వినేసరికి.

“నీకు ఆ ముట్టెపొగరు మగాడు గుర్తుకువచ్చాడు. అవును కదూ?” అడిగింది పిచ్చిమామ్మ.

కిందిపెదవిని మునపళ్ళతో నొక్కుకుంటూ తలను పక్కకు తిప్పుకుంది రంగమ్మ.

“మనసులో మాటను చెప్పుకోవటానికి నీకు సిగ్గెందుకే పిచ్చినాతల్లీ? మనసయిన మగాడు మధ్యరాత్రిలో గుర్తుకురావటంలో తప్పు ఏమీలేదు. వాడు, ఆ ముట్టెపొగరు మగాడు తొందర్లోనే వచ్చేస్తాడు. పోయి హాయిగా పడుకో” అని ఆమెను అనునయించింది మామ్మ.

“తర్వాత పడుకుంటాను. నాకు నిద్ర రావటంలేదు.”

“ఒసి నీ భ్రమతని దొంగలు ఎత్తుకుపోనూ! నాలుగురోజులైనా కాలేదు ఆడు అవతలికిపోయి. అప్పుడే బాధపడితే ఎలాగే?” ఆశ్చర్యంగా అడిగింది.

“నీకు తెలియదు మామ్మా! పాండు వట్టి పొగరుబోతు. ఏ క్షణంలో ఎవరితో పోట్లాట పెట్టుకుంటాడో, ఏ అఘాయిత్యం చేస్తాడో తనకే తెలియదు. కొత్తచోట్లో ఎవరితో గొడవలు పడుతున్నాడోనని నా భయం....” ఉండబట్టలేక మనసులో మాటని బయటపెట్టుకుంది రంగమ్మ.

“ఒసినీ.... పెళ్ళి చేసుకోకముందునుంచే ఇలా బెంగపెట్టుకుంటే ఎలాగే....? పెళ్ళి అయిన తర్వాత వాడిని అసలు గడపదాటి బయటికి పోనివ్వవు కాబోలు. ఇంతకీ నీ బాధ.... వాడు ఏం చేస్తున్నాడోననేగా! వాడు ఇప్పుడు ఏం చేస్తున్నాడో తెలిస్తే హాయిగా నిద్రపోతావా?” మంచం మీద సర్దుకు కూర్చుంటూ అన్నది మామ్మ.

“వాడు ఎక్కడ వున్నాడో, ఏం చేస్తున్నాడో ఎలా తెలుస్తుంది?” అమాయకంగా అడిగింది రంగమ్మ.

“నీ దగ్గరున్న సత్తుపళ్ళాన్ని తీసుకువచ్చి ఇక్కడపెట్టు. నిండా నీళ్ళుపోసి లాంతరుని పెద్దదిచేయి.....” అంటూ ఆమెని ఆజ్ఞాపించింది మామ్మ.

“పళ్ళేమా? నీళ్ళా?” అయోమయంగా అడిగింది రంగమ్మ.

“అవును పళ్ళేమే. త్వరగా తీసుకురా వెళ్ళు” ఉన్నట్లుండి కటువుగా మారిన కంఠంతో కాస్తంత బిగ్గరగా అన్నది మామ్మ.

అయోమయంగానే వెళ్ళి సత్తుపళ్ళాన్ని తెచ్చి మంచం దగ్గర పెట్టింది రంగమ్మ. పళ్ళెం నిండా నీళ్ళు పోసింది, మామ్మ చెప్పినట్టే కిరోసిన్ లాంతరుని పెద్దది చేసింది.

మంచంకింద పెట్టిన తన చేతికర్రను అందుకుని పళ్ళెం చుట్టూ తిప్పింది మామ్మ. రంగమ్మకి అర్థంకాని మాటల్ని చాలా వేగంగా ఉచ్చరించింది.

“రారా... త్వరగా రారా ముట్టెపొగరు మగాడా! వెంటనే వచ్చి మా రంగమ్మకి కనిపించు. రా....” అంటూ హూంకరించింది.

చలనం లేకుండావున్న నీళ్ళల్లో వెంటనే వచ్చింది కదలిక. సుడిగుండం ఏర్పడినట్టు గిర్రున తిరిగాయి అవి. ఉన్నట్లుండి రంగమ్మకి కనిపించాడు పాండు.

ముసలయ్య గుడిసెలో నుంచి తీసుకువచ్చిన అద్దంలో తన భుజం మీది మచ్చని చూసుకుంటున్నాడు.

“ఏంటదీ? ఏమిటి చూసుకుంటున్నాడు?” అంటూ మామ్మని ఆశ్చర్యంగా అడిగింది రంగమ్మ.

“తన అందం చూసుకుంటున్నాడు అర్థరాత్రివేళ అద్దం పట్టుకుని నిలబడటం అందుకే...” చిన్నగా నవ్వుతూ అన్నది మామ్మ. ఆ మాటలు నవ్వుతూనే అన్నదిగాని, ఆమె కళ్ళవెంట అదేపనిగా కారటం మొదలుపెట్టిన భాష్పధారల్ని రంగమ్మ గమనించలేదు.

"ఎక్కడ వున్నాడు? అదేదో అడవి మాదిరిగా వున్నదే...?" అంటూ ముందుకు వంగి నీటిలో కనిపిస్తున్న పాండును ముట్టుకోవటానికి ప్రయత్నం చేసింది ఆమె.

చటుక్కున మాయం అయిపోయింది కనిపిస్తున్న దృశ్యం.

"మంత్ర ప్రయోగం పట్టు తప్పింది. కావాలంటే రేపు ఇంకోసారి చూపిస్తాను. వాడు క్షేమంగానే వున్నాడని తెలిసిందిగదా. పోయి పడుకో" రంగమ్మ చూడకముందే కళ్ళు తుడుచుకుంటూ చెప్పింది మామ్మ.

"మామ్మా... నీకు మంత్రాలు వచ్చా?" ఆమె వంక ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది రంగమ్మ.

"మేలు చేసే మంత్రాలు మాత్రమే కొద్దిగా వచ్చు తల్లీ. నీ బాధను చూడలేక నా గురించి బయట పెట్టుకున్నాను. ఎవరికైనా చెప్పావంటే నన్ను ఊళ్ళో నుంచి వెలివేస్తారు. చెపుతావా?" ఆందోళనగా చూస్తూ అడిగింది మామ్మ.

"నీకు మంత్రాలు వచ్చని పాండుకి తెలుసా?"

"తెలుసో తెలియదో నాకు తెలీదు. అర్ధరాత్రి వేళల్లో మంత్రాలను గురించి మాట్లాడటం మంచిదికాదు. పోయి పడుకో వెళ్ళు" మరోసారి కరుకు కంఠంతో ఆజ్ఞాపిస్తూ, చేతికర్రతో రంగమ్మ భుజాన్ని తాకింది మామ్మ.

ఉలిక్కిపడినట్లయి ఒక అడుగు వెనక్కి వేసింది రంగమ్మ. ఎదురు చెప్పకుండా పోయి తన మంచంమీద పడుకున్నది. పదినిముషాలు ఆగి మంచంమీదినుంచి దిగి, తడబడుతున్న అడుగులతో ఆమె దగ్గరికిపోయింది

మామ్మ. ముందుకు వంగి ముద్దుగా ఆమె తల నిమిరింది. నుదుటిమీద ముద్దు పెట్టుకుని వెనక్కి వచ్చేసింది.

***

"పడిపోతున్నాను... నేను తల్లకిందులుగా పడిపోతున్నాను... రక్షించు సువర్ణా... నన్ను కాపాడు... అని కేకపెడుతూ అపూర్వ గది కిటికీలో నుంచి పోయి ఆమె పరుండివున్న మంచం దగ్గర దభ్ మని పడింది రాజశేఖర్ ఆత్మస్వరూపం." ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది అపూర్వ.

"అయ్యయ్యో దెబ్బ తగిలిందా?" అని అడుగుతూ కిందికి దిగి హెల్ప్ చేయబోయింది. తనంతట తానే లేచి, గట్టిగా నిట్టూరుస్తూ బెడ్ పక్కనేవున్న కుర్చీలో కూర్చుంది రాజశేఖర్ రూపం.

"అర్థాంతరంగా చచ్చిపోయి ఈ ఆత్మరూపాన్ని పొందాక ఏనాడూ ఎరగని భయంకరమైన అనుభవం నాకివ్వాళ ఎదురైంది. నువ్వు మనసుపడిన ఆ రవిబాబుని మహోగ్రమైన శక్తి కాపలా కాస్తోంది. దగ్గరికి పోయిన వెంటనే నా గుండెలు చెదిరిపోయేటట్టు తన్నింది.

జుట్టు పట్టుకుని గిరగిరా తిప్పి గాలిలోకి విసిరితే, ఆ విసురుకు సరాసరి వచ్చి ఇక్కడపడ్డాను..." ముఖం తుడుచుకుంటూ చెప్పింది.

"సువర్ణా.... అని అరిచావ్ గుర్తువుందా?" అడిగింది అపూర్వ. సన్నగా నవ్వి ఆమె బుగ్గల్ని నిమిరింది రాజశేఖర్ రూపం.

"నువ్వు అపూర్వవే. నాకు మాత్రం సువర్ణ మాదిరిగానే కన్పిస్తున్నావ్" అంటూ కుర్చీలో నుంచి లేచి సీరియస్‌గా గదిలో పచార్లు చేయటం మొదలుపెట్టింది.

"ఇంతకీ నువ్వు వెళ్ళిన పని ఏమయినట్టు?" చూసి చూసి వుండబట్టలేక అడిగింది అపూర్వ.

"ముందుగానే చెప్పాను కదరా... ముక్కూ ముఖం ఏకం చేసి పంపింది రవిబాబుని కాపలా కాస్తున్న శక్తి. ఆ శక్తి కంటపడకుండా అతన్ని పట్టుకోవాలి. మర్యాదగా మాట విన్పించుకోకపోతే, పెళ్ళికొడుకును ఆవహించినట్లు అతన్ని కూడా ఆవహించి బలవంతంగా ఇటు తీసుకు రావాలి. ఎలా చేయాలా అని ఆలోచిస్తున్నా..." పచార్లు చేయటం మానకుండా చెప్పిందా రూపం.

"అయితే నువ్వు రవితో మాట్లాడలేదు, నా గురించి చెప్పలేదు". నిరుత్సాహంగా అంటున్న అపూర్వ దగ్గరికి వచ్చి ఆప్యాయంగా తల నిమిరింది.

"మొదలుపెట్టిన పది నిమిషాల మీద పూర్తి అవ్వాలంటే ఒక్కోసారి అవదురా... కొంచెం ఓపిక పట్టాలి... ఒకసారి గుడ్డిగావెళ్ళి తన్నులు తిని వచ్చినంత మాత్రాన నేను పట్టిన పట్టు వదులుతానని అనుకోబోకు. ఇంకోసారి వెళతాను. ఈసారి ఖచ్చితంగా అతనితో మాట్లాడి వస్తాను..." అంటూ వెనుతిరిగింది.

"ఎక్కడికి పోతున్నావ్?" ఆందోళనగా అడిగిందామె.

“ఇంకెక్కడికి? నీ రవిబాబు దగ్గరకే.... గాలిలో పల్టీలు కొడుతూ ఇక్కడికి వచ్చేటప్పుడు అడవి మధ్యలో ఒక శక్తి విగ్రహం కన్పించింది. అదేమిటో చూడాలని కోరిక కలుగుతోంది. తెల్లారేవరకూ అక్కడ కాలక్షేపం చేసి, తెల్లారిన తర్వాత రవిబాబు సంగతి ఆలోచిస్తా...” అంటూ రివ్వున గాలిలోకి లేచి కిటికీలోనుంచి బయటికి దూసుకుపోయింది రాజశేఖర్ ఆత్మస్వరూపం.

బెడ్ మీదికి చేరుకున్న అపూర్వ... దుప్పటిని వంటిమీదికి తీసుకుని కళ్ళు మూసుకున్నది. పది నిముషాలపాటు ప్రయత్నం చేసినప్పటికీ నిద్ర రాకపోవటంతో విసురుగా కిందికి దిగింది. “ఏమిటమ్మా? ఎవరితో మాట్లాడుతున్నావ్?” అని అడుగుతూ ఆమె గది గుమ్మం దగ్గర ప్రత్యక్షం అయ్యాడు ఆమె తండ్రి.

ఉలిక్కిపడింది అపూర్వ. అంతలోనే నేర్పుగా తమాయించుకున్నది. పీడకల ఒకటి వచ్చింది నాన్నా.... భయం వేసింది. బహుశా నిద్రలో కలవరించి వుంటాను అంటూ తిరిగి బెడ్ ఎక్కబోయింది.

“పీడకల వచ్చిందా? పొద్దున్నే మన ఆంజనేయస్వామి పూజారిని పిలిపించి సింధూర, పెట్టిద్దాం. ఒంటరిగా పడుకోకు. వచ్చి అమ్మ దగ్గర పడుకో... రా” అంటూ లోనికి వచ్చి, ఆమె చేయిపట్టుకుని కిందికి తీసుకుపోయాడు తండ్రి. తల్లి దగ్గర పడుకోవటం ఇష్టం లేకపోయినా, ఆయన మాటల్ని కాదనటం ఎలాగో తెలియకపోవటం వల్ల, మారు మాటాడకుండా అనుసరించింది అపూర్వ. తల్లి పక్కనే పడుకుని బలవంతంగా కళ్ళు మూసుకున్నది.

***

"గోపాలం... ఒరేయ్ గోపాలం... ఏం చేస్తున్నావ్? ఇంకా నిద్రపోతూనే వున్నావా?" అని గురువుగారు బిగ్గరగా పిలవటంతో ఉలిక్కిపడి లేచాడు గోపాలం.

అప్పుడే తెల్లబడుతోంది తూర్పుదిక్కు. అడవిలోని పక్షులన్నీ అరుపులతో అడవిని అల్లకల్లోలం చేయటం మొదలెడుతున్నాయి. ఆదమరిచి నిద్రిస్తున్న వెంకటమ్మ భుజంతట్టి ఆమెనూ నిద్రలేపి, గురువుగారి దగ్గరికి పోయాడతను.

"కరాళ శక్తిలో కదలిక మొదలైంది. ఏ క్షణంలోనైనా తల్లి నా ఎదుట సాక్షాత్కరించవచ్చు. మనం తెచ్చిన సీసా భద్రంగానే వున్నదా?" శక్తి విగ్రహం ఎదుట కూర్చుని వున్న గురువుగారు వెంటనే అడిగాడు. నిద్ర కళ్ళను నులుముకుంటూ తల ఊపాడు గోపాలం.

"అయితే నువ్వు ప్రయాణానికి సిద్ధంకా. వేములపల్లి ఊళ్ళోకి వెళ్ళి సరుకులు తీసుకురా. నిమ్మకాయలు తీసుకురావడం మరిచిపోకు. వెళ్ళు" అని చెప్పి తన జపంలో మునిగిపోయాడు గురువుగారు.

"సరుకులంటున్నాడు. బియ్యం అయిపోయాయా?" వెంకటమ్మ దగ్గరికొచ్చి లోగొంతుకతో అడిగాడు గోపాలం.

తమ ట్రంకుపెట్టెని తెరిచి, అందులోంచి నాలుగు కరెన్సీనోట్లను తీసి అతనికందించిందామె.

పూజలు చేయటారికి అసరమయిన సరంజామా గురించి వివరంగా చెప్పింది. "ఎందుకని అడుగుతారు. ఈ సరుకు ఎవరికోసమని ప్రశ్నలు వేస్తారు. ఏమని చెపుతావ్?" అని అడిగింది.

"ఓస్! ఆ మాత్రం నాకు తెలియదా.... కొండలమ్మ తల్లికి ప్రత్యేకమైన పూజలు చేయించటానికని చెపుతా. ఎవరికీ అనుమానం రాదు...." అన్నాడు గోపాలం.

చూపుడువేలితో అతని బుగ్గమీద బలంగా పొడిచి, అతని జుట్టులోకి వేళ్ళని జొనిపి, తలను ముందుకు వంచి పెదవులను ముద్దాడింది వెంకటమ్మ.

"ఏమిటో అనుకున్నానుగాని, నీకు ఈమధ్య తెలివితేటలు బాగా పెరిగిపోతున్నాయి... ఫరవాలేదు" అంటూ అతన్ని వదిలిపెట్టింది.

పది నిముషాల్లో డ్రెసప్ అయ్యాడు గోపాలం.

గురువుగారు ఏం చేస్తున్నారో ఒకసారి చూసి, వెంకటమ్మను గట్టిగా కౌగిలించుకున్నాడు... "ఏం తెమ్మంటావ్ నీకోసం?" చెవిదగ్గర నోరు పెట్టి రహస్యంగా అడిగాడు.

"నువ్వు తొందరగా వచ్చేయ్. నాకు అదిచాలు" అతని చేతలకు పరవశించిపోతూ అస్పష్టంగా అన్నది వెంకటమ్మ.

ఆ ప్రదేశానికి వందగజాల దూరంలో వున్న ఒక చెట్టు దగ్గర నిలబడి పరిశీలనగా చూస్తున్న రాజశేఖర్ స్వరూపం, తనలో తను నవ్వుకుంటూ చెట్టుచాటున జరిగి నేలమీద చతికిలపడి కూర్చుంది.

“భక్తిపారవశ్యంతో వాళ్ళు పూజలు చేయటంలేదు. తమ స్థావరాన్ని అష్టదిగ్భంధనం చేసి ఏదో తాంత్రిక శక్తిని ఆరాధిస్తున్నారు. వాళ్ళ అంతర్యం ఏమిటో మనకి ఎలా తెలుస్తుంది?” అని తనలో తను అనుకుంటూ గట్టిగా ఆవులించి, కూర్చున్న చోటనే నేలమీదికి ఒరిగి నిద్రకుపక్రమించింది.

అప్పుడే ట్రంకు పెట్టెలో నుంచి తమ సీసాని బైటికి తీసి పరీక్షగా ఒకసారి చూసింది వెంకటమ్మ. అందులో నిలబడి అలమటిస్తున్న స్వరూపాన్ని.

“వదిలిపెట్టు. నన్ను ఈ సీసాలో నుంచి బయటికి లాగు... నీకు పుణ్యంవుంటుంది. నీకుగాని, నీ వాళ్ళకుగాని ఎవరికీ నేను ద్రోహం చేయలేదు. దయచేసి నన్ను వదిలేయ్....” చేతులు జోడించి కడు దీనంగా వెంకటమ్మను అర్థించింది సీసాలో గిలగిలలాడుతున్న ఆత్మస్వరూపం.

“నిన్ను వదిలిపెట్టాలా? ఇంకా నయం... నా చేతులతో నన్నే నా గొంతును పిసుక్కోమని అనలేదు. నోరుమూసుకుని పడివుండు” అంటూ హెచ్చరించి, సీసాని ట్రంకుపెట్టెలో పెట్టేసింది వెంకటమ్మ.

నిస్సహాయంగా మోకాళ్ళమీద కూలబడిపోయింది సీసాలోవున్న ఆత్మస్వరూపం. దీనంగా చూస్తూ వుండగా మూసుకున్నది ట్రంకుపెట్టె మూత.

***

“అయ్యగారూ.... ఆ రవిబాబు పట్నం నుంచి మళ్ళీ మన ఊళ్ళోకి వచ్చేశాడు. ఒంటిమీద ఏదో గాయం. నిన్న పొద్దున ఆచారిగారి దగ్గర కట్టుకట్టించుకున్నాట్ట” ఉదయం ఎనిమిది గంటల సమయంలో పరుగు పరుగున భజంగరాయుడి దగ్గరికి వస్తూ రిపోర్ట్ చేశాడు ఆయన అనుచరుడు ఒకతను.

చేతులు కట్టుకుని నిలబడిన రాంసింగుతో ఏదో మాట్లాడుతున్నాడు భుజంగరాయుడు. గిర్రున పక్కకు తిరిగాడు. పిడికిలి బిగించి బలంగా కొట్టాడు.

లావుపాటి కాంక్రీట్ దిమ్మ ఏదో వచ్చి గుండెలకు తగిలినట్లు కీచుగా అరిచి, వెనక్కి తూలాడు ఆ అనుచరుడు. వెల్లికిలా పడి కళ్ళు తేలేశాడు.

"పొయ్యండిరా ముఖంమీద నీళ్ళు..." ఉరుములాంటి కంఠంతో హుంకరించాడు భుజంగరాయుడు.

రెండే రెండు క్షణాల్లో ఒక నీళ్ళ బక్కెట్ ని తీసుకువచ్చి, పడిపోయిన మనిషి తలమీద కుమ్మరించాడు ఇంకో అనుచరుడు.

"ఎందుకు అయ్యగారూ... నన్ను ఎందుకు కొట్టారు? ఏం తప్పు చేశాను నేను??" అయోమయంగా చూస్తూ అడిగాడు కళ్ళుతెరిచి నెమ్మదిగా లేచి కూర్చున్న తరువాత ఆ అనుచరుడు.

"దొరగారి దివాణంలో విచిత్రంగా కనిపించే ఏపని జరిగినా నిముషాలమీద నాకు తెలియజేయమని మీకు చెప్పాను. ఇప్పుడు ఏమని చెప్పావ్? ఆ రవిబాబు నిన్న ఉదయం ఊళ్ళోకి వచ్చాడా? నువ్వు వచ్చి ఇప్పుడు చెపుతున్నావా? కొట్టటం కాదురా – నరికిపారేయాలి మిమ్మల్ని..." పళ్ళు పటపటమని కొరుకుతూ అన్నాడు భుజంగరాయుడు.

ఇంకో దెబ్బ కొట్టటానికి రెడీ అవబోతుండగా, అడ్డం నిలుచుని ఆపేశాడు రాంసింగు.

"డబ్బు తీసుకున్న తరువాత మాట తప్పే మనిషికాదు మనం కలిసి వచ్చిన శ్యామ్ దాదా. రవిబాబుకి ఒంటిమీద గాయం అయిందని అంటున్నాడు కదా! జరిగింది ఏమిటో సరిగ్గా తెలుసుకోమని చెప్పండి" అంటూ అనునయించాడు.

బిక్కముగంతో నిలబడిన అనుచరుడికేసి సాభిప్రాయంగా చూశాడు భుజంగరాయుడు. నొరుతెరిచి ఆజ్ఞ ఏదో ఇచ్చేటంతలో, సుడిగాలి మాదిరి అక్కడికి వచ్చాడు ఇంకో అనుచరుడు.

"అయ్యగారూ! ఆ రవిబాబు కొండలమ్మ తల్లి దగ్గరికి పోతున్నాడు. ఊళ్ళోకి వచ్చేటప్పుడు ఎవరో జతగడ్ని వెంటబెట్టుకు వచ్చాట్ట. ఆ జతగాడు నిన్ననగా కొండలమ్మ తల్లి దగ్గరికిపోయి ఇంతవరకూ తిరిగి రాలేదట..." వచ్చీరావటంతోనే అక్కడి పరిస్థితి అర్థం చేసుకున్నాడు కాబోలు, కాస్తంత దూరంగానే నిలబడి తను మోసుకువచ్చిన సమాచారాన్ని వినిపించాడతను.

మీసాల్ని తడుముకుంటూ రాంసింగుకేసి చూశాడు భుజంగరాయుడు.

"ఇక వెనుకాముందు ఆలోచించటం అనవసరం. రవిబాబుకి చీటీ రాసేద్దాం" అంటూ రెండో అనుచరుడికేసి చూశాడు రాంసింగు.

"ఆ బాబుతో ఎంతమంది వెళుతున్నారు?" అని అడిగాడు.

"వాళ్ళ పాలేళ్ళు ఇద్దరే వెళుతున్నారు. ఆర్నెల్లకిందట బళ్ళారి నుంచి తెప్పించిన మైసూరెడ్లు కట్టిన బండిలో పోతున్నారు. ఈపాటికి పొలిమేరల్ని దాటి మూడు ఫర్లాంగులు వెళ్ళి వుంటారు..." చెప్పాడా మనిషి.

"తొందరగా వెళ్ళి నా డ్రయివరు రత్నాజీని పిలువ్. మా జీప్‌ని రెడీగా నిలబెట్టించు. నేను సరుకు తీసుకువస్తాను..." అంటూ ఆ ఇంటి వెనుక భాగంలో వున్న అవుట్ హౌస్ వంటి కట్టడంలోకి పరిగెత్తాడు రాంసింగు.

మధ్యగదిలో మంచం కింద పెట్టివుంచిన అట్టపెట్టెను అతి జాగ్రత్తగా తీసుకుని బయటికి వచ్చాడు.

అతని ఆర్డర్స్‌ని అక్షరాలా అమలులో పెట్టాడు భుజంగరాయుడి మనిషి. డబడబ మోతలుచేస్తూ, ప్రయాణానికి సిద్ధంగా నిలబడి వున్నది అతను పట్నం నుంచి తీసుకవచ్చిన జీప్.

"రోడ్డంతా ఎగుడు దిగుళ్ళు. ఎత్తుపల్లాలతో వుంది. జీపుని జాగ్రత్తగా పోనీ... ఈసారి చాలా హడావుడిగా తయారు చేశాను సరుకుని. ఏ మాత్రం ఒత్తిడి తగిలినా మన ముఖాలమేదే ఢమాల్ అంటుంది. కట్టకట్టుకుని వెళ్ళిపోతాం అందరమూ ఆకాశంలోకి" చిన్నకంఠంతో డ్రయివర్ ని హెచ్చరిస్తూ జీప్ ఎక్కాడు రాంసింగు.

ఆవరణలోకి వచ్చి నిలబడిన భుజంగరాయుడికి చేయి ఊపాడతను. కళ్ళెం వదిలిన గుర్రంలా పరుగు మొదలుపెట్టింది జీప్. రెండే రెండు నిముషాల్లో ఊరి పొలిమేరల్ని దాటి అడవిలోకి వచ్చింది.

"ఇంకో ఫర్లాంగుదూరం పోతే అడ్డదారి ఒకటి వస్తుంది. కొండలమ్మ తల్లి దగ్గరకి పోకముందే రవిబాబుని నిలబెట్టేయొచ్చు" కింద పడిపోకుండా సీటును

గట్టిగా పట్టుకుంటూ రాంసింగుకి చెప్పాడు, అతనితోపాటు జీప్ ఎక్కిన భుజంగరాయుడి మనిషి.

"సరే అలాగే చేద్దాం. నువ్వు మాట్లాడకు...." అంటూ అతన్ని హెచ్చరించి, దృష్టినంతా ఎదుటవున్న మట్టిరోడ్డు మీద కేంద్రీకరించాడు రాంసింగు.

భుజంగరాయుడి మనిషి చెప్పినట్టే రెండు నిముషాల్లో వారికి కనిపించింది కాలిబాట మాదిరిగా కనిపిస్తున్న అడ్డదారి ఒకటి. దాన్ని పట్టుకుని మూడు మైళ్ళ దూరం పోయేసరికి చదునుగా వున్న సమతల ప్రదేశం ఇంకోటి అగుపించింది. అదే సమయంలో అక్కడికి చేరుకుంటున్న ఎడ్లబండి కూడా వాళ్ళ దృష్టి పథంలోకి వచ్చింది.

రెండో ఆలోచన చెయ్యలేదు రాంసింగు. ఒక్కక్షణం కూడా ఆగలేదు... తన ఒళ్ళో వున్న అట్టపెట్టెతో సహా గబుక్కున జీప్ లో నుంచి దిగాడు.

"కొట్టేయ్.... ఆ బండిని ఢీ కొట్టేయ్..." అని తన డ్రైవర్‌కి చెప్పాడు.

అదిరిపడి జీప్ లోనుంచి కిందికి దూకేశాడు భుజంగరాయుడి మనిషి. రాంసింగు డ్రైవర్ వెర్రిగా నవ్వుతూ యాక్సిలేటర్‌ని అడుగు కంటా అదిమాడు. విమానంలా ముందుకు దూసుకెళ్ళింది జీప్.

అది ఇంకో వందగజాల దూరంలో వున్నదనగా, ఆ డ్రైవర్‌ని చూసి అదిరిపడ్డాడు ఎడ్ల బండిని తోలుతున్న దొరగారి పాలేరు.

"అయ్యబాబోయ్.... ఆడు రాంసింగు డ్రైవరు. మనల్ని చంపటానికే వస్తున్నాడు. దూకేయండి బాబూ... వెంటనే బండి మీది నుంచి దూకేయండి" అని

రవిబాబుని హెచ్చరిస్తూ ఛెంగు ఛెంగున అడుగులు వేస్తున్న మైసూరెడ్లను రెండింటినీ తన అరచేతుల్తో వెన్నులపై చరిచాడు.

తల్లకిందులు కాబోయి ఆఖరి క్షణంలో సెట్ రైట్ అయింది అవి లాగుతున్న బండి. అడ్డువచ్చిన బండరాయిని, అరంగుళం తేడాతో తప్పించుకుని, అతివేగంగా ఒకపక్కకు వెళ్ళిపోయింది అది.

సూటిగా వచ్చి ఆ బండరాయిని ఢీ కొట్టింది జీప్. వికృత శబ్దాలు చేస్తూ పక్కకు తిరిగి, ఒక పల్లపు ప్రదేశంలోకి పల్టీలు కొట్టుకుంటూ వెళ్ళిపోయింది.

''తప్పించుకున్నాడు.... రవిబాబు తప్పించుకున్నాడు'' బిగ్గరగా అరిచాడు భుజంగరాయుడి మనిషి.

''ఎక్కడికి పోతాడు బే? ఈ రాంసింగ్‌ని తప్పించుకుని వాడు అవతలికి పోలేడు'' కోపంగా అంటూ అట్టపెట్టెను కిందపెట్టి అందులో నుంచి ఒక నాటుబాంబుని బయటికి తీశాడు రాంసింగు.

''రాంసింగూ... రాంసింగూ అది ఏంటి? ఏంటి అది?'' ఉన్నట్లుండి అతని దగ్గరికి జరుగుతూ, ఆందోళన నిండిన కంఠస్వరంతో అడిగాడు భుజంగరాయుడి మనిషి.

క్షణ క్షణానికి దూరం అయిపోతున్న ఎడ్లబండిమీది నుంచి దృష్టిని మరలించలేదు రాంసింగు... ''నోరు మూసుకో... ఏంటీలేదు గింటీలేదు... అవతలికిపో'' అని హెచ్చరిస్తూ, శరీరంలోని శక్తినంతా చేతిలోకి తెచ్చుకొని, బయటికి తీసిన బాంబుని ముందుకు విసిరాడు.

గింగిరాలు తిరుగుతూ గాలిలోకి లేచింది అది... రివ్వుమని ఎగురుతూ ఎడ్ల బండికేసి వేగంగా దూసుకుపోయింది.

'అయిపోయాడు రవిబాబు. ఈ దెబ్బతో ఖతమైపోయాడు' సంతోషంగా అనుకుంటూ కిందికి వంగి అట్టపెట్టెలో చేయిపెట్టాడు రాంసింగు, రెండో బాంబు కోసం.

"రాంసింగూ... వెనక్కి వచ్చేస్తోంది ఆ బాంబు వెనక్కి...." అంటూ మాటల్ని మధ్యలోనే ఆపి, ఒక్కసారిగా అవతలికి దూకాడు భుజంగరాయుడి మనిషి. అతని కంఠంలోని దారుణమయిన భయాన్ని గమనించాడు రాంసింగు. బయటికి తీయబోతున్న బాంబుని పెట్టెలోనే వదిలేసి, తను కూడా అవతలికి జంప్ చేశాడు.

పాలేరు అరిచిన అరుపు అక్షరాలా యదార్థమని, వెంటనే అవగతమయింది అతనికి. గురి తప్పకుండాపోయి ఎడ్లబండిమీద పడవల్సిన మొదటి బాంబు, తనంతట తనే వెనక్కి వచ్చి,అంతవరకూ అతను నిలబడిన ప్రదేశంలోపడి, చెవులు చిల్లులుపడే శబ్దంతో బ్రద్ధలైపోయింది.

ఆ అదటుకు అట్టపెట్టెలో వున్న బాంబులు పెద్ద శబ్దం చేస్తూ పేలిపోయాయి. ఎర్రటి మంటలు, నల్లటి పొగలు పది నిలువుల ఎత్తున గాలిలోకి లేచాయి. పెద్ద పెద్ద ప్రొక్లెయినర్లు ఏవో వచ్చి డబడబా తవ్విపోసినట్లు మూడు నిలువుల గోయి ప్రత్యక్షమైంది అది పేలిన ప్రదేశంలో.

‘‘అయ్యబాబోయ్... అయిపోయినట్టున్నాడు రాంసింగు’’ పిచ్చిగా పరుగులు పెడుతున్న ఎడ్లను బలవంతంగా ఆపి వెనక్కి చూస్తూ అన్నాడు బండిని నడుపుతున్న పాలేరు. బండిమీద నుంచి కిందికి దూకబోయిన రవిబాబును చటుక్కున అడ్డుకున్నాడు రెండో పాలేరు.

‘‘ఆళ్ళు మనకోసమే వచ్చారు. వాళ్ళు తీసుకున్న గోతిలో వాళ్ళే పడ్డారు. ఇంక మనదారిన మనం పోదాం’’ అంటూ మొదటి పాలేరుకు సైగ చేశాడు.

‘‘అంతే బాబూ... ఆ భుజంగరాయుడి జనం మీద జాలి చూపించకూడదు. పాములాంటివాళ్ళు. అన్నం పెట్టిన చేతినే కాటేస్తారు. మనం వెళ్ళిపోదాం... మన కొండలమ్మ తల్లి మనల్ని కాపాడింది ఇయ్యాళ....’’ అంటూ ఎడ్లను అదిలించాడు అతను.

తమ బండిని ఢీ కొట్టబోయి పల్లంలోకి దొర్లిన జీప్ డ్రైవర్‌ని, బాంబు విసరబోయిన రాంసింగుని తలుచుకుంటూ గట్టిగా నిట్టూర్చాడు రవిబాబు. అతను కూర్చునివున్న బండి ఒక మలుపు తిరిగి మటుమాయమయ్యేదాకా ఆగి, అంతకుముందు ఆ బండి తప్పించుకున్న బండరాయి దగ్గరికి వెళ్ళింది రాజశేఖర్ స్వరూపం.

‘గాలిలో వుండగానే బాంబుని పట్టుకుని నేర్పుగా వెనక్కి విసిరిన నా గొప్పతనాన్ని గుర్తించకుండా కొండలమ్మతల్లి కాపాడిందని భక్తితో దండాలు పెట్టుకున్నారు. వీళ్ళకు బుద్ధిలేదు, జ్ఞానంలేదు...’ అంటూ పల్లంలోకి తొంగి చూసింది.

తల్లకిందులయిన జీప్ లోనుంచి నెమ్మదిగా బయటికివచ్చి దిక్కులు చూస్తున్న డ్రైవర్ కనిపించేసరికి, విపరీతమైన సంతోషం కలిగింది కాబోలు, బ్రేక్ డాన్స్ చేస్తున్నట్లు రెండు చిందులువేసింది. రవిబాబుని వాళ్ళ కొండలమ్మ తల్లేకాదు... నేనూ కాపాడటానికి కంకణం కట్టుకుని వున్నాను. అతన్ని మీరేమీ చేయలేరు. ఇళ్ళకుపోయి తగిలిన దెబ్బలకు మందులు వేసుకోండి పొండి.... అంటూ రివ్వున పల్లంలోకిపోయి అతని షర్టును పట్టుకుని బరబరా పైకి లాక్కొచ్చింది.

“ఎవరు? ఎవరు నన్ను లాగుతోంది? ఎవరు....?” విపరీతమయిన భయంతో కంపించిపోతూ అరిచాడు డ్రైవర్. అరుస్తూనేపోయి రాంసింగ్ దగ్గర కూలబడ్డాడు. బ్రద్ధలైపోయిన బాంబుల అదటుకు కళ్ళు పచ్చబడి ఒక పొదచాటున చతికిలపడి వున్నాడు రాంసింగ్. విసురుగా వచ్చిపడిన తన డ్రైవర్ వంక ఆశ్చర్యంగా చూశాడు.

“అదిగో.... రాంసింగూ... అదిగో... నువ్వు బాంబు విసిరేటప్పుడు నాకు కనిపించిన ఆకారం అదే...” సడన్ గా అరిచాడు భుజంగరాయుడి మనిషి.

వికటంగా నవ్వింది రాజశేఖర్ రూపం. “అవునురా... మీ దుమ్ము దులిపింది నేనే... సాధారణమయిన దయ్యాన్ని... కొండలమ్మ తల్లిని కాదు.....” అంటూ ఇంత వెడల్పున నోటిని తెరిచి చెవులు చిల్లులుపడేలా అరిచింది.

శబ్దంతోపాటుగా భరించలేనంత దారుణమైన వేడిగాలి కూడా వచ్చి రాంసింగ్‌ని తాకింది. భయంతో వణికిపోతూ పొదలచాటునుంచి లేచి పరుగు మొదలుపెట్టాడతను. అతనితోపాటు పిక్కబలం చూపిస్తున్న అతని

సహచరులిద్దర్నీ కొద్దిదూరం వెంటపడి తరిమి, నెమ్మదిగా వెనక్కి మరలింది రాజశేఖర్ ఆత్మస్వరూపం.

'ఇవాల్టికి ఈ ఎడ్వెంచర్ చాలు... ఇక రవిబాబును పట్టుకుందాం. కొండలమ్మతల్లి దగ్గర్నించి అతను ఊళ్ళోకి బయలుదేరకముందే వెంటబెట్టుకుని నారాయణపురం లాక్కుపోదాం' అని అనుకుంటూ కొండలమ్మ తల్లి గట్టువైపు బయలుదేరింది.

***

"దయ్యమా? మీకు అడవిలో దయ్యం కనిపించిందా? మీరు విసిరిన బాంబు అది గాలిలోనే పట్టుకుని మీ మీదికి విసిరిందా? నమ్మమంటావా రాంసింగూ?" ఆశ్చర్యంగా అడిగాడు భుజరంగరాయుడు.

"పన్నెండు సంవత్సరాలనుంచీ బాంబులు తయారుచేస్తున్నాను. ఎప్పుడయినా ఇటువంటి సంఘటన జరిగినట్టు మీకు తెలిసిందా?" పరిగెత్తి పరిగెత్తి కాళ్లునొప్పులు పుట్టడంవల్ల కాబోలు ఒక గోడను ఆనుకుని కూర్చుంటూ అన్నాడు రాంసింగు.

"తెలియలేదు కాబట్టే నమ్మబుద్ధికావటంలేదు. అసలక్కడ జరిగిందేమిటో నాకు వివరంగా చెప్పండి" అన్నాడు భుజంగరాయుడు.

అడ్డదారినపోయి చదును ప్రదేశంలో ఎడ్లబండిని ఢీ కొట్టటానికి ట్రై చేసిన దగ్గర్నించి మొదలుపెట్టి పారిపోయి వచ్చినంతవరకూ తమ తమ వెర్షన్స్‌ని అతనికి వినిపించారు వాళ్ళు.

“దయ్యం పనే అయ్యగారూ... కొండలమ్మతల్లి దెబ్బకు బెదిరిపోయిన దయ్యం ఏదో ఆ చుట్టుపట్ల తచ్చట్లాడుతూ వుండి వుంటుంది. అది మన వాళ్ళను తప్పకుండా పల్టీ కొట్టించి వుంటుంది.”

అంతా విని సాలోచనగా అన్నాడు ఆయన అనుచరుల్లో వృద్ధుడయిన మనిషి ఒకతను.

“నాటుబాంబు కంటె పవర్‌ఫుల్ అయిన శ్యామ్ దాదాని తప్పించుకున్నాడు ఈ రవిబాబు. ఇప్పుడు ఏకంగా నా బాంబులతో నన్నే మటాష్ చేయబోయాడు. ఇక వాడిని ఉపేక్షించి లాభంలేదు....” అంటూ గోడ దగ్గర్నించి లేచాడు రాంసింగ్.

“ఏం చేయాలనుకుంటున్నావ్...?” అడిగాడు భుజంగరాయుడు.

“నారాయణపురంలో శివయ్య అనే బార్బరు ఒకతను వున్నాడు. వాడిని కన్సల్ట్ చేసి మాంచి మంత్రగాడిని కాంటాక్ట్ చేద్దాం. మానవ ప్రయత్నాలు పనిచేయని పక్షంలో మంత్రాల్ని వుపయోగించటంలో తప్పు వుండదని నా అభిప్రాయం” అన్నాడు రాంసింగు.

“మంత్రాలా? ఆ కొండలమ్మతల్లి మనల్ని బతకనిస్తుందా?” సాలోచనగా తన అనుచరులవైపు చూస్తూ అన్నాడు భుజంగరాయుడు.

“అయ్యగారూ.... మన ఊరి మొగదల మకాం పెట్టిన మందుల వాళ్ళు గుర్తున్నారా మీకు....?” అడిగాడో అనుచరుడు. కళ్ళు చిట్లించి చూశాడు భుజంగరాయుడు.

“మందులవాళ్ళు కాబట్టి వాళ్ళకి మంత్రాల్ని తంత్రాల్ని గురించి తెలిసి వుండవచ్చు. ఒకసారి పిలిపించి మాట్లాడితే బాగుంటుంది” అన్నాడా అనుచరుడు.

“ఆళ్ళు ఆడ లేరు. అడవిలోకి వెళ్ళిపోయారు. ఆళ్ళని పట్టుకోవటం కష్టం” అన్నాడింకో అనుచరుడు.

“లేదు అయ్యగారూ! ఆళ్ళలో ఒకడు ఇందాకే బజారులో కనిపించాడు. చలమయ్య హోటల్లో టీ తాగి ఏవో సరుకులు కొనుక్కుంటున్నాడు. అడవిలో ఇంకా కొన్ని రోజులుండాల్సి వస్తుందని కొట్లో ఎవరితోనో చెప్పటం విన్నా....” చెప్పాడు మొదటి అనుచరుడు.

“వెళ్ళు... వెళ్ళి వాడిని వెంటబెట్టుకురా.... వెళ్ళు....” వెంటనే హుకుం జారీచేశాడు భుజంగరాయుడు. తూనీగ మాదిరి స్పీడ్‌గా వెళ్ళిపోయాడు ఆ అనుచరుడు.

వెంకటమ్మ చెప్పిన సరుకులన్నిటినీ కొని అడవిలోకి వెళ్ళేముందు ఇంకో టీ తాగటానికి చలమయ్య దగ్గరికి పోతున్నాడు గోపాలం. “పద పద.... మా అయ్యగారు నిన్ను తీసుకురమ్మన్నారు” అంటూ ప్రత్యక్షమయిన భుజంగరాయుడి మనిషిని చూసి అవాక్కయ్యడు.

***

“వెంకటమ్మా... గోపాలం వచ్చాడా??” మిట్టమధ్యాహ్నం తన జపాన్ని చాలించి, అన్నం తినటానికి రెడీ అవుతూ అడిగాడు గురువుగారు.

“వచ్చే వేళైంది. వస్తూనే వుంటాడు” చెప్పిందామె.

"ఈ రాత్రితో నా మంత్రజపం పూర్తి అవుతుంది. ఈ తెల్లవారు ఝామున కరాళశక్తి కదిలి కళ్ళు తెరుస్తుంది. మనం అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా వుండాలి" అంటూ తల ఎత్తి చూశాడు గురువుగారు.

"అడుగో గోపాలం వచ్చేశాడు...." కామెంట్ చేయబోయి ఆ మాటల్ని తనలోనే అదుముకున్నదామె. గోపాలం ఒంటరిగా లేడు. అతనితోపాటు భుజంగరాయుడి జనం, వెనకాలే రాంసింగు రావటమే అందుకు కారణం.

"ఎవరు మీరు? ఏం కావాలి మీకు?" అన్నం పూర్తిగా ఆరగించకుండానే చేతులు కడుగుకుంటూ వారిని అడిగాడు గురువుగారు.

"మందులు ఏరుకునే మిషమీద మీరు క్షుద్రశక్తుల్ని ఆరాధిస్తున్నందుకు మేమేమీ అనుకోవటంలేదు. మీ గోపాలం మాకన్ని విషయాలు చెప్పాడు. మీరు మాకో సహాయం చేస్తే మీ గురించి మేమెవరికీ చెప్పం" సూటిగా విషయంలోకొచ్చేశాడు రాంసింగు.

"మా గోపాలం మీకేం చెప్పాడు?" అనుమానంగా అడిగాడు గురువుగారు.

"పాడుపడిన మేడదగ్గర మనకి కనిపించిన అదృశ్యశక్తిని జయించటానికి కరాళశక్తిని ఆరాధిస్తున్నామని చెప్పాను. ఆ మేడలో అడవి సంపెంగ తీగ వున్నది కదా...." అది మనం తయారు చేసే మందుల్లోకి అత్యవసరం కదా.. అన్నాడు గోపాలం.

అష్టసిద్ధి యంత్రం ఎక్కడున్నదో తెలుసుకోవటం కోసం తాము పూజలు చేస్తున్న విషయాన్ని అతడు మరుగునపరిచి, నోటికొచ్చిన కథ ఏదో వారికి చెప్పినట్టుగా అర్థమై ఆనందంగా తల ఊపాడు గురువుగారు.

"అవును.... ఇంతకీ మీరొచ్చిన పనేమిటో చెప్పండి...." అని రాంసింగుతో అన్నాడు. తాము వచ్చిన పనిని చెప్పి, "ఆ రవిబాబుని ఖతం చేసేయాలి.... మంచి ప్రయోగం ఏదైనా వుంటే వెంటనే చేయాలి" అని అన్నాడు.

"మూడురోజుల తర్వాత వచ్చి కలుసుకోండి. చిటికెలో ఆ అబ్బాయిని భస్మం చేసి పారేసే శక్తిని ఆవాహనచేసి మీకు అప్పగిస్తాను...." అన్నాడు.

"మూడురోజులా? ఈలోపల ఆ రవిబాబు మళ్ళీ పట్నం వెళ్ళిపోతాడేమో!" అన్నాడు రాంసింగు.

"పట్నమే కాదు... పరాయిదేశం వెళ్ళినా అతను తప్పించుకోలేడు. వెంటపడి తరిమి తరిమి చంపుతుంది నేను ప్రయోగించేశక్తి" గంభీరంగా అన్నారాయన.

పూర్తిగా కాకపోయినా కొద్దిగా కన్విన్స్ అవటంవల్ల, కూర్చున్న చోటి నుంచి లేచాడు రాంసింగు. "రాంసింగూ... అటు... అటు చూడు అటు...." అతని చెవి ఊదాడు పక్కనేవున్న భుజంగరాయుడి మనిషి ఒకతను. అతను చూపించినవైపు చూసిన రాంసింగుకి కుంకుడుచెట్టు వెనక చాపపై పడివున్న ఆకారం కన్పించింది.

“నా మనిషే.... నిద్రపోతున్నాడు. మీరు వెళ్ళి మూడురోజుల తర్వాత రండి” అన్నాడు గురువుగారు.

“మీరు మా ఊరికి వచ్చినప్పుడు ముగ్గురు మాత్రమే వున్నారు. నాలుగోమనిషి మీతో రాలేదు. అతని వాలకం, చూస్తూంటే మాకు తెల్సిన మనిషిలా కనిపిస్తోంది” అంటూ అటుకేసి కదిలాడు రాంసింగు.

“ఆగండి... అటుకేసి పోకండి... ఆగండి....” ఖంగుమంటున్న కంఠంతో బిగ్గరగా అన్నాడు గురువుగారు.

ఎక్కడివాడక్కడ ఆగిపోయి ఆశ్చర్యంగా అతనివంక చూశాడు రాంసింగు. “కరాళశక్తి కొలువైవున్న ప్రదేశం ఇది. ఎవరుపడితే వాళ్ళు, ఎప్పుడుపడితే అప్పుడు రావటానికి వీలులేదు. ఇంతవరకూ నేను చేసిన పూజలు వేస్ట్ అయిపోతాయి. మీరు అటు పోవాలంటే శుభ్రంగా స్నానం చేసి రావాలి. వెళ్ళి స్నానం చేసి రండి. అతను ఎవరో చూద్దురుగాని....” బింకం చెడకుండా, చాలా కన్విన్సింగ్‌గా చెప్పాడు గురువుగారు.

“ఇప్పుడు ఎటూకానివేళ స్నానం చేయాలా? మా వల్ల కాదు” అంటూ రాంసింగ్ తల ఊపకముందే వెనుతిరిగారు భుజంగరాయుడి మనుష్యులు.

రెండు క్షణాలపాటు కుంకుడు చెట్టువైపే చూసి తను కూడా వారిని అనుసరించాడు రాంసింగు.

“మూడు రోజుల తర్వాత వస్తాం” అని గురువుగారికి చెప్పటమైతే చెప్పాడుగాని, అక్కడినుంచి ఆరు ఫర్లాంగులు ఇవతలికి వచ్చిన తరువాత

ఉన్నట్లుండి ఒకచోట ఆగిపోయాడు. “నాకు ఏదో అనుమానంగా వుంది. అనుమానం తీరకుండా నేను వూళ్ళోకి రాను” అంటూ ఒక చెట్టుకింద కూర్చున్నాడు.

***

“వద్దు.... నువ్వు తొందరపడవద్దు.... కాస్తంత నిదానంగా నిలబడు” అంటూ పాండు చేతిని పట్టుకుని బలవంతంగా ఆపేశాడు రవిబాబు.

“పట్టపగలు పెద్ద మొనగాళ్ళ మాదిరి జీప్‌ని తీసుకువచ్చి, మీరున్న బండిమీదికి ఎగతోలుతుంటే ఇంకా తొందరపడవద్దు. నిదానించు అంటావేమిటి బాబూ?”

ముఖం ఎర్రగా మారిపోతుండగా అన్నాడు పాండు.

“ఆ భుజంగరాయుడిని చంపినా చంపకపోయినా ఒక్కటే.... ఎదురుపడి ఏనాడు ఏమీ చేయలేని చచ్చుముఖం వాడిది. తను చేయించిన ప్రయత్నం వమ్మయిందని తెలియగానే బ్లడ్ ప్రెషర్ పెరిగిపోతుంది వాడికి. మనకి అదిచాలు. వాడి పాపాన వాడు పోతాడు. ఇక్కడితో ఈ అంశాన్ని వదిలేయ్....” అన్నాడు రవిబాబు.

“నీ గురించి నేను చాలా చాలా ఊహించుకున్నాను రవిబాబూ. ఇలా చిన్న చిన్న మాటలు మాట్లాడతావని అనుకోలేదు” నిష్టూరంగా చూస్తూ అన్నాడు పాండు.

చిన్నగా నవ్వి అతని చేతిని వదిలిపెట్టాడు రవిబాబు. “నీకు తెలియదు పాండూ... భుజంగరాయుడి మీదికి యుద్ధానికి పోతున్నానని తెలిస్తే గ్రామంలో

వున్న మా అనుయాయులు, అభిమానులు అందరూ కట్టకట్టుకుని వచ్చి పడతారు. వాళ్ళల్లో ఎవరికి ఏ మాత్రం చిన్న దెబ్బ తగిలినా నాన్నగారు సహించలేరు. అందుకే నిన్ను ఆగమని అంటున్నాను. ఎవరికీ తెలియకుండా మనం ఇద్దరమే వెళ్ళి వాడి అంతు చూడటానికి నేను రెడీ... అది సాధ్యపడుతుందా?" తల వూపిన మరుక్షణం గ్రామంలోకి వెళ్ళి తన జనాలందర్ని భుజంగరాయుడి మీదికి ఉసికొల్పేందుకు రెడీగా వున్న తమ పాలేర్లవైపు కనులతోనే చూపిస్తూ, చిన్న కంఠంతో అడిగాడు రవిబాబు.

చిటికెలో మాయం అయిపోయింది పాండుని ఆవరించుకుని వున్న ఆవేశం. "మీరు చెప్పింది నిజమే బాబూ! నేను అంతదూరం ఆలోచించలేదు. ఈ గోలని ఇక్కడితో వదిలేద్దాం. మీరు మీ వాళ్ళని ఇంటికి పంపించేయండి" సాలోచనగా చూస్తూ చెప్పాడు.

"మా వాళ్ళని ఇంటికి పంపించేయాలా?" పాండువైపు చూస్తూ అనుమానంగా అడిగాడు రవిబాబు.

"అవును బాబూ.... రాత్రి ముసలయ్యతో మాట్లాడుతుంటే అష్టసిద్ధి యంత్రాన్ని గురించి నాకు కొన్ని ఆలోచనలు వచ్చాయి. ముచ్చింతల గట్టుదగ్గర కొందరు కోయవాళ్ళు వుండాలిట. వాళ్ళు అక్కడవుంటే, మన పని చాలా తేలిక అవుతుంది. ఒకసారి అటుకేసి పోయివద్దాం" తన ఆలోచనను అతనికి చెప్పాడు పాండు.

"నిన్న సాయంత్రం అపూర్వ నాకు ఫోన్ చేసిందట" అంటూ అప్పుడు జరిగిందేమిటో చెప్పాడతనికి రవిబాబు.

"ఇటు నుంచి ఇటు ఆ బిడ్డ దగ్గరికిపోదాం.... ఆ పని కూడా పూర్తి అయిపోతుంది. ముందు మీ వాళ్ళని ఇంటికి పంపించేయండి" ప్యాంటు జేబులో నుంచి బీడీని తీసి వెలిగించుకుంటూ అన్నాడు పాండు. అడవిలో జరిగింది ఏమిటో ఎవరికీ చెప్పవద్దని స్ట్రిక్ట్ ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చినా ఏమీ ఉపయోగం వుండదని రవిబాబుకి తెలుసు. కనుసైగచేస్తే చాలు, వట్టిచేతులతో భుజంగరాయుడి జనం మీద కలబడాలన్నంత కోపంతో రగులుపోతున్నారా పాలేర్లు.

"మీరు ఎవరూ ఆవేశపడవద్దు. పాండు, నేను కలిసి ఒక పన్నాగం పన్నుతున్నాం. ఆ భుజంగరాయుడి గర్వం దెబ్బకి అణిగిపోతుంది. మన చేతికి తడి అంటకుండా కార్యం సానుకూలపడుతుంది. మీరు వెళ్ళి కామ్‌గా మీ పనులు చూసుకోండి. ఎవరినీ రెచ్చగొట్టవద్దు. మీరు రెచ్చిపోవద్దు. అర్థమైందా?" అని అడిగి, వారు తలలు ఊపగానే ఎడ్లబండితో సహా ఇంటిదారి పట్టించాడు.

"బాబూ! తల్లికి దణ్ణం పెట్టుకోండి...." దూరంగా నిలబడిన ముసలయ్య దగ్గరికి వస్తూ రవిబాబుతో అన్నాడు.

కొండలమ్మ తల్లికేసి తిరిగాడు రవిబాబు. అతనికే కాదు ముసలయ్యకు కూడా వెంటనే కలిగింది అపరిమితమయిన ఆశ్చర్యం. ఎటో చూస్తోంది కొండలమ్మతల్లి... ఎప్పుడూ సూటిగా ముందుకు చూస్తూ వుండే ఆమె విశాల నేత్రాలు అడవి మధ్యలోకి చూస్తున్నాయి.

"ఇటువంటి వింత ఇంతకుముందు ఎప్పుడూ నా కళ్ళపడలేదు. ఏమిటి విచిత్రం?" ఆశ్చర్యం, ఆందోళన, భయం కలగలిపిన కంఠంతో అంటూ పది అంగల్లో తన గుడిసెలోకిపోయి, హారతిపళ్ళెరాన్ని తీసుకు వచ్చాడు ముసలయ్య.

నిమ్మకాయ సైజున్న కర్పూరగుడ్డను ఆ పళ్ళెరములో పెట్టి హారతి ఇచ్చాడు. నెమ్మదిగా, అతి నెమ్మదిగా మామూలైపోయింది కొండలమ్మ తల్లి. ఎప్పటిమాదిరిగా ముందుకు చూస్తూ వుండిపోయింది.

“బాబూ ఇది ఏదో అర్థం కావటంలేదు. మీరు నా మాట విని ఇంటికి వెళ్ళిపొండి. నేను స్నానం చేసి ధ్యానంలో కూర్చుంటాను. ఈ పరిస్థితిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తాను” రవిబాబు నుదుట కుంకుమ అద్దుతూ చెప్పాడు ముసలయ్య. అతనితో ఏదో ఆర్గ్యుమెంట్ పెట్టుకోబోయిన రవిబాబును కనుసైగతో ఆపి, “అలాగే ముసలయ్యా... కాస్సేపు అడవిలో అటూఇటూ తిరిగి ఇంటికి వెళ్ళిపోతాం. మా గురించి ఆదుర్దా పడవద్దు. నీ పని నువ్వు చేయి” అంటూ అక్కడి నించి కదిలాడు పాండు.

***

“ఏమిటి మామ్మా? ఏమిటి ఇవ్వాళ తొందరగా ఇంటికి తిరిగి వచ్చావ్? నీ తల్లికోసం తిరిగి తిరిగి కాళ్ళు పీక్కువచ్చాయా?” ఇంటి ముందు ఆటలాడుకుంటున్న పిల్లల్ని చూస్తూ కాలక్షేపం చేస్తున్న రంగమ్మ అలసటగా వచ్చిన పిచ్చిమామ్మని సాదరంగా పలకరించింది.

“కాళ్ళు పీక్కు వచ్చిన మాట వాస్తవమే పిల్లా... ముందు కాసిని మంచినీళ్ళు ఇవ్వు. తర్వాత మాట్లాడుకుందాం” అంటూ గుమ్మంలోనే చతికిలపడింది మామ్మ.

“అరేయ్ టింగూ… మీరు అవతలికిపోయి ఆడుకోండి. మన మామ్మకి చిరాకుగా వుందిట. త్వరగా వెళ్ళండి” అని పిల్లల్ని హెచ్చరిస్తూ లోపలికి పోయి పెద్ద లోటాతో మంచినీళ్ళు తెచ్చి మామ్మకిచ్చింది రంగమ్మ.

నోటి దగ్గర పెట్టుకోబోతూ, వున్నట్లుండి అదిరిపడింది పిచ్చి మామ్మ. “అరేయ్… నా బిడ్డ జోలికి పోవటానికి నీకు ఎంత ధైర్యం? నేను ఇంకా జవసత్వాలతోనే వున్నానురా… నీ పీచం అణుస్తాను!” అంటూ ఎడమ చేతితో కిందపెట్టిన చేతికర్రను బలంగా నేలకేసి అదిమి, గట్టిగా హుంకరించింది.

ఎగిరి అవతలపడింది రాజశేఖర్ ఆత్మస్వరూపం. పాండు పక్కనే అడుగులు వేస్తున్న రవిబాబును సమీపించబోతోంది అది. “ఏమిటది? ఏమయింది నాకు?” అని తనలో తను అనుకుంటూ మరోసారి రివ్వున ముందుకు దూసుకు రాబోయింది.

“మర్యాదగా వెనక్కి తిరుగు…. పిచ్చివేషాలు వేస్తే నిన్ను భస్మం చేసి ఇహానికి పరానికి ఎక్కడికీ కాకుండా పాతాళలోకానికి పంపించేస్తాను. తిరుగు వెనక్కి” ఉరుములాంటి కంఠం ఒకటి చెవులపడేసరికి అదిరిపడి, తనకు తెలియకుండానే దూరంగా పారిపోయింది.

***

“ఏమిటి మామ్మా? ఎవరిని కసురుకుంటున్నావ్?” ఆశ్చర్యంగా అడిగింది రంగమ్మ. లోటాలోకి చూస్తూ అదేపనిగా అరిచి కేకలు పెడుతున్న మామ్మని.

“నీ ముట్టెపొగరు మగాడు ఉన్నచోట వుండకుండా కొత్తకొత్త తలనొప్పుల్ని తెచ్చి నెత్తిపై పెట్టుకుంటున్నాడు. ఊరికే వదిలేస్తే లాభంలేదు. నేను వాడి దగ్గరికి

వెళ్ళివస్తానే తల్లీ!'' అంటూ లోటాను నీళ్ళు తాగకుండానే అవతల పారబోసి, కిందపెట్టింది పిచ్చిమామ్మ.

''ముట్టెపొగరు మగాడి దగ్గరికి వెళ్ళివస్తావా? పాండు దగ్గరికేనా?'' అయోమయంగా చూస్తూ అడిగింది రంగమ్మ. ''అవునే తల్లీ.... వాడి దగ్గరికే... వాడికి నా సహాయం అవసరమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. వాడిచుట్టూ ఏవేవో దుష్టశక్తులు చిందులు తొక్కబోతున్నాయి'' అంటూ చేతికర్ర సాయంతో లేచి నిలబడింది మామ్మ.

''నిలబడలేవు.... నిలబడితే కూర్చోలేవు.... నువ్వు పాండు దగ్గరికి పోతావా? అసలు పాండు ఎక్కడున్నాడని పోతావ్. నీకెలా తెలుస్తుంది?'' సత్తుపళ్ళెంలో పాండును చూసిన సంగతి పూర్తిగా మర్చిపోవడం వల్ల ఆశ్చర్యంగా పిచ్చిమామ్మని అడిగింది రంగమ్మ.

''నడవగా నడవగా ఊరు అదే వస్తుంది. అడగగా అడగగా జాడ అదే తెలుస్తుంది. వాడు నీ యజమాని రవిబాబు దగ్గరికి పోయాడు. నేను కూడా పోతాను'' అంటూ రెండోమాట లేకుండా మురికివాడలో నుంచి మెయిన్ రోడ్డు మీదికి బయలుదేరింది. రెండేరెండు నిముషాలు ఆలోచించి, అర్జంట్ గా తన ఇంటికి తాళం పెట్టింది రంగమ్మ. లోపల ఒక స్టీలుగ్లాసులో తను పొదుపు చేసుకున్న కరెన్సీ నోట్లన్నటినీ పమిటెచెంగులో ముడివేసుకుంటూ మామ్మను అనుసరించింది.

***

“ఏమి తినటమే అది? అన్నం తింటున్నావా? అటుకుల్ని తింటున్నావా? నీకు వయసు పెరిగినకొద్దీ బుద్ధి తగ్గపోతోంది. సరిగ్గా తిను...” ఉన్నట్లుండి తన తల్లి గట్టిగా అరవటంతో అదిరిపడింది అపూర్వ.

“అరవకండమ్మా.... అమ్మాయిగారి మనసు బాగోలేదు. రాఘవాపురం అవతల్నించి వచ్చినోళ్ళ దెబ్బకి పిచ్చి పట్టినట్లైంది. ఆరే సర్దుకుంటారు. మీరు అరవకండి” అంటూ అపూర్వని వెనకేసుకువచ్చింది పనిమనిషి.

“నోరు మూసుకో.... ఇంకోసారి దీన్ని వెనకేసుకువచ్చావంటే నీ వీపు వాయగొడతా...” అంటూ కసురుకుని వంటింట్లోకి వెళ్ళిపోయింది అపూర్వ తల్లి. నీరు నిండిన కనులతో పనిమనిషికేసి చూసింది అపూర్వ.

“నేనొక ఉపాయం చెపుతా.... మీరు అన్నం తిని గదిలోకి వెళ్ళండి” లోగొంతుకతో ఆమెకు మాత్రమే వినబడేటట్లు చెప్పి అవతలికి వెళ్ళిపోయింది పనిమనిషి.

గబగబ భోజనం చేసి తన గదిలోకెళ్ళింది అపూర్వ. “మా బుడ్డోడు పదో తరగతి బళ్ళారిలో చదువుతూ దసరా సెలవులకు ఇంటికి వచ్చాడు. రేపు ఉదయం వాడిని మీ రవిబాబు దగ్గరికి పంపిద్దాం. మీరు ఏదైనా ఉత్తరం రాసి రెడీగా వుంచండి. బళ్ళారి వెళుతున్నట్టు నటించి ఆడు రవిబాబు దగ్గరికికెళతాడు” రహస్యంగా చెప్పింది పనిమనిషి. ఆనందంతో వింతగా ప్రకాశించింది అపూర్వ వదనం. “అలాగే చేద్దాం... నేను లెటర్ రాసి వుంచుతా. నువ్వు పొద్దున్నే వచ్చేయ్” అంటూ అప్పటికప్పుడు రైటింగ్ ప్యాడ్ ని చేతుల్లోకి తీసుకుంది.

“లెటర్ రాస్తున్నావా? ఎవరికి? రవిబాబుకేనా?” అంటూ ఆమె ఎదుట ప్రత్యక్షమైంది రాజశేఖర్ రూపం. అదిరిపడి గది గుమ్మంవైపు చూసిందామె.

“నా మాటలు నీకు తప్ప ఇంకెవరికీ వినిపించవు. నీకు తప్ప ఇంకెవరికీ కనిపించను. మీ పనిమనిషి కిందికి వెళ్ళింది. ఖంగారుపడకు” అంటూ కుర్చీలో చేరగిలపడింది రాజశేఖర్ ఆత్మస్వరూపం.

“రవిని వెంటబెట్టుకు వస్తానని చెప్పి వెళ్ళిపోయావ్. వెంట తీసుకువచ్చావా?” కినుకు కలిగినట్టు ముఖం ముడుచుకుంటూ అడిగింది అపూర్వ.

“అవునుకదూ? వెంట పెట్టుకురావటానికి విశ్వప్రయత్నం చేశాను. ఇంకోసారి నా వీపు విమానం మోత ఎక్కే పరిస్థితి ఎదురై చేతులు ఊపుకుంటూ వచ్చేశాను. ఇంతకీ ఆ లెటర్ ఎవరికి రాస్తున్నావు...?” మరి కాస్తంత విశ్రాంతిగా కూర్చుంటూ అడిగిందా రూపం.

“ఎవరికో ఒకరికి రాస్తున్నా... నీకు చెప్పి ఏం ప్రయోజనం....?” కోపంగా అడిగింది ఆమె.

ఫక్కున నవ్వి ఆమె దగ్గరికిపోయిందా రూపం. “పిచ్చితల్లివి.... నీ రవిబాబు నీ కోసం అర్ధరాత్రి దాటిన అర్థఘడియకు ఈ ఊళ్ళో అడుగు పెడతాడు. అతన్ని కలుసుకునే మార్గం ఆలోచించుకుని సిద్ధంగా వుండు. నేను పోయి నా గదిలో కాస్సేపు కునుకుతీస్తాను” అంటూ ద్వారంవైపు కదలబోయింది. చేతిలోవున్న లెటర్ ప్యాడ్ ని అవతలికి విసిరి చేయి పట్టుకుంది అపూర్వ.

"ప్లీజ్... కోపం పట్టలేక నోటికొచ్చినట్టు ఏదేదో మాట్లాడాను... నన్ను క్షమించు. రవి ఎక్కడికి వస్తాడు? ఎలా వస్తాడు?" అని ఆసక్తిగా అడిగింది అపూర్వ.

"నీ దగ్గరికే బయల్దేరాడు. ఎక్కడికో, ఎలాగో నేను చెప్పలేను. అతగాడితో పాటు పాండు అనే మొండి జగమొండి తిరుగుతున్నాడు. అతను ఎంతచెపితే నీ రవిబాబుకి అంత! వాళ్ళిద్దరూ కలిసి ఏం ప్లాను వేశారో, ఏమిటో నాకు అర్థం కాలేదు" ద్వారం దగ్గరే నిలబడి చెప్పింది రాజశేఖర్ ఆత్మస్వరూపం.

"అర్థరాత్రి అంటే నాన్న అప్పటికి ఇంకా నిద్రపోడు. రచ్చబండ దగ్గర జనం కూడా కబుర్లతో కాలక్షేపం చేస్తూ వుంటారు. నేను ఇంట్లో నుంచి బయటికి పోవటమెలా?" బేలగా చూస్తూ అడిగింది అపూర్వ.

"నువ్వే వెలుపలికి పోయి రవిని కలుసుకుంటావా?"

"అంతే.. అతను ఇక్కడికి వస్తే మళ్ళీ అవమానాలపాలవుతాడు అన్నది" అపూర్వ.

"నువ్వు వెలుపలికి వెళ్ళినట్లు నీ తల్లిదండ్రులకు తెలియకూడదు. అంతేనా?" అవునని తల వూపిందామె. చిన్న మెరుపు మెరిసిందా గదిలో. రాజశేఖర్ స్వరూపం మాయమై, ఆ స్థానంలో ఇంకో అపూర్వ ప్రత్యక్షమైంది. రాఘవాపురం రహదారి మీదుగా వస్తాడు రవిబాబు. నువ్వు ఊరి వెలుపల రోడ్డు పక్కన నిలబడి అతని కోసం ఎదురుచూడు అంటూ ఆమె తలమీద అరచేతిని వుంచింది ఆ రూపం.

ఈదురుగాలిలో చిక్కుకున్నట్లు అనుభూతిని పొందిందామె. కళ్ళను గట్టిగా మూసుకుని క్షణం తర్వాత తెరిచింది. తన మేడ గదిలో లేదామె... రాఘవాపురం రహదారిలో నిలబడి వుంది. అడవిలోనుంచి చిత్ర విచిత్రమైన ధ్వనులను ఆలకిస్తూ పొదలోని కీచురాళ్ళ కేకలను వింటూ, రహదారి పక్కనేవున్న ఒక చెట్టుచాటున నిలబడింది.

"ఏమే.... పాలు తాగకుండా పడుకున్నావా?" అంటూ అపూర్వ గదిలోకి ఎంటరైన ఆమె తల్లికి ఏఅనుమానాలు రాలేదు. అపూర్వ స్థానంలో హాయిగా బెడ్ మీద చేరగిలపడిన రాజశేఖర్ రూపం ఆమె అందించిన గ్లాసును పక్కనే వున్న టేబిల్ పై పెట్టి "తర్వాత తాగుతానులే... నువ్వు వెళ్ళు" అన్నది చిరుకోపంతో.

"నిన్ను కాలేజీకి పంపించటం మాది బుద్ధితక్కువ... రోజురోజుకి నీ ఆకతాయితనం హద్దులు మీరుతోంది. మరిచిపోకుండా తాగు" అంటూ గది తలుపుల్ని దగ్గరికి లాగి కిందకి వెళ్ళిపోయింది అపూర్వ తల్లి.

తనలో తను నవ్వుకుంటూ గోడకి తగిలించిన గడియారం వైపు చూసింది రాజశేఖర్ ఆత్మస్వరూపం. పన్నెండు కావటానికి పది నిముషాలే వ్యవధి వుండటంతో గట్టిగా ఆవులించి బెడ్ మీదికి ఒరిగింది.

***

"వద్దు రాంసింగూ... మంత్రాల మరిడయ్యతో మనం తకరారు పెట్టుకోకూడదు. ఊళ్ళోకి వెళ్ళిపోదాం... పద" అంటూ బతిమాలిన సహచరుల్ని కసిరికొట్టాడు రాంసింగు. అతను చెట్టుకింద భైఠాయించిన క్షణం నుంచీ వాళ్ళు

అలాగే మాట్లాడుతున్నారు. అతన్ని వెనక్కి తీసుకుపోవటానికి ట్రై చేస్తూనే వున్నారు.

"నా అనుమానం తీరకుండా ఇక్కడి నుంచి అడుగు అవతలకేసేది లేదని మీకు ఇప్పటికి వెయ్యిసార్లు చెప్పాను. ఇంకోసారి నోళ్ళు తెరిచారంటే పళ్ళు రాలగోడతాను" అంటూ వాచీవంక చూసుకున్నాడతను.

అర్థరాత్రి పన్నెండును చూపించింది.

"మాంచి నిద్రలో వుండి వుంటారు. చప్పుడు చేయకుండా వెళ్ళి వాళ్ళ సెటప్ ఏమిటో స్వయంగా తెలుసుకుందాం. గుండె దమ్మున్నవాళ్ళు నాతోరండి.... దమ్ములేనివాళ్ళు వెళ్ళిపొండి" అంటూ పైకిలేచి గురువుగారి స్థావరంవైపు నడక మొదలుపెట్టాడు రాంసింగు. అతని వెనకాలే కదిలాడు అతని డ్రైవర్. క్షణకాలం ఆలోచించి ఊరివైపు వెళ్ళిపోయాడు భుజంగరాయుడి మనిషి.

***

"గోపాలం... ఒరేయ్ గోపాలం... పూర్తి అయింది జపం. నా జపం పూర్తి అయింది. కరాళశక్తి కదలటమే ఆలస్యం... నరబలికి సిద్ధం చేయ్...." ఖంగుమంటున్న ఖంఠంతో గోపాలాన్ని హెచ్చరించాడు గురువుగారు. వెంకటమ్మ దగ్గరికి దగ్గరికి జరుగుతున్న గోపాలం అదిరిపడి నిఠారుగా లేచి కూర్చున్నాడు.

కిసుక్కున నవ్వి పక్కకు జారిన పమిటెచెంగును సరిచేసుకుంది వెంకటమ్మ.

"నరబలికి సిద్ధం చేయటమంటే ఏమిటి?" అని ఆమెను అడిగాడు గోపాలం

"బలిమానవుడి నెత్తిమీద పసుపునీళ్ళు జల్లాలి. మెడలో పూల మాలలు వేయాలి. అతన్ని తీసుకుపోయి కరాళశక్తి ముందు కూర్చోబెట్టాలి" అంటూ తను కూడా లేచి ఆ పనులు చేయటానికి అవసరమైన సామాగ్రిని అతనికి అందించిందామె.

"ఇతనికి తెలివి వస్తే ఎలా వుంటుంది?" అని అడిగాడు గోపాలం. చాపమీద వున్న శివయ్యను చేతులమీద మోసుకుంటూ కరాళ శక్తి ముందు పడుకోబెట్టిన తర్వాత.

"తెలివి ఎప్పుడో వచ్చింది.. లేచి పరిగెత్తే ఓపిక మాత్రం లేదు." అంటూ పెట్టెలోని సీసాను అందించిందతనికి.

"సీసా తీసుకురా... సీసా...." అప్పుడే ఇంకో అరుపు అరిచాడు గురువుగారు. గబగబా అతని దగ్గరికిపోయి సీసాను అతని ఎదుట పెట్టాడు గోపాలం. పసుపు కుంకుమల్ని జల్లుతూ నిమ్మకాయల్ని చుట్టూ తిప్పి అవతలికి విసిరేస్తూ భీకరమైన కంఠంతో నోరు తిరగని మంత్రాలను అవలీలగా చదివాడు గురువుగారు.

"రావే... బయటికి రా...." ఉన్నట్టుండి పెద్దగా అరిచాడు.

ఫట్ మని శబ్దం చేస్తూ పగిలిపోయింది సీసా... సుడులు తిరుగుతున్న పొగలా బైటికొచ్చేసింది అందులోని ఆత్మస్వరూపం. "వెళ్ళు... వెళ్ళి బలిమానవుడి శరీరంలోకి ప్రవేశించు..." అంటూ ఇంకా కొన్ని మంత్రాల్ని చదివాడాయన. ఇష్టంలేనట్లు తల అడ్డం తిప్పిందా ఆకారం.

"తెగి అవతల పడుతుంది నీ తల... సర్వనాశనమైపోతావ్.... వెళ్ళు" అంటూ తన మంత్రదండం వంటి చేతికర్రతో బలంగా గాలిని మోదాడాయన. విపరీతమైన బాధతో విలవిల్లాడుతూ పోయి శివయ్య మీద పడిందా ఆకారం. అరక్షణంలో అతనిలో ఐక్యమైపోయింది.

అంతవరకూ తెలివిలేనట్టు పడుకుని వున్న శివయ్య వున్నట్టుండి నోరు తెరిచి హృదయవిదారకంగా అరిచాడు.

"వదిలేయండి.. నన్ను వదిలేయండి" అంటూ పైకిలేచి పరిగెత్తబోయాడు. రెండు అడుగులు కూడా వేయలేకపోయాడతను. మొదటి అడుగు వేస్తుండగానే, అంతకుముందు వరకూ చలనం లేకుండా వున్న కరాళశక్తి విగ్రహంలో చటుక్కున వచ్చింది కదలిక.

"ఆహారం... నాకు ఆహారం కావాలి. ఆహారం" అంటూ భయంకరమయిన ముఖం ఒకటి విగ్రహం పై భాగంలో ప్రత్యక్షమై వికటంగా అడిగింది.

"వచ్చావా? వచ్చావా తల్లీ... ఈ భక్తుడి ప్రార్థనల్ని ఆలకించావా?" అంటూ కూర్చున్న చోటి నుంచి లేచి, విగ్రహం పక్కనే పెట్టివున్న పెద్ద వేటకత్తి అందుకున్నాడు గురువుగారు. వెనకా ముందూ చూడకుండ శివయ్య శరీరం మీద దాన్ని ప్రయోగించాడు.

చటుక్కున వేరయింది శివయ్య తల. ఎర్రటి నెత్తురు ధారలు ధారలుగా కారుతుండగా పోయి విగ్రహం పాదాలమీద పడింది. విగ్రహం పై భాగంలో

ప్రత్యక్షమయిన తల వికటంగా నవ్వుతూ తీగెమాదిరి సాగి శివయ్య తలని, శరీరాన్ని చుట్టుముట్టింది. పదే పది క్షణాల్లో మటుమాయమయిపోయింది శివయ్య శరీరం.

"తృప్తి అయింది. అడుగు.... నీకేం కావాలో అడుగు...." నెత్తురుతో మలినమైన తల యథాస్థానంలోకి చేరుకుంటూ ఆయనని అడిగింది.

"నీకు తెల్సు... మహిమాన్వితమైన అష్టసిద్ధి యంత్రం ఎక్కడ వుందో నాకు తెలియాలి. నీకు తృప్తిని కలిగించిన కారణమదే" చేతులు జోడిస్తూ అన్నాడు గురువుగారు.

"అమోఘమైన ఆ యంత్రం నీకు దక్కుతుందని నేననుకోవడం లేదు....." అతని కోరికకు విరుద్ధంగా మాట్లాడింది ఆ తల.

"తల్లీ... దక్కాలి. నాకు ఆ యంత్రం దక్కాలి. దక్కకపోతే నేను ఊరుకోను" కోపంగా అరిచాడు గురువుగారు.

"ఏం చేస్తావ్ దక్కకపోతే?" అడిగిందామె తల.

కింద పడవేసిన వేటకత్తిని అందుకుని తన తలమీద చటుక్కున వేటు వేసుకున్నాడు గురువుగారు.

సన్నపాటి వెంట్రుకను సైతం రెండుగా చీల్చేంతటి పదును మీద వున్నది ఆ వేటకత్తి. పుచ్చకాయ దొర్లినట్లు దొర్లుకుంటూ కరాళశక్తి విగ్రహం దగ్గరికి వెళ్ళిపోవలసిన గురువుగారి తల అలా వెళ్ళలేదు.

అతని మెడను తాకేలోపలే తీగె మాదిరి ముందుకు సాగి ఆ కత్తిని పట్టుకున్నది కరాళశక్తి చేయి.

“తరతరాలుగా గాఢమయిన నిద్రలో వున్న నన్ను నీ జపాలతో నిద్రలేపావు. రుధిరభోజనం పెట్టి సంతుష్టురాలిని చేశావు. నీ కోరిక తీర్చటం నా విధి. అడుగు. నీకు ఏం కావాలో నిక్కచ్చిగా అడిగి నీ భ్రమతను తీర్చుకో” చిరునవ్వులు చిందిస్తూ అన్నది కరాళశక్తి విగ్రహం పై భాగంలో ప్రత్యక్షం అయిన భీకర స్వరూపం.

“తల్లీ.... నాకు ఏదీ వద్దు. అష్టసిద్ధి యంత్రం తప్ప... నా ఆశ, ఆశయం, నా జీవిత పరమార్థం ఆ యంత్రమే. అది లభించే మార్గం చెప్పు” చేతులు జోడించి వినయాతి వినయంగా అర్థించాడు గురువుగారు.

“సిరిపుర సంస్థానంలో కీర్తిరాయుడి సోదరి సుదంతి అజ్ఞానం కారణంగా ఆ సంస్థానాన్ని విడిచిపెట్టి ఆ అమోఘ శక్తి, ఆకాశంలో తోక చుక్క మాదిరి ప్రకాశిస్తూ వచ్చి మొదట ఈ అడవిలోని కొండలమ్మతల్లి విగ్రహం దగ్గర నేలను తాకింది. వెంటనే యంత్రంలోని సగం శక్తి కొండలమ్మకు సంక్రమించింది. నీటిమీదికి విసిరిన చిల్లపెంకులా అక్కడి నుంచి గాలిలోకి ఎగిరిన ఆ యంత్రం నువ్వు ఆత్మస్వరూపాన్ని తీసుకు వచ్చిన పాడుపడిన మేడదగ్గర ఇంకోసారి నేలను తాకింది.

అక్కడ మరికొంత శక్తి యంత్రం నుండి విడుదల అయింది. ఇంకోసారి గాలిలోకి ఎగిరిన ఆ అద్భుత యంత్రం చక్రతీర్థంలో పడింది. అందులో మిగిలిన శక్తిలో చాలా భాగం చక్రతీర్థానికి సంక్రమించింది. తనలో మిగిలివున్న అతి

కొద్దిపాటి శక్తితో అది అక్కడి నుంచి ముచ్చింతల గట్టుమీదికి పోయి అదృశ్యమైంది."

"ముచ్చింతల గట్టు మీదికిపోయి మాయమైందా? ఎక్కడ మాయం అయింది?" భీకర స్వరూపం చెప్పిన వివరాలన్నిటినీ మనసులో మననం చేసుకుంటూ ఆతృతగా అడిగాడు గురువుగారు.

"అది నేను చెప్పలేను.. నువ్వే తెలుసుకోవాలి. తెలుసుకునేముందు ఒక హెచ్చరిక.... వట్టి యంత్రమే నీకు లభిస్తుంది. నేలను తాకిన సమయాల్లో అది వదలివేసిన శక్తులను తిరిగి ఆ యంత్రంలోకి ప్రవేశపెడితే తప్ప వట్టి యంత్రంవల్ల నీకు ఎటువంటి వుపయోగమూ వుండదు. అర్థమైందా?" "వదిలివేసిన శక్తుల్ని తిరిగి యంత్రంలోకి ప్రవేశ పెట్టటం ఎలా తల్లీ?" ఆందోళనగా అడిగాడాయన.

"పాడుపడిన మేడలోని ఆత్మస్వరూపాన్ని జీవించి వున్న మానవుడి శరీరంలోకి ప్రవేశపెట్టటం తెలిసిన నీకు ఆ పని ఎలా చేయాలో తెలియదని అనటం హాస్యాస్పదం అవుతుంది. వెళ్ళు.... త్వరగా వెళ్ళి నీ మనోరథాన్ని ఈడేర్చుకో" అంటూ మటుమాయం కాబోయి చటుక్కున ఆగిపోయిందా భీకర స్వరూపం.

"ఈ సృష్టిలో ఎటువంటి ప్రాణి రెండుసార్లు మరణించటం అసంభవం. కానీ నీ తాంత్రిక ప్రయోగం వల్ల పాడుపడిన మేడలోని ఆత్మ స్వరూపం రెండవసారి కూడా మరణించింది. ఆ కారణంగా అది తను ఏ మానవుడితో కలిసి నాకు రుధిర భోజనం పెట్టిందో, ఆ మానవుడి ఆత్మతో సంయోగం చెంది భయంకరమైన క్షుద్రశక్తిగా మారిపోతుంది. అది నీ ప్రయత్నాలకు

అడ్డుతగలకుండా జాగ్రత్త వహించు.. జాగ్రత్త సుమా!" అని చెప్పి చటుక్కున కనుమరుగైపోయింది.

అంతవరకూ ఆ ప్రదేశాన్ని ఆవరించుకుని వున్న విచిత్రమయిన వెలుగు కూడా ఆ రూపంతోపాటు అదృశ్యం అయ్యేసరికి, కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించని కటికచీకటి తమను చుట్టుముట్టిన అనుభూతి కలిగింది గోపాలానికి.

"గురువుగారూ... మీరు ఎక్కడ వున్నారు?" అని అడగబోతుండగా అతనికి అగుపించింది కరాళశక్తి విగ్రహం ముందు రూపుదిద్దుకుంటున్న ఒక జడలరూపం.

చూసిన వెంటనే ఒళ్ళు జలదరించేటట్లున్న ఆ స్వరూపాన్ని గమనించి, వెర్రిగా అరవబోతున్న అతని నోటిని అతి బలంగా అదిమేసింది వెంకటమ్మ. "పారిపోవాలి మనం.... అదేదో చాలా భయంకరంగా వుంది. మనల్ని చూసిందంటే కరకరా నమిలి మింగేస్తుంది." అంటూ అతని చేతిని పట్టుకుని వెనక్కి లాగింది. అప్పుడే పుట్టినట్టు, తన చుట్టూ వున్న వాతావరణం తనకు విచిత్రంగా అగుపిస్తున్నట్టు తల విదిలిస్తోంది కొత్తగా ప్రత్యక్షమైన జడల స్వరూపం. వెంకటమ్మ మాటలు తనకు వినిపించాయి కాబోలు గుండెలు జలదరించేటట్లు అరిచి అమాంతం వారిమీదికి దుమికింది.

"ఆగు... ఆగిపో... కరాళశక్తి మీద ఆనపెడుతున్నాను. ఆగిపో" ఖంగుమంటున్న కంఠంతో హెచ్చరించి, ఏదో మంత్రాన్ని చదవసాగాడు గురువుగారు.

నిర్మోహమాటంగా వెంకటమ్మను పడగొట్టేసిందా స్వరూపం. గోపాలం గుండెల్ని రక్కి అతని కవోష్టరుధిరాన్ని ముఖానికి పూసుకుంటూ వికటంగా నవ్వింది.

క్షణం ముందువరకూ సజీవులై, అంతలోనే ప్రాణాలు పోగొట్టుకున్న తన వారిని చూసుకునేసరికి దారుణమైన భయం గురువుగారిని ఆవరించుకున్నది. మంత్ర పఠనాన్ని ఆపి, వేగంగా అక్కడి నుంచి పరారయ్యాడతను.

“పారిపోదాం. మనం కూడా పారిపోదాం” అంటూ రాంసింగు చేయి పట్టుకున్నాడు, పొదల్ని అడ్డుగా పెట్టుకుని రాంసింగుతోపాటు అక్కడ జరిగిన సంఘటనలన్నిటినీ చూసిన అతని డ్రైవర్.

“ఆగు బే... ఒక్క క్షణం ఆగు....” అంటూ అతన్ని అదిలించబోయి అదిరిపడ్డాడు రాంసింగు. తనకు తెలియకుండానే వెనక్కి తిరిగి పరుగు మొదలుపెట్టాడు.

పది గజాల దూరం మాత్రమే పోగలిగారు వాళ్ళు. పదకొండో గజం పోకముందే గబ్బిలం మాదిరి వచ్చి అతనిమీద, అతని డ్రైవర్ మీదా పడింది మోకాళ్ళ వరకూ జడలు వేలాడుతున్న ఆ వికృత రూపం.

గొంతు చించుకుని అరిచేందుకు వ్యవధి కూడా రాంసింగుకు లభించలేదు. చురకత్తుల మాదిరి వున్న ఆ వికృతరూపం చేతిగోళ్ళు గుండెలమీద పడి చర్మాన్ని చీల్చటంతో హతమారిపోయాడతను.....

అంతకు ఒక్కక్షణం ముందే తన డ్రైవర్ ప్రాణాలు గాలిలో కలిసిపోవటం అతను చూడలేదు.

రక్తపు స్పర్శతో ఎర్రగా మారిన చేతులను గాలిలో వూపుతూ చిందులు తొక్కింది ఆ జడలరూపం.. ఉన్నట్టుండి గాలిలోకి ఎగిరి నారాయణపురానికి దారితీసే మట్టిరోడ్డు మీద నిలబడింది. కనులు చిట్లించి అటూ ఇటూ చూస్తుండగా దానికి అగుపించారు వడివడిగా అడుగులు వేసుకుంటూ వస్తున్న ఇద్దరు మానవులు.

***

నడక మొదలుపెట్టిన క్షణం నుంచీ అలుపు ఆయాసం అనే మాటలకు అర్థం తెలియనట్టు వడివడిగా అడుగులు వేస్తున్న పాండు ఉన్నట్లుండి ఒక చోట ఆగిపోయాడు. "ఏమిటి? ఎందుకు ఆగావ్?" అని ఆశ్చర్యంగా అడిగాడు అతడిని రవిబాబు. "ఆయాసమా? కాస్సేపు ఆగి వెళదామా?" అని కూడా అన్నాడు.

ప్యాంటు జేబులో నుంచి బీడీని తీసి వెలిగించుకుంటూ తల అడ్డం తిప్పాడు పాండు. "మనల్ని ఎవరో చూస్తున్నట్లు నాకు అనిపిస్తోంది. మన మాదిరిగానే ఎవరయినా ఈ దారిలో నడుస్తూ నడవలేక మధ్యలోనే ఆగిపోయారేమొ!" బీడీ పొగను పీల్చుకుంటూ అన్నాడు.

"కొండలమ్మ తల్లికి భయపడిన దుమ్ము, ధూళి, గాలి మొదలైన వికృత స్వరూపాలు ఇటుగా పారిపోయి వచ్చి ఈ చుట్టుపట్ల సంచరిస్తూ వుండివుంటాయి. కొండలమ్మ తల్లి దగ్గర్నించి వచ్చాంకదా. వాటి జాడ మనకి ఖచ్చితంగా కనిపించకపోయినా, అవి ఉన్నట్టు, మనల్ని చూస్తున్నట్టు

అన్పించవచ్చు. ఇటువంటి అనుభవాలు గతంలో నాకు ఒకటి రెండుసార్లు ఎదురయ్యాయి" అంటూ సడన్‌గా మాటల్ని ఆపి, పెద్ద చెట్టుకేసి చేయి చూపించాడు రవిబాబు. కనులు చిట్లిస్తూ అటుకేసి చూసిన పాండుకు వెంటనే కనిపించింది కుందనపు బొమ్మ మాదిరి ఆ చెట్టు చాటున నిలబడి వున్న అపూర్వ.

"అరె... మన అపూర్వమ్మ... ఇక్కడికి ఎలా వచ్చింది? ఎందుకు వచ్చింది?" ఆశ్చర్యంగా అంటూ ముందుకు అడుగు వేశాడు పాండు. అతనికంటె ముందుగా అటుకేసి పరిగెత్తిన రవిబాబును చూసి తనూ రోడ్డు మీదికి వచ్చి, గాఢంగా కౌగలించుకున్నది అపూర్వ.

ఆనందం అధికమైపోయేసరికి, వెంటనే ముంచుకువచ్చేసింది విపరీతమైన దుఃఖం. వెక్కి వెక్కి ఏడ్వటం మొదలుపెట్టిన ఆమెను గట్టిగా గుండెలకు అదుముకుంటూ పాండుకేసి నిస్సహాయంగా చూశాడు రవిబాబు.

పది గజాలు ఇవతలగా ఆగి, ఎటో చూస్తున్న పాండు చిన్నగా నవ్వి పెదవుల మీద వేలు పెట్టుకున్నాడు.

అతని సైగను అర్థం చేసుకుని అపూర్వతో మాటలు మొదలుపెట్టలేదు రవిబాబు. ప్రశ్నలు వేయలేదు. కనీసం ఆమెకు ధైర్యం కూడా చెప్పలేదు.

గుండెల్లో గూడు కట్టుకుని వున్న వ్యథ అంతా కన్నీటి రూపంలో బయటికి వచ్చిన తర్వాత తనకు తనే కుదుటపడింది ఆమె. మలినమయిన బుగ్గల్ని పమిటె చెంగుతో అద్దుకుంటూ తల ఎత్తి అందంగా నవ్వింది.

"నువ్వు ఇక్కడికెలా వచ్చావ్ అని అడగబోతున్నావ్... అంతే కదూ?" అని అడిగింది అపూర్వ అతని నడుమును చేతులతో చుట్టి ముందుకు అడుగువేస్తూ.

"ఉత్తగా కాదు.... చాలా గట్టిగా... ఎలా వచ్చావ్?" అని అడిగాడు ఆమెని రవిబాబు.

"రాజశేఖర్ మామయ్య మీరు వస్తున్నట్టు చెప్పాడు. ఇంటిచుట్టూ కాపలా వున్న మా పాలేర్ల కంట పడకుండా అతనే తన శక్తితో నా గదిలోనుంచి మాయం చేసి ఇక్కడ నిలబెట్టాడు" చాలా ఈజీగా చెప్పింది ఆమె.

అయోమయంగా చూసిన రవిబాబుకు మరోసారి పెదవులమీద వేలు పెట్టుకుని సీరియస్ గా సైగచేశాడు పాండు.

"టెన్షన్ అధికం అవటంవల్ల ఒక్కోసారి రకరకాల భ్రమలు కలుగుతాయి. ఈ చుట్టుపట్ల గాలిధూళి అవేవో తిరుగుతూ వుంటాయని మీరే చెప్పారుగదా. ఆ కొండలమ్మ తల్లి బొట్టుపెట్టండి...." అని సలహా యిచ్చాడు.

"నువ్వా పాండు! నువ్వు ఇక్కడికి ఎలా వచ్చావ్? నీతోపాటు రంగమ్మ కూడా వచ్చిందా?" మొదటిసారి అతన్ని గుర్తుపట్టి ఆశ్చర్యంగా అడుగుతున్న అపూర్వ నుదుటికి తనకు ముసలయ్య పెట్టిన బొట్టును చూపుడువేలితో అద్దాడు రవిబాబు.

"అపూర్వా! నీకు ఇతను తెలుసా?" అని ఆమె వైపు చూస్తూ అడిగాడు.

“రంగమ్మ చాలాసార్లు చెప్పింది. మూడు నాలుగుసార్లు మాట్లాడాను. అవునుకదూ?” అని పాండును అడిగింది అపూర్వ. అంతటితో ఆగకుండా రంగమ్మను గురించి మాటలు మొదలుపెట్టింది.

“ఓ....కే.... మీ ఇద్దరికీ పరిచయం వుంది. ఒప్పుకుంటున్నాను. ఇప్పుడు మనం చేయాల్సింది ఏమిటి?” పదిక్షణాల తర్వాత వున్నట్లుండి అడిగాడు రవిబాబు.

“ముందు ఈమెని మన ఊరు చేర్చాలి. ఆ తర్వాత మనం ముచ్చింతల గట్టు దగ్గరికి పోయిరావాలి. అది చాలా ముఖ్యం...” అన్నాడు పాండు.

“ముచ్చింతల గట్టు దగ్గరికి పోయిరావాలా? ఎందుకు?” అనుమానంగా అడిగింది అపూర్వ.

“అదీ... ఎందుకంటే....” అంటూ మాటలు నాన్చటం మొదలుపెట్టిన రవిబాబుని, “చెప్పేయటం మంచిది. ఒక పనైపోతుంది....” అని హెచ్చరించాడు పాండు.

రహదారిని వదిలి ఒక పొద పక్కనుంచి అస్పష్టంగా అగుపిస్తున్న కాలిబాట మీదికి దారితీశాడు రవిబాబు. వందగజాల దూరం నడుచుకుంటూ వెళ్ళిన తర్వాత కనిపించిన పెద్ద నేరేడు చెట్టుకింద ఆమెను కూర్చోబెట్టి అష్టసిద్ధి యంత్రాన్ని గురించి, దాన్ని సాధించవలసిన పరిస్థితి గురించి సవివరంగా తెలియజేశాడు.

"నిన్ను ప్రేమించినప్పుడు నాకు ఈ విషయం తెలియదు. ఇప్పుడు తెలిసింది. నిన్ను పెళ్ళి చేసుకోవాలంటే మేము ఆ యంత్రాన్ని కనిపెట్టి తీరాలి. వేరేదారిలేదు" అంటూ మాటలు ముగించాడు రవిబాబు.

తన మాటలకు ఆమె ఆలోచనలో పడుతుందనీ, అటువంటి శాపం కలిగివుండి కూడా తనను ప్రేమించి తన జీవితాన్ని నాశనం చేశాడన్న దుఃఖంతో ఇంకోసారి ఏడుపు ప్రారంభిస్తుందనీ అనుకున్నాడు.

దారుణంగా తప్పిపోయింది అతని ఊహ.

"నాకు పిల్లలు అవసరంలేదు. నువ్వు చాలు. అష్టసిద్ధి యంత్రం దొరికినా, దొరక్కపోయినా నా నిర్ణయంలో మార్పు వుండదు. ముందు ఈ విషయం నీకు అర్థంకావాలి. అర్థం అయిందా?" అంతా విని రెండో ఆలోచన లేకుండా అతన్ని అడిగింది అపూర్వ.

మూగగా తల ఊపాడు రవిబాబు.

"ఓ....కే... దటీజ్ బెటర్. ఎక్కడో పడిపోయిందని మీరుకుంటున్న ఆ యంత్రం కోసం అడవి దార్ల వెంట పరుగులుతీయాల్సిన అవసరం లేదు. నేనడిగితే క్షణాలమీద ఆ యంత్రాన్ని మా మామయ్య తెచ్చి పెడతాడు."

అంతకుముందు ఆమెను ఆవహించిన దుమ్ము-ధూళి, గాలి మొదలయిన వికృతశక్తులు ఇంకోసారి వచ్చి మీదపడ్డాయనే అనుమానంతో పాండు వైపు చూశాడు రవిబాబు.

తన ప్యాంటు జేబులో మిగిలివున్న మూడే మూడు బీడీలలో మొదటిదానిని వెలిగించుకుంటూ ముఖం పక్కకు తిప్పేసుకున్నాడు పాండు.

తన ముఖంమీద ముసలయ్య పెట్టిన కొండలమ్మ తల్లి కుంకుమలో నుంచి మరికొంచెం చూపుడువేలితో అద్దబోయిన రవిబాబు వంక చాలా సీరియస్ గా చూసింది అపూర్వ.

"ఏమిటి సంగతి? నిముషానికి ఒకసారి బొట్లు పెడుతున్నావ్? నాకు నట్టు లూజ్ అయినట్టు అనుమానమా?" అని అడిగింది రవిబాబుని.

"అదికాదు అపూర్వా! అసలు నేను ఎందుకు ఇలా చేయాల్సి వచ్చిందంటే..." అని రవిబాబు సంజాయిషీ చెప్పుకోబోతుండగా, మధ్యలో ఆపి అతని ముక్కును పట్టుకుని ముద్దుగా వూపింది అపూర్వ.

"మా రాజశేఖర్ మామయ్యని గురించి నీకు తెలియదనే సంగతిని నేను మరిచిపోయాను. నాకు ఒక మేనత్త వుండేదిట. పేరు సువర్ణ.... పాతికేళ్ళ క్రితం...." అంటూ మొదలుపెట్టి ఆ రోజు రాజశేఖర్ తన రూపంలో గదిలో వుండిపోవటం వరకూ వివరంగా చెప్పిందతనికి.

"అయ్యబాబోయ్... ఈ కథ కూడా మన కథలాగానే వున్నది. నమ్మశక్యం కావటంలేదు..." ఆశ్చర్యంగా అంటున్న పాండుకేసి కొంచెం కోపంగా చూసి, మామయ్యా! వీళ్ళు నా మాటల్ని నమ్మటంలేదు. నువ్వు ఒకసారి ఇటురా అని ఎలుగెత్తి అరిచింది అపూర్వ.

***

ముందుకు దూకి తన చేతి గోళ్ళకు పని కల్పించాలని ఎంతగా అనిపిస్తున్నా, ఎందుకనో ఆ పనిచేయలేక మొదటగా కనిపించిన మానవులిద్దర్నీ కొత్తగా వారితో చేరిన సుందరాంగిని అనుసరించి వచ్చి, నేరేడు చెట్టుకు అల్లంత దూరంగా నిలబడింది జడల స్వరూపం.

చెట్టుకింద కూర్చున్న అపూర్వ ఎలుగెత్తి అరవటంతో, దాన్ని ఆవరించుకుని వున్న మందకొడితనం మటుమాయమైపోయింది. చాకుల మాదిరి వున్న కోరలు కన్పించేలా నోటిని తెరిచి చెట్టు దగ్గరికి జంప్ చేయబోయింది.

అంతలోనే జడల చాటున వున్న దాని కర్ణేంద్రియాలకు వినవచ్చిందొక కరుకు కంఠం.

“ఆగు... ఆగిపో... వందల సంవత్సరాలుగా అష్టసిద్ధి యంత్రాన్ని అన్వేషిస్తూ, మృత్యువును ధిక్కరించి బతుకుతున్న ఈ ముదివగ్గు చూస్తుండగా నువ్వు నా బిడ్డడినేమీ చేయలేవు. వెనక్కి తిరిగి వెళ్ళిపో...” తల మీద బరువైన వస్తువు ఏదో పడినట్టు తల విదిలించింది జడల రూపం. వెనక్కి మాత్రం తిరగలేదు.

“వట్టొట్టి మాటలు నీ మొద్దుబుర్రకి ఎక్కవు. చూడు నా దెబ్బ...” అంటూ ఇంకోసారి వినవచ్చిందా కంఠం. వికృత రూపం వెన్ను మీద పడింది బలమైన దెబ్బ ఒకటి. కీచుగా అరిచి గాల్లోకి ఎగిరిపోయిందది.

***

“ఏమిటి మామ్మా ఇది? నిద్రలో కూడా దెబ్బలు, గొడవలు... ప్రశాంతంగా పడుకోలేవా?” నిద్రాభంగం అయిన రంగమ్మ విసుగ్గా అనటంతో కిసుక్కున నవ్వి, తన చేతి కర్రని పక్కన పెట్టేసింది పిచ్చి మామ్మ.

“నువ్వు మాట్లాడకుండా పడుకో. పిచ్చిమాటలు మాట్టాడితే రైల్లో నుంచి మనల్ని దింపేస్తారు. చైన్ లాగి రైలుని ఆపేస్తారు” గట్టిగా ఆవులించి పక్కకు తిరిగి పడుకుంటూ పిచ్చిమామ్మని హెచ్చరించింది రంగమ్మ.

“నా బిడ్డ... నీ ముట్టెపొగరు మగాడు ఇన్ని సంవత్సరాలపాటు నేను చేయలేని పనిని అతి తేలికగా చేసి చూపించబోతున్నాడు. తెలియక చేసిన అపరాధానికి తరతరాలుగా శిక్ష అనుభవిస్తూ, విముక్తి అంటూ లభించక వెంపర్లాడుతున్న నాకు, ఈ ముదిమినుంచి, ఈ జన్మ నుంచి విముక్తి లభించబోతోంది. నాకు ఎంత సంతోషంగా వుందో నీకు ఎలా తెలుస్తుందే పిచ్చి నా తల్లి... నా సంతోషాన్ని పాడుచేసే పనులు చేసేవారి కనుగుడ్లు పీకిపారేస్తాను.

వాగ్బంధనం చేసి శాశ్వతంగా మూగతనం కల్పిస్తాను. నువ్వు పడుకుని హాయిగా నిద్రపోవే... నిద్రపో...” అంటూ ఆమె తల నిమిరింది పిచ్చిమామ్మ. రైలు రాఘవాపురం స్టేషన్ వైపు పరుగులు తీస్తూనే వున్నది.

***

“ఏడి మీ మామయ్య? నీ అరుపు వినిపించి వుండదు. ఇంకా కాస్త గట్టిగా అరువ్....” అంటున్న రవిబాబు వంక కోపంగా చూసి, చెవులు చిల్లులుపడేలా బిగ్గరగా అరవటానికి నోరు తెరిచింది అపూర్వ.

శబ్దం ఆమె పెదవుల్ని దాటి బయటికి రాకముందే ఠక్కున మెరిసిందొక మెరుపు. చిరునవ్వులు చిందిస్తూ వారి ఎదుట ప్రత్యక్షమైంది రాజశేఖర్ ఆత్మస్వరూపం.

"ఇడుగో నా మామయ్య...." అంటూ వారికి పరిచయం చేసి, వారిని ఆ రూపానికి కూడా ఇంట్రడ్యూస్ చేసిందామె.

"నిన్ను కలవాలని మీ దివాణానికి వచ్చాను. మీ కొండలమ్మ తల్లి నా దుమ్ముదులిపి గాలిలోకి ఎగతన్నింది..." అంటూ ముందుకు వచ్చిందా రూపం.

"మనం ఆ యంత్రం ఎక్కడ వుందో తెలుసుకున్నాక, నా మేనత్త ఆత్మ స్వరూపం ఎక్కడ వుందో కనిపెట్టాలి. అంతవరకూ నీకు, నాకు నో పెళ్ళి. అర్థమైందా?" ఓ కండిషన్ విన్పించింది అపూర్వ.

"ఒప్పుకోండి బాబూ! వెతుకులాటలకి అలవాటుపడ్డాక ఇంకో పని మీద ఊళ్ళు తిరగటం ఏమంత కష్టంకాదు. ఒప్పేసుకోండి..." తటపటాయించటం మొదలుపెట్టిన రవిబాబును హెచ్చరించాడు పాండు.

అలాగే అన్నట్లు తల ఊపిన రవిబాబును గట్టిగా కౌగలించుకుని బుగ్గని ముద్దాడింది అపూర్వ.

ఆశ్చర్యంగా, ఆనందంగా చూస్తున్న రాజశేఖర్ రూపంతో తమకు కావాల్సిన మేటర్ గురించి చెప్పింది.

"ముచ్చింతల గట్టుదగ్గర కోయలు ఎవరైనా ఉన్నారోలేదో తెలుసుకోవటం చిటికెలో పని. ఎవరికీ కనిపించకుండా మాయం అయిపోయిన దైవికశక్తిని

కనిపెట్టటం చాలా కష్టం. అయినాసరే ప్రయత్నం చేస్తాను” అంటూ మాయం అయింది రాజశేఖర్ రూపం.

“పని అయిపోయినట్టే. మనం ఇక తాపీగా కూర్చోవచ్చు” అంటూ నేరేడుచెట్టు మొదలుకు ఆనుకుని కూర్చుంది అపూర్వ.

ఆమె మాటలు ముగిసిన మూడో క్షణంలో గోడకుకొట్టిన రబ్బర్ బంతిలా వచ్చి ఆమె సమీపంలో పడింది రాజశేఖర్ ఆత్మస్వరూపం.

“తల్లీ... నీకు సంబంధించిన ఏపని మొదలుపెట్టినా నాకు తన్నులు తప్పటం లేదురా. ముచ్చింతల గట్టుదగ్గర మూడు కోయ గృహాలున్నాయి. వాటిని దాటి ఒక మిట్టమీదికి పోబోతుంటే ఎవరో లాగిపెట్టి వెన్నుమీద ప్రహరించారు. గింగిరాలు తిరుగుతూ వచ్చిపడ్డాను....” వీపును తడుముకుంటూ చిన్న ముఖంతో చెప్పింది.

ఆశ్చర్యంతో ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటూ లేచి నిలబడ్డారు పాండు, రవిబాబు.

“ముందు ఆ కోయల ఇళ్ళకువెళ్ళి మాట్లాడదాం....” అంటూ ముందుకు నడక మొదలుపెట్టారు.

***

“వేములపల్లి వెళ్ళాలా? వెళ్లేందుకు దారి వున్నదిగాని, మీరు ఎర్రబస్సులో వచ్చి వుంటే యకాయకి ఆ ఊరి పొలిమేరల్లో దిగిపోయే పని. ఇప్పుడు చాలాదూరం నడవాలి....” తెల్లవారుఝామున రైలు దిగి ప్లాట్‌ఫాం మీద నిలబడిన రంగమ్మకి చెప్పాడు స్టేషన్ మాస్టర్.

"ఫరవాలేదురా అబ్బాయ్! నాకు ఇంకా శక్తి మిగిలి వుంది. నడుస్తాను..." అంటూ రంగమ్మ చేయి పట్టుకుని స్టేషన్ బయటికొచ్చింది మామ్మ.

సరిగ్గా అదే సమయంలో మోతలు చేసుకుంటూ అక్కడికి వచ్చాయి రెండు జీప్‌లు. కర్రలు, కత్తులు పట్టుకున్న జనం వాటిల్లోనుంచి దూకి స్టేషన్ లోకి పరుగుతీశారు.

"మామ్మా... వాళ్ళల్లో అపూర్వమ్మ తండ్రి రత్నంగారు వున్నాడు" ఆందోళనగా అన్నది రంగమ్మ.

"వాడు నీకెలా తెలుసే?" అంది.

"ఒకటి రెండుసార్లు అపూర్వమ్మని కలవటానికి మన పట్టణం వచ్చాడు. దూరం నుంచి చూశాను. మరునాడు ఎవరని అడిగితే అపూర్వమ్మ చెప్పింది" అన్నది రంగమ్మ మామ్మతో

స్టేషన్ లోకి పోయిన జనం, అక్కడ ఇంకో రైలుకోసం ఎదురు చూస్తున్న రాఘవాపురం జనాల్ని బెదిరించి, అల్లరిచేసి, స్టేషన్ మాస్టర్ గదిలోకి వెళ్ళారు.

"మీ అమ్మాయి నాకు తెలుసు. ఇక్కడికి రాలేదు. వస్తే మీకు తప్పకుండా ఫోన్ చేసి చెపుతాను..." అధికంగా మాట్లాడకుండా అపూర్వ ఫాదర్‌తో అన్నాడు స్టేషన్ మాస్టర్.

"అది ఇక్కడికి రాలేదు. ఎక్కడికి పోయి వుంటుంది...?" తన స్నేహితులకేసి చూస్తూ అడిగాడు రత్నంగారు.

“ఒకవేళ అడవిని క్రాస్ చేసి వేములపల్లివైపు వెళ్ళి వుంటుందేమో!” సాలోచనగా అన్నాడు ఒక స్నేహితుడు.

రెండు క్షణాలు ఆలోచించి వేగంగా వెలుపలికి వచ్చాడు అపూర్వ పాదర్ స్టేషన్లోంచి. తన జీప్ ఎక్కి “పదండి... వేములపల్లికి పదండి” అని ఆర్డర్ యిచ్చాడు.

రెండో జీప్ లో ఎక్కబోతూ ఒక్కక్షణం డ్రైవర్ని ఆగమని సైగ చేశాడు. రత్నంగారి స్నేహితులలో మొదటివాడయిన చలమయ్య.

“ఇప్పుడే ఒక్క నిముషంలో వచ్చేస్తాను” అంటూ ఒక పక్కగా వున్న పెద్ద నిద్రగన్నేరు చెట్టుకేసి అడుగులు వేశాడతను.

“వెళ్ళండి... ఇంకా ఎవరికైనా అవసరం వుంటే త్వరగా వెళ్ళి వచ్చేయండి. రత్నం ఈ పాటికి మైలు దూరం వెళ్ళిపోయి వుంటాడు...” అంటూ మిగిలిన వారిని హెచ్చరించి, తనూ చలమయ్య వెనకే బయలుదేరాడు రెండో స్నేహితుడు పోతురాజు.

ఇంకో అరగంటలో తెల్లవారబోతున్నదనటానికి సూచనగా తూర్పు దిక్కున ప్రత్యక్షమైంది వేగుచుక్క.. ఆకాశపు అంచులు తెల్లబడటం స్టార్ట్ అయింది.

ఆ మసక మసక వాతావరణంలో తన పని ముగించుకుని వెనక్కి వచ్చేయాల్సిన చలమయ్య వచ్చిన పని మరిచి, గుడ్లప్పగించి చూస్తూ కనిపించాడు పోతురాజుకి.

“ఏమిటిరా? ఏమయ్యింది? ఏమిటి చూస్తున్నావ్?” ఆశ్చర్యంగా అడిగాడు అతను చలమయ్య పక్కకిపోయి.

“శివయ్య భార్య.... మన బార్బరు శివయ్య పెళ్ళాం” రహస్యం చెపుతున్నట్టు లో గొంతుకతో చెప్పి, చెట్టు అవతలిపక్కకు చూపించాడు అతను.

అటుకేసి చూసిన పోతురాజుకి వెంటనే కనిపించింది బార్బరు శివయ్య భార్య సిమ్మాచలం.

అప్పుడే కాయను వలిచి బయటికి తీసిన పనసతొన మాదిరి పదునైన ఒంపులతో ఆకర్షణీయంగా వుంటుంది సిమ్మాచలం.

పిల్లాజెల్లా లేకపోవటంతో రోజు రోజుకి ఆ అందం అధికమవుతున్నదేగాని కొంచెంగా కూడా రంగు మాయటంలేదు. కంటికి కన్పించకుండా పోయిన శివయ్య కోసం తిండి, నిద్రలేక నారాయణపురంలో ఏడుస్తూ వుండాల్సిన ఆమె... ఆ సమయంలో అక్కడికెందుకొచ్చిందో పోతురాజుకి అర్థం కాలేదు.

“ఏమిటిరా చలమయ్యా? ఏంటి కథ?” వచ్చిన పనిని మర్చిపోయి తనూ చలమయ్యని అడిగాడతను.

“చూడు గట్టిగా అరవబోకు. అలాగే చూడు...” రహస్యంగానే అన్నాడు చలమయ్య.

అతను అలా అంటున్న సమయంలోనే చిన్నగా నవ్విందామె. కాటుక కళ్ళను కొంచెం పెద్దవిచేసి అదోలా చూసింది పోతురాజుకేసి.

“ఓసినీ... నారాయణపురం చాలలేదా నీకు?” రాఘవాపురం కావాల్సివచ్చిందా...?” అంటూ చకచకా ముందుకు నడిచి ఆమెను సమీపించాడు పోతురాజు.

“నమస్కారం మాబుగారూ! ఏంటీ మీదిమీదికి వచ్చేస్తున్నారూ? ఏం చేస్తారూ?” నవ్వుతూనే రెండడుగులు వెనక్కి వేసి వయ్యారంగా అడిగింది సిమ్మాచలం.

చెవులలోనుంచి, నాసికా రంధ్రాలలోనుంచి సెగలు, పొగలు వెలువడుతున్న అనుభూతి వెంటనే కలిగింది పోతురాజుకి. వెనుకా ముందు చూసుకోవటం మరిచిపోయాడతను.

“రేయ్ చలమయ్యా! చూస్తూ వుండు. ఇప్పుడే వచ్చేస్తాను” భుజం మీది నుంచి తన స్నేహితుడిని హెచ్చరించి, ఇంకొంచెం ముందుకు దారి తీశాడు.

“మొగుడు కనిపించకుండా పోయినప్పటి నుంచీ నా బతుకు ఏడుపుబతుకు అయిపోయింది. ఈ సమయంలో ఇట్టాంటి పనులు నా పరువు తీసేస్తాయి....” అంటున్న సిమ్మాచలం చేయి పట్టుకుని ఎత్తుగా ఎదిగివున్న పొదచాటుకు లాగాడు. రెండు చేతులతోను ఆమెను కౌగలించుకుని తమకంగా పెదవుల్ని ముద్దు పెట్టుకోబోయాడు.

అప్పుడు – అలా మీదికి ఒరిగినప్పుడు అతనికి కనిపించాయి ఆమె పెదవుల చివర్ల నుండి వికృతంగా వెలుపలికి పొడుచుకువస్తున్న కోరలు. అదిరిపడి ఆమెను అవతలికి నెట్టేయటానికి ట్రై చేశాడు.

“వదలనురా... నిన్ను వదలను.... నా అన్నకు స్నేహితుల మాదిరి నటించి, నా పచ్చటి జీవితాన్ని నిప్పచ్చరం చేసేసిన నిన్ను వదిలే ప్రసక్తి లేదు...” అంటూ తన కౌగిలిని మరింత బిగించింది సిమ్మాచలం.

““వదులు... వదిలేయ్... వదులు...” ఖంగారు నిండిన కంఠంతో కీచుగా అరవటానికి ప్రయత్నించాడు పోతురాజు. అప్పటికే ఆలస్యం అయిపోయింది.

చురకత్తుల వంటి కోరల్ని, బాకులవంటి మునిపళ్ళతో సహా అతని కంఠనాళం మీద గుచ్చి, పెద్దపులి మాదిరి తల విదిల్చింది సిమ్మాచలం.

తమతోపాటు జీప్ దిగి కాలకృత్యం కోసం అటూ ఇటూ వెళ్ళిన వారందరూ జీప్ దగ్గరికి చేరుకుని హారన్‌ని గట్టిగా అదమటంతో విసుగ్గా అటుకేసి చూశాడు నిద్రగన్నేరు చెట్టుకు అవతలి పక్కన నిలబడిన చలమయ్య.

“ఆగండిరా... ఒక్కక్షణం ఆగండి... వచ్చేస్తున్నాం....” అంటూ వారిని కసురుకుని, రెండు నిమిషాలు వెయిట్ చేశాడు. మూడో నిముషంలో కుతూహలాన్ని అదుముకోవడం చేతకాక తను కూడా చెట్టు దగ్గర్నించి చకచకా ముందుకు అడుగు వేశాడు.

పొద దగ్గర కనిపించింది సిమ్మాచలం... “పోతురాజు ఏడి?” అని అడుగుతూ ఆమె దగ్గరికిపోబోయిన చలమయ్యకి నేలమీద వెల్లకిలా పడిపోయినంత పని అయింది.

“ఏమిటిది? ఏమయింది వీడికి?” ఆందోళనగా అడుగుతూ ముందుకు వంగబోయిన అతని మెడమీద గుచ్చుకున్నాయి పదునుగా వున్న చేతి గోళ్ళు.

"ఎవరు? ఎవరు నువ్వు?" విపరీతమైన భయంతో బెంబేలెత్తిపోతూ సిమ్మాచలాన్ని అడిగాడతను.

"చూడు. బాగా చూడు" అంటూ నవ్వింది సిమ్మాచలం.

నవ్వుతూ వుండగానే రకరకాల మార్పులకు గురైంది ఆమె వదనం. సిమ్మాచలం, కాస్తా సువర్ణ... రత్నంగారి చెల్లెలు సువర్ణగా మారిపోయింది.

"నువ్వా... నువ్వు పాతిక సంవత్సరాల క్రితం చచ్చిపోయావ్... నువ్వెందుకు వచ్చావ్?" తడి ఆరిపోయిన కంఠంతో అడుగుతూ, అక్కడి నించి వెనక్కి పరిగెత్తేటందుకు ప్రయత్నం చేశాడు చలమయ్య.

అతని మెడమీది పట్టును కొద్దిగా కూడ సడలించలేదా విచిత్ర రూపం.

"నా నిండు జీవితాన్ని అడవిపాలు చేసిన నీకు మరణం తప్పదు, చావరా దుర్మార్గుడా... చావు" అంటూ ఖాళీగావున్న రెండో చేతిని వేగంగా పైకి ఎత్తి అతని వెన్నుమీద గట్టిగా చరిచింది.

శరీరంలోవున్న రుధిరమంతా ముక్కు చెవుల్లో నుంచి బయటికొచ్చేస్తుండగా వెల్లకిలా పడివున్న స్నేహితుడి శరీరంపై వాలిపోయాడు చలమయ్య. అరనిముషంలో ప్రాణాల్ని కోల్పోయాడు.

"మూడోవాడు మిగిలేవున్నాడు. వాడిని కలుసుకోవాలి...." అంటూ అదృశ్యమయింది సిమ్మాచలం రూపంలో వచ్చిన జడల స్వరూపం. మరో పది నిముషాలు వెయిట్ చేశారు జీప్ దగ్గర నిలబడిన జనం.

అప్పటికే అవతలికిపోయిన స్నేహితులు వెనక్కి రాకపోవటంతో అనుమానం కలిగి, నిద్రగన్నేరు చెట్టును దాటి పొదల దగ్గరికి వచ్చారు. విగతజీవులై పడివున్న వారిద్దరినీ చూసేసరికి మతులు పోయినంత పనై, వెర్రిగా కేకలు పెడుతూ జీప్ దగ్గరికి పరుగులు తీశారు.

***

"ఏరిరా? వీళ్ళు ఇంకా రావటంలేదేమిటి?" రాఘవాపురం స్టేషన్‌కి నాలుగుమైళ్ళ దూరంలో జీప్‌ని ఆపించి వెనక్కి చూస్తూ అసహనంగా అన్నాడు రత్నంగారు.

"వాడు ఆ చలమయ్యగాడు ఆపేసి వుంటాడు. పట్టుమని పది నిముషాలు కూడా జీపులో కూర్చోలేడు. నాలుగు మైళ్ళకు ఒకసారి కిందికి దిగి పొదల దగ్గరికి పోయిరావాల్సిందే – ప్రోస్టరేట్ ట్రబుల్..." నవ్వుతూ చెప్పాడతనిక పక్కనేవున్న మూడో స్నేహితుడు కనకయ్య.

"ఏడిచాడు... డాక్టరు దగ్గరికి పోదామంటే వినిపించుకోడు... వట్టి పిసినారి" తన గుండెల్ని తొలుస్తున్న ఆగ్రహాన్ని ఒకింతసేపు మరిచిపోతూ స్నేహితుడిని తలచుకుని తిట్టాడు రత్నంగారు. "మనం నెమ్మదిగా కదులుతూ వుందాం... వాళ్ళే వస్తారు" అని అంటూ వుండగా, స్టేషన్ దగ్గరినుంచి కాలి నడకన వస్తున్న ఇద్దరు ఆడవాళ్ళు కన్పించారతనికి.

"వీళ్ళు ఎవరు? ఈ అడవిలో ఈ సమయంలో?" అంటూ జీప్ లోంచి దిగి దారి మధ్యలో నిలబడ్డాడు రత్నంగారు.

"వేములపల్లి గ్రామానికి పోవాలి... దారి ఇదేకదూ నాయనా?" నడవలేక నడుస్తున్నట్టు ఆయాసపడుతూ అతన్ని అడిగింది వారిలో ఓ వృద్ధురాలు.

"దారి ఇదేగాని ఈ సమయంలో మీరు ఒంటరిగా వెళ్ళటం ఏమంత మంచిదికాదు మామ్మా. వేములపల్లిలో ఎవరింటికి?" సాదరంగా ప్రశ్నించాడు రత్నంగారు.

"దొరగారి ఇంటికి. అర్జంటుగా ఆయన్ని కలుసుకోవాలి..." తడుముకోకుండా చెప్పింది ఆ వృద్ధురాలు.

రత్నంగారి వదనంలో ప్రతిఫలిస్తున్న అనునయభావం హఠాత్తుగా మాయమైపోయింది.

"ఏమిటీ? దొరగారి ఇంటికా? వెళ్ళండి దారి ఇదే. వెళ్ళండి" అంటూ కటువుగా చెప్పి ముఖాన్ని పక్కకు తిప్పుకున్నాడాయన. వృద్ధురాలి పక్కనున్న చూడచక్కని ఆడమనిషి అదోలా చూసింది అతనికేసి.

"పదవేపిల్లా.. పదపద.... ఆడకూతుళ్ళు అడవిదారి వెంట వెళుతుంటే చూసి అయ్యోపాపం అనుకోనివాళ్ళతో మనకు పనిలేదు. పద పద..." అంటూ ఆ మనిషి చేయిపట్టుకుని వడివడిగా ముందుకు అడుగేసింది వృద్ధురాలు.

"అరేయ్ రత్నం! ఎవర్రా వాళ్ళు?" ఆమె పక్కనవున్న ఆడమనిషి వైపు చూస్తూ అడిగాడు కనకయ్య.

"ఎవరయితే మనకెందుకు? పోనీ... వాళ్ళదారిన వాళ్ళను పోనీ.." అంటూ రిస్ట్ వాచివైపు చూసుకున్నాడు రత్నంగారు చాలా అసహనంగా.

రెండు నిముషాలు ఆగి, “అరేయ్ రత్నం... మనం ఒక పని చేద్దాం... ఒకవేళ అపూర్వ చీకటి సమయంలో దారితెలియక చక్రతీర్థంవైపుగాని, ముచ్చింతల గట్టుకేసి కాని వెళ్ళివుండవచ్చు.

నలుగుర్ని వెంటబెట్టుకుని నేను అటుకేసి వెళ్ళివస్తాను. నువ్వు ఈ లోపల వేములపల్లి వెళ్ళి వచ్చేయ్....” అని చెపుతూ అతని సమాధానం కోసం ఎదురు చూడకుండా కిందికి దిగాడు కనకయ్య జీప్ లోనుంచి.

మరింత అధికం అయిపోయింది రత్నంగారి అసహనం. “నువ్వు ఒకపనిచేయి... మేము వేములపల్లి వెళ్ళివస్తాం... వెనకాలవున్న చవటలు వస్తే వాళ్ళని వెంటబెట్టుకుని చక్రతీర్థం దగ్గరికి, ముచ్చింతల గట్టు దగ్గరికి పోయిరా... టైమ్ వేస్ట్ చేయటం అనవసరం” అంటూ చటుక్కున జీప్ ఎక్కి డ్రైవర్‌కి సైగచేశాడు.

దుమ్ముతెరలు రేపుతూ దూరంగా వెళ్ళిపోతున్న ఆ జీప్ వంకా, రాఘవాపురం స్టేషన్ దారివంకా ఒకసారి చూసి, పెద్ద పెద్ద అడుగులు వేస్తూ వెళ్ళాడు కనకయ్య.సరిగ్గా నాలుగే నాలుగు నిముషాల్లో నడవలేక నడవలేక నడుస్తున్న వృద్ధురాలిని కలుసుకున్నాడు.

“వేములపల్లి వెళ్ళటానికి ఇటునుంచి దగ్గరదారి ఒకటుంది. నాకు బాగా తెలుసు. నాతో వస్తానంటే తీసుకుపోతాను... నేను అక్కడికే పోతున్నాను” అంటూ వారికి సహాయం చేయటానికి సంసిద్ధతని వ్యక్తం చేశాడు.

“నా బాబే... దేవుడిలా వచ్చావ్. తప్పకుండా నీతోపాటు వస్తాము. పద నాయనా...” అంటూ రెండోమాట లేకుండా సంతోషంగా ఒప్పేసుకుంది వృద్ధురాలు.

ఆమె వయస్సుకు ఎంతో గౌరవాన్ని ఇస్తున్నట్లు ఎగుడుదిగుళ్ళలో ఆమెకు చేతిని ఆసరాగా ఇస్తూ, రహదారి మీదినించి ఒక కాలిబాటకేసి తీసుకుపోయాడు కనకయ్య. దట్టమయిన పొదలు తమను పూర్తిగా కమ్ముకునేదాకా ఆగి, ఆమెను బలంగా ఒకపక్కకు నెట్టాడు. అతను అలా చేస్తాడని అనుకోకపోవటం వల్ల ఆశ్యర్యంతో మ్రాన్పడిపోయింది వయసులో వున్న ఆడమనిషి.

“అయ్యయ్యో... ఏమిటిరాబాబూ ఈ పని? ఇంతలోనే ఏమయిందిరా నీకు?” అల్లంత దూరంలో చతికిలపడుతూ ఆవేదనగా అడిగింది వృద్ధురాలు.

“నోరు మూసుకుని కూర్చో... నోరు తెరిచావంటే నిన్ను చంపి ఇక్కడే పాతిపెడతాను” అని ఆమెను చాలా వికృతంగా హెచ్చరించి, వయసులోవున్న ఆడమనిషి చేతిని గట్టిగా పట్టుకున్నాడు కనకయ్య.

అరిచి కేకలుపెడుతుందనీ, అటూ ఇటూ పరిగెత్తుతుందనీ అనుకున్నాడతను.

“నా చేతిని పట్టుకోవటానికి నీకెంత ధైర్యం? నీ ముఖం పగలగొట్టేస్తాను” అంటూ రెండో చేత్తో అతని ముఖంమీద చరిచిందామె.

వృద్దురాలు పడిపోతున్నప్పుడు ఆనమె నిర్ఘాంతపడి నోటిమాట లేకుండా అలాగే నిలబడిపోవటాన్ని చూసి భయస్తురాలిగా, పిరికి ప్రాణంగా భావించిన

కనకయ్యకి చాలా పెద్దషాకే తగిలింది. కళ్ళు పచ్చబడి గిర్రున తిరిగినట్లయ్యేసరికి, తనకు తెలియకుండానే ఆమె చేతిని వదిలి రెండు అడుగులు వెనక్కి వేశాడు.

"ఒంటరిగా వస్తున్నామనుకుని, ఏం చేసినా చెల్లుబాటు అయిపోతుందని భావించావా? నీలాంటి చవటల్ని రోజుకి వందమందిని చూసే రంగమ్మనిరా నేను..." అంటూ సివంగి మాదిరి అతని మీదికి ఎగబడింది ఆ ఆడమనిషి. పిడికిళ్ళతో గుండెలమీద బాది, ఎడమకాలి చెప్పుతో ఎడాపెడా కొట్టింది ముఖంమీద.

"ఆగవేపిల్లా... ఆగు... ఆ దరిద్రుడి ఒంటిని తాకకు. వాడు అసలే వావివరసలు లేని చవట... పమిటెచెంగు కనిపిస్తే చాలు పిచ్చిపట్టిన వాడిలా వెంటపడే కుక్క... నువ్వుండు.. వాడి సంగతి నేను చూస్తాను" అంటూ పైకి లేచింది కింద చతికిలపడివున్న మామ్మ.

నడుము వంగిపోయి నడవలేక నడవలేక నడిచే వృద్ధురాలు అమాంతంగా ఆకాశమంత ఎత్తు ఎదిగినట్టు, ఆమె చేతికర్ర పదునైన బరిసెగా మారిపోతున్నట్టు కన్పించి మరింతగా భయపడిపోయాడు కనకయ్య.

రెండోఆలోచన చేయకుండా గిరుక్కున వెనక్కి తిరిగి, దట్టంగా పెరిగివున్న పొదలను విరగదొక్కుకుంటూ పరుగులు మొదలుపెట్టాడు అతను.

సూర్యుడు కాస్తంత పైకి రావటంతో వెలుగులతో నిండిపోయింది ఆ అడవి... చెట్ల మీద వున్న పక్షులు, పిట్టలు అన్నీ ఆహారం కోసం తలా ఒక ప్రక్కకు ప్రయాణమైపోవటానికి సిద్ధపడుతున్నాయి.

ఆ తొలి వెలుగుల సందడిలో గుడ్డిగా పరుగులు తీస్తున్న కనకయ్యకు కనిపించింది రత్నంగారి చెల్లెలు సువర్ణ. మోకాలిలోతున్న ఒక నీటిగుంట దగ్గర నిలబడి దిగులు నిండిన కనులతో ఎటో చూస్తోంది. తన కళ్ళను తనే నమ్మలేక ఎక్కడి వాడక్కడ ఆగిపోయిన అతన్ని చూసి అందంగా చాలా అందంగా, దిగులుగా నవ్విందామె. "సు... సువర్ణా... నువ్వు... ఇక్కడ.. ఇది..." చుట్టూ చూస్తూ తడబడుతున్న కంఠంతో అడిగాడతను.

"దగ్గరికి రా.... దగ్గరికి వచ్చి మాట్లాడు..." తియ్యటి కంఠంతో అతన్ని పిలిచింది ఆమె. అనుమానంగానే చూస్తూ ముందుకు కదిలాడు కనకయ్య.

"నా రాజశేఖర్‌ని నాకు కాకుండా చేసి, నన్ను నాశనం చేయాలని ప్రయత్నించిన ఇద్దరు ఎప్పుడో హతమయిపోయారు. ఇక మిగిలింది నువ్వు ఒక్కడివే" అన్నదామె.

అర్థమైపోయింది కనకయ్యకి. వృద్ధురాలితో వున్న ఆడమనిషి మీది భ్రమతతో రత్నాన్ని ముందుకు పంపించి తను ఒంటరిగా అడవిలో మిగిలిపోవటం పెద్ద తప్పయిపోయిందని వెంటనే తెలిసివచ్చింది.

నోరు తెరిచి ఒక్క మాట కూడా మాట్లాడకుండా చటుక్కున పక్కకు తిరిగి బాణం మాదిరిగా వేగంగా పరుగు మొదలుపెట్టాడతను. పకపకా నవ్వింది సువర్ణ.. వున్నచోటి నుంచి ఇసుమంతైనా కదల్లేదామె. తెగెల్లా సాగాయి ఆమె చేతులు. పగబట్టిన పాముల మాదిరి వెళ్ళి కనకయ్య మెడను దొరకబుచ్చుకున్నాయి.

ఇక తనకు చావు తప్పదని అర్థమై వేరే మార్గం ఏదీ స్ఫురించకపోవటంతో, “మామ్మా... రక్షించు.. మామ్మా నన్ను కాపాడు” అని వెనుక వదిలేసి వచ్చిన వృద్ధురాలిని ఉద్దేశించి బిగ్గరగా అరిచాడతను.

“పదవే.... పిచ్చి మానవుడు చావుకేక పెడుతున్నాడు. వెళ్ళి అదేమిటో చూడాలి. పదవే తల్లీ....” అంటూ వయసులో వున్న ఆడమనిషి చేతిని గట్టిగా పట్టుకుని సాధ్యమైనంత వేగంగా అక్కడికి వచ్చింది వృద్ధురాలు.

అప్పటికే అంతా అయిపోయింది. నోటివెంట రక్తపు నురుగులు వెలువడుతుండగా మోకాలెత్తున పెరిగివున్న అడవి మొక్కల మధ్యలో పడివున్నాడు కనకయ్య.

“అయ్యయ్యో... ఏంటిది మామ్మా? ఏంటీ దారుణం?” విపరీతమైన భయంతో కళ్ళు పెద్దవిచేసి చూస్తూ వృద్ధురాలిని అడిగింది పక్కనే వున్న ఆడమనిషి.

“ఖర్మఫలమే రంగమ్మతల్లీ... ఎప్పుడో పాతిక సంవత్సరాల క్రితం చేసిన అన్యాయానికి ఇప్పుడు ఫలితమనుభవించాడు” అంటూ చుట్టూ చూసింది వృద్ధురాలు. “వేములపల్లి దారి మాదిరిగా లేదు ఇది. ఈ చవట మనల్ని పక్కదారి పట్టించాడు...” అంటూ కొంచెం ముందుకు పోయి గాలిని గట్టిగా వాసన చూసింది.

“నువ్వు మళ్ళీ పిచ్చిచేష్టలు మొదలుపెట్టావ్... నీతో రావటం తప్పయిపోయింది” చిరుకోపంతో అంటున్న రంగమ్మ దగ్గరికి వచ్చి, ఆమెను దగ్గరికి తీసుకున్నది.

“నాతో నాకోసం రాలేదే తల్లీ నువ్వు. నీ ముట్టెపొగరు మగాడి కోసం వచ్చావు. ఇంత దూరం వచ్చిన తరువాత వెనక్కి వెళ్ళటం కంటె ముందుకే పోవటం మంచిదని అనిపిస్తోంది. ఎక్కడి నుంచో తియ్యటి నీళ్ళున్న వాసన వస్తోంది. పోయి చూద్దామే....” అంటూ రంగమ్మ చేయి పట్టుకుని అడుగు ముందుకు కదిపింది పిచ్చిమామ్మ.

ఉదయం పదకొండు గంటల సమయం వరకూ నడిచి నడిచి అలిసిపోయింది రంగమ్మ.

“ఇంక నావల్ల కాదు మామ్మా... నేను ఒక్క అడుగు కూడా వేయలేను” అంటూ ఒకచోట చతికిలబడబోతుండగా, వందగజాల దూరంలో ఆమెకు కనిపించింది పెద్ద చెరువు. ఎగసిపడుతున్న అలలతో సముద్రం మాదిరిగా వున్న ఆ చెరువును చూసేసరికి మటుమాయం అయిపోయింది ఆమెను ఆవరించుకున్న అలసట.

“ఆగవే తల్లీ... కాస్తంత ఆగు. తొందర వద్దు” అని మామ్మ ఎంతగా హెచ్చరిస్తున్నప్పటికీ వినిపించుకోకుండా నీటి దగ్గరికి పరిగెత్తింది రంగమ్మ. మోకాళ్ళమీద ముందుకు వంగి నీటిలో చేతులు పెట్టబోతుండగా, “కదలకు... కదిలితే నీ ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి” అంటూ వినవచ్చింది ఒక కరుకు కంఠం.

అదిరిపడి వెనక్కి చూసిన ఆమెకు అగుపించారు నలిగిపోయిన దుస్తులతో, ఎర్రబడివున్న కనులతో, రాక్షసుల్లా కనిపిస్తున్న ఆగంతకులు ముగ్గురు.

"అరేయ్... ఎవర్రా మీరు? నా రంగమ్మతల్లిని ఏం చేస్తున్నార్రా?" అని కళ్ళెర్రజేసి కోపంగా అడుగుతూ వచ్చిన మామ్మను కూడా పట్టేసుకున్నారు వాళ్ళు.

"పదండి... పిచ్చివేషాలు వేయకుండా నడవండి..." అని హెచ్చరిస్తూ చెరువుకు ఆవలివైపున వున్న కొండరాళ్ళ దగ్గరికి బలవంతంగా నడిపించారు.

***

"అబ్బో తరతరాలుగా మేము ఈ అడవిని నమ్ముకుని బతుకుతున్నాం.... ఎప్పుడూ ఇలా మాకోసం వెతుక్కుంటూ వచ్చినవాళ్ళు లేరు. ఇప్పుడు మీరు వచ్చారు" తూర్పుదిక్కు తెల్లబడుతుండగా తమ గుడిసెల దగ్గరికి వచ్చిన రవిబాబుని, పాండుని, వారితో వున్న అపూర్వని చూసి ఆశ్చర్యంగా అన్నాడు ముచ్చింతల గట్టు దగ్గర నివాసముంటున్న కోయపెద్ద. తానెవరో వారికి తెలియచెప్పాడు రవిబాబు. తనవెంట వున్నవారిని కూడా పరిచయం చేశాడు. సాదరంగా ఆహ్వానించిన ఆ పెద్దాయనకి కృతజ్ఞతలు తెలియచేసుకున్నాడు.

"మా ఊరికి దగ్గర్లో వున్న కొండలమ్మ తల్లిని గురించి మాట్లాడటానికొచ్చాము.... ఆ తల్లిని గురించి మీకు తెలిసిన విషయాలు చెప్పండి..." అంటూ రిక్వెస్ట్ చేశాడు. అతిథి మర్యాదలు పూర్తయిన తరువాత వారిని ముచ్చింతల గట్టు కనిపించే ప్రదేశంలో కూర్చోబెట్టి తమ పూర్వీకులు చెప్పిన మాటల్ని వివరించాడు కోయపెద్ద.

“ఆ తల్లిని ప్రతిష్ఠించింది మావాళ్ళే.... ఆ తరువాత ఒకసారి ఆకాశంలో తోకచుక్క కనిపించిందట... నేరుగా వచ్చి అది ఆ తల్లి దగ్గర నేలను తాకి మళ్ళీ గాలిలోకి ఎగిరిపోయిందట... అప్పటి నుంచీ ఆ తల్లి శక్తి చాలా అధికం అయిపోయిందిట...” అన్నాడాయన.

“అవును దొరా.. గాల్లోకి ఎగిరిన ఆ తోకచుక్క ఇంకా ఎక్కడైనా ఇంకోసారి నేలమీద పడిందా?” ఉన్నట్లుండి అడిగాడు అంతవరకూ మౌనంగా కూర్చుని వున్న పాండు.

“అవును... తాకింది... ఇప్పుడుందే పాడుపడిన దయ్యాలమేడ. అక్కడ పడి మళ్ళీ పైకిలేచి, చక్రతీర్థంలో పడి ఇంకోసారి ఎగిరి, అదిగో ఆ గట్టుమీద మటుమాయం అయిందిట. మా తాతకి వాళ్ళ తాత... వాళ్ళ తాతకి వాళ్ళ తాత... తరతరాలుగా చెప్పుకుంటూ వస్తున్న కథ ఇది. నిజం ఏమిటో నాకు తెలీదు” అన్నాడు కోయపెద్ద.

కూర్చున్న చోటినుంచి పైకిలేచి అప్పటికప్పుడు ముచ్చింతలగట్టు మీదికి పరిగెత్తాలన్న కోరికను అతి బలవంతంగా అదుముకున్నాడు పాండు.

“ఇంతకీ విషయం ఏమిటి బాబూ? మీకూ అదేదో యంత్రం... అది కావాల్నా? దానికోసమే ఇక్కడికి వచ్చారా?” ఉన్నట్లుండి అడిగాడు ఆ కోయదొర

అదిరిపడ్డాడు రవిబాబు. ఆశ్చర్యంతో మ్రాన్పడిపోయింది అపూర్వ. ఉక్కిరిబిక్కిరైనట్టు అరచేత్తో నెత్తిమీద చరుచుకున్నాడు పాండు.

“అంతగా ఆశ్చర్యపడమాకండి బాబులూ... అష్టసిద్ధి యంత్రంట. ఆకాశంలో నుంచి వచ్చి ఇక్కడే పడిందట. వెతికిపెడితే పదివేల రూపాయలను, పాతిక మేకల్ని ఇస్తానని ఒక సాములోరు ఇవాళ పొద్దున్నే చెప్పి వెళ్ళాడు” అంటూ తను కూర్చున్న గద్దెమీదినించి కిందికిదిగి రవిబాబుకు సైగచేశాడు కోయదొర.

అతనితో కలిసి పది గజాల దూరం ముందుకు పోయాడు రవిబాబు. ముచ్చింతల గట్టు మొదలు అయ్యే ప్రదేశం దగ్గర మొదలుపెట్టి అంగుళం అంగుళం వెతుకుతూ గట్టుమీదికి పోతున్న పాతికమంది కోయలు, వారి పిల్లలు, ఆడవాళ్ళు అందరూ అగుపించారతనికి.

“ఏం చేద్దాం పాండూ... సాములోరు అంటే ఎవరై వుంటారు? మనకు మాత్రమే తెలుసుకుంటున్న ఆ అష్టసిద్ధి యంత్రాన్ని గురించి అతనికెలా తెలిసింది?” వెనక్కి వచ్చి పాండు చెవిలో గుసగుసలాడాడు అతను.

“ఇంతదూరం వచ్చిన తర్వాత అటువంటి సందేహాలు మనకి అనవసరం. వెతికితే దొరికే వస్తువుకాదు అది. గాలిస్తే కనిపించటానికి రూపాయిబిళ్ళ అంతకన్నాకాదు. కొన్ని ప్రత్యేకమయిన పరిస్థితుల్లో తనంతట తానుగా ఇక్కడికి వచ్చి దాక్కున్న ఒక దైవశక్తి. వీళ్ళకి దొరికితే సాములోరి కిచ్చుకోమని చెప్పు.... అతనిస్తానని వాగ్దానం చేసిన సొత్తును ఆనందంగా తీసుకొమనీ చెప్పు. మన దారిన మనం పోదాం...” అంటూ తను కూడా లేచినిలబడ్డాడు పాండు.

ఒకపక్కగా నిలబడి అతని మాటలు చాలా శ్రద్ధగా ఆలకిస్తున్నాడు కోయపెద్ద

"మీ దారిన మీరు ఎలా పోతారు బాబూ? మీరంతా ముచ్చింతల గట్టుమీదికిపోయి మాకు పోటీగా తయారై మానోటి ముందుకు రాబోతున్న కూటిని చెడగొడతారా? మేము చూస్తూ కూర్చుంటామా?" అంటూ చప్పట్లు చరిచాడు.

పరుగున వచ్చేశారు మరో పదిమంది కోయలు.

"పట్టుకోండి ఈళ్ళని, కాళ్ళు చేతులు కట్టేసి గబ్బిలాల కనుమలో కూర్చున్న సాములోరి దగ్గరికి తీసుకుపోదాం" అని ఆజ్ఞ ఇచ్చాడు. అడవిలో పుట్టి అడవి తల్లినే నమ్ముకుని హాయిగా జీవిస్తున్నందువల్ల, అతి బలాఢ్యులుగా తయారయ్యారు కోయలు.

వారిని ఎదిరించటం తమకు అసాధ్యం అవుతుందేమో అన్న అనుమానంతో పాండుకేసి చూశాడు రవిబాబు. కనుసైగ ఎవరికీ కనిపించకుండా చేశాడు పాండు. మారు మాట్లాడకుండా లొంగిపొమ్మని సూచించాడు.

అతను అలా ఎందుకు నిర్ణయించాడో తెలియకపోయినా, మారు మాటాడకుండా అందుకు సిద్ధపడ్డాడు రవిబాబు. "ఇది అన్యాయం. మీరు మంచివాళ్ళని, మీ ఇళ్ళకు వచ్చినవారిని చాలా మర్యాదగా చూసుకుంటారని విన్నాం. విన్నది తప్పని తేలింది. బందిపోటు దొంగలకీ మీకు తేడా లేదు" కోపం నటిస్తూ కరుకుగా అన్నాడు.

ముచ్చింతల గట్టు దగ్గిరి తమ మూడు ఇళ్ళను వారికి చూపించాడు కోయపెద్ద. "పిల్లాజెల్లా ముసలోళ్ళు ముతకూళ్ళు అందరూ కలిసి అరవై ఎనిమిది

మందిమి ఈడ బతుకుతున్నాం. మేమూ మనుషులమే... మాకు కూడా తిండికావాలి. మాకు కావల్సినవన్నీ అడవిలో దొరకవు. బయటి నుంచి తెచ్చుకోవాలి. అందుకు డబ్బులు కావాలి. మీరు ఇవ్వరు... ఇచ్చే వాళ్ళనీ ఇవ్వనీయరు'' అంటూ ఇంకోసారి తనవారికి సైగచేశాడాయన.

వెనక్కి విరిచి తాళ్ళతో కట్టేశారు అతని మనుష్యులు పాండు, రవిబాబు చేతుల్ని, బరిసె మొనను వెన్నుకు ఆనించి అపూర్వని నడిపించాడు. రెండు గంటల తర్వాత వేలకువేలు గబ్బిలాలు వేలాడుతున్న పెద్ద పెద్ద చింతచెట్లున్న కోనలోకి ఎంటరయ్యారందరూ.

''గబ్బిలాలకోన అంటారు దీన్ని. ఈ గబ్బిలాలు కామ్ గా వున్నంతవరకూ ఫరవాలేదు. బెదిరినా, మనం బెదరించినా మనపని అవుట్ అయిపోతుంది'' లోగొంతుకతో పాండుకు చెప్పాడు రవిబాబు.

చెపుతూ వుండగా అతని దృష్టిపథంలోకి వచ్చాయి దారుణంగా చెడిపోయి, భయంకరమైన దుర్వాసనలు వెలువరుస్తున్న కొన్ని మానవ శరీరాలు.

''మొన్ననో అటు మొన్ననో చీకటివేళ ఈ కోనలో అడుగుపెట్టిన మీవంటి వాళ్ళే.. గబ్బిలాల దెబ్బకు ప్రాణాలు పోగొట్టుకున్నారు.''

అతని ముఖంలోని భావాలను అర్థం చేసుకుంటూ చెప్పాడు ముందు నడుస్తున్న కోయపెద్ద.

మరో పది నిమిషాలు గడిచిన తరువాత వారికి కనిపించాడు జుట్టు విరబోసుకుని ఓ చింతచెట్టు కింద ఏదో హోమం చేస్తున్న సాములోరు.

"అరె... ఇతన్ని ఎక్కడో చూసినట్టు అనిపిస్తోంది. జ్ఞప్తికి రావటం లేదు" అనుమానంగా చూస్తూ అంటున్న రవిబాబువంక చూసి వికటంగా నవ్వాడు ఆ సాములోరు.

"ఇందాక మొదటి జాములో వచ్చిన్ను.... ఈళ్ళకు కూడా ఆ అష్టసిద్ధి యంత్రం కావాలిట..." హోమం చేస్తున్న స్వాములోరి దగ్గరికిపోయి వినయంగా నమస్కారం చేస్తూ చెప్పాడు కోయపెద్ద.

"నా దగ్గరికి తీసుకువచ్చి మంచిపని చేశారు... మీకు ఇంకో వెయ్యి రూపాయలు అదనంగా ఇస్తాను. పది మేకలు, నాలుగు గొర్రెల్ని ఎక్కువగా ముట్టచెపుతాను..." అంటూ దగ్గర్లో వున్న చింతచెట్టును చూపించాడు.

"వాళ్ళని దానికి కట్టేసి మీరు వెళ్ళిరండి... యంత్రం కోసం బహు జాగ్రత్తగా వెతకండి. వెళ్ళండి" అని ఆజ్ఞా ఇచ్చాడు స్వాములోరు.

తాళ్ళవంటి అడవితీగెల్ని తీసుకువచ్చి పాండును, రవిబాబును, అపూర్వని అతను చూపించిన చింతచెట్టు మొదలుకు గట్టిగా అంటకట్టారు కోయలు. వంగి వంగి నమస్కారాలు చేస్తూ వెళ్ళిపోయారు అక్కడినించి. పట్టుపడిన వారితో అధిక ప్రసంగం చేయలేదు స్వాములోరు. కోయలు అవతలికిపోగానే కనులు మూసుకుని హోమాన్ని కంటిన్యూ చేయటంలో బిజీ అయిపోయారు.

***

"చలమయ్య చచ్చిపోయాడా? పోతురాజు కూడా చచ్చిపోయాడా? అయితే కనకయ్య ఎక్కడ? ఎక్కడ వున్నాడు?" పగలు పన్నెండు గంటల సమయంలో

దుమ్ముతెరలు రేపుతూ వేములపల్లిలోకి ఎంటర్ అయిన తన రెండో జీప్‌ని చూసి, భుజంగరాయుడి ఇంటి ఎదుటికి వస్తూ ఆశ్చర్యంగా అడిగాడు రత్నంగారు.

వేములపల్లి గ్రామంలోకి ఎంటర్ అవగానే దొరగారి దివాణం దగ్గరికి పోలేదతను. సరాసరి భుజంగరాయుడి దగ్గరికే వచ్చాడు. "నా బిడ్డ ఇంట్లోనుంచి పారిపోయి వచ్చింది. అది మీ దొరగారి అబ్బాయిని లవ్వాడానంటోంది. తప్పకుండా దివాణంలోకే వెళ్ళి వుంటుంది... బయటికి రప్పించటం ఎలా?" అని భుజంగరాయుడిని అడిగాడు. దొరగారి దివాణం మీదికి దండు వెడలేందుకు సరి అయిన కారణం దొరికినా తొందరపడలేదు భుజంగరాయుడు. "మీ అమ్మాయి ఇక్కడికే వచ్చినట్లు ఖచ్చితంగా ఎలా చెపుతున్నావు?" అని అడిగాడు.

అర్ధరాత్రి దాటిన అర్ధ ఘడియ తరువాత అపూర్వ కోసం ఆమె గదిలోకెళ్ళిన రత్నంగారికి ఖాళీ బెడ్ దర్శనం యిచ్చిందట... ఇంటి వెలుపల వున్న పాలేర్లను గట్టిగా నిలదీస్తుండగా పనిమనిషి ద్వారా ఆమెను ప్రేమించింది వేములపల్లి దొరగారి బిడ్డడే అని తెలిసిందట...

"అది ఆ రవిబాబును కలుసుకోవటానికి చాలాసార్లు ఇక్కడికి ఫోన్ చేసినట్లు నాకు తెలిసింది. అందుకే మీ దగ్గరికి వచ్చాం. మీరు మాకు సహాయం చేయాలి...." అని అంటూ వుండగా ఇంటి ముందుకు వచ్చింది అతని రెండోజీప్. రాఘవాపురం రైల్వేస్టేషన్ దగ్గర అర్థాంతరంగా హతమారిపోయిన స్నేహితుల శరీరాల్ని చూసేసరికి గిర్రున తిరగాయి రత్నంగారి కళ్ళవెంట నీళ్ళు. కనకయ్య కూడా కనిపించకపోవటంతో మరింత వ్యాకులపాటుకు గురి అయింది అతని అంతరంగం.

కనకయ్యను తను వదిలేసిన ప్రదేశాన్ని తన వారికి తెలియచెప్పి "మేము ఇటుగా వస్తున్నప్పుడు దారిలో ఒక ముసలావిడ, ఒక పడుచు పిల్ల కనిపించి దారి అడిగారు. ఆ పిల్లను చూసి లోట్టలేసుకుంటూ వాడు అక్కడే వుండిపోయివుంటాడు. రహదారిని వదిలి, అడవిలోకిపోయి చూడండి... వెంటనే వచ్చి నాకు చెప్పండి" అని అప్పుడే వచ్చిన జీప్‌ని మళ్ళీ వెనక్కి పంపించాడు.

అతనితోపాటు జీప్‌లో వున్న శరీరాలను చూసిన భుజంగరాయుడు మనిషి ఒకతను, "అయ్యగారూ! ఇది ఖచ్చితంగా అడవిలో వున్న మందులాయన పనే అయివుంటుంది... మన రాంసింగు, అతని డ్రైవరు ఇంకా తిరిగిరాలేదు" అని గుర్తుచేశాడు.

అప్పటికప్పుడు తన జనాన్ని కొంతమందిని రాంసింగు కోసం అడవిలోకి పంపించాడు భుజంగరాయుడు.

"దివాణం దగ్గరికిపోయి దొరగారిని అడుగుదాం. దెబ్బలు తగిలాయని చెప్పి ఆ మందులోళ్ళని తన దివాణంలో అట్టేపెట్టుకున్నాడు రెండు రోజులు. చేతబడులు చేయించి ప్రజల ప్రాణాలు తీయించాలనుకుంటున్నాడు కాబోలు. సిద్ధంకండి" అని ఆజ్ఞలు జారీచేశాడు.

అరనిముషంలో కార్చిచ్చు మాదిరి గ్రామమంతా వ్యాపించింది ఆ వార్త. కర్రలు కత్తులు పట్టుకున్న వందమంది గ్రామస్థులు భుజంగరాయుడి వెంట దొరగారి దివాణం దగ్గరికి బయలుదేరారు.

***

“వేములపల్లి గ్రామానికి వెళ్ళటానికి బయలుదేరి దారితప్పి ఇటుగా వచ్చాము. మా దారిన మమ్మల్ని పోనీయండిరా. మీకు పుణ్యం వుంటుంది” అంటూ తమను బంధించిన ఆగంతకులు ముగ్గుర్నీ అరగంటపాటు బతిమలాడుకున్నది పిచ్చిమామ్మ.

“మీ మాటలు నమ్మటానికి మేము పిచ్చివాళ్ళం కాదు. మీరు పోలీసులు పంపగా వచ్చిన సి.ఐ.డి.లు. మాకోసమే ఇక్కడికి వచ్చారు. మిమ్మల్ని పంపి చక్రతీర్థంలో పారేస్తాం....” ఆమె గోలని భరించటం అసాధ్యం అయిపోతుండగా అన్నాడు ఒక ఆగంతకుడు.

“నీ ముఖం మండా... నీ కళ్ళకు నేను పోలీసులా కనిపిస్తున్నానా? నా వయసును చూసైనా నువ్వు నోరు మూసుకోవాల్సింది. నీ కాళ్లు విరిగి పోనూ... నీ చేతులు చచ్చుబడిపోనూ...” అంటూ తిట్లు మొదలెట్టింది మామ్మ.

భరించటం అసాధ్యమై చెవులు మూసుకుని అవతలికి వెళ్ళిపోయాడు ఆ మనిషి. అంతలోనే రహదారి దగ్గరికిపోయిన అతని సహచరుడు ఒకతను పరుగులాంటి నడకతో స్థావరంలోకి వచ్చేశాడు.

“వీళ్లు ఎవరో సామాన్యులు కారు.... వీళ్ళకోసమో, మనకోసమో జీప్ లో వచ్చారు పదిమంది... కర్రలు కత్తులు వున్నాయి. రహదారికి అటువైపు ఇటువైపు పొదల్లో గాలింపు మొదలుపెడుతున్నారు. వాళ్ళ వరస చూస్తుంటే ఇటుగా వచ్చేయవచ్చని అనిపిస్తోంది. వీళ్ళని చంపేసి మనం వెంటనే అవతలికి వెళ్ళిపోవాలి....” అంటూ తన సహచరుల సమాధానం కోసం ఎదురు చూడకుండా పదునయిన పేష్కప్ ని బయటికి తీశాడు.

“చచ్చిపోయిన చవటకోసం వెతుకులాట మొదలయినట్టుందే పిల్లా. వాడు కనిపించిన వెంటనే వెనక్కి వెళ్ళిపోతారు ఆ జీప్ లో వచ్చిన జనం. ఇక్కడికి రారు. ఆ విషయం యీ చచ్చు ముఖానికి తెలియదు. వీడు కొంచెం అధికంగా ప్రవర్తిస్తున్నాడు...” అని రంగమ్మతో అంటూ ముడుచుకుని వున్న కుడిపాదాన్ని ముందుకుజాపి బలంగా నేలను అదిమింది పిచ్చిమామ్మ.

ఒక్కసారిగా భూకంపం వచ్చినట్టు కంపించింది నేల.... ముందుకు వస్తున్న ఆగంతకుడు బ్యాలెన్స్ నిలబెట్టుకోలేక ముందుకు తూలాడు.... అతని చేతిలోని పేష్కప్ జారి అవతలపడిపోయింది. “వేసేయ్... వాడి ముఖంమీద రెండు దెబ్బలు వేసేయ్...” అంటూ ఖంగుమంటున్న కంఠంతో ఆజ్ఞాపించింది పిచ్చిమామ్మ. ఆగంతకుడి పేష్కప్ దానంతట అదే గాలిలోకి లేచి ఆగంతకుడి ముఖంమీద రెండు గాట్లు పెట్టింది. పెద్దగా అరవాటానికి కూడా ధైర్యం చేలలేదు అతనికి, అతని ఫ్రెండ్స్‌కి.

“మధ్యలోకి వెళితే సుడిగుండాల్ని సృష్టించి ప్రాణాలు బలితీసుకునే చెరువులు, కిందపడిన పేష్కప్‌లను మాటలతోనే గాలిలోకి లేపే ముసలమ్మలు.. అయ్యబాబోయ్... ఇది అడవికాదు. మంత్రాలకోన.... ఇక్కడే వుంటే మనం హతమారిపోతాం... పదండి... పారిపోదాం...” అంటూ కిందినించి లేచి భయంతో పరుగు మొదలుపెట్టాడు మొదటి ఆగంతకుడు. ఎదురు చెప్పకుండా క్లోజ్‌గా అతన్ని ఫాలో అయ్యారు మిగిలినవాళ్ళు.

“పిచ్చిముఖం వేసుకుని అలా చూస్తూ కూర్చుంటావేమిటే నా తల్లీ.... లేచి నా కట్లు విప్పు...” రంగమ్మకేసి చూస్తూ కసురుకున్నది మామ్మ.

"ఎలా మామ్మ? నా చేతులు కూడా కట్టేసి వున్నాయి" అంటూ చేతుల్ని కదిలించి ఆశ్చర్యపడింది రంగమ్మ. ఎప్పుడో విడిపోయి వున్నాయి ఆమెను పట్టివుంచిన బంధాలు. "వీళ్ళు ఎవరు మామ్మా? ఈ అడవిలో ఏం చేస్తున్నారు? అసలీ గోలంతా ఏమిటి....?" మామ్మ చేతులకు అలాగే వున్న బంధనాలను సడలిస్తూ అడిగిందామె.

"కాకిని కొట్టి తీసుకువచ్చిన సొమ్ము గద్దలపాలు అయిందట. వీళ్ళు బ్యాంకు దొంగలే తల్లీ.... ఇక్కడికొచ్చి పొరపాటున దొంగ సొత్తును ఈ చెరువులో పారేసుకున్నారు. బయటికి తీయటం చేతకాక ఈ చుట్టుపట్లే గబ్బిలాల మాదిరి తిరుగుతున్నారు..." అంటూ చటుక్కున మాటల్ని ఆపి ఆకాశంలోకి చూసింది.

"ఏమయింది మామ్మా? నీకు మళ్ళీ గుబులు మొదలయిందా?" అడిగింది రంగమ్మ. సమాధానం చెప్పలేదు పిచ్చిమామ్మ. ఆమె చేతిని పట్టుకుని బరబరా చెరువు దగ్గరికి లాక్కుపోయింది. "చూడవే తల్లీ... సూట్ కేసు కనిపిస్తుందేమో చూడు" అని తొందరపెట్టింది.

కనులు చిట్లించి చూసింది రంగమ్మ. చెరువు మధ్యభాగంలో లీలగా ఆమెకు కనిపించింది సూట్ కేస్ రూపం.

"దిగు... నీళ్ళల్లోకి దిగు... ఈత రాదని భయపడకు. నేనున్నాను గదా... దిగి దాన్ని బయటికి తీసుకురా..." చేతికర్రను గట్టిగా పట్టుకుంటూ కమాండ్ చేసింది మామ్మ. నీళ్ళంటే రంగమ్మకి భయం. అయినా తప్పలేదు.... భయం భయంగానే నీటిలో దిగింది. "నేనున్నాను.... నీటిలో మునుగు" ఖంగుమన్నది మామ్మ కంఠం.

మామ్మ చెప్పినట్టే నీటిలో మునిగింది రంగమ్మ. ఆమె భయపడినట్టు ఊపిరి తీసుకోకపోతే చచ్చిపోతున్న అనుభూతి కలుగలేదు. అసలు ఎటువంటి ఇబ్బంది ఆమెకు ఎదురుకాలేదు. నడిరోడ్డుమీద నడిచినట్టు నీటి అడుగున నడుచుకుంటూ సూట్ కేస్ దగ్గరికిపోయింది.

సరిగ్గా అదే సమయంలో స్టార్ట్ అయింది నీటిలో ఒక సంచలనం... సుడిగుండం సడన్ గా ఏర్పడినట్టు గిర్రున తిరగటం మొదలుపెట్టాయి నీళ్ళు.

"మామ్మా... మామ్మా" భయంతో పిచ్చిగా అరిచింది రంగమ్మ, సూట్ కేస్ గట్టిగా పట్టుకుంటూ.

"ఉన్నా.... నేను ఇక్కడే వున్నా... నేనుండగా నిన్ను ఏ దుష్టశక్తి ఏమీ చేయలేదు..." అంటూ తనూ నీటిలోకి దిగి, చేతికర్రతో నీటిపై బలంగా చరిచింది మామ్మ. రంగమ్మని వదిలేసి, ఆమె మీదికి దూసుకు వచ్చింది సుడిగుండం. తెల్లటి వెలుగురేఖ ఒకటి ఆ సుడిగుండం మధ్యలో ప్రవేశించింది. కనులు ఎర్రచేసి కర్రతో అదేపనిగా నీటిని కొడుతున్న మామ్మ కళ్ళు జలపాతాలైపోయాయి.

"తల్లీ... నా కన్నతల్లీ... ఇంతకాలానికి దయ కలిగిందా? నీకోసం దేశదేశాలు తిరిగాను.... ఎన్నెన్నో కష్టాలు, అవమానాలు భరించాను. ఈ నట్టడివిలో దాక్కుని నన్ను పిచ్చిదాన్ని చేశావు.... నా దగ్గరికి రా.. నా ప్రాణాలు బలితీసుకుని నా వంశానికి నువ్వు పెట్టిన శాపాన్ని ఉపసంహరించుకో... రావే.... నా దగ్గరికి రావే..." అంటూ అంతెత్తున ఎగిరి తనే సుడిగుండంలోకి దుమికింది. సూట్‌కేసు పట్టుకుని రంగమ్మ ఒడ్డుకు చేరుకోవటం – పిచ్చిమామ్మని సుడిగుండం ఒడ్డకు విసిరికొట్టటం ఒకేసారి జరిగింది.

"రంగమ్మ తల్లీ.... నా తల్లి ఈ చెరువులో వున్నది.... నా తల్లి ఇక్కడ దాక్కున్నది. నేను చూశాను.... నేను కళ్ళారా చూశాను..." పట్టరాని సంతోషంతో పరవశించిపోతూ ఆమెకు చెప్పింది పిచ్చిమామ్మ.

"ఇప్పుడేం చేద్దాం మామ్మా?" అని అడిగింది రంగమ్మ.

"నా తల్లిని బయటికి రప్పించాలి. నామీద అలిగి ఇటు పారిపోయి వచ్చింది...." అంటూ చెరువు గట్టుమీద పచార్లు మొదలుపెట్టింది పిచ్చిమామ్మ.

***

తదేకంగా జపంచేసి సాయం సమయంలో హోమగుండం దగ్గర్నించి పైకి లేచాడు గురువుగారు.

"చిన్న చిన్న బలులతో సంతృప్తిని చెందే బంధకికి మీలో ఒకరిని బలిస్తాను. నా కోరిక వెంటనే తీరుతుంది" అంటూ అపూర్వ దగ్గరికి వచ్చాడాయన.

"కదలకుండా అలాగే నిలబడండి... పొరపాటున కూడా కదలవద్దు..." చిన్న కంఠంతో రవిబాబుని, అపూర్వని హెచ్చరించి, తన కుడి పాదంతో పెద్ద గులకరాయిని పైకి ఎత్తాడు పాండు. ఊపిరి బిగపట్టి, శరీరంలోని శక్తినంతా పాదంలోకి తెచ్చకుంటూ ఆ రాయిని ఎదురుగావున్న చింతచెట్టు కొమ్మల్లోకి విసిరాడు.

"ఏమిటది? ఏం చేస్తున్నావు నువ్వు?" ఆగ్రహంతో రగులుకుపోతూ, అతని చెంపమీద బలంగా కొట్టాడు గురువుగారు. పాండు పెదవులు చిట్లి ఎర్రటి రక్తం చుబుకంమీదికి కారటం మొదలుపెట్టింది. అదే సమయంలో గింగిరాలు

తిరుగుతూపోయి చింతచెట్టు కొమ్మలకు వ్రేలాడుతున్న ఓ గబ్బిలానికి తగిలింది అతను విసిరిన రాయి.

చెవులు చిల్లులుపడేటట్లు కీచుగా అరిచి కిందికి పడిపోయింది అది. ఆ అరుపును విని విపరీతమయిన ఆగ్రహంతో చెట్ల కొమ్మలనుంచి విడివడ్డాయి ఆ చుట్టుపట్ల వున్న గబ్బిలాలు అన్నీ. వాటి మ్రోతను ఆలకించి 'ఏమిటిది? ఏమౌతోంది?' అంటూ వెనక్కి చూసి, ఆందోళనతో వెర్రిగా అరిచాడు గురువుగారు.

"ఆగిపొండి... కరాళశక్తి మీద ఆనపెడుతున్నాను. ఆగి వెనక్కి వెళ్ళిపోండి" చేతుల్ని గాలిలో ఊపుతూ అరిచాడు.

అతని ఆనలు పనిచేయలేదు. అతని బెదిరింపుల్ని గబ్బిలాలు లక్ష్యపెట్టలేదు. మూకుమ్మడిగా వచ్చి ఫెడీ ఫెడీమని తన్నాయి అతని ముఖం మీద.

తలను రెండు చేతులతోనూ కప్పుకుంటూ కోయగూడెంవైపు పరిగెత్తాడు గురువుగారు. వలయాకారంలో అతనిచుట్టూ తిరగసాగింది ఒక లావుపాటి గబ్బిలం. ఉన్నట్లుండి కిందికి దూసుకువచ్చి అతని ముఖాన్ని తీవ్రంగా గాయపరిచింది.

"అదేమిటి పాండూ... ఆ గబ్బిలానికి జడలున్నాయి.... ముఖం మనిషి ముఖంలా వుంది...." కదలకుండా నిలబడి పాండుతో అన్నాడు రవిబాబు.

"అదేమిటో నాకో తెలియటం లేదు. కదలకుండా ఈ చెట్టులో భాగమయినట్టు నిలబడిపోతే మన జోలికి రావు అవి. పారిపోవటానికి ట్రై చేస్తే

వచ్చి వచ్చి మీదపడతాయి. కదలికలు మాత్రమే వాటికి తెలుస్తాయి అని ఎప్పుడో ఎవరో చెపుతుంటే విన్నాను'' చిన్న కంఠంతో చెప్పాడు పాండు.

అక్షరసత్యాలు అయ్యాయి అతని మాటలు... తప్పించుకోవటానికి ప్రయత్నించిన గురువుగారిని తరిమి తరిమి గాయపరిచాయి అవి... పది గజాలదూరం కూడా పోకముందే కిందపడి గిలగిలా కొట్టుకున్నాడు అతను. కొట్టుకుని కొట్టుకుని కళ్ళు తేలవేశాడు.

''ముచ్చింతలగట్టు దగ్గరికి ఎవరూ రావటానికి సాహసించరు.... అందుకు కారణం ఈ గబ్బిలాలే అయివుంటాయి... ఇప్పుడు ఏం చేయాలి మనం?'' ఉన్నట్లుండి పాండును అడిగింది అపూర్వ.

''మీ మామయ్యని పిలువ్... మన బంధానాలను సడలించమని చెప్పు...'' అంటూ ఆమెకు సజిషన్ ఇచ్చాడు పాండు.

గబ్బిలాలు తమ తమ స్థానాలకు వెళ్ళిపోయేదాకా ఆగి ''మామయ్యా!'' అని పిలిచింది అపూర్వ... వెంటనే ప్రత్యక్షం అయింది రాజశేఖర్ స్వరూపం.

''వెతుకుతున్నా... ముచ్చింతల గట్టు చుట్టూ రౌండ్లు కొడుతున్నా... నాకు ఎటువంటి వింత వస్తువు కనిపించలేదు'' అపూర్వని పరిశీలిస్తూ చెప్పిందది.

''పాండూ... అటు.... అటు చూడు.... ఆ జడల గబ్బిలం ఇటే వస్తోంది....'' ఖంగారుగా అరిచాడు రవిబాబు.

గబగబా అతని కట్లు విప్పింది అపూర్వ... పాండును కూడా బంధవిముక్తుడిని చేసింది. తను గాట్లు పడిన చేతుల్ని రుద్దుకుంటూ పైకి చూసింది.

"ఆ ముఖాన్ని ఎక్కడో చూసినట్లు అనిపిస్తోంది. గుర్తుకురావటం లేదు" అంటున్న రాజశేఖర్ తలమీదుగా అపూర్వ దగ్గరికి దూసుకువచ్చింది రవిబాబు చెప్పిన జడల గబ్బిలం. కొండలమ్మ తల్లి కుంకుమబొట్టులో నుంచి కంటికి కనిపించని కాంతిరేఖ ఒకటి రివ్వున పైకిపాకి జడల గబ్బిలానికి తగిలింది. గాలిలోనే రెండు పల్టీలుకొట్టి దూరంగా వెళ్ళిపోయిందా క్షుద్ర జీవి.

"ముచ్చింతల గట్టువంకా కోయలు జల్లెడ పట్టారు. గట్టుమీద ఒక పెద్ద బండరాయి వుంది. దానిచుట్టూ తిరిగిందిగాని, పైకి పోలేదు. ఎప్పుడో చాలా సంవత్సరాల క్రితం ఎవరో స్వాములోరు అక్కడ సజీవ సమాధి అయ్యాడట.... వాళ్ళు అనుకుంటుంటే విన్నాను" అంటున్న రాజశేఖర్ ఆత్మస్వరూపం మాటల్ని విని ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు పాండు, రవిబాబు.

"నిన్ను ఏదో శక్తి లాగిపెట్టి కొట్టిందని చెప్పావ్.... ఆ ప్రదేశంలోనే వున్నదా ఆ బండరాయి?" గబుక్కున ఆ స్వరూపాన్ని అడిగింది అపూర్వ.

"అవునురా... అదే చోటు... అడుగు ముందుకు పడలేదు... అటు కేసి చూస్తే చాలు భయం కలుగుతోంది" తన బలహీనతను ఒప్పుకున్నది ఆ ఆత్మస్వరూపం.

“డెఫినిట్‌గా అది శక్తిరాయుడి స్థావరమే అయివుంటుంది. దివాణంలో వుండమంటే వినకుండా ముచ్చింతల గట్టుదగ్గరికి పోతున్నానని చెప్పి వెళ్ళిపోయాడు... మనం అక్కడికిపోయి చూద్దాం... పదండి...” అంటూ అపూర్వ చేయిపట్టుకున్నాడు రవిబాబు.

“నేనున్నాను.... నాకు ఎంతో కొంత శక్తి వున్నది...” అంటూ వారందరికేసి చేతుల్ని ఊపింది రాజశేఖర్ రూపం.

ఈదురుగాలిలో చిక్కుపడినట్లు అనుభూతిని పొందారు అందరూ. కళ్ళు తెరిచేసరికి ముచ్కింతల గట్టుమీద వుండే బండరాయికి సమీపంలో నిలబడి వున్నారు.

***

“దయచేసి నా మాట వినండి... మీ అమ్మాయిని మా అబ్బాయి ప్రేమించిన మాట వాస్తవం.... వీలుదొరికితే మీ ఇంటి నుంచి తీసుకువచ్చి పెళ్ళి చేసుకోవాలని అనుకున్నమాట కూడా వాస్తవమే. కానీ మీ అమ్మాయిని లేవతీసుకువచ్చాడని నేను అనుకోవటంలేదు. వాడు కొండలమ్మతల్లి దగ్గరికి పోయాడు.... తీసుకురావటానికి మనుషుల్ని పంపాను. రాగానే జరిగింది ఏమిటో తెలుస్తుంది. అంతవరకూ ఓపికపట్టండి....” తన దివాణం ముందు గుమిగూడిన రత్నంగారి జనాల్ని, తమ గ్రామస్థుల్ని ఉద్దేశించి చెప్పాడు దొరగారు.

“అదేం కుదరదు. రవిబాబు మీ ఇంట్లోనే వుంటాడు. బైటికి పిలవండి” అరిచాడు భుజంగరాయుడు.

“అయ్యగారూ! మీ అమ్మాయి మేజరా, మైనరా?” చూసి వుండబట్ట లేక అడిగాడు అక్కడికొచ్చిన ఆచారి. అందుకు సమాధానంగా ఏదో చెప్పటానికి నోటిని తెరిచి వెంటనే మౌనం వహించాడు రత్నంగారు.

“మేజరైతే ఆమె ఇష్టమొచ్చినవాడిని ఇష్టం వచ్చిన చోటుకెళ్ళి వివాహం చేసుకోవచ్చు. మైనర్ ఐతే ఆ పని చేయకూడదు. మా దొరగారు తన కొడుకును దాచిపెట్టి కుంటిసాకులు చూపిస్తున్నారంటున్నారు మీరు.

“మీ అమ్మాయి మైనరయితే దివాణంలోకి వెళ్ళి వెతుక్కోండి. కనిపిస్తే మీ వెంట తీసుకుపొండి. మేజరే గనుక అయితే దివాణంలోకి అడుగు పెట్టినవాడు దివాణంలోనే హతమారిపోతాడు. తలలు నరికి రోడ్డుమీదపడేస్తాము” ఆవేశంతో అరిచాడు ఆచారి.

ఎప్పుడు చూసినా శాంతంగా కోపం అనేది ఎరుగనట్టుండే ఆ సాత్వికమూర్తిలో అంతటి కక్ష దాగి వున్నట్లు తెలియని వారందరూ అదిరిపడి నోళ్ళు తెరిచారు.

“వెళ్ళండి... వెళ్ళి చూడండి....” ఇంకోసారి హెచ్చరించాడు ఆచారి.

“వెళతాం ఆచారిగారూ... మా వూరు వెళ్ళి జనాలందరితోను తిరిగి వస్తాం. ఈసారి దివాణం వుండటమో ఊడిపోవటమో తేలిపోవాలి” కచ్చగా అంటూ వెనుతిరిగాడు రత్నంగారు.

గొల్లున అరిచి కర్రలను గాలిలోకి ఎత్తి అతని మీదికి దుముకబోయిన తన పరివారాన్నంతా చూపులతోనే ఆపేశారు దొరగారు.

“ఆచారిగారితో కొండలమ్మతల్లి దగ్గరికిపోయి నా బిడ్డడిని వెంటపెట్టుకురండి” అని ఆజ్ఞ ఇచ్చాడు. భుజంగరాయుడి జనం చూస్తుండగానే దొరగారి జనం ఊరి వెలుపలికి వెళ్ళారు ఆచారిని వెంటబెట్టుకుని.

“ఇదే అదను... వేసేద్దాం....” రహస్యంగా భుజంగరాయుడితో అన్నాడు అనుచరుడు.

గొల్లున అరిచి కత్తులతో, కర్రలతో దొరగారిమీదికి దుమికారు అతని జనం.

చత్రాతిమీద కొట్టిన చిల్లపెంకుల మాదిరి చెల్లాచెదురైనారు అక్కడ గొడవ ఏమిటో చూడటానికి వచ్చిన అమాయక ప్రజలు.

“అయిపోయాడు... దొరగారు అయిపోయాడు...” అంటూ అరిచారు కొందరు.

పదునైన వేట కొడవలితో దొరగారి తలమీద వేటు వేయబోతున్న భుజంగరాయుడి మనిషి ఒకతను, రబ్బర్ బంతి మాదిరి గాల్లోకి లేచి దూరంగా పడ్డాడు.

అదిరిపడి తలతిప్పిన భుజంగరాయుడికి వెంటనే కన్పించాడు రవిబాబు.

“వేసేయ్ బాబూ... వాడిని వేసేయ్... కట్లపాములు కంటపడితే నలిపి నాశనం చేయాలి. ప్రాణాలతో వదలకూడదు” అంటూ రవిబాబు పక్కనుంచి భుజంగరాయుడి మీదికి దూసుకెళ్ళాడు పాండు.

ఒక పాలేరు అందించిన కర్రను గిర్రున తిప్పుతూ రవిబాబు, పిడికిళ్ళు బిగించి బలమయిన దెబ్బలుకొడుతూ పాండు వీరవిహారం మొదలుపెట్టడంతో చెదిరిపోయింది దివాణం ఎదుట పోగయిన గుంపు...

చొక్కా చిరిగిపోయింది... పంచె సగం వరకూ పనికిరాకుండా పోయింది. ఒక అనుచరుడు తెలివిగా వెనక్కి లాగటంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకుని తన ఇంటికేసి పారిపోయాడు భుజంగరాయుడు.

ఆ తర్వాత రెండు క్షణాలు కూడా కొనసాగలేదు పోరాటం... వెంటనే అంతమైపోయింది. వెర్రిముఖాలు వేసుకుని నిలబడిన రత్నంగారు, ఆయన జనం తప్ప పరాయి మనిషంటూ ఆ వీధిలో మిగలలేదు.

"మీ అమ్మాయికోసం మా దివాణం మీదికి వచ్చారు, ఇదిగో మీ అమ్మాయి.... తీసుకుపొండి...." అంటూ అపూర్వని అతని ముందుకు నెట్టాడు రవిబాబు.

"నేను రవిని ఇష్టపడ్డాను. అతన్నే పెళ్ళి చేసుకుంటాను. ఇదివరకు నా మేనత్త విషయంలో చేసిన తప్పు ఇప్పుడు చేయకండి. నేను నేనే... నా మేనత్తని కాను..." నిర్భయంగా చెప్పి రత్నంగారు చూస్తుండగానే దివాణంవైపు బయల్దేరింది అపూర్వ.

"కుడిపాదం పెట్టమ్మా....కుడిపాదం..." అంటూ ఆహ్వానించింది పాలేరు పెద్దయ్య దగ్గర నిలబడివున్న అతని భార్య.

“ఆపూర్వా...నీకు ఇద్దరు మామలు... ఇదుగో రెండో మామ. ఈమె నీ అత్తగారు” అంటూ అతన్ని, ఆమెను అపూర్వకి పరిచయం చేశాడు రవిబాబు.

దొరగారికి నమస్కరించి, ఆ దంపతులకు పాదాభివందనం చేసిన అపూర్వను చూస్తూ గ్రామం దద్దరిల్లిపోయేటట్లు అరిచారు ఆచారిగారితో సహా వెనుతిరిగి వచ్చిన దొరగారి జనం. చిన్న ముఖం చేసుకుని తన అనుచరులతో వెనక్కి వచ్చేశాడు రత్నంగారు.... తన జీప్ ఎక్కి పొలిమేరల దగ్గరికి పోతుండగా కనకయ్య శరీరంతో అతనికి ఎదురుపడింది రెండో జీప్.

***

“శక్తిరాయుడు జీవసమాధి అయిన ప్రదేశంలో అడుగుపెట్టిన వెంటనే మాకు వెళ్ళిన పని పూర్తి అవుతుందని నమ్మకం కుదిరింది... అక్కడే నిలబడి ఆ ప్రదేశమంతా గాలిస్తుండగా సమాధిమీద మొలచిన తులసి మొక్కల మధ్యలో దొరికింది ఇది....” అంటూ రాగిరేకు నొకదాన్ని తీసి తండ్రికి చూపించాడు రవిబాబు.

చెంపలు వేసుకుని దాన్ని తీసుకుని పూజామందిరంలో నిలబెట్టాడు దొరగారు. అప్పటికప్పుడు పాలతో తేనెతో అభిషేకాలు జరిపి పూజలు చేశాడు. కదలికలేదు యంత్రంలో. కనీసం చిన్నపాటి కాంతి కూడా కనిపించలేదు.

దొరగారి ముఖంలో అప్పటివరకూ వున్న కాంతి ఒక్కసారిగా మటుమాయం అయిపోయింది. దారుణమైన నీరసం తనను ఆవరించుకొన్నట్టు నిస్సత్తువగా నేలమీద చతికిలపడిపోయారాయన.

"అష్టసిద్ధి యంత్రం కాకపోవచ్చును ఇది. ఒకవేళ అదే యంత్రమై వుంటే అప్పుడు జరిగిన అవమానాన్ని ఇంకా మర్చిపోకుండా గుండెల్లోనే దాచుకుని వుండి వుండవచ్చు. ముసలయ్యని పిలిచి విషయం ఏమిటో తేల్చుకోవటం బెస్టు" దొరగారి దగ్గరికి జరిగి చిన్న కంఠంతో చెప్పాడు పాండు.

దొరగారు ఆజ్ఞలు ఇచ్చేదాకా ఆగలేదు. దగ్గర వుండి పూజా కార్యక్రమాలను శ్రద్ధగా పరికిస్తున్న ఆచారిగారు. "వెళ్ళండి... వెళ్ళి ముసలయ్యను వెంటనే ఇక్కడికి తీసుకురండి" అని ఇద్దరు పాలేర్లకు చెప్పాడు.

"ముసలయ్యని చిటికెలో తీసుకు వచ్చేస్తాం... నడిచి వెళితే ఆలస్యం అవుతుంది. మన మైసూరెడ్లు కట్టిన బండిలో పోదాం" అంటూ తూనీగల మాదిరి వెలుపలికి పరుగుతీశారు వాళ్ళు. దివాణం వెలుపల ఎంతో సందడిగా వుంటుందని అనుకున్న పాండుకు, అక్కడి నుంచి చిన్నపాటి శబ్దం కూడా వినిపించకుండా, పిన్ డ్రాప్ సైలెన్సుగా వుండటంతో అనుమానం వచ్చి, "అదేంటో చూడాలి బాబూ... ఆ రత్నంగారు మళ్ళీ ఏదైనా తిరకాసు మొదలెట్టాడేమో..." అంటూ రవిబాబును వెంటబెట్టుకుని మెయిన్ గేటు దగ్గరికి వచ్చాడు. "అడుగో... పాండుగాడు కూడా ఇక్కడే వున్నాడు. అరేయ్ పాండూ... నేను జోగినాథాన్ని" అంటూ వెంటనే వినవచ్చింది జోగినాథం గొంతు.

ఆశ్చర్యంగా చూసిన పాండుకు అరడజనుమంది టూ టవున్ కానిస్టేబిల్స్ తో కలిసి వచ్చిన జోగినాథం కనిపించాడు. యూనిఫాంలో లేరు వాళ్ళు. సివిల్ డ్రస్ లో వున్నారు. "నిన్న సాయంత్రం షరీఫు వచ్చాడురా నా దగ్గరికి. వాడిని

రంగమ్మకి కాపలా పెట్టావుట కదా... దాహంగా వుంటే రెండు చుక్కలు గొంతులో పోసుకోవటానికి సారా డిపో దగ్గరికి పోయాట్ట.

ఆ టైమ్ లోనే పిచ్చిమామ్మతో కలిసి రంగమ్మ నిన్ను వెతుక్కుంటూ వచ్చేసిందట. ఎక్కడికి పోయిందో తెలియక నా దగ్గరికొచ్చాడు. నాకు కూడా డౌటు వచ్చి వెంటనే బయలుదేరాను. ఎందుకైనా మంచిదని నా వాళ్ళని కూడా తీసుకొచ్చాను. మెడికల్ లీవులు పెట్టేశాం మేమందరం" తనను, తనతో వచ్చినవాళ్ళను మెయిన్ గేటు దగ్గరే ఆపేసిన దొరగారి మనుషుల్ని తోసుకుంటూ ముందుకువచ్చి సంతోషంగా చెప్పాడు జోగినాథం.

ఛట్ మని పాండు కళ్ళముందు మెదిలింది చక్రతీర్థం. "చూడు బాబాయ్.... నువ్వు రావటం చాలా మంచిదైంది. అసలు నువ్వు ఇక్కడికి ఎలా రాగిలిగావ్?" అతన్ని అతనితో వచ్చిన కానిస్టేబిల్స్‌ని లోపలికి తీసుకుపోయి, చిలకమ్మ రెడీచేసిన గ్లాసుల్ని చేతికిస్తూ అడిగాడు.

"రేయ్... మేము పోలీసులమని మర్చిపోతున్నావ్. ఎర్రబస్సులో ఎక్కిన క్షణం నుంచీ ఒకటే రోదన. నారాయణపురం రత్నంగారి అమ్మాయిని వేములపల్లి దొరగారి రవిబాబు లేవతీసుకుపొయాడని, రత్నంగారు కత్తులు కటార్లతో బయలుదేరుతున్నాడని బస్సులో కొందరు మాట్లాడుకోవటం విన్నాం. షరీఫుని నారాయణపురం పంపించి మేము ఇక్కడ దిగిపోయాం" టీని సిప్ చేసి రుచిని మెచ్చుకుంటూ చెప్పాడు జోగినాథం.

తాగుబోతు షరీఫ్ ఒంటరిగా నారాయణపురం వెళ్ళాడని తెలిసేసరికి, అలజడికి గురి అయింది పాండు అంతరంగం. "వట్టి అమాయకుడు. ఎప్పుడు

ఎవరితో ఏం మాట్లాడతాడో తెలియదు. గుండెల్లో మాటని గుండెల్లోనే గుంభనంగా వుంచుకోడు. బయటికి కక్కేస్తాడు. అక్కడ అనవసరమైన ఇబ్బందుల్లో ఇరుక్కుంటాడు'' రవిబాబువైపు చూస్తూ ఆందోళనగా అన్నాడు.

''మనం మనుషుల్ని పంపిద్దాం. మరేం భయంలేదు'' అంటూ తమ జనంకేసి చూశాడు రవిబాబు.

ఎవరిని పంపించాలో అతనికి అర్థంకాలేదు. ఎప్పుడు చూసినా ప్రశాంతంగా వుండే ఆ జనం విపరీతమైన ఎగ్జయిట్‌మెంట్ కారణంగా, కీ ఇచ్చి సిద్ధంచేసిన మరబొమ్మల మాదిరి రెడీగా వున్నారు. స్విచ్ నొక్కితే చాలు చిందులు... గంతులు... అడ్డంవచ్చిన వారిపై అరుపులు, కేకలు....! సావకాశంగా నిలబడి ప్రశాంతంగా తన పని పూర్తిచేయగలవాళ్ళు ఎవరు? రవిబాబు మనసేమిటో పూర్తిగా తెలిసిన పెద్దయ్య చటుక్కున కదిలాడు.

''నేను వెళతాను. ఆ షరీఫు ఎలా వుంటాడో చెప్పండి. నేను అతడిని వెంటబెట్టుకొస్తాను'' అంటూ పాండుకేసి చూశాడు. షరీఫు పోలికల్ని అతనికి చెప్పటం అయితే చెప్పాడుగాని, వాళ్ళిద్దరూ క్షేమంగా తిరిగి రాగలరనే నమ్మకం పాండుకి కలగలేదు.

''షరీఫు ఒక్కడే కాదు. మా రంగమ్మ, పిచ్చిమామ్మ కూడా ఇటుగా వచ్చారట.... వాళ్ళూ నారాయణపురమే వెళ్ళి వుండవచ్చు...'' అంటూ కాసేపు ఆలోచించి, నేనే వెళ్ళివస్తాను... మీరెవరూ వద్దు అంటూ ముందుకు అడుగేశాడు.

“ఓరినీ… నువ్వు బయలుదేరితే మేము ఇక్కడ వుండటం దేనికిరా? పద… అందరం కలిసే పోదాం…” అంటూ వెంటనే రెడీ అయ్యాడు జోగినాథం. అష్టసిద్ధి యంత్రంలో కదిలికలు కనిపించని ఆ క్రూషియల్ పిరియడ్ లో అతను అవతలిక పోవటం రవిబాబుకి ఇష్టంలేదు. అయినా అడ్డు చెప్పటానికి ధైర్యం చేయలేకపోయాడు.

“జాగ్రత్తగా వెళ్ళిరావాలి…” అంటూ మెయిన్ గేటు దాకా వచ్చి పాండును సాగనంపాడు. సివిల్ డ్రస్సులో వున్న కానిస్టేబిల్స్ జోగినాథం వెంట వస్తూండగా, దొరగారి దగ్గరవున్న ఇంకో ఎట్లబండిమీద ఎక్కి పగ్గాలను విదిలించాడు పాండు. సుడిగాలి మాదిరి వేగంగా నారాయణపురంవైపు దూసుకుపోయింది ఆ బండి.

***

అరుపులతో, కేకలతో, ఆడవాళ్ళ ఏడుపులతో గగ్గోలెత్తిపోతున్నది నారాయణపురం. రత్నంగారి అమ్మాయిని వెతకటానికి అందరితోను కలిసి బైలుదేరిన రత్నంగారి స్నేహితులు అర్థాంతరంగా అన్యాయమైపోవటాన్ని చూసి ఆగ్రహావేశాలతో రగులుపోతున్నారు జనం.

“ఇది ఆ వేములపల్లి దొరగారి మూలకంగానే జరిగింది. మనం వెళ్ళి ఆయన దివాణాన్ని తగలబెడదాం” పళ్ళు పటపట కొరుకుతూ ఎనౌన్స్ చేస్తున్నారు వారిలో కొందరు. అంతకుముందు అరగంట క్రితమే అక్కడినుంచి వెనక్కి వచ్చిన రత్నంగారు మాత్రం ఉలుకూ పలుకూ లేకుండా తన స్నేహితుల శరీరాల దగ్గర చతికిలపడి కూర్చుని వున్నాడు.

"అయ్యగారూ! ఆలస్యం దేనికి? మనమందరం కల్సి బయలుదేరుదాం..." అని అతన్ని రెచ్చగొట్టటానికి ట్రై చేశాడు ఆగ్రహం అధికమైపోయిన గ్రామస్థుడొకతను.

"ఇది... ఈ పని ఆ దొరగారివల్ల జరగలేదు. మన వాళ్ళంతా అల్లంత దూరంలో వుండగానే రాఘవాపురం స్టేషన్ దగ్గిర హతమారిపోయార్ట పోతురాజు, చలమయ్య... వద్దు వద్దన్న కొద్దీ పోయి అడవిదారిలో ఓ ఆడమనిషి వెంట పడ్డాడుట కనకయ్య... మనుష్యుల మూలకంగా జరగలేదు. దయ్యాలో, భూతాలో కావాలని చేసిన పని ఇది. వాళ్ళ ఒంటిమీది గాయాల్ని చూడండి" అందరితోను చెప్పాడో వృద్ధుడు.

ఎర్రబడిన ముఖంతో ఏదో అనబోయి ఆఖరి క్షణంలో ఆ ప్రయత్నాన్ని విరమించుకుని వెనక్కి వచ్చేశాడు రత్నంగారిని రెచ్చగొట్టబోయిన గ్రామస్థుడు.

"అయ్యగారూ! మీరు మాట్లాడకుండా కూర్చుంటే వాళ్ళు ఇలా రెచ్చిపోతూనే వుంటారు. మీరు మాట్లాడాలి... మీ అభిప్రాయం ఏమిటో చెప్పాలి..." రత్నంగారి దగ్గరికిపోయి మృదువైన కంఠంతో చెప్పాడా వృద్ధుడు.

"ఏం చెప్పను మామయ్యా? ఇలాంటి ఆవేశాలకు వశమై, తరుముకుంటూ పోయినందువల్లనే కంటికి కనిపించకుండా పోయింది నా చెల్లెలు. ఇప్పుడు నా కూతురూ అదేపని చేసి నా గుండెల్ని పిండిచేసేసింది. చెల్లెల్ని పోగొట్టుకున్నట్టే ఇప్పుడు కూతుర్నీ పోగొట్టుకోనా? ఏం చేయను?" నిస్సహాయంగా చూస్తూ అన్నాడు రత్నంగారు.

“శబ్బాషయిన మాట చెప్పారు అయ్యగారూ! తప్పుచేసిన కూతుర్ని గురించి ఒక కన్నతండ్రి ఎలా మాట్లాడాలో అలాగే మాట్లాడారు. మీ సహనానికి నేను సలాం చేస్తున్నా...” ఉన్నట్లుండి ఆ సంభాషణలో కల్పించుకున్నాడు అంతకుముందే ఎర్రబస్సు దిగి, ఎటుపోవాలో తెలియక సరాసరి రత్నంగారి ఇంటికొచ్చిన షరీఫు.

“ఎవరు నువ్వు?” కనులు చిట్టిస్తూ అన్నాడు రత్నంగారు.

తానెవరో చెప్పుకున్నాడు షరీఫు. “పాండుగాడని నా స్నేహితుడు. పెద్దముదురు. రంగమ్మ వాడికి కాబోయే భార్య. వాడు ఇటుగా వచ్చి వుంటాడనే అనుమానంతో, మా రంగమ్మ ఎవరికీ చెప్పకుండా వచ్చేసింది.

“ఆ బిడ్డకోసం నేను వచ్చాను. ఎవరికైనా తెలిస్తే వాళ్ళ జాడలు నాకు చెప్పండి.... వెళ్ళిపోతాను...” తనను పరిచయం చేసుకున్న తర్వాత సూటిగా అసలు విషయంలోకి వచ్చాడు. రంగమ్మ పోలికలు చెప్పాడు.

“వాళ్ళెవరో నాకు తెలియదు...” అని తలను పక్కకు తిప్పుకోబోయి, ఉన్నట్లుండి కనులు చిట్లించాడు రత్నంగారు.

“రంగమ్మ చామన ఛాయగా ఉంటుందని అంటున్నావే... ఆ అమ్మాయితో పాటు ఒక ముసలమ్మ కూడా వుంటుందా?” అనుమానంగా చూస్తూ అడిగాడు.

“ఓరినీ... ఆ ముసల్ది కూడా వచ్చేసిందా? అవును అయ్యగారూ.... నడుము వంగిపోయిన ముసలమ్మేనా? ఐతే తప్పకుండా మా రంగమ్మతో వచ్చివుండవచ్చు” ఆత్రుతగా అన్నాడు షరీఫు.

అతని మాటలు ముగిసిన మరుక్షణం నోరువిప్పి ఏదో చెప్పబోయి, అప్రయత్నంగా అచేతనంగా పడివున్న తన స్నేహితుడు కనకయ్యవైపు చూశాడు రత్నంగారు.

"చెప్పండి బాబుగారూ! తొరగా చెప్పండి. నాకు ఆత్రం ఎక్కువైపోతోంది" అన్నాడు షరీఫు.

క్షణంపాటు తటపటాయించి పైకి లేచాడు రత్నంగారు. షరీఫుని తనతో రమ్మని సైగచేసి, భవనంలోకి తీసుకుపోయాడు.

"మా కనకయ్య మీ రంగమ్మని చూసి లొట్టలువేశాడు. చక్రతీర్థానికి వెళ్ళే కాలిదారి దగ్గర మా జీప్‌లో నుంచి దిగిపోయాడు. బహూశా అటుకేసి వాళ్ళని తీసుకుపోయి వుండవచ్చు. మీ రంగమ్మ కత్తి తిప్పుతుందా?" కనకయ్య మెడమీది గాయాన్ని గుర్తుచేసుకుంటూ అడిగాడు.

"అదే పెద్ద చురకత్తి. దానికి కత్తితో అవసరంలేదు బాబూ! చక్రతీర్థం అంటే ఏమిటి?" అన్నాడు షరీఫు.

చక్రతీర్థాన్ని గురించి వివరంగా చెప్పబోయి ఆగిపోయాడు రత్నంగారు.

"ఇప్పుడు చీకటి పడిపోయింది. ఈ చీకట్లో నువ్వు అడవిలోకి పోలేవు. తెల్లారిన తరువాత నేనే తోడిచ్చి పంపిస్తా..." అంటూ తన పనిమనిషిని పిలిచి ఆమెకు అతన్ని అప్పగించాడు. "భోజనం పెట్టి మెట్ల గదిలో పడుకోమని చెప్పు..." అని ఆదేశించాడు.

ఇంటి ముందు అరుపులు, కేకలు, ఏడుపులు అప్రతిహతంగా కొనసాగుతూనే వున్నాయి.

లోపలి నుంచి బయటికొచ్చిన రత్నంగారిని చూసేసరికి అవి యింకా అధికమయ్యాయి.

పదిక్షణాలు ఓపికపట్టి ఒక్కసారిగా ఆడవాళ్ళని కూడా చూడకుండా నోటికి వచ్చినట్టు తన స్నేహితుల బంధువుల్ని, పరివారాన్ని తిట్టిపోశాడు రత్నంగారు.

"ఏడ్చి రాగాలు తీసినా, గుండెలు బాదుకున్నా పోయినవాళ్ళు తిరిగి రారు, పోయినందుకు గుండెల్లో వెలితిగా వుండటం సహజం. అలాగని అందరినీ రెచ్చగొట్టే పద్ధతిలో రాగాలు తీయటం మంచిదికాదు. వాళ్ళకి దహన సంస్కారాలు చేయాలి. ఏర్పాట్లు చూడండి" సీరియస్‌గా చెప్పాడు.

"రాత్రివేళల్లో అలాంటి పనులు చేయటం పద్ధతి కాదు బాబూ..." అన్నదో వృద్ధ మహిళ.

"పద్ధతి ప్రకారం జరిగే పనులకు పద్ధతులు అన్వయించాలి. వీళ్ళు పద్ధతి ప్రకారం ప్రాణాలు వదల్లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఆలస్యం చేయకూడదు. పని పూర్తవటమే ముఖ్యం. నోరు మూసుకుని నేను చెప్పినట్టు చేయండి" అని కసురుకున్నాడాయన.

చకచకా పూర్తి అయ్యాయి ఏర్పాట్లు. లోపలికెళ్ళిన షరీఫు స్నానం చేసి, పనిమనిషి ఇచ్చిన రత్నంగారి పాతదుస్తుల్ని ధరించి, కడుపునిండా భోజనం చేసి,

మెట్ల గదిలో ఒక కునుకుతీసే సమయానికి కార్యక్రమాలన్నిటినీ పూర్తి చేసుకుని, స్నానం చేసి ఇంట్లోకి వచ్చాడు రత్నంగారు. తనను చూసి వినయంగా చేతులు కట్టుకుని దగ్గిరికొచ్చిన షరీఫుని పెరటితోటలోకి తీసుకెళ్ళి, తన మనసులోని వ్యధనంతా వెళ్ళబోశాడు.

“ఏం చేయాలి నేను? మందీ మార్భలంతో వేములపల్లి మీదికి యుద్ధానికి పోవాలా?” అని అడిగాడు.

“నువ్వుగింజ కూడా నా నోట్లో ఆగదని, వెనుకాముందు చూడకుండా నోటికి ఏది వస్తే అది వాగేస్తానని, వట్టి ఎదవననీ మా పాండు అంటూ వుంటాడు. మీరు పెద్దోళ్ళు. నా అభిప్రాయం అడుగుతున్నారు. బాగోదేమో ఆలోచించండి....” అన్నాడు షరీఫు.

“మరేం ఫరవాలేదు. నేనేమీ అనుకోను. చెప్పు....” అన్నాడు రత్నంగారు.

“ఇంతకుముందు ఇట్టాటి సమస్య ఎదురయితే ఏం చేసేవోళ్ళు మీరు?”

“నా స్నేహితులు సలహా ఇచ్చేవాళ్ళు.”

“ఆళ్ళు లేకపోయేసరికి మీకు అంతా అయోమయంగా అన్పిస్తోంది. అవునా?”

అవునని తల ఊపాడు రత్నం.

“ఆళ్ళు ఏం చెపితే అది చేసేవాళ్ళు మీరు. మంచి చెడు ఆలోచించే వోళ్ళు కారు.”

అందుకు కూడా తల వూపాడు రత్నం.

“అదే మీ తప్పు బాబుగోరూ! అక్కడే మీరు దెబ్బతింటున్నారు. మీకంటూ ఆలోచన వుండాలి. తాగొద్దని అందరూ అంటారు. తాగటం మానేస్తున్నామా? ఇదీ అంతే. మీ ప్రాణంలో ప్రాణం మీ అమ్మాయి. మీ ఆస్తిపాస్తులు అన్నింటికీ ఆమే వారసురాలు. ఆ బిడ్డ సంతోషమే మీ సంతోషం. హాయిగా, ఆనందంగా ఒప్పేసుకోకుండా ఎవరో ఏదో చెప్పారని, ఎగదోశారని రెచ్చిపోవటం మీ తప్పు. మీ అమ్మాయి మీకు కావాలి. అంతే... వెళ్ళి ఆ బిడ్డ ఇష్టపడినోడితో నిక్కా చేయించండి. ఆ బిడ్డ కళ్ళల్లో కన్పించే సంతోషాన్ని మీరు జన్మంతా గుర్తుపెట్టుకుంటారు...” అన్నాడు షరీఫు.

పదిక్షణాలు మౌనంగా వూరుకుని, “మా అమ్మాయి మాటని నేను కాదని అన్నది నా స్నేహితులు సలహా ఇవ్వటం వల్ల కాదు. నా చెల్లెలు సువర్ణకూడా ఇలాగే చేసి నా పరువుతీసింది. అందుకని నేనే రెచ్చిపోయి వద్దన్నాను. నా మాటని బలపరిచారు నా స్నేహితులు...” అన్నాడు రత్నంగారు.

“అదీ ఇదీ అన్నీ ఒకటే బాబుగోరూ... మీ చెల్లెలంటున్నారుకదా! అప్పుడు ఆ బిడ్డ పెళ్ళికి మీ స్నేహితులు అడ్డం పడ్డారా పడలేదా? నిజంగా చెప్పండి.”

షరీఫు ముక్కుకు సూటిగా మాట్లాడిన మాటలు మరింత ఆలోచనలో పడేశాయి రత్నంగారిని. రెండు నిముషాలపాటు ఆలోచించి “అవును... అప్పుడు అడ్డంపడి పరువును గురించి నాకు హితబోధ చేసింది నా స్నేహితులే” అన్నాడాయన.

“అవునుకదా... నిప్పులేనిదే పొగ రాదని అంటారు. ఆళ్ళు అలా అప్పుడు మిమ్మల్ని రెచ్చగొట్టటానికి వెనకాల ఏదైనా కారణం వుందేమో తెలుసుకోండి.

నేను పోయి పడుకుంటా. పొద్దున్నే మా రంగమ్మ తల్లిని వెతుక్కుంటూ పోవాలి... నిద్రవస్తోంది....'' అంటూ తోటలో నుంచి ఇంట్లోకి వచ్చాడు షరీఫు.

గుమ్మం పక్కనే నిలబడి చెవులు ఓరగాపెట్టి వాళ్ళ సంభాషణను ఆలకిస్తోంది రత్నంగారి భార్య నీరునిండిన కళ్ళతో షరీఫు వంక చూసి అమాంతంగా చేతులు జోడించింది.

''అయ్యయ్యో.... అట్టాటి పని చేయనేవద్దు. పోయి అయ్యగారితో మాట్టాడండి. మీ ఇంటి విషయం ఇది. మీలో మీరు మాట్లాడుకోవాలి. అదీ పద్ధతి...'' అంటూ మెట్ల కింద వున్న చిన్న గదిలోకి వెళ్ళిపోయాడు షరీఫు.

అక్కడ వున్న చాపపై పడుకోబోతుండగా, కన్పించింది అతనికి ఓ మూలగా కూర్చునివున్న రాజశేఖర్ స్వరూపం. సబ్బు బుడగకంటె ట్రాన్సపరెంట్ గా వున్న ఆ స్వరూపాన్ని ఆశ్చర్యంగా చూశాడతను.

''నా ఆకారం నీకు భయాన్ని కలిగించటంలేదా?'' అడిగింది ఆ రూపం.

''భయాలు గియాలు మన వంటికి అంటుకోవు. ఎవరు నువ్వు? సైతాన్ వా?'' కనులు చిట్లిస్తూ ప్రశ్నించాడు షరీఫు.

''అంతకంటే పవర్‌ఫుల్.. దయ్యాన్ని.''

''ఓరినీ... ఇంకానయం... భూతానివేమో అనుకున్నా. ఏంటీ ఇక్కడ మకాం పెట్టావ్?''

''నీ మాటల్ని విన్నా... నీలాంటివాడు ఒక్కడంటే ఒక్కడు పాతికేళ్ళ క్రితం ఇక్కడికి వచ్చి ఆ మూర్ఖ శిఖామణితో మాట్లాడివుంటే ఈనాడు నేనిలా మూలల్లో

దాక్కోవాల్సిన అవసరం వచ్చివుండేది కాదు. ఒకే ఒక్క నిముషంలో నువ్వు ఆయన మనసు మార్చేశావు. నమస్కారం చేసి వెళ్దామని నీ కోసం వెయిట్ చేస్తున్నా....'' అంటూ నమస్కారం చేసి, పక్కనే వున్న గోడలోనుంచి బయటికి వెళ్ళిపోబోయింది రాజశేఖర్ స్వరూపం.

''ఓరినీ... ఆగు. అర్ధాంతరంగా వెళ్ళిపోకు. నువ్వవరివో, ఎక్కడి నుంచి వచ్చావో చెప్పివెళ్ళు'' అంటూ చెయ్యి పట్టుకోవటానికి ట్రై చేశాడు షరీఫు. రాజశేఖర్ చేతిలోనుంచి పోయి గోడకు తాకిందతని చేయి.

''నువ్వు దయ్యానివి కదూ! మరిచేపోయా...'' అంటూ చేతిని విదిలిస్తున్న అతన్ని చూసి నవ్వి, తానెవరో చెప్పిందా రూపం. తన కథను కొద్దిగా వివరించింది.

''అదీ.... అసలు సంగతి! నువ్వు ఈ ఇంటి అల్లుడివి. నీకు ఈ గతి పట్టించినవాళ్ళు ఖతమైపోయారు. కొంపతీసి నువ్వే వాళ్ళని...'' అంటూ మాటల్ని ఆపాడు షరీఫ్.

గాఢంగా నిట్టూర్చి తల అడ్డం తిప్పింది రాజశేఖర్ రూపం. ''నేను చేయలేదా పని. ఎవరు చేశారో ఎంతగా ప్రయత్నం చేసినా ఊహకి అంతుబట్టటంలేదు. బహుశా చక్రతీర్థం దగ్గర చిందులు తొక్కుతున్న మామ్మ చేసి వుంటుంది.''

చక్రతీర్థం అనేమాట చెవులపడిన వెంటనే ఎలర్ట్ అవుతున్న షరీఫుకి, అక్కడ చిందులుతొక్కే మామ్మ అనేమాట మరింత హుషార్ ని యిచ్చింది.

“రంగమ్మ.... మా రంగమ్మతో వచ్చిన పిచ్చిమామ్మే అయి వుంటుంది. దయ్యం భాయ్... నన్ను అక్కడికి తీసుకుపోగలవా?” ఆత్రుతగా అడిగాడు.

“తప్పకుండా....” అంటూ అతని తలమీద చేయి పెట్టింది రాజశేఖర్ రూపం.

ఈదురుగాలిలో చిక్కుపడినట్లు అనుభూతిని పొందుతూ గదిలో నుంచి మాయమై చక్రతీర్థం దగ్గర నిలబడ్డాడు షరీఫు. తల పక్కకు తిప్పిన వెంటనే కనిపించింది అతనికి రంగమ్మ.

చెరువు ఒడ్డున బాసిపట్టు వేసుకుకూర్చున్న పిచ్చిమామ్మ తొడమీద తల పెట్టుకుని గాఢ నిద్రపోతోంది. అనుకోని విధంగా ప్రత్యక్షమైన షరీఫుని చూసి తల విదిలించింది మామ్మ.

***

“రత్నంగారో... ఓసారి బయటికి రండి... త్వరగా” అర్ధరాత్రి సమయంలో గొంతు చించుకుంటూ ఒక గ్రామస్థుడు అరిచేసరికి, హాల్లో నిద్రపోకుండా కూర్చుని వున్న రత్నంగారు భవంతి బయటికి వచ్చాడు.

“వేములపల్లి నుంచి ఎవరో ఎడ్ల బండి మీద వస్తున్నారు. చూడటానికి జెమాజెట్టీల మాదిరిగా వున్నారు. ఎందుకయినా మంచిది... మన వాళ్ళందర్నీ పిలిపించండి...” తన అరుపులకు కారణాన్ని వివరించాడా గ్రామస్థుడు.

ఆ మాటలు విన్న తన పాలేర్లు కర్రల్ని బయటికి తీయటాన్ని చూసి వెంటనే వారించాడు రత్నంగారు.

"వేములపల్లి దొరగారితో మనకి విరోధం వద్దు. అమ్మాయిగారిని ఆ రవిబాబుకే ఇచ్చి పెళ్ళి చేయాలని నేను నిర్ణయించుకున్నా. మీరు ఎదురువెళ్ళి ఆ వచ్చేవాళ్ళని గౌరవంగా తీసుకురండి" అన్నాడు.

ఆశ్చర్యంగా చూస్తూ అవతలికిపోయి, పావుగంట తర్వాత వేములపల్లి నుంచి వచ్చిన బండిని అక్కడికి తీసుకువచ్చారు వాళ్ళు.

"మీతో యుద్ధం చేయటానికి రాలేదు మేము. మా షరీఫు మీ ఊరు వచ్చినట్టు తెలిసింది. అతనికోసం వచ్చాం...." బండి దిగుతూ అన్నాడు పాండు.

"షరీఫంటే నాతో మాట్లాడిన మనిషి. మెట్ల గదిలో పడుకోమని అన్నాను" ఒక పాలేరుతో చెప్పాడు రత్నంగారు.

పరుగెత్తుకుంటూ లోపలికిపోయి "అయ్యగారూ... ఎవరూలేరు... ఖాళీగా వుంది గది" అంటూ బైటికొచ్చాడతను.

నిలుచున్న చోటి నుంచి ఒక్కసారిగా జంప్ చేసి రత్నంగారి మీద పడ్డాడు పాండు. ఆయన్ని నేలమీదికినెట్టి రెండు చేతులతోనూ గొంతు పట్టుకున్నాడు.

అది చూసి పొలికేకలు పెడుతూ కదిలిన ఆయన పాలేర్లను తమ ప్యాంటు బెల్టులను కొరడాల మాదిరి గాలిలో ఝుళిపిస్తూ అడ్డుకున్నారు జోగినాథం, అతని కానిస్టేబుల్స్.

"పిచ్చివేషాలు వేయకండి. మర్యాదగా మా షరీఫుని మాకు అప్పగించకపోతే, మీరందరికీ ఇక్కడే గోరీలు కట్టిపోతాం. చెప్పండి... మా షరీఫుని ఏం చేశారో చెప్పండి...." అంటూ రంకెలు పెడుతున్న జోగినాథం

తలమీది నుంచి రివ్వున దూసుకుపోయిందొక ఈదురుగాలి. పాండు దగ్గరికి పోగానే రాజశేఖర్ గా మారిపోయింది.

"మీ షరీపు చక్రతీర్థం దగ్గర వున్నాడు. రంగమ్మ, పిచ్చిమామ్మ అక్కడే వున్నారు. రత్నంగారిని వదిలేయ్. అపూర్వ పెళ్ళికి అంగీకరించాడు..." ఎర్రబడిన కనులతో పెద్దపులిలా వున్న పాండుకు చెప్పింది అది.

"నువ్వు ఎవరివి? రాజశేఖర్‌వి కదూ?" పాండు తనను వదిలిపెట్టగానే, అతను తన ప్రాణాల్ని తీయబోతున్నాడన్న సంగతిని మర్చిపోయి ఆశ్చర్యంగా అడిగాడు రత్నంగారు.

అప్రయత్నంగా కమ్ముకువచ్చిన కన్నీటిని చేతులతో తుడుచుకుంటూ తల ఊపిందా రూపం.

"నా చెల్లెలు... మా సువర్ణ ఏది? ఎక్కడ వుంది?"

ఆత్రుతగా అడిగిన ఆయనకు సమాధానం చెప్పలేదు. అమాంతంగా మాయమైపోయింది.

"ఏడి....? రాజశేఖర్ ఏడి? ఎటుపోయాడు?" అని అడుగుతున్న రత్నంగారిని, వరండాలో వున్న కుర్చీలో కూర్చోబెట్టాడు పాండు.... అపూర్వ ద్వారా తను విన్న కథను ఆయనకు తెలియచేశాడు.

తను ఎంతగానో నమ్మిన తన స్నేహితులే తన చెల్లెలి మరణానికి కారకులయ్యారని తెలిసిన వెంటనే వీరభద్రుడి మాదిరి చివ్వున కుర్చీలో నుంచి

లేచాడాయన. అంతలోనే తన స్నేహితులు తన చేతుల మీదుగానే పరలోకానికి వెళ్ళిపోయారన్న సంగతి గుర్తుకువచ్చి నీరసంగా కుర్చీలో వాలిపోయాడు.

“కట్లపాముల్ని పక్కన పెట్టుకున్న సంగతిని గుర్తించలేక, నా బిడ్డ బతుకును నాశనం చేయాలనుకున్నాను. ఇప్పుడే పోయి దొరగారిని క్షమాపణ కోరుకుంటాను. నా బిడ్డను తీసుకువచ్చి పెళ్ళి ఘనంగా జరిపిస్తాను. నా చెల్లెలు సువర్ణకి, రాజశేఖర్‌కి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు చేయిస్తాను అంటూ అప్పటికప్పుడు పాలేర్లను ప్రయాణానికి రెడీ అవమని చెప్పాడు.

“మంచిగా జరిగిందిరా పాండూ...! ఆ దయ్యం నీతో చక్రతీర్థం గురించి చెప్పింది కదా... మనం అక్కడికి వెళితే ఇంకోపని అయిపోతుంది” అంటున్న జోగినాథం వంక చూసి చిత్రంగా నవ్వాడు పాండు.

“ఎందుకురా...? ఎందుకా నవ్వు?” పాండు వంక అనుమానంగా చూస్తూ అడిగాడు జోగినాథం.

“తన్నులాటలు, కొట్లాటలు సీజను అయిపోయింది. ఇప్పుడు పెళ్ళిళ్ళ సీజను షురూ అవుతోంది. నీ పిల్లలకి కూడా మంచి సంబంధాలు చూసుకో, చేసేద్దాం” అంటున్న పాండు మాటలు అర్థంకాక, తనతో వచ్చిన కానిస్టేబిల్స్ వైపు అయోమయంగా చూశాడతను.

“వాడు... ఆ పాండుగాడు ఎప్పుడూ అంతే... వాడి మాటల్ని అర్థం చేసుకోవటం నీకు, మాకు అసాధ్యం” అన్నారు వాళ్ళు. జోగినాథం దగ్గర

బీడీనొకదాన్ని తీసుకుని ఎడ్లబండి ఎక్కాడు పాండు. అందరూ వచ్చిన తర్వాత చక్రతీర్థంవైపు పరుగులు తీయించాడు.

***

"లాభంలేదు దొరగారూ! ఈ విషయంలో కొండలమ్మతల్లి మనకు సాయంచేసేటట్లు కనిపించటంలేదు. ఎంతసేపు ధ్యానంలోకూర్చున్నా ఏమీ తెలియటంలేదు" అన్నాడు ముసలయ్య. తూర్పుదిక్కు తెల్లబడటానికి రెడీగా వున్నది. కంటిమీద కునుకులేకుండా నిలబడి వున్నారు వేములపల్లి గ్రామస్థులు దివాణం ఆవరణలో. దొరగారి ముఖం డీలా పడింది ముసలయ్య మాటలకి. రవిబాబు వదనం మరింత నీరసంగా తయారయింది.

"అయితే మేము తీసుకువచ్చింది నిజమయిన అష్టసిద్ధి యంత్రం అయివుండదు. దీన్ని అవతల పారేయటమే బెటర్...." అంటూ పూజా మందిరంలోని యంత్రాన్ని అందుకోబోయాడు రవిబాబు.

"ఆగండిబాబూ... ఆగండి" అంటూ అష్టసిద్ధి యంత్రాన్ని అందుకోబోయిన రవిబాబుని ఆపేశాడు ముసలయ్య.

"అది నకిలీ యంత్రం అయివుంటే కొండలమ్మతల్లి ఏదో ఒక సైగ చేసివుండేది. ఆమె మాట్లాడకుండా మౌనం వహించిందిగాని, ఇది నకిలీ యంత్రం అని ఇదమిత్థంగా తేల్చలేదు. కాబట్టి మీరు తొందరపడకూడదు" అంటూ అనునయించి, పూజా మందిరంలో నుంచి బయటికి తీసుకువచ్చాడు.

"ఇప్పుడు మనం ఏంచేస్తే బాగుంటుంది?" కాంతిని కోల్పోయిన ముఖాన్ని రుద్దుకుంటూ అడిగాడు దొరగారు.

“అదే ఆలోచిస్తున్నా.... నన్ను తొందరపెట్టకండి...” అంటూ పూజామందిరం వెలుపల ఒక పీటమీద కూర్చుని ధ్యానంలో మునిగిపోయాడు ముసలయ్య.

“బాబూ... బయట మనవాళ్ళందరూ నిలువు కాళ్ళమీద నిలబడి వున్నారు, ఇళ్ళకుపోయి నెమ్మదిగా రమ్మని చెప్పు. నీమాట అయితేనే వాళ్ళు వినిపించుకుంటారు....” రవిబాబు దగ్గరికి వచ్చి చెవిలో చెప్పాడు పెద్దయ్య.

విసవిసా బయటికిపోయి అక్కడున్న వారందరినీ ఇళ్ళకు పొమ్మని చెప్పాడు రవిబాబు. “మంచిగా నిద్రపోయి భోజనాలకు ఇక్కడికే వచ్చేయండి. మా చిలకమ్మ వంటలు చేయిస్తుంది” అని కూడా అన్నాడు.

తమలోతాము గుసగుసలు ఆడుకుంటూ అవతలికి పోతున్న గ్రామస్థుల్ని చూసి గాఢంగా నిట్టూర్చాడు రవిబాబు. “భోజనాలు పెట్టించేటంతటి శుభకార్యం ఇక్కడ ఏదీ జరగటంలేదు.... అయినాసరే మాట అనేశాను” అనుకుంటూ వుండగా–

“నువ్వు కూడా కాస్సేపు నిద్రపోతే బాగుంటుంది” అంటూ అతని దగ్గరికి వచ్చింది అపూర్వ.

తమలానే జాగరణ చేసినందువల్ల వడిలిపోయిన కలువలా తయారయిన ఆమె ముఖాన్ని ముద్దుగా అరచేత్తో తడుతూ, “పద. ఇద్దరం కల్సి నిద్రచేద్దాం” అన్నాడతను.

"కలిసి చేద్దామా నిద్ర...? పిచ్చిగాని ఏమైనా ఎక్కిందా? నట్టింట్లో అష్టసిద్ధి యంత్రాన్ని పెట్టుకుని పద్ధతి తప్పి ప్రవర్తిస్తామా?" కోపంగా అడిగింది ఆమె.

"అది అసలు యంత్రమో, నకిలీ యంత్రమో తేలటంలేదు. అసలైనదే అయితే ఆ చిహ్నాలు ఈపాటికి కనిపించాలి..." నిరాశగా అంటున్న అతన్ని ముక్కును పట్టుకుని అటూ ఇటూ ఊపింది ఆమె.

"పాండు వచ్చిన తర్వాత అన్ని రహస్యాలు బట్టబయలు అయిపోతాయి. ఇటువంటి పరిస్థితులకు అతనే విరుగుడు..." అని చెపుతూ వుండగా పరుగు పరుగున లోపలికి వచ్చాడు ఆమె తండ్రివద్ద పనిచేసే పాలేరు ఒకతను.

"అమ్మాయిగారండీ... నాన్నగారు పొలిమేరల్లో నిలబడి వున్నారు. మీకు, రవిబాబుకి పెళ్ళి చేయటానికి ఒప్పుకుని అమ్మగారితో ఆడంగులతో పసుపు కుంకాల్ని పట్టుకువచ్చారు.... ఊళ్ళో పరిస్థితి ఎలా వుందో చూసి రమ్మని నన్ను పంపించారు" అని ఆనందంగా చెప్పాడు.

"అరేయ్... నిజమే చెపుతున్నావా.....? నిజంగానే నాన్నగారు వచ్చారా?" విపరీతమైన ఆశ్చర్యంతో తన చెవుల్ని తనే నమ్మలేనట్టు అడిగింది ఆమె.

"అమ్మతోడు, నేను చెప్పేది నిజమే తల్లీ... కావాలంటే మీరే వచ్చి చూడండి" అన్నాడా పాలేరు.

"అపూర్వా ఆగు... ఒక్క నిముషం ఆగు" అని రవిబాబు పెద్దగా పిలుస్తున్నా వినిపించుకోకుండా పాలేరు వెంట పొలిమేరల దగ్గరికి పరుగు లాంటి నడకతో వెళ్ళింది ఆమె. అక్కడ జీప్ దిగి నిలుచునివున్న తల్లిని, తండ్రిని, తన

బంధువుల్ని చూడగానే సంతోషాన్ని ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడుస్తూ నిలబడిపోయింది.

"నన్ను క్షమించరా.... నీ మనసు కష్టపెట్టాను. నీ ఇష్ట ప్రకారమే చేస్తాను. తాంబూలాలు మార్చుకుంటానికి వచ్చాం..." అంటూ ఆమెను అక్కున చేర్చుకున్నాడు రత్నంగారు. బుగ్గలమీదికి అదేపనిగా జారుతున్న కన్నీటిని తుడుచుకోవటం కూడా మరిచిపోయి, దూరంలో అలాగే నిలబడిపోయింది నారాయణపురం నుంచి పెళ్ళివారిని అనుసరించి వచ్చిన రాజశేఖర్ ఆత్మ స్వరూపం.

***

"నీకు తెలియదురా అబ్బాయ్... నువ్వు వట్టి ముట్టెపొగరు మగాడివి... నా కళ్ళతో నేను స్వయంగా చూశాను. నా తల్లి ఇక్కడే వుంది... నేను మీతో రాను.... కావాలంటే మీరు వేములపల్లి వెళ్ళిపోండి" తెల్లారిన తర్వాత అర్ధఘడియకు వచ్చిన పాండుతో నిక్కచ్చిగా చెప్పింది పిచ్చి మామ్మ. అతను తీసుకువచ్చిన ఎడ్లబండి ఎక్కటానికి నిర్మొహమాటంగా నిరాకరించిందామె.

"ఇప్పటిదాకా షరీఫ్ బాబాయ్ ఆ మాటే అన్నాడు. అతన్ని కూడా అవతలికి నెట్టేసింది. ఎవరిమాటా వినటం లేదు. ఒట్టి తిక్కమేళం" విసుగ్గా చెప్పింది రంగమ్మ.

"మామ్మ సంగతి నేను చూసుకుంటాను. నువ్వు వేములపల్లి వచ్చేయ్" షరీఫ్ తోపాటు ఆమెను కూడా బండి ఎక్కించటానికి ట్రై చేశాడు పాండు.

“మామ్మని ఒంటరిగా ఈ అడవిలో వదిలిపెట్టి నేను రావాలా? నీకేమైనా పిచ్చిగాని ఎక్కిందా?” ఎర్రబడిన ముఖంతో చాలా కోపంగా అడిగిందతన్ని రంగమ్మ.

“నీ మొండితనంలో మూడొంతులు రంగమ్మకి అంటుకుంది. సందేహం లేదు” అంటున్న జోగినాథం వంక చూసి చిరునవ్వు నవ్వింది రంగమ్మ.

“నీకో బహుమతి ఇస్తాను బాబాయ్....” అంటూ ఒక పొదచాటున పెట్టిన సూట్ కేసును తెచ్చి అతనికి ఇచ్చింది.

“ఏంటమ్మా ఇది? ఏముంది ఇందులో?” ఆశ్చర్యంగా అడుగుతూ ఓపెన్ చేసి, కళ్ళు గిర్రున తిరుగుతున్నట్టు నేలమీద చతికిలపడిపోయాడు జోగినాథం.

“అయ్యబాబోయ్... డబ్బు... కట్టలకు కట్టలు... కోట్లకు కోట్లు...” ఆశ్చర్యంతో కామెంట్ చేశాడు షరీఫు.

“అదేదో బ్యాంకులో దొంగిలించిన డబ్బుట అది. ఆ దొంగలు ఈ చెరువులో పారేసుకున్నారట. పిచ్చిమామ్మ చెపుతున్న శక్తి దీన్ని వాళ్ళకు దక్కకుండా ఇంతవరకూ అడ్డుపడిందిట... మామ్మ చెప్పింది” మెరుస్తున్న కనులతో సంగతి ఏమిటో వివరించింది రంగమ్మ.

“రంగమ్మతల్లీ... నీ మాటలే నిజం... పిచ్చిమామ్మని ఒంటరిగా వదిలిపోవటం చాలా అన్యాయం. తనంతట తాను కదిలే వరకూ నీతోపాటు మేము కూడా ఇక్కడే మకాం” సూట్‌కేసును మూసి తన కానిస్టేబిల్స్‌కి అందిస్తూ తన నిర్ణయాన్ని వినిపించాడు జోగినాథం.

తలను రెండు చేతులతోనూ పట్టుకుంటూ అవతలికిపోతున్న పాండును, వున్నట్లుండి పిలిచింది పిచ్చిమామ్మ.

“పొగరెక్కిన పుంజులా అలా ఊరికే తచ్చట్లాడకపోతే ఈ చెరువులో దాక్కున్న నా తల్లిని బయటికి రప్పించే ఉపాయం ఆలోచించలేవు....” దెప్పి పొడిచింది.

“నీయవ్వ! నీకు నోరు బాగా పెరిగిపోయింది” అంటున్న పాండుకేసి ఓ మట్టిబెడ్డను విసిరింది రంగమ్మ.

“ఏంటే? ఏంటీ నీ చేతులు కూడా మహా స్పీడుగా కదులుతున్నాయ్? ఒళ్ళు ఎలా వుంది?” అంటూ తనకేసి వచ్చిన అతన్ని అవతలికి తీసుకుపోయింది.

“ఏదో ఒకటిచేసి మామ్మ మాటని చెల్లించు.. పిచ్చిది చెరువులో సుడిగుండాల్ని చూసిన దగ్గర్నించి ఇంకా పిచ్చిదైపోతోంది....” అనునయ స్వరంతో బతిమాలింది.

“నా తల్లో నా తల్లో అని రొద పెట్టకుండా ఆ తల్లి ఎవరో, ఎలా వుంటుందో చెప్పి ఏడవమను.... నా బుర్రని తినొద్దని చెప్పు...” విసుగ్గా అన్నాడు పాండు.

అంటూ వుండగానే అతని వెన్నుమీద పడింది పిచ్చిమామ్మ చేతి కర్ర. “పెద్దా చిన్నా తేడా తెలీకుండా నోటికొచ్చినట్టు వాగితే నరికి పోగులు పెడతాను. నా తల్లి ఎవరో నీకు తెలీదూ? తీలీకుండానే ముచ్చింతల గట్టు దగ్గరికి పోయివచ్చావా? తీలీకుండానే అష్టసిద్ధియంత్రం పేరుతో ఒక రాగి రేకును

తీసుకువచ్చి దొరగారి దివాణంలో పడేసి వచ్చావా?'' ఎర్రబడిన కనులతో కోపంగా అడిగింది.

నెత్తిమీద బక్కెట్ తో నీళ్ళు కుమ్మరించినట్లు చెమటలతో నిండి పోయిందతని ముఖం. ''మామ్మా... నువ్వు... నువ్వెవరివి?'' తడబడుతున్న కంఠంతో అడిగాడు.

''నేను నేనేరా... మనసైన పిల్లను మనసైన వెంటనే పెళ్ళి చేసుకోవటానికి తటపటాయించాల్సిన ఖర్మను మీకు పట్టించిన కీర్తిరాయుడి చెల్లెలు సుదంతినిరా... నా కథ నీకు తెలుసు. దొరగారు చెప్పాడు.... గుర్తు తెచ్చుకో'' గద్గద స్వరంతో అంది మామ్మ.

నిలుచున్నవాడు నిలుచున్నట్లుగానే ఆమె పాదాల ముందు బోర్లాపడి పోయాడు పాండు. ''పిచ్చిదానివనే అలుసుతో నోటికి వచ్చినట్లు మాట్లాడుతూ వచ్చాను. నన్ను క్షమించు'' అని వేడుకున్నాడు. చేతికర్రను వదిలి అతన్ని పైకి లేవదీస్తూ నుదుటిపై ముద్దు పెట్టుకుందామె.

''మాతృత్వంలోని మధురిమను ఆస్వాదించే అదృష్టం లేకపోవటం వల్ల, అసలు చావేలేకుండాపోయింది నాకు. చేసిన తప్పును సరిచేసుకునేందుకు నా తల్లిని అన్వేషిస్తూ దేశదేశాలు తిరిగి ఇన్నాళ్ళకు నీ పంచకు చేరుకున్నాను. తరతరాల నా బాధ నీ సహచర్యంతో ఉపశమించింది. బిడ్డల పెంపకంలోని మధురిమ ఎలా వుంటుందో రంగమ్మ పరిచయం నాకు చవి చూపించింది. నాన్నా.... నా తల్లిని బయటికి రప్పించు'' బుగ్గల మీదికి అదే పనిగా జారుతున్న కన్నీటిని తుడుచుకోకుండా అర్థించింది.

"కాస్సేపు ఆగు.... నన్ను ఆలోచించుకోనీ!" అంటూ ఇవతలకు వచ్చి, జోగినాథం దగ్గర బీడీని అప్పు తీసుకుని గుండెలనిండా పొగ పీల్చాడు పాండు.

అప్పుడు తట్టింది అతనికి అసలు పాయింటు.

"అష్టసిద్ధి యంత్రాన్ని రెచ్చగొట్టి మా మామ్మతో తప్పటడుగు వేయించటానికి అప్పటి దివాన్ భూపతి ఒక పన్నాగం పన్నాడు... సిరిపుర సంస్థానంలో వున్న ఒక గ్రామదేవతకు జాతర జరిపించే నెపంతో డోళ్ళూ తాషామార్ఫాలు మోగింపించాడు. ఆ శబ్దాలను ఆలకించి ఆత్ర పడిందిట అష్టసిద్ధి యంత్రంలోని అధిష్టానదేవత" ఆశ్చర్యంగా చూస్తున్న జోగినాథంతో చెప్పాడు.

"ఇప్పుడు ఏం చేయాలి మనం?" అడిగాడు జోగినాథం.

"జాతరచేయాలి మనం... ఇక్కడికి నారాయణపురమే దగ్గర... ఊళ్ళోకివెళ్ళి డోళ్ళు డోలకులు తాషామార్ఫాలతో జనాన్ని వెంట బెట్టుకు రావాలి" చెప్పాడు పాండు.

అదేపనిగా ప్రయాణం చేసి వుండటం వల్ల అలసిపోయిన మైసూరెడ్లను నిర్ధాక్షిణ్యంగా బండికికట్టాడు ఖాళీగా నిలబడివున్న షరీఫు. "రండి తొందరగా వెళ్ళివద్దాం" అని జోగినాథాన్ని తొందరపెట్టాడు. మూడు మూడు ఆరుగంటల తరువాత సరిగ్గా మిట్టమధ్యాహ్న సమయంలో అతని వెంట వచ్చిపడ్డారు నారాయణపురంలో గ్రామదేవతలకు పూజలు చేసే పంబలవాళ్ళు.

పసుపు కుంకుమల్ని చక్రతీర్థంలోకి విసిరి, "అల్ల భైరవా... ఆళ్ళ రభశరభా... మాలక్షమ్మ తల్లీ... మమ్మేలు జననీ.. కోపమెందుకే మా యమ్మ...

కొలువు తీరుద్దుగాని బయటికిరావే... మమ్మేలు మా తల్లి యమ్మ రావే" అంటూ చిందులు ప్రారంభించారు.

బాజాలు మోగాయి.... భజంత్రీలు మోగాయి... డప్పుల దరువుతో, తాషామార్ఫాల హోరుతో దద్దరిల్లిపోయింది చక్రతీర్థం.... ఈదురు గాలులు వీచినపుడు ఎగసిపడే అలలు – గాలి కొంచెంగా కూడా వీయకముందే ఉన్నట్టుండి ఒక్కసారిగా నిలువెత్తున పైకిలేచాయి.

"రాతల్లీ..... రావే మాయమ్మ రావే...." అంటూ చేతులు జోడిస్తున్న పంబలవాళ్ళ తలలమీదుగా ఆకాశంలోకి ఎగిరింది ఒక తోకచుక్క లాంటి వెలుగు.

"వెళ్ళిపోతోంది... నా తల్లి వెళ్ళిపోతోంది అయ్యయ్యో" అని ఆక్రోశించిబోయిన పిచ్చిమామ్మ నోటిని బలంగా అదిమి, ఎడ్లబండివైపు నెట్టాడు పాండు.

"పదండి అందరూ.... వేములపల్లికి దగ్గర్లో వున్న పాడుపడిన మేడ దగ్గరికి పదండి" అని జాతర చేయడానికి వచ్చినవాళ్ళకు హెచ్చరించి, బండిని అటు పరిగెత్తించాడు.

***

భోజనాలు చేసి విశ్రాంతి తీసుకుని, పొద్దు పడమరకు తిరగబోతున్న సమయంలో "నా తప్పుల్ని మంచి మనసుతో క్షమించి, నా బిడ్డను మీ కోడలిగా చేసుకోండి" అని దొరగారిని అర్థించాడు రత్నంగారు.

"ఆచారిగారూ... మంచి ముహూర్తం చూడండి" అన్నాడు దొరగారు. పూజా మందిరంలో వున్న పంచాంగం కోసం బయలుదేరి, ఒక్కసారిగా వెనక్కి వచ్చేశాడు ఆచారి.

"దొరగారూ! ముసలయ్య... ఒక్కసారి అటువైపు చూడండి" అంటూ దొరగారిని హెచ్చరించాడు.

శివమెక్కిన తాచులా ఊగిపోతున్నాడు ముసలయ్య. "జాతర... నాకు జాతర... జాతర కావాలి..." అంటూ పాము చేసిన మాదిరిగానే శబ్దాలు చేస్తున్నాడు.

"ఎప్పుడూ లేనిది ఏమిటి ఈ వింత?" అని కామెంట్ చేయబోయిన రవిబాబు జేబులో సెల్ అదేపనిగా సిగ్నల్స్ ఇవ్వటం మొదలుపెట్టింది.

"హల్లో..." అన్నాడతను, సెల్ లో కనిపించిన నెంబర్ ఎవరిదో తెలియక పోవటం వల్ల చాలా చిరాకుగా.

"బాబూ... నేను జోగినాథాన్ని! మీరు వెంటనే పాడుపడిన మేడ దగ్గరికి వచ్చేయండి. పాండు ఈ విషయం మీతో చెప్పమన్నాడు... క్విక్" అంటూ కనెక్షన్ కట్ చేశాడు జోగినాథం.

తండ్రికి కూడా చెప్పలేతదడు. "ఇప్పుడే వస్తాను" అంటూ బయటికి పరిగెత్తి, ఎంతో అవసరం అయితే తప్ప బయటికి తీయని తన జీప్‌ని ఒక షెడ్‌లో నుంచి బయటికి తీశాడు. స్టార్టు చేసి ముందుకు దూకించబోతుండగా, పరుగు పరుగునవచ్చి అతని పక్కన కూర్చుంది అపూర్వ. ఆమెను కిందికి దించే

ప్రయత్నంలో టైమ్ వేస్ట్ చేసుకోవటం ఇష్టంలేక యాక్సిలేటర్ని అదుగుకంటా అదిమాడతను. దుమ్ము తెరల్ని రేపుతూ వేగంగా అడవికేసి నడిపించాడు.

***

పాడుబడిన మేడదగ్గర తాషామార్ఫాలు మోగటం మొదలుపెట్టిన మరుక్షణం మేడచుట్టూ వున్న చెట్లు తుఫానులో చిక్కుపడినట్లు వూగటం మొదలైంది.

అందరూ చూస్తుండగా మేపడక్కనుంచి గాలిలోకి లేచింది ఒక సుడిగాలి... వేగంగా పక్కకు వంగి దూరంలో వున్న కొండలమ్మ గట్టుకేసి పరుగుతీసింది.

"పదండి.... అందరూ కొండలమ్మ తల్లి దగ్గరికి పదండి!" అంటూ అందర్నీ హెచ్చరించాడు పాండు. నడిచి నడిచి అలసిపోయి వున్న పంబలవాళ్ళు అతనిలా త్వరగా అడుగులు వేయలేకపోయారు... అందరూ కొండలమ్మ దగ్గరికి వచ్చేసరికి చీకట్లు చుట్టుముట్టేశాయి.

"ఈ చీకటిలో పూజలు చేయలేం.... తెల్లారిన తర్వాత చేద్దాం" అని అనబోతున్న జోగినాథం అదిరిపడి ఆ మాటల్ని మధ్యలోనే మింగేశాడు.

కొండలమ్మతల్లి కొలువై వున్న గట్టు ఫ్లడ్ లైట్లు వెలిగించినట్లు విపరీతమైన వెలుగుతో నిండిపోయింది. పెద్ద పెద్ద కళ్ళతో తనవంక సూటిగా చూస్తున్నట్లున్న కొండలమ్మని చూసి అప్రయత్నంగా నమస్కారం చేశాడు పాండు. "మొదలుపెట్టండి..." అన్నాడు పంబలవాళ్ళతో. అలసటను లెక్కచేయకుండా పాటను అందుకున్నారు వాళ్ళు. తమ పూజని కంటిన్యూ చేశారు.

అరిచి అరిచి వాళ్ళ గొంతులు కీచుగా ధ్వనిస్తున్న సమయంలో కొండలమ్మతల్లి దగ్గర ప్రత్యక్షమయినటువంటి వెలుగు రివ్వుమంటూ ఆమాంతంగా గాలిలోకి ఎగిరి వేములపల్లివైపు ప్రయాణం మొదలుపెట్టింది.

"పదండి.... అందరూ వేములపల్లి పదండి!" అని ఆజ్ఞ ఇవ్వబోతున్న పాండు దగ్గరికి వచ్చి సడన్ బ్రేకులతో ఆగింది రవిబాబు నడుపుతున్న జీప్.

"నన్ను ఆ మేడ దగ్గరికి రమ్మని చెప్పి మీరందరూ ఇక్కడికి వచ్చేశారా? మీకసలు మతిలేదు. ఇంతకీ ఏమిటి ఈ సందడి?" పంబలవాళ్ళను చూసి అడిగాడతను.

"తర్వాత చెప్తాను... ముందు మనం దివాణానికి వెళ్ళాలి పదండి" అంటూ ఎడ్లబండిని వదిలి తనూ జీప్ ఎక్కాడు పాండు. తానొక్కడే కాదు, జాతర సామాగ్రితో వచ్చిన నారాయణపురం జనాలను కూడా ఎక్కించాడు.

"ఇది ఆర్డినరీ జీప్... పుష్పక విమానం కాదు. బయటికి తీసి చాలారోజులైంది. టైర్లు బరస్ట్ అయిపోతాయి" అని అబ్జెక్ట్ చేయబోయాడు రవిబాబు.

"పోనీయండి... త్వరగా... ఆలస్యం చేస్తే దివాణం అల్లకల్లోలం అయిపోతుంది..." అంటూ పాండు అతన్ని హెచ్చరించి, పిచ్చిమామ్మని గట్టిగా పట్టుకు కూర్చున్నాడు కిందపడిపోకుండా.

"మరి వాళ్ళు? వాళ్ళ సంగతేంటి?" అని అడిగింది అపూర్వ, చోటు లేకపోవడం వల్ల దిగబడిపోయిన జోగినాథంని, అతని బేచ్ ని చూస్తూ.

“బండిమీద నెమ్మదిగా రండి...” అంటూ వాళ్ళకి చెప్పి, రెండో చేత్తో రంగమ్మని ఒడిసిపట్టుకున్నాడు పాండు.

నడవలేక నడవలేక నడుస్తున్నట్లు వికృతశబ్దాలు చేస్తూ కదిలి, ఎలాగయితేనేం టైర్లు బరస్ట్ కాకుండా దివాణం చేరుకుంది జీప్. అప్పటికే దారుణమైన గందరగోళంతో నిండిపోయి వుందా ప్రదేశం.

“జాతర.... జాతర నాకు జాతర కావాలి...” అంటూ చిందులు తొక్కుతున్నాడు ముసలయ్య.

“రేపు పొద్దున్నే జరిపిస్తాం తల్లీ.... శాంతించు...” అని అనునయించబోయిన వాళ్లందరినీ ఇష్టం వచ్చినట్లు అరిచేతులతో కొట్టేస్తున్నాడు. అవతలికి నెట్టేస్తున్నాడు.

జీప్ దిగకముందే పరిస్థితిని గమనించి పంబలవాళ్ళకు సైగచేశాడు పాండు.

ఒక్కసారిగా రంఢోలు మ్రోతలతో బాకాల శబ్దంతో దద్ధరిల్లిపోయింది దివాణం.

“రావే మా తల్లి రావేలమ్మా... నీ బిడ్డలం మేము దయచూడమ్మా.. తల్లిరోరావే... అమ్మరోరావే... చల్లంగ మెల్లంగ మమ్ము కాపాడు...” అంటూ పాటలు మొదలుపెట్టారు కొందరు పంబలవాళ్ళు.

పదివేల క్యాండిల్స్ పవరున్న ఫ్లడ్ లైట్లు పదో పాతికో వెలిగించినట్టు చూడరానంత ప్రకాశవంతమైన వెలుగుతో నిండిపోయింది దొరగారి పూజామందిరం.

"మామ్మా.... పద. ముందుగా వెళ్ళు...." అంటూ అందరికంటె ముందుగా పిచ్చిమామ్మ చేయి పట్టుకుని అక్కడికి తీసుకుపోయాడు పాండు.

దారుణమైన వెలుగులో అతనికి ఏమీ కనిపించలేదు.

"తల్లీ... నన్ను క్షమించు. నా అజ్ఞానం కారణంగా నా వంశానికి నువ్వు పెట్టిన శాపాన్ని ఉపసంహరించు.... నా బిడ్డల్ని కాపాడు..." గద్గద స్వరంతో అంటున్న మామ్మ మాటలు మాత్రం వినవచ్చాయి.

అవతలి నుంచి ఎటువంటి సమాధానం వచ్చిందో అతనికి తెలియదు. ఏం జరిగిందో అంతకన్నా తెలియదు. భగ్గుమని మంట ఒకటి పిచ్చిమామ్మ నిలబడిన ప్రదేశంలో ప్రత్యక్షం అయింది.

చూడటానికి ట్రై చేస్తుండగానే అది మటుమాయం అయిపోయింది.

మంటతోపాటు మామ్మ కూడా కనిపించకుండా పోయేసరికి డగ్గుత్తిక పడింది పాండుకి.

"మామ్మా... మామ్మా...." అంటూ పిలుస్తున్న అతని చుబుకాన్ని ఆప్యాయంగా పట్టుకుంది ఒక అమృత హస్తం.

"శక్తిరాయుడు సృష్టించిన కారణంగా మీ వంశానికి అధిదేవతనయ్యాను. అనాలోచితంగా మీరు బాధలు పడటానికి కూడా నేను బాధ్యురాలిని అయ్యాను.

ఇక నుంచీ మీకు ఎటువంటి కష్టమూ రాదు. నీ పిచ్చిమామ్మ ఈ బతుకు నుండి విముక్తిని పొందింది... పెళ్ళిళ్ళు చేసుకుని మీరు పిల్లాపాపలతో హాయిగా జీవించండి...'' దారుణమైన ఆ వెలుగులో నుంచి లీలగా అతని చెవులకు చేరాయి ఆ మాటలు.

ఎప్పుడు వచ్చాడోగాని పాండు వెనక నుంచి మాట్లాడాడు రవిబాబు.

''తల్లీ.... ఇంకో ముఖ్యమయిన విషయం. తను కూడా మా వంశానికి చెందినవాడేనని తెలిసి కూడా ఇంతవరకూ మాకు చెప్పకుండా మా మధ్య తిరిగిన పాండును నువ్వు క్షమించవద్దు. నన్ను క్షమించు. నాకు కాబోయే భార్యకి మేనత్త అయిన సువర్ణ ఎక్కడుందో చెప్పి పుణ్యం కట్టుకో. సువర్ణ జాడతెలియకపోతే మా పెళ్ళి జరగదు.''

''ఏది ఎప్పుడు ఎక్కడ ఎలా జరగాలో ముందుగానే నిర్ణయింపబడి వుంటుంది. చిన్న చిన్న మార్పులు చేర్పులు తప్ప పూర్తిగా మార్చే శక్తి ఈ సృష్టిలో ఎవరికీ లేదు.

అమోఘమయిన శక్తి కలిగివున్న నన్ను కులదైవంగా పొంది కూడా మీ వంశీయులు అష్టకష్టాలు పడటమే అందుకు నిదర్శనం. నీతిగా నిజాయితీగా జీవించండి....

మీకు ఎటువంటి ఇబ్బందులూ రావు. నీకు కాబోయే భార్యకు మేనత్త సువర్ణకు విముక్తి లభించింది'' అంటూ వినవచ్చాయి మాటలు. గదిలో వున్న

వెలుగంతా కుచించుకుపోయి పూజసామాగ్రి మధ్యనవున్న అష్టసిద్ధి యంత్రంలో ఐక్యమైపోయింది.

అది రివ్వున గాలిలోకి లేచి కొండలమ్మతల్లి గట్టువైపు దూసుకుపోయింది.

“అయ్యయ్యో... మళ్ళీ మాయం అయిపోతోంది....” అని ఆందోళనగా అంటున్న రవిబాబు పక్కన ప్రత్యక్షంమయింది రాజశేఖర్ ఆత్మ స్వరూపం.

అతని పక్కనే నిలబడి వుంది అపూర్వ. “అపూర్వా... నీ కోరిక తీరింది... నీ మేనత్తకు కూడా విముక్తి లభించిందని తల్లి చెప్పింది” ఆనందంగా అంటూ ఆమె భుజంమీద చేయి వేయబోయాడు రవిబాబు.

“నువ్వు మాకు కొడుకు వరస కాబట్టి నా సువర్ణని తాకవచ్చు.... తప్పులేదు. కాని అపూర్వ వాళ్ళ నాన్న దగ్గరే వున్నది. ఈ గదిలోకొచ్చేందుకు ఎవరికీ ధైర్యం చాలటంలేదు. రాక్షసుడి మాదిరి నిలుచుని వున్నాడు గుమ్మానికడ్డంగా ముసలయ్య...” నవ్వుతూ అన్నాడు రాజశేఖర్.

“ఈమె అపూర్వ కాదా? అచ్చం అపూర్వ మాదిరిగానే వున్నది” విపరీతమైన ఆశ్చర్యంతో అన్నాడు రవిబాబు.

“అవును.... అపూర్వ నా పోలికలతోనే పుట్టింది. పాడుపడిన మేడలో అలమటిస్తున్న నాకు మీ కారణంగా విముక్తి లభించింది. మీకు కృతజ్ఞతలు...” అంటూ నవ్వింది రాజశేఖర్ పక్కనే వున్న సువర్ణ.

చేతులూపుతూ మటుమాయం అయిపోయారు వారిద్దరూ.

ఒకరివంక ఒకరు చూసుకుని తృప్తిగా నిట్టూరుస్తూ పూజా మందిరంనుంచి వెలుపలికి నడిచారు పాండు, రవిబాబు.

అంతవరకూ ఎవరినీ లోనికీ రానీయకుండా అడ్డుపడిన ముసలయ్య నెమ్మదిగా నేలమీద చతికిలపడిపోయాడు.

"అష్టసిద్ధి యంత్రం మన కొండలమ్మ తల్లిలో ఐక్యం అయిపోవటానికి కాబోలు అటుగా దూసుకుపోయింది... నాన్నగారూ! మనం వెంటనే ఆ తల్లికి జాతర జరిపించాలి..." ఆతృతగా చూసిన తండ్రికి జరిగినదంతా చెపుతూ అన్నాడు రవిబాబు.

మరునాడు సూర్యోదయం వేళ నుంచీ మొదలైనాయి జాతర ఏర్పాట్లు. రవిబాబు అపూర్వని, పాండు రంగమ్మని పెళ్ళి చేసుకుని పసుపు బట్టలతో పూజలు చేసేవరకూ నిర్విఘ్నంగా కొనసాగింది జాతర.

సాతూర్ బ్యాంక్ దొంగల్ని పట్టుకోలేకపోయినా, దొంగిలించబడిన సొత్తును రికవరీ చేసినందుకు టూ టవున్ ఎస్సయ్‌గా ప్రమోషన్ పోందాడు జోగినాథం. టెన్ పర్సెంట్ రికవరీ సొమ్ములో బహుమానంగా లభించింది అతనికి.

పెద్దపిల్లను మెడిసిన్ చదివించకపోతే, అందులో పాండు వాటా అడుగుతాడన్న భయంతో అతను పిల్లను ఆ చదువుకోసం ప్రిపేర్ చేయటం మొదలుపెట్టాడు.

రంగమ్మని వెతుక్కుంటూ సిటీని వదిలిన షరీఫు తిరిగి సిటీలోకి రాలేదు.

నారాయణపురంలో దొరికే నాటుసారా టేస్ట్ అతనికి బాగా నచ్చటంతో అక్కడే వుండిపోయాడు. రత్నంగారికి అవసరం అయినప్పుడు సలహాలు ఇస్తూ సలహాల షరీఫుగా పేరు తెచ్చుకున్నాడు.

-: శుభం:–

# CHAKRATEERDHAM

By

**MADHU BAABU**



SRI SRINIVASA PUBLICATIONS
4/4, A.T. AGRAHARAM, GUNTUR - 522 004.
Ph. No. 0863-2357945